Telaṅgāṇalō bhāvakavithvaṁ- vastuvu, śhilpaṁ

A Thesis submitted to the University of Hyderabad in partial Fulfilment of the requirement for the award of

Doctor of Philosophy

In

Telugu

Researcher

KAMERA PURUSHOTHAM

(Reg No: 18HTPH07)

Supervisor

Dr. BHUKYA THIRUPATHI

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad-500046
Telangana, India

April– 2024

తెలంగాణలో భావకవిత్వం– వస్తువు, శిల్పం

పిహెచ్.డి పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన

పరిశోధన గ్రంథం

పరిశోధకుడు

కామెర పురుషోత్తం

18HTPH07

పర్యవేక్షకులు

డా. భూక్య తిరుపతి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు –500046

ఏప్రిల్–2024

DECLARATION

I, **KAMERA PURUSHOTHAM** hereby declare that this dissertation entitled **"Telaṅgāṇalō bhāvakavithvaṁ– vastuvu, śhilpaṁ"** submitted by me under the guidance and supervision of **Dr. BHUKYA THIRUPATHI** is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in shodhganga/INFLIBNET.

Place: Hyderabad

Signature of the Student

Date:

Name:**KAMERA PURUSHOTHAM**

Regd. No. **18HTPH07**

CERTIFICATE

This is to certify the thesis entitled**"Telaṅgāṇalō bhāvakavithvaṁ – vastuvu, śhilpaṁ"** submitted by **Mr. KAMERA PURUSHOTHAM** bearing **Regd. No. 18HTPH07** in partial fulfillment of the requirements for the award of award of Doctor of Philosophy in the school of Humanities, Department of Telugu is a bonafide work carried out by his under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any degree or diploma.

A. Published in the following publications: Parts of this thesis have been: (NOT EXACT PARTS) Issues discussed in the following papers have been presented elaborately in the chapter 2, 3 and 4 of the thesis.)

1. **"Bhāvakavithvanlō navyata"** (ISSN 2320-2882), Pg. No.F242-F247, Vol.12 issue 3, MARCH 2024 " INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS"

2. **"Telaṅgāṇa bhāvakavithvaṁ–bhaashaa parisheelana"** (ISSN:2582-8738), Pg. No. 36-38, Vol-10, SANCHIKA-1, MARCHI,APRIL,2024 "TELUGU JAATHI PATHRIKA ''AMMANUDI'' Editor by DR. SAAMALA RAMESH BABU.

B. Presented in the following National and International conferences:

(Issue presented in the following papers have been discussed elaborately)

1. **"BHAVAKAVITVAM PUTTU POORVOTHARALU "** 1st chapter " Telugu Sahityam- vibhinna prakriyalu dhoranalu " Department of Telugu KRK GOVT DEGREE COLLEGE NELLURU International Webinaor, 2022, AGU 24 &25

Further, the student has passed the following courses towards fulfillment of course work requirement for Ph.D. Telugu (recommended by doctoral committee) courses passed during Ph.D. programme.



Sl No. 4379
Notification No. 1

हैदराबाद विश्वविद्यालय
UNIVERSITY OF HYDERABAD
(A Central University Established by an Act of Parliament)
P.O. CENTRAL UNIVERSITY, GACHIBOWLI, HYDERABAD - 500 046 (INDIA)

SEMESTER GRADE TRANSCRIPT — **REGULAR EXAMINATION**

REG. NO.	18HTPH07
NAME OF THE STUDENT	KAMERA PURUSHOTHAM
MONTH AND YEAR OF	NOV 2018 — SEMESTER 1
COURSE	Ph.D. TELUGU
PARENT'S NAME	K NARAYANA / K LAXMI

COURSE NO	TITLE OF THE COURSE	CREDITS	RESULTS
HT700	RESEARCH METHODOLOGY	4	PASS
HT701	HISTORY OF TELUGU RESEARCH	4	PASS
HT702	STUDIES IN LITERATURE AND LANGUAGE	4	PASS
HT703	SPECIALIZED AREA AND BROAD FIELD	4	PASS

SEMESTER GRADE POINT AVERAGE (SGPA) :10.0
(In words) :TEN POINT ZERO

DEPUTY REGISTRAR
(ACAD & EXAMS)

Date Of Result Notification : Jan 8, 2019
Date Of Download : Mar 9, 2024
This is system generated certificate issued by O/o The Controller of Examinations, University of Hyderabad

Dr. BHUKYA THIRUPATHI

Research Supervisor

Prof. Darla Venkateswara Rao

Head of the Department of Telugu

Prof. V. Krishna

Dean School of Humanities

కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, నన్ను విశ్వవిద్యాలయాల స్థాయి వరకు చదివిస్తూ నాకోసం నిరంతరం శ్రమిస్తున్న నా తల్లిదండ్రులు నారాయణ, లక్ష్మి గార్లకు పాదాభివందనాలు.

జీవితంలో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఎల్లప్పుడూ నన్ను ప్రోత్సహిస్తూ, నిత్యం నా మేలు కోరే గురువుగారు, పరిశోధనలో నాకు అవకాశం ఇచ్చి అమూల్యమైన సలహా, సూచనలు అందించిన పర్యవేక్షకులు డా. భూక్య తిరుపతి సార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

పరిశోధనను కొంతకాలం వారి పర్యవేక్షణలో చేసే అవకాశం కల్పించి పదవి విరమణ పొందిన కూడా, నిత్యం నా వెంటే ఉంటూ నా పరిశోధన పూర్తి అయ్యేవరకు, అలాగే నా పరిశోధనకు సంబందించిన సూచనలు, సలహాలు ఇచ్చినవారు మాతృ సమానులు ఆచార్య జి. అరుణ కుమారి మేడం గారికి ప్రత్యేక వందనాలు.

'తెలంగాణాలో భావకవిత్వం–వస్తువు, శిల్పం' అనే అంశంపై పరిశోధన చేయడానికి నాకు అవకాశం కల్పించిన హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు, ఇంటిగ్రేటేడ్ స్థాయి నుంచి నన్ను ప్రోత్సహిస్తూ పరిశోధన రంగంవైపు దారి చూపిన గురువు, అలాగే డాక్టోరల్ కమిటి సభ్యులుగా ఉంటూ నా పరిశోధనకు తగిన సలహా, సూచనలు ఇచ్చిన తెలుగు శాఖ అధ్యక్షులు, పూర్వ డిప్యూటి డి. ఎస్ . డబ్ల్యూ. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి ప్రత్యేక వందనాలు.

డాక్టోరల్ కమిటి సభ్యులుగా ఉంటూ నా పరిశోధనకు తగిన సలహా, సూచనలు ఇచ్చిన ఆచార్య పిల్లలమర్రి రాములు సార్ గారికి....

ఇంటిగ్రేటేడ్ స్థాయి నుంచి నాకు పాఠాలు బోధించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం గురువులు శరత్ జ్యోత్స్నారాణి, తుమ్మల రామకృష్ణ, పమ్మి పవన్ కుమార్, డి. విజయలక్ష్మి, బాణాల భుజంగ రెడ్డి,

డి. విజయకుమారి గార్లకు .. అలాగే తెలుగు శాఖలో నూతనంగా పదోన్నతి పొందిన వారిజారాణి, త్రివేణి, విజయ్ కుమార్, లత గార్లకు.....

హైదరాబాద్ విశ్వ విద్యాలయం గ్రంథాలయం సిబ్బంది వారికి, అలాగే నా పరిశోధనకు సంబం దించిన పుస్తకాలు అందించిన హైదరాబాద్ విశ్వ విద్యాలయ గ్రంథాలయానికి, అలాగే పుస్తకాలు వెతకడానికి సహకరించిన గ్రంధాలయ సిబ్బంది విశ్వనాథ్ గారికి కృతజ్ఞతలు..

మా తెలుగు శాఖలో పనిచేసిన నాన్ టీచింగ్ స్టాఫ్ కృష్ణ గారికి, మధు గారికి, నరేష్ గారికి, స్వాతిగారికి, దయాకర్ గార్లకు, ఇతర ఆఫీస్ సిబ్బందికి వారికి కృతజ్ఞతలు....

నా పరిశోధన రాస్తున్న సమయంలో నాకోసం తన విలువైన సమయాన్ని కేటాయిస్తూ నా పరిశోధనకు సంభందించిన పుస్తక సేకరణలో భాగమై,తగిన సలహాలు,సూచనలు ఇచ్చినటువంటి వారు తెలంగాణ భావకవితా వికాసం పుస్తక సంపాదకులు సామిడి జగన్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే పుస్తక సేకరణలో భాగమైన గురువుగారు ఆచార్య అనుమాండ్ల భూమయ్య (కాకతీయ యూనివర్సిటీ) గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

నాకు ఇంటర్లో బోదిస్తూ, నన్ను విశ్వవిద్యాలయానికి పరిచయం చేసిన గురువుగారు ఎం. కృష్ణార్జున సార్ కి ప్రత్యేక ధన్యవాదాలు.

నా విజయంలో తన సహాయ సహకారాలు అందిస్తూ నన్ను నిత్యం ప్రోత్సహిస్తున్న నా సతీమణి విజయ లక్ష్మికి.... అలాగే నన్ను ఎప్పుడు బాగా చదువుకో నాన్న అని ముద్దు ముద్దు మాటలతో చెప్పిన నా చిన్నారులు ఆధ్య, రిహాన్ లకు....

జీవితంలో ఉన్నతంగా ఉండాలని ఆశించే చెల్లి బావలు సుమలత–చిరంజీవి, ... అన్నా వదినలు సమ్మయ్య –స్వప్నలకు, గణేష్ &సునీతలకు , సురేష్ &మల్లీశ్వరిలకు .... తమ్ముడు విజయ్ కి .... నేనంటే ఇష్టపడే చిన్నారులు శ్రీజ, తేజశ్రీ, వర్షిత, సౌమ్య, హైందవి, హనీష్ లకు.....

అనునిత్యం నా మేలుకోరె తమ్ముడు, రాకేశ్ & కవితలకు ... అన్న సురేష్ & జయలకు ..

నన్ను ప్రోత్సహిస్తూ ఇంటికి వెళ్ళినప్పుడల్లా నా వెంటే ఉండే మిత్రులు శివరాం, శాంతన్, వెంకటేష్ లకు ..

బాబాయి అంటూ ఎప్పుడు నా వెంటే ఉంటూ నా మంచి కోరే నా బేట తులసికి ..

అనునిత్యం నన్ను అభిమానించే కాశీరామ్ అన్నకు....

ఎల్లప్పుడూ నా వెంటే వుంటూ, నన్ను ప్రోత్సహిస్తూ నాతోపాటు పరిశోధన చేస్తున్న మిత్రులు కమలాకర్ & కళ్యాణికి .....

పరిశోధనలో నూతన కోణాలను చెబుతూ నన్ను ఆదరిస్తున్న డా. దామెర సుమన్ అన్న గారికి...

నాతో పాటు పరిశోధన చేస్తున్న మిత్రులు రాజా అన్న, వేణు, వెంకటాద్రి, తుంగ రమేష్, కార్తీక్, చరణ్, రాణాప్రతాప్, బాస్కర్, రమేష్, బిరున్, కృపాకర్, మోహన్, మారుతి, వాసుదేవ్, మదన్ మోహన్ రెడ్డి, భట్టు విజయ్ కుమార్, తుళ్ళూరు రవి, శివకుమార్, మహేష్, అదిలక్ష్మి, యశోద, శ్వేత, సృజన, ... నన్ను అభిమానించే జూనియర్ మిత్రులు అంబదాస్, తిరుపతి, హరిప్రసాద్, మనోజ్, నాగరాజు, వర్ధన్, మానస, మౌనిక, రమేష్, ప్రవీణ్ ,రోహిత్ , గంజి కుమార్ రాజా, బీచులకు...

నా పరిశోధన పూర్తి చేయడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికి కృతజ్ఞతలు.

అందరికి ధన్యవాదాలు...

కామెర పురుషోత్తం

ప్రవేశిక

1. పరిశోధనాంశ పరిచయం:

కవిత్వమంటే కవుల ఉద్వేగానికీ, సంవేదనలకీ మాత్రమే పరిమితమైంది కాదు. అందులో కవుల అలోచనలూ, హేతుక్రమాలు కూడా వుంటాయి. కాకపోతే చాలా వరకు ఈ ఉద్వేగ సంవేదనలు, ఆలోచనా తర్కాలు కలగలసిపోయి ఒక దానిలో ఒకటి మిళితమైపోయి వుంటాయి. సమాజ ప్రభావానికి మనషులందరూ ఒకే రకంగా గురికారు. సామాజిక వాస్తవికత పట్ల అందరూ ఒకే రకంగా స్పందించరు.ఆయా మనసులో వాస్తవికతకి అనుగుణంగానే వారి స్పందనలు ప్రవర్తనలు ఉంటాయి. సమాజానికీ, మనిషికీ ఉన్న గతి తార్కిక సంబంధం కవులకీ, సమాజానికి మధ్య ఉన్న సంబంధానికి వర్తిస్తుంది.

ఒకే సామాజిక వాస్తవికతలో జీవించిన వివిధ కవులు రచయితలు వివిధ రకాలుగా సాహిత్యంలో స్పందించడం జరిగింది. శ్రీశ్రీ సామ్యవాద ధోరణిలో స్పందిస్తే, కృష్ణశాస్త్రి కాల్పనిక వాదిగా స్పందించారు. చలం స్త్రీవాదిగా సృజనగావించారు. విశ్వనాథ సత్యనారాయణ సంప్రదాయ సనాతన వాది కోణం నుంచి స్పందించారు. త్రిపురనేని గోపీచంద్ మనస్తత్వం కోణం నుంచి వాస్తవాన్ని విశ్లేషించారు.ఆలూరి బైరాగి ఆధునిక సమాజపు ఆధ్యాత్మికలేమిని ఎండబెట్టడం జరిగింది. వీళ్ళందరూ ఒకే కాలంలో ఉన్న వీరంతా ఒకే రకంగా స్పందించక పోవడానికి కారణం ఏమిటంటే తమ చుట్టూ ఉన్న వాస్తవికత వీరిని, వారి మానసిక వాస్తవికతకు లోబడే ప్రభావితం చెయ్యటం. ఆయా కవుల మానసిక వాస్తవికతకి వారి కాలపు సామాజిక వాస్తవికతకి మధ్య జరిగే పరస్పర చర్య వారి కవిత్వ వాస్తవికతకు కారణమవుతుంది. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలించినట్లయితే ఆధునిక కవిత్వానికి ఉషఃకాంతులు వెదజల్లిన సంధియుగానంతరం, తెలుగు కవిత్వం అనేక మార్గాల్లో పయనించిందని అర్థమవుతుంది.

ఇలా అనేక మార్గాల్లోనూ పయనించిన తెలుగు కవిత్వం కోరుకున్నది స్వేచ్ఛ అనేది ప్రధానంగా కనిపించే అంశం. ఇది ఆలోచనలను, అనుభూతులను అర్థం చేసుకోవడానికి పాత కొత్తల మేలు కలయికల సంస్కృతిని ప్రతిబింబించే భావకవిత్వం కోరుకున్న స్వేచ్ఛ ఒక రకమైతే, మనిషిని పట్టించుకోవడం, మనిషి సమస్యల్ని ప్రతిబింబించడం, అంతర్జాతీయ దృక్పథం కలిగి ఉండడంలో మానవుడికి 'స్వేచ్ఛ'లభించాలనే 'ప్రగతి' లేదా అభ్యుదయ భావజాలంతో కూడినది మరొక రకం. ఆదే విధంగా జాతీయోద్యమంలో భాగంగా స్వదేశీ పౌరునిగా, గాలి, నీరు తాము నివసించే నేలనూ స్వంతంగా అనుభవించే స్వేచ్ఛను కోరుకున్నది. తెలంగాణా పోరాటం కూడా ఒక విధంగా ఆలోచిస్తే దేశభక్తి అవుతుంది. స్వదేశీయులైనప్పటికీ, పీడించే స్వభావం కల సంస్థానాల పాలకులు పెట్టే పీడన నుండి విముక్తి కోరుకుని స్వేచ్ఛను ఆశించారు. ఆ మార్గంలో కవిత్వం రాయడం, కవిత్వం చెప్పడమే కాకుండా ఆ స్వేచ్ఛను సాధించుకోవడంలో స్వయంగా రంగంలోకి దిగి కవులు కూడా 'సాయుధులు' అయ్యారు. తెలంగాణా పోరాటం తర్వాత ఆ మార్గాన్ని ఆనుకొని, మరో చిన్న మార్గం ఏర్పాటు చేసుకొని భాషా ప్రయుక్త రాష్ట్రాల స్వేచ్ఛ కోసం కవిత్వం రాయడం జరిగింది.

ఇలా అనేక మార్గాలను కొంత సవివరంగా పరిశీలించినప్పుడే కవిత్వంలో కనిపించే వస్తువు, రూపం, శిల్పాల ప్రత్యేకత మరింత ప్రస్ఫుటం అవుతుంది. కాల పరిస్థితులను బట్టే వీటిని పరిశీలించటం అవసరం. కనుక ముందు ఆధునికయుగ ఆరంభలో వచ్చిన కవిత్వాన్ని ఇక్కడ పరిశీలించటం జరుగుతుంది. ఈ యుగ మొదటి పాదాల్లో మనకు కనిపించేది రొమాంటిక్ పొయెట్రీ ప్రభావం ఒకటి. అన్యభాషలను నేర్చుకొని, సాహిత్యాన్ని బాగా చదువుకోవటం వల్ల ఆ భావాల ప్రేరణ పొందటంతో కొత్త కొత్త భావాలు, కొత్త కొత్త రూపాలు (వీటినే కొంతమంది ప్రక్రియలు అంటున్నారు.

కానీ ప్రక్రియకు, రూపానికి స్పష్టమైన భేదాన్ని నిర్వచించటం జరుగుతుంది. దాన్ని బట్టే ఈ అధ్యయనం కొనసాగటం గమనించవచ్చు) కొత్త వస్తువులతోపాటు కొత్త శిల్ప పద్ధతుల్ని కూడా

పాటించడం మొదలు పెట్టారు. అంతవరకూ రాజుల్ని, సంస్థానాలను కీర్తించి విసిగిపోయిన కవులు కొంతమందైతే, ఆదరణ కోల్పోయిన కవులు మరికొంత మంది ఉన్నారు. ఈ రెండు వర్గాల కవులకంటే ప్రాశ్చాత్య విద్యాభ్యాస ఫలితంగా ఒక తరం ముందుకు వచ్చింది. అంతవరకు ఉన్న తెలుగు సాహిత్యాన్ని, సంస్కృత సాహిత్యాన్ని, అటు పాశ్చాత్య సాహిత్యాన్ని చదువుకోవటం వల్ల ఈ కవులు స్వేచ్ఛ వైపు మొగ్గు చూపారు. అప్పటికే రొమాంటిక్ పోయిట్రీగా పిలువబడుతున్నప్పటికీ, అది తెలుగులో భావకవిత్వంగా ప్రసిద్ధికెక్కింది. 1910 నుండి 1940 వరకూ ఇది అవిచ్ఛిన్నంగా కొనసాగింది. దీని అనుసరించి నా పరిశోధనలో భాగంగా "**తెలంగాణలో భావకవిత్వం–వస్తువు, శిల్పం**" అనే అంశాన్ని పరిశోధానాంశంగా స్వీకరించాను. అదేవిధంగా తెలంగాణలో వచ్చిన భావకవిత్వాన్ని అందులో గల, వస్తువైవిధ్యాలను, నిర్మాణ శిల్పాన్ని నా పరిశోధనలో భాగంగా అధ్యాయనం చేయడం జరిగింది

2. పరిశోధన ఆవశ్యకత:

20వ శతాబ్దంతో తెలుగు సాహిత్యంలో ఎన్నో కొత్త ధోరణులు ప్రారంభమయ్యాయి. ప్రబంధాలకు కథా కావ్యాలకు విరేశలింగం పంతులు కాలం నుంచే ప్రాధాన్యం తగ్గి ఈ కొత్త ధోరణులకు ప్రాధాన్యం పెరిగింది. వస్తువులో, స్వరూపంలో ప్రాచీన కవిత్వం కన్నా భిన్నత్వాన్ని సంతరించుకున్న ఈ కవిత్వాన్ని 'ఆధునిక కవిత్వం' అంటున్నారు. ఒక విధంగా ప్రాచీన కవిత్వ స్వరూపాన్ని కొనసాగిస్తున్న నవ్య సాంప్రదాయ కవిత్వం కంటే ఈ కవిత్వం భిన్నమని గుర్తించడానికి కూడా 'ఆధునిక కవిత్వం' అనే పదం ఉపయోగపడుతుంది. తెలుగు సమాజల్లో భావ కవిత్వం 20వ శతాబ్దం తొలినాళ్లలో విస్తరించింది. కానీ ఇంతవరకు మనకు తెలిసిన, మనం చదువుకున్న సాహిత్య చరిత్రలు, పరిశోధన గ్రంథాలు భావకవిత్వం అంటే ఆంధ్ర కవిత్వం అనే విధంగానే చూపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో వెలసిన భావకవిత్వాన్ని కూడా పరిశోధించవలిసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భావించి ఈ అవగాహనతోనే నా పరిశోధన ఆవశ్యకతను రూపొందించుకున్నాను.

3. పరిశోధన పరిధి:

నా పరిశోధనలో భాగంగా "**తెలంగాణలో భావకవిత్వం–వస్తువు, శిల్పం**" అనే అంశం ఎన్నుకోవడం జరిగింది. ఈ అంశాన్ని ఎన్నుకోవడానికి ముందు తెలంగాణలో భావకవితా వికాసం అనే సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా అచ్చు వేసింది. దీనికి సామిడి జగన్ రెడ్డి సంపాదకత్వం వహించారు. తెలంగాణలో భావ కవిత్వాన్ని రెండు దశలుగా విభజించుకోవడం జరిగింది. 1920–43 వరకు ఒక దశ, 1948–66 వరకు మరొక దశ. ఈ రెండు దశలలోని వెలువడిన బావకవిత్వాన్ని అనేక కోణాల్లో పరిశీలించి అందులోగల వస్తు వైవిధ్యాలను, శిల్పాన్ని, భాషా వైవిధ్యాన్ని నిరూపిస్తూ, నా పరిశోధనకు సంబందించిన ఆధార గ్రంధాలను సేకరించి నేను అధ్యాయనం చేశాను.

4. పూర్వ పరిశోధనలు:

"**తెలంగాణలో భావకవిత్వం–వస్తువు, శిల్పం**' అనే అంశం మీద ఇప్పటి వరకు పరిశోధన జరగలేదు. కానీ తెలంగాణలో భావకవితా వికాసం అనే సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఒక పుస్తకాన్ని అచ్చు వేసింది.

5. ఆకరాలు:

ఈ పరిశోధనకు సంబంధించిన గ్రంథ సేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగలేదు. తెలంగాణ భావకవితా ఖండికలను, ఆయా కవులు రచించిన పుస్తకాలను గ్రంథాలయాల నుండి, తెలంగాణ సాహిత్య అకాడమీ నుండి, మరికొన్ని పుస్తకాలు హైదరాబాదు విశ్వవిద్యాలయం ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ నుండి సేకరించాను.

6. పరిశోధన గ్రంథ రచన– ప్రధాన ఆధార గ్రంథాలు:

ఈ పరిశోధన గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. ఇందులో మొదటి అధ్యాయం 'భావకవిత్వం–స్వరూప స్వభావాలు', రెండవ అధ్యాయం 'భావకవిత్వంపై ఆంగ్ల రోమాంటిక్ కవిత్వం–ఇతర ప్రభావాలు', మూడవ అధ్యాయం 'తెలంగాణలో భావకవిత్వం–ప్రారంభ వికాసాలు', నాలుగవ అధ్యాయం 'తెలంగాణలో భావకవిత్వం– వస్తువైవిధ్యం', ఐదవ అధ్యాయంలో తెలంగాణ భావకవిత్వంలో శిల్పం, భాషా పరిశీలన చేశాను. ఈ పరిశోధన గ్రంథ రచనకు ఉపకరించిన ప్రధాన ఆధార గ్రంథాలను కొన్నిటిని క్రింద పేర్కొంటున్నాను.

1. జగన్ రెడ్డి, సామిడి. 2017. తెలంగాణలో భావకవితా వికాసం. హైదరాబాద్. తెలంగాణ సాహిత్య అకాడమీ.

2. నారాయణ రెడ్డి, సి. 1977. ఆధునికాంధ్ర కవిత్వం,సంప్రదాయాలు– ప్రయోగాలు. హైదరాబాద్. నవరత్న బుక్ హౌస్.

3. నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. 2016. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. హైదరాబాద్. తెలుగు అకాడమీ.

4. ప్రతాప రెడ్డి, సురవరం. 2009. గోలకొండ కవుల సంచిక. హైదరాబాద్. తెలంగాణ జాగృతి

5. భూమయ్య, అనుమాండ్ల. 2013. తెలంగాణ భావ విపంచిక. గోలకొండ కవుల సంచిక. హైదరాబాద్. నవోదయ బుక్ హౌజ్.

6. శాయిరెడ్డి, గంగుల. 2019, కాపుబిడ్డ, హైదరాబాద్. తెలంగాణ సాహిత్య అకాడమీ.

7. శ్రీనివాస్, కె. 2019. తెలంగాణ సాహిత్య వికాసం. హైదరాబాద్. నవోదయ బుక్ హౌస్.

8. సుజాత రెడ్డి, ముదిగంటి. 2015. తెలంగాణ సాహిత్య చరిత్ర. హైదరాబాద్. ఆంధ్ర సారస్వత పరిషత్తు.

పైన పేర్కొన్న గ్రంథాలను పరిశోధనకు ప్రధానంగా గ్రహించాను. వీటితో పాటుఅంతర్జాతీయ లోని పుస్తకాలను, వ్యాసాలను, పరిశోధన గ్రంథాలను వినియోగించుకున్నాను. వీటన్నిటి వివరాలను ఉపయుక్త గ్రంథ సూచిలో చేర్చాను.

7. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి:

ఈ పరిశోధన గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించి, విశ్లేషించాను. అవి ఈ కింది విధంగా ఉన్నాయి.

అధ్యాయం – 1. భావకవిత్వం–స్వరూప స్వభావాలు

అధ్యాయం – 2. భావకవిత్వంపై ఆంగ్ల రోమాంటిక్ కవిత్వం – ఇతర ప్రభావాలు

అధ్యాయం – 3. తెలంగాణలో భావకవిత్వం–ప్రారంభ వికాసాలు

అధ్యాయం – 4. తెలంగాణలో భావకవిత్వం– వస్తువైవిధ్యం

అధ్యాయం – 5. తెలంగాణలో భావకవిత్వం– శిల్పం, భాష

పైన పేర్కొన్న అధ్యాయాలలో మొదటి నాలుగు అధ్యాయాలను సాహిత్య కోణంలోనూ, చివరి అధ్యాయాన్ని కొంత సాహిత్య కోణం, కొంత భాషాకోణంలోనూ అధ్యాయనం చేశాను.

ఈ పరిశోధన గ్రంథంలో ఉపయుక్త గ్రంథాల వివరాలను కూర్చడంలో APA (American Psychological Association)వారి పద్ధతిని అనుసరించాను.

8. పరిశోధన లక్ష్యం:

"తెలంగాణలో భావకవిత్వం–వస్తువు, శిల్పం" అనే పరిశోధన ద్వారా తెలంగాణలో వెలసిల్లిన భావ కవిత్వాన్ని కవితావస్తు స్వరూప స్వభావాలను బట్టి ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, స్మృతి కవిత్వం,సంఘ సంస్కరణ కవిత్వం అని విభజించి అనేక కోణాలలో అధ్యాయనం చేయడం, అలాగే భాషాంశాలను కూడా అధ్యాయనం చేసి ఆ విశేషాలను వివరించడం ఈ పరిశోధన లక్ష్యం.

9. పరిశోధనవల్ల కలిగే ప్రయోజనాలు:

1. సాహితీ లోకంలో వివిధ ప్రాంతాల నుండి రచనలు వెలువడుతున్నాయి. అందులో భాగంగా తెలంగాణలో వెలువడిన భావకవిత్వాన్ని అధ్యాయనం చేయడం జరిగింది.

2. తెలంగాణలో గల భావకవిత్వాన్ని అధ్యాయనం చేయడం ద్వారా ఎన్నో విషయాలు బోధపడతాయి. అందులో ముఖ్యంగా ప్రణయం, ప్రకృతి, భక్తి, దేశభక్తి, స్మృతి, సంఘసంస్కరణం, మొదలైన అంశాలతో కూడిన ఖండికలలో గల వస్తువైవిధ్యం స్పష్టమవుతుంది. ఈ ఖండికలు సాహిత్య ప్రియులకు మార్గదర్శకంగా నిలుస్తాయని అనడంలో సందేహం లేదు.

3. కవిత్వం ఎంత పురాతనమో అంత అధునాతనం. అది ప్రధానంగా మానవుని అనుభూతులపై ఆధారపడిన కళ. అందుచేత మానవుడున్నంత కాలం కవిత్వానికి క్షతి లేదు. భౌతిక జగత్తులో ఎన్నెన్ని చిత్రమైన మార్పులు వచ్చినా, మానవునిలోని మౌలిక మనఃప్రవృత్తుల్లో చెప్పుకోదగ్గ పరివర్తనం రాలేదు. రాగద్వేషాలు, పాపపుణ్యాలు, అధికారవాంఛ, కీర్తికాంక్ష, ప్రకృతిప్రీతి, దైవభీతి సగటు మానవుణ్ని పెనవేసుకునే ఉన్నాయి.ఇవి ఉన్నన్ని నాళ్ళు కవిత్వం ఉంటుంది. అందువల్ల కవిత్వంపై పరిశోధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

4. తెలంగాణ భావకవిత్వంలో ప్రయోగించిన భాషలో అన్యదేశాలు, ధ్వనిపరిణామం, అర్థ పరిణామం, ధ్వన్యనుకరణపదాలు, జంట పదాలు వంటివి ప్రయోగించిన తీరు మొదలైనవి పాఠకులకు ప్రత్యేక భాషాంశాలు కనిపిస్తాయి.

5. గత శతాబ్ది తొలి దశకాల నుంచి తెలంగాణ వికాసంలో అనేక సాహితీ ప్రక్రియలు వచ్చిన విషయాన్ని ఇది వరకే పరిశోధకులు తేల్చారు. ఈ క్రమంలో అంతగా దృష్టిపెట్టని ప్రక్రియ భావకవిత. దీనిని నూతనంగా అధ్యాయనం చేయడం పాఠకుడికి కొన్ని కొత్త విషయాలు తెలుసుకునే ఆవశ్యకత కలుగుతుంది.

10. అనుబంధం:

ఈ పరిశోధన గ్రంథంలో రెండు అనుబంధాలను చేర్చడం జరిగింది. అవి:

అనుబంధం–1

పరిశోధన కాలంలో నేను వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ఆయా అంశాలపై పత్రాలను సమర్పించాను. అలాగే వివిధ పత్రికలలో వ్యాసాలు కూడా ప్రచురించాను.

అనుబంధం–2

"తెలంగాణలో భావకవిత్వం – వస్తువు, శిల్పం" అనే నా అంశానికి సంబందించిన నేను సేకరించిన పుస్తకాల ఫోటోలను , ఆ పుస్తకాల సంపాదకులతో నా అంశం గూర్చి వారితో చర్చించే సంధర్భంలో తీసుకున్న ఫోటోలను పొందుపరిచాను.

విషయసూచిక

కృతజ్ఞతలు పుటలు

ప్రవేశిక

1. పరిశోధనాంశ పరిచయం i

2. పరిశోధన ఆవశ్యకత iii

3. పరిశోధన పరిధి iv

4. పూర్వ పరిశోధనలు iv

5. ఆకరాలు iv

6. పరిశోధన గ్రంథ రచన– ప్రధాన ఆధార గ్రంథాలు v

7. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి vi

8. పరిశోధన లక్ష్యం vii

9. పరిశోధనవల్ల కలిగే ప్రయోజనాలు vii

10. అనుబంధం viii

మొదటి అధ్యాయం

భావ కవిత్వం–స్వరూప స్వభావాలు [1–67]

1.1. కవిత్వం–నిర్వచనం 01

1.1.1. మమ్మటుని నిర్వచనం 01

1.1.2. విశ్వనాథుని నిర్వచనం 01

1.1.3. జగన్నాథుని నిర్వచనం 02

1.1.4. పాశ్చాతులు– కావ్య నిర్వచనాలు 02

1.2. భావకవిత్వం ప్రారంభం 06

1.3. భావకవిత్వం–నిర్వచనం 08

1.4.భావకవిత్వం– అంశిక లక్షణాలు 11

1.4.1. ఆత్మ శ్రయత్వం 11

1.4.2. స్వేచ్ఛా ప్రియత్వం 11

1.4.3. ఉత్తమపురుషలో వ్యక్తీకరణ 11

1.4.4. గానయోగ్యత 12

1.4.5. సున్నితమైన శృంగారం 12

1.4.6. ప్రకృతి 13

1.4.7. భక్తి 14

1.4.8. స్మృతి 15

1.5. భావకవిత్వ శాఖలు 16

1.5.1. ప్రణయ కవిత్వం 17

1.5.2. ప్రకృతి కవిత్వం 18

1.5.3. భక్తి కవిత్వం 21

1.5.4. దేశభక్తి కవిత్వం 24

1.5.5. సంఘ సంస్కరణ కవిత్వం 26

1.5.6. స్మృతి కవిత్వం 28

1.6. భావకవులు– ఊహా ప్రేయసీలు 29

1.6.1. ప్రాచీన సాహిత్యంలో స్త్రీపట్ల దృక్పథం 29

1.6.2. స్వయంవరం 29

1.6.3. ప్రాతివ్రత్యం 29

1.6.4. అంగాంగ వర్ణన 30

1.6.5. భోగవస్తువుగా స్త్రీ 30

1.7. ఆంగ్ల రొమాంటిక్ కవిత్వంలో స్త్రీ దృక్పథం 31

1.8. గురజాడ,రాయప్రోలు సుబ్బారావు కవిత్వంలో స్త్రీ,పురుష సంబంధాలు 32

1.8.1. గురజాడ అప్పారావు– స్త్రీ దృక్పథం 32

1.8.2. రాయప్రోలు సుబ్బారావు– స్త్రీ దృక్పథం 34

1.9. భావకవిత్వంలో ప్రణయం 35

1.10. ఊహా సుందరులు 36

1.10.1. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఊర్వశి' 36

1.10.1.1. రవీంద్రుని 'ఊర్వశి' 36

1.10.1.2. ఊర్వశి వ్యక్తిత్వం 37

1.10.1.3. ఊర్వశి వర్ణన 38

1.10.1.4. కవి అనుభూతులు 38

1.10.2. అడవి బాపిరాజు 'శశికళ' 39

1.10.2.1. శశికళ వ్యక్తిత్వం 39

1.10.2.2. శశికళ వర్ణన 39

1.10.2.3. శశికళతో కవి సంవాదం 40

1.10.2.4. శశికళ పట్ల కవిభావన 40

1.11. ఇల్లాలు 41

1.11.1. నాయని సుబ్బారావు ‘వత్సల’ 41

1.11.1.1. వత్సల వర్ణన 41

1.11.1.2. వత్సల ప్రేమ 42

1.11.1.3. సౌభద్రుని ప్రేమ 42

1.11.2. తల్లావర్ఝుల శివశంకర శాస్త్రి ‘హృదయేశ్వరి’ 43

1.11.2.1. నాయిక వ్యక్తిత్వం 44

1.11.2.2. నాయిక వర్ణన 44

1.11.2.3. నాయికపై నాయకుడికి ప్రేమ 44

1.12. కావ్య నాయికలు 45

1.12.1. నండూరి సుబ్బారావు ‘యెంకి’ 45

1.12.1.1. యెంకి వర్ణన 45

1.12.1.2. యెంకి అనుభూతులు 46

1.12.1.3. నాయుడుబావ అనుభూతులు 47

1.12.2. విశ్వనాధ సత్యనారాయణ 'కిన్నెరసాని' 47

1.12.2.1. కిన్నెర పుట్టుక 48

1.12.2.2. కిన్నెరసాని నడకలు 48

1.12.2.3. కిన్నెర నృత్యం 49

1.12.2.4. కిన్నెర సంగీతం 49

1.12.2.5. కడలి పొంగు 49

1.12.2.6. కిన్నెర దుఃఖం 50

1.12.2.7. గోదావరి సంగమం 50

1.12.2.8. కిన్నెర వైభవం 50

1.13. భావకవితోధ్యమ నేపథ్యం 51

1.13.1. రాజకీయ పరిస్థితి 51

1.13.2. ఆర్థిక సామాజిక స్థితి 52

1.13.3. విద్యావ్యవస్థ 54

1.13.4. సాహిత్య స్థితి 55

1.14. భావకవిత్వం అభివృద్ధి వికాసాలు 59

1.14.1. సహకవి సమ్మేళనం 59

1.14.2. సాహితి సమితి 59

1.14.2.1. సాహితి సమితి సభ్యత్వార్హత 59

1.14.2.2. సాహితి సమితి స్థాపన సభ్యులు 60

1.14.2.3. సాహితీ పత్రిక 60

1.14.2.4. సంఘాలు 61

1.14.3. నవ్యాసాహిత్య పరిషత్తు 62

1.14.3.1. నవ్య సాహిత్య పరిషత్తు– ఆశయాలు 62

1.14.3.2. 'ప్రతిభ' పత్రిక 63

1.14.3.3. నవ్య సాహిత్య గ్రంథాలు 63

1.15. భావకవిత్వ దశలు 64

1.15.1. ఆరంభ దశ (1910–1916) 64

1.15.2. వికాస దశ (1917–1921) 65

1.15.3. పరిణామ దశ (1922-1940) 66

రెండవ అధ్యాయం

భావకవిత్వంపై ఆంగ్ల రొమాంటిక్ కవిత్వం – ఇతర ప్రభావాలు [68-96]

2.1.భావకవిత్వంపై ప్రభావాలు 68

2.2. ఆంగ్ల రోమాంటిక్ కవిత్వం 68

2.2.1. ఆవిర్భావం 69

2.2.2. నిర్వచనాలు 71

2.2.3. లక్షణాలు 72

2.2.4. ఆంగ్ల రొమాంటిక్ కవులు 75

2.2.5. భావకవిత్వంపై ఆంగ్ల రోమాంటిక్ కవుల ప్రభావం 79

2.3. రవీంద్రుని బెంగాలి కవిత 83

2.3.1. రవీంద్రుని కవితా తత్వం 85

2.3.2. భావకవిత్వంపై రవీంద్రుని బెంగాలి కవిత్వ ప్రభావం 87

2.4. మత సాంఘిక సంస్కరణోద్యమాలు 89

2.4.1. భారత దేశం- బ్రహ్మసమాజం 90

2.4.2. ఆంధ్రదేశం- బ్రహ్మ సమాజం 92

2.4.3. సాహిత్యం- బ్రహ్మసమాజం 94

మూడవ అధ్యాయం

తెలంగాణలో భావకవిత్వం – ప్రారంభ వికాసాలు[97-134]

3.0. తెలంగాణ భావకవిత్వం- నేపథ్యం 97

3.1 . తెలంగాణ ప్రాచీన సాహిత్యంలో భావకవిత్వ చ్ఛాయలు 97

3.2. తెలంగాణ భావకవిత్వంలో పూర్వదశ 102

3.2.1.తెలంగాణలో బ్రిటిష్ ఆంధ్ర అహంకార ధోరణులు 105

3.2.2. ప్రాంతీయ చర్చలు- వివాదాలు 107

3.2.3. తెలంగాణలో గోలకొండ కవుల సంచిక ఆవిర్భావం 110

3.2.4. నిజాం రాష్ట్ర వాసులకే ఆహ్వానం 113

3.3. తెలంగాణలో భావకవిత్వం ఆవిర్భావం 116

3.3.1. తెలంగాణలో భావకవిత్వం- ప్రారంభ వికాసం 124

3.3.2. తెలంగాణ భావకవులు 130

3.3.3. తెలంగాణ భావకవిత్వానికి ఆధారాలు 131

3.3.4. తెలంగాణ భావకవితా శాఖలు 132

3.4. ముగింపు 133

నాల్గవ అధ్యాయం

తెలంగాణలో భావకవిత్వం- వస్తు వైవిధ్యం[135-238]

4.0. పరిచయం 135

4.1. వస్తువు నిర్వచనం– లక్షణాలు 136

4.1.1. వస్తువుని ఎన్నుకోవడం 137

4.1.2. కావ్య వస్తువు 138

4.1.3. కవితా వస్తువు 139

4.2. భావకవిత్వంలో వస్తువు 141

4.3. తెలంగాణ భావకవిత్వం– ప్రణయం 144

4.4. తెలంగాణ భావకవిత్వం– ప్రకృతి 167

4.5. తెలంగాణ భావకవిత్వం–భక్తి 188

4.6. తెలంగాణ భావకవిత్వం – దేశభక్తి 205

4.7. తెలంగాణ భావకవిత్వం– స్మృతి 219

4.8. తెలంగాణ భావకవిత్వం– సంఘసంస్కరణం 225

ఐదవ అధ్యాయం

5. తెలంగాణలో భావకవిత్వం– శిల్పం, భాష [239–281]

5.0. పరిచయం 239

5.1 కవితా శిల్పం 241

5.1.1. శిల్పం– లక్షణాలు 241

5.2. శిల్పంగాలు 244

5.2.1. శీర్షికలు 244

5.2.1.1. ప్రతీకాత్మక శీర్షికలు 245

5.2.2. ఎత్తుగడ 246

5.2.3. ముగింపు 247

5.2.4. ఆద్యంతాల సమన్వయం 249

5.2.5. నిర్వహణ 251

5.2.6. చంధస్సు 253

5.2.6.1. భావాంశం– భావగణం 253

5.2.7. అంతర్లయ 255

5.2.8. నిర్మాణ వైవిధ్యం 257

5.2.8.1. దీర్ఘపాదాలు 258

5.2.8.2. పొట్టిపాదాలు 259

5.2.8.3. పొట్టి కవిత్వం 260

5.2.8.4. 'స్టాంజా' కవిత్వం 261

5.3. తెలంగాణ భావకవిత్వం – భాష 263

5.3.1. అన్యదేశాలు 264

5.3.1.1. తెలంగాణ భావకవిత్వంలో ఆంగ్ల పదాలు 264

5.3.1.2. తెలంగాణ భావకవిత్వంలో ఉర్దూ పదాలు 265

5.3.1.3. తెలంగాణ భావకవిత్వంలో సంస్కృత పదాలు 267

5.3.2. మాండలిక పదాలు 269

5.3.3. ధ్వని పరిణామం 271

5.3.3.1.. వర్ణ సమీకరణం 271

5.3.3.1.1. పర వర్ణ సమీకరణం 271

5. 3.3.1.2.పూర్వ వర్ణ సమీకరణం 272

5.3.3.2. స్వర లోపం 272

5.3.3.3. స్వరభక్తి 273

5.3.3.4. లోప దీర్ఘత 274

5.3.3.5. తాలవ్యీకరణం 274

5.3.4. అర్థ పరిణామం 274

5.3.4.1. అర్థ వ్యాకోచం 275

5.3.4.2. అర్థ సంకోచం 276

5.3.4.3. అర్థాపకర్ష 276

5.3.4.4. వస్తు పరిణామం 276

5.3.5. ధ్వన్యనుకరణ పదాలు 277

5.3.5.1. తెలంగాణ భావకవిత్వం– ధ్వన్యనుకరణ పదాలు 277

5.3.6. జంట పదాలు 277

5.3.6.1. తెలంగాణ భావకవిత్వం– జంట పదాలు 278

5.3.7. అలంకారములు 279

5.3.7.1.శబ్దాలంకారములు 279

5.3.7.1.1. వృత్యాను ప్రాసము 280

5.3.7.1.2. లాటాను ప్రాసము 280

5.3.7.1.3. అంత్యాను ప్రాసము 280

5.3.8. ముగింపు 281

సింహావలోకనం 282

ఉపయుక్త గ్రంథాలు 288

అనుబంధం–1

అనుబంధం–2

అధ్యాయం- 1

భావ కవిత్వం - స్వరూప స్వభావాలు

మొదటి అధ్యాయం

భావ కవిత్వం – స్వరూప స్వభావాలు

1.1. కవిత్వం–నిర్వచనం:

ప్రాచీన కాలం నుండి మానవుడు తన జీవితంలో వివిధ పార్శ్వాలను, వాటి భావాలను వ్యక్తం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాడు. భావాల అభివ్యక్తీకరణకు ప్రధాన సాధనం భాష. అయితే మానవుడు తన అనుభవాల్ని, అనుభూతుల్ని రమణీయంగా, రసాత్మకంగా అభివ్యక్తీకరించే ప్రయత్నాన్ని 'కవిత్వం'గా పిలవడం జరుగుతుంది. ఈ ప్రయత్నం చేసేవాడిని కవి అంటున్నాం.

భాష ఎంతటి ప్రాచీనమైనదో కవిత్వం కూడా అంతే ప్రాచీనమైంది. మొదట కవిత్వం అనే పదం కావ్యంగా పిలువబడేది. వివిధ దేశాల్లోని అలంకారికులు, పండితులు కవిత్వానికి వివిధ రకాల నిర్వచనాల్ని ఇచ్చారు. భారతీయ అలంకారికులు కావ్యం పేరుతోనూ, పాశ్చాత్య విమర్శకులు కవిత్వం (Poetry) పేరుతోనూ అనేక నిర్వచనాల్ని, లక్షణాల్ని చెప్పారు.

సంస్కృత అలంకార గ్రంథాల్లో పరిశీలనాయోగ్యమైన నిర్వచనాలు మూడు కన్పిస్తాయి. అవి:

1.1.1. మమ్మటుని నిర్వచనం:

"తదదోషా శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునఃక్వాపి" **(శ్రీరామ చంద్రుడు, పుల్లెల,అలంకార శాస్త్ర చరిత్ర. 2002, పుట.384).**

– అదోషములును, సగుణములును, సాలంకారములును అగు శబ్దార్థాలు కావ్యము అని భావము. అవి ఎక్కడైనా అలంకార రహితంగానూ ఉండవచ్చును. ఈ నిర్వచనములో అస్పష్టమైనది అదోషము అనేది. దోషము అను మమ్మటుడు దేనిని భావించాడో దానిపైనే ఈ నిర్వచనం స్పష్టత, సమగ్రత ఆధారపడి ఉంటాయి. అయితే ఏదైనా దోషమున్నంత మాత్రాన కావ్యం కాకపోదని, దోషాలున్నా సరే మహాకావ్యాలుగా పరిగణింపబడినవి చాలా ఉన్నాయని, గుణాలు, దోషాలు అనేవి ఉండడము, లేకపోవడము అనేవి కావ్య సమగ్రతను నిర్వచించలేవని విశ్వానాథుడు భావించి మమ్మటుని నిర్వచనాన్ని ఖండించాడు. ఇతడు కొత్త నిర్వచనాన్ని ఇచ్చాడు.

1.1.2. విశ్వనాథుని నిర్వచనం:

"వాక్యం రసాత్మకం కావ్యమ్" **(అలంకార శాస్త్ర చరిత్ర. 2002, పుట.381).** రసాత్మకమైన వాక్యమే కావ్యమని దీని భావం. రసమనేది కావ్యాన్ని పఠించే సహృదయునికి సంబంధించినది. అది

పఠిత మానసిక పరిస్థితిని అనుసరించి ఉంటుంది. సహృదయుని మనసును స్పందింపజేసేదిగా ఉండే వాక్యమే కవిత్వమవుతుందని ఇతని భావన.

ఈ విధంగా ఇతడు మమ్మటుడు చెప్పిన శబ్దార్థాలకు సంబంధించిన విషయాన్ని ప్రక్కకు నెట్టి రసవాదాన్ని తెచ్చాడు. "ఇతని తరువాతి వాడైన జగన్నాథుడు ఈ నిర్వచనాన్ని అంగీకరించలేదు. రసవంతమైన వాక్యమే కావ్యమయితే ఏ రస స్పర్శలేని రమణీయ వర్ణనలన్నీ కావ్యాలు కానేరవని, కాబట్టి ఈ నిర్వచనానికి అవ్యాప్తి దోషముందని భావించి తానొక కొత్త నిర్వచనాన్ని ఇచ్చాడు.

1.1.3. జగన్నాథుని నిర్వచనం:

"రమణీయార్థ ప్రతిపాదకశ్శబ్దః కావ్యమ్" **(అలంకార శాస్త్ర చరిత్ర. 2002, పుట.383).**

– రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దమే కావ్యమని దీని భావం. రమణీయత సహృదయులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. రసవంతమైనది రమణీయము కూడా అవుతుంది. కాబట్టి విశ్వనాథుని రసాత్మకత్వము రమణీయతలో భాగం అవుతుంది. ఇతని నిర్వచనంలో శబ్దంతోపాటు అర్థానికి కూడా చోటిచ్చాడు. పఠితకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే శబ్దాలనే కావ్యమన్నాడు.

ఇవే కాకుండా దండి (కావ్యాదర్శము), భోజుడు (సరస్వతీ కంఠాభరణము), జయదేవుడు మొదలగు అలంకారికులు కావ్య నిర్వచనం ఇచ్చారు. ఈ నిర్వచనాలలో శబ్దం ప్రధానమైనవి కొన్ని, అర్థ ప్రధానమైనవి కొన్ని ఉన్నాయి.

1.1.4. పాశ్చాతులు – కావ్య నిర్వచనాలు:

కావ్య నిర్వచనం విషయంలో భారతీయాలంకారికులకు, పాశ్చాత్యాలంకారికులకు భేదం ఉంది. భారతీయాలంకారికులు కావ్య శబ్దాన్ని అనేక సాహితీ ప్రక్రియలకు వాడారు. పాశ్చాతులు సాహితీ ప్రక్రియలన్నింటినీ కావ్యాలుగా భావించలేదు. ఆంగ్ల విమర్శలో నాటకం, నవల, కవిత్వాలను విడిగా చూసే అలవాటు ఉంది. పాశ్చాత్య విమర్శకులు కూడా శబ్దాన్ని అనుసరించి, అర్థాన్ని అనుసరించి నిర్వచనాలు ఇచ్చారు. అయితే వీరిలో చాలామంది కవిత్వాన్ని ఒక కళగా (Art) భావించారు. వర్డ్స్‌వర్త్ అనే కవి కవిత్వాన్ని నిర్వచిస్తూ –

"All good poetry is the sponteaneous overflow of powerful feelings" **(నారాయణరెడ్డి, సి, ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు–ప్రయోగములు, 1977, పుట.66)** అని అన్నాడు. మంచి కవిత్వం శక్తిమంతమైన అనుభూతుల స్వచ్ఛంద విజృంభణమే. ఇతడే మళ్ళీ –

"It takes its origin from emotion recollected in tranquillity" అని కూడా అన్నాడు. కవి మానసిక స్థితి నుండి కవిత్వం ఎలా ఆవిర్భవింస్తుందో దాన్ని వివరిస్తున్నాడు. కవి

అంతరంగంలోంచి పుట్టి, విశృంఖలంగా నర్తించే అనుభూతులే కవిత్వం అని మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. Powerful feelings అని అనడంలో ఆ అనుభూతులకు పఠిత మనస్సుకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కల్గించే శక్తి ఉండాలని సూచిస్తున్నాడు.

"Poetry is at bottom a criticism of life. Poetry is simply the most delightful and perfect form of utterance that human words can reach" **(నారాయణరెడ్డి, సి, ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు–ప్రయోగములు. 1977, పుట.67)** అని నిర్వచించాడు. కవిత్వాన్ని మానవ జీవితానికి విమర్శగా ఇతడు భావించాడు. మానవ భాష చేరగలిగే అత్యుత్తమ రూపంగా, ఆనందాన్ని అందించే సాధనంగా దీన్ని అభివర్ణిస్తున్నాడితడు. ఈ నిర్వచనంలో భాష (శబ్దం) ప్రాముఖ్యత కన్పిస్తోంది. శబ్దాన్ని బట్టి, పొందికను బట్టి అత్యుత్తమ రూపాన్ని కవిత్వం పొందుతుందని ఇతడి భావన.

శామ్యూల్ జాన్‌సన్ అనే పండితుడు – "Poetry is the metrical composition. It is the art of uniting pleasure with truth by calling forth imagination to the help of reason" **(నారాయణరెడ్డి, సి, ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు–ప్రయోగములు,1977, పుట.68)** అని కవిత్వాన్ని నిర్వచించాడు. ఇది కవిత్వం అంతర్గత భావనా లక్షణాలను కాకుండా బాహ్యరూప లక్షణాలకు ప్రాధాన్యతనిచ్చిన నిర్వచనం. కవిత్వాన్ని ఛందోబద్ధమైన రచనగా ఇతడు భావిస్తున్నాడు. బుద్ధి, భావన సాధనాలుగా సత్యం, ఆనందాలను ఐక్యపరిచే కళగా దీనిని వివరిస్తున్నాడు. కవిత్వం ఛందోబద్ధమైన రచనగా చెప్పడంలో రూపపరంగా కవిత్వానికి హద్దుల్ని నిర్ణయిస్తున్నాడు. వీరే కాకుండా కార్లయిల్, జె.ఎస్.మిల్, షెల్లీ, హాజ్‌లిట్, కాలరిడ్జ్, ప్లేటే, అరిస్టాటిల్, జాన్‌డ్రైడన్ మొదలైన పండితులు, కవులు, తత్త్వవేత్తలు కవిత్వాన్ని అనేక రకాలుగా నిర్వచించారు.

తెలుగు భాషాసాహిత్యాలపై ప్రాచీన యుగం నుండి సంస్కృత ప్రభావం పడుతూ వచ్చింది. దీని వల్ల తెలుగులో స్వతంత్రంగా లక్షణ గ్రంథాలు వెలువడలేదు. సంస్కృతంలో వచ్చిన అనేక లక్షణ గ్రంథాలు తెలుగు లాక్షణికులు లేదా కవులు అనువాదం చేయడం వల్ల సుమారుగా తెలుగు, సంస్కృతాలకు అలంకార శాస్త్రం ఒకటే అయింది. అయితే తెలుగు కవులు వారి కావ్యావతారికలలో, కావ్యాల్లో కొన్ని చోట్ల కవిత్వాన్ని/కావ్యాన్ని నిర్వచించే ప్రయత్నం చేశారు. నన్నయ భారతాన్ని జగద్ధితంబుగా రచించానన్నాడు. అలాగే ఆంధ్ర శబ్ద చింతామణిలో మనకు "విశ్వశ్రేయః కావ్యమ్" అనే వాక్యం కన్పిస్తుంది. ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన నిర్వచనం ఇది. కవిత్వ

ప్రయోజనంగా ఇతడు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని చెప్పలేదు. సమస్త ప్రజాశ్రేయస్సే కావ్యలక్ష్యంగా ప్రకటించాడు. శివకవులుగా ప్రసిద్ధిగాంచిన వారిలో పాల్కురికి సోమనాథుడు కవిత్వాన్ని గురించి చెప్తూ –

"అల్పాక్షరముల అనల్పార్థరచన కల్పించుటయె గాదె కవి వివేకంబు" (**నాగయ్య, జి,తెలుగు సాహిత్య సమీక్ష, 2019, పుట.162.**) అన్నాడు. ఇది మామూలు భాషకి, కవిత్వ భాషకి తేడాని స్పష్టం చేస్తున్న నిర్వచనం. భావాన్ని అతి తక్కువ మాటల్లో కుదించి, విశిష్టమైన, విస్తృతమైన అర్థాన్ని స్ఫురింపజేయడమే కవిత్వం అని ఇతని భావన.

ఛందోబద్ధమైన రచనలే కావ్యాలుగా భావించి చెప్పినవారు ఉన్నారు. వీరిలో తిక్కన –

"తెలుగు కవిత్వం చెప్పం
దలచిన కవి యర్థమునకు దగియుండెడు మా
టలు గొని వళులు భ్రాసం
బులు నిలుపక యొగిని బులిమి పుచ్చుట చదురే?"

(నాగయ్య, జి, తెలుగు సాహిత్య సమీక్ష, 2019, పుట.231–232)

అంటూ కావ్యారచనకు నిర్దిష్టమైన సూత్రాలను, పరిమితులను వివరిస్తున్నాడు. యతిప్రాస స్థానాలను, అర్థవంతమైన పదాలను వాడాలని అలా చేయకుంటే కవిత్వం గంభీరంగా ఉండదని చెప్పాడు.

ప్రాచీన, ఆధునిక తెలుగులో వచ్చిన కావ్య నిర్వచనాలన్నీ కవిత్వాశయాన్ని, లక్ష్యాల్ని చెప్పేవిగానే ఉన్నాయి. వీటిలో చాలావరకు కవిత్వంలోని సాంకేతిక అంశాల్ని గుర్తించనివే. ఆధునిక యుగంలో పాశ్చాత్య భాషా సాహిత్యాల ప్రభావం చేత అనేక సాహిత్య ప్రక్రియలు తెలుగు భాషలోకి చొచ్చుకొని వచ్చాయి.

క్షీణ యుగ ప్రబంధాలపై విమర్శ చేస్తూ కందుకూరి తమ **'సరస్వతీ నారద విలాపం'లో** "ఛందోబద్ధంబగు పద బృందాటోపంబు కవిత్వమగునే"**(కందుకూరి అధిక్షేప రచనలు, 2019, పుట.2)** అని అన్నాడు. ఈ విధంగా ఇతడు శబ్దార్థాలకు రెంటికీ ప్రాధాన్యతనివ్వాలని సూచించాడు. కేవలం ఛందస్సు సామన్య భాషని కవిత్వభాషగా మార్చలేదని ఇతని ఆధునిక యుగం ప్రారంభమైన తరువాత తెలుగు కవిత్వం వేగవంతమైంది. కవిత్వం వివిధ సామాజిక సందర్భాలకు అనువుగా మారుతూ వచ్చింది. ఆ సందర్భంలో కవిత్వ లక్షణాలు, ప్రయోజనాలు కూడా మారాయి.

శ్రీశ్రీ తన 'నవ కవిత' గేయంలో –

“కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేది పాడించేదీ
పెనునిద్దుర వదిలించేదీ
మునుముందుకు సాగించేదీ
సంపూర్ణపు బ్రతుకిచ్చేదీ
కావాలోయ్ నవ కవనానికి”

(శ్రీశ్రీ.మహాప్రస్థానం. 2022. పుట.26)

అంటూ కవిత్వ ప్రయోజనం లక్ష్యంగా లక్షణాల్ని వివరిస్తున్నాడు. శ్రీశ్రీ తరువాత అనుభూతి కవిగా ప్రసిద్ధిచెందిన తిలక్ తన రచనల్లో కొన్ని చోట్ల కవిత్వం ఎలా ఉండాలో నిర్దేశిస్తూ కొన్ని మాటలు చెప్తాడు తన ‘నవత–కవిత’లో –

“... మోడరన్‌గా ఉందామనీ, ఏదో అందామనీ
తనకే తెలియని అస్పష్టపు అనుభూతినీ
అర్థంలేని ఇమేజరీతో కలగాపులగపు వర్ణనలతో
డిలాన్ థామస్‌కు చేతకాని అనుకరణలతో
ఒక దేశం నిర్దేశంలేని వాక్యాల వికారంతో
ఎందుకు బాధిస్తావు నువ్వు...”

(బాలగంగాధర తిలక్, అమృతం కురిసిన రాత్రి. 2019, పుట.113)

అంటాడు. కేవలం వాక్యాలతో గారడీ చేసినంత మాత్రాన కవిత్వం కాదని, అర్థం కానిదేదీ కవిత్వం కాలేదని ఇతని భావం.

శ్రీశ్రీ ‘మహాప్రస్థానానికి” యోగ్యతాపత్రం రాస్తూ చలం –

“తనకీ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారవమే కవిత్వం” **(శ్రీశ్రీ.మహాప్రస్థానం.2022, పుట.10)** అంటాడు. హృదయం ఎలా కంపిస్తే అలా మాటల రూపం ఇవ్వడమే కవిత్వం అని ఇతని భావం. అనుభవాన్ని అనుభూతిగా మార్చుకునే దశలో గల ప్రక్రియ బహిర్యుద్ధమైతే అనుభూతి అభివ్యక్తిని పొందే వరకూ జరిగే ప్రక్రియని అంతర్యుద్ధమనవచ్చును.

ఈ విధంగా అనేక మంది కవిత్వాన్ని నిర్వచించడానికి, కవిత్వ పరమార్థాన్ని, లక్ష్యాన్ని, లక్షణాలను, ప్రయోజనాన్ని వివరించడానికి ప్రయత్నించారు. అనుభవాన్ని వ్యక్తం చేయడమే కాదు, అనుభవం పాఠకునిలో అనుభూతమయ్యేట్టు చేయడమే కవిత్వం పని అని వీటన్నింటివల్లా స్పష్టమవుతుంది. ఎటువంటి శాస్త్రీయ సూత్రాల నిమిత్తం లేకుండానే జీవితానుభవాన్ని ప్రత్యక్షంగా అనుభూతమయ్యేటట్లు చేయగలిగే శక్తి కవిత్వానికి ఉంది. కవిత్వానికి కేవలం శబ్ద చమత్కారం వల్లనే అర్థం కలగదు. కేవలం ఛందస్సుకి ప్రాధాన్యత లేదు.

ఒక సామాన్య వాక్యం లేదా సామాన్య భాష చెప్పలేని దానికన్నా ఎక్కువ తీవ్రతతో చెప్పగలిగేది కవిత్వభాష. ఇది జీవితానికి ఒక స్పృహను, దృక్పథాన్ని కలుగజేస్తుంది. అనుభవాల నుండి వచ్చిన స్పృహ ఇది. ఈ స్పృహ కల్గించడం ద్వారా జీవితాన్ని, ప్రపంచాన్ని అర్థవంతం చేయడం కవిత్వం పని.

1.2. భావకవిత్వం ప్రారంభం:

కాల్పనిక సాహిత్యమనీ, భావకవిత్వమనీ రెండూ పర్యాయంగా ఒకే విషయాన్ని వివరిస్తున్నాయి. ఆంగ్లంలో రొమాంటిసిజం అన్న పదం తెలుగులో ఈ రెండు పదాల సృష్టికి మూలమైంది. లిరికల్ పోయిట్రీ అనే పదం మరొకటి ఉందనీ అది కాల్పనిక సాహిత్యానికి, రోమాంటిసిజం భావకవిత్వానికి అనువాదాలని భావించే స్థితి లేకపోలేదు. అందువల్ల వివరణ అవసరం. రొమాంటిసిజం అనే ఆంగ్లపదమే భావకవిత్వం, కాల్పనిక కవిత్వం, భావకత, కాల్పనిక సాహిత్యంగా తెలుగులో పిలవబడుతున్నదానికి మూలం.

యూరోపుదేశాలలో మారిన సాంఘిక పరిస్థితులు కారణంగా 18 వ శతాబ్ది చివరి భాగంలో సాహిత్యరంగంలో కాల్పనికోద్యమం బయలుదేరింది. ఇది ఒక విధంగా ప్రాచీన సాహిత్య దృక్పథం సవరించే ధోరణిలో ఆరంభమయింది. ఈ దృక్పథాన్ని తిరస్కరిస్తూ సంప్రదాయ నవ్య సంప్రదాయ వాదాలు పుట్టాయి. 19 వ శతాబ్దిలో ఈ మూడు వాదాలూ మార్కిష్టు సాహిత్య దృక్పథంలో సంఘర్షించాయి. ఇటువంటి క్రమ పరిణామం తెలుగులో రాలేదు. యూరోపు దేశాలలో బయలుదేరిన ఎన్నో సాహిత్య ఉద్యమాలు ఒకేసారి 20 వ శతాబ్దిలో తెలుగులో ప్రవేశించాయి.

"సంప్రదాయ, నవ్య సంప్రదాయవాదాలు వేరువేరుగానూ, పునరుజ్జీవన సాహిత్యంలో భాగంగానూ ఈ శతాబ్ది ఆరంభం నుంచి తెలుగులో రూపం దిద్దుకున్నాయి. పునరుజ్జీవన సాహిత్యం, అందువల్ల, అటు సంప్రదాయ దృష్టినీ, ఇటు ఆధునికతా దృష్టినీ, కలగాపులగంగా కలుపుకొని ప్రవర్తించింది.1910లో కాల్పనిక ఉద్యమం,1930లలో మార్క్సిస్టు ఉద్యమం తెలుగులో ఆరంభమయ్యాయి. తెలుగులో ఇవి సంఘర్షణాత్మకంగా లేవు. ఒకదాని పరిణామంగా మరొకటి ప్రభవించింది. భావకవిత్వమే అభ్యుదయకవిత్వానికి మార్గం ఏర్పరచినట్లు నిలిచింది. విభిన్న సాహిత్య ధోరణులు ఏక కాలంలో భిన్న ధర్మ ప్రబోధకాలుగా తెలుగు సాహిత్యంలో నిలదొక్కు కున్నాయి". **(ఇనాక్, కొలకనూరి, ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, 2010, పుట.55)**

20వ శతాబ్దంతో తెలుగు సాహిత్యంలో ఎన్నో కొత్త ధోరణులు ప్రారంభమయ్యాయి. ప్రబంధాలకు కథా కావ్యాలకు విరేశలింగం పంతులు రోజుల నుంచే ప్రాధాన్యం తగ్గి ఈ కొత్త ధోరణులకు ప్రాధాన్యం పెరిగింది.వస్తువులో, స్వరూపంలో ప్రాచీన కవిత్వం కన్నా భిన్నత్వాన్ని సంతరించుకున్న ఈ కవిత్వాన్ని 'ఆధునిక కవిత్వం' అంటున్నారు.ఒక విధంగా ప్రాచీన కవిత్వ స్వరూపాన్ని కొనసాగిస్తన్న నవ్య సాంప్రదాయ కవిత్వం కంటే ఈ కవిత్వం భిన్నమని గుర్తించడానికి కూడా 'ఆధునిక కవిత్వం' అనే పదం ఉపయోగపడుతుంది.

ఆధునిక కవిత్వం తొలి రోజుల్లో వచ్చిన రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు మొదలైన కవుల కవిత్వాన్ని గురించి ఆయా కవులు 'గీతకవిత్వ'మని,'కాల్పనికి కవిత్వ'మని, 'అభినవ కవిత్వ'మని 'నవ్య కవిత్వం' అని పిలుచుకున్నారు. మొత్తం మీద ఈ కవిత్వం విషయంలో 'భావకవిత్వం' అనే పదమే స్థిరపడింది.

భావకవిత్వం ముఖ్యంగా పూర్వా ప్రబంధాల పట్ల ప్రతిక్రియగా, సంఘసంస్కరణ ఉద్యమాలు, పాశ్చాత్య సాహిత్య సాంకేతిక విజ్ఞానాల వ్యాప్తి, ప్రధానంగా యూరోప్లో 18వ శతాబ్దంలో విజృంభించిన 'రొమాంటిక్ కవిత్వ' ప్రభావం బెంగాలీ భాషలలోని కొత్త రచనారీతుల ప్రభావం అందులో ప్రధానంగా రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల ప్రభావం కారణంగా ఆవిర్భవించిందంటారు.

1910 తరువాత వచ్చిన నవ్యకవిత్వాన్ని 'భావకవిత్వం' అని అన్నారు. నవ్యకవిత్వాన్ని ఉద్దేశించి ఈ పదాన్ని మొట్టమొదటగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఉపయోగించాడు.1914లో ఈయన ఆంధ్ర పత్రిక సంపాదకులుగా ఉన్నప్పుడు భావకవులలో మొదటివాడుగా చెప్పబడుచున్న రాయప్రోలు సుబ్బారావు కవిత్వం మీద ప్రసంగిస్తూ ఈ పదం వాడాడు. రాయప్రోలు సుబ్బారావు భావపదం,భావగీతం అనే పదాలు వాడాడు. దేవులపల్లి కృష్ణశాస్త్రి "ఊర్వశి" కావ్యంలో భావగీతం అని ప్రయోగించాడు.

1.3. భావకవిత్వం – నిర్వచనం:

"భావం, కవిత్వం అనే రెండు పదాల కలయికతో ఏర్పడిన సమస్త రూపం 'భావకవిత్వం'. 'భావం' రెండు రకాలు. కవి భావమే కవిత్వంలో ప్రతిబింబిస్తే, అది 'శుద్ధ కవిత'. ఇక్కడ కవి ప్రత్యక్షంగా కనిపిస్తాడు. భావం పాత్రలపరంగా, ఇతివృత్తపరంగా కనిపిస్తే అది 'ప్రయుక్త కవిత'. ఇక్కడ కవి పరోక్షంగా కనిపిస్తాడు.

"కవి భావ పాఠకునిలో అనురూప భావానుభూతిని కూర్చే కవిత్వం భావ కవిత్వం. పాఠకునిలో కవిత్వంలోని సన్నివేశాన్ని చిత్రించుకోగలిగిన హృదయ సంవాదం, కవి ఆవేశ సామాగ్రిని అందుకోగలిగిన అర్హత ఉండాలి. కవి భావం పాఠకునిలో ప్రత్యక్ష సహానుభూతిని పెంపొందించాలి. భావకవిత్వంలో వ్యక్తమయ్యేది కవి స్వీయభావం. కవి యొక్క తత్త్వం అది కవిస్వానుభవం.

"కవి స్వీయభావం మూడు రకాలుగా కనిపిస్తుంది. కవిత్వంలో కవి నాయకుడుగా ఉంటే, అది 'ఆత్మనాయకత్వం'. కవి భావన మాత్రం కవిత్వంలో కనిపిస్తే 'ఆత్మాశ్రయత్వం'. కవి తన వ్యక్తిత్వాన్ని కవిత్వంలో పొందుపరిస్తే అది 'ఆత్మావిష్కారం"**(కృష్ణకుమారి,నాయని.'భావకవిత్వంలో అనుభూతి' 1988, పుట.105–112).**

భావకవి స్వేచ్ఛాప్రియుడు. కనుక ఈ కవిత్వ లక్షణాలలో స్వేచ్ఛా ప్రియత్వాన్ని కూడా జోడించారు. స్వేచ్ఛ అనేది భాషలో, భావనలో, శైలిలో, ఛందస్సులో అన్నింటా ఉండవచ్చు. భావ

కవిత్వానికి గానయోగ్యత ఉండాలని కొందరు నిర్వచనకారులు భావించారు. కాని గానయోగ్యం గాని కవిత్వం కూడా భావకవిత్వంగా గుర్తింపబడింది.

భావకవిత్వంలో వ్యక్తీకరణ గురించి కూడా నిర్వచన రూపంలో ప్రతిపాదనలు చేసినవారున్నారు. స్ఫుటాస్ఫుట ప్రతీతితో వ్యక్తీకరణ చేయడం, అనుభూతిని సాంకేతికమైన పద్ధతిలో క్రొత్త దృష్టితో క్రొత్త నుడికారంతో శబ్దలలిత చిత్రణతో వ్యక్తీకరించడం భావకవితా లక్షణంగా కొందరు భావించారు.

వస్త్వాశ్రయమైంది కాక భావాశ్రయమైంది 'భావకవిత్వం'. అది ఏక భావాశ్రయమై ఉండాలి. అటువంటి కవిత్వం పరిమాణంలో సహజంగా చిన్నదిగానే ఉంటుంది. అందువల్ల ఈ కవిత్వం లఘు రచన లేక చిన్న కావ్యం లేక ఖండకావ్యం అయి ఉంటుందని కొందరు నిర్వచనకారులు పరిమాణం దృష్ట్యా కూడా నిర్వచనం చెప్పారు.

"ఎదియొ అపూర్వ మధుర

రక్తి స్ఫురియించుకొని అర్థముకాని భావగీతమ్ములవి"

(కృష్ణశాస్త్రి,దేవులపల్లి, ఊర్వశి, 1982, పుట.58)

పంతొమ్మిదోశతాబ్దం మొదటి అర్థభాగంలో ఆంగ్లసాహిత్యంలో వచ్చిన కాల్పనిక కవిత్వం (Romantic Poetry) ప్రభావంతో ఈ భావ కవిత్వం తెలుగునాట 1910 –1940 సంవత్సరాల మధ్య భాగంలో వర్ధిల్లింది. భావకవిత్వాన్ని తొలి తెలుగు సాహిత్యోద్యమంగా విమర్శకులు భావించారు. గురజాడ మొదటిగా సాహిత్యంలో కొత్త పోకడలకు తెరవేసినా సంఘసంస్కరణ దృష్టితోనే సాహిత్యాన్ని సృజించారు. అయితే భావ కవిత్వం ఈ సంఘసంస్కరణ ఉద్యమాన్నీ, నవ్యకవిత్వోద్యమాన్నీ భూమికగా తీసుకొన్నప్పటికీ స్వతంత్రంగా ఒక సాహితీ ఉద్యమంగా కొంతకాలం పాటు నిలబడింది. ఈ ఉద్యమం ఎంత ఆదరణ పొందిందో అంతగా ఖండనలకీ, హేళనలకీ గురిఅయింది. అయితే కేవలం మూడు దశాబ్దాల్లో వర్ధిల్లిన ఈ కవిత్వం తరువాతి కాలంలో తెలుగు నేలపై వికసించిన అనేక సాహితీ రూపాలకు మార్గం చూపింది.

ఈ భావకవిత్వాన్ని నిర్వచించడంలోనూ, లక్షణాన్ని ప్రతిపాదించడంలోనూ అనేక వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఈ భావకవిత్వంపై వచ్చిన నిర్వచనాల్లో విశ్వనాథ, శ్రీశ్రీ ఇచ్చిన నిర్వచనాలు కింద వివరిస్తాను.

విశ్వనాథ సత్యనారాయణ తెలుగులో కవిత్వోద్యమాలు పుస్తకంలో భావకవిత్వానికి సంబంధించిన ఇలా అన్నారు."కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యములో ఊదబడినచో అది భావ కవిత్వము" అని అన్నారు.

అలాగే శ్రీశ్రీ కూడా భావకవిత్వం గురించి ఇలా వివరించారు. "హృదయాలను, మానసాలను కలవరపరుస్తూ అల్లకల్లోలంగా ఘూర్ణిల్లే ప్రమాద ప్రాంతరాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి అతని సంచారాలలో ఏ సన్ముహుర్తానలో కావ్యగీతం ఒకటి మెరుగులు తీరిన విలక్షణ రచనా ధోరణిలో వెలుగు చూస్తుంది. ఆ గీతం కవి అనుభవించిన రసధోరణిలో వెలుగు చూస్తుంది. ఆగీతం కవి అనుభవించిన రసస్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించగలుగుతుంది. ఉత్కృష్ట భావగీతానికి నా నిర్వచనం ఇది" అని అన్నారు.

ఈ నిర్వచనాలన్నింటినీ సమీక్షిస్తూ సి. నారాయణ రెడ్డి "భావ కవిత్వము భావ ప్రధానమైనదనగా రససహితమైనది; రసదృష్ట్యా అప్రధానమైనది కాదని, వస్తు భావ రచనలలో భారమునకగ్రతాంబూల మిచ్చిన కవిత్వమని, అది ఉత్తమ శ్రేణిదైనప్పుడు రసశిఖరమునందు కొను రచనయేనని" ***(తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమి, 2016, పుట.79-80)*** తన అభిప్రాయం వెలిబుచ్చారు.

పై నిర్వచనాలన్నింటిని పరిశీలించిన తరువాత 'భావకవిత్వాన్ని' ఈ విధంగా నిర్వచించవచ్చు. కవిత్వం వస్తు ప్రధానం కాకుండా భావ ప్రధానంగా ఉండాలి, కొంత కల్పన జోడించి కవి తనను తాను కవిత్వంలో ఆవిష్కరించుకోగలగాలి. అదే 'భావకవిత్వం'. భావకవిత్వాన్ని వివరిస్తూ తమకు తోచిన కొన్ని లక్షణాలను, ఉపలక్షణాలను పేర్కొన్నవారు ఉన్నారు.

1.4. భావకవిత్వం–అంశిక లక్షణాలు:

భావకవిత్వంగా గుర్తించిన కవితా సముదాయానికి కొన్ని అంశిక లక్షణాలను కూడా గుర్తించారు. అవి ఆత్మాశ్రయత్వం, స్వేచ్ఛాప్రియత్వం, ఉత్తమ పురుషలో వ్యక్తీకరణ, గానయోగ్యత, శృంగారం, ప్రకృతి, భక్తి, స్మృతి. **(తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమి,2016, పుట.83)**

1.4.1. ఆత్మాశ్రయత్వం:

భావకవిత్వం ఆత్మాశ్రయమయింది. కవి మనోధర్మాలను కవిత్వంలో ప్రతిబింబించడం వల్ల భావకవిత్వం 'ఆత్మాశ్రయ కవిత్వం' అయ్యింది. ఇది మానసికానుభూతి ప్రధానమైంది. ప్రాచీన కవిత్వం వస్తువు, భావం, రచనలలో వస్తువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల, అది 'వస్త్వాశ్రయ కవిత్వం' అయ్యింది. భావకవిత్వం తరువాత వచ్చిన అభ్యుదయ కవిత్వంలో సామాజిక సమస్యలను ప్రతిబింబించడం వల్ల, అది ఆత్మాశ్రయ కవిత్వం కాదు. భావకవిత్వం కవి భావానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఆత్మాశ్రయత్వం ప్రధాన లక్షణం అయ్యింది. ఇది కవి అంతః సౌందర్యానికి ప్రాధాన్యం ఇస్తుంది.

1.4.2. స్వేచ్ఛాప్రియత్వం:

ఈ కవిత్వంలో ముఖ్య లక్షణం 'స్వేచ్ఛాప్రియత్వం'. ఈ స్వేచ్ఛతో కవి తన సుఖ దుఃఖాలను కవిత్వంలో వెల్లడిస్తాడు. ఇలా తాను చూసిన సంఘటనలను కూడా కవిత్వ రూపంలో పాఠకుని ముందు ఉంచుతాడు. ఈ సౌలభ్యం అంతకు ముందు వచ్చిన కవిత్వానికి లేదు. అది ఎప్పుడూ ప్రభువులు కోరిన కథలనో, లేక వారి జీవితాలనో కావ్యాలుగా చిత్రించింది. అందుకని ఆనాటి కవులకు కావలసినంత స్వేచ్ఛ రచనలలో లభించేది కాదు. దీనికి శతకాలు కొంత అపవాదం. స్వీయ భావనలను సమకాలీన విషయాలను కవిత్వంలో తెలియజేసే స్వేచ్ఛ భావకవిత్వంలోనే ప్రస్ఫుటమైంది.

1.4.3. ఉత్తమ పురుషలో వ్యక్తీకరణ:

భావ కవిత్వానికి ఆలంబనం 'నేను' అనే తత్వం. ఇది కవి ఆత్మీయమైన వ్యక్తి. ఆ 'నేను' తో 'నువ్వు' అనేది ఎప్పుడూ అంటి పెట్టుకునే ఉంటుంది. ఆ 'నువ్వు' కవి ప్రేయసి కావచ్చు, భార్య

కావచ్చు, సృష్టిలోనిది కాని కవి ఊహ జగత్తులోనిది కాని ఏ వస్తువైనా కావచ్చు. ఈ రెండూ లేని కవిత్వం భావకవిత్వం అనిపించుకోదు. పూర్వ కవిత్వంలో శతకాలలో తప్ప కవి వ్యక్తం కాదు.

1.4.4. గానయోగ్యత:

దేవులపల్లి కృష్ణశాస్త్రి భావ గీతాలను గానం చేస్తూ ప్రచారం కలిగించాడు. కీర్తనలో లాగా పల్లవి, చరణాలతో కొన్ని గేయాలున్నాయి. దీని వల్ల ఈ కవిత్వం పాట రూపంలో పాడడానికి వీలైంది. ఇవి గేయాలు కాబట్టి ఆ సౌలభ్యాన్ని కలిగి ఉన్నాయి. పూర్వం దాదాపు అన్నీ పద్య, గద్యాలతో నిండి చంపూ కావ్యాలుగా ఉండేవి. పద్యాలు పాడడానికి కాక పఠనయోగ్యమైనవిగా భావించారు. ఆధునిక కాలంలో పద్యం పాడడానికి కూడా అనువైనది.

1.5.5. సున్నితమైన శృంగారం:

శృంగారంలోని సంభోగం, విప్రలంభాలలో ప్రాచీన కవులు ముఖ్యంగా ప్రబంధ కవులు సంభోగ శృంగారాన్ని విచ్చలవిడిగా తమ కావ్యాలలో వర్ణించారు. భావకవులు దానిని త్యజించి వియోగ శృంగారానికి అధిక ప్రాముఖ్యం ఇచ్చారు. ప్రేమ లోకంలో సహజంగా పొంగి ప్రవహిస్తుందని వీరి భావనం. సృష్టిలో జరిగే కార్యాలన్నీ ప్రేమ కోసమే అని వీరి తీర్పు.

రాయప్రోలు సుబ్బారావు 'తృణకంకణం'లో 'అమలిన శృంగార' తత్త్వాన్ని ప్రస్తావించాడు. సౌందర్యం వల్ల, శృంగార భావం వల్ల పొందే ఆనందం అమలినమైంది. అది లౌకిక వాసనలకు అతీతమైంది. అదే రసానందం. ఆ ఆనందమై కవి ధ్యేయం. వియోగ శృంగారంలో ఉన్న పవిత్రతను దృష్టిలో పెట్టుకుని ఆయన ఆ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఆయన తన కావ్యాలలో వియోగానికి పరమస్థాయిని చిత్రించాడు.

ప్రబంధాలలో స్త్రీ పురుషులు మధ్య గల పవిత్ర బంధం మరుగునపడి, అది ఎక్కువగా వారి కామ క్రీడలతో నిండిపోయింది. ప్రబంధ కవులు స్త్రీని శృంగార రసాధి దేవతగా, పురుషునికి సుఖానుభవాన్ని మాత్రం ప్రసాదించే వ్యక్తిత్వం లేని ఛాయగా భావించారు. అప్పటి కావ్యాలలోని స్త్రీని నఖశిఖ పర్యంతం వర్ణించారు. రాయప్రోలు సుబ్బారావు లౌకిక శృంగారాన్ని నిరసించి, అలౌకిక ప్రణయ భావనకు ప్రాధాన్యం ఇచ్చాడు. అనంతర భావకవులు కూడా ఆంగాంగ వర్ణన చేయక అంతరంగ వర్ణనకే ప్రాధాన్యం ఇచ్చారు.

వీరిలో కొంత మంది ఊహా ప్రేయసులను, కొంత మంది తమ జీవిత సహచరిణులను వర్ణించారు. వీరికి స్త్రీ ప్రేమమయి నాయికా సౌందర్యంతోపాటు ఆమెలో స్నేహశీలతను, సుకుమారతను దర్శించారు.

ప్రేమ సహజం, సృష్టిలోని ప్రతి కార్యం ప్రేమ కొరకేనని భావకవులు భావించారు. 'చెట్టుకు మొగ్గ తొడగడం, కోయిల పాడడం, మెరుపులు మెరవడం, వేసవిలో వేడి, సూర్య కిరణాలు జ్వలించడం ఎలా ప్రకృతి సహజాలో, ఇలాగే ప్రేమ కూడా లోకంలో విహరిస్తుందంటారు. ప్రేమ తత్వం ప్రేమించడమే అన్నారు. జీవితంలో "ప్రేమించకుండా నిర్జీవంగా బ్రతికే కంటే ప్రేమించి విఫలం చెందడం మంచిది. సుఖం కోసం, ముక్తికోసం, ప్రేమ కోసం ప్రేమించమన్నారు భావ కవులు అన్నారు.

ప్రాచీన కవుల కన్నా భిన్నంగా స్త్రీని భావ కవులు వర్ణించారు. ఇందులో వీరు స్త్రీ గుణానికి ప్రాధాన్యత నిచ్చి, వారి వర్ణనలో సున్నితమైన విశేషణాలను వాడారు. నాయుడు బావ యెంకిని "మెడలో పూసలతో, తలలో పూవులతో, చెక్కిట చిన్న మచ్చతో చూసాడు.

ఇంకా "ఆమె చూపులు కనకాభిషేకాలు, నవ్వు వజ్ర వైఢూర్యాలతో సమానం"గా భావించాడు. "ఆమె అడుగు పెట్టిన ఇల్లు ఎల్లప్పుడూ కలకలలాడుతుందని"**(సుబ్బారావు, నండూరి. 'నమిలి మింగిన నా యెంకి',1953, పుట.12-13)** ఔన్నత్యాన్ని కీర్తించాడు.

1.4.6. ప్రకృతి:

ప్రాచీన కావ్యాలలోని అష్టాదశ వర్ణనలలో ప్రకృతి అంతా కృత్రిమమైంది. భావకవుల ప్రకృతి అంతా చుట్టూ ఉన్న పరిసరాలతో నిండింది. అలంకారాల జోలికి అంతగా పోలేదు. సహజత్వాన్ని కోల్పోలేదు.

భావకవులు ప్రకృతిలో లీనం కావాలని కోరుకుంటారు. దానితో తాదాత్మ్యాన్ని పొందాలనుకుంటారు. ఆంగ్ల రొమాంటిక్ కవులు 'నేచర్ పొయట్స్'గా కూడా పిలువబడ్డారు. వీరిలో వర్డ్స్‌వర్త్, ఎలన్ వంటి కవుల పొస్టోరల్ పొయిట్రీని కూడా తెలుగులో రాశారు. అంటే పల్లెలను, గొల్లలను, పల్లెపడుచులను, పశువుల మీద కూర్చొని వేణువు వాయిస్తూ తిరిగే గొల్ల పిల్లలను వర్ణించారు.

ఈ కవులు కోయిల గురించి, వసంత కాలాన్ని గురించి గేయాలు రచించారు. మానవ జీవిత సమస్యలను కోయిలలకు ఆపాదించారు. ప్రకృతిని మానవీకరించారు. కోకిలమ్మకు పెండ్లి చేశారు.

ప్రాచీన కావ్యాలలో ప్రకృతి అంతా లవంగీ లవంగ లతలు, పనస ఖర్జూరాది వృక్షాలతో నిండి ఉంది. భావకవుల కవిత్వంలోని ప్రకృతిలో నిమ్మచెట్లు, మల్లికలు, కాశీ రత్నాలు, ఆనాస మొక్కలు దర్శనమిస్తాయి. "మేఘోదయాన్ని చూచి ఆడిన నెమళ్లను, వాటిని చూచి ఆనందంలో ప్రవహించే సెలయేళ్లను, ప్రకృతి పులకించిపోయేటట్లు గానం చేస్తున్న పక్షులను చిత్రించారు" **(రామిరెడ్డి, దువ్వూరి,వనకుమారి,1955, పుట.8)** భావకవులు.

భావకవులు పల్లీయుల మధ్య సంభాషణలను పల్లీయ జన చిత్రణలో చేర్చారు. ఒక పల్లెలో సాయంకాలం కావువాడు తన ప్రేయసిని ఊయల నూగడానికి పిలుస్తూ, "ఆవులను తోలేదాక దూడలను పట్టుకొనే చిన్నదాన! ఎవరూ లేనిచోట నీతో ఊయల నూగ మనసాయెను. చెట్ల చాటున కొమ్మల ఆకుల వలె మాటాడక కూర్చుందాం". **(రామకృష్ణారావు, అబ్బూరి.'కావుపాట'.సంకలనం: ముద్దుకృష్ణ, 1957,పుట.40)** అని అన్నాడు.

మంచిపై నిలుచుండి పిట్టలను తోలుకునే చిన్నవాడితో చిన్నది సంభాషణ ప్రారంభించింది. దారిని పోయేవారు చూస్తుండగా వడిసెలు విసరు, ఒత్తుగా పెరిగిన గడ్డి గుప్పెడు కోసి మా ఆవుకు వేసుకుంటా" నన్నది చిన్నది. సెనగ పూరైక తొడిగిన చిన్నదానా మీ మిరపలు ఈ సారి బాగా పండాయి. వంగ చెట్లు ఇప్పుడిప్పుడే పూత పడుతున్నాయి. బంతిపూలు సంక్రాంతి పండుగకు పూస్తాయి అంటూ, పిట్టలు వాటిని పాడుచేయకుండా తోలుతున్నాను. పాలుగారిన లేత జొన్న కంకులను, పండిన దోసకాయలను కోసి తినమన్నాడు. ఈ విధంగా పంట చేలను భావకవులు వర్ణించారు.

1.4.7. భక్తి:

ప్రాచీన సాహిత్యంలోని భక్తి తత్వానికి, భావకవుల భక్తి తత్వానికి తేడా ఉంది. ప్రాచీన కాలంలో వివిధ మతాల వల్ల ఆయా భక్తి మార్గాలు ఏర్పడ్డాయి. దాంతో సాహిత్యంలో కూడా అనేక రూపాలతో భగవంతుని కొలిచారు. ఆధునిక యుగం వచ్చేసరికి మార్పు చెందింది. దానికి కారణం క్రైస్తవ మతం, ఇస్లాం మతం, బ్రహ్మసమాజోద్యమం. భావకవులు ఆంగ్ల సాహిత్యం చదవడం వల్లల

క్రైస్తవంలోని తత్వాన్ని మనస్సుకు పట్టించుకున్నారు. ఏకేశ్వరోపాసన, విగ్రహారాధనను నిరసించడం, సాహిత్యంలోను ప్రతిఫలించింది.

భావకవులకు భగవంతుడు విశ్వ వ్యాప్తి అయినవాడు. అతని గొప్పతనాన్ని కీర్తించడం, అతనిలో ఐక్యం కావాలని ఆరాటం చెందడం ఈ కవులలో అధికం. వీరు తమ దోషాలను ఎత్తి చూపుకుంటూ భగవంతుని కరుణ కటాక్షాల కోసం, భవబంధాల విముక్తి కోసం తహతహలాడారు. వీరు తమ భావాలను నేరుగా అతనికి నివేదించుకుంటారు. వీరు ప్రేయసిని కూడా దేవతగా ఆరాధించారు. భావకవులు గోపికా కృష్ణుల లీలలను, మురళీనాదాన్ని కూడా వర్ణించారు. ఈ చిత్రణలో కూడా పూర్వుల కన్నా విలక్షణతను చూపించారు.

"దివ్య సౌధంలో దీపాలు వెలిగాయి. గర్భాలయంలో గంటలు మ్రోగాయి. ప్రాక్సతీమణి బంగారు గొడుగు పట్టుకుంది. విశ్వసుందరి పింజామరం వీచింది. ప్రకృతి గణం భవనాంగణంలో స్వామి కొరకు వేచి ఉంది. నైవేద్యం ఆరగింపరావయ్య" **(వేంకట పార్వతీశ్వర కవులు.'ఏకాంతసేవ'. సంకలనం:ముద్దుకృష్ణ,1957, పుట.235–236)** అని భగవంతుని భక్తితో వేడుకున్నాడు. ఆ తరువాత జరిగిన భగవంతుని సాక్షాత్కారంతో, ఆనందంతో భక్తునికి తడబాటు కలిగింది.

1.4.8. స్మృతి:

"ఎలిజీ' స్మృతికావ్యం. అది గ్రీకు పదం. గ్రీకులో 'ఎలిగాస్' అంటే 'శోకం'. శోకభరితమైన కవిత ఎలిజీ. 16వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రారంభమైనప్పుడు, గ్రీకు, రోమన్ సాహిత్యాల అధ్యయనం ద్వారా ఎలిజీ అనే పదం ఆంగ్లంలోకి వచ్చింది. మిల్టన్, షెల్లీ, ఆర్నాల్డ్ వంటి ప్రముఖ కవులు మరణించిన వ్యక్తులపై ఎలిజీలను రాయడం వల్ల అది ఆ అర్థంలో స్థిరపడింది. ఎలిజీ రాసే కవికి ముఖ్యంగా కావలసింది జీవన విషాదాన్ని గురించిన స్మృతి, మానవ హృదయావేశాలను బలవత్తరంగా చిత్రించగల శక్తి" **(రామచంద్రయ్య, పణతుల.'తెలుగు కవిత్వంలో ఎలిజీ', 1966, పుట.17–25).**

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల ఆధునిక తెలుగు సాహిత్యంలోకి ఎలిజీలు వచ్చాయి. అవి సతి స్మృతి, మాతృస్మృతి, మిత్రస్మృతి, పితృస్మృతి, నాయకస్మృతి వంటివి.

ఆప్తుల మరణానికి చిహ్నంగా స్మృతి గీతాలు రాయడంలో భావకవులు నవ్యతను సాధించారు. "క్రూర కర్మరుడు నట్టింట దీపాన్ని ఆర్పేసినాడని తల్లి మరణాన్ని సూచిస్తూ మాతృగీతాలు రాశారు. "తల్లీ, తండ్రీ అయ్యి ప్రాణానికన్నా అధికంగా పెంచిన తండ్రి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ పితృస్మృతిని వ్యక్తపరచారు.

"బంగారు గనిలో తిరుగుతున్న వేళ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మరణవార్త వినిపించింది. ఆ వార్త వినినంతనే నోరు పెగలలేదు. అటువంటప్పుడు ఆయన లేకుండా ఆయన కిష్టమైన యమునా కళ్యాణి రాగం ఎలా పాడగలను" (**అప్పారావు, బసవరాజు.'యమునాసాంత్వనము',1955, పుట.81–82**) అని బాధ పడ్డాడు కవి. దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన 'ప్రవాసం' కావ్యసంపుటి మిత్రస్మృతికి నిదర్శనం.

1.5. భావకవిత్వ శాఖలు:

భావకవిత్వ శాఖలను సి. నారాయణ రెడ్డి గారు ఆరు శాఖలుగా వర్గీకరించారు అవి :

1. ప్రణయ కవిత్వం
2. ప్రకృతి కవిత్వం
3. దేశభక్తి కవిత్వం
4. సంఘ సంస్కరణ కవిత్వం
5. భక్తి కవిత్వం
6. స్మృతి కావ్యాలు

అనే ఆరు శాఖలు ప్రధానమైనవి.

1.5.1. ప్రణయ కవిత్వం :-

భావకవిత్వంలో ప్రముఖ స్థానాన్ని పొందింది ప్రణయ కవిత్వం. భావకవులు ప్రేమను ధర్మంగా భావించారు ప్రకృతి గాలివీచినంత సహజంగా.

"సౌరభము లేల చిమ్ము పుష్పవ్రజంబు?

చంద్రికలనేల వెదజల్లు చందమామ ?

ఏల సలిలంబు పాఱు? గాడ్పేల విసరు?

ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను ?"

(దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణ పక్షము, 2019, పుట.14)

పై కవితలో కృష్ణశాస్త్రి ప్రణయాన్ని గురించి వివరించారు.

"ప్రబంధ, క్షీణప్రబంధ కాలాల నాటి సాహిత్యంలో స్త్రీని కేవలం విలాసవస్తువన్న దృష్టిని కలిగించారు. కానీ ఈ విషయం భావకవులను బాధించింది. వీళ్ళ ప్రణయకవిత్వానికి దోహదం చేసింది. వీళ్ళు స్త్రీ శరీర సౌందర్యాన్ని కాక ఆత్మసౌందర్యాన్ని దర్శించి ఆరాధించారు. అలౌకిక సౌందర్య వర్ణన చేశారే కాని దైహిక మోహాన్ని రెచ్చగొట్టే వర్ణనలు చేయలేదు. వీళ్ళ ప్రణయ కవిత్వంలోని శృంగారవర్ణనలు సభ్యతను దాటలేదు. స్త్రీలోని వాత్సల్యాని ఆమృత గుణాలకు భావకవిత్వంలో ప్రాధాన్యం లభించింది. కొందరు భావకవులు స్త్రీని దేవతగా కూడా ఆరాధించారు"**(రాయప్రోలు సుబ్బారావు, తృణకంకణం, 1981, పుట.16)**

అలాగే వీళ్ళు సంయోగ శృంగారం కంటె వియోగ శృంగారాన్ని అధికంగా ఆదరించారు. విషాదంలో మాధుర్యాన్ని దర్శించారు.

"సరస సాంగత్య సుఖ వికాసములకన్న

దుస్సహ వియె గభరమె మధురమ సఖియ

నాకు నిశ్వాస తాళవృంతాలు కలవు

నాకు కన్నీటి సరుల దొంతరలు కలవు

నా కమూల్య మపూర్వ మానంద మొసగు

నిరుపమ నితాంత దుఃఖపు నిధులు గలవు''.

(కృష్ణశాస్త్రి, దేవులపల్లి, కృష్ణపక్షం,2019,పుట.60)

పై కవితలో విషాదాన్ని సంపదగా కృష్ణశాస్త్రి ఊహించారు.

'కోకిలమ్మ కోయని యేడ్చె గొంతునెత్తి' అని తీయని కోయిల పాటలో కూడా విషాదం గోచరించింది. కృష్ణశాస్త్రికి ఇటువంటి రచనలు భావకవులు విషాదాన్ని ఎంతగా ప్రేమించారో చూపుతాయి.

ఈ విధంగా స్త్రీ అంతరంగ సౌందర్య వర్ణన, వియోగ శృంగారాన్ని విషాదాన్ని ప్రేమించడం వంటి లక్షణాలవల్ల భావకవిత్వంలో ప్రణయ కవిత్వ శాఖ ప్రత్యేకతను సంతరించుకుంది.

1.5.2. ప్రకృతి కవిత్వం:

సాహిత్యంలో ప్రకృతి వర్ణనలు ప్రాచీనకాలం నుంచి ఉన్నాయి.ప్రబంధాల్లోని ఆష్టాదశ వర్ణనల్లో ప్రకృతి వర్ణనలు కూడా ఉన్నాయి. కనుక ప్రకృతి కవిత్వం అన్నది, పూర్తిగా కొత్తదనం చెప్పడానికి వీలులేదు. కాని ప్రాచీన సాహిత్యంలోని పృకృతి వర్ణనల కంటె భావకవుల ప్రకృతి వర్ణలు కొంత ప్రత్యేకమైనవి. ప్రాచీన సాహిత్యంలో ప్రకృతి వర్ణన లున్నాయి. కాని వాటిలో ఆ కవుల దృక్పధము లేదు. ప్రబంధకవులు స్పష్టమైన భావంకంటే, క్లిష్టమైన కల్పనకు ప్రాధాన్యాన్నిచ్చారు ప్రకృతి యధారూపవర్ణన చేశారుగాని ప్రకృతితో సాంగత్యాన్ని అనుభవించి వర్ణించలేదు. ఏదయినా ప్రబంధాల్లోని ప్రకృతి వర్ణనల్లో కొంత కృత్రిమత్వం వచ్చింది.

ప్రకృతి దర్శనం వల్ల కవి పొందిన అనుభూతి, కవిలో చెలరేగిన భావ పరంపర భావకవిత్వంలోని ప్రకృతి వర్ణనల్లో ప్రాధాన్యం వహించింది. ఇది ప్రాచీనసాహిత్యంలోని ప్రకృతి వర్ణనలకు భావ కవిత్వంలోని ప్రకృతి వర్ణనలకు ప్రధానమైన భేదం.

"వెనుకటి గ్రంథాలన్నిటిలో ప్రకృతి వర్ణనలు ఉన్నది ఉన్నట్లు చెప్పడమే గాని వాటిలో ఉండే అంతరార్థమూ, వాటికీ కవికీ ఉండే పరస్పర సంబంధమూ, వాటివల్ల కవి నేర్చుకుని పాఠకులకు విప్పిచెప్పే ఉపదేశమూ వాటికి అంతర్భూత మైన తత్త్వము, ఆ తత్త్వాన్ని జీవితానికి సమన్వయించడమూ మొదలైన విష యాలు వెనుకటి కవులు పరామర్శించలేదు. అంతేగాకుండా ప్రకృతికి కథావస్తువును సంబంధింపజేయడమూ వెనుకటి కపులందరూ చేసిన పనికాదు"(**కురుగంటి సీతారామయ్య, పిల్లలమర్రి హనుమంతరావు, నవ్యాంధ్ర సాహిత్య విధులు, 1949, పుట. 210**)

ప్రకృతిలోని కొన్ని భాగాలను, సూర్యోదయం, చంద్రోదయం, మలయా నిలం వంటి వాటిని వర్ణించాలనే నియమం భావ కవులకు లేదు. దానివల్ల దారిన ఉన్న గడ్డి పువ్వుతో సహా తమ హృదయాన్ని ఆకర్షించి ఆకట్టుకున్న వాటినివేటినైనా స్వేచ్ఛగా భావ కవులు వర్ణించారు. అంతేకాక ప్రకృతిలో వీళ్ళు అంతర్లీనమై తన్మయమవడం కనబడుతుంది. ఇదే విషయాన్ని కృష్ణశాస్త్రి ఇలా అంటారు.

"ఆకులో ఆకునై పూవులో పూవునై

కొమ్మలో కొమ్మనై ఈ యడవి దాగిపోనా

పగడాల చిగురాకు తెర చాటు తేటినై

పరువంపు చిగురాకు విరిచేడి చిన్నారి సిగ్గునై

ఈ అడవి దాగిపోనా.. .. .(**కృష్ణశాస్త్రి , కృష్ణపక్షం,2019, పుట. 01**)

తాను ప్రకృతిలో భాగంగా మారిపోవాలని వాంచించాడు. అది ప్రకృతిలో లీనం కావాలని ఆశించిన భావ కవి కోరిక.

భావకవికి ప్రకృతి ప్రణయానికి ఉద్దీపనగానే కాక తాపానికి ఉపశాంతిని కలిగించేదిగా కూడ కనబడింది. ప్రాచీన కావ్యాలలో వియోగంలో విషాదంలో ప్రకృతిని దూషించడం కనబడుతుంది. ప్రబంధాలలో మలయానిల దూషణము, చంద్రోపాలంభము వంటివి ఉన్నాయి. కాని భావ కవులు వియోగంలో విషాదంలో ప్రకృతిని నిందించక స్నేహాన్ని చూపారు. చంద్రుడు, మేఘాలు, గాలులు తమకు ఆప్త మిత్రులని భావించి వాటితో తమ వ్యధను వెళ్ళబోసుకుని ఉపశాంతి పొందారు.

" ఓయి సంధ్యాసమీరణా, రేయితోడఁ

గారుచీకటితోడ దుఃఖమ్ముకూడ

పరువు పరువున నా కొఱకరుగు దెంచు

నీదు నునులేత రెక్కల మీద వడిగ

నెత్తుకొని పోవరాదే నన్నే చటి కేని"

(కృష్ణశాస్త్రి , కృష్ణపక్షం,2019, పుట.57)

అంటూ ప్రకృతితో సాన్నిహిత్యాన్ని అభిలషించి తమ కష్టసుఖాలను చెప్పుకొని ఉపశాంతి పొందారు.

"చిత్ర తాపంబు బాపుకోఁ జేలగట్ల

కరిగి కూర్చుండ మూక సహానుభూతి

పైరు తలవంచు భారంబు పంచికొన్న

ప్రాణసఖులట్లు కవులకు ప్రకృతి తోడు."

(దువ్వూరి రామిరెడ్డి , కవికోకిల గ్రంధావళి వ్యాసములు,1955, పుట.212)

అంటూ తనకు ప్రకృతిని తోడుగా భావించాడు *దువ్వూరి రామిరెడ్డి*.

ప్రకృతిని ఆరాధించి ఉపాసించడం కూడా భావకవులలో కొందరు చేశారు. పృధివిని దేవతగా భావించారు. రాయప్రోలు వారు. విశ్వనాథవారి 'కోకిలమ్మ పెండ్లి' 'కిన్నెరసాని పాటలు' వంటి కావ్యాలలో ప్రకృత్యుపాసన కనబడుతుంది. కావ్యాన్ని ప్రకృతికే అంకితం ఇవ్వడం భావకవుల ప్రకృతి ప్రీతికి నిదర్శనం.

ఈ విధంగా అనుభూతి ప్రధానంగా ప్రకృతిని వర్ణించడం ప్రకృతితో తాదాత్మ్యాన్ని ఊహించుకోవడం ప్రకృతిలో లీనమై ప్రకృతిని వర్ణించడం వంటి విశిష్ట లక్షణాలు ప్రకృతి కవిత్వంలో కనబడతాయి.

1.5.3. భక్తి కవిత్వం :

ఇతర విషయాల్లో లాగానే ఆత్మాశ్రయ కవితారీతిలో భగవంతుని గూర్చి రచన చేయడంవల్ల భక్తి కవిత్వంలో కవుల వ్యక్తిగత భావాభివ్యక్తి అధికంగా కనబడుతుంది. భగవత్తత్వాన్ని గూర్చిన కవి ఆత్మ థాము ప్రకటనకు దీనిలో ప్రాధాన్యం వచ్చింది. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో శతక సాహిత్యంలో కొంతవరకు ఆత్మాశ్రయ పద్ధతిలో భక్తి భావాలను వెల్లడించడం కనబడుతుంది. ఈ శతక సాహిత్యాన్ని మినహాయిస్తే ఇతర స్థలాలలో కవివ్యక్తి గతమైన భక్తి భావం స్పష్టంగా గోచరించే ఘట్టాలు ప్రాచీనాంధ్ర సాహిత్యంలో తక్కువ అని చెప్పవచ్చు. అందుచేత భక్తుల గాథలనో, భక్తుడి పాత్రనో ఆలంబనం చేసుకుని కవి, తన భక్తిభావాన్ని వెల్లడించవలసి వచ్చేది. ఈ విధంగా పాత్రల ఆవసరం లేకుండా తమ భక్తిని వ్యక్తం చేశారు భావకవులు.

వీరు తాము దర్శించిన సత్యాన్ని భక్తి పారవశ్యంతో ప్రత్యక్షం చేశారు. భగవంతుని అన్వేషిస్తూ తమ ఆర్తిని అల్పత్వాన్ని ప్రకటించారు. భగవంతుని గుణాలను, మహిమలను తమకున్న స్వేచ్ఛతో తాము ఊహించిన విధంగా వర్ణించారు. నిత్య పరిచయ వస్తువులో తాము దర్శించిన పారలౌకిక సత్యాన్ని ప్రదర్శించారు.

"గుసగుస చెప్పెదు గునిసి యాడెదవు

నీలోన వెలిగెడు నిర్మల జ్యోతి

వెలికొత్త బోరాటc బెట్టుచున్న దియె!"

(దువ్వూరి రామిరెడ్డి, గరిక, 1957, పుట.204)

అని 'గరిక' వంటి అల్పవస్తువులో మానవాతీత దివ్యశక్తిని దర్శించాడు భావకవి.

"ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన

భక్తి నమ్రుడనై నిలంబడిన యపుడు

తలపునకు వచ్చె నా పేదతనము నాకు.....

ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన

నాక కల్లోలినీ పదన్యాసమునకు

దర వినతమైన హరజటాధరముపోలె

నతుడనయ్యు మహా మహోన్నతి వహింతు."

(వేదుల సత్యనారాయణ శాస్త్రి, దీపావళి,1944, పుట.69)

ఈ విధంగా ఒకరు గరికలో దివ్య తేజస్సును దర్శిస్తే మరొకరు ప్రేయసి సాన్నిధ్యంలో దివ్యత్వాన్ని భావించి భక్తులై ఆరాధించారు. ప్రేయసి దివ్యపద సన్నిధానంలో నిలబడడమే మహోన్నతిగా భావించారు.

భగవంతుని పరిపూర్ణత్వాన్ని ఆధిక్యాన్ని స్తుతిస్తూ తమ అల్పత్వానికి వివరించారు. అల్పుడయిన భక్తుడు విశ్వవ్యాప్తుడయిన భగవంతుని దృష్టిలో తనకు గుర్తింపు రావాలనే ఆరాటాన్ని వ్యక్తం చేశారు.

ప్రకృతి రహస్యాలు సృష్టికర్త విలాసాలని భావించారు. అలాగే పూలలో రంగుకు, తేనెకు సహితం దివ్యశక్తి అదృశ్యహస్తం కారణమని ఊహించారు. భావ కవులు భగవంతున్ని తాము భావించిన విధముగా భగవంతుని చిద్విలాసాలను తమ అనుభూతికి అనుగుణంగా మలచారు.

వైష్ణవ భక్తి సంప్రదాయంలోని మధుర భక్తి మార్గంలో తమను రాధగా గాని, గోపికగా గాని తాము భావించుకుని భగవంతుని సాన్నిధ్యానికై పరితపించడం భావకవుల భక్తి కవిత్వంలో కనబడుతుంది.

ఈ మధురభక్తి సంప్రదాయం ప్రాచీనమే అయినా ఈ మార్గాన్ని ప్రధానం చేసుకున్న తెలుగుకవిత్వం భావ కవిత్వకాలంలో కొంత అధికంగా వెలువడిందనవచ్చు. భావకవులు భక్తిని మధుర భావాన్వితంగా ప్రదర్శించడంలో కొంత విశిష్టతను కనబరిచారు. ప్రేమకు భక్తికి ఒక అనుబంధాన్ని, ప్రేమ భక్తిగా పరిణమించడాన్ని మధురభక్తిపరమైన బందికలు ప్రదర్శిస్తాయి. జగదీశ్వరుని బాంధవ్యదృష్టితో, ప్రేమభావనలో ప్రేమించిన భక్తుని ఆర్తిని, అన్వేషణను పరమోన్నతంగా కొందరు భావకవులు చిత్రించారు.

భగవంతుడు ఆకలివేళ కూడా మరచినట్లు తలచి ఆరగింపుకు ఆప్యాయంగా ఆహ్వానించే వాత్సల్యాన్ని ప్రదర్శించాడు భక్తుడు. తలపులో పూజలో తడబాటును మనసులో, తెలివిలోమరపును, భక్తిలో పూజలో భ్రాంతిని కలిగించి మాయచేసే ప్రియునిగా జగదీశ్వరుని ఊహించాడు. తన ప్రేమ తన్మయత్వంలో స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని సరిగా చూడను గూడా చూడలేకపోయినందుకు చింతించాడు. తాను ప్రాణేశనిగా భావించిన భగవంతుని కనులనిండుగా చూసు కోవాలని, ప్రేమతీరగ పలుకరించాలని, చేతులారగ సేవ చేయాలని భక్తుడు పొందే తాపాన్ని మనోహరంగా ప్రదర్శించింది 'ఏకాంతసేవ'లో అన్నారు వెంకట పార్వతీశ కవులు.

అలాగే రాయప్రోలు వారి 'రాధపిలుపు', 'ప్రవాస రాధిక'; కృష్ణశాస్త్రి గారి 'అన్వేషణము' 'నటరాజ', 'మహతి': బసవరాజు 'గోపికాగీతములు', 'దొంగ' వేదుల గారి 'నిరీక్షణము'. 'ఉత్కంఠ', 'ఆశాగానము', రాధ' 'ప్రభూ' 'మురళి' వంటి రచనలు ప్రేమను ఆలంబనము చేసుకుని భగవంతునికై భక్తుని నిరీక్షణను వెల్లడిస్తాయి.

1.5.4. దేశభక్తి కవిత్వం :

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న సూక్తి అతి ప్రాచీనమైనదే. కాని అంతరాంతరాల్లో ఉండే దేశాభిమానం ప్రస్ఫుటంగా ప్రకటితం కావడానికి పరిస్థితులు కొంత కారణం అయ్యాయి. బ్రిటిష్ పాలనలోని భారతదేశం స్వాతంత్ర్యం పొందాలనే కోరిక భావకవిత్వం లోని దేశభక్తి కవిత్వానికి దోహదం చేసింది. తెలుగులోని దేశభక్తి కవిత్వంతో పాటు రాష్ట్రాభిమాన కవిత్వం కూడా కొంత ఎక్కువగా ఉంది.

స్వాతంత్ర్యోద్యమాన్ని ఆధారం చేసుకుని సాగిన దేశభక్తి కవిత్వం. అనేక విషయాలను వస్తువులుగా చేసుకుని వెలువడింది. ఆంగ్లేయ పరిపాలనా విధానాన్ని, దానిలోని లోటు పాట్లను చెప్పే రచనలు, భారతదేశ పురావైభవాన్ని చాటి చెప్పే రచనలు కొన్ని ఉన్నాయి. ఇవేకాక స్వాతంత్ర్యోద్యమం మీద, రాట్నం మీద, గాంధీ మీద, జండా మీద, జైలు కష్టాల మీద చాలా రచనలు వచ్చాయి. అంతేగాక దీని గురించి గురజాడ రాఘవశర్మ ఇలా అంటారు.

"మాతృపూజా ధ్యానతత్పర

మతి ఐవిత్ర స్నాతుడవునై

విశ్వమందిర పుణ్యభూమికి

వెడలి రావోయ్"!

(గురజాడ రాఘవశర్మ,జాతీయ గీతాలు,1979, పుట.08)

అదేవిధంగా దేశభక్తిని, జాతియాభిమానాన్ని ప్రభోధించడానికి కొందరు భావకవులు భారతదేశ పురాప్రశస్తిని భారత మాతృ ఔన్నత్యాన్ని కీర్తించారు.

భావ కవులు ఈ విధమైన రచనల వల్ల ప్రజల్లో నిద్రాణమై ఉన్న దేశ అభిమానాన్ని జాగృతం చేశారు. దేశంలోని అడవులు, నదులు, దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు మొదలైన వాటిని

తమ తమ దేశాభిమానాన్ని పెంపొందించడానికి ప్రయత్నం చేశారు. భారతదేశ గత వైభవాన్ని కీర్తించి ప్రజల్లో ఉత్సాహాన్ని కలిగించారు.ఇదే విషయాన్ని గురజాడ రాఘవశర్మ ఇలా అన్నారు.

"గోలకొండ నీ రత్నకోకమట

కోహినూరు నీ జడలో పూనట

తాజమహలు నీ దివ్యభవనమాట."

(గురజాడ రాఘవశర్మ, జాతీయ గీతాలు,1979,పుట.20)

ఇటువంటి రచనలు దేశ వైభవాన్ని కనుల ముందుంచుతాయి. భారత దేశ ఔన్నత్యాన్ని వైభవాన్ని చాటి చెప్పినవి కొన్ని రచనలయితే, భారత దేశపు ఆనాటి స్థితిని పరాయి పాలనలో కష్ట నష్టాలను తెలియచేసే రచనలు కొన్ని వచ్చాయి. అందులో భాగంగా చిలకమర్తి వారి రచన పరిశీలిస్తే మనకు అర్థం అవుతుంది.

"భరత ఖండంబు చక్కని పాడియావు

హిందువులు లేగ దూడలై యేడ్చుచుండ

తెల్లవారను గడుసు గొల్లవారు

పితుకుచున్నారు మూతులు విగియగట్టి."–(చిలకమర్తి)

అలాగే దొరతనం పరిపాలనా విధానాన్ని గూర్చిన ఇటువంటి ప్రచార గీతాలు కొందరు భావకవులు రాశారు. అందులో ప్రధానంగా బసవరాజు అప్పారావు, కొండా వెంకటప్పయ్య వంటి రచయితలు గాంధీజీని గూర్చి చేసిన రచనలు అధికప్రచారం పొందాయి. ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేస్తూ కర్తవ్యాన్ని ఉపదేశించాయి. ఈ విధంగా భావకవులలో దాదాపుగా అందరూ స్వాతంత్రోద్యమ కాలంలో దేశభక్తి కవిత్వం వ్రాశారు.

ఈ విధంగా భావకవులు తమ దేశభక్తిని, ఆంధ్రదేశ, భాషలపై అభిమానాన్ని ప్రకటించి అనేక ఖండికలను రచించారు. భావకవిత్వంలో ప్రణయ కవిత్వం తరువాత దేశభక్తి కవిత్వశాఖలో ఎక్కువ రచనలు వెలువడ్డాయి.

1.5.5. సంఘసంస్కరణ కవిత్వం :

కందుకూరి వీరేశలింగం పంతులుగారు. తలపెట్టిన సంఘసంస్కరణోద్యమం అనాటి విద్యావంతులలో ఒక విధమైన సంచలనం కలిగించింది. ఈ ప్రభావముతో ప్రేరితులై సంఘంలోని దురాచారాలను మూఢ నమ్మకాలను నిరసిస్తూ ఆధునికులు కొన్ని రచనలు చేయసాగారు. వితంతు వివాహాలు, బాల్య వివాహాలు, శ్రీవిద్యా స్వాతంత్రాలు వీరికి కవితావస్తువు లయ్యాయి. కన్యాశుల్కం, వరకట్నంవంటి ఆచారాలపట్ల నిరసనను తమ కవితల్లో వ్యక్తం చేయసాగారు. వర్ణవ్యవస్థలోని లోపాలు, కులమత వైషమ్యాల పట్ల తీవ్ర మైన అసంతృప్తిని కనబరచసాగారు. వీటికితోడుగా గాంధీజీ సిద్ధాంతాల వల్ల హరిజనోద్ధరణ, మద్యపాన నిరసన వంటి విషయాలుకూడా భావకవిత్వంలో చోటు చేసుకున్నాయి.

"పొత్తిళ్ళలో నున్న నెత్తురు కందుల

పెండ్లిండ్లు సేయ భావించు నొకడు....

అమ్మ తాత యత్తయను తొక్కు పల్కులే

పలుకలేని చిన్న పాపలకును

రామ రామ మున్ను రానున్న దెంచక

చెనటి యగుచు బెండ్లి సేయు నొకండు"

(మంగిపూడి వెంకటశర్మ, బాలవితంతు విలాపము,1979,పుట.89)

అంటూ బాల్యవివాహాల వికృత స్వరూపాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించారు. చిన్నవయసులో వివాహం చేయడానికి తోడుగా వితంతువులకు వివాహ యోగ్యత లేకపోవడం బాధాకరమైన విషయమని కొందరు భావించారు.

కొన్ని రచనల్లో కన్యాశుల్కాలు, వరకట్నాలవంటి ఆచారాలు వ్యక్తులను అనేక విధంగా బాధిస్తున్న సంఘటనలను నిరూపించే ప్రయత్నం జరిగింది. ధనానికి ఆశపడి బాలికలను వృద్ధులకిచ్చి వివాహం చేయడాన్ని నిరసిస్తూ గురజాడ వారు రాసిన కావ్యం 'పూర్ణమ్మ' వెలసింది. ఈ విధమైన రచనల్లో ఇది చెప్పుకోదగిన రచన. భోగరాజు నారాయణమూర్తి 'పండుగ కట్నము' వరకట్న సమస్య ఇతివృత్తంగా గల రచన. రాయప్రోలువారి 'స్నేహలత' కూడా వరకట్నాచారంలోని దుష్ఫలితాలను చక్కగా చూపింది. ఇది యదార్థగాథే అయినా రసవత్తరమైన రచనా విధానం ఆ ఆచారం వల్ల దారుణ పరిణామాన్ని సమర్థవంతంగా ఎదుట నిలిపింది.

స్త్రీవిద్యకు, స్త్రీ స్వాతంత్ర్యానికి సంబంధించిన రచనలు కూడా కొన్ని ఆ కాలంలో వచ్చాయి. బాలురకు ఉన్నట్లే బాలికలకు ఉన్నతవిద్య కావాలని, యువకులకులాగానే యువతులకు స్వేచ్ఛ ఉండాలని వాంఛించారు మంగిపూడి వేంకటశర్మ వంటి కవులు. వీరి 'నీతికథామంజరి'. 'స్త్రీ ధర్మబోధిని', 'ఆబలా విలాపము' వంటివి స్త్రీ విద్యను, స్త్రీ స్వాతంత్ర్యాన్ని ఉద్దేశించిన రచనలు.

అదే విధంగా వర్ణవ్యత్యాసాలు పోవాలని, కులమత భేదాలు తొలగాలని కొందరు భావించారు. అందులో జాషువా రచన 'గబ్బిలము', త్రిపురనేని రామస్వామి చౌదరి 'సూత పురాణము' వర్ణవ్యవస్థలోని అసమానతలను స్పష్టం చేయడానికి ఉద్దేశించిన రచనలు. నిమ్నజాతుల ఉద్ధరణను సూచించే గేయాలు చాలా వెలువడ్డాయి. కొన్ని ఖండికలలో అస్పృశ్యతా నివారణ, హరిజనుల సమస్యలు కవితాంశాలయ్యాయి. కాటూరి వేంకటేశ్వరరావు 'గుడిగంటలు', జాషువా గారి కొన్ని ఖండకావ్యాలు హరిజనుల సమస్యలను ప్రదర్శించాయి.

1.5.6. స్మృతి కవిత్వం :

స్మృతికావ్యాలు కొంత పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక కవిత్వంలో ప్రవేశించాయనవచ్చు. పాశ్చాత్య సాహిత్యంలో ఎలిజీ (Elegy) స్మృతి కావ్యం ఎక్కువగా దేశ నాయకులను,మిత్రులను ఉద్దేశించి వెలువడ్డది.

అందులో ప్రధానంగా రాయప్రోలు 'రవీంద్రుని అస్తమయము', 'స్మృతి' (గిడుగు రామమూర్తి పంతులుగారిని గూర్చి), గోపాలకృష్ణ గోఖలే గూర్చి చేసిన రచనలు దేశ ప్రముఖుల స్మృతికి సంబంధించినవి. దేవులపల్లి (గురజాడ గూర్చి), బసవరాజు అప్పారావు (దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గూర్చి), తుమ్మల (కాశీనాథుని నాగేశ్వర రావును గూర్చి), జాషువా (గాంధీ) గూర్చిన రచనలు కూడా ఇటువంటివే. వీటిలో వాళ్ళ మరణానికి విచారించడం, వాళ్ళ సద్గుణాలను కీర్తించడమే కాక ఆ గుణాల నాదర్శంగా పెట్టుకొని తరువాతి తరంవారు ముందుకు సాగడానికి ప్రబోధం కూడా ఉండవచ్చు.

వావిలాల వాసుదేవశాస్త్రి 'రుక్మిణీ స్మరణము' వడ్డాదివారి, 'సతీస్మృతి' భార్యావియోగ దుఃఖాన్ని గూర్చి రచించిన స్మృతి కావ్యాలు. విశ్వనాథవారి 'వరలక్ష్మీ త్రిశతి' సతిస్మృతి కావ్యాలలో ప్రధానంగా చెప్పదగ్గది. దువ్వూరివారి 'భగ్నహృదయము', కూడా ఈ కోవలోవే.

వడ్డాదివారి 'సుతస్మృతి', దువ్వూరివారి శివవియోగము', బసవరాజు అప్పారావుగారి 'నిర్యాణ సుఖము', నాయని వారి 'విషాద మోహనము', రాయ ప్రోలు వారి 'నందా' వంటివి సుతాదిక స్మృతి ప్రధాన రచనలు.

ఇక తల్లి తండ్రులను గూర్చి, సోదరీ సోదరులను గూర్చి, మిత్రులను గూర్చి వచ్చిన స్మృతి కావ్యాలలో వావిలాల వాసుదేవశాస్త్రి గారి 'పిత్రారాధనము', నాయని సుబ్బారావు గారి 'మాతృ గీతాలు', పెనుమర్తి వెంకటరత్నం గారి 'రత్నాపణము', మోటూరి వెంకటరావు గారి 'ఆహుతి', ఓ చెల్లీ (తండ్రిని, సోద రిని గూర్చి), దువ్వూరి వారి 'సోదరీ స్మృతి' వంటి రచనలు ప్రముఖమైనవి. ఈ విధంగా ప్రకృతి, ప్రణయం, దేశభక్తి, భక్తి, సంఘ సంస్కరణ, స్మృతి వంటి జీవనతత్త్వ వివేచనా

శీలమయిన విషయాలను ఆధారం చేసుకుని అతి విస్తృతమైన వస్తు వైవిధ్యంతో భావకవిత్వం వెలువడింది.

1.6. భావకవులు –ఊహ ప్రేయసీలు

భావకవులు ఊహా ప్రేయసులపై కవిత్వం రాశారు. సహధర్మచారిణులపై కవిత్వం అల్లారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఊర్వశి', అడవి బాపిరాజు 'శశికళ', తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి 'హృదయేశ్వరి', నాయని సుబ్బారావు 'సౌభద్రుని ప్రణయ యాత్ర', విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని పాటలు', నండూరి సుబ్బారావు 'యెంకి పాటలు' ఇందుకు నిదర్శనాలు.

ఆధునిక సాహిత్యంలో స్త్రీని ప్రేయసిగా, సహధర్మచారిణిగా, ప్రత్యేక వ్యక్తిత్వం కలదానిగా కవులు చిత్రించారు. చాలామంది కవులు ఊహా ప్రేయసులకు తమ కవిత్వంలో స్థానం కల్పించారు.

1.6.1. ప్రాచీన సాహిత్యంలో స్త్రీ పట్ల దృక్పథం:

సంస్కృత పురాణాలలో స్త్రీ స్వయంవరంతో భర్తను నిర్ణయించుకునే స్వతంత్ర కలదిగా, పతివ్రతా ధర్మంతో పతిని రక్షించుకునే పతిభక్తి కలదిగా కనబడుతుంది. తెలుగు కావ్య ప్రబంధాలలో స్త్రీ అంగాంగ వర్ణనతో భోగ వస్తువుగా చిత్రింపబడింది.

1.6.2. స్వయంవరం:

పురాణాలలో స్వయంవర పద్ధతి ఎక్కువగా ఉంది.ఇది రాజకుమారికి భర్తను ఎన్నుకోవడంలో గల స్వేచ్ఛకు సూచకం. సీతాస్వయంవరంలో శివధనుస్సును విరిచినవాడే వరుడు అవుతాడు. ఆ స్థానం రాముడికే దక్కింది. ద్రుపదుడు అర్జునుడే అల్లుడు కావాలని మత్స్యయంత్రాన్ని చేధించాలని ద్రౌపదీ స్వయంవరంలో పరీక్ష పెట్టాడు. యంత్ర చ్ఛేదన చేసి అర్జునుడు ద్రౌపదిని చేపట్టాడు. ఈ విధంగా స్వయంవరంలో అందానికే కాక, బలానికి కూడా పరీక్ష ఉంది.

1.6.3. పాతివ్రత్యం:

సీత, గాంధారి, ద్రౌపది, సావిత్రి వంటివారు మహా సాధ్వీమణులుగా చెలామణి అయ్యారు. సీత ఆదర్శ మహిళ, పరపురుషుని కన్నెత్తి చూడని, పతి మాటని జవదాటని ఇల్లాలు. గాంధారి పుట్టుకతో గుడ్డిది కాకపోయినా, వివాహం తరువాత భర్తను నొప్పించక ఆయనను అనుసరించింది.

ద్రౌపది అయిదుగురు భర్తలతో అడుగడుగున కష్టాలను ఎదుర్కొంటూ కీర్తి పొందింది. సావిత్ర పెళ్లికి ముందే సత్యవంతుని గుణశీలాదులు తెలుసుకుని, అల్పాయుష్కుడైనా అతన్ని తప్ప వేరెవ్వరినైనా వివాహమాడనని నిశ్చయించుకుంది. తన పాతివ్రత్యంతో యముణ్ణి కూడా మెప్పించి, తన భర్తను జీవింప చేసుకుంది. తెలుగు ప్రబంధంలో నిగమశర్మ అక్క కులాభిమానం, ధర్మార్థాలలో జాగ్రత్త, శీలధైర్యాలతో చిత్రింపబడింది.

1.6.4. అంగాంగ వర్ణన:

ప్రాచీన తెలుగు స్త్రీ దేవత అయినా, రాజకాంత అయినా, వేశ్య అయినా వర్ణనలో మార్పు లేదు ఇక్కడ సందర్భం లేకపోయినా, వర్ణనాత్మక సంబోధనలు తరచూ కనిపిస్తాయి. ప్రవరుడు వరూధినితో 'భీతా హరిణేక్షణా!' అని సంభాషణ మొదలెడతాడు. భాగవతంలో భారతి 'కాటుక కంటి నీరు చనుకట్టుపై' పడడం, బలి 'శ్రీసతి కొప్పు'తో మొదలుపెట్టి 'పాలిండ్ల పై' పడే విష్ణుమూర్తి చెయ్యికి పైచేయి అవుతున్నందుకు మురిసిపోయాడు. రుక్మిణీ యౌవనంలో 'పురుష రత్నం భోగింప లేని ఈతనులత సౌందర్యం ఎందుకు?' అని విరహతాపం పొందింది. ఇష్ట దేవతా స్తుతితో మొదలుపెట్టిన మనుచరిత్ర 'శ్రీవక్షోజ' అంటూ మొదలయ్యింది. ఈ విధంగా చివరి దాకా స్త్రీ లోకాన్ని సౌందర్య దృష్టితోనే చూడడం పూర్వ సాహిత్యంలో పరిపాటి అయిపోయింది.

1.6.5. భోగవస్తువుగా స్త్రీ:

ఆనాడు స్త్రీలను భోగ వస్తువుగా చూశారు. మనుచరిత్రలో స్వరోచి మనోరమను వివాహమాడాడు. ఆమెకున్న ఇద్దరు చెలికత్తెలు రోగంతో బాధ పడ్డారు. ఆ విషయం తెలిసిన స్వరోచి వారి రోగం కుదిర్చి, మనోరమతో చెప్పకనే వివాహమాడాడు. అది తెలిసి కూడా ఆమె మాట్లాడలేదు. ఆనాడు సమాజంలో బహుభార్యత్వం దోషం కాదు.

ఆనాడ సమాజంలో వేశ్యలకు గౌరవం ఉండేది. వారు సంగీత నాట్యాలలో ప్రవీణులు. 'వారు జలకాలాడి, సయ్యెదతోనే జత కలుపుతారు'. అంతటి నెఱజాణలు వారు. రాజులు సామాన్య సమయంలోనే కాక యుద్ధవేళలలో కూడా నాట్యకత్తెలను వదిలిపెట్టరు. దేవుళ్లకు మాణిక్యాలతోపాటు దేవదాసీలను సమర్పించేవారు. అది పుణ్యం అని నమ్మేవారు. అన్నసత్రాలతోపాటు 'అతివల సత్రాలు' కూడా ఏర్పాటు చేశారు. వేశ్యలు లేకుండా ఏ ఉత్సవం రంజింపదు. విష్ణుచిత్తుని వంటి పరమ

ఛాందసుని మధుర నుండి సాగనంపడానికి కూడా వేశ్యలు కావలసి వచ్చారు. ఊరి వారిని తోడ్కొని రావడానికి వేశ్యలు కావాలి. ఆ మెరవణిలో పొరుగూళ్ల నుండి వచ్చిన సామంతరాజులు అందరి ఎదుటివారితో సరసలాడుతారు.

ఆనాడు ధర్మార్థ మోక్షాలను సాధించడంలో ఎంత పట్టుదలతో ఉన్నారో జీవితావసరమైన తృతీయ పురుషార్థాన్ని సాధించడంలోఅంతే అభినివేశం చూపించారు. వారు ప్రతి వస్తువులోనూ సౌందర్యాన్ని చూపారు. 'మట్టెలు మ్రోగగా, చనుగవ కంపించగా, కురులు అస్తవ్యస్తంకాగా, ఆశ్రువులతో కూడిన కనులతో జన సంచారం లేని అడవిలో స్త్రీ దీనంతో కనిపించిందని' ప్రాణ భయంతో పరుగెత్తుతున్న మనోరమను వర్ణించాడు పెద్దన.

ప్రబంధ యుగం తరువాతి కాలంలో స్త్రీల స్థానం మరీ అట్టడుగు పోయింది. ఈ కాలంలో రచనలు చేసిన కొందరు కవయిత్రుల కావ్యాలలో కూడా శృంగారం పచ్చిగా ఉంది. దానికి ముద్దు పళని 'రాధికా సాంత్వనం' నిదర్శనం. నాయిక రాజుల కాలంలో యుద్ధాలు, కరువు కాటకాలు, అసమర్థులైన రాజుల పాలన మూలంగా సమాజంలో అస్తవ్యస్థ పరిస్థితి ఏర్పడింది. స్త్రీలకు సాంఘిక భద్రత కరువైంది. ఆ కాలంలో చిన్న వయస్సులోనే వివాహాలు జరిపించేవారు. యుక్త వయస్సు వచ్చేసరికి భర్త దాంపత్య సంబంధాలకు విముఖంగా ఉండేవాడు. దాంతో స్త్రీ మరొక యువకునిపై వ్యామోహం పెంచుకునే అవకాశం ఉంది. కాని ఈ పరిస్థితి సమాజానికి ఆమోదం కాదు. ఈ పరిస్థితులలో అవతరించిందే సముఖం వేంకట కృష్ణప్పనాయకుని 'ఆహల్యా సంక్రందనం' ప్రబంధం.

1.7. ఆంగ్ల రొమాంటిక్ కవిత్వంలో స్త్రీ దృక్పథం:

"భౌతికం, నశ్వరం కాని ఆత్మ సంబంధమైన అలౌకిక పరిశుద్ధ ప్రేమ భావాన్ని ఆంగ్ల రొమాంటిక్ కవులు స్వీకరించారు. స్త్రీని కోరికలు తీర్చే అందాల బొమ్మగా కాక, ఆరాధ్య దేవతగా ఆరాధించారు. స్త్రీ తమకు ప్రేరణగా ఉత్తేజాన్నిచ్చే శక్తిగా, తమ బ్రతుకులకు వెలుగును ప్రసాదించే జ్యో స్వరూపిణిగా భావించారు" (**జయప్రభ, భావకవిత్వంలో స్త్రీ,1988, పుట.72–92**).

వర్డ్స్‌వర్త్ 'Lyrical Ballads'లో ద్రిమ్మరియైన స్త్రీ కథను వర్ణించాడు. 'Female Vegrant' అనే గీతంలో నాయిక ఒక జాలరి బిడ్డ. ఆమె ఆత్మకథే ఇది. ప్రేమతో విఫలమై తండ్రిని,

భర్తను, పిల్లలను పోగొట్టుకొని ఆకలితో అలమటిస్తూ ఒంటరిగా మిగిలిపోయిన యువతి మానసిక స్థితి. దుఃఖం వివరంగా ఇందులో వివరించాడు. 'గుడీ బ్లేక్ అండ్ హేరీ బిల్' అనే వాస్తవిక కథలో పేదరాలైన వృద్ధ స్త్రీ కథ చెప్పాడు.

'ముళ్ల పొద' (The Thorn) అనే గేయంలో ప్రేమించి వంచించబడిన స్త్రీ గాథను చిత్రించాడు. 'Mad Mother'లో కొడుకును చూసుకుని మురిసిపోతూ, ఆ పసిబిడ్డతో తమ అనుభూతిని, అనుభవాలను చెప్పుకుంటున్న తల్లిని వర్ణించాడు. 'Young Lady'లో స్త్రీ స్వేచ్ఛను సమర్థించేవాడు. ఎవరి నిందలను లక్ష్య పెట్టక స్వేచ్ఛగా ప్రేమను, దైవత్వాన్ని పంచమని ప్రబోధించాడు.

కీట్స్ 'ఎండిమియాన్' కావ్యంలో ప్లేటోనిక్ లవ్ ప్రతిపాదించబడింది. నిజ జీవితంలో ప్రేమకన్నా కళలో నిక్షిప్తమైన ప్రేమ శాశ్వతమైందనే భావాన్ని 'Ode to the Grecian Urn'లో కీట్స్ వ్యక్తం చేశాడు. షెల్లీకి 'ఎ–లాస్టర్' కావ్యంలో కలలు కంటున్న స్త్రీ వెదకగా సాక్షాత్కరించింది. ఈయన ప్రేయసిలో లీనం కావాలని ప్రేమికులిద్దరి కలయికకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చాడు.

బైరన్ ప్రేయసి నడకను విడో అయినప్పటికీ ఆమె ఆరాధనను, ఆ అనుభూతిని, ప్రేమను వర్ణిస్తాడు. ఆంగ్ల రొమాంటిక్ కవిత్వంలో స్త్రీ సమాజంలోని పలు వర్గాలకు చెందింది. ఈ కవులలో స్త్రీని చిత్రించేటప్పుడు కేవలం ప్రణయ భావన మాత్రం లేదు.

1.8. గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు కవిత్వంలో స్త్రీ–పురుష సంబంధాలు:

నవ్య సాహిత్యంలో స్త్రీ శృంగార వస్తువుగా కాకుండా స్నేహమయిగా కనిపిస్తుంది. ఈ పద్ధతని ముందుగా కవిత్వంలో ప్రవేశ పెట్టినవారు గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు.

1.8.1.గురజాడ అప్పారావు– స్త్రీ దృక్పథం:

దేశంలో స్త్రీలు అనేక శతాబ్దాలుగా సాంఘిక దాస్యంలో జీవించారు. అప్పటి సాంఘిక సమస్యలలో స్త్రీ సమస్యలు కూడా ముడివడి ఉన్నాయి. అందువల్ల భారత దేశంలో సంఘ సంస్కరణ కార్యకలాపాలలో స్త్రీ ఉద్ధరణ ప్రధాన స్థానం ఆక్రమించింది. ఆనాడు స్త్రీ సమస్యలు ప్రధానంగా బాల్య

వివాహాలు, కన్యాశుల్కం, వితంతు వివాహం మొదలైనవి. ఈ సమస్యలన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.

డబ్బుకు ఆశపడి ఆడపిల్లల తండ్రులు చిన్న పిల్లలను చావడానికి సిద్ధంగా ఉన్న ముసలివారికిచ్చి పెళ్లి చేయడం వల్ల బాల వితంతువుల సంఖ్య ఎక్కువయింది. వీళ్లు మళ్లీ పెళ్లి చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల ఆడపిల్లల సంఖ్య తక్కువయింది. చిన్న పిల్లలను ముసలివారు తమ ఆస్తులు పరాయి వారికి దక్కకుండా ఉండడానికి, అగ్నిహోత్రాది పూజా కార్యక్రమాలకు భంగం కలగకుండా ఉండడానికి, సంతానం కోసం పెళ్లి చేసుకునేవారు. అది క్రమంగా ఆచారంగా, దురాచారంగా మారింది.

బాల్య వివాహాలు రెండు రకాలు. చిన్న పిల్లలను వృద్ధులకిచ్చి వివాహం చేయడం ఒకటి, చిన్న పిల్లలను చిన్న పిల్లలకే ఇచ్చి వివాహం చేయడం రెండవది. గురజాడ అప్పారావు మొదటి రకం వివాహాలను రచనలలో చూపాడు. రెండవరకం వివాహాలు తానే జరిపించాడు.'కన్యాశుల్క' నాటకంలో డబ్బు కోసం ముసలి వారికిచ్చే వివాహాల విషయం ఎక్కువగా చర్చించాడు. 'పూర్ణమ్మ'లో కథ కూడా ఇదే. ముసలివాడు చనిపోతే వితంతువైన ఆ పిల్లకే ఆస్తి దక్కుతుంది. దానిని ఆమె తల్లిదండ్రులు అనుభవించాలని వివాహం చేశారు. ముసలి మొగనితో కాపురం చేయడం యిష్టం లేక చివరకు పూర్ణమ్మ మరణిస్తుంది.

ఆనాటి స్త్రీలు ముఖ్యంగా వివాహం మీద అభిప్రాయాన్ని చెప్పలేని స్థితిలో ఉండేవారు. దాంతో తండ్రి తలపెట్టిన ముసలివారితో వివాహానికి ఎదురుచెప్పలేక ఆత్మహత్యలు చేసుకునేవారు. అటువంటి పాత్రే గురజాడ అప్పారావు 'పూర్ణమ్మ'. ఆయన స్త్రీ స్వేచ్ఛను వాంఛించాడు. అయితే దానికి స్త్రీ చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని చెప్పలేదు. స్త్రీలు వంట, చాకిరీ నుండి విముక్తి పొందాలి. రక్షణ కోసం ఖడ్గ విద్యను నేర్చుకోవాలి అని మాత్రం అన్నాడు.

గురజాడ అప్పారావు కాలం నాటి సామాజిక సమస్యలలో వేశ్యా సమస్య ఒకటి. ఆయన తన రచనల్లో దీనిని ఒక సామాజిక సమస్యగా తీసుకుని పరిష్కరించలేదు. కాని ఆయనకు వేశ్యల జీవితాల మీద సానుభూతితో కూడిన అవగాహన ఉంది. 'కన్యాశుల్కం'లో వేశ్య ప్రధాన పాత్ర. పెళ్లిళ్లలో, శుభ కార్యాల్లో నృత్య ప్రదర్శనలకు వేశ్యలను పిలవడం వల్ల, చిన్న పిల్లలకు వివాహం

చేయడం వల్ల ఈ నృత్య ప్రదర్శనలు చూసి మగవాళ్లు వేశ్య వ్యామోహంలో పడే అవకాశం ఉండడంవల్ల సానిమేళాలు తీసెయ్యాలంటాడు గిరీశం. ఇక్కడ వేశ్యలను వారి వృత్తుల నుండి మాన్పించాలనే అభిప్రాయం ఉన్నా, వారి జీవన భృతి గురించి, వారికి స్త్రీ సహజమైన కోర్కెల గురించి చర్చ జరగలేదు. ఈ విధంగా తన రచనలలో స్త్రీకి అస్తిత్వం ప్రసాదించేదే నిజమైన జీవితం అని ఆధునిక కాలంలో మొట్టమొదటగా చెప్పినవాడు గురజాడ అప్పారావు.

1.8.2. రాయప్రోలు సుబ్బారావు– స్త్రీ దృక్పథం:

భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. ఆయన గురజాడ అప్పారావు తరువాత స్త్రీ దృక్పథంలో నవ్యతను సాధించాడు. లౌకిక శృంగారాన్ని నిరసించి అలౌకిక ప్రణయ భావనకు ప్రాధాన్యత కల్పించాడు. స్త్రీ సౌందర్య వర్ణన కన్నా స్త్రీ సమస్యలే ఆయన కథకు వస్తువులైనాయి. అంగాంగ వర్ణన చేయక అంతరగం వర్ణనకు అధిక ప్రాముఖ్యాన్నిచ్చాడు. ఆయన మార్గాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణ శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, నాయని సుబ్బారావు, అడవి బాపిరాజు, బసవరాజు అప్పారావు, తల్లావర్జుల శివశంకర శాస్త్రి వంటివారు అనుసరించారు.

"రాయప్రోలు సుబ్బారావు కవిత్వంలో స్త్రీ దృక్పథంలో మార్పు రావడానికి మొట్టమొదటగా కారణం ఆయన పినతల్లి. ఆమె ప్రాచీన సాహిత్యంలోని స్త్రీ దుస్థితిని వివరించి, ఈ ఆలోచనలో మార్పు రావాలని భావించింది. వీటివల్లే రాయప్రోలు సుబ్బారావు రచనలలో స్త్రీ సమస్యలను తీసుకొని, స్త్రీకి దివ్యత్వాన్ని అంటగట్టాడు. మొదట్టమొదటగా ఆయన 'అమలిన శృంగార'తత్వాన్ని 'తృణకంకణం' కావ్యంలో చూసాడు. సంభోగ శృంగారాని కన్నా వియోగ శృంగారానికి ప్రాధాన్యత కల్పించాడు. వియోగంలోనే మాధుర్యం ఉందని భావించాడు" (**సత్యనారాయణ, పి.'రాయప్రోలు వారి సాహిత్యంలో నవ్యత'.సమాలోచన, 1981, పుట.1–3**).

ఈ అమలిన శృంగారంలో స్త్రీ పురుషుల మధ్య శృంగారమే కాక స్నేహం కూడా ఉంటుందని భావించాడు. లౌకిక వాసనలకు అతీతమైన ఆనందమే రాయప్రోలు సుబ్బారావు ధ్యేయం. దానినే 'అమలిన శృంగార' తత్వంలో చూపాడు. 'తృణకంకణం'లో నాయిక చేత వియోగ ప్రాధాన్యాన్ని చెప్పించాడు. నాయని సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి కవుల విరహ గీతాలపైన కొంత దీని ప్రభావం ఉందని చెప్పవచ్చు.

పితృ గృహ పరిరక్షణకు ఆత్మాహుతి చేసుకున్న నిజమైన సంఘటనను రాయప్రోలు సుబ్బారావు 'స్నేహలత' అనే కావ్యంలో చిత్రించాడు. ఇది వరకట్న దురాచార సమస్య. స్నేహలత తండ్రి కూతురి వివాహానికి ఇల్లు అమ్మి డబ్బు తేవాలనుకుంటాడు. ఇంకా తన కోసం ఆ కుటుంబం వీధిని పడడానికి ఇష్టపడక లేఖ రాసి, అగ్నికి ఆహుతి అవుతుంది స్నేహలత. ఇది సంఘంలో ప్రబలిన వరకట్న దురాచారానికి బలి అవుతున్న స్త్రీ దుస్థితికి నిదర్శనం. ఇలా ఆధునిక కవులు స్త్రీ సమస్యలకు తమ కావ్యాలలో ప్రచారం కల్పించారు.

'స్వప్నకుమారం'లో ఒక యువకుడు ఒక స్త్రీని చూచి మోహిస్తాడు. ఆమె మనసీయక మధు పాత్రను అందిస్తుంది. అంతటితో తృప్తిపడక ఆమెపై మరులు కొంటాడు. అప్పుడామె పరిశుద్ధమైన ప్రేమతత్వాన్ని, బాధలోని మాధుర్యాన్ని వివరించి అతనిని ప్రసన్నుణ్ణి చేస్తుంది. స్వప్నం విడిపోతుంది. యువకునిలో జ్ఞానోదయం కలుగుతుంది. దీనిలో వియోగంలో లభించే ఆనందాన్ని వివరించాడు రాయప్రోలు సుబ్బారావు. 'కష్ట కమల'లో కూడా స్త్రీ పురుషుల మధ్య స్నేహ బంధాన్ని, సోదర సోదరీ భావాన్ని సూచించాడు.

ఈ విధంగా రాయప్రోలు సుబ్బారావు తన కావ్యాలలో స్త్రీ పురుషుల మధ్య శృంగారమే కాక సోదర సోదరీ భావం, స్నేహం కూడా ఉంటుందన్ని విషయాన్ని చూపాడు. ఆనాటి వరకట్న దురాచారం లాంటి స్త్రీ సమస్యలను కూడా వివరించాడు. ప్రాచీన కవుల కంటె ప్రత్యేకతను చూపి తరువాతి కవులకు ఆదర్శంగా నిలిచాడు.

1.9. భావ కవిత్వంలో ప్రణయం:

భావ కవిత్వంలో ప్రణయ భావన ఎక్కువగా ఉందని పూర్వం ఈ కవిత్వాన్ని 'ప్రణయ కవిత్వం' అని పిలిచేవారు. ప్రణయం, శృంగారం వంటి విషయాలలో పూర్వం ఉన్న దృక్పథంలో మార్పు వచ్చింది. దీనికి కారణం ఆంగ్ల సాహిత్య ప్రభావం. ఆనాడు ఆంధ్ర దేశంలో వెలసిన బ్రహ్మ సమాజోద్యమాలు మొదలైనవి. దేశంలో స్త్రీ విద్య రావడంతో యువతీ యువకులు కలిసి చదువుకునే అవకాశం కలిగింది. రాను రాను యువకుల మనస్సులలో పూర్వం స్త్రీ పట్ల ఉన్న దృక్పథం మారింది. ఆధునిక కవుల దృష్టిలో ప్రేమకు 'స్నేహం' అని అర్థం. 'ధన మన నొండు గలదె పసిడిగాక' అని అజ్ఞానంలో ఉన్న సమాజానికి ప్రేమ పెన్నిధి, 'ప్రేమ కలుగక బ్రతుకు చీకటి' అని ప్రేమ విలువను

వివరించారు. ఆధునిక కవులు. జీవితంలో ప్రేమింపబడటం కంటే అధికమైన సుఖం ఉండదు. సుఖం కోసం, ముక్తి కోసం, ప్రేమించబడడం కోసం ప్రేమించడం నేర్చుకోవాలని ప్రేమ నెరుగని, ప్రేమను పొందని వ్యక్తులు జీవన్మృతులు అని వీరు చెప్పారు.

1.10. ఊహా సుందరులు:

భావ కవులలో దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఊర్వశి'లోను, అడవి బాపిరాజు 'శశికళ'లోను తమ ఊహా సుందరులను దర్శించారు.

1.10.1. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఊర్వశి':

ఊర్వశి అనగానే దేవేంద్రుని సభలోని ఊర్వశి వెంటనే గుర్తుకు వస్తుంది. ఊర్వశి పుట్టుక గురించి రెండు గాథలున్నాయి. ఒకటి క్షీర సాగర మథనంలో పుట్టింది. రెండవది నారాయణుని ఊరువుల నుండి పుట్టింది. బదరికాశ్రమంలో నారాయణ దేవుడు తపస్సు చేస్తున్నాడు. ఇంద్రుడు ఆయన మనస్సు కలత పెట్టడానికి వసంత మన్మథాదుల ఆసరాతో రంభాద్యప్సరసలను పంపుతాడు.

" నాచన సోమనాథుడు ఊర్వశిని ఒక వేశ్యగా చిత్రించాడు. మానవుణ్ణి కర్తవ్య విముఖుడిగా చేసే ఒక సౌందర్య మూర్తిగా ఆమెను అరవిందుడు భావించాడు. ఆవస్థా భేదాన్ని బట్టి వధువుగా, భార్యగా, తల్లిగా రూపొందే ఒక అలౌకిక సౌందర్య రాశిగా ఊర్వశిని రవీంద్రుడు చిత్రించాడు"(**'కృష్ణశాస్త్రి, దేవులపల్లి , ఊర్వశి, 1982.పుట.60**).

1.10.1.1. రవీంద్రుని ఊర్వశి:

రవీంద్రుడు ఊర్వశి క్షీర సాగర మథనం నుండి పుట్టిందని భావించాడు. ఒక చేతిలో విష భాండంతో, ఒక చేతిలో సుధా పాత్రతో అవతరించిందని, తన వల్ల త్రిభువనాలు యౌవన చంచలాలు అయాయని ఊర్వశిని కొనియాడాడు. 'చిరయౌవన పాత్రలో రూపామృతం ఊర్వశి' అన్నాడు రవీంద్రుడు. సురసురాపాన సభల సఖియమైన స్వర్గ నర్తియైన అనిందితమైన విశ్వ ప్రేయసి ఊర్వశి, ఆశల చేత, కల్పనల చేత, వేదలనచేత, విలాపాల చేత మాత్రమే ఆమె చేలాంచలాలను స్పర్శింప వీలవుతుంది కాని, భౌతిక శరీరంతో కాదు. ఆమె ఆలౌకిక సౌందర్య కల్పనామూర్తి. ప్రకృతిలోని అందాలన్నింటికి అందని అందమే ఊర్వశి అని ఆమె ఛాయలు ప్రకృతిలో కనిపిస్తాయని రవీంద్రుడు

అన్నాడు. ఊర్వశి సౌందర్యం అలౌకికం, సత్యం, అనంత యౌవన ఊర్వశి. ఆమె అనంత యౌవనాల మధ్య అది సౌందర్యమై వసంతంలోను, జ్యోత్స్నలోను, ఉషస్సులోను, విద్యుత్‌లోను తన దివ్య వైభవాన్ని చూపుతుంది. అంతరంగ సంక్షోభం తరువాత ఈ ఊర్వశి జన్మింపగా వసంతోదయం అయ్యింది. జీవన మరణాలు, సుఖ దుఃఖాలు ఆమె చేతిలో పనులు. ఇటువంటి స్త్రీ తన గర్భాన జన్మించిందా అని సాగరుడే ఆశ్చర్యం చెందాడని ఈ విధంగా క్షీర సాగర మథనం నుండి ఊర్వశి పుట్టిందని రవీంద్రుడు వివరించాడు.

1.10.1.2. ఊర్వశి వ్యక్తిత్వం:

"ఊర్వశి విశ్వ ప్రేయసి. కరుణార్ద్రమూర్తి. అందుకే ఆమె వియోగినిగా, ప్రేయసిగా తన ప్రేమను వ్యక్తం చేసింది. హాలాహలం, అమృత శీతల రసం ఆమెకు తోడబుట్టువులు, తోడు నీడలు. ఇవి సుఖ దుఃఖాలకు ప్రతీకలు. ఈ రెండింటి సమ్మేళనమే 'ఊర్వశి'. ప్రకృతి సిద్ధమైన ప్రణయమూర్తి ఈ ఊర్వశి. మబ్బుల నుండి తొంగి చూసే చంద్రుని వెన్నెల, ప్రొద్దున్నే పూరేకులపై కురిసే మంచు, పావురాయి రెక్కలతో వీచే గాలి విరజాక్షి పూల నుండి వచ్చే సువాసన" **(కృష్ణశాస్త్రి, దేవులపల్లి,'ఊర్వశి',1982,పుట.121)** అంతా ఊర్వశిలో రూపు కట్టాయి.

సంధ్యాకాలంలో చిటారు కొమ్మల ఆకుల సందుల నివసించే చీకట్ల గుసగుసలు ఆమె కన్నులలో వినబడతాయి. గుసగుసలు అనే మాట రహస్యాన్ని సూచిస్తుంది. రహస్యం అంటే జీవిత రహస్యం. కన్నులలో జీవిత రహస్యపు ధ్వనులు వినబడతాయని కవి సూచించాడు. వానాకాలపు మబ్బుల వెనక ఉన్న బాష్పాలు ఆమె కన్నులలో పొంచి ఉంటాయి. భాష్పాలు ఆర్ద్రతకు సూచకం. ఉబికి వచ్చే కన్నీళ్లు శోకాన్ని సూచిస్తాయి. పొంచి ఉన్న కన్నీళ్లు అనేకానేక అర్ద్ర భావాల్ని సూచిస్తాయి. 'అర్థం కాని భావ గీతం' వినగానే మధురంగా ఉంటుంది. వెంటనే అర్థం కాదు. కాని తర్వాత ఆలోచనలను రేకెత్తిస్తుంది. అలాగే కళ్లు చూడటానికి ఆహ్లాదకరంగా ఉంటాయి. కాని లోపలి భావాలు చదవగలిగిన వాళ్లకే అర్థం అవుతాయి.

1.10.1.3. ఊర్వశి వర్ణన:

"ఊర్వశిని విశ్వ సౌందర్యానికి ప్రతీకగా భావించాడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఆమె ప్రొద్దునే కురిసే మంచుగా, వర్ష శరత్ఋుతువుల మధ్య కాలంలో వచ్చే సంధ్యాకుమారిగా, నిట్టూర్పుగా, కన్నీరుగా, విశ్వవేదనా మూల్య భాగ్యంగా"(**కృష్ణశాస్త్రి, దేవులపల్లి,1982, పుట.116**) కనిపించింది.

వసంతం వచ్చేసరికి కవికి చాలా రోజుల నుండి విడిపోయిన ప్రేయసి ఎదురైన విధంగా ఒక మధురానుభవం కలిగింది. అందుకే ప్రేయసిని 'ఓ వసంత విలాస మాధుర్యమా', 'ఓ యుషః కళ్యాణ లావణ్యమా' అని సంబోధించాడు. ఇక్కడ ప్రకృతే ప్రేయసి. అందుకే ప్రకృతి వసంతాలంకరణ నాయిక అలంకరించుకొని ప్రియుని ఎదుట నిలబడినట్లు ప్రకృతి కన్య వసంత మాసంలో చక్కగా అలంకరించుకొని ప్రత్యక్షమయింది.

ఊర్వశి దివ్య, ఇంద్రుని శిరస్సు నుండి జారి పడిన రూపం. 'వైకుంఠ మృదు కంఠ వైజయంతీ మాల' నుండి తెగిపడిన పూస, ఈశ్వరాలోకమే వెడలిన కాంతి ఆమె. కాబట్టి తనను తాను తెలుసుకునేందుకు ఈశ్వరాలోకమే ఒక చైతన్యశక్తిగా, రక్తి నుండి భక్తి వైపు పయనింపజేసి ముక్తిని ప్రసాదించే ఒక ఆధ్యాత్మిక శక్తిగా ఊర్వశిని భావించాడు కవి.

1.10.1.4. కవి అనుభూతులు:

"దేవులపల్లి కృష్ణశాస్త్రి జీవితంలో, హృదయంలో, ఊపిరిలో ఊర్వశి నిండి ఉంది. ఊర్వశి ఆయనకు ఒక స్థితి, కోరిక, ఆశయం, జీవిత సర్వస్వం. అందుకని హృదయంలో, జీవిత రహస్య మార్గంలో వదలకుండా నా బ్రతుకును నడిపించమని" **(కృష్ణశాస్త్రి, దేవులపల్లి,1982, పుట.124)** కోరాడు.

ఈ విధంగా ప్రేయసీ సమాగమం కలలో సంభవించింది. ఫలితంగా ఆయనలో రేగిన విషాదం అంతరించింది. రక్తి భక్తిగా పరిణామం చెందింది. కవి చేసిన నటరాజ స్తుతిలో శివైక్యం చెందడానికి జీవుడు పడే ఆవేదన కనబడుతుంది. విధాత సరస్వతిని సృజించి ఆమెను ప్రేమించి, ఆమెచే ప్రేమించబడినట్లుగా ఊర్వశి విషయంలో అటువంటి స్థితిని అందుకున్నాడు దేవులపల్లి

కృష్ణశాస్త్రి. ఈ విధంగా పేరులో రవీంద్రుని ఊర్వశితో సామ్యం ఉన్నా, ఆమెను ఒక విలక్షణమైన ఊహా సుందరిగా సృష్టించాడు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

1.10.2. అడవి బాపిరాజు 'శశికళ':

మూడు వేల సంవత్సరాల క్రిందటి గ్రీకు దేశంలోని గ్రీకు బాలుడు 'ఎండిమియాన్'. అతను అందగాడు. ఒకనాడు అలమందను తోలుకుంటూ అడవిలో తిరుగుతూ ఉన్నాడు. అలా తిరుగుతూ అలసిపోయి, ఏటి ఒడ్డున బండరాయి మీద నిదురపోయాడు. అతని అందాన్ని చూసి 'నీవే సర్వస్వం' అంటూ ఒక అప్సరస మీద వాలింది. ఈ కథను కీట్స్ మొదలైన ఆంగ్ల రొమాంటిక్ కవులు కావ్యరూపంలో చిత్రించారు. ఈ వృత్తాంతానికీ, అడవి బాపిరాజు 'శశికళ'కూ పోలిక ఉంది. అడవి బాపిరాజు, గురువు కూల్లే తీర్థయాత్రలు చేస్తున్నప్పుడు ఒక సంఘటన జరిగింది. ఒకసారి నదీలోయలో వెన్నెలలో బండమీద నిద్రపోతున్న అడవి బాపిరాజుపై పడిన వెన్నెల కిరణం కూల్లేకి స్త్రీమూర్తిగా కనపించింది. ఆ దృశ్యాన్ని కూల్లే 'ఎండిమియాన్' పేరుతో చిత్రంగా చిత్రించాడు. ఆ ఇతివృత్తంతో అదే పేరుతో బాపిరాజు ఒక గేయం కూడా రాశాడు. ఆ దివ్య సుందరి చిత్రానికే అడవి బాపిరాజు 'శశికళ' అని పేరు పెట్టాడు. ఆమెపైన గేయాలు రాశాడు. అవే 'శశికళ' కవితాసంపుటిలోని గేయాలు.

1.10.2.1. శశికళ వ్యక్తిత్వం:

శశికళ చుట్టూ కవికి వెలుగు కనిపించింది. దీనివల్ల ఆమె అడవి బాపిరాజు ఊహా ప్రేయసి అని తెలుస్తుంది. ఆమె కన్నులు ఆకాశంలో వెలిగే చంద్రుని వెన్నెలలాగా అమృతాన్ని కురిపించింది. ఈ విధంగా ఆమె ఒక దివ్యసుందరిగా కనిపిస్తుంది.

1.10.2.2. శశికళ వర్ణన:

"అడవి బాపిరాజు ఊహాప్రేయసి 'రాగాలాపనలో కిరణంలాగ, సురచాప వర్ణంలాగ మెరిసిపోయింది. దివి నుండి భువికి దిగిన ఆ దిశామూర్తి, నిశామూర్తి 'శశికళ'" **(బాపిరాజు, అడవి,1984, పుట.23-24)**. ప్రకృతి అంతా ప్రేయసిగా రూపుదిద్దుకుంది ఆయనకు. పూవులోని మసృణాలు కలిసి ప్రేయసిగా మూర్తీభవించాయి. కోకిల కువ కువలు ఆమె పలుకులుగా మారాయి.

లలిత కళలైన చిత్రలేఖనం, శిల్పం, కవిత్వం, సంగీతం వంటి రూపాలలో శశికళ కనిపించింది పలు కళలలో ఆరితేరిన కవికి చిత్రం గీయడానికి ఉపయోగించే రంగు, శిల్పి చేతులలోని ఉలి, కావ్యరసానికి గల స్థాయి, కావ్య వ్యంగ్యరీతి, వీణ తీగల మెట్లు, రాగాలు, తాళాలు కూడా ఆమె.

శశికళ కన్నులలో అడవి బాపిరాజుకు నాట్యరీతులు కనిపించాయి. ఆ కళ్లల్లో నాట్యం మెరిసింది. కనుబొమలు నాట్యరాగం పాడాయి. కనురెప్పలు ఆరజం వాయించాయి. కనుపాపలు రాగతాళ గతిని కదిలాయి. శశికళ నెలరేకగా, వెన్నెలగా, పరమ శోభగా, నిరతిశయ ప్రణయగా కనిపించింది.

1.10.2.3. శశికళతో కవికి సంవాదం:

"శశికళ ప్రణయ కోపానికి కవి విలవిల్లాడిపోయి వేడుకున్నాడు. వీణ మీటినట్లు పాటలు, వేణువు వూదినట్లు పలుకులూ పలుకవేమి అని ప్రశ్నించాడు. తాను చేసిన తప్పు తానెరుగును. ప్రణయ లీలలో ప్రథమ తప్పు క్షమార్హం కాదా అని వేడుకున్నాడు. ప్రేయసిని శిష్యురాలిగా భావించాడు కవి. కావ్యాలు కవిత్వం, కవి, వ్యంగంయ, రసం, అలంకారాలు, మూర్ఛనలు, రాగాలు వంటి లలిత కళాస్వరూపాలను వివరించమని" (**బాపిరాజు, అడవి,1984, పుట.104–105**) కవిని కోరుతూ ప్రణయ మూర్తే శిష్యురాలిగా చివరకు మారిపోయింది.

1.10.2.4. శశికళ పట్ల కవి భావన:

ప్రేయసి కోసం జీవితం అంతా తపస్సులో మునిగిపోయాడు కవి. అయినా ఆమె తలపులలో బొమ్మ మాత్రం అయిందిగాని మనిషిగా రూపుకట్టలేదు. చివరకు కాలి మువ్వలు ఘల్లు ఘల్లుమనగా శశికళ 'వెన్నెల'లాగ కవి జీవితంలోకి వచ్చింది. భావ కవులు ఊహా లోకాలలో పయనిస్తారనే ఆరోపణకు ఈ ఎరుక అపవాదంగా కనిపిస్తుంది. ప్రేయసిని దేవతగా భావించి ఆరాధించాడు కవి. దివ్యపథాల నుండి దిగి వచ్చిన ఆమెకు తాను ఏ మాత్రం తగనని భావించాడు.

అడవి బాపిరాజు భావకవుల ఇష్ట సుందరులను ఒక గీతంలో వివరించాడు. హృదయేశ్వరి ఒకరికి, కిన్నెర బాల ఒకరికి, ఊర్వశి ఒకరికి ఇష్ట దేవతలు. తన బ్రతుకుకు శృతి కలిపి నడిపించే ఇష్టదేవత శశికళ అని భావకవులందరి లాగా ఊహా ప్రేయసిగా శశికళను ఆరాధించాడు. కవి తనని

బాపిరాజా!, బాపిబావా!, బాబు!, నాన్న! అనే పిలుపుల కన్నా హో శశికళా ప్రియ భావుకా! అనే పిలుపే రసానంద దివ్యానుభూతి కలిగిస్తుందన్నాడుర. పిలుపులో శశికళా సంబోధన ముఖ్యం.

అడవి బాపిరాజు కళాకారుడు, కవి కావడం వల్ల ఊహా సుందరి శశికళా సౌందర్యానికి చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నాట్యం, కవిత్వం వంటి లలితకళలను అన్వయించాడు. ఆమెను ప్రేయసిగా, ప్రణయారాధ్య దేవతగా, దేవిగా, శిష్యురాలిగా ఆరాధించాడు. దేవులపల్లి కృష్ణశాస్త్రి వలె అడవి బాపిరాజు శశికళ కూ డా కవి ప్రేమ భావన. ఒక ఊహా సుందరి.

1.11. ఇల్లాళ్లు:

నాయని సుబ్బారావు వత్సల ఊహా ప్రేయసి కాదు. ఆమె ఆయన మరదలే. వీరి వివాహానికి వీరి మేనమామే అడ్డుపడ్డాడు. అయినా వీరిద్దరి మధ్య ప్రేమ ఏ మాత్రం తగ్గలేదు. ఆ ప్రేమ యాత్రే ఈ 'సౌభద్రుని ప్రణయ యాత్ర' కావ్యం. వత్సల మొదట ఆయన ప్రేయసి, తరువాత ఇల్లాలు.

1.11.1. నాయని సుబ్బారావు వత్సల:

సౌభద్రుడు, వత్సలల ప్రేమ భారతంలోని అభిమన్య శశిరేఖల ప్రేమను పోలి ఉంది. బలరాముడు అభిమన్యునకు తన కూతురైన శశిరేఖను ఇచ్చి వివాహం చేయడానికి వారి చినప్పుడే మాట ఇచ్చాడు. కొంత కాలానికి పాండవుల రాజ్యం పోతుంది. దాంతో శశిరేఖను దుర్యోధనుని కుమారుడైన లక్ష్మణకుమారుడికి ఇవ్వడానికి నిశ్చయించుకున్నాడు. అదే విధంగా వత్సల తండ్రి చెల్లికి చేసిన బాసను మరచిపోయాడు.

1.11.1.1. వత్సల వర్ణన:

"వత్సలను మల్లెపూనుతో పోల్చి, పూజింపడానికి అనువైనదిగా చేసాడు. కన్నె గేదంగి రేకుల కన్నులతో, సిగ్గు చెక్కిళ్ల చిరునవ్వు నాట్యమాడగా చెలులతో సౌభద్రుని హృదయంలో ప్రేమ నాట్యం చేసింది వత్సల" **(సుబ్బారావు, నాయని,'సౌభద్రుని ప్రణయ యాత్ర',1958, పుట.33)**. ఇక్కడ ప్రకృతి దేవతగా ఆరాధ్యయైన ఊహా సుందరిగా వెలసింది వత్సల. ఆమెను ప్రణయ దేవతగా భావించి కోమలమైన రేకులతో పూజించాడు.

1.11.1.2. వత్సల ప్రేమ:

వత్సల తమ ప్రేమను పెద్దలు అంగీకరించనందుకు బాధపడి, ప్రేమకన్నా ఈ లోకంలో సాటిలేనిది ఏమీ లేదని చెప్పింది. చిన్న వయస్సులోనే ఒకరి మీద ఒకరం అనురాగం పొందాం. దానిని ఇప్పుడు పోగొట్టుకోవడానికి ఎట్లా వీలవుతుందని ప్రశ్నిస్తుంది. ప్రకృతిలోని ప్రతి సంఘటన ప్రేమ వల్లే సాగుతుంది. శివుడు, దమయంతి, సావిత్రి కథలు కూడా ప్రేమతో నడిచాయి. బాధలలోనే ఆనందాన్ని అనుభవించారు వాళ్లు. అటువంటి ప్రేమను మనస్సులో నుండి నెట్టి వేయడం చాలా కష్టం అంటుంది. చివరకు ప్రేమతో ఆకాశం పైకి ఎక్కి స్వర్గానికి వెళ్లవచ్చు. నరకంలో సంతోషంగా ఉండవచ్చు. నిజంగా ప్రేమ కంటే వాంఛనీయం ఏదీ లేదు అని ప్రేమలోని గొప్పతనాన్ని చెప్పింది.

1.11.1.3. సౌభద్రుని ప్రేమ:

"సౌభద్రుని ప్రణయ యాత్రలో కవే సౌభద్రుడు. ఆయన తన మరదలు మీదే ప్రేమను వ్యక్తం చేసాడు. సౌభద్రుడు ప్రేమతో వత్సల కోసం ఎదురు చూడడాన్ని, పూవులో తేనె ఒలుకుతుండగా అమరగానం వర్షించే భ్రమరం ఇంకా రాదేమి అని పూవు ఎదురుచూడడంతో పోల్చాడు" **(సుబ్బారావు,నాయని,1958, పుట.18).**

ఉదయాన్నే పడే మంచు చేత ప్రణయ సందేశం పంపించాడు వత్సలకు సౌభద్రుడు. సౌభద్రుడు వత్సల కటాక్ష వీక్షణాల కోసం వేచి ఉన్నాడు. ఆమె మూడుప లోకాలలో రసోద్దీపం కలిగించే ప్రణయ రూపిణి. ఆమె చిరునవ్వు కోసం వేచి ఉండే ముగ్ధ భిక్షకుడు సౌభద్రుడు. ఆమె అమృతానికి మాధుర్యాన్ని జోడించిన కలశవారాశి. ఆమె పలకరింపులకు మురిసే బాలచంద్రుడు ఈ సౌభద్రుడు. చివరగా ఆమెను జీవన ధాత్రిగా, తనను జీవిగా చెప్పుకుని, ఆమె లేనిదే తనకు గుర్తింపు లేదన్నాడు ఆయన.

తమ ప్రేమకు మధ్య ఎవరో అడ్డు వచ్చారని, ఆమె కంఠాన్ని అలంకరించడానికి తను వేసిన ప్రేమ ప్రసూనమాలను మధ్యలోనే ఆమె చూస్తుండగా నలిపి, ఆమె కన్నులలో ఎర్రదనం నింపారని కోపగించుకున్నాడు సౌభద్రుడు. చివరకు కావ్యం వీరి వివాహంతో సుఖాంతం అయ్యింది. నాయని సుబ్బారావు తన ప్రణయ చరిత్రనే కావ్యంగా రచించాడు.

చివరకు ఈ ప్రేమ కార్తీక పూర్ణిమలాగ ప్రసన్న చాంద్రీమయంకాగా, శుక్రవారం నాడు ప్రేయసితో జంటగా చేరి పూజా వ్యగ్రతతో కావ్య సమాప్తి చేయడం భారత సంప్రదాయ సిద్ధమైన చతుర్వర్గ సాధనను సూచిస్తూ, ఉత్తమ సంస్కారాన్ని వెల్లడి చేస్తుంది. నాయని సుబ్బారావు ప్రణయాన్ని దేవీమూర్తిలోని ఒకఅంశంగా, కళగా దర్శించాడు. తల్లి ఉద్బోధతో వలపుల జ్యోతిని కనుగొనడానికి బయలుదేరి, తల్లి కొరకే యాత్ర సాగించి, తుదకు ప్రియురాలితో చేరి తల్లికి నమస్కరించడమే పరమార్థంగా చిత్రించడం వల్ల సమగ్ర దేవీమూర్తిని మాతృభావంతో పరికించి, ఏకదేశంగా తన ప్రియురాలిలో ప్రణయ భావాన్ని చూచాడు.

1.11.2. తల్లావర్జుల శివశంకర శాస్త్రి 'హృదయేశ్వరి':

తల్లావర్జుల శివశంకర శాస్త్రి 'హృదయేశ్వరి' అనే పద్య సంపుటి సంస్కృత సంప్రదాయాన్ననుసరించిన ఒక యువకుని ప్రమోదంతం. ఇందులో నాయిక స్వతంత్రురాలు కాదు. బంధుజన పరివేష్టిత. నాయిక పేరు 'లక్ష్మి'. ఈ కావ్యంలో కవి నాయకుడి ప్రాణసఖుడుగా చెప్పబడ్డాడు. తొమ్మిది ఉచ్ఛ్వాసాల కావ్యంలో మొదటి నాలుగు ఉచ్ఛ్వాసాలలో ఉత్తమపురుషలో నాయకుడి గురించి విభ్రమ, విరహాది అవస్థలు వర్ణింపబడ్డాయి. మిగిలిన ఉచ్ఛ్వాసాలలో నాయకుడు, నాయిక, వారి సంతానం కుమారుడు, కుమార్తె, కుమారి, నాయకుని మిత్రులు, ఆప్తుడు, హితుడు, సఖుడు, తల్లి, వృద్ధురాలు, జ్యోతిష్కుడు, జోషి, చెల్లెలు మొదలైన కావ్యగత పాత్రలు నడిచినాయి. కావ్యం అంతా ఆయా పాత్రల ఉత్తమ పురుషాత్మక సంభాషణలో సాగింది.

కావ్యంలో మొదటి నాలుగు ఉచ్ఛ్వాసాలలో నాయకుడు నాయికను ఒక ఊహా సుందరిగా భావించి వర్ణించాడు. నాయకుడు నాయిక ప్రేమకోసం విలపించడం, ఆమె తనను చూడలేదని విచారించడం, ఆమెను వర్ణించి చెప్పడం, చివరకు ఆమె ప్రేమను పొందడం మొదలైన విషయాలను ఈ ఉచ్ఛ్వాసాలలో భావనాత్మక దృష్టితో చెప్పాడు తల్లావర్జుల శిలశంకర శాస్త్రి. దీనివల్ల ఈ కావ్యాన్ని భావకవిత్వంలోని ఊహాసుందరుల విభాగంలో చేర్చవచ్చు. ఇందులో కవే నాయకుడుగా కనిపిస్తాడు. తరువాతి ఉచ్ఛ్వాసాలలో నాయకునితోపాటు నాయకునితో సంబంధం ఉన్న పాత్రలు కొన్ని వస్తాయి. నాయకుడు తనకు ఒక చిన్న కుటుంబం ఏర్పడినట్లు, కుమారుడు, కుమార్తెలు కలిగినట్లు కల గంటాడు. విరహ బాధను, ఆప్తులకు, తల్లికి చెప్పుకుని సానుభూతి పొందుతాడు. ఎటూ తోచక

భవిష్యత్తు గురించి జ్యోతిష్కున్ని అడుగుతాడు. జ్యోతిష్కుడు వీరి వివాహం జరగదని చెపుతాడు. నాయకుడు తన చెల్లెలి చేత ప్రేయసికి సందేశాన్ని పంపిస్తాడు. చివరకు వారి సమాగమం భావనాత్మకంగానే ఉండిపోతుంది.

1.11.2.1. నాయిక వ్యక్తిత్వం:

ఆమె కన్నులు కోమల మనోజ్ఞంగా, చల్లని చూపులతో చంద్రుని వెన్నెలలాగ ఉన్నాయి. ఆమె మూర్తి మధురమం కన్నా మధురమైనది. చివరకు నాయకుడు ఆమెను వాడిపోయిన తన ముఖాన్ని వికసింపజేసే తరుణార్క బింబంగా, గాఢాతాపార్తమైన గానానికి చందన చర్చగా, బహిఃప్రాణిగా, భాగ్యలక్ష్మిగా భావించి ఆరాధించాడు.

1.11.2.2. నాయిక వర్ణన:

"నాయిక ముఖం వెన్నెలను వెదజల్లే చంద్రునిలాగ ఉంటుంది. తెల్లని వస్త్రాలు ధరించి, కాంతిని చిందించే శరీరంతో మందగమనంతో వచ్చే నాయిక లక్ష్మిలాగే ఉందని" (**శివశంకరశాస్త్రి, తల్లావర్జుల,1954, పుట.16**) నాయకుడు భావించాడు. దేవాలయానికి వచ్చిన ప్రేయసి క్రొమ్ముడిని, కమ్రచేలాన్ని, రుచిరమైన పాదాలను చూసి నాయకుడు సంతోషపడ్డాడు. నాయకుడు ఆ మనోహర మూర్తిని మనస్సులో నిలిపి వస్తుండగా ప్రేయసి మేడ దగ్గర చేతిలో సంస్కృత గ్రంథం పట్టుకుని భారతీదేవీలాగ కనిపించింది. విద్యాలయం నుండి వస్తున్న ప్రేయసి వాగ్దేవిగా కనిపించింది నాయకుడికి.

1.11.2.3. నాయికపై నాయకుడి గల ప్రేమ:

నాయకుడు నృసింహాలయాంగణంలో ప్రేయసి కోసం నిరీక్షిస్తున్నప్పుడు నాయకి అక్కడికి స్వజనంతో వచ్చింది. రాగా ముఖ సౌందర్యభిలాషతో నాయకుడు ఆమె వెంట వెళ్లాడు. ఆమె చంచల కాంతలాగ వేరొక ద్వారం గుండా బయటకు వెళ్లిపోయింది. దాంతో ఈ భక్తునకు చరణ యుగళియే సమస్తం అయి వాపోయింది.

"కొంత కాలానికి ప్రేయసి రూప సందర్శనం కలిగింది నాయకుడికి. దాంతో నాయిక మూర్తిని హృదయంలో ప్రతిష్టించి, ఇష్టదేవతగా సేవించుకున్నాడు. అపరిమితమైన అనురాగంతో

నిత్యాభిషేకం జరుపతలపెట్టాడు. తన అంతరంగాన్ని సమర్పిస్తానని" (**శివశంకరశాస్త్రి, తల్లావర్జుల,1954, పుట.22**) ఉప్పొంగిన ప్రేమతో అన్నాడు. ప్రేయసి దర్శనాంతరం ఆమె ప్రేమను పొందడానికి నాయకుడు పడిన వేదన వర్ణనాతీతం. ఆమె ప్రేమలో పడి అతని హృదయం కృశించింది. చివరకు కరుణతో కాపాడలేనా అని జాలిగా నాయికను కోరాడు. ప్రేయసి కరుణించకపోవడంతో నాయకుడికి జీవితమంతా అమావాస్య అయింది. ఇది భావకవులందరకూ ఉన్న భావమే. వీళ్లంతా విరహవేదనను చీకటితో పోల్చారు. నాయకుడు పూరెక్కలతో లక్ష్మి పేరును కూర్చాడు. ఆ అక్షర ద్వయం చూడగానే కన్నులు సంతోషంతో ఆనంద భాష్పాలు వెలువరించాయి. ఆ పేరు పలుకులో మధురత ధ్వనించింది.

ఈ విధంగా ఆమెపైన ప్రేమతో ఒక చిన్న కుటుంబం తమకు కలిగిందని కలగంటాడు నాయకుడు. చివరకు వారి సమాగమం భావనాత్మకంగానే ఉండిపోయింది. ధృతి, క్షమ, దయ, శౌచం, నిస్వార్థ, ప్రేమ మొదలైన గుణాలకు నిలయమైన స్త్రీని దేవీపీఠంపై అధిష్టింప చేసాడు. తల్లావర్జుల శివశంకర శాస్త్రి. 'నా మతంలో భార్య మాన్యురాలు' అంటూ సహధర్మచారిణిని దేవిగా ఆరాధించాడు. వారి వర్ణనా పద్ధతి మాత్రం సంస్కృత సంప్రదాయాన్నే పాటించింది.

1.12. కావ్య నాయికలు:

నండూరి సుబ్బారావు కావ్యనాయిక 'యెంకి', విశ్వనాథ సత్యనారాయణ కావ్యనాయిక 'కిన్నెరసాని'. వీరి నాధారం చేసుకుని వారు 'యెంకి పాటలు/కిన్నెరసాని పాటలు' రచించారు.

1.12.1. నండూరి సుబ్బారావు 'యెంకి':

'యెంకి పాటలు' ఊహా ప్రేయసిని కీర్తించే కావ్యాల క్రిందకు రాదు. ఎందుకంటే ఇక్కడ నాయికా నాయకులిద్దరూ ఉన్నారు. ఈ పాటలలో యెంకి చిత్రణను చూడవచ్చు. అందులో భావకవుల స్త్రీ దృక్పథం తెలుస్తుంది.

1.12.1.1. యెంకి వర్ణన:

యెంకి ఆకారాన్ని సున్నితంగా చెప్పాడు నండూరి సుబ్బారావు. "మెడలో పూసల దండతో, తలలో పూవుల దండతో కళ్లెత్తితే చాలు కనకాభిషేకాలుగా ఉంటుంది యెంకి. ఇంకా చెక్కిట చిన్ని

మచ్చతో, ఒక్క నవ్వే వజ్ర వైఢూర్యాలను పోలి ఉంటుంది" (**సుబ్బారావు, నండూరి.యెంకిపాటలు. పుట.12–13**). ఇలా వర్ణించిన కవే మరొక గేయంలో ఊహా సుందరికి ఛాయగా యెంకి ఎవ్వరంటే వెలుగు నీడల వైపుకు వేలు చూపాడు. యెంకిని ప్రకృతి కన్యతో పోల్చి చూపాడు కవి. పచ్చని చేలలో, పండు వెన్నెలలో నీలిరంగు చీర గట్టిన యెంకి వనలక్ష్మిలా కనిపించింది. ఇటువంటి యెంకి చివరకు ఉత్తమ ఇల్లాలయ్యింది.

1.12.1.2. యెంకి అనుభూతులు:

యెంకికి నాయుడు బావపై ప్రేమ నిసర్గమైంది. కొన్ని గేయాలలో యెంకి ప్రేయసిగా కనబడుతుంది. కోడి కూసే వేళకి కొంప కెళ్లాలని హడావుడి పడిపోతుంది యెంకి. కాని నాయుడు బావను వదిలిపెట్టలేక వెనకెనక చూసుకుంటూ పోతుంది.

పది మందిలో యెంకి పాటలు పాడుతూ ఉంటే అందరూ నాయుడు బావను మెచ్చుకుంటూ ఉన్నప్పుడు, యెంకి భార్యగా మురిపాలు పోతుంది. తమ భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలను తలచుకొని ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని, దిగులును పొందుతూ తెలుగింటి ఆడపడుచులాగ కనిపిస్తుంది. వెనక జన్మలో మనం ఎవరమో అని నాయుడు బావ అడగడం శృంగార రసస్ఫోరకమైంది. ఇక్కడ ఇది పూర్తి రసావేశ స్థితిలో ఉండి వేసిన ప్రశ్న. దానికి అనుగుణంగా యెంకి సిగ్గు పడి నవ్వింది. దీనికన్నా రసావేశ స్థితి నుండి ఒక్క మెట్టు క్రిందకు దిగి ముందు మనకే జన్మం ఉందో అంటే, తెల తెల బోయింది యెంకి. పూర్వ పుణ్యం వల్ల లభించిన ఈ జన్మంలోని ప్రణయ జీవితం ఇంతటితో అంతం అవుతుంది. ముందు జన్మలో నీ దారి నీది. నా దారి నాది అవుతుందా అనే తాత్త్విక ప్రశ్న అర్థంకాక యెంకి తెలతెల బోయింది. ఎన్నాళ్లు మనకు ఈ సుఖాలు అనగా యెంకి కంట నీరెట్టింది. ప్రణయ జీవితానికి ఆవాంతరం వాటిల్లవచ్చుకదా. తామూ మానవ మాత్రులమేనని సంశయ స్థితిని ప్రకటించాడు నాయుడు బావ. సంసారంలో అనుభవించే సుఖ దుఃఖాలు, కష్ట సుఖాలు, ఎడబాటులు ఎంతటి వారికైనా తప్పవు.

"నాయుడు బావ దూరతీరాలకు వెళ్లినప్పుడు యెంకి మనసు రకరకాల ఆలోచనలతో గుబులు గుబులుగా ఉంటుంది. చీమ చిటుక్కుమనగానే చెదిరి పోతుంది మనస్సు. కళ్లకేటో మబ్బు కమ్మినట్టుంటుంది అంటూ బెంగ పడుతుంది. యెంకి విరహాన్ని కవి వర్ణించాడు. ఈ విరహ

వర్ణనలలో చంద్రుని మన్మథుణ్ణి తిట్టడం లాంటివి లేవు. సహజంగా, జానపద సరళిలో ఉన్నాయి. నాయుడు బావ దగ్గర లేని కాలంలో నీళ్లు తీసుకు వస్తుంటే తనతో ఎవరో నడిచినట్టు, అద్దంలో చూస్తుంటే వెనక ఎవరో నవ్వినట్లు, కళ్లల్లో కనిపించినట్లు" **(సుబ్బారావు, నండూరి.1953, పుట.11)** అయింది.

ఇది నిజ జీవితానికి దగ్గరగా అతిశయోక్తులు లేకుండా ఉంది. నాయుడు బావ లేని రాత్రి యెంకి కంతా కలత నిదరే. తన వెన్నెలల సొగసంతా ఏటి పాలయ్యింది. వెలుతురు వచ్చి రాత్రిని తినేసి తన బ్రతుకును కలత నిదుర పాలు చేసిందని యెంకి బాధపడింది., చివరకు యెంకి కాశీ రాణిని తమ మనస్సులు కలపమని బ్రతిమాలుకుంటుంది. నాయుడు బావ తనను ఏనాడూ తలచలేదని బాధ పడింది.

1.12.1.3. నాయుడు బావ అనుభూతులు:

"నాయుడు బావ యెంకిని దేవతగా భావించాడు. ఆమెకు సిగ్గెందుకు? ఆమె అందాలు చూసి ప్రజలు దేవతను చేస్తారు. ఇంటింటా ఆమె పేరే పెడతారు అన్నాడు." **(సుబ్బారావు, నండూరి.1953, పుట. 34)**. యెంకి నాయుడు బావ మధ్య విరహాన్ని కవి వర్ణించాడు. యెంకి లేని రోజున నాయుడు బావకు తినే పండు కూడా విషంగా మారి పోయింది. యెంకిలేని రాత్రిళ్లు పొందే విరహతాపం భరించలేక యెంకిని తన ప్రక్కకే రావొద్దన్నాడు నాయుడు బావ. ఇది అలక. ఈ విరహంతో యెంకిని కఠినమైన గుండె కలదానిగా చేశాడు. చివరకు యెంకి కోసం ఎదురుచూస్తూ ఉన్న తన ముందుకు యెంకి వచ్చి కులుకుతూ తనను పలకరించాలని కోరుకుంటాడు.

1.12.2. విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని':

విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని పాటలు' ఊహాసుందరికి సంబంధించిన గానం కాదు. భద్రాచలానికి దిగువన గోదావరిలో దక్షిణపు వైపు నుండి కలిసే వాగు 'కిన్నెరసాని'. దానిమీద కథ అల్లుకుపోయాడు విశ్వనాథ సత్యనారాయణ. నదికి మానవత్వం కల్పించాడు. కిన్నెరసాని కోడంట్రికం భరించలేక అడవుల వెంట పరిగెత్తింది. భర్తపోయి ఆమెను పోవద్దని కౌగలించుకున్నాడు. ఆ కౌగిట్లోనే ఆమె కరిగి నీరై, వాగుగా ప్రవహించింది. అతను శోకించి శిలగా

మారాడు. ఇది కథ. ఈ కథ ముందుగానే చెప్పి, కావ్య రచన మొదలుపెట్టాడు. కిన్నెరసాని కథను ఒక సాంఘికేతివృత్తంగా కవి రచించాడు. పాటలన్నీ జంపె వరుసలో రచించి యెంకి పాటలను అనుసరించాడు.

1.12.2.1. కిన్నెర పుట్టుక:

"కిన్నెరసాని భర్త కౌగిట నీరై, వాగుగా ప్రవహించడంతో కథ మొదలైంది. ఆమె నీరుగా మారడం అతనికి విరహ కారకం" **(సత్యనారాయణ, విశ్వనాథ, కిన్నెరసాని,1970, పుట.7–12)**. తను చేసిన తప్పు ఏమిటో తనకు తెలియడం లేదు. తనపై ఇంత కోపం వహించుట ఆమెకు తగదు అని వాపోతాడు. వెన్నెల వలె తెల్లని మేని తరంగాలతో ఆమె తన కన్నులకు కనిపించింది. ఒయ్యారపు నడకలు నురగలుగా ప్రవహించాయి. నవ్వులు నురుగులుగా, కన్నులు చేపలుగా మారాయి. ఇది ఆమెలోని మార్పు. ఆమెను జీవితమణిగా, జీవేశ్వరిగా, చూడామణిగా, ప్రియురాలుగా భావించాడు. ఆమె కోసం ఏడ్చి ఏడ్చి తానూ శిలగా మారిపోయాడు. ఇందులో భర్తకు కిన్నెరసాని మీద గల అవ్యాజమైన ప్రేమ వ్యక్తమైంది. ఆమె రసానుభూతి గలది కాబట్టి వాగుగా ప్రవహించింది. తాను కఠిన హృదయుడు కాబట్టి శిలగా మారుతున్నానని వాపోతాడు. ఇక్కడ కిన్నెరసాని సున్నిత మనస్సు, మృదు స్వభావం వ్యక్తమయింది.

1.12.2.2. కిన్నెరసాని నడకలు:

కిన్నెరసాని నదిగా ప్రవహించి వరదలై పారింది. పరుగులు పెట్టింది. సుళ్లుగా తిరిగింది. నురుగులు గ్రక్కింది. తరగవాళ్ల మధ్య తళ తళా మెరిసింది. ఇసుక నేలలపైన బుస బుసా పొంగింది. తెల్లని పూల నది వలె కదిలింది. తొడిమ ఊడిన పూవు పడతిగా కనిపించింది. సిగ్గుపడి రాచకన్నె వలె ఉంది. తన భర్త చూపిన ప్రేమకు తిరిగి మనిషిలాగ పుడదామనుకుంది. బ్రతికుండగా ఇంత ప్రణయం ఉందని తెలిస్తే ఇలా అయ్యేదాన్నా అని విలపించింది. కిన్నెరసాని చివరకు ఏమీ చెయ్యలేక రాయిగా మారిన భర్త చుట్టూ తిరుగుతూ, తన కెరటాల మ్రోతతో పలకరించింది.

తన కోసం భర్తకు ఎంత బాధ కలిగించిందో తెలుసుకుని వాపోయింది. నదిగా మారిన కిన్నెరసాని ఈ బాధలో పూర్వపు పతి ప్రేమను తలచుకుంది. అమిత ప్రేమతో తన భర్త ఇక తనను

చేరడని, వద్దన్న కొద్దీ తన పాదాలు ఒత్తుతూ ఇక తనను కౌగిట చేర్చుకోడని, తలిరాకు వంటి ఎర్రని పెదవితో తన మోమును ఇక స్పృశించడని దుఃఖించింది కిన్నెరసాని.

1.12.2.3. కిన్నెర నృత్యం:

కిన్నెరసాని నది ప్రవహించే తీరులో నృత్య రీతిని దర్శించి కిన్నెర నృత్యం రచించాడు కవి. కిన్నెర అటుఇటు కదులుతూ తన తరంగాలతో నాట్యం చెయ్యడం మొదలుపెట్టింది. పువ్వు కన్నెలా, అటూ ఇటూ ఊగడం మొదలుపెట్టింది. సోన జారుతూ, నీటిపైన వాలుతూ కిన్నెర చిన్నారి నడకలతో కొత్త తళుకులతో ఒప్పింది. చిరు తేనెలా, అచ్చరల గొంతులా, గజ్జెల మ్రోతలా కిన్నెర ఊగాడింది. మద్దెల మ్రోతలా కిన్నెర మృదు తాండవం చేసింది. కిన్నెర తన అలల నురుగులతో ఘల్లు ఘల్లున మ్రోగే అందెల మ్రోతను తోపింప చేసింది. అలసట పొందుతూ కిన్నెర చిరుమీను కన్నులతో సోయగాలు చూపుతూ లోగొంతుతో రాగాలు పాడింది. చిరుపాయలై, సోనలై పారే కిన్నెర దివ్య నృత్యం దిగ్గంతములంటింది.

1.12.2.4. కిన్నెర సంగీతం:

కిన్నెర నది పారుతూ ఉంటే వచ్చే శబ్దాన్ని శబ్ద సంగీతాన్ని 'కిన్నెర సంగీతంగా కవి చిత్రించాడు. తేనె తరగల పిండుతో జలజల సాగే కిన్నెరసాని జాలైన మేలైన వాకలో, అందాల రాకలో బంగారు జిలుగు గంటలు మ్రోగుతాయి. కిన్నెర పాట విని కొమ్మాపి సిగ్గు పడింది. పూవులు, తేసంజలు తెల తెల బోయాయి. కిన్నెరసాని పాట విని పగలు పులకలు పొందింది. మల్లెల సొగసు వెలుగులు చిందించాయి. ఆనంద జలధిలో లోకాలు పులకితమై పోయాయి. కిన్నెర పాట సన్నగిల్లి పోవడంతో చిరుగాలి ఆ పాట సాగించింది. కిన్నెర పాట అందం సిగ్గులో వనమంతా ఒక పాటయై పోయింది. ముద్దు ముద్దుగా నడిచి మురిపెంగా పాడిన కిన్నెరసాని ఎదలో కష్టాల కడలిని కవి దర్శించాడు.

1.12.2.5. కడలి పొంగు:

కడలి కిన్నెర పొందు కోసం బిర బిర పొంగుతూ రాసాగింది. కడలి రాజును ఇక్కడ ప్రతినాయకుడిగా చిత్రించాడు విశ్వనాథ సత్యనారాయణ. గంగ, యమున ఇల్లాళ్లుగా ఉన్న కడలికి

కిన్నెరసానిని చూడడంతో మనస్సు ఉప్పొంగింది. అది చూసి ముల్లోకాలు ఉప్పెనని భీతి చెందాయి. ఆ పొంగును చూసి కిన్నెర కీడు తలచింది. అడ్డదిడ్డంగా పరుగెత్తుతూ ఏడ్చింది.

1.12.2.6. కిన్నెర దుఃఖం:

కిన్నెర తన దుఃఖంలో పతి ప్రేమను గుర్తు చేసుకుని, తన తొందరతనానికి బాధ పడింది. ఆకాశంలో చుక్కగా, నేలపై మొక్కగా మారిపోతే ఈ బాధ తప్పేది కదా అని వగచింది. కిన్నెర ఏడ్పునకు అడవిలోని పులుగులు, మృగాలు, గాలులు ఓదార్పు వచనాలు పలికాయి. అక్కడే ఉన్న గోదావరి కిన్నెర ఏడ్పులను విని పొంగి వచ్చి అభయం ఇచ్చింది. కిన్నెర తన కథను చెప్పుకుని, తన అలలను అందిచ్చింది.

1.12.2.7. గోదావరీ సంగమం:

కిన్నెరసాని గోదావరిలో సంగమం చెందింది. జాలి గుండె కల గోదావరి ఎదురు వెళ్లి కిన్నెర దిగుళ్లు పోయే విధంగా ఆదరంగా కౌగిట చేర్చుకుంది. కడలి కిన్నెర దగ్గరకు రాదని, కిన్నెర దుఃఖం లోకాలను ఊపిందని, ఇక హాయిగా ఉండుమని, తన కెరటాలతో కిన్నెరను కప్పుతాను అంది. గోదావరీ కెరటాలు, కిన్నెర కెరటాలు కలిసి కొన్నప్పుడు పెద్దక్క, పిన్నక్క నవ్వుల బోదెలో దిగినట్లనిపించింది. కడలికి ఈ సంగమం ఆగ్రహం తెప్పించింది. కడలి అనచరులు గోదావరి గొప్పతనాన్ని వివరించి, ఆమెను ఎదిరించడం మంచిది కాదని, ఆ ప్రయత్నాన్ని విరమింపజేశారు. కిన్నెరసాని గోదావరీ దేవిని కూడి ఏ దిగులు లేకుండా ఉండిపోయింది.

1.12.2.8. కిన్నెర వైభవం:

చివరగా కిన్నెర వైభవాన్ని వర్ణించాడు విశ్వనాథ సత్యనారాయణ. కిన్నెర నదిగా ఎన్ని అందాలను కనబరుస్తుందో, విశేషణాలతో వివరించాడు. తలలపై రతనాలు మెరిసే నల్ల త్రాచులా దూకి నాట్యం చేసింది కిన్నెర. క్రొం బొద్దున బట్టలు నేలపై అరబెట్టగా ఆపి గాలికి కదలాడినట్లు కదిలింది కిన్నెరసాని. పైరు నాట్యమాడినట్లు తరలింది. శుక్లపక్ష మాసంలో చంద్రుడు, తారలు వెలుగుతో వచ్చిన కాంతి కిన్నెర నదిమీద పడి వెండిని కంసాలి మూసలో కరిగించి పోసినట్లు వెలుగులు చిందింది. పాలలో పంచదార కలిపినట్లు దాని నీరు తీయగా ఉంది. ఋతువు ఋతువుకు

మార్పు పొందుతూ కాంతులు వెదజల్లింది కిన్నెర. భద్రాద్రి రాముణ్ణి దర్శించుకొనడానికి దారి కాసింది. యాత్రికులకు చల్లని నీరు అందించే పుణ్యాత్మురాలు కిన్నెర. కవి నదికి మానవ ప్రకృతిని అంటగట్టి కావ్యాన్ని రచించాడు. ఇక్కడ కిన్నెర తెలుగింటి ఆడపడుచుగా వర్ణించి, సాంసారిక పరిస్థితులు వివరించాడు. భావ కవిత్వంలో స్త్రీని ప్రేయసిగా, దేవతగా, జీవితేశ్వరిగా ఆరాధించారు. కొంత మంది ఊహాసుందరులను కూడా సృష్టించారు. వారిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి ఊర్వశి విలక్షణమైంది. ఊర్వశిని అలౌకిక స్త్రీని చేసాడు కృష్ణశాస్త్రి.

1.13. భావ కవిత్వోద్యమం–నేపథ్యం:

భావ కవిత్వం ఒక మహోద్యమంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రవేశించింది. ఈ కవిత్వం అంతవరకు స్థిరపడ్డ కవితా సంప్రదాయాల మీద భావాల మీద సామూహికంగా దాడి చేసింది. కృష్ణాపత్రిక, ఆంధ్ర భారతి, గ్రంథాలయ సర్వస్వం, అనసూయ, శారద వంటి పత్రికలు ఈ ఉద్యమ ప్రచారానికి తోడ్పడ్డాయి. ఆనాటి రాజకీయ, ఆర్థిక, విద్యా, సాహిత్య పరిస్థితులు దీనికి తోడ్పడ్డాయి.

1.13.1. రాజకీయ పరిస్థితి:

1857 భారతదేశం ముఖ్యంగా ఆంధ్ర దేశంలో సామాజికంగా చాలా మార్పులు జరిగాయి. బ్రిటీష్ వారి వలస ఆర్థిక విధానం వల్ల జాతి, దేశభక్తి, జాతీయత అనే భావాలు ప్రజల ఆలోచనా విధానంలో చోటు చేసుకున్నాయి. ఈ కాలంలో మనిషి శాస్త్రీయ విజ్ఞానంలో అభివృద్ధి సాధించడం వల్ల మానవుని దృక్పథం కూడా మారింది. క్రమంగా ఏ విషయాన్నైనా హేతువాద దృష్టితో చూపి సత్యాసత్యాలు తెలుసుకునే వివేచన మనిషిలో కలిగింది. ఈ కాలంలో ఆంధ్ర దేశం అంతా ఒకే పాలనలో ఉండడం, ఆధునిక విద్య ఆంధ్ర దేశం అంతటా ప్రవేశ పెట్టడం వల్ల పరపాలనలో మగ్గుతున్న జాతిలో క్రమంగా జాతీయతా భావాలు రూపు దిద్దుకున్నాయి. ఈ జాతీయ భావనలు భావకవిత్వాన్ని ప్రభావితం చేశాయి.

బ్రిటీష్ వారు చేసిన వంగ రాష్ట్ర విభజనతో 'వందేమాతరోద్యమం' విజృంభించింది. అప్పటి వరకు నామరూపాలు లేకుండా ఉన్న చేనేత పరిశ్రమ తిరిగి బలం పుంజుకుంది. భారతీయులు మొదట మెకాలే చేసిన విద్యా ప్రణాళికను అంగీకరించలేదు. కాలేజీలు బహిష్కరించారు. జాతీయ

కళాశాలకు రూప కల్పన జరిగింది. దీనిని నిర్మించిన బిపిన్ చంద్రపాల్ దేశమంతటా తిరుగుతూ ఉపన్యాసాలు ఇచ్చాడు. 1907లో బిపినా చంద్రపాల్ ఆంధ్ర దేశంలో పర్యటన చేశాడు. రాజమండ్రి, విజయవాడ, బందర్, నెల్లూరు మొదలైన పట్టణాలలో తన వాణిని వినిపించాడు. దీనితో ఆంధ్ర దేశం కూడా స్వరాజ్య ఉద్యమంలో ఉత్సుకతను చూపింది.

ప్రథమ ప్రపంచ సంగ్రామం తరువాత గాంధీ స్వాతంత్ర సంగ్రామంలో ప్రవేశించాడు. దాంతో జాతీయోద్యమ వైఖరే మారిపోయింది. 1919 మార్చి 18న మద్రాసులో బహిరంగ సభలో మాట్లాడుతూ ఆంధ్ర ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేసాడు. విజయవాడలో గాంధీ అధ్యక్షతన జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశం సత్యాగ్రహోద్యమానికి మరింత ఊపు నిచ్చింది. కాకినాడ సముద్ర తీరంలో బులుసు సాంబమూర్తి ఆధ్వర్యంలో తెలుగు జిల్లాలన్నింటిలో ఉప్పు సత్యాగ్రహానికి ప్రారంభం జరిగింది.

ఆంధ్ర రాష్ట్రంలో భారతదేశ స్వాతంత్ర సంగ్రామమే కాక ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం కూడా ఉద్యమం జరిగింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే విజ్ఞప్తి లిఖిత పూర్వకంగా 1911 డిసెంబర్ 12న జరిగింది.

1.13.2. ఆర్థిక, సామాజిక స్థితి:

ఆ కాలంలో ఆర్థిక స్థితిలో చాలా మార్పులు వచ్చాయి. 1850కి చేనేత పరిశ్రమ బ్రిటీష్ వారి మిల్లు వస్త్రాలతో పోటీపడలేక క్రమంగా అంతరించింది. ఆ పారిశ్రామికులు కూలీలుగా మారే స్థితి ఏర్పడింది. ఇంకా కొత్త వృత్తులు ఏర్పడ్డాయి. అవి లాయర్, ప్రభుత్వ ఉద్యోగాలు, కంట్రాక్టర్లు, కమీషన్ ఏజంట్లు, గుమస్తాలు, పత్రికల వారు, ఉపాధ్యాయులు. ఇవి చాలా తక్కువ మందికి అందుబాటులో ఉండేవి.

"కుల వ్యవస్థ, సమిష్టి కుటుంబ వ్యవస్థ, స్వయం సంపూర్ణ గ్రామ వ్యవస్థ క్రమంగా సడలిపోయాయి"(**సత్యనారాయణరావు, యండమూరి,ఉషఃకిరణాలు,1960, పుట.45–48**). ఆ కాలంలో మత, కుల తత్వాలు భయంకరంగా విజృంభించాయి. బ్రిటీష్ వారు తమ పాలనలో తమ ప్రయోజనాలు ప్రధానంగా చూసుకున్నారు. దాంతో దేశంలో ఆర్థికాభివృద్ధి కుంటుపడింది.ఆర్థిక

వనరులు అందుబాటులో లేనందువల్ల కుల, మత వర్గాలు సంఘర్షించాయి. ముందు నుండే వీటి మధ్య భేదాలున్నా, అవి ఆధునిక కాలంలో తీవ్ర రూపానికి చేరుకున్నాయి.

కులవృత్తులు పోవడంతో అందరూ పొట్ట కూటికి ఆంగ్ల విద్యను అభ్యసించసాగారు. అన్ని వృత్తులూ అన్ని కులాలవారు చేపట్టవచ్చుననే భావన ఏర్పడింది. విద్యావంతులు ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలనకు ప్రయాణం సాగించారు. దాంతో సమిష్టి కుటుంబ వ్యవస్థ క్షీణించింది. ఈ పరిస్థితులలో స్త్రీ విద్య, స్త్రీలకు పురుషులతోపాటు సమాన ప్రతిపత్తి కల్పించాలనే భావనలు ఏర్పడ్డాయి.

బ్రిటీష్ వారు రాక పూర్వం సామ్రాజ్యాలు మారినా, రాచరికాలు మారినా, విదేశీయుల దండయాత్ర వచ్చినా అవి గ్రామీణ వ్యవస్థపై అంత ప్రభావాన్ని చూపలేదు. బ్రిటీష్ వారు తమ ఆర్థిక వనరుల కోసం గ్రామీణ వ్యవస్థలోకి కూడా చొచ్చుకుపోయారు. దాని వల్ల కులవృత్తులు, చేతివృత్తులు క్షీణించిపోయి సాంప్రదాయ జీవనం చిన్నాభిన్నం అయిపోయింది. పట్టణ జీవన ప్రభావం గ్రామీణులపై కొంత కొంతగా పడసాగింది.

ఇవన్నీ భావకవిత్వం మీద చాలా ప్రభావాన్ని చూపాయి. కుల, మత విభేదాలు వద్దని, స్త్రీకి సాహిత్యంలో గౌరవనీయమైన స్థానం కల్పించి, గ్రామీణ జీవితం మీద కావ్యాలల్లారు. మారుతున్న సమాజంలో మంచిని, చెడ్డని తీసుకున్నారు. నారాయణ, అల్లా మానవులకు తండ్రి వంటివారు. మతం మనుషుల మధ్య ద్వేషాలు, రోషాలు తెచ్చేదైతే, ఆ మతం వద్దు. అది లోకానికి హితమైతే, హిందువులు, ముస్లింలు అందరూ మానవులు. అందరూ సోదరులు అని మానవులంతా ఒక్కటేనని కుల భేదాలను నిరసించారు భావకవులు.

భావకవుల కాలానికి పల్లెలన్నీ పట్టణవాసపు జీవన పద్ధతులను అంతర్ముఖంగా జీర్ణించుకుంటున్నాయి. దానివల్ల పల్లెపట్టు, పల్లీయుల ఆప్యాయతలు మెల్లమెల్లగా అంతరిస్తున్నాయి. ఈ విషయం ప్రకృతిని ఆరాధించే భావకవులకు బాధ కలిగించింది. అదే కవిత్వంలో గ్రామీణ జీవిత చిత్రణకు ఆస్కారం కలిగింది. విశ్వనాథ సత్యనారాయణ "ఋతు సంహారము" ఋతువులను గురించిన విశేషాలను చూపెడుతుంది. ఆయా ఋతువులలో పల్లెపట్టులలోని ప్రకృతిలో మార్పు, ప్రజల జీవిత రంగంలో జరిగే మార్పులను చిత్రించిన కావ్యమిది. దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు'లో

పాలం కాపుల జీవిత చిత్రణ కనిపిస్తుంది. వారి చర్యలకు, మనః ప్రవృత్తులకు ఋతువులతో సమన్వయం చేసి చూపెట్టాడు కవి. ఈయనే రాసిన 'వనకుమారి'లో పుట్టుకతో గొల్లవారు కాకున్నా ఇతర కులాలవారు పశులకాపరులుగా జీవించిన విధానాన్ని చిత్రించాడు. ఈ విధంగా ఆర్థిక, సామాజిక స్థితిలో వచ్చిన మార్పులు భావకవిత్వం ప్రతిబింబిస్తుంది.

1.13.3. విద్యా వ్యవస్థ:

19వ శతాబ్దానికి పూర్వం విద్యా విధానం గురుకుల పద్ధతిలో ఉంది. సంస్కృతం, శాస్త్ర విజ్ఞానం, తెలుగు సాహిత్య బోధన ఉండేది. ఆ కాలంలో గురువునే తల్లి, తండ్రిగా భావించి, వారి ఇంట్లోనే విద్య నేర్చుకునేవారు. ఈ విద్య చాలా కాలాన్ని తీసుకునేది.

లార్డ్ మన్రో బ్రిటీష్ వారి అవసరాలకు అనుగుణంగా క్రొత్త దృక్పథంతో ఆధునిక విద్యను మద్రాస్ ప్రెసిడెన్సీలో 1822లో ప్రవేశ పెట్టాడు. 1826కి పాఠశాలలను జిల్లాలలో, తాలూకాలలో మద్రాస్ సెంట్రల్ స్కూల్ పరిధిలో స్థాపించాడు. బ్రిటీష్ వారి దృష్టి ప్రభుత్వ పరిపాలనకు అవసరమైన గుమస్తాలను తయారుచేయడానికి ప్రజలకు తగిన శిక్షణ ఇవ్వడం, పాశ్చాత్య విధానాన్ని ప్రచారం చేయడం 1820లో మద్రాస్ స్కూల్ బుక్ సొసైటీని స్థాపించారు. పుస్తకాలు తక్కువ ధరకు లభించేటట్లు చేయడం, విద్యలో మార్పు చేయడం దీని విధి.

ఈ ఆంగ్ల విద్యావ్యాప్తి వల్ల భారతీయులు పాశ్చాత్య సంస్కృతి, విజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం కలిగింది. వారి దృక్పథంలో మార్పు వచ్చింది. పాశ్చాత్య సాహిత్యం, సంస్కృతి పరిచయం వల్ల యువకులలో క్రొత్త చైతన్యం కలిగింది. ఇది సామాజికంగా మార్పును తెచ్చింది. ఆంగ్ల విద్యను అభ్యసించే కాలంలో ఎందరో వ్యక్తులు ఉత్తమ లక్ష్యాలతో రాజకీయ, సాంఘిక పరిణామాలకు కారకులయ్యారు.

ఆనాటి విజ్ఞాన పరిశోధనల ఫలితంగా దేశీయుల భావాలు పూర్తిగా మారిపోయాయి. వైగ్లేన్ సినిమా యంత్రాలు కనుగొనడం వల్ల సాహిత్య విలువలే మారాయి. అంత వరకు సాహిత్యం విద్యావంతులకు మాత్రమే అందుబాటులో ఉండేది. సినిమాల వల్ల సాహిత్యం నిరక్షరాస్యులకు కూడా అందుబాటులోకి వచ్చింది. అచ్చు యంత్రం వల్ల సాహిత్య గ్రంథాలు అధికంగా ముద్రిత మయ్యాయి. పాఠకులు కూడా ఎక్కువయ్యారు. దాంతో భాషలో భారతాది కావ్యాలే కాక చరిత్ర, భూగోళం, భౌతిక

శాస్త్రం, జంతు శాస్త్రం, ఖగోళ శాస్త్రం, రసాయనికి శాస్త్రం, వృక్షశాస్త్రం, శారీరక ధర్మశాస్త్రం మొదలైన విజ్ఞాన శాస్త్ర విషయాలు కూడా చేరాయి. దాంతో ప్రజల దృక్పథంలో మార్పు వచ్చింది.

ముద్రణా యంత్రాల వల్ల వాడుక భాష బాగా ప్రచారం అయ్యింది. అప్పటి వరకు ఉనన్న మహాకావ్యాలు, ఛందోబద్ధమైన పద్యాలు తమ ప్రాబల్యాన్ని పోగొట్టుకున్నాయి. దేశ భాషలలో వచన వాఙ్మయం అభివృద్ధి చెందింది. క్రైస్తవ మిషనరీలు ఈ విషయంలో ఎక్కువగా తోడ్పడ్డారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో వాడుక భాష వల్ల సాహిత్యం ప్రజలకు సన్నిహితం అయింది. గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు దీనికి ప్రారంభకులు. గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం'తో ప్రజల భాషకు సాహిత్యంలో స్థానం కల్పించాడు. ఆంగ్ల విద్య వల్ల పత్రికల ప్రచురణ అధికం అయ్యింది. ఇవి సాహిత్యానికి ప్రోత్సాహం కల్పించాయి. పుటల పరిమితి వల్ల, పాఠకుల అభిరుచి వల్ల ఖండ కావ్యాలకు ఆదరణ పెరిగింది.

1.13.4. సాహిత్య స్థితి:

ఆధునిక కాలంలో సాహిత్యం చాలా మార్పులను పొందింది. పాశ్చాత్య సాహిత్యం చదవడం వల్ల సాహిత్య దృక్పథంలో మార్పు వచ్చింది. ఇంగ్లీషు రొమాంటిక్ కవుల ప్రభావంతో తెలుగులో భావకవిత్వం వచ్చింది. ఇతివృత్తంతోపాటు ఛందస్సులో కూడా మార్పు వచ్చింది. స్వతంత్ర భావాలతో స్వచ్ఛందంగా కావ్యరచన చేయడం మొదలయ్యింది. ఆ కాలానికి రాజుల పాలన అంతరించడంతో కవిత్వం సామాన్యులకు దగ్గరయ్యింది.

ఆధునిక యుగంలో రచనా విధానంలో చాలా మార్పులు వచ్చాయి. దీని మీద ఆంగ్ల విద్య, సంఘ సంస్కరణోద్యమం చాలా ప్రభావాన్ని కనబరిచింది. ప్రజల కోసం రచనలు చేయబడ్డాయి. సమాజంలోని సమస్యలు తీసుకుని జీవితాన్ని ఇతివృత్తంగా చేశారు. మాత్రా ఛందస్సులో రచనలు చేయబడ్డాయి.

స్థానిక ప్రజలతో సంబంధాలు పెట్టుకోవడం కోసం సంస్కృతి, సంప్రదాయాల అధ్యయనంలో భాగంగా తెలుగు భాషాధ్యయనం జరిగింది. తెలుగులో స్థానిక చరిత్రలు, గ్రంథాలు, శాసనాలు, నాణాలు సేకరించి తెలుగు వారి మత, సాంఘిక, సాహిత్యాది విషయాలను పరిశోధన చేసిన వారిలో కర్నల్ మెకంజీ ముఖ్యమైనవాడు. తనకు లభ్యమైన స్థానిక చరిత్రలను సేకరించి కొన్ని సంపుటాలుగా

రికార్డు చేయించాడు. వాటివల్ల ఆనాటి కవులు ప్రజలలో వాడుకలో ఉన్న కొన్ని కథలను ఇతివృత్తాలుగా తీసుకొని కావ్యాలు రచించడానికి అవకాశం ఏర్పడింది.

కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా చేసి క్రొత్త మార్గాలను అవలంబించాడు. శబ్ద చిత్రాలతో, చిత్ర కవితా రీతులతో, ప్రౌఢ సమాసాలతో కూడి ప్రబంధాల వల్ల సామాన్య జనులకు అంత మేలు చేకూరదని, కందుకూరి వీరేశలింగం 1887లో 'సరస్వతీ నారద సంవాదం' అనే ఖండ కావ్యంలో చెప్పాడు. కఠిన రచనా నియమాలతో కూడుకున్న ఆనాటి సాహిత్యం పడుతున్న దురవస్థను చిత్రించాడు.

కందుకూరి వీరేశలింగం సాంఘిక సంస్కరణను, గిడుగు రామమూర్తి భాషా సంస్కరణను తనలో సమన్వయించుకుని ఆధునికాంధ్ర సాహిత్యంలో క్రొత్త సంస్కరణను ప్రవేశ పెట్టినవాడు గురజాడ అప్పారావు (1862–1915). ఆయన మొదట ప్రాచీన వృత్తాలలో రచనలు చేసాడు. 1910లో ఈయన 'ముత్యాల సరాలు' అనే సంపుటిలో వ్యావహారిక భాషా సౌలభ్యం, వాస్తవికత, సాంఘిక జీవన చిత్రణం, ఛందస్సులో దేశీయత, అభ్యుదయ వైఖరి మొదలైన గుణాలు చోటు చేసుకున్నాయి. ఆనాటి కన్యాశుల్కానికి నిరసనగా 'పూర్ణమ్మ', 'కన్యక' గేయాలు రచించాడు. సామాన్యులను నాయకులుగా చేశాడు.

'ఆశుకవిత్వం' ప్రారంభం అయిన క్రొత్తలో, అందులో మాడభూషి వేంకటాచార్య కవి ప్రసిద్ధి చెందాడు. 19వ శతాబ్దం చివరి భాగం నుండి 20వ శతాబ్దం మధ్య భాగం వరకు తిరుపతి వేంకటకవులు తమ కవితా మాధుర్యంతో, అష్టావధాన శతావధానాశు కవిత్వ ప్రక్రియలతో ఆంధ్ర సాహిత్యానికి క్రొత్తదనాన్ని చూపించారు. అనవసరమైన భాష, అర్థం లేని పదాలతో ఉన్న కవిత్వానికి సహజత్వాన్ని కల్పించారు. వ్యావహారిక పదాలను యథేచ్ఛగా ప్రయోగించారు. వీరి కావ్యాలైన 'శ్రవణానందం', 'పాణీగ్రహీత'లు కందుకూరి వీరేశలింగం వేశ్యావృత్తి వ్యతిరేకోద్యమ ప్రభావంతో రచించినవి. ఇతివృత్తం సాంఘికం, రెండింటిలో వేశ్య నాయిక, బ్రాహ్మణ యువకుడు నాయకుడు. వేశ్యల పొందు సర్వానర్థాలకు బీజమని సందేశం రెండింటిలోనూ ఉంది. రచనా విధానం మాత్రం సాంప్రదాయ బద్ధంగానే నడిచింది.

1860లో సంస్కృత సంప్రదాయాలను అనుసరించి 'నాటకాలు' వచ్చాయి. మొట్ట మొదట తెలుగు నాటకం కోరాడ రామచంద్ర శాస్త్రి రచించిన 'మంజరీ మధుకరీయం' కందుకూరి వీరేశలింగం నాటక ప్రక్రియను అభివృద్ధి చేశాడు. ఆయన సంస్కృత రూపక నాటకానువాదం, ఆంగ్ల రూపకానువాదంతోపాటు స్వతంత్ర నాటక రచన కూడా చేశాడు. సాంఘిక వృత్తంతో స్వతంత్రంగా రచించిన వాటితో, 'బ్రహ్మ వివాహం' అనే ప్రహసనం మొదటిది. ఇందులో అంక విభజన, రంగ విభజన ఉంది కాని, మిగిలిన లక్షణాలేమి కనిపించవు. ఈ రూపకంలో ప్రధాన విషయం ఆనాడు సంఘంలో ప్రబలిన కన్యాశుల్కంపై నిరసన. ఇతివృత్తం సంఘంలోనిది కాబట్టి నవ్యత ఉంది. ఆ ప్రహసనంలో పాత్రలన్నీ సమకాలిక వ్యక్తులు.

కందుకూరి వీరేశలింగం రచించిన 'వ్యవహార ధర్మబోధిని' ప్రహసనంలోని పాత్రలన్నీ ఆనాటి సంఘంలో హేయవర్తనం కలిగిన మనుషులకు సంబంధించినవి. దీనిలో సంభాషణలు వ్యావహారికంలో ఉన్నాయి. సంఘంలోని దురన్యాయాన్ని, దురాచారాన్ని ఇందులో వర్ణించాడు. 'వివేక దీపిక' స్త్రీ పునర్వివాహం గురించి బోధించింది. ఈ విధంగా స్వతంత్ర సాంఘిక రూపకాలలో ఆనాటి పరిస్థితులనే ఇతివృత్తంగా తీసుకుని రచించాడు.

1987లో 'బాలీవాలా థియేటర్' అనే పేరుతో పార్శీ కంపెనీ ఆంధ్ర దేశ పర్యటనకు వచ్చింది. మిరుమిట్లు గొలిపే దుస్తులతో, వైర్‌వర్క్‌తో, విద్యుద్దీపాలతో నాటకాలు ప్రదర్శించారు. ఆ నాటకాలను చూసి తెలుగువారూ రంగస్థలంలో పార్శీ మట్లులో పాడడం, స్త్రీలు స్త్రీ పాత్రలు ధరించడం ప్రారంభమయింది. కొన్ని కుటుంబాలవారు (సురభి నాటక సమాజం వంటివి) నాటకాలు వృత్తిగా ప్రదర్శించడం ప్రారంభించారు.

నాటకాలలో వినూత్న ప్రయోగం గురజాడ అప్పారావు చేశాడు. 'కన్యాశుల్కం' నాటకం 1897లో ప్రదర్శించబడింది. ఆ తరువాత అది సంస్కరించి రాయబడింది. అది నిత్య వ్యావహారిక భాషలో, హాస్య రస ప్రధానంగా రచింపబడింది. ఈ నాటకంలో కన్యాశుల్కం నిరసనం, విధవా వివాహం, వేశ్యా వ్యతిరేకోద్యమం వంటి సంఘ సమస్యలు సృజించబడ్డాయి. సామాన్యులే పాత్రలు. ఆనంద గజపతి ఆదరణ క్రింద విజయనగరంలో ఉన్న నాటక సమాజం వారు ఒక పాఠశాల వార్షికోత్సవంలో దీన్ని ప్రదర్శించారు.

ప్రారంభంలో 'కథావాఙ్మయం', కాశీమజిలీ కథలు, బాలనాగమ్మ కథ, దేశింగురాజు కథ, పల్నాటి యుద్ధం, కాంభోజరాజు కథ వంటి వాటికే పరిమితం అయ్యింది. 19వ శతాబ్దంలో కందుకూరి వీరేశలింగం, రఘుపతి వేంకటరత్నం సంఘ సంస్కరణల ప్రభావం తెలుగు కథానిక మీద కూడా పడ్డాయి. ఇతివృత్తంలో, శైలిలో ఆధునికతను సంతరించుకున్న తొలి కథానిక గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' ఆ కాలంలో వచ్చింది. ఆనాటి సమాజ పరిస్థితులను ప్రతిబింబించేది ఈ కథ. వేశ్యావ్యామోహంలో పడిన భర్తను మార్చే స్త్రీ కథ ఇది. అలాగే మతం పేరిట సాగే మూఢ విశ్వాసాలను 'మీ పేరేమిటి?'లో చూశాడు. ఒకరిని సంస్కరించబోయి తానే గోతిలో పడ్డ సంస్కర్తను 'సంస్కర్త హృదయం'లో చిత్రించాడు. ఈయన తన రచనను ఆనాటి భాషలో రచించాడు. ఆ తరువాత కథాసాహిత్యం అభివృద్ధి చెందింది.

పాశ్చాత్య పద్ధతి ననుసరించి 19వ శతాబ్దం ఉత్తరార్ధంలో వచ్చిన ప్రక్రియ 'నవల'. 1978లో కందుకూరి వీరేశలింగం రాసిన 'రాజశేఖర చరిత్ర' మొదటి నవల. కాని దానికి ఆంగ్లంలో మూలం ఉంది. చిలకమర్తి లక్ష్మీనరసింహం 'రామచంద్ర విజయం'లో కోనసీమలోని కొబ్బరి తోటలను, గోదావరీ తీర ప్రాంత సీమలను వర్ణించాడు. సున్నితమైన హాస్యం, ఉత్తమ పాత్ర చిత్రణ, స్థానిక ప్రదేశ వర్ణన ఆ నవలలో ప్రత్యేకతలు.

కాల్పనికోద్యమ లక్షణాలను నవలా రచనలో ప్రవేశ పెట్టిన వారిలో గుడిపాటి వేంకటచలం ప్రముఖులు. సమాజంలో నీతి చేర జరుగుతున్న అన్యాయాన్ని నిర్భయంగా ఎదిరించి, స్త్రీ స్వేచ్ఛను గురించి తీవ్రంగా పోరాడిన వ్యక్తి ఇతడు. మైదానం, శశిరేఖ, కన్నీటి కాలువ, దైవమిచ్చిన భార్య, బ్రాహ్మణీకం, అమీనా మొదలైన నవలలో చలం స్వేచ్ఛాప్రణయాన్ని చూపాడు.

పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో కొట్టుకుపోతున్న వ్యవస్థను పూర్వుల నైతిక జీవనం వైపుకు త్రిప్పి క్రొత్త వ్యవస్థను సృష్టించాలని విశ్వనాథ సత్యనారాయణ ప్రయత్నించాడు. ఆర్ష ధర్మానికి, వ్యక్తిగత హృదయ స్పందనకు మధ్య సంఘర్షణ 'ఏకవీర' కథ. అది కవిత్వ స్థాయినందుకున్న ఉత్తమోత్తమ నవల. భావకవిత్వంలోని కాల్పనిక దృక్పథం అందులో ఉంది.

పాశ్చాత్య ప్రభావం వల్ల పత్రికా ప్రచురణ ప్రారంభం అయ్యింది. 1835లో మొదటి పత్రిక బళ్లారి క్రైస్తవ సంఘం వారిచే ప్రచురింపబడింది. సాహిత్య విమర్శలకు, నూతన గ్రంథ ప్రచురణకు

ప్రాధాన్యం ఇచ్చిన పత్రికలు చాలా వచ్చాయి. సుజనరంజని, ఆంధ్ర భాషా సంజీవనీ, వివేక వర్ధిని, చింతామణి, అముద్రిత గ్రంథ చింతామణి వంటివి చెప్పుకోదగ్గవి. వాటి పరిధి తక్కువ కాబట్టి. ఖండకావ్యాలకు ప్రాచుర్యం ఏర్పడింది, భావకవిత్వానికి దోహదం చేశాయి.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతర కవులు అంతర్జాతీయంగా శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వాలను ఆకాంక్షించారు. భావకవిత్వం ఆ అవసరాలను తీర్చలేక పోయింది. అభ్యుదయ కవిత్వం దాన్ని సాధించింది.

1.14. భావకవిత్వోద్యమం–అభివృద్ధి వికాసాలు:

భావకవిత్వం దేశంలోని రాజకీయ, ఆర్థిక, విద్యా వ్యవస్థలలోని మార్పుల వల్ల ఉద్యమంగా ప్రచారం పొందింది. భావ కవులంతా కవిత్వ ప్రచారానికి 1919లో 'సాహితీ సమితి'ని స్థాపించారు. దీని ఉద్దేశ్యం ఆంగ్ల, వంగ సాహిత్యాల పరిచయంతో క్రొత్త సాహిత్య సృష్టి చేయాలన్నది.

1.14.1. సహకవి సమ్మేళనం:

భావకవిత్వ ఆరంభ దశనుంచే సమభావం ఉన్న తోటి కవులంతా విడిగా కలిసి పరస్పరం తమ కవితలను వినిపించడం, వేదికల మీద సమావేశం అయి తమ కవితలను కవిత్వాభిమానులకు వినిపించడం ఒక ఆచారంగా మారింది. ఉర్దూ ముషాయిరా పద్ధతిలో నేటి కవి సమ్మేళనాలకు ఆనాడే అంకురార్పణం జరిగింది.

1.14.2. సాహితీ సమితి:

1916లో తల్లావర్ఝుల శివశంకరశాస్త్రి ప్రాచీన సాహిత్యాన్ని సమీక్షించి యువ కవులలో నూతన దృక్పథాన్ని కలిగించాడు. 1918కి ఆయన ఆ కవులందరినీ కూడగట్టి 'సాహితీ సమితి' స్థాపించాలనే కోరిక కలిగింది.

1.14.2.1. సాహితీ సమితి సభ్యత్వార్హత:

"బహుకాల పరిచయం, అన్యోన్య ఆదరానురాగాలు, మనస్సుల కలయిక, భారతీయ సంస్కృతీ సంప్రదాయ విద్యలపై లక్ష్యం, శాంత చిత్తంతో వినయంతో పనిచేయు స్వభావం, కళ, భాష, విద్యాశాస్త్రాదులలో దేనియందైనా ప్రావీణ్యం, అమంగళకరాలు, జుగుప్సాకరాలైన వాటిని

పరిహరించి, ఉదాత్తాలు ఉల్లాస ప్రదాలు, విజ్ఞానదాయకాలైన కృషులు నెరవేర్పగల వారితో 'సాహితీ సమితి' వర్థిల్లింది " **(సీతారామ భట్టాచార్యులు, కురుగంటి, హనుమంతరావు, పిల్లలమఱ్ఱి , నవ్యాంధ్ర సాహిత్య వీధులు, 1949. పుట.295–300).**

ఈ సమితి తెనాలిలో స్థాపించబడింది., ఈ సమితిలో కవిత్వం, లలిత కళల పట్ల విశేషాభిమానం ఉన్న అనేక మంది యువకులు కలిసారు. అంతా ఆంగ్ల సాహిత్యాన్ని చదివి అవగాహన చేసుకున్నవారే. బెంగాలీ, హిందీ మొదలైన భాషలను అభ్యసించి, ఆ భాషలలో కావ్యాలను చదివారు. నిరంతరం సాహిత్య గోష్ఠితో, చమత్కార భాషణలతో కాలం గడిపేవారు. కీర్తి, కామం, స్వార్థం, అహంకారం వాళ్ల మనసులను కలుషితం చేయలేదు.

ఈ సమితికి తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి సభాపతి. చిన్నవాళ్లని కొందరి విషయంలో, వాళ్ల కోరికలు తీర్చుకోనియ్యమని కొందరి విషయంలో, భావన నీ ఇష్టం. భావం మాత్రం సవ్యంగా ఉంటే చాలునని కొందరి విషయంలో, రెండింటి యందు నవ్యత చూపగల వాళ్లను ప్రోత్సహిస్తూ అందరినీ కూడదీసుకుని కార్యసాధన చేయడమే ఈయన సభాపతిత్వం.

1.14.2.2. సాహితీ సమితి స్థాపన సభ్యులు:

తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి, చింతా భీమశంకరం, చింతా దీక్షితులు, నోరి నరసింహశాస్త్రి, కొడవటిగంటి వెంకట సుబ్బయ్య, త్రిపురారిభొట్ల వీరరాఘవస్వామి, పెద్దిభొట్ల పూర్ణశర్మ, వర్ధు బాబురావు, కొమ్మూరి హనుమంతరావు, కోపల్లె శివకామేశ్వరరావు, ముని మాణిక్యం నరసింహారావు, పెద్దిభొట్ల రామచంద్రరావు, చామర్తి రాజశేఖరరావు, కొత్తపల్లి సుబ్బన్నాచార్యులు సాహితీ సమితిలో ప్రథమ సభ్యులు. 1919లో ఈ సమితి స్థాపించబడింది.

1.14.2.3. సాహితీ పత్రిక:

1920లో 'సాహితీ' పత్రిక వచ్చింది. ఆ తరువాత వేదుల సత్యనారాయణ శాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వింజమూరి వేంకట రత్నమ్మ (అనుసూయ పత్రికా సంపాదకురాలు), కొప్పర్తి నారాయణమూర్తి, నూతక్కి రామశేషయ్య, కొమాండూరు కృష్ణమాచార్యులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు, నండూరి వేంకట సుబ్బారావు, నాయని సుబ్బారావు, వింజమూరి పార్థసారధి, శ్రీనివాస శిరోమణి సాహితీ సమితిలో చేరారు. గిడుగు

రామమూర్తి తరువాత గౌరవ సభ్యులుగా చేరడం విశేషం. ఆ తరువాత పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, అడవి బాపిరాజు, రాయప్రోలు సుబ్బారావు, కురుగంటి సీతారామ భట్టాచార్యులు ఈ సమితి సభ్యులయ్యారు.

సాహితీ పత్రిక తల్లావజ్ఝుల శివశకంరశాస్త్రి సంపాదకత్వం క్రింద వెలువడుతూ వచ్చింది. ఈ పత్రిక నవ్యసాహిత్య ప్రచారానికి బాగా తోడ్పడింది. గిడుగు వ్యావహారిక భాషోద్యమానికి సాహితీ సమితి పక్షాన సాహితీ పత్రిక దోహదం చేసింది. గ్రాంథిక వాదులైన ఈ సమితి సభ్యులలో క్రమంగా వ్యావహారిక భాషపై ఆదరణ కలగడం ప్రారంభం అయ్యింది. సాహితీ సంచికలలో చాలా భాగం వ్యావహారిక భాషా రచనలున్నాయి.

ఈ సమితి, పత్రిక నవ్యసాహిత్యానికి చేసిన సేవ అపారమైంది. ఈ సాహితీ పత్రిక దోహదమిచ్చిన సాహితీ ప్రక్రియలు ఖండకావ్యం, చిన్నకథ, పెద్ద నవల, ఏకాంకిక. ఈ క్రొత్త ప్రక్రియలకు, రీతులకు తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి పునాది చేశాడు. ఈయన అనేక యువకవులను తయారుచేసి వారిచేత కవితా సాధన చేయించాడు.

1.14.2.4. సంఘాలు:

సాహితీ సమితి సభ్యులు పరస్పరం కావ్యాల్ని గూర్చి, కష్టసుఖాలను గూర్చి ఉత్తరాలు రాసుకునేవారు. వీటివల్ల ఆ సమితికి 'అన్యోన్యం మెచ్చుకునే సంఘం' అనే పేరు వచ్చింది. సాహితీ సమితిని చూచి రాష్ట్రం అంతా అనేక సాహిత్య కూటాలు ఏర్పడ్డాయి. అనంతపురంలో 'కౌముదీ సమితి', సికింద్రాబాదులో 'సాధన సమితి', విజయవాడలో 'వ్యాస సారస్వత సమితి', నరసరావుపేటలో 'నవ్య కళాపరిషత్తు', ఏలూరులో 'సాహిత్య మండలి', భీమవరంలో 'రవీంద్ర సారస్వత సమాజం', వరంగల్‌లో 'కాకతీయ కళాసమితి', హైదరాబాద్‌లో 'వివేక వర్ధినీ' ఘంటసాలో 'దేశీయ కవితా మండలి', విశాఖపట్టణంలో 'కవితా సమితి' ఇలా ఏర్పడినవే.

"నేటి కాలపు కవిత్వం, చాకిరేవు, సాహిత్య కల, శుక్ల పక్షం వంటి విమర్శలు ఆనాటి భావకవుల కవిత్వం మీద వ్యతిరేకతతో వచ్చాయి" **(హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి.కృష్ణాపత్రిక, వజ్రోత్సవ సంచిక.పుట.66–71**). వాటన్నిటిని భావకవులు కలిసి ఎదుర్కొన్నారు. వాటిని ఖండిస్తూ ఉపన్యాసలివ్వడం కాకుండా, ఇంకా ఉత్సాహంతో భావకవిత్వాన్ని రాయడమే సమాధానంగా

భావకవులు భావించారు. పూర్వ కవిత్వం కన్నా భిన్నంగా వీరు వ్యావహారిక భాషలో కవిత్వం రాయడానికి ప్రయత్నించారు. ఈ రచనా వ్యాసాంగమే కాక 1923 నుండి దేవులపల్లి కృష్ణశాస్త్రి నవ్యకవితా పఠనంతో దేశమంతా తిరిగి ప్రచారం కల్పిస్తూ, నవ్య సాహిత్యానికి ఆధునికాంధ్ర సాహిత్యంలో తిరుగులేని పీఠం వేసాడు. దీంతో సభారంజకంగా ఉపన్యసించడం కళగా మారింది.

1.14.3. నవ్య సాహిత్య పరిషత్తు:

1993 మార్చి 10, 11, 12 బరంపురంలో జరిగిన 'అభినవాంధ్ర కవి పండిత సభ'లో ప్రముఖ పాత్ర వహించిన పెద్దలు సాహితీ సమితి అనే పేరును మార్చి 'నవ్య సాహిత్య పరిషత్తు' అనే పేరు పెట్టారు. క్రమంగా దీని స్థానం గుంటూరుకు మారింది. 1939 ఫిబ్రవరిలో ఆ ఉత్సవం జయప్రదంగా జరిగింది. దీని ఆశయాలు నవ్య కవిత్వాన్ని రచించడం, దాన్ని ప్రోత్సహించడం. నవ్య కవిత్వాభివృద్ధిని పరిశీలించడం, నవ్య కవిత్వానికి గౌరవం కల్పించడం. 1936లో ఈ ఉద్యమ ప్రచారానికి 'ప్రతిభ' అనే పత్రిక స్థాపించబడింది. ఆనాటి నుండి ఒక లక్ష్యసిద్ధితో ఆంధ్రదేశంలోని వివిధ పట్టణాలలో సమావేశాలు ప్రారంభం అయ్యాయి.

"రాజమండ్రిలో రాయప్రోలు సుబ్బారావు (1933) అధ్యక్షతన, అనంతపురంలో పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి (1936) అధ్యక్షతన, గుంటూరులో గిడుగు సీతాపతి (1937) అధ్యక్షతన, బందర్‌లో బుర్రా శేషగిరిరావు (1938) అధ్యక్షతన, బెజవాడలో విశ్వనాథ సత్యనారాయణ (1940) అధ్యక్షతన, మద్రాసులో అడవి బాపిరాజు (1941) అధ్యక్షతన, ఏలూరులో దేవులపల్లి కృష్ణశాస్త్రి (1942) అధ్యక్షతన, తెనాలిలో కాటూరి వేంకటేశ్వరరావు (1944) అధ్యక్షతన ఈ పరిషత్తు సమావేశాలు జరిగాయి."(**శివప్రసాద్, ముదిగొండ.'సాహిత్యోద్యమాలు–భావకవిత్వోద్యమం', 1990, పుట. 105**). ఈ సమావేశాలలో నవ్య సాహిత్య రచనలెన్నో పరిచయమయ్యాయి.

1.14.3.1. నవ్య సాహిత్య పరిషత్తు–ఆశయాలు:

నవ్య సాహిత్య పరిషత్తు స్థాపనకు ప్రధాన కారకులు గురు భాగవతుల ధర్మారావు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, ప్రథమ సభాధ్యక్షులు డా. చిలుకూరి నారాయణరావు. ఈ పరిషత్తు

స్థాపన కాలంలో చేసిన కొన్ని తీర్మానాల వల్ల సాహితీ సమితి నాటి ఆశయాలకు విశాల ప్రాతిపదిక ఏర్పాటు చేయడంగా దీన్ని అర్థం చేసుకోవచ్చు.

1) 'నవ్య సాహిత్య రచన చేయడం, నవ్య సాహిత్యం దేశంలో ఏ విధంగా ఉత్పత్తి అవుతుందో పరిశీలించి అందులోని బాగోగులు విమర్శించడం, నవ్య వాఙ్మయాన్ని గురించి అపోహలు తొలగించుటకు ఆ వాఙ్మయాన్ని ప్రచారం చేయడం, వచన వాఙ్మయం సాధ్యమైనంత వరకు పద్య వాఙ్మయాన్ని ప్రజలకు సుపరిచితమైన వ్యావహారిక భాషలో రచించి ప్రజలను విజ్ఞానవంతులను చేయడం" (**సీతారామ భట్టాచార్యులు, కురుగంటి మరియు పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు,నవ్యాంధ్ర సాహిత్య వీధులు,1949, పుట.510–512**).

2) వ్యావహారిక భాషను ప్రచారం చేయడం. వ్యావహారిక భాషలో విద్యాభ్యాసం జరపాలని ప్రభుత్వాన్ని కోరడం.

3) ఆంధ్ర కళాపరిషత్తు, మద్రాస్ కళాశాల ఇంటర్‌మీడియట్, బి.ఏ. కోర్సులలో నవ్య కావ్యాల అభ్యాసానికి ఎక్కువ అవకాశం ఇప్పించాలని తెలుగు బోర్డ్ ఆఫ్ స్టడీస్‌ను కోరడం.

1.14.3.2. 'ప్రతిభ' పత్రిక:

1936లో ఏర్పడిన 'ప్రతిభ' నవ్వుల రచనలను ప్రచారం చేస్తూ, నవ్య సాహిత్య ప్రచారానికి కేంద్రంగా మారింది. మొదటి సంపుటంలో పరిషత్తు నాలుగవ, అయిదవ వార్షిక సభలలో అధ్యక్షత వహించిన పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, గిడుగు రామమూర్తి నవ్య సాహిత్యోద్యమం గురించి చేసిన ఉపన్యాసాలు, భాషా చరిత్రకు సంబంధించిన వ్యాసాలు, సారస్వత సభకు సంబంధించిన పది వ్యాసాలు ప్రకటించింది. కృష్ణశాస్త్రి కృతులు, పురిపండా అప్పలస్వామి, కొడాలి ఆంజనేయులు, గుర్రం జాషువా, అడవి బాపిరాజు, కవికొండల వేంకటరావు వంటి కవుల రచనలు చేసేవారు.

1.14.3.3. నవ్య సాహిత్య గ్రంథాలు:

ప్రేమ గ్రంథమాల పేరుతో సంస్థ స్థాపించబడి, 'ప్రేమాంజలి' వంటి ఖండకావ్యాలను ప్రచురించింది. వఝ్ఝుల వేంకటేశ్వరుడు 'నౌకాభంగం' పేరుతో టెన్నిసన్ రాసిన ఈనక్ ఆర్డెన (Enoch Arden)ను అనువాదం చేశాడు. 'ప్రతిభ' పత్రికను చూస్తే ఖండకావ్య కర్తలే గ్రంథ విమర్శ చేసేవాళ్లుగా కనబడతారు. ఇది నవ్య సాహిత్య పరిషత్తు క్రింద జరిగిన గొప్ప విశేషం.

1.15. భావ కవిత్వం–దశలు:

నవ్య కవిత్వం, భావ కవిత్వం మొదట పర్యాయపదాలుగా వాడబడ్డాయి. రాను రాను ఆలోచనలలో మార్పు కలిగి, ఆ పదాలు రెండూ వేరు చేయబడ్డాయి. గురజాడ అప్పారావు 1910 నుండి కవిత్వంలో నవ్యత్వాన్ని సాధించి, నవ్య కవిత్వానికి ప్రచారం కల్పించాడు. భావ కవిత్వానికి రాయప్రోలు సుబ్బారావు ప్రచారం తెచ్చాడు.

1.15.1. ఆరంభ దశ (1910–1916):

ఈ దశలో ప్రధానంగా కనిపించే లక్షణం పురాణ ప్రబంధాలలో చెప్పబడిన శృంగారానికి భిన్నమైన శృంగారాన్ని ప్రవేశపెట్టడం. భావ కవులు సంభోగ శృంగారం కన్నా వియోగ శృంగారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. 'ప్రణయ' శబ్దాన్ని 'శృంగార' శబ్దానికి బదులుగా వాడారు. స్త్రీ, పురుషుల మధ్య ప్రేమే కాకుండా స్నేహం కూడా ఉంటుందని భావించారు. ప్రేమ తత్వాన్ని భావకవులు తనివితీరా వర్ణించారు.

పరిసరాలలోనే ప్రకృతి భావకవిత్వంలో ప్రతిబింబించింది. భక్తితో హృదయాన్ని నైవేద్యంగా ఉంచి పూజించడం, ఆత్మీయుల మరణాన్ని స్మృతి పూర్వకంగా చెప్పడం ఈ కవిత్వంలో కనిపిస్తుంది. రాయప్రోలు సుబ్బారావు, వేంకట పార్వతీశ్వర కవులు, బసవరాజు అప్పారావు, అబ్బూరి రామకృష్ణారావు ఈ దశలో కనిపించే భావకవులు.

వియోగ శృంగారాన్ని దృష్టిలో పెట్టుకుని రాయప్రోలు సుబ్బారావు 'అమలిన శృంగారం' అనే తత్వాన్ని ప్రతిపాదించాడు. ఇది లౌకిక వాసనలకు అతీతమైంది. దీనిని 'తృణకంకణం' కావ్యంలో ప్రవేశ పెట్టాడు. పదునాలుగేండ్ల పడుచు వివాహానంతరం పూర్వపు చెలికాణ్ణి కలుసుకుని తమ ఇద్దరి మధ్య ఎప్పటిలాగే స్నేహం విలసిల్లాలని ఆకాంక్షిస్తుంది. ఆ స్నేహానికి గుర్తుగా తృణకంకణాన్ని కట్టమంటుంది. పెళ్లయిన అమ్మయి అలా పరపురుషుణ్ణి కోరడం ఆనాడు అంగీకార యోగ్యం కాదు. ఈ సిద్ధాంతానికి తరువాతి కవులెవరూ అంత ప్రచారం కల్పించలేదు. దీనిలోని వియోగ శృంగారాన్ని మాత్రం పాటించారు.

రాయప్రోలు సుబ్బారావు పరిసరాల ప్రకృతినే కావ్యాలలో వర్ణించాడు. తృణకంకణాన్ని 'నీరదసుత'కు అంకితం ఇవ్వడం, ఆయనకు గల ప్రకృతి ప్రీతిని వ్యక్తం చేస్తుంది. ఆయన కొబ్బరి చెట్లు, పొన్నచెట్లు, వెదురు పొదలు వంటి వాటిని వర్ణించాడు.

విగ్రహారాధనా ప్రసక్తి భగవదారాధనా భావం, హృదయాన్ని నైవేద్యంగా సమర్పించదలచడం వేంకట పార్వతీశ్వర కవుల ''ఏకాంత సేవ'లో కనిపిస్తుంది. ఇది ఆధునికమైన భావన. ప్రవిమల భక్తిమంతుడైన భక్తుడు పరమేశ్వరుని గూర్చి పాడే ప్రణయగీతం ఈ కావ్యం. బసవరాజు అప్పారావు తన గేయాలలో ప్రేమ తత్వాన్ని ప్రబోధించాడు. ఆయన లౌకిక ప్రేమనే వర్ణించాడు. ప్రేమను అనుభవించకుండా బ్రతికేకంటే, ప్రేమించి విఫలం చెంది విలపించడం మేలు అని చాటాడు. ఇంకా ఆయన లైలామజ్ను, తాజ్‌మహల్, గోపికా కృష్ణులు వంటి వారి ప్రేమగాథలకు కవితా రూపం కల్పించాడు. బిడ్డ మరణించిన దుఃఖాన్ని వర్ణిస్తూ ఇల్లు ఖాలీ చేసి వెళ్లి పోయాడు అని పేర్కొన్నాడు. ఇది స్మృతి గీతం.

అబ్బూరి రామకృష్ణారావు ప్రేమలో మాతృప్రేమ, క్షణిక ప్రేమ, పూర్వ ప్రేమ అనే కొత్త విభాగాలు చేర్చాడు. 'పూర్వ ప్రేమ' అనేది ఒక కావ్యఖండం.

1.15.2. వికాస దశ (1917–1921):

ఈ దశలో కవులు ఎక్కువగా గ్రామీణ వాతావరణాన్ని చిత్రీకరించారు. దానిలో పల్లెసీమలు, జానపదుల జీవనం, జానపదుల దాంపత్య వర్ణన చేసారు. మానవేతర ప్రకృతిని మానవీకరణం చేయడం ప్రకృతి చిత్రీకరణలో ముఖ్యమైంది. ఊహా ప్రేయసులను కావ్యాలలో పొందుపరచడం ఆరంభమయింది. ఈ దశలోని ముఖ్యమైన లక్షణం ప్రకృతిని కవిత్వంలో వస్తువుగా చేసి కావ్యం రచించడం, పింగళి కాటూరి కవులు, దువ్వూరి రామిరెడ్డి, కవికొండల వేంకటరావు, అడివి బాపిరాజు, నండూరి సుబ్బారావు, తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి ఈ దశలో కనిపించే భావ కవులు.

పింగళి కాటూరి కవులు ప్రకృతిని, పరిసర జనజీవనాన్ని కవిత్వంలో భాగంగా చేశారు. వారు 'తొలకరి' కావ్యంలో గ్రామ జీవన శోభను వర్ణించారు. దీనిలో 'సంక్రాంతి' పండుగ విశేషాలను వివరించారు. ధాన్య సంపద ఇంటికి చేరడం, హరిదాసు మేలుకొలుపు, ఇంటి ముంగిట ముగ్గులు, గొబ్బిళ్లు, కొత్త పెండ్లి కొడుకు అత్తవారింటికి రావడం, పేరంటం మొదలైనవి వర్ణించారు.

దువ్వూరి రామిరెడ్డి 'వనకుమారి'లో ప్రకృతిని స్త్రీగా భావించి, ప్రకృతి సౌందర్య వర్ణనతో భావకవిత్వంలోకి అడుగుపెట్టాడు. 'కృషీవలుడు'లో పల్లెసీమను వర్ణించాడు. పల్లీయుల కార్యకలాపాలను చిత్రీకరించాడు. ఆయన రచనలలో ప్రకృతి సహజ సౌందర్యం, శ్రమజీవి జీవిత సౌందర్యం వెల్లి విరిసింది.

కవికొండల వేంకటరావు రచనలు ఎక్కువ భాగం జానపదుల సౌందర్య చిత్రీకరణతో కూడి ఉంటాయి. ఆయన మానవేతర ప్రకృతిని, మానవ ప్రకృతిని కవిత్వంలో పొందుపరిచాడు. 'కూలియన్నల కుతుకము'లో కూలీ చేసుకొని బ్రతికే స్త్రీ పురుషులను వర్ణించాడు. అడవి బాపిరాజు పడవ సరంగు, ఆంధ్రయాచక దంపతులు, గంగిరెద్దు దాసు మొదలైన వివిధ వృత్తుల వారిని చిత్రీకరించాడు. 'గోధూళి'లో పల్లెజనుల సౌందర్య చిత్రణ ఉంది. 'శశికళ' ఆయన కవిత్వంలోని ఊహా ప్రేయసి. ఆయన ఆశయమూర్తి, ఆత్మ పూజా పీఠస్థ శిల్ప కళాలక్ష్మి.

నండూరి సుబ్బారావు 'యెంకి పాటలు' జానపదుల దాంపత్య ప్రేమను కర్షకుల భాషలో పలికించిన రచన. నిర్మలమైన దాంపత్య ప్రేమ యెంకి నాయుడు బావలలో కనిపిస్తుంది. మొదట కర్షకుల వాతావరణాన్ని స్ఫురింపజేసే ఉద్దేశంతో కర్షకుల భాషను వాడాడు. చివరకు యెంకి నాయుడు బావలు ప్రేమ యోగులవడంతో అది కొంత గ్రాంథిక భాషలోకి మారింది.

తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి 'హృదయేశ్వరి' ఒక యువకుని ప్రేమోదంతం. ఈ కావ్యంలో హృదయేశ్వరిని 'అమ్మ' అని సంబోధించి అంకితం ఇవ్వడం ఒక కొత్తదనం. ఈ హృదయేశ్వరి ఊహా ప్రేయసి. ఆమె కోసం ఆరాటపడడం, విరహావస్థలను అనుభవించడం వంటివి ఈ కావ్యంలో వ్యక్తమయ్యాయి.

1.15.3. పరిణామ దశ (1922–1940):

ఈ దశలోని భావకవిత్వంలో శృంగారం, భక్తి, స్మృతి, ప్రకృతి, స్వేచ్ఛ వంటి లక్షణాలు అంతటా కనిపిస్తాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి కావ్యాలలో ఇవి ఎక్కువ. కవి మానవేతర ప్రకృతికి మానవత్వ ఆరోపణ చేసి మానవ భావాలను ప్రదర్శించాడు. ఈ దశలోని కవులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, నాయని సుబ్బారావు మొదలగువారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి వేషభాషలలో భావ కవిగా ప్రసిద్ధి చెందాడు. 'కృష్ణ పక్షం' దుఃఖానికి ప్రతీక. ఈ కవి విషాదంలో ఆనందాన్ని చవిచూసాడు. 'ప్రవాసం'లో మిత్రస్మృతి, 'ఊర్వశి'లో ఊహా ప్రేయసి చిత్రణ ఉంది. 'మహతి', 'ఋగ్వీథి', 'తిరుప్పావు' భక్తి ప్రబోధకాలు.

వేదుల సత్యనారాయణ శాస్త్రి 'దీపావళి'లో కవే నాయకుడు. కవి సూటిగా తన అనుభవాలను చెబుతాడు. దీపావళి నాటి అమావాస్యలాగా కవి మనస్సు చీకటితో నిండి పోయింది ఈ కావ్యంలో. విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని పాటలు'లో మానవేతరాలకు మానవత్వాన్ని ఆపాదించాడు. కిన్నెరసాని వాగుకు స్త్రీత్వాన్ని, పర్వతానికి పురుషత్వాన్ని ప్రతిపాదించాడు. వీరి మధ్య కథ సాగిపోయింది. అత్తాకోడళ్ల ఆరళ్లు వంటి జీవిత సమస్యలను కిన్నెరసాని పాటలలో చెప్పాడు.

జీవితానుభవాలు కావ్యాలుగా రచించినవాడు నాయని సుబ్బారావు. తన ప్రియురాలు వత్సలను దక్కించుకోవడానికి నాయని సుబ్బారావు పొందిన వేదన 'సౌభద్రుని ప్రణయ యాత్ర'. 1924లో పరమపదించిన తల్లి స్మృతిలో రచించిన కావ్యం 'మాతృ గీతాలు'. కవి వివాహం కాకముందు ప్రియురాలిని తనవైపు త్రిప్పుకోవడానికి, ఆవిడ పూజించే దేవిని అర్చించి కామ్యార్థసిద్ధికి ఆశువుగా చెప్పిన పద్యాలు'సౌందర్య లహరి'.

1930 వరకు భావకవిత్వం ఉచ్ఛదశలో ఉంది. ఆ తరువాత వ్యక్తీకరణతో శాబ్దికతకు ప్రాధాన్యం ఏర్పడి అర్థ గాంభీర్యం అడుగంటి పోయింది. ఆత్మ వ్యక్తీకరణ ధోరణి ముదిరిపోయి సంఘ దృష్టి మరుగున పడిపోయింది. దాంతో తిరుగుబాటుగా అభ్యుదయ కవిత్వం చచ్చింది. 1940 వరకు అక్కడక్కడ భావకవితా ఛాయలు కనిపిస్తూనే ఉన్నాయి. ప్రముఖ అభ్యుదయ కవి శ్రీశ్రీ కూడా తొలుత భావకవితా ధోరణి ప్రభావం నుండి తప్పించుకోలేక పోయాడు.

1910 నుండి 1930 వరకు భావకవిత్వం ఉద్యమంగా అభివృద్ధి చెందింది. భావకవుల రచనలన్నీ పూర్వ కవిత్వం మీద తిరుగుబాటుగా వచ్చినవే. భావనకు కవిత్వంలో అధిక ప్రాధాన్యం ఇచ్చి భావకవిత్వం ఆధునికాంధ్ర సాహిత్యంలో స్థానాన్ని పదిలపరుచుకుంది. క్రమ క్రమంగా ఈ కవిత్వం పెడదారులు పట్టింది. భావ కవులు నేల విడిచి సాము చేయడానికి పూనుకున్నారు.దాంతో ఈ కవిత్వాన్ని వెనకకు నెట్టేసి అభ్యుదయ కవిత్వం ప్రాచుర్యంలోకి వచ్చింది.

******

అధ్యాయం- 2

భావకవిత్వంపై ఆంగ్ల రొమాంటిక్ కవిత్వం - ఇతర ప్రభావాలు

రెండవ అధ్యాయం

భావకవిత్వంపై ఆంగ్ల రొమాంటిక్ కవిత్వం – ఇతర ప్రభావాలు

2.1. భావకవిత్వపై ప్రభావాలు:

ఆధునిక తెలుగు సాహిత్యంలో తొలి కవితా ఉద్యమం భావకవిత్వ ఉద్యమం. దీనిపై ఆంగ్ల, బెంగాలీ సాహిత్యాల ప్రభావాన్ని గుర్తించవచ్చు. అందువల్ల భావకవిత్వ ఉద్యమం గురించి తెలుసుకునే ముందు, ఆంగ్ల సాహిత్యంలోని రొమాంటిక్ కవిత్వం గురించి, బెంగాలీ సాహిత్యంలోని రవీంద్రుని కవిత్వం గురించి తెలుకోవలసిన అవసరం చాలా ఉంది. బ్రిటీష్ వారి రాకతో ఆంగ్ల రొమాంటిక్ సాహిత్యం మొట్టమొదటగా బెంగాల్ సాహిత్యంలోకి ప్రవేశించింది. దీంతో బెంగాల్ కవులు ఆంగ్ల గ్రంథాలను అనువదించారు. రవీంద్రుడు తన కవిత్వంలో క్రొత్తదనాన్ని ప్రవేశపెట్టాడు. కొంత మంది భావకవులు రవీంద్రుని సాంగత్యంలో గడపడం వల్ల బెంగాల్‌లోని నవ్య కవిత్వం కూడా తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది.

2.2. ఆంగ్ల రొమాంటిక్ కవిత్వం:

క్రీ.శ.1660 ఇంగ్లాండులో రాజరికం తిరిగి నెలకొనడంతో సంప్రదాయవాదం వచ్చింది. డ్రైడెన్, పోప్, జాన్సన్ సంప్రదాయవాదులు. వారు గ్రీకు, లాటిన్ సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఆరిస్టాటిల్ అడుగుజాడల్లో నడవాలన్నారు. హేతువాదబద్ధులై ఔచిత్య నిర్ణయం కవితాభావం కన్నా ముఖ్యం అన్నారు. సృష్టికర్త నియమపాలనను సాహిత్యం ప్రతిఫలించాలన్నది వీరి వాదం. ఇటువంటి సమయంలో పూర్వ సాహిత్య నియమాలను వదిలించుకుంటూ రొమాంటిక్ కవిత్వం (క్రీ.శ.1798–1832) ఆంగ్ల సాహిత్యంలో ప్రవేశించింది.

రొమాంటిక్ (Romantic) అనే పదం మొదట భాషాపరంగా వాడబడింది. ఇటలీ దేశాన్ని అనాగరికులైన ఔత్తరాహులు జయించారు. వారి వల్ల దేశీయుల వాడుకలో ఉన్న లాటిన్ భాషకు అనాగరికుల భాషతో సంపర్కం కలిగి క్రొత్త భాష ఏర్పడింది. ఆ భాష పేరు రొమాంటిక్ లేక రొమాన్స్. ఫ్రాన్స్ దేశంలో ఆ పదం బహుళ ప్రచారం పొందింది. క్రీ.శ.11, 12వ శతాబ్దాలలో ఈ

భాషలో సాహితీ ప్రక్రియలు ఆవిర్భవించాయి. ఆ దశలో రొమాంటిక్ పదం సాహిత్యపరంగా ఉపయోగింపబడింది.

అప్పుడు ఆ రొమాంటిక్ అనే పదం అర్థంలో మార్పు కలిగింది. మొట్టమొదటగా రొమాంటిక్ శబ్దం చాలాకాలం అసహజం, కల్పితం, వాస్తవాతీతం అయిన దృగ్విషయాలకు ప్రతీకగా వాడబడింది. క్రీ.శ.1711కు "శిష్ట వ్యవహారం" (Refined Conduct) లేక "శిష్ట సంస్కృతి" (Refined Culture) అనే అర్థం వాడుకలోకి వచ్చింది. క్రమంగా దీనికి ఊహను సమ్మోహనం చేసే శక్తి (Captivating the imagination) అనే అర్థం ఏర్పడింది.

"క్రీ.శ.18వ శతాబ్దం మధ్య కాలంలో అర్థం మారి భావనాశక్తి (Imagination), అనుభూతులు (Feelings) మొదలైన వాటికి సమానార్థకంగా ఈ రొమాంటిక్ పదాన్ని ఉపయోగించారు. ఈ పదం ఆంగ్లం నుండి ఫ్రెంచి భాషలోకి వచ్చింది. ఫ్రాన్స్‌లో లాగే జర్మనీలో కూడా రొమాంటిక్ పదం ఆంగ్ల రచయిత థామ్సన్ (Thomson) రాసిన "ఋతువులు" (Seasons) అనే గ్రంథం వల్ల ప్రచారంలోకి వచ్చింది. జర్మనీలో కూడా రొమాంటిక్ పదం రసోద్వేగాన్ని, భావోద్రేకాన్ని కలిగించే ప్రకృతి దృశ్యాలను వర్ణించినప్పుడే కనిపిస్తుంది. క్రీ.శ.1797లో Frederick Schlegel రాసిన 'Cogitations' కావ్యం తరువాత రొమాంటిక్ అనే శబ్దానికి కల్పన (Imagination), రసోద్వేగం (Emotion) అనే అర్థాలు స్థిరపడ్డాయి".**(రంగనాథాచార్యులు. కె.కె. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, 2005, పుట.3).**

2.2.1. ఆవిర్భావం:

యూరప్ దేశాలలో కాల్పనిక ఉద్యమం (Romantic Movement) ఆవిర్భవించడానికి కారణాలు – అప్పటి వరకు ఉన్న ఉత్పత్తి శక్తులను, విధానాలను సమూలంగా మార్చి వేసిన పారిశ్రామిక విప్లవం, అది మానసిక, తాత్త్విక దృష్టిలో సమూలమైన మార్పులను, రాజకీయంగా కొన్ని సిద్ధాంతాలను ప్రచారం చేసిన విప్లవం. వీటితో రాజరికపు జీవితం మీద, నగరాల కృత్రిమ జీవితం మీద మోజు పోయింది. దాంతో ప్రకృతి ఒడిలోకి తిరిగి వెళ్లడం (Return to Nature)

అనే దృక్పథం ప్రారంభం అయ్యింది. ప్రకృతి మీద, గ్రామీణ వాతావరణం మీద ఆసక్తి పెరిగింది. పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచి విప్లవం, ఫ్రెంచి కాల్పనిక వాదం మీద బాగా ప్రభావం చూపించాయి.

ఫ్రాన్స్ దేశంలోని సాంఘిక, రాజకీయ వేత్త రూసో స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రబోధించాడు. ఈయన ప్రభావం జర్మన్ సాహిత్యం మీద కూడా ప్రతిఫలించింది. పూర్వ సాహిత్య సూత్రాల మీద సంపూర్ణంగా తిరస్కార భావం రేకెత్తించి, నిర్మానుష్యమైన ప్రకృతిని ఆరాధించాలన్నది ఈయన సందేశం. సాహిత్యంలో, మతంలో ధర్మచ్యుతి కలిగించాలన్న రూసో రచనలు రొమాంటిక్ ఉద్యమానికి ప్రోత్సాహకాలయ్యాయి.

రూసో రాసిన 'హేలాయిస్' (Heloise) అనే నవల మనిషిని ప్రకృతికి చేరువకమ్మని ఉద్బోధిస్తుంది. సహజంగా మంచిదైన మానవ ప్రవృత్తి నాగరికతా ప్రభావం వల్ల కలుషితమైందన్నది ఈయన వాదం. ఈయన 'సోషల్ కాంట్రాక్ట్' అనే మరో గ్రంథం "మానవులంతా సమానులే" అని సిద్ధాంతీకరించింది. ఈయన "న్యూ హెలాయిస్" (New Heloise) కావ్యం ప్రణయ తత్వాన్ని పెంపొందింపజేసింది.

రూసో మానవతావాదం జర్మన్ సాహిత్యం మీద ప్రభావం చూపింది. జర్మనీలో ష్లెగెల్ (Schlegel) రొమాంటిక్ దృక్పథాన్ని (Romantic view of Art) ప్రచారం చేశాడు. ఈయన క్లాసిక్ (Classic), రొమాంటిక్ (Romantic) పదాలను మొట్టమొదటగా తన రచనలలో వాడాడు. అందంగా స్వతఃసిద్ధంగా అమరి ఉన్న ప్రకృతిపై కృత్రిమంగా జరిపే అన్వేషణ క్లాసిసిజం అని, క్రొత్త జీవితాలు, అందచందాలు, వాస్తవికత కోసం జరిపే నిజమైన పోరాటం రొమాంటిసిజం అని ప్రబోధించాడు. ఇది జర్మనీనే కాక యూరప్ నంతా ఆకట్టుకుంది.

జర్మనీలోని తాత్త్వికుడైన కాంట్ (Kant), ఫిక్టే (Fichte) మొదలైనవారు ఈ రొమాంటిక్ ఉద్యమం యొక్క తత్త్వ నిరూపణకు ప్రయత్నించారు. వీరికి సైదోడుగా షెల్లింగ్ అనే తత్త్వవేత్త, నావాలిస్ (Novalis) అనే కవి జర్మనీలో ఈ ఉద్యమానికి చేయూత నిచ్చారు. జర్మనీ, ఫ్రాన్స్ దేశాలలో బాగా వ్యాప్తి చెందిన ఈ ఉద్యమం ఇంగ్లాండులో ప్రవేశించి బహువిధాల విస్తరించింది.

"ఎలిజబెత్ యుగం నుండి వచ్చిన పరిణామాన్ని జీర్ణించుకుని, ఫ్రాన్స్‌లోని రాజకీయ విప్లవం చేత నూతన చైతన్యం పొంది, జర్మనీ దేశ ప్రభావాలను ఆకళింపచేసుకొని అతి సహజంగా

ఇంగ్లాండులో ఉద్భవించిన ఉద్యమం ఈ రొమాంటిక్ ఉద్యమం. స్పెన్సరు ప్రణయ కవిత్వంలో ఆనాటి యువకవులకు, రొమాంటిక్ కవితకు దోహదం చేసే లక్షణాలు కనబడ్డాయి. ముఖ్యంగా ఈయన 'ఫేయిరీ క్వీన్' (Fairy Queen) అనే కావ్యం దీనికి తోడ్పడింది. క్రీ.శ.1754లో థామస్ వార్టన్ ప్రచురించిన 'Observations of Fairy Queen' అనే రచన మధ్యయుగాల మహా వైభవానికి, రొమాంటిక్ దృక్పథానికి బాగా అవకాశం కల్పించింది" (**నారాయణ రెడ్డి, సి,ఆధునికాంధ్ర కవిత్వము,సంప్రదాయములు–ప్రయోగములు,1977, పుట.186**). ఈయన 'Essay on Pope' అనే వ్యాసంలో పోప్‌ను విమర్శించాడు. ఈ విమర్శ ఆనాటి రొమాంటిక్ కవులకు అండగా నిలిచింది. ఈ ఉద్యమాన్ని ప్రారంభంలోనే అణచి వేయడానికి పోప్, స్విఫ్ట్ మొదలైన రచయితలు ప్రయత్నించారు. కాని అది కొనసాగలేదు. రొమాంటిక్ కవిత్వం ఆంగ్ల సాహిత్యానికి చాలా పేరు సంపాదించి పెట్టింది.

ఇంగ్లాండులో క్రీ.శ.18వ శతాబ్దంలో కవిత్వాన్ని మేధాశక్తి ఆక్రమించుకుని సహజత్వానికి దూరమైన రచనలకు ప్రాధాన్యం కలిగించింది. దానికి తిరుగుబాటుగా బయలుదేరిన ఉద్యమమే రొమాంటిక్ కవిత్వం. ఆంగ్ల సాహిత్యంలోని రొమాంటిక్ కవిత్వానికి మూలస్తంభాలు వర్డ్స్‌వర్త్ (Wordsworth), కాల్‌రిడ్జ్ (Coleridge), షెల్లీ (Shelley), కీట్స్ (Keats), బైరన్ (Byron), 'లిరికల్ బాల్లాడ్స్ (Lyrical Ballads) (1796)ను ప్రచురించడంతో రొమాంటిక్ ఉద్యమం ప్రారంభం అయ్యింది.

2.2.2. నిర్వచనాలు:

బుష్, పాటర్ వంటి కవులు క్లాసికల్ కవిత్వానికి, రొమాంటిక్ కవిత్వానికి తేడాలను సునిశితంగా చెప్పడానికి ప్రయత్నించారు. క్లాసికల్ కవిత్వం వాస్తవానికి దూరంగా నాగరిక జీవితానికి సంబంధించి ఉంటుంది. రొమాంటిక్ కవిత్వం ఆదర్శం వైపు వెళుతూ జానపద జీవితాన్ని ఆశ్రయిస్తుంది. మొదటి దానిలో మేధ, రెండవ దానిలో భావనాశక్తి ప్రాధాన్యం వహిస్తాయి. ఒకటి సంప్రదాయాన్ని, రెండోది తిరుగుబాటు తత్వాన్ని ప్రతిపాదిస్తాయి.

క్లాసికల్ కవిత్వంలో కథ తెలిసిందే. చెప్పే పద్ధతిలో రమ్యత కలిగి, తిరిగి తిరిగి వినాలనిపిస్తుంది. యుగ యుగాల నుండి వస్తున్న ప్రశాంత వాతావరణాన్ని తీసుకు వస్తుంది. బాహ్య

సౌందర్యానికి ఇందులో స్థానం ఉంటుంది. రొమాంటిక్ కవిత్వంలో సౌందర్యం ఒక వింతను చేకూరుస్తుంది. సౌందర్య పిపాసతోపాటు కుతూహలం (Curiosity) కలిగిస్తుంది.

పాటర్ (Pater) "సౌందర్య పిపాసతోపాటు రొమాంటిక్ కవిత్వంలో కుతూహలం (Curiosity) ఉంటుంది" అని చెప్పాడు. (**నారాయణ రెడ్డి, సి, 'ఆధునికాంధ్ర కవిత్వము–సంప్రదాయములు,ప్రయోగములు,1977, పుట.187**). ఈ కవిత్వంలో సౌందర్యాన్ని ఆరాధించడం ఎక్కువగా ఉంటుంది. "వాస్తవికత నుండి తప్పించుకు పోవడమే రొమాంటిసిజమ్" అన్నాడు వాల్టర్ హౌజ్ (Walter House).

"విక్టర్ హ్యూగో (Victor Hugo) ప్రకారం "సాహిత్యంలో ఉదార ఉదాత్త భావాల సమ్మేళనమే 'రొమాంటిసిజమ్'"**(రంగనాథాచార్యులు. కె.కె. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, 2005, పుట.4**). ఈ కవిత్వంలో స్వేచ్ఛాతత్వం ఉంటుంది. క్రీ.శ.1833లో John Stuart Mill ఈ కవిత్వాన్ని 'ప్రకృతి కవిత్వం' అని, "అనుభవించి వ్యక్తం చేసే కవిత్వం" అని నిర్వచించాడు.

ఈ నిర్వచనాల వల్ల రొమాంటిసిజమ్ ప్రకృతి కవిత్వం అనవచ్చు. అంటే తన సుఖ దుఃఖాలను ప్రకృతికి అన్వయిస్తూ చెప్పడం. ఈ కవిత్వంలో సౌందర్య ఆరాధన కూడా ఉంది.

2.2.3. లక్షణాలు:

రొమాంటిక్ కవితకు ప్రధాన లక్షణం 'ప్రణయం'. అది సంయోగ వియోగ శృంగారాలలో వియోగ శృంగారానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ప్రణయం ప్రకృతి నిష్టంగాను, మానవ నిష్టంగాను ఉంటుంది. దీనితోపాటు సంఘ సంస్కరణ, స్వాతంత్ర్యకాంక్ష, వినూత్న సమాజ స్వప్నం, సృజనాత్మకత, పురోగామి తత్వం అనే లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. రొమాంటిస్టులకున్న సామాన్య లక్షణం సంఘం నుండి పరిచ్యుతులమనే భావం.

రొమాంటిక్ కవులు కవిత్వానికి ప్రాణమైన 'కల్పన' (Imagination)కు ప్రాధాన్యం కల్పించారు. వీరు సౌందర్యాన్ని అద్భుతతత్వంతో సమ్మేళనం చేశారు. పూర్వం విస్మరించబడిన

ప్రకృతికి ప్రాధాన్యం ఇచ్చారు. సామాన్య వస్తువులను ఇతివృత్తంగా చేశారు. కవితా వస్తువుకు అనవసర విషయాలను వదిలి వేశారు.

రొమాంటిక్ కవితకు 'ఆత్మాశ్రయ తత్త్వమే' (Subjective Philosophy) మూలసూత్రం. హేతువు కంటే అనుభూతి, వాదం కంటే అనుభవానికి రొమాంటిసిస్ట్‌లు ప్రాముఖ్యం ఇచ్చారు. వీరు తమ హృదయంలో అశాంతి వల్ల చెలరేగే తుఫానులను సంఘంలో సంభవించిన సంఘటనలను, సున్నితమైన హృదయాన్ని స్పందింపజేసే విషయాలను కవితా వస్తువులుగా స్వీకరించారు. ఆత్మానుభవమే వీరికి ముఖ్యం. ఇది ఆత్మాశ్రయ రీతికి చెందింది. ఇందులో కవే నాయకుడు. అతనికి కలిగిన అనుభూతి కావ్య వస్తువు.

"రొమాంటిసిజమ్ ముందటి ఆంగ్ల కవులు చెప్పిన 'ప్రకృతి' వర్ణనలు పుస్తకాల నుండి తీసుకున్నవే. షేక్స్పియర్‌లో కూడా ప్రకృతి వర్ణనలు అలంకారప్రాయాలు. మొట్టమొదటసారిగా ప్రకృతిని తెర ముందుకు తీసుకువచ్చినవారు స్కాటిష్ కవులు. క్రీ.శ.1680–1756కు చెందిన అలన్ రాంసే అనే కవి రచనలలో మొదటిసారిగా ప్రకృత్యుపాసన కనిపిస్తుంది. తన నాటి జానపద గేయాలతో ప్రభావితుడై 'Gentle Shepherd' అనే కావ్యంలో పల్లెపడుచులను, పసులకాపరులను వర్ణించాడు" ***(నారాయణరెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు–ప్రయోగములు, 1977, పుట.189)***. జేమ్స్ థాంసన్ (క్రీ.శ.1700–48) ఆగస్టన్ కవుల తరగతికి చెందినవాడైనా, ఈయన రచనలలో చిత్రించబడిన ప్రకృతి స్వానుభవపూర్వకమైంది. ఈయన 'Seasons' కావ్యంలో ప్రకృతి ప్రధానంగా రచించబడింది. బ్లేక్ ప్రకృత్యుపాసకులలో ప్రముఖుడు. సామాన్య విషయాలను కావ్య వస్తువులుగా చేసుకోవడంలో ఈ కవి వర్డ్స్‌వర్త్‌కు మార్గ దర్శకుడు.

ప్రకృతిని భావనాపరంగా చూడడంలో వర్డ్స్‌వర్త్ గొప్పవాడు. ఈయన దృష్టికి నిత్యం చూసే కొండలు, కోనలు, విరులు, తరులు, వాగులు, వనాలు, వంకలు మొదలైనవి అపూర్వ సౌందర్యవంతంగా కనిపించాయి. ప్రకృతి కేవలం బాహ్య శోభాలింగితం కాదు, దివ్యత్వ నిధానం. ప్రకృతిని ఈయన Apocalypse (భగవత్ సాక్షాత్కారం)గా చూశాడు. మానవులలో కూడా ప్రకృతి స్వరూపాన్ని దర్శించాడు.

పోపు యుగంలో జర్మన్ శిల్పరీతి (Gothicism), సాహసం (Chivalry) అంతర్ నిగూఢంగా ఉన్నాయి. రొమాంటిక్ కవులు 'గత వైభవ' వర్ణనను కవిత్వంలో పునరుద్ధరించారు (Revival of the past). వర్డ్స్‌వర్త్ తన 'Excursion' అనే గీతంలో గ్రీకు పురాణ గాథతో కూడిన ఇతివృత్తాన్ని తీసుకుని ప్రకృతికి అన్వయించాడు. షెల్లీ రాసిన ప్రామీధియస్ అన్‌బౌండ్ (Prometheus Unbound) గ్రీకు పురాణ గాథకు సంబంధించిందే. కీట్స్ రచించిన ఎండిమియాన్ (Endymion), హైపీరియాన్ (Hyperion) మొదలైన కావ్యాలు ఇటువంటివే.

రొమాంటిక్ కవులలో షెల్లీ, కీట్స్, బర్న్స్ వంటి కవులు ప్రణయతత్వ (Philosophy of Love) రచనలు చేశారు. దీనికి ప్లేటో తత్వం (Platonism) మూలం. రొమాంటిక్ కవులు స్త్రీని కామాపేక్షతో చూడలేదు. ఆమెను ఆరాధ్య దేవతగా పూజించారు. వీరు ప్రధానంగా వియోగ శృంగారాన్ని, విషాద మాధుర్యాన్ని చిత్రించారు.

రొమాంటిక్ కవులు ఈ జీవితం నుండి ఏ సుదూర తీరాలకో ఎగిరిపోవాలని ఆకాంక్షించారు. కాల్‌రిడ్జ్ అద్భుతత్వాన్ని ప్రసాదించే రచనలు చేశాడు. 'Lyrical Ballads' లోని ఇతర రచనలు అద్భుత రసప్రాయాలే. ఐతిహాసిక యుగంలో వచ్చిన వీర గాథలు రొమాంటిక్ ఉద్యమ ప్రభావంతో పునరుద్ధరింపబడినవి. జేమ్స్ వాట్సన్ ప్రచురించిన 'వీరగాథా' సంపుటాలు ప్రజలను విశేషంగా ఆకర్షించాయి. ఈ వీరగాథలను చదివిన రొమాంటిక్ కవులలో తమలోని సాహస ప్రియత్వం బయటకు వచ్చింది. బైరన్ కవిత దీనికి నిదర్శనం. Childe Harold's Pilgrimage, Isles of Greece మొదలైన గేయాలు ఈ రకమైన కవిత్వానికి ఉదాహరణ. షెల్లీ రచించిన Revolt of Islam, Skylark, Prometheus Unbound, Ode to the West Wind వంటి రచనలలో 'స్వేచ్ఛా ప్రియత్వం' (Love of Liberty) స్పష్టంగా కనిపిస్తుంది.

ఇవే కాక రొమాంటిక్ కవులు ఛందస్సులో కూడా మార్పును తెచ్చారు. శైలీ ప్రాధాన్యాన్ని త్రోసి పుచ్చారు. భాషా సారళ్యానికి, నుడికారపు సొంపుకు ప్రాధాన్యం ఇచ్చారు. మానవతా దృక్పథాన్ని కవిత్వంలో సాధించారు. కవిత్వాన్ని సౌందర్యావతారంగా దర్శించారు. ప్రతి ఒక్కరూ నవ్యత కోసం పాటు బడ్డారు. వీరిలో వర్డ్స్‌వర్త్ ఎక్కువగా ప్రకృతి గత వస్తువులకు ప్రాముఖ్యం ఇవ్వడమే కాక వాటికి సాహిత్య గౌరవం సాధించిపెట్టాడు. కాల్‌రిడ్జ్ అద్భుతతత్వాన్ని, మధ్యయుగ జానపద కథలను కావ్య

వస్తువులుగా మలచుకున్నాడు. కీట్స్, షెల్లీ రచనలలో వియోగానికి ప్రాధాన్యం కనబడుతుంది. లార్డ్ బైరన్ స్వేచ్ఛను కాంక్షించాడు. ఈ రొమాంటిక్ కవుల ప్రభావం తెలుగులోని భావ కవిత్వంపై పడింది. దాంతో రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, నండూరి సుబ్బారావు, వేదుల సత్యనారాయణ శాస్త్రి వంటి వారు క్రొత్త క్రొత్త బాణీలలో తమ గేయాలను వినిపించి, భావకవిత్వానికి ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక స్థానాన్ని కల్పించారు.

2.2.4. ఆంగ్ల రొమాంటిక్ కవులు:

వర్డ్స్‌వర్త్, కాల్‌రిడ్జ్ క్రీ.శ.1797లో రాసిన 'లిరికల్ బాలెడ్స్'తో ఆంగ్ల సాహిత్యంలో రొమాంటిక్ కవిత్వం ప్రారంభం అయ్యింది. ఆంగ్ల రొమాంటిక్ కవులు 'భావా'నికి (Romantic Imagination) ప్రాముఖ్యం ఇచ్చి, దాని పట్ల ప్రత్యేకమైన దృక్పథం ఏర్పరచుకున్నారు. వీరు వాస్తవానికి దగ్గరగానే కావ్యాలు రాశారు. అందర్నిగూఢంగా దాగి ఉన్న విషయాన్ని వెలికి తీసి కవిత్వంలో పొందుపరిచారు. వీరు ప్రకృతి ద్వారానే ప్రేరణ పొందారు.

కీట్స్ ఇంద్రియగోచర దృశ్యాలనే వర్ణించాడు. ఆయన 'Sleep and Poetry' అనే కవితలో భావన ఒక శక్తి, అది విషయాన్ని పాఠకునికి తెలిసేటట్లుగా వివరిస్తుందని చెప్పాడు. భావన ద్వారా ఆధ్యాత్మిక సత్యాన్ని తెలుసుకోవడానికి కీట్స్ ప్రయత్నించాడు. 'Endymion' కావ్యంలో తాను వేరే లోకానికి వెళ్లిపోతున్నట్లు, తనకు స్వేచ్ఛ కలిగినట్లు భావించుకున్నాడు.

కాల్‌రిడ్జ్ కూడా భావన గురించి 'Biographia Literaria' అనే పుస్తకంలో చెప్పాడు. ఈ ప్రపంచానికి భావనతో ప్రాణం పొయ్యాలి అన్నాడు. ఆయన భావం జీవానికి ఒక ఆకారం ఇస్తుందని నమ్మాడు. 'Dejection' అనే కవితలో ప్రకృతి మనిషిలో నివసిస్తుందని, మనిషే ప్రకృతిలో ఉండవలసిన వాటిని సృష్టించుకున్నాడన్నాడు.

వర్డ్స్‌వర్త్ తన కవిత్వంలో ఒక అబ్బాయి భగవత్ శక్తి చేత చిన్న ప్రపంచాలను సృష్టించుకునే విధంగా సృజనాత్మక శక్తి కూడా ఉంటుందని చెప్పాడు. ప్రకృతి మనిషికి దగ్గరగా వచ్చినట్లు భావించాడు. మనిషి ఉనికి ఎంత నిజమో, ప్రకృతి ఉనికి కూడా అంత నిజం. కాబట్టి ప్రకృతికి ఉన్నత స్థానం ఇచ్చి, మనిషి ఆత్మ ప్రకృతి ఆత్మతో ఐక్యం చేయాలని అనుకున్నాడు.

హేతువు భావనను విశ్లేషించాలి. భావనకు ఒక పరికరంగా ఉపయోగపడాలి. హేతువు వల్ల ఏర్పడిన అభిప్రాయాలతో సంధానాత్మకమైన, సమైక్యమైన భావనా వస్తువులను సృష్టించవచ్చునని రొమాంటిక్ కవి అనుకున్నాడు. షెల్లీ కవిత్వాన్ని 'భావనా ప్రకటన' (The expression of the imagination) అన్నాడు. భావన మనిషికి ఉండే అత్యుత్తమైన కళానైపుణ్యం అని, దాని ద్వారా మనిషి ఉన్నతమైన శక్తులు సంపాదిస్తాడని షెల్లీ అభిప్రాయం.

ప్లేటో యొక్క జ్ఞాన సిద్ధాంతాన్ని షెల్లీ సౌందర్యానికి అన్వయించాడు. సుందరమైన వస్తువుల సమక్షంలో కవులకు ఏర్పడే అంతర్ దృష్టి కవిత్వానికి పునాది. అక్షరాల ద్వారా సత్యాన్ని తెలియజెప్పడమే భావన యొక్క ఉద్దేశమని షెల్లీ నమ్మాడు. దృశ్య ప్రపంచం ఒక సర్వోత్కృష్టమైన క్రమ పద్ధతిలో నడుస్తుంది. సుందరమైన వస్తువుల సమక్షంలో హృదయం స్పందిస్తుంది. ఒక మహా శక్తి నుండి ఆ స్పందన పుట్టి ఉండాలి. ఆ మహా శక్తి ప్రపంచాన్ని నడుపుతూ ఉండాలి. భావన ద్వారా ఆ మహాశక్తిని తెలుసుకుని కవిత్వం రాయడమే కవుల పని అని రొమాంటిక్ కవులు భావించారు.

ఆంగ్ల రొమాంటిక్ కవుల అభిప్రాయం ప్రకారం రొమాంటిక్ ఉద్యమం అంటే "మనస్సు ద్వారా ఆధ్యాత్మిక ప్రపంచాన్ని కనుగొనాలని చేసే బ్రహ్మాండమైన ప్రయత్నం". ముఖ్యమైన విషయాన్ని తెలుసుకోవడానికి కవిత్వం ద్వారా తెలియ జెప్పడానికి ఇతరులకు లేని శక్తి తమకున్నదని వీరు నమ్మారు. తాము భావనలో సృష్టించిన కలలు నిజమైనవని, శాశ్వతమైనవని వక్కాణించారు. కాబట్టి వాటిని కవిత్వం ద్వారానే సరైన ఆకారాన్ని కల్పించవచ్చునన్నారు. వీరు క్రీ.శ.18వ శతాబ్ద హేతువాద కవుల కంటే మనిషిని, కవిత్వాన్ని విశాల దృక్పథంతో చూశారు.

వర్డ్స్‌వర్త్‌తో ఆంగ్ల సాహిత్యంలో అసలైన రొమాంటిక్ యుగం ప్రారంభం అయ్యింది. ఆయన కవితా వస్తువులు సామాన్య మానవుని సుఖ దుఃఖాలే. జానపదులు నిత్య జీవితంలో వాడే భాషను ఎన్నుకున్నాడు. కొండ కోనలలోని సౌందర్యానికి ముగ్ధుడు కావడమే కాక, దానిని ఆధ్యాత్మిక దృష్టితో వ్యాఖ్యానించాడు. ప్రకృతి ఆయనకు ఆరాధ్య దేవత.

కాల్‌రిడ్జ్ అఖండమైన మేధావి. అద్భుతమైన భావన ఆయన సొమ్ము. సూటిగా వస్తువు అంతర్భాగంలోకి చొచ్చుకుని పోయి దానిలోని మిస్టరీని వెలికితీసి, దానికి రూపకల్పన చేయడంలో

ప్రజ్ఞావంతుడు. స్వాప్నిక జగత్తును సృష్టించడంలోను, మానవ హృదయాన్ని చలింపచేసే సన్నివేశాలను చిత్రించడంలోను నేర్పరి.

షెల్లీ రొమాంటిక్ కవులందరిలో భావగీతాలు రాయడంలో నైపుణ్యం గల శిల్పి. ఆంగ్ల సాహిత్యంలోని మాధుర్యం అంతా ఆయన గీతికలలో ఉన్నట్లనిపిస్తుంది. షెల్లీ చూపు భవిష్యత్తు మీద ఉంటే, కీట్స్ గతంలో జీవించాడు.

బైరన్ చిన్నతనం నుండి సమకాలీన కవులను, విమర్శకులను తీవ్రంగా ఎదుర్కోవడానికి ఉద్యమించాడు. ఆయన బాహ్య ప్రపంచంలో లీనమవ్వడానికి ఇష్టపడలేదు. బాహ్య ప్రపంచమే తనలో లీనం కావాలన్నది ఆయన సిద్ధాంతం. ఆయన కవిత్వంలో ఎక్కడ చూసినా దుఃఖం, నైరాశ్యం కనిపిస్తాయి. కవిత్వంలో తన ఆత్మీయతను శక్తివంతంగా చూపి బైరన్ రొమాంటిక్ కవులలో విశిష్ట వ్యక్తిత్వం గలవాడయ్యాడు.

షెల్లీ కూడా సమకాలీన సమాజాన్ని, సంప్రదాయాన్ని నిరసించాడు. ఈర్ష్యలు, అసూయలు, ద్వేషాలతో నిండి ఉన్న ఈ నికృష్ట ప్రపంచాన్ని విడనాడి దివ్యతేజోమయమైన వేరొక లోకాన్ని దర్శించడానికి ప్రయత్నం చేశాడు. విటన్నిటికి ప్రేమే సాధనమని, అదే జీవిత పరమార్థం అని నమ్మాడు. ఆ నమ్మకమే ఆయన కవిత్వాన్ని సౌందర్యమయం చేసింది.

ఆయన విశిష్టత అంతా ఛందో రచనలో, అగోచరమైన ఆధ్యాత్మిక విషయాన్ని చెప్పడంలో కనిపిస్తుంది. సహజమైన సంగీత గతులలో ప్రతి పద్యం పాట వలే వినిపిస్తుంది. వైద్య విద్యను అభ్యసించి, వృత్తిలో ప్రవేశించి, తరువాత సాహిత్యంలో మనస్సు లగ్నమై వైద్య వృత్తిని వదిలి వేసాడు. ఆయనపై ఛాప్‌మన్ అనువదించిన ఇలియడ్, ఒడిస్సీల ప్రభావం పడింది.

కవిత్వం సాంఘిక, మత, రాజకీయ వేదాంత సిద్ధాంతాలకు వాహికగా ఉండరాదన్నాడు కీట్స్. సౌందర్యమే సత్యమని, సత్యమే సౌందర్యం అనేది ఆయన తత్వం. ప్రతి పద్యం ఒక సుందర చిత్రంగా మలచే నైపుణ్యం ఆయనది. ఆయన రొమాంటిక్ తత్వం పరిపూర్ణంగా కలవాడు.

ఆంగ్ల రొమాంటిక్ కవులు భగ్న ప్రణయాన్ని కావ్య వస్తువుగా తీసుకున్నారు. అందులో వ్యక్తీకరింపబడిన ప్రేమ దివ్యమైంది. భౌతిక వాంఛలకు దూరమయ్యింది. ప్రేమ ప్రేమ కొరకే,

ప్రతిఫలాపేక్ష లేదు. తాను ప్రేమించిన స్త్రీని వేరెవరైనా వివాహమాడినా, కవి మనస్సులో ఆమె పట్ల ప్రేమలో మార్పు ఉండదు. అదే ఈ ప్రణయంలోని విశేషం.

కాల్‌రిడ్జ్ కవిత్వానికి అస్పష్టత అవసరం అన్నాడు. దాని కోసం శబ్దాన్ని ఎక్కువగా నమ్ముకున్నాడు. కవిత్వానికి అర్థం ఎంత ముఖ్యమో, శబ్దం అంత ముఖ్యం. ఒకదానికి మితిమీరి ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల కవిత్వానికి ప్రమాదం ఏర్పడుతుంది. దీనికి 'Kubla Khan' కవిత నిదర్శనం.

రొమాంటిక్ కవులు కవిత్వ పరిధిని విశాలం చేయాలని అనుకున్నారు. చాలా వరకు చేసారు కూడా. కాని సౌందర్యం వల్ల ఆ అవకాశాలు పరిమితం అయ్యాయి. అది వీరి మీద చాలా ప్రభావం చూపించింది. పూర్తిగా జ్ఞానేంద్రియాలను ఆక్రమించి, పరలోకాన్ని దర్శించేటట్టు చేసింది. దాని వల్ల కవి ప్రపంచం వైయక్తికం అయ్యింది. ఇతరులకు అర్థం కాకుండా పోయింది.

నిజానికి వీరు కవిత్వం ఒక్కదానికే పరిమితం చేశారు. వర్డ్స్‌వర్త్ గ్రామసీమలకూ, కాల్‌రిడ్జ్ నిద్రకూ మెలకువకూ మధ్య గల వెన్నెల రహస్యానికి షెల్లీ పారవశ్యమైన ఆలోచనలకూ, కీట్స్ నిర్మలమైన సృష్ట్యానందాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నానికి పరిమితం అయ్యారు. బైరన్ సౌందర్యం గురించి పాతకాలపు ఆలోచనలు పట్టించుకోకుండా సమకాలీన జీవితం గురించి రాసాడు. ఆయన శుద్ధ వచనాన్ని కూడా కవిత్వంగా కనబడేటట్టు చేసాడు.

వర్డ్స్‌వర్త్, షెల్లీలు Immortal Ode, Defence of Poetryలలో బాల్యదశలోని అమాయకత్వం, నిష్కలంకమైన మనస్సు రకరకాలుగా వర్ణించారు. కీట్స్ హేతువాదాన్ని విమర్శించాడు. 'Lamia' అనే ఖండికలో హేతువాదం కంటే భావన చాలా ముఖ్యమని చెప్పాడు. వేదాంతాన్ని, శాస్త్రాన్ని తిరస్కరించి కవిత్వాన్ని పాత ఆలోచనాసరళి నుండి దూరం చేశాడు.

ఈ విధంగా రొమాంటిక్ కవులు ఆంగ్ల సాహిత్యంలో క్రొత్త ఆలోచనలను ప్రవేశపెట్టి తమకు ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. పారిశ్రామికి విప్లవం వల్ల ఆర్థిక సంబంధాలలో మారు వచ్చింది. ఫ్రెంచి విప్లవం వల్ల సాంఘిక, సాంస్కృతిక రంగాలలో మార్పు వచ్చింది. అది కవిత్వంలో ప్రతిబింబించింది. వీరు ఆనాటి సమాజాన్ని పట్టించుకోకుండా ఊహలలో తేలిపోయినా మంచి కవిత్వం రాశారు.

ఆంగ్ల రొమాంటిక్ కవులందరూ కలిసి సాంప్రదాయం, ఆనవాయితీ, అభిప్రాయం అనే సంకెళ్లను పగులగొట్టి ప్రపంచాన్ని, మనస్సును బంధవిముక్తులను చేశారు. కవిత్వంలో ఉపన్యాస ధోరణి ఉండకూడదని నిర్ణయించారు. వీరు ప్రకృతిని వర్ణించడమే కాక అందులో అద్భుతతత్వాన్ని దర్శించారు. అందువల్ల కవిత్వం ఉజ్వలంగా భాసించింది. కథ చెప్పడం, నీతులు వల్లించడం, అధ్యయనం చేయడం వంటివేవీ అందులో ఉండవు. వంద సంవత్సరాల తరువాత వచ్చిన భావ కవిత్వం ఆంగ్ల రొమాంటిక్ కవిత్వ ప్రభావంతో సాంప్రదాయక కవిత్వం మీద నిరసన ధోరణిని చూపింది.

2.2.5. భావకవిత్వంపై ఆంగ్ల రొమాంటిక్ కవుల ప్రభావం:

క్రీ.శ.19వ శతాబ్దం ప్రారంభంలో వచ్చిన ఆంగ్ల రొమాంటిక్ కవిత్వ ప్రభావం క్రీ.శ.20వ శతాబ్దంలో వచ్చిన తెలుగు భావ కవులపై పడింది. బ్రిటీష్ వారి రాకతో ఆంగ్ల విద్య వచ్చింది. దీనివల్ల ఆనాటి యువకవులకు ఆంగ్ల సాహిత్యంలోని గొప్పతనం తెలుసుకునే అవకాశం కలిగింది. ఆ కాలంలో వచ్చిన సంస్కరణోద్యమాల ఫలితంగా యువకుల ఆలోచనా విధానం మారింది. దీంతో జీవన విధానంలో, సాహిత్యంలో నవ్యత చోటు చేసుకుంది.

భావ కవిత్వంలోని విప్రలంభ శృంగారంలో విషాద భావన ఉన్నత స్థానాన్ని పొందింది. ప్రేయసిని తనకు దూరం చేసిన ఈ లోకంలోని అన్యాయానికి షెల్లీ 'తన జీవితం ముళ్లమయం అయిపోయిందన్నాడు'. ఇదే అభిప్రాయాన్ని వేదుల సత్యనారాయణ శాస్త్రి 'దీపావళి'లో వ్యక్తీకరించాడు. లోకం అతనికి నిత్య హింసాపూర్వకంగా భయంకరమంగా కనిపించింది. అమావాస్య చీకటుల మధ్య గుండె మరణ వాయిద్యంలో కొట్టుకుని విలపించసాగింది.

దేవులపల్లి కృష్ణశాస్త్రి సహజ ప్రేమను వర్ణించాడు. "పువ్వులు సువాసనను, చందమామ వెన్నెలను వెదజల్లడం సృష్టి వైచిత్యం. అలాగే నీరు పారడం, గాలి వీచడం వంటి సహజ లక్షణాలలాగా నేను నిన్ను ప్రేమిస్తున్నానని" చెప్పాడు. దీనిపై షెల్లీ "Love's Philosophy" అనే గేయ ప్రభావం ఉంది. ప్రకృతిలో సంయోగ గుణం ప్రధానం, పరస్పర ప్రేమ దీని మూల సూత్రం అని షెల్లీ చెప్పిన విషయాన్నే ఆయన చెప్పాడు.

"'మృత్యువరణం' కీట్స్‌లో కనిపిస్తుంది. విషాద భావం విలాపానికి, మృత్యువరణానికి మూల ప్రవృత్తి. 'నా మరణశయ్య నేనే పరచుకున్నాను' అనే భావం దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ప్రవాసం'లో కనిపిస్తుంది. షెల్లీ, కీట్స్‌లలో ఉన్న 'పలాయన తత్త్వం' భావ కవిత్వంపై ఎక్కువగా ప్రభావాన్ని చూపింది. దీనిని రొమాంటిక్ ఉద్యమకాలంలో 'Romantic Melancholy'" **(నారాయణ రెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు–ప్రయోగములు,1977,పుట.191–193)** గా పిలిచేవారు. షెల్లీ 'Ode to the West Wind', కీట్స్ 'Ode to Nightingale' అనే గీతాలలో ఈ తత్త్వం సమగ్రమైన ఆకృతిని పొందింది. జీవితంలో తాము పొందిన weariness, fever, fret నుండి తప్పించుకుని కోకిలతోగాని, గాలితోగాని, పారిపోవాలని షెల్లీ, కీట్స్‌ల భావన. అదే భావనను దేవుపల్లి కృష్ణశాస్త్రి 'కృష్ణపక్షం'లో వ్యక్తం చేశాడు. "రాత్రితో, చీకటితో దుఃఖం నా దగ్గరకు వస్తుంది. అందుచేత ఓ సంధ్యాసమీరణా నీ నునులేత రెక్కల మీద నన్ను తొందరగా ఎక్కడికైనా తీసుకుని పో" అని పలాయన తత్వాన్ని వ్యక్తం చేశాడు.

'Invocation to Misery' అనే గీతంలో షెల్లీ దుఃఖాన్ని ప్రేయసిగా, తోడునీడగా, సోదరిగా, ఆనంద సంధాయినిగా భావించాడు. దేవులపల్లి కృష్ణశాస్త్రి తనకు దుఃఖం తోడు నీడ అని భావించాడు. తనకు 'నిరుపమనితాంత దుఃఖపు నిధులు' ఉన్నాయని చెప్పాడు. వేదుల సత్యనారాయణ శాస్త్రి దుఃఖంలో ఆనందాన్ని అనుభవించాడు. 'ప్రేమ కొరకు తపించుచున్న కన్నులలో అమృతాన్ని ఒలికిస్తా'నన్నాడు.

షెల్లీ 'Hymn to Intellectual Beauty' అనే గేయంలో వ్యక్తి నిష్టమైన సౌందర్యాన్నే కాక సమస్తమైన జగత్సౌందర్యాన్నే కీర్తించాడు. సౌందర్యం నిత్యనివాసం చేసినపుడు మానవుడు మృత్యుంజయుడని స్పష్టపరిచాడు. రవీంద్రుడు ఈ ఆదర్శ సౌందర్యాన్నే ఊర్వశిలో దర్శించాడు. దేవులపల్లి కృష్ణశాస్త్రి కూడా విశ్వ సౌందర్యాన్ని భావన చేసి 'ఊర్వశి' అనే ఊహా ప్రేయసిని సృష్టించుకున్నాడు.

పాశ్చాత్య సాహిత్యంలో తాము ప్రేమించిన స్త్రీల మీద గీతాలల్లడం రొమాంటిక్ కవులలో ఉంది. జీవిత కాలమంతా తన ప్రేయసి కొరకు తహతహలాడి పాడిన ప్రతి గీతంలో ఆమె సంకీర్తనం చేశారు. దీనిలో ప్రసిద్ధులైన కవులు షెల్లీ, కీట్స్, బైరన్‌లు. వీరి భగ్నమైన ప్రేమగాథలు వీరి కవిత

ద్వారా ప్రాముఖ్యం పొందాయి. కీట్స్ ఫ్యానీ బ్రౌన్ అనే అమ్మాయిని ప్రేమించి, ఆమె తిరస్కారానికి గురయ్యాడు. దాంతో ఆయన ఓడ్ టు నైటింగేల్, ఓడ్ టు ది గ్రీషియన్ ఆర్న్, ఎండిమియాన్, ఓడ్ టు ఫ్యానీ, లామియా గీతాలు రచించాడు.

షెల్లీ వివియానీని అనే ప్రేయసిని దృష్టిలో పెట్టుకుని రాసిన కావ్యం 'Epipsychidion. Mrs. Williams అనే యువతిని దృష్టిలో పెట్టుకుని రాసినవే. Rarely, Spirit of Delight, One word is too often, when the Lamp..., Rough Wind, To Jame, The Magnetic Lady వంటి గేయాలు. బైరన్ మేరీ చావర్త్‌ను మనసార ప్రేమించాడు. క్రీ.శ.1805 నుండి ఆమె వివాహం అయ్యేంత వరకు గల పందొమ్మిదేండ్ల కాలం రాసిన గోయాలన్నింటిలో ఆమె ప్రసక్తి ఏదో ఒక రూపంలో ఉంది. Manfred, Don Jaun, The Dream, Last Words to Greece వంటి గేయాలు. బైరన్ మేరీ చావర్త్‌ను మనసార ప్రేమించాడు. క్రీ.శ.1805 నుండి ఆమె వివాహం అయ్యేంత వరకు గల పందొమ్మిదేండ్ల కాలం రాసిన గేయాలన్నింటిలో ఆమె ప్రసక్తి ఏదో ఒక రూపంలో ఉంది. Manfred, Don Jaun, The Dream, Last Words to Greece వంటి గేయాలు.

"ఆంగ్ల విద్య వల్ల భావకవులకు రొమాంటిక్ కవుల సాహిత్యాన్ని పరిశీలించడానికి అవకాశం కలిగింది. భావకవులను వారి 'స్వచ్ఛంద ప్రణయం' ఆకర్షించింది. వారి వల్లే వీరిలో భగ్నాశులైన వారు ప్రణయ కావ్యాలు రచించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి మద్రాస్ రేడియో స్టేషన్‌లో పని చేస్తుండగా రేడియో నాటికల్లోని ఒక నటి (పేరు బుద్ధి పూర్వకంగా వదిలివేయడం జరిగింది) ప్రేమలో పడ్డాడు"(కే.శే. ఆచంట జానకీరామ్‌తో ఇంటర్వ్యూ.మద్రాసు). ఆ సమయంలో వచ్చిన గీతాలే 'ఊర్వశి' కావ్యంగా అవతరించాయి. కాని ఆయన అందులో తన ప్రేయసికి శరీరమే లేదని చెప్పాడు. ఆ కావ్యాన్ని తన ప్రేయసి 'ఊర్వశి' కే అంకితం చేశాడు. అడవి బాపిరాజుకు వెన్నెల అంటే ఇష్టం. ఒకనాడు గురువైన కూల్డీ చిత్రించగా, ఆ వెన్నెల కిరణానికి 'శశికళ' అని పేరుపెట్టి దానినే కావ్య రూపంలో చిత్రించాడు అడవి బాపిరాజు.

ఆంగ్ల రొమాంటిక్ కవిత్వంలో దేశభక్తి కవిత్వం అంతగా లేదు. తెలుగు దేశభక్తి కవిత్వంలో గత వైభవ స్మరణ (Glory of the Past) కనిపిస్తుంది. వర్డ్స్‌వర్త్ మొదలైనవారు స్వదేశీయ గత

వైభవాన్ని స్మరించారు. రాయప్రోలు సుబ్బారావు 'జన్మభూమి' గేయం పై వర్డ్స్‌వర్త్ ప్రభావం రేఖామాత్రంగా ఉంది. గత వైభవ స్మరణ విశ్వనాథ సత్యనారాయణ 'వేంగి క్షేత్రము'లో కూడా కనబడుతుంది.

"ఈ లక్షణాలే కాక ప్రకృతిలో Romantic Melancholy (రొమాంటిక్ విషాద ప్రవృత్తి)ని చూడడం, Pantheistic Feeling (ప్రకృత్యారాధన తత్త్వం)ని ప్రదర్శించడం రొమాంటిక్ కవులలో ఉంది. Pantheistic Feeling అంటే మానవుని ఆత్మకన్నా మహత్తరమైన ఆత్మ ప్రకృతిలో ఉందని భావించడం" **(నారాయణ రెడ్డి, సి, ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు–ప్రయోగములు, 1977, పుట.189–190)**. ప్రకృతిని అర్థం చేసుకొనడం అంటే ఆ పరమార్థాన్ని సాధించడమేనని వీరి అభిప్రాయం.

భావకవులు ప్రకృతిని ఆత్మాశ్రయ రీతిలో చిత్రించడం రొమాంటిక్ కవుల నుండి నేర్చుకున్నదే. వర్డ్స్‌వర్త్ మొదలైన రొమాంటిక్ కవులలాగా ప్రకృతితో సుఖ దుఃఖాలు నివేదించుకోవడం, ప్రకృతిలో ఆత్మాంశను సందర్శించడం ప్రకృతిని దేవతగా చూడడం, ప్రకృతి దర్శనంతో తాదాత్మ్యం చెందడం మొదలైన లక్షణాలు భావ కవిత్వంలో కనిపిస్తాయి.

భావ కవి ప్రకృతిని తాత్త్విక చింతనకు ఉపస్కారకంగా గ్రహించాడు. ఇది వర్డ్స్‌వర్త్ ప్రకృతి దర్శనతత్త్వ ప్రభావం. దువ్వూరి రామిరెడ్డి 'గరిక'ను చూచి పూర్వ జన్మానుబంధాలు స్మరించడం, దానిలో నిర్మల జ్యోతి వెలుగుతుందని భావించడం ఈ తాత్త్విక దృక్పథానికి తార్కాణం.

పల్లీయ జనుల జీవిత రేఖలను భావ కవులు చిత్రించారు. వీరిలో కర్షకులు గొల్లవారు, పడవ సరంగులు మొదలైనవారు ఉంటారు. తెలుగులో భావకవులు పల్లీయ జనులపై కావ్యాలు రాయడానికి స్వదేశీ, విదేశీ ప్రభావాలు కారణం. వర్డ్స్‌వర్త్ 'మైకేల్' వంటి కావ్యాలలో కాపువారి జీవితాన్ని కావ్య వస్తువుగా తీసుకోవడం, కాపువారి కష్ట సుఖాలను చిత్రించడం, పల్లీయ జీవితాలే కాక వారి భాష కూడా కావ్య యోగ్యత కలిగినదేనని నిరూపించడం, 'లిరికల్ బాలడ్స్' పీఠికలో దీనిని సిద్ధాంతంగా చేయడం వంటివి భావకవులపై ప్రభావం చూపాయి. దీని వల్ల దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు' మొదలైన కావ్యాలు వచ్చాయి. పడవల వాళ్ల మీద, చేపలు పట్టే వారిమీద, గొల్లవాళ్ల మీద అనేక

గీతాలు వచ్చాయి. కవికొండల వేంకటరావు వర్డ్స్‌వర్త్ వలే ప్రకృతి ఉపాసకుడు. కూలియన్నల కుతుకము, జనపదములు, ప్రకృతి చందనము వంటి గేయాలలో పల్లీయుల శోభ కనిపిస్తుంది.

గ్రీక్ సాహిత్యంలో విషాదాన్ని సూచించి, ఎలిజాయిక్ (Elegiac) ఛందస్సులో నడిచే ఏ పద్యమైనా 'ఎలిజీ' అవుతుంది. క్రీ.శ.16వ శతాబ్దం ఇంగ్లాండులో సాంస్కృతిక పునరుజ్జీవనం (Renaissance) ప్రారంభం అయినప్పుడు గ్రీక్, రోమన్ సాహిత్యాలు అధ్యయనం చేసిన వారి ద్వారా ఈ ఎలిజీ పదం ఆంగ్ల సాహిత్యంలోకి వచ్చింది. చాలాకాలం వరకు దీని అర్థం గ్రీక్ సాహిత్య పరిధిలోనే ఉంది. ఆధునిక సాహిత్యంలో ఎలిజీ మరణించిన వ్యక్తిపై రాసిన కవితగా మారింది. దీనినే తెలుగులో 'స్మృతి కావ్యం' అంటారు. నాయని సుబ్బారావు 'మాతృ గీతాలు', బసవరాజు అప్పారావు 'పితృ స్మృతి', దువ్వూరి రామిరెడ్డి 'సోదరీ స్మృతి', అబ్బూరి రామకృష్ణారావు 'సోదర స్మృతి', తల్లావర్జుల శివశంకర శాస్త్రి 'సుత స్మృతి', విశ్వనాథ సత్యనారాయణ 'పత్నీ స్మృతి' బోధకమైన 'వరలక్ష్మీ త్రిశతి' మొదలైనవి ఈ రకమైన కావ్యాలలో ప్రసిద్ధాలు.

రొమాంటిక్ కవిత్వం మొదట ఫ్రాన్స్, జర్మనీలలో ప్రారంభమయ్యింది. క్రీ.శ.19వ శతాబ్దం ఇంగ్లాండులో ఈ కవిత్వం వ్యాప్తి చెందింది. దాని ప్రభావం ఆధునికాంధ్ర సాహిత్యంపైన పడింది. దానివల్ల ఆధునిక తెలుగు సాహిత్యంలో భావ కవిత్వం ఆవిర్భవించింది.

2.3. రవీంద్రుని బెంగాలి కవిత:

క్రీ.శ.19వ శతాబ్దం ప్రారంభం నాటికి బ్రిటీష్ వారి ప్రాబల్యం స్థిరపడింది. ఈ కాలంలో ఫోర్టు విలియం కళాశాల స్థాపించబడింది. విలియం కేరీ, మృత్యుంజయ విద్యాలంకారులు పవనానికి ఒక రూపం ఇవ్వడానికి ప్రయత్నించారు. రాజారామ మోహన్‌రాయ్ మత, నైతిక, సామాజిక, ఆచర వ్యవహారాల్లో సంపూర్ణ సంస్కరణను ప్రబోధిస్తూ చిన్న చిన్న పుస్తకాలు ప్రకటించాడు. ఆయన బుద్ధి సునిశితమైంది. ఆయన చూపు భవిష్యత్కాలానికి సంబంధించింది. క్రీ.శ.19వ శతాబ్దం నాటి ప్రజ్ఞావంతులైన బెంగాలీవారు కొద్ది మంది వీరి వల్ల ప్రభావితులై, వారికి తోచిన మార్గాలలో దేశాభ్యుదయానికి పాటుపడ్డారు. నవీన సంస్కృతిని రూపొందించిన రవీంద్రనాథుడు రాజారామ మోహన్‌రాయ్ భావాలకు ప్రభావితుడయ్యాడు.

"మైకేల్ మధుసూదన్ దత్తు క్రైస్తవ మతం స్వీకరించి, ఐరోపియ భాషలలో ప్రాచీనార్వాచీనాలను అధ్యయనం చేశాడు. నవ్య సాహిత్యానికి ప్రథమ కవియై, దాని స్థాపకుడుగా పూజింపబడ్డాడు. ఈ శతాబ్దంలో హైందవ జాతీయ భావం పుట్టింది"(**కాజీ అబ్దుల్ వదూద్, 'వంగ సాహిత్యము',సమకాలీన భారతీయ సాహిత్యము,1965, పుట.211–215**). బ్రిటీస్ పాలకులు భారతీయుల సమస్యలను పరిష్కరించడానికి ఆసక్తి చూపలేదు. దాంతో భారతీయుల ఆత్మగౌరవం దెబ్బతిన్నది. టాడ్ రచించిన 'రాజస్థాన్ కథావళీ' అనే గ్రంథం వారి దేశభక్తికి దోహదం చేసింది. జాతీయ రంగ స్థలాలు ఏర్పడి మనస్సులను ఉర్రూతలూగించే నాటక ప్రదర్శనలు ప్రారంభించాయి. సనాతన హిందూ మతాన్ని, తత్త్వ శాస్త్రాన్ని, దివ్య జ్ఞాన సామాజికురాలైన బ్లావెట్స్కీ సతి, ఇతర పాశ్చాత్య విద్వాంసులూ ప్రశంసించారు. ఈ పరిస్థితులు జాతీయతకు దోహదం చేశాయి. బంకిమ్ చంద్రుడు హైందవ జాతీయవాదిగా, దేశభక్తుడుగా ప్రసిద్ధి చెందాడు.

బిహారిలాల్ చక్రవర్తి, సురేంద్రనాథ్ మజుందారులు ఆ కాలపు కవులు. బిహారిలాల్ ప్రకృతిని, ప్రజలను అధికంగా ప్రేమించాడు. చాలా నిరాడంబర జీవనం గడిపాడు. యువకుడైన రవీంద్ర నాథుని మీద ఆయన ప్రభావం బాగా ఉంది. హైందవ జాతీయత వికసిస్తున్న వాతావరణంలో రవీంద్రనాథుడు పెరిగాడు. ఆయనకు ముఖ్యంగా కాళిదాసు, జయదేవుల కావ్యాలు, బైరన్, షెల్లీ, వర్డ్స్‌వర్త్, కీట్స్, బ్రౌసింగ్ కవుల కావ్యాలంటే చాలా ఇష్టం.

రవీంద్రనాథుడు ప్రకృతి కవిగా పెరిగాడు. ఇరవైయేళ్లు వచ్చేటప్పటికి 'కళ కళ కోసమే' అనే కోవలో చేరి పూర్ణ వికాసం గల కవి అయ్యాడు. కావ్య శిల్పంలో ప్రావీణ్యం సంపాదించి, గేయాలు, నాటికలు, కథానికలు, వ్యాసాలు ఎనిమిదేళ్లు శరపరంపరగా రచించాడు. తరువాత ఆయనకు జీవిత యధార్థాన్ని శోధించి చూడాలనే తపన పెరిగిపోయింది. దానివల్ల ఆయన ప్రకృతిపై అధిక ప్రీతితోపాటు సత్య శివశంకరుడైన పరమేశ్వరుని కోసం ఆరాటపడ్డాడు. దేశభక్తి, జాతీయ భావాలు ఆయనలో రూపొందాయి. ఆయన స్వార్థాతీత శీలం గల నిజమైన హైందవ జాతీయవాది అయ్యాడు.

క్రీ.శ.1901లో రవీంద్రుని 'నైవేద్యం' అనే భక్తి రసాత్మక కావ్యం ప్రచురించబడింది. ఈశ్వరానుభూతి గల కవి చైనత్యం, నిత్య జీవిత విధానంలోని పవిత్రత, మాతృభూమి యెడ కర్తవ్యం కావ్యంలో విషయాలు. క్రీ.శ.1905లో లార్డ్ కర్జన్ రాజ ప్రతినిధిగా ఉండగా వంగ రాష్ట్ర విభజన

జరిగింది. వంగవాసులు దృఢంగా నిలిచారు. రవీంద్రుని ఉపన్యాసాలు, గేయాలు ఎన్నడూ లేని విధంగా ప్రజలను ఆవేశపూరితం చేసాయి. ఆయన జాతీయ జీవితంలోని ప్రతి అంశంలో స్వయం సహాయాన్ని గురించి ప్రబోధించాడు. అయితే బ్రిటీష్ వారి మీద ద్వేషాగ్ని రగులుకొలిపే ఒక్క పదం కూడా ప్రయోగించలేదు.

వంగ దేశ విభజన వల్ల వ్యాప్తమైన విదేశ వస్తు బహిష్కరణం, స్వదేశీ ఉద్యమాలు భయానక రూపం దాల్చడంలో రవీంద్రుడు వాటిని అంగీకరించలేకపోయాడు. స్వదేశీ ఉద్యమంతో సన్నిహిత సంబంధం ఏర్పడిన దగ్గర నుండి, ఆయనలో హైందవ జాతీయత విస్తృతమవుతూ వచ్చింది. కొన్ని సంవత్సరాల తరువాత ఆయన జపాన్, అమెరికా ఖండాంతరాలలో జాతీయతను గూర్చి ఉపన్యాసాలు చేశాడు.

రవీంద్రుని కవితా రమణీయకానికి ముగ్దులై చాలామంది అనుయాయులు ఏర్పడ్డారు. ఆయన ప్రతిభా విశేషాలు చాలామంది సాహితీపరులు గుర్తించారు.

రవీంద్రుని మానవవాదం వల్ల, శిల్పం వల్ల ప్రభావితుడై శరశ్చంద్ర ఛటోపాధ్యాయ్ క్రీ.శ.19వ శతాబ్దం చివరలో రచనలు చేయడం ప్రారంభించాడు. రవీంద్రుని 'గీతాంజలి' కవితా సంపుటి క్రీ.శ.1912 ఆంగ్ల అనువాదంతో వెలువడింది. దానికి నోబుల్ ప్రైజ్ వచ్చింది. ఇది పాశ్చాత్య మేధావి వర్గంలో అపూర్వ సంచలనం తీసుకు వచ్చింది. ఆ ప్రభావం ఆ ప్రాంత యువకవులపైనే కాక తెలుగు ప్రాంతంలోని యువ కవులపై పడింది. దానివల్ల తెలుగు సాహిత్యంలో 'భావ కవిత్వం' వచ్చింది.

2.3.1. రవీంద్రుని కవితాతత్వం:

రవీంద్రుని తల్లిదండ్రులకు సంసారం పెద్దది కావడం చేత పిల్లల బాధ్యతను సంరక్షకునికి ఇచ్చారు. ఆయన రవీంద్రుని ఒక గదిలో బంధించేవాడు. దాంతో రవీంద్రునికి భావనా జగత్తే వాస్తవమైనదిగా కనిపించేది. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేవాడు. చిన్నప్పుడు ఎప్పుడూ ఊహలలో తేలిపోయేవాడు. ఆయన తన మొదటి పద్యాన్ని ప్రకృతిపరంగానే చెప్పాడు.

రవీంద్రుడు స్కూల్లో బెంగాలీ, ఇంగ్లీషు భాషలు నేర్చుకున్నాడు. వీరి దగ్గర బంధువైన జ్యోతి ప్రకాశ్ రవీంద్రుని పిలిచి పద్నాలుగు గణాలతో బెంగాలీ పద్యం రాయడం నేర్పించి, కవిత్వం

రాయమన్నాడు. అప్పటి నుండి కవితా జీవనం ప్రారంభం అయ్యింది. ఆయనకు కవిత్వంతోపాటు సంగీతం కూడా సహజంగా వచ్చింది.

తరువాత రవీంద్రుడు ఇంగ్లాండుకు వెళ్లి, లండన్ విశ్వవిద్యాలయంలో హెన్రీ మోర్లే వద్ద ఆంగ్ల సాహిత్యం చదివాడు. ఆయన ఇంగ్లాండులో ఒకటిన్నర సంవత్సరం మాత్రమే ఉన్నాడు. ఆ కాలంలోనే ఆంగ్లేయుల జీవితాన్ని, సాహిత్యాన్ని అవగాహన చేసుకున్నాడు.

క్రీ.శ.1882లో ఆకస్మాత్తుగా ఒక దివ్యానుభూతితో బాహ్య ప్రపంచం రవీంద్రుని ముందు ఆవిష్కృతమయ్యింది. ఈ అనుభూతిని తన 'జీవన స్మృతి'లో వివరించాడు. కొంత కాలానికి ఆయన తండ్రి బ్రహ్మసమాజ నిర్వహణ భారం రవీంద్రుని మీద వేశాడు. ఆ సమయంలో చాలా భక్తి గీతాలు రచించాడు.

క్రీ.శ.1884 ప్రాంతంలో నూతన హిందూ తత్త్వం బెంగాల్‌లో ఏర్పడింది. హిందూ మతానికి చెందిన ప్రతి అంశం చాలా గొప్పదని ఋజువు చేయడానికి చాలా మంది తాపత్రయపడ్డారు. అన్నిటికి అసంబద్ధమైన శాస్త్రీయ వివరణలు ఇవ్వసాగారు. రవీంద్రుడు అప్పట్లో ఈ హిందూ మతాన్ని హేళన చేస్తూ కొన్ని పద్యాలు, నాటకాలు, వ్యాసాలు రాసాడు.

గ్రామ సీమల్లో ఉండే రోజుల్లో రవీంద్రనాథ్‌కి జానపద సంగీతం అన్నా, సాహిత్యం అన్నా ఆసక్తి కలిగింది. ఆ రోజులలో రచించిన ఆయన పాటలపై జానపద సంగీత ముద్ర కనిపిస్తుంది. పాటలు పాడుకుంటూ తిరిగే సంచార గాయకుడు (బావుల్) లాలన్ ఫకీర్ కూర్చిన అనేక జానపద గీతాలను స్వయంగా సేకరించాడు.

క్రీ.శ.1905లో బెంగాల్ విభజనకు అంకురార్పణ జరిగింది. కలకత్తాకి దూరంలో ఉన్న నవ కాశీ, చిట్టగాంగ్ వంటి ప్రాంతాల పట్ల కలకత్తా నుండి శ్రద్ధ వహించడం సాధ్యం కాదని వైస్రాయి కర్జన్ వాదన. పరిపాలనా విషయంలో ఈ ఏర్పాటు బాగుంటుంది. విదేశీ పాలకుల పట్ల బెంగాలీలు నిర్మొహమాటంగా ఉంటారని వారిని బలహీనులను చేయడానికి రాష్ట్ర విభజనే మార్గమని బ్రిటీష్ పాలకులు అభిప్రాయపడ్డారు. కాని ఈ ప్రతిపాదనకు దేశమంతటా ప్రజలు నిరసన తెలిపారు. జాతీయ కవిగా రవీంద్రుడు ఉద్యమానికి ఉత్తేజం కల్పించడానికి అనేక దేశభక్తి గేయాలు రచించి, దేశాన్ని ఉర్రూతలూగించాడు.

"యంత్రాలు, వైజ్ఞానిక శాస్త్ర ఫలితాలు పాశ్చాత్యుల ఐహిక సంపదను పెంచాయి. పారిశ్రామికాభివృద్ధి, సామ్రాజ్య విస్తరణ వారికెంతో ఉత్సాహాన్ని కలిగించాయి. అటు జాతి, వర్ణ అహంకారాలకి, ఇటు అత్యాశ, స్వార్థపరత్వాలకి మధ్య సాహిత్యం ఉపేక్షింపబడింది. ఉబుసుపోక వ్యవహారంగా మారింది. ఆ సమయంలో 'గీతాంజలి' వెలువడింది" **(క్షితిశ్‌రాయ్,రవీంద్రనాథ ఠాగూర్, 1985, పుట.85–88).**

రవీంద్రుని జననం నుండి మరణం వరకు గల కాలంలో మానవ జీవితంలోని సంఘటనలు, పరివర్తనలు, ఈశ్వరాదేశాలు, మహత్తర సందేశాలు, పరమాత్మకు మానవునకు గల సన్నిహిత సంబంధం, విశ్వమైత్రి మొదలైన విషయాలు గీతాంజలిలో చెప్పాడు.

రవీంద్రుడు తన జీవిత, సాహిత్యాలను గురించి జీవిత చరిత్ర పుస్తకంలో చెప్పుకున్నాడు. మానవుడు శారీరకంగా గడిపే జీవితం వేరు. అతని ఆత్మ జీవితం లేదా ధర్మం వేరు. ఈ అవిచ్ఛన్నమైన ఉత్సాహ శక్తి, అత్మాంతర్గతమైన సృజనాత్మక శక్తి అస్థిత్వానికి కీలకం. అదే సుఖ దుఃఖాలను, లాభనష్టాలను, జీవనాధారమైన ప్రాతిపదిక సూత్రాలను ఏకైక సార్థక్యం కోసం ఏకోన్ముఖ ప్రవంతిగా నడిపిస్తోంది అని రవీంద్రుడు భావించాడు.

రవీంద్రుడు తనను తాను సౌందర్యాన్ని గురించి తెలిపే వార్తాహరుడిగా భావించాడు. ప్రాథమిక విశ్వసృష్టిలోని అవ్యక్తానందంతో పులకించి, నిరంతర పరిణామ క్రీడలో ఆనందించే ఆ సౌందర్యం ఈ విశ్వసృష్టి చైతన్యం. దానిని పదే పదే చెప్పాలని ప్రయత్నించాడు ఆయన. దుఃఖోద్వేగంలో మంచికీ, చెడుకీ జరిగే సంఘర్షణలో అనేక విధాల వ్యక్తమయ్యే వైవిధ్యంలో అంతర్లీనమైన ఆకాంక్షను అందించడానికి పూనుకున్నాడు రవీంద్రుడు.

రవీంద్రుడు జీవితంలో సర్వ ప్రాణులను ఆత్మీయతతో బంధించి ఉంచే పరబ్రహ్మ స్వరూపాన్ని ఆత్మ జ్ఞానంతో స్పృశించాలనుకున్నాడు. పరమాత్మకు అర్పించుకోగల స్వేచ్ఛ కోసం ఆశించాడు. విశ్వమానవతలో మనిషి నిజస్వరూపం ఉందని విశ్వసించాడు.

2.3.2. భావ కవిత్వంపై రవీంద్రుని బెంగాలి కవిత్వ ప్రభావం:

బ్రిటీష్ వారి పాలనా వ్యవస్థ ముందుగా కలకత్తాలో ఏర్పడింది. వారి ప్రభావం బెంగాలీయుల మీద పడింది. చిన్నప్పటి నుండి రవీంద్రుడు ఆంగ్ల సాహిత్యాధ్యయనం చేసాడు. ఆంగ్లానువాదాలు

చేసాడు. వాటిలోని సులభతను మాతృభాషలో ప్రవేశపెట్టాడు. వాడుక భాషలో, ఛందస్సు పాటించకుండా చాలా రచనలు చేసాడు. బ్రహ్మ సమాజం ప్రభావంతో బ్రహ్మ గీతాలను రచించాడు. శాంతి నికేతనం స్థాపించాడు. తెలుగు భావకవులు రవీంద్రుని దర్శించి, ఆయనలో నున్న గుణాలన్నింటిని అవపోసన పట్టారు. తిరిగి తమ ప్రాంతానికి వచ్చి మాతృభాషలో ప్రవేశపెట్టారు.

దేవదానవులు క్షీరసముద్రాన్ని మధించినపుడు అప్సరసలందరితోపాటు పుట్టింది ఊర్వశి. ఒక చేత విషపాత్రతో, ఇంకొకచేత అమృత పాత్రలో క్షీర సాగర తరంగాలపై నిల్చిన చిరయౌవనిగా, కాడలేని ఊర్వశిని రవీంద్రుడు వర్ణించాడు. రవీంద్రుని 'ఊర్వశి' పై ఋగ్వేద, కాళిదాస ప్రభావాలే కాక, గ్రీకు గాథల ప్రభావం కూడా కనిపిస్తుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఊర్వశి' పై రవీంద్రుని ప్రభావం ఉంది. ప్రియునితో హాలాహలం, అమృతం నాకు తోడు నీడలు, తోడ బుట్టువులు అంటుంది దేవులపల్లి కృష్ణశాస్త్రి ఊర్వశి. ఇది రవీంద్రుడు చెప్పిన అమృత విష పాత్రల ప్రసక్తిని గుర్తుకు తెస్తుంది. సంయోగ వియోగాలు, సుఖ దుఃఖాలు తనను వీడవని దీని అభిప్రాయం. ఒకటి రెండు సాదృశ్యాలున్నా దేవులపల్లి కృష్ణశాస్త్రి ఊర్వశి రవీంద్రుని రచన కన్న విలక్షణమైంది.

తెలుగులో జాతీయోద్యమ కవిత్వం రావడానికి రవీంద్రుని జాతీయ గేయాలు కొంత వరకు తోడ్పడ్డాయి. అప్పటికే ఆయన గేయాలు దేశంలో బాగా వ్యాప్తి చెందాయి. రాయప్రోలు సుబ్బారావు రచించిన 'జన్మభూమి' అనే దేశభక్తి గేయంలోని "పూర్వపుణ్యం వల్ల నీవు భరతఖండం నందు జన్మించినదా"న్నది రవీంద్రుని భావన. ఆయన "ఈ భూమి మీద జన్మించడం తన భాగ్యంగా చెప్పుకున్నాడు".

దేవులపల్లి కృష్ణశాస్త్రి "తన ప్రభుని చేతలను అర్థం చేసుకోలేక కృంగిపోతాడు. ఈ బాధతో ఎట్లు నిన్ను ఊహించుకోవడం, నీ నివాసం ఎక్కడ అంటాడు". ఇదే భావం రవీంద్రుడు 'గీతాంజలి' గేయంలో కూడా వ్యక్తపరచాడు. వేంకట పార్వతీశ్వర కవుల 'ఏకాంతసేవ'. రవీంద్రుని 'గీతాంజలి' కావ్యాల వస్తువు ఒక్కటే. రెండింటిలో యుగ యుగాల విశ్వమానవుని మధుర సాధన మధురంగా, మార్దవంబుగా, మంజులంగా చిత్రింపబడింది. ఈ రెండూ ప్రవిమల భక్తియుక్తుడైన భక్తుడు పరమేశ్వరుని గూర్చి పాడే మధుర గీతాలు.

'మృత్యువు ఒక జన్మకు మరొక జన్మకు సంధి' సూత్రం అని రవీంద్రుడు పునర్జన్మను అంగీకరించాడు. ఈ జన్మ సమాప్తం కాక తప్పదు. క్రొత్త జన్మ రాకపోదు. ఈ జన్మ నుండి ఇంకొక జన్మకు తీసుకునిపోయే సాధనం మృత్యవయితే ఇక భయమెందుకు అంటాడు రవీంద్రుడు. మృత్యువు దగ్గరకు వస్తే నా చేయి పట్టుకుని తీసుకు వెళ్లు అంటాడు. మృత్యువు గురించి ఈ అభిప్రాయం దువ్వూరి రామిరెడ్డి రచనలో కనిపిస్తుంది. 'జీవితం, మృత్యువు జంట బిడ్డల వంటివని' ఆయన అన్నాడు. మృత్యువును 'సకియ'గా భావించడం ఒక విలక్షణత.

దువ్వూరి రామిరెడ్డి ఊహించిన 'మృత్యుమూర్తి' రవీంద్రుని 'ఊర్వశి'లోని కొన్ని లక్షణాలను పోలుతుంది. ఆయన ఆమె 'సుఖకర నిశ్శబ్ద చుంబనాన్ని' ఆశించాడు. ఇది రవీంద్రుని మృత్యువునకు సంబంధించిన 'Cold Kisses' లోని భావనను పోలి ఉంది. ప్రాణి కోటులు తిరిగి జన్మనెత్తడంలో సహాయం చేయడానికి ప్రకృతి మృత్యువును నియమించిందని 'మృత్యువు' అనే ఖండికలో చెప్పాడు. రవీంద్రుని పునర్జన్మ సిద్ధాంతాన్ని దువ్వూరి రామిరెడ్డి చెప్పాడు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి 'మహతి' గేయ సంపుటిలో రవీంద్రుని 'గీతాంజలి' లాగా కులమతాతీతమైన సమతా భావం, ఆహంకార నిరసనం, సంపూర్ణంగా తనను తాను భగవంతుని అర్పించుకోవడం కనబడతాయి. క్రీ.శ.1902లో రవీంద్రుని భార్య మృణాళినీ దేవి మరణంతో ఆయన 'స్మరణ్' అనే పేరుతో రెండు స్మృతిగీతాలు రచించాడు. దీనిలో తాత్త్విక చింతనలో పడిపోయి, 'ప్రేమ అనేది నా చావుకు దారి' అన్నాడు. ఈ కోవలో తెలుగులోని సతీస్మృతి కావ్యాలు రాసినవారిలో విశ్వనాథ సత్యనారాయణ 'వరలక్ష్మీ త్రిశతి', దువ్వూరి రామిరెడ్డి 'భగ్న హృదయం', దేవులపల్లి కృష్ణశాస్త్రి 'కన్నీరు' ముఖ్యమైనవి.

2.4. మత, సాంఘిక సంస్కరణోద్యమాలు:

క్రీ.శ.19వ శతాబ్దంలో వచ్చిన క్రైస్తవ మతం హిందూ మత సంప్రదాయాల మీద ప్రభావం చూపింది. క్రైస్తవ మత ప్రచారం కోసం స్థాపించిన మిషనరీలు తమ నాగరికతను, ఆచారాలను భారతదేశంలో ప్రవేశపెట్టాయి. దాని వల్ల హిందూ మతంలో వస్తున్న మార్పులకు వ్యతిరేకంగా మత సాంఘిక సంస్కరణోద్యమాలు భారతదేశంలో మొదలయ్యాయి. 'బ్రహ్మ సమాజం' అటువంటిదే.

2.4.1. భారతదేశం – బ్రహ్మ సమాజం:

పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే మార్గాల ద్వారా కేవలం అవే మహాశక్తిని తెలుసుకోవడానికి వీలుందని ఉపనిషత్తులు చెబుతున్నాయి. బ్రహ్మతత్త్వం అంటే దేవుని గురించిన జ్ఞానం. అది ప్రకృతికి అతీతమని, దానిని తెలుసుకోవడం అసాధ్యమని ఉపనిషత్తులు ఎక్కడా చెప్పలేదు. శాస్త్రాలను బాగా అధ్యయనం చేసి, బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోవాలని మాత్రం చెబుతున్నాయి. ఈ జగత్తుకు కారణం ఆ కేవలమేనని, అందుకు సృష్టి, స్థితి, లయలే సాక్ష్యాలని వేదాంతం ఒక సిద్ధాంతాన్ని రూపొందించింది. దీనిని బట్టి బ్రహ్మను తెలుసుకోవడానికి మనస్సు, బుద్ధి, జిజ్ఞాసలే మార్గమని స్పష్టంగా తెలుస్తోంది. సత్యాన్వేషణకు రాజారామ మోహన్‌రాయ్ ఈ మార్గాన్ని అనుసరించాడు. అయినప్పటికీ శాస్త్రాల ఆధిక్యతను ఆయన ఎప్పుడూ ఖండించలేదు. శాస్త్రాలను పరిశీలించి అర్థం చేసుకున్న తరువాత వాటిని అంగీకరించాలని, అంతేగాని, ప్రతి పుక్కిటి పురాణాన్నీ శాస్త్రంగా, గుడ్డిగా నమ్మరాదని ఆయన వాదం.

ప్రజలలోని మూఢ నమ్మకాలు, దురాచారాలు, బాల్య వివాహాలు, బాల్య వైధవ్యాలు, స్త్రీల అవిద్య, అజ్ఞానం వంటివి పోవాలంటే ఆలోచనా విధానాలు మారాలని బోధిస్తూ రాజారామ మోహన్‌రాయ్ క్రీ.శ.1815లో 'ఆత్మీయ సభ'ను స్థాపించాడు. దాని ద్వారా కన్యాశుల్కం, కుల భేదాలు, సతీ సహగమనం పోవాలని, స్త్రీలకు ఆస్తి హక్కు ఉండాలని పోరాడాడు. కానీ ఆ సభ క్రీ.శ.1819లోనే ప్రచారం లేక ఆగిపోయింది.

ఆ తరువాత పది మంది సభ్యులతో 'ఏకేశ్వర సంఘం' నడిచింది. అది కూడా కొద్ది రోజులలో ఆగిపోయింది. ఏకేశ్వరోపాసనకు ప్రత్యేకమైన సంస్థను ఏర్పాటు చేయవలసిన అవసరముందని రాజారామ మోహన్‌రాయ్ శిష్యులు తలంచారు. ఏకేశ్వరోపాసకులు కలుసుకోవడానికి ఒక సమావేశ భవనం ఉండాలని చంద్రశేఖర్ దేవ్ అనే శిష్యుడు సలహా చెప్పగా, రాజారామ మోహన్‌రాయ్ 20–03–1828లో 'బ్రహ్మ సభ'ను ఆవిష్కరించారు.

బ్రహ్మ సభ స్వంత భవనంలోకి మారే సందర్భంలో 08–01–1830లో ఆ భవనానికి, బ్రహ్మసభకు సంబంధించి, ధర్మకర్తల కార్యనిర్వహణ పత్రమొకదానిని రాజారామ మోహన్‌రాయ్

చాలా పకడ్బందీగా రాశాడు. "ఈ భవన సముదాయాన్ని, దీని పరిసరాలను ప్రజలందరూ ఏ విధమైన వర్గ భేదాలు లేకుండా బహిరంగ సభలు నిర్వహించడానికి ధర్మకర్తలు అనుమతించాలి. ఆ ప్రజలు క్రమశిక్షణతో, ప్రశాంతతతో, భక్తి శ్రద్ధలతో మెలుగుతూ, శాశ్వతమైనది, వెతకరానిది, మారనిది అయిన బ్రహ్మను, విశ్వకర్తను, విశ్వ రక్షకుడని ప్రార్థించాలి. ప్రాణ సహితమైన దానిని గాని, ప్రాణ రహితమైన దానిని గాని ఏ మానవుడు గాని, ఏ మానవ సముదాయం గాని పూజించరాదు. ఆ వస్తువును ప్రార్థన ద్వారా గాని, ఇంకా ఏ ఇతర పూజా కార్యక్రమాల ద్వారా గాని పూజించరాదు. ఆ విశ్వకర్త, విశ్వ రక్షకుడు ఆశించిన నీతి, పవిత్రత, ఔదార్యం సుగుణాలను ప్రోత్సహించే విధంగా ప్రార్థించాలి. ఆ ప్రార్థనలు మానవుల మధ్య, మతాల మధ్య సంబంధాన్ని పెంపొందించేవిగా ఉండాలి" (Saumyendranath Tagore. Raja Rammohan Roy. p.44 &45).

ఆ పత్రాన్ని బట్టి బ్రహ్మసభను ఒక క్రొత్త మతంగా స్థాపించాలని రాజారామ మోహన్‌రాయ్ అనుకోలేదని తెలుస్తోంది. బ్రహ్మసభామందిరాన్ని అన్ని మతాలకు సంబంధించిన ఏకేశ్వరోపాసకులు తమ స్వంత భవనమని తలంచాలని కోరుకున్నాడు. దేవుడు రూపం లేనివాడని, శాశ్వతుడని, వెతకడానికి వీలులేనివాడని, మారనివాడని నమ్మే ఏకేశ్వరోపాసకులు ఏ మతానికి చెందినవారైనప్పటికి ఆ భవనంలో సమావేశం కావాలని కోరుకున్నాడు. ధర్మకర్తల కార్య నిర్వహణ పత్రం గురించి మాట్లాడుతూ ఎమ్.జి. రనడే అనే సంస్కరణవాది, "ఆ పత్రపు ఆధ్యాత్మికత, పవిత్రత, విశ్వవ్యాప్తమైన సహనం అర్థం చేసుకోవడానికి, దాని సౌందర్యాన్ని అనుభవించడానికి ప్రజలకు ఎన్నో శతాబ్దాలు పట్టుతుందని" చెప్పాడు. దైవ ప్రార్థన చేసుకోవాలని కోరేవారికి సమావేశ వేదికగా మాత్రమే బ్రహ్మసభను స్థాపించాడని "ప్రముఖ భారతీయ జర్నలిస్టు రామానంద ఛటర్జీ చెప్పాడు. క్రీ.శ.1906లో రఘుపతి వేంకటరత్నం నాయుడు కలకత్తా బ్రహ్మ సమాజ సమావేశంలో అధ్యక్షోపన్యాసం ఇస్తూ" దైవ ప్రార్థనకు బ్రహ్మ సమాజం ఒక ఆధ్యాత్మిక సమానత్వ వేదిక అని, దానిని కృత్రిమ భేదాలు, మత భేదాలు లేకుండా మనిషికీ మనిషికీ మధ్య అడ్డుగోడలు లేకుండా, నీతి, పవిత్రత, దానం, ఔదార్యం పెంపొందించే వేదికగా రూపొందించడం ధర్మకర్తల కార్యనిర్వహణ పత్రపు పవిత్ర ఉద్దేశాలుగా అభివర్ణించారు.

రాజారామ మోహన్‌రాయ్ బ్రహ్మ సభను వేరొక మతంగా గాక, అన్ని మతాలకు చెందిన ఏకేశ్వరోపాసకలు సమావేశ వేదికగా స్థాపించాడని మొత్తం మీద అందరూ అంగీకరిస్తున్నారు. తరువాత దేవేంద్రనాథ్ టాగోర్ ఆధ్వర్యంలో బ్రహ్మసభ క్రమంగా 'బ్రహ్మసమాజం'గా ఒక ప్రత్యేక మతంగా మారింది. ప్రత్యేక నియమాలు ఏర్పడ్డాయి. హిందువులకు తప్ప ఇతర మతస్థులకు అక్కడ చోటు లేకుండా పోయింది. కర్మకాండ ప్రారంభమైంది. ఆ కర్మకాండ ననుసరించి 26–07–1861లో బ్రహ్మ సమాజ ఆధ్వర్యంలో మొట్టమొదటి వివాహం జరిగింది.

రాజారామ మోహన్‌రాయ్ ప్రభావం సాహిత్యం మీద పడింది. దాని వల్ల రవీంద్రుని 'గీతాంజలి', 'తోటమాలి' (Gardener) మొదలైనవి, మైకేల్ మధుసూదన్ దత్తు, బంకించంద్ర ఛటోపాధ్యాయ వంటి వారి రచనలు సాహిత్యంలో క్రొత్తదనాన్ని తెచ్చాయి. వాటి ప్రభావం తెలుగు సాహిత్యం మీద కూడా కనిపిస్తుంది.

2.4.2. ఆంధ్రదేశం–బ్రహ్మసమాజం:

క్రీ.శ.1864లో కేశవ చంద్రసేన్ మిషనరీ పర్యటనకు మద్రాస్ వచ్చాడు. అప్పుడు బ్రహ్మ సమాజం మీద ఉపన్యాసాలు ఇచ్చాడు. ఆ ప్రభావంతో ఆ సంవత్సరం 'వేద సమాజం' స్థాపించబడింది. ఇది వర్ణ వ్యవస్థను నిరసించింది. వితంతు వివాహాలను ప్రోత్సహించింది. స్త్రీ విద్య అవసరాన్ని నొక్కి చెప్పింది. ప్రార్థనా పుస్తకాలను ప్రచురించింది. క్రీ.శ.1882లో దక్షిణ భారతదేశంలో 'సాధారణ బ్రహ్మసమాజం' స్థాపించబడింది. దానిలో రఘుపతి వేంకటరత్నం నాయుడు వంటివారు పని చేశారు. అది అనాథ శిశువుల కోసం Brahmo Ragged Schoolను, రాజారామ మోహన్‌రాయ్ రాత్రి పాఠశాలను, Theistic లైబ్రరీని నడిపించింది. The Brahmo Orphan Asylum Press ని కూడా స్థాపించింది.

క్రీ.శ.1878లో మొట్టమొదటి 'ప్రార్థనా సమాజం' రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యింది. అది బ్రహ్మ సమాజం సూత్రాలతోనే ఏర్పడింది. సభ్యులలో కులబేధం లేదు. ఆయన ఆ సమాజాన్ని స్థాపించక పూర్వమే 'వివేక వర్ధిని' పత్రికలో విగ్రహారాధనకు వ్యతిరేకంగా, ఏకేశ్వరోపాసనను సమర్థిస్తూ వ్యాసాలు రాశాడు. ఆయన జన్మరాహిత్యాన్ని, శాశ్వతమైన, నిజమై దేవుని పట్ల భక్తిని ప్రకటించాడు.

కందుకూరి వీరేశలింగం ఎక్కువగా స్త్రీ సమస్యల మీద దృష్టి నిలిపాడు. క్రీ.శ.1874లో కొక్కొండ వేంకట రత్నం స్త్రీ విద్యకు ప్రతికూలంగా ఆంధ్ర భాషా సంజీవనిలో రాయగా, ఆయన వాదాన్ని ఖండిస్తూ కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్యకు అనుకూలంగా 'పురుషార్థ ప్రదాయని' పత్రికలో వ్యాసాలు రాశాడు. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ధవళేశ్వరంలో ప్రముఖులందరూ చందాలు వేసుకుని బాలికా పాఠశాలను స్థాపించారు.

స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతం అని క్రీ.శ.1879 ఆగస్టు 3న బాలికా పాఠశాల మందిరంలో ఉపన్యాసం కందుకూరి వీరేశలింగం ఇచ్చాడు. దాని మీద చాలా వాదోపవాదాలు జరిగాయి. ఆయన మద్రాసులో 'వితంతు శరణాలయాన్ని' తన ఇంట్లోనే నడిపాడు. ఇంట్లో ఇద్దరో, ముగ్గురో వితంతువులు ఉండేవారు. వారికి చదువు చెప్పించడంతోపాటు అన్ని సౌకర్యాలను సమకూర్చాడు. స్త్రీ పునర్వివాహం గురించి క్రీ.శ.1880లో 'వివేక దీపిక' అనే నాటకాన్ని, స్త్రీ విద్య, అభివృద్ధి కోసం 'సత్యవతీ చరిత్ర' అనే ప్రబంధాన్ని రచించాడు.

స్త్రీలకు జరిగే అన్యాయాలను 'సత్యరాజ పూర్వదేశ యాత్రలు' ప్రథమ భాగంలో చెప్పాడు. ఇంకా స్త్రీల కొరకు విక్టోరియా మహారాణి చరిత్ర, స్త్రీ నీతి దీపిక శతకం, సత్యా ద్రౌపదీ సంవాదం, మాతృపూజ, పితృపూజ వంటివి రచించాడు. బాల్య వివాహాలు, విగ్రహారాధన, ఏకేశ్వరోపాసన, స్త్రీ పునర్వివాహ చరితం, ప్రార్థన వంటి విషయాల మీద సభలో చాలా ఉపన్యాసాలిచ్చాడు.

క్రీ.శ.1870–80 మధ్య ఆంధ్ర దేశంలో ముఖ్య పట్టణాలన్నింటా బ్రహ్మ సమాజాలు ఏర్పడ్డాయి. బ్రహ్మ సమాజం ఏకేశ్వరోపాసనను ప్రతిపాదించింది. విగ్రహారాధన వద్దంది. మత భేదాలతో కూడిన వర్ణ వ్యవస్థను కాదని, వర్ణాంతర వివాహాలను సర్వ వర్ణ సహపంక్తి భోజనాలను ప్రోత్సహించింది. అనాథ శరణాలయాలను స్థాపించింది. అంటరానితనాన్ని నిరసించి, నిమ్నజాతుల అభ్యున్నతి కోరింది.

కందుకూరి వీరేశలింగం ప్రభావం ఆనాడు ఆంధ్రదేశంలోని విద్యావంతుల మీద పడింది. వారిలో ముఖ్యమైనవాడు రఘుపతి వేంకటరత్నం నాయుడు. ఆయన కందుకూరి వీరేశలింగం మరణానంతరం హితకారిణీ సమాజానికి అధ్యక్షుడై, ఆ సంస్థ కార్యకలాపాలు కొనసాగించాడు. ఆయన వేశ్యలకు వివాహాలు చేసి, గౌరవప్రదమైన కుటుంబీకులుగా చేసేందుకు తన జీవితాన్ని

ధారపోసాడు. కాకినాడలో పిఠాపురం రాజా ధన సహాయంతో దాని కోసం అనేక సంస్థలను నిర్మించాడు. వర్ణాంతర వివాహాలకు ప్రోత్సాహం కల్పించాడు. అస్పృశ్యతా నిర్మూలనకు తీవ్ర కృషి చేశాడు. ఆయన ప్రోత్సాహంతో కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాలలో అంటరాని వారికి ప్రవేశం కలిగింది.

రఘుపతి వేంకటరత్నం నాయుడు విద్యారంగంలో ఉండడం వల్ల విద్యావంతులను ప్రభావితం చేయగలిగాడు. ఆయన విద్యార్థినులకు, క్రింది కులాల వారికి ఉచితంగా విద్య బోధించాడు. ఆయన ప్రభావం ఆనాటి యువ కవుల మీద అధికంగా పడింది. వారిలో ముఖ్యుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఆ ప్రభావంతో రఘుపతి వేంకటరత్నం నాయుడి ఆంగ్ల సూక్తులను "ఋగ్వీ " పేరుతో అనువదించాడు. 'మహతి' అనే గేయ సంపుటిని రచించాడు.

కాకినాడకు చెందిన పైడా రామకృష్ణయ్య కందుకూరి వీరేశలింగం చేసే వితంతు వివాహాలన్నింటికి ధన సహాయం, ఆ కుటుంబాలకు ఉపాధి కల్పించాడు. రాజమండ్రికి చెందిన బసవరాజు గవర్రాజు ప్రతి విషయంలో ఆయనకు కుడి భుజంగా ఉన్నాడు. చిలకమర్తి లక్ష్మీనరసింహం స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్నాడు. పత్రికలలో బ్రిటీష్ విధానాలను ఖండించాడు. గేయాలు రచించాడు. హరిజన పాఠశాలను స్థాపించాడు. మత మౌఢ్యాన్ని ఎదుర్కొన్నాడు. ఉన్నవ లక్ష్మీనారాయణ వితంతు వివాహాలను చేశాడు. బాలికల విద్యా ప్రచారానికి 'శారదా నికేతనం' అనే విద్యాలయాన్ని స్థాపించాడు. ఆనాటి స్థితిగతులకు ప్రతిబింబంగా 'మాలపల్లి' అనే నవలను రచించాడు.

2.4.3. సాహిత్యం–బ్రహ్మ సమాజం:

ఆ కాలంలో బ్రహ్మసమాజం సాహిత్యం మీద చాలా ప్రభావాన్ని కలిగించింది. ఆనాటి కవులంతా సంస్కరణోద్యమానికి సాహిత్యాన్ని ఆయుధంగా వాడారు. మొట్టమొదట బెంగాలీ బ్రహ్మ సమాజం మీద ఉన్న పుస్తకాలను తెనిగించారు. ఈ విధంగా తెనిగించిన వారిలో పలవర్తి నరసింహం, ఆకులరాతి కృష్ణమూర్తి, కామరాజు హనుమంతరావు, కవికొండల సాంబశివరావు, పిళ్లారిసెట్టి సీతారామయ్య ముఖ్యులు.

గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటకం ద్వారా సంస్కరణోద్యమానికి గొప్ప సేవ చేశాడు. ఆయన ఉద్యమ నిర్మాణం చేయకపోయినా, ఆయన ఆలోచనలు సమకాలీన విద్యావంతులు. మేధావులతో పోలిస్తే చాలా ప్రగతిశీలమైనవి. 'పూర్ణమ్మ' గేయం కన్యాశుల్కానికి బాలికలు ఆనాడు ఎలా బలైపోతున్నారో వివరించింది. జాతీయోద్యమం నడుస్తున్న కాలంలో గురజాడ అప్పారావు 'దేశభక్తి' గేయం రాశాడు. అందులో దేశభక్తిని ప్రబోధిస్తూ కుల, మత భేదాలను నిరసించాడు. సమానత్వం కోసం కలగన్నాడు.

"రాయప్రోలు సుబ్బారావు సంస్కరణాభిలాషకు 'స్నేహలత' కావ్యం నిదర్శనం. పదునాలుగు సంవత్సరాల బాలిక వరశుల్కానికి నిరసనగా ఆత్మార్పణ చేసుకోవడం ఇందులోని ఇతివృత్తం. ఆ కావ్యం వంగ దేశంలో జరిగిన యథార్థ గాథ. అందులో స్నేహలత 'కన్యను పెండ్లి ఆడడమా? లేదా కన్యాశుల్కాన్ని పెండ్లి ఆడడమా? అని పెండ్లి కొడుకుని ఎవరూ అడగరే' అని లోకాన్ని ప్రశ్నిస్తుంది"**(సుబ్బారావు, రాయప్రోలు,స్నేహలత,1963, పుట.22).**

రాయప్రోలు సుబ్బారావు "ఛండాలుడనే భేదం ఎందుకు? బ్రాహ్మణ ఆగ్రహారంలో పగలు, రాత్రి, గాలి వేరుగా ఉంటాయా?" అని అంటరానితనాన్ని నిరసించాడు. ఇంకా "మానవులు స్నేహాన్ని వదిలి పశువులు కావద్దు. కాలే కడుపుకి గరిటెడు గంజి, శరీరానికి మూరెడు బట్ట అందరకూ దొరికే చల్లని రోజు కోసం వెదకండీ" అని ప్రబోధించాడు.

అస్పృశ్యతను కవులు వ్యతిరేకించారు. గురజాడ అప్పారావు 'లవణరాజు కల'లో "మంచి అన్నది మాలైతే, ఆ మాల నేనవుతా" అన్నాడు. హరిజనుల దేవాలయ ప్రవేశాన్ని సమర్థిస్తూ గీతాలు చాలా మంది కవులు రాశారు. "మాట తప్పినవాడు మాలకాక, అన్నెము పున్నెమెరుగని అతడు మాలనా?" అని 'వంచమాభినందన'లో వేంకట పార్వతీశ్వర కవులు ప్రశ్నించారు.

రాను రాను బ్రహ్మ సమాజోద్యమం సాధనాశ్రమం స్థాపించి, ప్రచారకులను, సాధకులను తయారుచేయడంలో విఫలం అయ్యింది. దానికి ముఖ్యమైన కారణాలు రెండు. జాతీయోద్యమం క్రీ.శ.1920 తరువాత అభివృద్ధి చెందడం, బ్రాహ్మణేతరుల ఉద్యమం రావడం. ఆంధ్ర దేశంలో మత సంస్థలు మత ప్రచారానికి పనిచేస్తూ తమ సాహిత్యాన్ని కూడా వ్యాపింప చేసాయి. ఆ సాహిత్యానికి

విద్యావంతులు ఆకర్షణ పొంది, మాతృభాషలో నూతన ప్రక్రియలకు దోహదం చేశారు. ఈ విధంగా భావ కవిత్వం తెలుగు సాహిత్యంలో స్థానం సంపాదించింది.

* * * * * *

అధ్యాయం- 3

తెలంగాణలో భావకవిత్వం – ప్రారంభ వికాసాలు

మూడవ అధ్యాయం

తెలంగాణలో భావకవిత్వం – ప్రారంభ వికాసాలు

3.0. తెలంగాణ భావకవిత్వం– నేపథ్యం:

తెలుగు సమాజల్లో భావ కవిత్వం 20వ శతాబ్దం తొలినాళ్లలో విస్తరించింది. కానీ ఇంతవరకు మనకు తెలిసిన, మనం చదువుకున్న సాహిత్య చరిత్రలు, పరిశోధన గ్రంథాలు భావ కవిత్వం అంటే ఆంధ్ర కవిత్వం అనే విధంగానే చూపించారు. ఈ నేపథ్యంలో 'తెలంగాణలో భావకవితా వికాసం' అనే సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా అచ్చు వేసింది. దీనికి 'సామిడి జగన్ రెడ్డి' సంపాదకత్వం వహించారు. దీనిని ఆధారంగా తీసుకొని తెలంగాణలో భావ కవిత్వాన్ని రెండు దశలుగా విభజించుకోవడం జరిగింది. 1920–43 వరకు ఒక దశ, 1948–66 వరకు మరొక దశ.

3.1. తెలంగాణ ప్రాచీన సాహిత్యంలో భావకవిత్వ చ్ఛాయలు:

"పుడమికి నడగని భువనైక శక్తి
వారికి కరగని వరణీయ శక్తి
కీలల గాలని కేవల శక్తి
గాలికి తూలని ఘనతర శక్తి
యాకసంబందని యద్భుతశక్తి
అతిపురాతన తత్త్వమగు పరాశక్తి"

–వెంకటపార్వతీశకవులు,

(తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ, 2016, పుట.21)

ఈ సృష్టికి మూలమైన 'శక్తి' ఒకటి ఉందని, ఆ పరమాత్మే జగన్నాటకాన్ని ఆడిస్తూ ఉంటాడని ఆర్యుల ప్రగాఢ విశ్వాసం. ఈ విశ్వాసమే దైవ స్వరూపానికి మూలం. ఆ స్వరూపమే భగవంతుడు మతానికి భక్తికి విడదీయరానంత ప్రకృష్టమైన బంధం ఉంది. ప్రతి మతానికి ఒక దేవుడు, ఒక పవిత్ర గ్రంథం, ఒక భక్తి విధానం తప్పనిసరి. మానవాళికి మతమే ప్రధాన జీవన విధానమైంది. హిందు

మతానికి మూలం వేదాలు, పురాణాలు వాటి ఆధారంగా సంస్కృతంలో భక్తి సాహిత్యం వెలువడింది. ఆ ప్రభావంతోనే తెలుగులో కూడా భక్తి సాహిత్యం వెలువడిందని చెప్పవచ్చు.

భావకవిత్వంలో వెలువడిన వివిధ శాఖలలో భక్తి కవిత్వం కూడా ఒకటి. దీనిని ఆంగ్లంలో Mystic Poetry అంటారు. Mystic అనగా "one who sees by contemplation and self surrender to obtain union with or absorption into the deity or who believes in the spiritual apprehension of truths inaccessible to the understanding" అని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు డిక్షనరీ ఇచ్చిన అర్థము.**(నారాయణరెడ్డి, సి , ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు–ప్రయోగములు,1977, పుట.433).**

భక్తుడు భగవంతుని ప్రత్యక్షముగా చూసెందుకు, అతనిలో లీనమగుటకు పొందు ఉత్కంఠమే భక్తి అని అర్థం."సాత్వస్మిన్ పరప్రేమరూపా" అని నారద భక్తి సూత్రాలలో భక్తి నిర్వసించబడింది. స్త్రీ, పురుషులకు పరస్పర అనురాము కేవలం ప్రేమ మాత్రమే. భగవంతుని యందుగల ప్రేమ దీనికి భిన్నము. అందుకే దీనిని భగవద్రతి అన్నారు. ఇది అహంకార రహితమైనది, అవ్యాజమైనది, విషయగంధ విధూరమైనది.

పూజ్యపూజక భావమే భక్తికి మూలభీజమువంటిది. పూజ్యపదార్థాన్ని పొందుటకు భక్తుడు చేసే ప్రయత్నము సాధన. ఈ సాధన అనేక రూపాల నుండి వస్తుంది. దాస్యభక్తి, సఖ్యభక్తి, వాత్సల్యభక్తి, మధురభక్తి మొదలైనవి దీని రూపాలు.

"భక్తి అనగా సర్వావస్థలయందు సర్వకాలములయందు తైలధారవలె హృదయం అందు విచ్ఛినమైనది. భక్తుని మనోవృత్తి భగవంతుని ఎడబాయకుండుట మరియు అమృతస్వరూపమైనది. భగవద్గుణములను వినుట, చెప్పుట భక్తి సాధనములు" అని కొందరు భక్తిని వివరించారు. భక్తిని గురించి చాలా నిర్వచనాలున్నాయి. భక్తి మౌలికంగా భగవంతుని అర్చించడం, భగవంతునితో సంలీనం కావడం అనే అర్థం సంతరించుకొంది.

"భక్తి భావనకు సైద్ధాంతిక రూపమిచ్చిన నారద భక్తి సూత్రాలలో భగవంతునియందు పరమప్రేమ కలిగి ఉండటం, శుద్ధ ఆత్మస్వరూపంతో అవిచ్ఛినమైన ఆత్మరతిని ఊహించడమే భక్తి అని చెప్పబడింది".**(రాములు, పిల్లలమర్రి, తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ, 2004,**

పుట. 30). అంటే అత్యున్నతమైన ప్రేమ స్వరూపమే భక్తిగా భావించారు. భగవంతుని అర్చించే భావాన్ని రతిలో పోలుస్తారు. భక్తిని రసంగం నిరూపించింది. రూపగోపస్వామి అయితే స్థాపించి ప్రచారం చేసినది మధుసూదన సరస్వతి. భక్తి రసానికి స్థాయిభావం 'మధురరతి' అని వివరించారు.

తెలుగులో భక్తి కవిత్వాన్ని అభివ్యక్తికరణను బట్టి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం ఇలా వర్గీకరించారు.

1) "ఆత్మాశ్రయ భక్తి కవిత: స్వీయ భక్తి భావనలనూ, అనుభవాలను, సంఘర్షణలను 'శరాణగతి' విధంగా వ్యక్తం చెయ్యడం.

ఉదా: పోతన భాగవతంలో గజేంద్రుని భక్తి.

2) పరాశ్రయభక్తి కవిత: కవి కావ్య పాత్రల ద్వారా భక్తిని వ్యక్తం చెయ్యడం.

ఉదా: కాళహస్తి మహాత్మ్యం (ధూర్జటి).

3) ప్రబోధాత్మకభక్తి కవిత: భక్తి ఆధారంగా లోకానికి హితవు చెప్పడం.

ఉదా: పోతన భాగవతం.

4) మార్మికభక్తి కవిత: ప్రతీకలు, కవి సమయాలు మొదలైన వాటిలో గూఢత ఆధారంగా భక్తిని వెల్లడించడం.

ఉదా: వేంకటపార్వతీశ కవుల 'ఏకాంతసేవ'.

5) తాత్వికభక్తి కవిత: వివిధ తాత్త్వికాంశాలను కవిత ద్వారా వెల్లడించడం.

ఉదా: పండితారాధ్యుని 'శివతత్త్వసారం'.

6) మధురభక్తి కవిత: స్త్రీ పురుషుడిని ఆశించినట్లు భక్తుడు భగవంతుని ఆశించడం.

ఉదా: భాగవతంలోని గోపికల రాసక్రీడలు."

(తెలుగులో కవిత్వోద్యమాలు,తెలుగు అకాడమీ.2016,పుట.23)

ప్రాచీన సాహిత్యంలో భక్తి కవిత్వం అనగానే మనకు గుర్తొచ్చే కవి బమ్మెర పోతన. ఈయన జనగామ జిల్లా (ఉమ్మడి వరంగల్) బమ్మెర గ్రామంలో 15 శతాబ్దంలో తల్లి లక్కమాంబ, తండ్రి కేసన దంపతులకు జన్మించాడు. ఈయన రచించిన గ్రంథాలు బోగిని దండకం, వీరభద్ర విజయం, నారాయణ శతకం, ఆంధ్ర మహాభాగవతం. ఈ గ్రంథం పూర్తిగా భక్తి కవిత్వంతో నిండి ఉందని

చెప్పవచ్చు. భాగవతం ఒక కల్పవృక్షం అని చెప్పవచ్చు. ఈ భాగవత కల్పవృక్షాన్ని పోతన ఇలా వర్ణించాడు.

మ II "లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం
జులతా శోభితమును, సువర్ణ సుమన స్సుజ్జేయమున్, సుందరో
జ్జ్వల వృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరుర్విన్ సద్ద్విజశ్రేయమై"

(భాగవతం.1 స్కంధం.20)

పోతన భాగవతంలో భక్తి కవిత్వానికి రూపాంతరములు అయిన దాస్యభక్తి, సఖ్యభక్తి, వాత్సలభక్తి, మధురభక్తి కనిపిస్తాయి. హనుమంతుడిది దాస్యభక్తి, అర్జునునిది సఖ్యభక్తి, యశోదది వాత్సలభక్తి, గోపికలది మధురభక్తి, స్థూలముగా మన సంప్రదాయములో భక్తి స్వరూపమిది. ఈ విధమైన భక్తి కవిత్వాన్ని భావకవులు భక్తి కవిత్వంలో పలువురు వెలయించి ఉన్నారు. **(నారాయణరెడ్డి, సి, ఆధునికాంధ్ర కవిత్వం ,సంప్రదాయములు–ప్రయోగములు.1977, పుట.432)**

"తెలంగాణ ఆదికవిగా పాల్కురికి సోమనాధుడిని పేర్కొంటారు. ఈయన జనగామ జిల్లాలో పాలకుర్తి గ్రామంలో జన్మించాడు. 12వ శతాబ్దానికి చెందినవాడు. ఈయన శివరూపమైన విద్యలో విశేషంగా రమించేవాడు కాబట్టి వీరశైవుడు అన్నారు. అంటే శివభక్తి వీరస్వరూ పాన్ని ధరించాడన్నామాట. ఈయన కవిత్వం సంఘసంస్కరణకి నాంది పలికింది. దేశీయ కవిత్వానికి పట్టాభిషేకం చేసింది. తెలుగు భాషకు గౌరవం కలిగించింది. ఈయన కవిత్వంలో ఈయన రచించిన గ్రంథాలలో అంటే వృషాదీపశతకంలో కాని, చతుర్వేదసారంలో, బసవపురాణంలో, పండితారాధ్య చరిత్రలో భక్తి కవిత్వం కనిపిస్తుంది.

అలాగే ఈయన రచించిన పండితారాధ్య చరిత్రలో వర్ణనానైపుణ్యము అనగా ప్రకృతి వర్ణనలు స్వభావోక్తి రమణీయములు, వేకువ జామున కూయుచున్న కోడిని వర్ణించిన విధము చూడవచ్చు.

"తొలికోడి కనువిచ్చి నిలిచియై వెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున గాలార్చి కంఠంబు విచ్చి

ముక్కున నీకెలు చక్కొల్పి కడుపు

నిక్కించి మెడసాని నిక్కి మిన్నూచి

కొక్కారో కుఱ్ఱని కూయకమున్న" –(పండితారాధ్య చరిత్ర)

సహజ సుందరమైన ఈ వర్ణన హృదయాహ్లాదమును కలిగిస్తున్నది. (**ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, తెలుగు అకాడమీ.2022, పుట.51).**

భాగవతంలోని భక్తి కవిత్వంలో 'మధురభక్తి కవిత్వం కూడా ఒకటి. ఈ మధురభక్తి శాఖ భారతీయ సాహిత్యంలో అన్నింటిలో ఫలించింది. భాగవతం, కృష్ణకర్ణామృతము, గీతగోవిందము అను గ్రంథాలలో మధురభక్తి కనిపించును. తెలుగులోను అన్నమాచార్య కీర్తనలలో, ఆంధ్ర మహాభాగవతములో, క్షేత్రయ పదములలో మధురభక్తి పరాకాష్టను అందుకొంది.

"ముఖ్యంగా భాగవతములోని గోపికా గీతాలు ఇందుకు నిదర్శనములు. నవ్య కవిత్వంలో వెలువడిన భక్తి కవిత్వానికి మధురభక్తి అధికమని చెప్పవచ్చు. దీని అవతరణకు ఆంధ్ర మహాభాగవతం మూలగ్రంథం అని చెప్పవచ్చు.(**నారాయణరెడ్డి, సి, ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు– ప్రయోగములు.1977,పుట.439).**

"ప్రేయసి ప్రియుల మధ్య ప్రణయానికీ, భక్తుడికీ, భగవంతునికీ మధ్యగల సంబంధానికి దగ్గరి పోలికలను భావించడం వల్లనేమో మధురభక్తి సంప్రదాయంలో భగవంతున్ని ప్రియుడిగా భావించి భక్తుడు తనను తాను ఆ భగవంతునికి ప్రేయసిగా భావించుకోవడం కనబడుతుంది. ప్రధానంగా విష్ణువు అవతారాల్లో కృష్ణావతారాల్లో కృష్ణుడు అనేక మంది గోపికలతో ప్రణయ లీలలు పడినట్లు ఉండటాన్ని ఈ మధురభక్తి సంప్రదాయములో ఉపయోగించుకోవడం జరుగుతుంది. భక్తులు తమను తాము రాధగాను, గోపికగాను భావించుకొని, కృష్ణవియోగం పట్ల విరహాన్ని అతని పొందు కోసం తపనను వ్యక్తం చేస్తూ పరితపించడం ఈ మధురభక్తిలో సాధనమార్గంగా భావించబడుతుంది.

"భక్తి కవిత్వం భక్తరామదాసుగా పేరు పొందిన కంచర్ల గోపన (17వ శతాబ్ది) కవిత్వంలో కనిపిస్తుంది. ఈయన పరమ శ్రీరామభక్తుడు.

"నరులను గొలుచుటకన్నా భద్రగిరి రాఘవుని వేడుకున్నా

ఇహపరము లీలగలవని విన్నా నేను దరహాసము నా రామదాసు ప్రసన్నా"

నరహరిని నమ్మక నరులను నమ్మిన నరజన్మ మీడెరునా

చెఱకుండగా వెట్టి చెరకును నమలిని జిహ్వకు రుచిపుట్టునా మనసా"

వంటి కీర్తనలలో రామదాసు ఆత్మీయత తెలుస్తుంది. పాలకులను కీర్తించడం రామదాసుకు నచ్చదు "అడుగుదాటి కదలనియ్యను నాకభయ మియ్యక నిన్ను విడువను" **(తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ.2016, పుట.30).** అని శ్రీరాముని వేడుకుంటాడు. భగవంతుడి శక్తి ముందు రాజుల శక్తి అత్యల్పమని చాటడమే రామదాసు కీర్తనల ఫలితం.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో భక్తి కవిత్వానికున్న ప్రాచుర్యం మరీ కవిత్వానికి లేదు. సమాజంలో అన్ని వర్గాలవారిని ఆకర్షించుటయే కాకుండా వారిచేత అనుభవింప చేస్తుంది భక్తి కవిత్వం.

ఈ విధంగా తెలంగాణ ప్రాచీన సాహిత్యంలో భావకవిత్వ ఛాయలు కనిపిస్తాయని స్పష్టంగా చెప్పవచ్చు.

3.2. తెలంగాణ భావకవిత్వం–పూర్వదశ:

తెలంగాణ సాంస్కృతిక వికాస చరిత్రలో గోలకొండ కవుల సంచిక ఒక కీలకమైన ఘట్టం. బహిరంగంగా తెలంగాణ ఆత్మాభిమాన ప్రకటన జరిగిన మొట్టమొదటి సన్నివేశం.

ఏ సాంస్కృతిక వికాస కృషికైనా ప్రాణ ప్రదమయిన అంశం ఆత్మాభిమానం. ఆ ఆత్మాభిమానంతోటే ఆంధ్ర జనసంఘం ఏర్పడింది. అవమానం నుంచి తమను తాము కూడగట్టుకుని, ఆ అవమానానికి ఆస్కారమిచ్చిన పరిస్థితులను ఎదుర్కొనడానికి ఆత్మాభిమాన ఉద్యమాలు ప్రయత్నిస్తాయి. ఆంధ్రోద్యమం ఆవిర్భావానికి కారణమైన సంఘటన మహారాష్ట్రీయుల నుంచి ఎదురు కాగా, గోలకొండ కవుల సంచికకు బ్రిటీష్ ఆంధ్రుల నుంచి ఎదురైన తృణీకారం, విశేషమేమిటంటే ఆంధ్రోద్యమానికి ఎంతో ముఖ్యమైన ఈ రెండు సంఘటనలలో పాలకులకు కానీ, పాలకపక్షీయులకు కానీ ప్రమేయం లేకపోవడం. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం ప్రారంభంతో హైదరాబాద్ తెలుగువారు అనే ఒక నియోజగవర్గం ఏర్పడడం మొదలైంది. ఆ అస్తిత్వం హైదరాబాద్ రాజ్యంలోని మహారాష్ట్రులు, కన్నడిగులు, ఉర్దూ మాతృభాషగా ఉన్న వర్గాలు .

వీరందరి నుంచి తెలుగు వారు తమను తాము వేరుచేసుకొని ఒక ప్రతిపత్తిని పొందేందుకు ఉద్దేశించింది. తెలుగువారు తమలో తాము, తమ గురించి తాము సంభాషించుకునే పరస్పర సంబంధాలను నెలకొల్పుకునే ప్రయత్నాలు చేయడం, ప్రభుత్వానికి రుచించని సామాజిక, రాజకీయ సంబంధాలను సృష్టించే ప్రయత్నం చేయడమే. అలా హైదరాబాద్ రాజ్యంలోని ఆంధ్రులు తమను తాము వ్యక్తం చేసుకుని, కూడగట్టుకునే ప్రయత్నంలో చరిత్రలోని 'వైభవాల' నుంచి, చరిత్రలో జరిగిన 'ద్రోహల' నుంచి ఐక్యభావాన్ని కానీ, ఇతరుల విషయంలో వైరభావాన్ని కానీ సమీకరించు కోగలిగారు. కానీ వర్తమానంలో వారు ఎక్కువగా స్పందించగలిగింది పాలకుల కోవకు చెందిన వారి నుంచి ఎదురవుతున్న అన్యాయాలకు కాదు, పాలితులతో భాగమైన వారి ధోరణికి, వైఖరికి.

'నిజాం రాష్ట్రములో ఆంధ్ర కవులు పూజ్యము' అని గోలకొండ పత్రిక తొమ్మిదవ సంవత్సరాది సంచికలో ఆధునిక కవిత్వతత్వము అను శీర్షికగల వ్యాసము నందు శ్రీముడుంబ వేంకట రాఘవాచార్యులు గారు నడుపుట అసామాన్యముగ కనబడెను. ఇట్టి విద్దూరపు అభిప్రాయములు నిజాం రాష్ట్రములోని ఆంధ్రులను గూర్చి పలుమార్లు వినుట తటస్థించినది" **(ప్రస్తావన, గోలకొండ కవుల సంచిక.2009, పుట.12)** అని ప్రతాపరెడ్డి గోలకొండ కవుల సంచిక సందర్భాన్ని తెలిపారు. గోలకొండ కవుల సంచికకు కారణమైన అంశాలు అకస్మాత్తుగా 1934లో ప్రత్యక్షమైనవి కావు. ఆంధ్ర ఉద్యమం ప్రారంభం కాకముందు నుంచీ ఉన్నవి. తెలంగాణ ప్రాంతానికి చెందిన వారి మీద తక్కువ అభిప్రాయాలు చాలా ముందు నుంచే ఏర్పడి ఉన్నాయి. సాక్షాత్తు కొమర్రాజు వెంకట లక్ష్మణరావుకే ఇటువంటి అభిప్రాయం ఉన్నట్టు "మాదిరాజు రామకోటీశ్వరరావు సూచించారు"ఒక గదిలో దస్తావేజులన్ని పరచి పెట్టబడి ఉండేడివి. ఆ గదిలోనికి రాజావారు దివాను లక్ష్మణరావుగారు నేను తప్ప మరెవ్వరు వెళ్లక ఉండేవారు. విచారణ మధ్య కాలమున ముఖ్యాతి ముఖ్యమైన పది పన్నెండు నైజాం పబ్లికు కాపీలను దాఖ లు చేయవలెనని నేను లక్ష్మణరావు గారు అనుకుంటిమి. కాని వాటిపైన హైదరాబాద్ రెసిడెంట్ సర్టిఫికేషన్ కాలేదు. ఈ దస్తావేజులు దాఖలు చేయుటకు వీలులేదని లక్ష్మణరావుగారు ఆందోళన పడినారు. ఇప్పటివరకు కొన్ని వందల పబ్లికు కాపీలపైన రెసిడెంటుగారితో సర్టిపై చేయించి దాఖలు చేసి ఉన్నాము. వీటిని సర్టిపై చేయించుట మరచితిమనుకొనిరి. దేశీయ గవర్నమెంట్ దస్తావేజులు కనుక రెసిడెంట్ సర్టిపై లేకున్నను దాఖలు

చేయవచ్చునని నేను సలహా ఇచ్చాను . నేను నైజాం చిన్న వకీలును గనుక న్యాయశాస్త్ర జ్ఞానమును గురించి వారికి అంతగా విశ్వాసము లేదు. వేయేల నేడు తెలంగాణవాసుల విజ్ఞానమును గురించి ఆంధ్ర మండలి వాసులు ఇదే అభిప్రాయమును కలిగియున్నారు''అని మాదిరాజు రామకోటీశ్వరరావు సూచించారు.

ఈ అభిప్రాయాలు అక్కడా ఇక్కడ మౌఖికంగానో, రాతపూర్వకంగానో కనిపించినవి మాత్రమే కాదు. వాటి వ్యక్తీకరణ అనేక రూపాల్లో జరిగేది. కవి కాల స్థలాదుల చర్చ రూపంలో జరిగేది. నైజాం ప్రాంతాన్ని పరిగణన నుంచి మినహాయించడం రూపంలో జరిగేది.

"కవి కాలము స్థలము నిర్ణయించుటలో విమర్శకులు పడిన శ్రమ పాండవుల అజ్ఞాతవాస శ్రమ కన్న మించినదే అయినది. ఒక్కొక్క కవిని 10–15 శతాబ్దముల మధ్య వెనుకకు ముందునకు లాగి బీభత్సము చేసినారు. వాడు మా ప్రాంతాము వాడే అని, మావాడే అని ముప్పుతిప్పలు పడి గోవలుగోవలువడ రాసి అచ్చుకొట్టి పెట్టారు. పాపము ఓరుగల్లు పోతన్నను లాగుకొనిపోయి కడప మండలములో స్థాపించినారు. మహబూబునగర్ అప్పకవిని గోదావరిలో వేద్దామా, కృష్ణలో ఉంచుదామ, లేకా గుంటూరులో నిశ్చయము చేద్దామా అని తగవులాడినారు. బిక్కనవోలు (దోమకొండ) సంస్థానము కవి అయిన మల్లారెడ్డిని లాగుకొని పోయి గోదావరిలో పడేసినారు" (ప్రస్తావన,గోలకొండ కవుల సంచిక.2009, పుట.14–20).

"బోగినీ దండకంబును బోతరాజు రచింపలేదనుచు వచించువారు
సర్వజ్ఞ సింగమక్ష్మాపతి పోతన పరిచితుల్ కారని పలుకువారు
సహజ పాండిత్యుండు సార్వభౌముండు భాంధవ్య దూరులటంచుఁ దలఁచువారు
గంగ గోదావరి కాదు భాగీరథి యంచుసారెకు వివరించువారు
కరుణతో నొక్క పర్యాయమరుగుదెంచి
బమ్మెరవితంబునోర్గల్లు ప్రతిభగాంచి
పొండనుచుఁబిల్చివారల పూర్వమతము
రాటుపఱుపవె నైజాము రాష్ట్రమాత"

(శేషాద్రిరమణకవులు, నిజాము రాష్ట్ర ప్రశంస, 1926.పుట.13)

సర్వజ్ఞసింగమక్ష్మానాయకుని కీర్త కల్పితంబనెనొక్క కావ్యకర్త

బమ్మెరపోతన భక్తాగ్రగణ్యుని నొంటిమిట్టకు జేర్చె నొక్క ఘనుఁడు

కాళేశ్వరచరిత్ర కాళహస్తికిఁ బెట్టి ప్రచురించెనొక్క కావ్యపారగుండు

లేములవాడను వేములవాడగా ముడిపెట్టెనొక కళాబోధకుండు

చిక్కినందాక నాంధ్రుల చిరయశంబు

కరన్నడులనెత్తిపై నంటఁగట్టెనొకడు

పూర్వవిఖ్యాతి యీరీతి పోవుచుండె

శాంతిగా నుండకమ్మ నిజాముభూమి

(శేషాద్రిరమణకవులు, నిజాము రాష్ట్ర ప్రశంస, 1926. పుట.21)

అని శేషాద్రిరమణ కవులు చెప్పిన పూర్వపక్షాలన్నీ ఆనాడు హైదరాబాదేతర తెలుగు పండితులలో నెలకొన్న అభిప్రాయాలే. పోతన, శ్రీనాథుడు బంధువుల కారు – వంటి అభిప్రాయాలు నిరాధారాలు కావు. అలాగే భీమకవి స్థలం ఏదనే దానిపై ఇప్పటికీ సందేహాలు, ప్రశ్నలూ మిగిలే ఉన్నాయి. అయితే, ఆనాటి పరిస్థితుల్లో అటువంటి అభిప్రాయాల వెనుక ప్రాంతీయత లేదని అనలేము.

3.2.1. తెలంగాణలో బ్రిటీషాంధ్ర అహంకార ధోరణులు:

“తెలంగాణలో కొందరు బ్రిటీష్ ఆంధ్రులు తమ ప్రత్యేకతను నిలుపుకోవడానికి ప్రయత్నించేవారు. విడిగానే ఉండేవారు. అటువంటి వారిలో చాలా మంది ఆంధ్ర ఉద్యమ కార్యక్రమాలతో ఏ సంబంధమూ లేకుండా సాధారణ జీవితం గడిపేవారు. కాని కొద్ది మంది, చాలా కొద్ది మంది మాత్రం స్థానిక ఉద్యమం ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించేవారు. ఆంధ్ర పౌరుషాన్ని కీర్తించిన రాయప్రోలు సుబ్బారావు హైదరాబాద్‌కు 1918లోనే వచ్చారు. కానీ, ఆయన ఇక్కడి సాంస్కృతిక వికాస ఉద్యమంతో ఎటువంటి సంబంధమూ పెట్టుకోలేదు. ఇక్కడి పత్రికల్లో ఆయన రచనలు వచ్చేవి కానీ, వాటి వస్తువు ఇక్కడిది కావు. 1940వ దశకంలో ఆయన ఖాసింఖాన్, కురుగంటి సీతారామయ్యలతో కలిసి ఒక బృందంగా వ్యవహరించారు. ఆ సమయంలో ఆ బృందం స్థానిక ఉద్యమ ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించిందని చెబుతారు. రాయప్రోలు, ఖాసింఖాన్,

కురుగంటి సీతారామయ్య ఈ ముగ్గురిని కలిపి స్థానికులు రాకాసి బృందం అని పిలిచేవారు. ఇక్కడ నిజాం ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తున్నందున వికాస కార్యక్రమాలకూ రాజకీయాలకూ సంబంధం ఉండరాదని వాదించేవారు. సంబంధం ఉందని ఆరోపిస్తుండేవారు. తమ వల్లనే అక్కడ అభివృద్ధి, వికాసం సాధ్యమవుతున్నాయని వాదించేవారు. పాలకోడేటి వెంకటరామశర్మ వివాదం ఇటువంటిదే. గ్రంథ నిలయములు అన్ని వీరి వల్లనే నిర్వహింపబడుచున్నవి అని జగద్వితము. వీరు గాక ఇంకెంత మంది యాప్పాషి ఉద్యోగాల నుండి చందాలు, విరాళములుగ చెల్లించి చేదోడు వాదోడుగ సహాయము చేస్తున్నారు. నిజాము రాజ్యమందలి గ్రంథాలయములకు అన్నిటికి బ్రిటీష్ నుండి వచ్చినవారు పోషకర్తలుగా ఉన్నారని చెప్పవచ్చును. ఈ విషయమున నిజాము రాష్ట్రంలో వాసము చేయుచున్న బ్రిటీష్ ఆంధ్రులు గ్రంథస్థమునకు అర్హులని రూఢిగా చెప్పవచ్చును. ఎందుకంటే ఇక్కడ విద్య నేర్పు ప్రధానోపాధ్యాయులు బ్రిటీష్ వారే. మెట్రిక్కు పరీక్షయందు కడతేరి ఇరవై రూపాయల వేతనానికే అభిమానముగా పనిచేస్తున్నారు" **(శ్రీనివాస్, కె, తెలంగాణ సాహిత్య వికాసం,2019, పుట.420-421)**

బ్రిటీష్ ఆంధ్రుల ధోరణికి తెలంగాణలో వెంటనే ప్రతిస్పందనలు కనిపించాయి. ఈ స్పందనల్లో కొన్ని పాత భావాల పరిధిలోనివి. బతకడానికి వచ్చినవారు బ్రిటీషాంధ్రులని, వారు అహంకరించకూడదని అనడం ఒక ధోరణి. బ్రిటీష్ సంస్థలకు విరాళాలు కావలసి వస్తే, హైదరాబాద్ రాజ్యంలోని ధనికుల దగ్గరికి, సంస్థానాధిపతుల దగ్గరికి వస్తారు కాబట్టి మీరే మామీద ఆధారపడి ఉన్నారని చెప్పడం ఒక వాదన. అయితే ఎక్కడా బ్రిటీష్ ఆంధ్రుల ప్రతిభా సామర్థ్యాల మీద, అభివృద్ధి మీద, విలువల మీద ప్రతి విమర్శలు చేయడం కనిపించదు. ఎక్కువగా ఆత్మరక్షణ ధోరణి కనిపిస్తుంది. గంగుల శాయిరెడ్డి వ్యవసాయ కావ్యం '***కాపుబిడ్డ***' కు ముందుమాట రాస్తూ సురవరం ప్రతాపరెడ్డి బ్రిటీష్ ఆంధ్ర సాహిత్యకారుల ప్రాధాన్యాలను సైద్ధాంతికంగా వ్యతిరేకించారు.

"పూర్వకవులకు రాజులతో రాణులతో కాలము గడచెను. ఇప్పటి కవులకు యెంకమ్మలతో, బుచ్చమ్మలతో, చింతామణులతో కాలము గడుచుచున్నది. కాని దేశమునకు, తత్సౌభాగ్యమునకును, శరీరమునకును వెన్నుమూకల వంటి వారగు కాపువారి ముచ్చట్లు ఎవ్వరికిని కాబట్టవు. కాని స్త్రీల కష్టములనైన తెలిసికొను శ్రమ యెవ్వరికిని కలుగలేదు ***"(సురవరం ప్రతాపరెడ్డి.పరిచయ వాక్యములు.***

కాపుబిడ్డ. గంగుల శాయిరెడ్డి వ్యవసాయ పద్యకావ్యము.1950. పుట.ii) అని అప్పటిదాకా వచ్చిన 'ఆధునిక' తెలుగు సాహిత్యం మీద విమర్శనాత్మక వ్యాఖ్య చేశారు.

3.2.2. ప్రాంతీయ చర్చలు, వివాదాలు:

1920 దశకంలోనే జరిగిన ఇటువంటి వాదోపవాదాలకు కొన్ని ఉదాహరణలు.

బ్రిటీష్ ఆంధ్ర దేసమున కంటె నైజాం ఆంధ్ర దేశము తక్కువ స్థితిలో యున్నదని వ్రాయుట సాహసము కంటె వేరు కాదు. ఊరక గ్రంథాలయమునకు దానమొనరించుడని యాచింపక నైజాము దేశమందు భాషలేదు, భాషా ప్రచారకులు లేరు, దాతలు లేరు అను మొదలగు నాస్తిక శబ్ద ప్రయోగము కంటె నైజాం రాజ్యమున ఆంధ్రులే లేరని ఒక్క మాట వ్రాసిన ఎంత బాగుండేది. నిజాం దేశమునకయి వీరు భగీరథ ప్రయత్నము లొనరించినారట. అది ప్రత్యాంధ్రుని విహితకృత్యమే కాని ఆ గ్రంథాలయము పక్షమున ప్రజోపయోగములగు యెన్ని గ్రంథములు ప్రకటింపబడినవో, ఎట్టి ప్రచారము ప్రజలలో కల్పింపబడినదో ఎంత మాత్రము ఎరుక కాకుండ ఉన్నది.

"నిజాం దేశమున రమారమి నూరు గ్రంథాలయములు ఉన్నవి. నలుబై వరాకంధ్ర జనసంఘములు ఉన్నవి. ఇంకను తదితర సంఘములు ఉన్నవి. పురాతన గ్రంథ, శాసన పరిశోధనము జరుగుతున్నది. ఆంధ్ర విద్యార్థులలో భాషా ప్రచారమునకై వక్తృత్వ, వ్యాస లేఖన పరీక్షలును, వ్యాయామము, చేతి పనులను ప్రోత్సహించు బహుమతులు, సంస్కరణ ప్రయత్నములు జరుగుచున్నవి. నాలుగు పత్రికలు నడుస్తున్నాయి. మరి నాలుగు పత్రికలు గుగ్గిలపు వెలుగునకై తెరచాటున వేచి 'తధిగిణతో'మ్మని భరతమాడుచు ఉన్నవి. ఇట్టి దినములలో దేశము యదార్థముగా వైజ్ఞానిక జ్యోతియందు మిలమిలలాడుచున్నపుడు ముక్కు వంకర, కాలుసొట్టి, కన్నులొట్టయని వ్రాయ సాహసించుట కంటె, యదార్థమైన వర్ణన యొనరించిన దేశీయులకెంత ఆహ్లాదముగ ఉండి ఉండేదో"(**శ్రీనివాస్, కె. తెలంగాణ సాహిత్య వికాసం,2019, పుట.421**) అని ఒక మధురకవి రాయగా, ఒక సత్యవాది మరింత తీవ్రంగా బ్రిటీష్ ఆంధ్రుల మీద విరుచుకుపడ్డాడు. హైదరాబాద్ రాజ్యంలో నివసిస్తూ, గ్రంథాలయాలలో చురుకుగా పనిచేస్తున్న బ్రిటీష్ ఆంధ్రులు ప్రత్యేకముగా నిజాం రాష్ట్రాందుల అభివృద్ధి కొరకు తమ నివాసమును ఇక్కడికి మార్చలేదు. కేవలం ఉద్యోగపాశబంధము వల్ల ఇక్కడ నివసిస్తూండిరి. ఈ రాష్ట్రమునందు నివసించు లాభమును

పొందుచున్నప్పుడు రాష్ట్ర శ్రేయోభిలాషులగుట, వారి యభివృద్ధికై నిరంతరము కృషి సలుపుటయు వారి విధియై యున్నది. వారుత్సాహముతో చేయుచున్న కృషి వారి విధిని చక్కగ నెరవేర్చుచున్నందుకు నిదర్శనము కాని సానుభూతి కాజాలదు. ఇక గ్రంథాలయములన్నియు బ్రిటీష్ యాంధ్రుల పోషకత్వము బొందుచున్న వనుటకు యెట్టి నిదర్శనమును లేదు... నీలగిరి పత్రికాధిపతులు మొదటి ఉగాది సంచికకై ఈ రాష్ట్రమునకు సంబంధించిన బ్లాకుల స్వయముగా ఆంధ్ర పత్రిక అధిపతులను అడుగుటయే గాక ఇక్కడి నాయకులు సహితమడిగిరి. కానివారు సఫలమనోరథులు కాజాలరైరి. నిజామాంధ్రుల అభివృద్ధికై వారెట్ల కృషి చేస్తున్నారు అని తెలుపుటకు ఇది ఒక నిదర్శనము.

ఇట్లా సాగిన పరస్పర చర్చల్లో సామరస్య ధోరణిని ప్రకటించిన వారు కూడా ఉన్నారు. నీలగిరి, తెనుఁగు పత్రికల్లో క్రమం తప్పకుండా రచనలు చేసిన కె.రాములు ఒక వ్యాసంలో ఇలా అభిప్రాయపడ్డారు

"మొన్న మద్రాసులో ఆంధ్ర రాష్ట్రీయ సభ సమావేశమైనది. అందులో ఆంధ్రులు అందరు ఒక్కటే అనే విషయమునకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇవ్వబడింది. కాని అరువై లక్షల ఆంధ్రులకు ఉనికిపట్టదు అలాగే నిజాం రాజ్యము గురించి విచారించినవారు కూడా లేరు. మమ్ములను అమాంతముగా మున్నగు దేశములలో పడద్రోసిరి కదా అని నిజాము రాజ్య ఆంధ్రులకు కొందరికి బ్రిటీష్ ఆంధ్రులపై అసూయగలిగి ప్రస్తుత వాగ్వివాదమునకు రెండవ కారణమైంది. మితవాదులు, అతివాదులు బయలుదేరినారు. మేము మీకు విద్యాగురువులమని ఒకరనగా, మేము మీకు అన్నప్రదాతలమని మరొకరు, మీరు చందాలు ఇవ్వడమే కాక మాకు వంగి వంగి సలాములు పెట్టవలేనని వారు అన భిక్షమునకు వచ్చినను బిర్రునేల పోనివ్వరని వీరు అన ఈ తీరున విచిత్రములగు వాగ్వివాదము జరుగుచున్నది. దీని పేరే అనైకమత్యము" **(రాములు. కె. నిజాం రాష్ట్రాంధ్రదేశము. తర్జనభర్జనము. తెనుఁగు పత్రిక.28-12-1924).** శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయ రజతోత్సవ సందర్భంగా జరిగిన బ్రిటీష్ నైజామాంధ్ర వివాదంలో మునగాల రాజా కూడా ఇటువంటి హితవులనే పలికారు. బ్రిటీష్ ఆంధ్రులకు భాషానిలయం నిర్వహణలో ప్రమేయం లేకుండా చేస్తున్నారన్న ఆరోపణ నిరాధారమనీ, శిరుగూరి హనుమంతరావు, గాడేపల్లి

సూర్యప్రకాశరావు, పందిటి రామస్వామి నాయుడు మొదలైన వారందరూ కార్యవర్గంలో ఉన్నారని, ఆ మాటకు వస్తే తాను బ్రిటీష్ ఆంధ్రుడు కూడానని, ఈ విభేదాలన్నీ పక్కకు బెట్టి పనిచేయాలని ఆయన అన్నారు.

గోలకొండ కవుల సంచికకు నేపథ్యంగా పని చేసిన వాతావరణాన్ని సూచించడానికే ఈ వివాదాలను పరిశీలించవలసి వచ్చింది. పైన సూచించిన వివాదాలన్నీ హైదరాబాద్ రాజ్యానికి ఉద్యోగార్థం వచ్చి ఉంటున్న బ్రిటీష్ ఆంధ్రులతో తలెత్తిన విభేదాలు. అలా కాక, బ్రిటీష్ ఆంధ్ర ప్రాంతం వారి విషయంలో హైదరాబాద్ తెలుగు సమాజానికీ, ఆంధ్రోద్యమ నాయకత్వానికి అనేక ఫిర్యాదులున్నాయి. అందులో ప్రధానమైన ఫిర్యాదు " కోస్తా ఆంధ్ర ప్రాంతపు ఆంధ్రోద్యమం తెలంగాణ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదని, అలాగే అక్కడి పత్రికలు ఇక్కడి వార్తలను ప్రచురించకపోవడం కూడా ఒక సమస్యగానే ఉండేది. అంటే ఆంధ్ర జాతికి సంబంధించిన సంఘీభావం, జాతీయభావం కోస్తాంధ్రుల నుంచి లభించడం లేదన్నది తెలంగాణ వారికి కష్టంగా ఉండేది.

గోలకొండ పత్రిక ప్రారంభమైన మొదట్లో రాసిన ఒక సంపాదకీయంలో ఈ ఫిర్యాదు విజ్ఞాపన రూపంలో మెత్తగా ఉన్నది.

"ఆంధ్ర మహాసభ అన్ని ప్రాంతములలో ఉన్న ఆంధ్రుల అభివృద్ధి కొరకు ప్రయత్నింపవలెను. రాజకీయ విషయములలో ఒక ప్రాంతము వారికి వేరొక ప్రాంతము వారికని భేదమునన్ను సాంఘిక, ఆర్థికాది విషయములలో భేదము ఉండజాలదు. ఈ సభ చెన్న రాజధానిలోని ఆంధ్రుల కొరకే ప్రయత్నించినచో అందు విశేషమేమి? ఆంధ్ర దేశములోని కొన్ని ప్రాంతముల వారు విద్యా విషయములలో వెనుకబడి ఉండవచ్చును. అంతమాత్రాన అట్టి వారిని వేరు పరచుటకు వీలు వుండదు. వారి అభివృద్ధికి కూడ మార్గము చూపుచుండవలెను. అపుడే ఆంధ్ర మహాసభ అనిన ఏ ప్రాంతములో నుండు ఆంధ్రులకయినను గౌరవోత్సహాములు కలుగును. సభానామము, ఉద్దేశము సార్థమగును" **(ఆంధ్రమహాసభ, గోలకొండ పత్రిక సంపాదకీయం.1927, పుట -16).** ఇలా ప్రాంతీయ తత్వాన్ని గురించి వివరించడం జరిగింది.

3.2.3. తెలంగాణలో గోలకొండ కవుల సంచిక ఆవిర్భావం:

పైన చెప్పిన నేపథ్యం అంతా గోలకొండ కవుల సంచిక ఆవిర్భావానికి కారణమయింది. సురవరం ప్రతాపరెడ్డి వ్యక్తిత్వం కానీ, సాహిత్య అభిప్రాయాలు కానీ తెలంగాణ ఆత్మాభిమాన ప్రకటనకు వ్యక్తీకరణలుగా అనేక సందర్భాలలో కనిపిస్తాయి. అటువంటి వ్యక్తి సారథ్యంలో ఉన్న గోలకొండ పత్రిక నిజాం రాజ్యంలో కవులు లేరనే వ్యాఖ్యకు ఎలా స్పందించడానికి అవకాశం ఉందో అలాగే స్పందించింది. ఈ స్పందన కేవలం ఆవేశంతోనో, ఉక్రోషంతోనో వ్యక్తమయింది కాదు. తనను తాను నిర్మించుకోవడానికి, నిర్వచించుకోవడానికి ప్రయత్నిస్తున్న నిజాము రాజ్య ఆంధ్ర అస్తిత్వం – ఈ వ్యాఖ్యలు తన మీద జరిగిన జాతీయ దురహంకారపు దాడిగా పరిగణించింది. తనను తాను కూడగట్టుకోవడానికి లభించిన ఒక అవకాశంగా ఈ విమర్శని స్వీకరించింది. అందుకే తమను ప్రేరేపించిన అంశాలేమిటో చెబుతూ గోలకొండ కవుల సంచిక సంపాదకుడు 'నిజాము రాష్ట్రాంధ్రుల యొక్క వాడిపోవుచున్న ప్రతిభాలతకు నూతన జీవకళఉ ఆపాదించుటయే' తమ ఉద్దేశ్యమని, 'స్వకీయ అభిమానమును పరకీయద్వేషముగా నిర్వచించుట అన్యాయము' అని స్పష్టపరిచారు.

నిజాము రాష్ట్ర కవులకు మాత్రమే సంచిక ప్రకటింపవలసిన అవసరమెందుకు? ఎవ్వరో ఒక వ్యక్తి తెలుసొ తెలియకనో బుద్ధిపూర్వకముగానో లేక తలవని తలంపుగానో నిజాము రాష్ట్రములో కవులు పూజ్యమన్నంతనే మీకింత తొందర యెందుకు? ఇంత అభిమానము ఎందుకు?" అని ప్రశ్నలు వస్తున్నాయని, కానీ అది ఒక్కరి అభిప్రాయం కాదని, చాలా మందికి ఉన్నదని వింటున్నామని ప్రతాపరెడ్డి వివరణ ఇచ్చారు.

"నిజాము రాష్ట్రాంధ్రులు వలసబోయిన వారనియే బ్రిటీష్ ఇండియాలోని ఆంధ్రులిదివరలో తీర్మానించుకోలేదా? మఱియు అదేమి గ్రహచారమో ఎన్నో సంవత్సరముల నుండి భారతి మున్నగు బ్రిటీష్ ఇండియా పత్రికలను నడుపబడినను నా పత్రికలలో ఒక్క నిజాం రాష్ట్రీయుని వ్యాసమైనను గాంచుట లేదు. అయితే వ్యాసములు పంపువారు లేకున్న వారేమి చేయుదురని చెప్పవచ్చును. మంచి మంచి వ్యాసములను పేరొందిన వారు పంపుటయు నయ్యవి ప్రకటింపబడకపోవుటయు మేమెఱిగిన విషయము కావున నీ కారణము చేతను నీ రాష్ట్ర కవులకు ప్రోత్సాహము కలిగించుట చాల

అవసరము" (**గోలకొండ కవుల సంచిక, సంపాదకీయము, గోలకొండ పత్రిక, 1934, పుట:9**) అని చెప్పి, సమస్య ఎక్కడో ఒకచోట వ్యాఖ్య, వ్యాసం కాదని, పాదుకొనిపోయి ఉన్న వివక్ష అనీ అభిప్రాయపడ్డారు.

గోలకొండ కవుల సంచికను వెలువరించాలన్న సంకల్పాన్ని ప్రకటిస్తూ, సంపాదకులు అందుకోసం రచనలను ఆహ్వానించారు. తరువాత సంచిక వచ్చేదాకా గోలకొండ పత్రికలో ఆ సంచిక నేపథ్యం గురించి, సంకల్పం గురించి వరసగా లేఖలు, పద్యరూపంలో ప్రబోధాలు ప్రచురితమయ్యాయి. వాదోపవాదాలు జరిగాయి. దానికి జవాబుగానే గోలకొండ కవుల సంచిక శీర్షికతో గోలకొండ పత్రిక ఒక సంపాదకీయం రాసింది. గోలకొండ కవుల ప్రత్యేక సంచికను వెలువరిస్తారనే ప్రకటనకు అనేక మంది తెలంగాణ కవులు, రచయితలు ప్రతిస్పందించారు. వ్యాఖ్యానాలూ అభిలాషలూ అభినందనలూ వచ్చాయి. బ్రిటీషాంధ్రుల వ్యంగ్యానికి విరుగుడు ఇదేనని, ఇందులో ప్రాచీన కవులను కూడా చేర్చాలని చిదిరె మఠం వీరభద్ర శర్మ కోరారు. కవిత్వంలో సాంప్రదాయిక వర్ణనలు ఎందరో చేశారు.

అనాడు అవి అవసరములేదని, అన్ని వృత్తుల వారిని గురించి ఐదు పద్యాలు రాయాలని కవులకు గంగుల శాయిరెడ్డి అభ్యర్థన చేశారు. సంచిక ఉద్దేశ్యాలు వివరిస్తూ గోలకొండ అనేక సంపాదకీయాల్ని కూడా వెలువరించవల్సి వచ్చింది. 'నిజాం రాష్ట్ర కవులకు సూచన' అనే పేరుతో సురవరం ప్రతాపరెడ్డి ఒక విజ్ఞాపనను ప్రకటించారు. 'తెలంగాణలో కవులున్నారని చెప్పడానికి ఈ సంచిక ప్రచురణ జరుగుతోంద'ని ఆయన స్పష్టం చేశారు. ఈ సంచిక వెనుక బ్రిటీష్, నిజామాంధ్రులను విడగొట్టే ప్రయత్నం జరుగుతున్నదన్న దుష్ప్రచారాన్ని పట్టించుకోవల్సిన పని లేదని కూడా ప్రతాపరెడ్డి తెలిపారు. అయిదు పద్యాలు రాయాలన్న సూచనను ప్రస్తావిస్తూ ఐదు పద్యా రాస్తే కవి ఎలా అవుతాడు అనే ప్రశ్న వస్తుందనీ, ఆ ప్రశ్న సహేతుకం కాదని, పద్యాలు రాయని దండి కవిర్దండి అయ్యాడని, కవిత్వం హృదయాన్ని తాకేట్టుగా ఉండాలని, ప్రతి నిజాం కవి విధిగా తన కవితతో గోల్కొండ కవుల సంచికకు అందాన్ని సంతరింపజేయాలని ప్రతాపరెడ్డి తమ పత్రంలో కోరారు.

ప్రకటనకూ ప్రచురణకర్తకు నడుమ ఉన్న మూడు మాసాల కాలంలో గోలకొండ పత్రికలోనూ, నాటి తెలంగాణ సాహిత్య బృందాలలోనూ కవుల సంచిక ఒక ఉద్యమంగా పని చేసింది. ఈ సంచిక విశిష్టత ఏమిటంటే సంచికలోని గుణం చాలా అప్రధానమైన అంశం అయింది. సంచికలో ఉత్తమ స్థాయి కవిత్వం చాలా ఉన్నది కానీ, ఆ మంచిచెడ్డలు ఆ సందర్భంలో చాలా అసందర్భమైనవిగా పరిణమించాయి. కవుల సంచిక అన్నదే ఒక చర్య, ఒక రాజకీయ చర్య, ఒక సాంస్కృతిక చర్య, ఒక సాంఘిక చర్య కూడా. దానిలోని కవిత్వం ఏమి ప్రకటించిందన్నది కాదు, ఆ సంచిక తనంత తాను గానే ఒక ప్రకటన. అదొక రాజకీయ ప్రకటన చేసింది. ఒక సాంస్కృతిక, సామాజిక ప్రకటన చేసింది. తెలంగాణలో కువులున్నారనో, పండితులున్నారనో కాదు ఆ ప్రకటన తెలంగాణకు ఆత్మాభిమానం ఉన్నది, అది తన మీద బయటివారు ఇచ్చే తీర్పులకు ప్రతిస్పందిస్తుంది. అంటే దానికిప్పుడు తన బాగోగుల గురించిన స్పృహ ఏర్పడుతున్నది. అదొక చారిత్రక ప్రకటన.

గోలకొండ కవుల సంచికలో మొత్తం 354 మంది కవుల కవితలున్నాయి. "శ్రీవారి యీ యాస్థానమునకు అష్టదిగ్గజములు కాదు కదా నవరత్నములు కాదు కదా 354 కవి కుంజరములను కవిసార్వభౌములను తీసికొనివచ్చి ఏతదా స్థానము నలంకరించినారము" అని '***ప్రస్తావన***'లో సంచిక పోషకులైన ఆత్మకూరు సంస్థానాధీశులకు సంక్రమించిన నూతన వైభవాన్ని గురించి ప్రతాపరెడ్డి అంటారు. ఇందరు తెలంగాణ కవులను తీసుకుని వెళ్ళి ఒక చిన్న సంస్థాధిపతి ఆస్థాన కవులును చేశారే అని ఆశ్చర్యం కలుగుతుంది. కానీ, అదొక కవితాత్మకమైన వ్యక్తీకరణే తప్ప వేరు కాదు. లేకపోతే, ఆత్మకూరు సంస్థానం కానీ, మరే సంస్థానం కానీ కొందరు మహమ్మదీయులు, కొందరు క్రైస్తవులు, కొందరు స్త్రీలు, అనేకమంది శూద్రులు, ఒక 'హరిజనుడు' వీరందరూ ఉన్న కొలువు కూటాన్ని భరించగలదా? ఈ సందర్భంలవో ఆత్మకూరు సంస్థానాధిపతి పోషకత్వం కూడా హైదరాబాద్ రాజ్య ఆత్మాభిమానం పరిధిలోనిదే తప్ప వారు ఏటేటా చేసే పండిత సభల నిర్వహణ వంటిది కాదు.

గోలకొండ కవుల సంచికను ప్రకటించబోతున్నామని చెబుతూ చేసిన విజ్ఞాపనలో సంచిక సంపాదకుడు ప్రతాపరెడ్డి ఏ సందర్భంలో ఈ ప్రయత్నం జరుగుతుందో వివరించారు.

"ఇప్పటికిని సంస్కృతాంధ్రములందు విశేష పాండితీ ప్రభావ సంపన్నులై దివ్య ప్రబంధ రచనా ధురంధరులై వెలసిన మహనీయులు ఈ ప్రాంతమునందు వెలువడిన ***'భావకవిత్వ'*** సాంప్రదాయమును గ్రహించి ఆంధ్ర భారతి నుపాసించుచున్న నవయువ కవులును అనేకులు గలరు. కాని, వీరందరును పల్లెటూళ్ల నివాసులు. పత్రికా ప్రచారమే లేని మారుమూలల నున్న వీరు తమ తమ అభిరుచులను అనుసరించియు, తమ కానందము నభిలషించియు, వాఙ్మయకృషి సల్పుచుండుటయే కాని, ఆధునిక పద్ధతులననుసరించి ప్రచారము చేసికొనుటయు, చేయించుకొనుటయు, నెఱుఁగరు. అందుచేత 'నిజాం రాష్ట్రమునందు ఆంధ్ర కవులు పూజ్యము, పండితులు లేరు' అని పలువురు భ్రమ ప్రమాదములకు లోనగుటలోను ఆశ్చర్యమేమున్నది?"**(సురవరం ప్రతాపరెడ్డి, ప్రసావన, గోలకొండ కవుల సంచిక. 2009, పుట–13).**

3.2.4. నిజాం రాష్ట్రవాసులకే ఆహ్వానం:

గోల్కొండ సంచికకు కవిత్వం పంపడానికి సంపాదకులు కొన్ని నియమాలు పెట్టారు. ఆ నియమాలు ఇలా ఉన్నాయి:

"1) కవి నిస్సంశయముగా నిజాం రాష్ట్రవాసియై యుండవలయును.

[ఇది 1934 నాటి మాట.అప్పుడు ఆంధ్రప్రాంతం మద్రాసులో కలిసి ఉంది. ఈ తెలంగాణా ప్రాంతాన్ని అప్పుడు నిజాం పరిపాలిస్తున్నాడు. ఇప్పుడు తెలంగాణా ప్రాంత మంటున్నాం. అప్పుడిది నిజాం రాష్ట్రం. ఇందులో మరికొన్ని జిల్లా లున్నాయి. ఇది ప్రత్యేక రాష్ట్రం కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వం లోని కవులు మాత్రమే కవితలు పంపించాలన్న నియమం పెట్టుకున్నారు.]

2) కవి తన జన్మస్థానము గ్రామము తాలూకా, జిల్లా, టప్పాఖాన మొదలగు వానినిఁ దెలుపవలయును.

3) సంచికలో పద్యములు మాత్రమే ప్రకటింపఁబడును.

[పద్యాలు మాత్రమే పంపించాలన్న నియము ఎందుకో ప్రతాపరెడ్డి గారే వేరొక చోట చెప్పారు. వాగ్రచన వర్తమానమున కుపకరించునది. గద్య ప్రబంధము కతిపయకాల జీవితము కలది. పద్య ప్రబంధము కాలము వర్తించునది. ఏ తద్రహస్యమును గ్రహించియే ప్రాజ్ఞులు తమ

యమూల్యాభిప్రాయములను విశ్వశ్రేయ మభిలషించి ఛందోబద్ధమగు వాక్యములలో లిఖించియున్నారు. ప్రపంచ వాఙ్మయమును పరిశీలించిన యెడల ఆది కావ్యము లన్నియు ఛందోబద్ధములే. అవియే మన పూర్వులగు ప్రాజ్ఞులు మన కిచ్చిన యమూల్య సంపత్తు. కవిత్వమే ప్రపంచాభివృద్ధికి ముఖ్య కారణము'']

4) ప్రతి కవియు సంస్కృతమునందైనను, ఆంధ్రమునందైనను లేక రెంటియందైనను రచన గావింపవచ్చును.

5) విషయము వర్ణనాంశమైనచో 5 పద్యములలోను, కథాంశమైనచో 100 చరణములలో నుండవలయును.

[కథ రాస్తున్న కవి, వచనం కూడా రాస్తాడు. చంపూ పద్ధతి. పద్యాలు 25 అన్నట్లయితే, వచనం మరో 25 చరణాలు రాస్తే, పేజీలు పెరుగుతాయి కదా, పేజీ పెరిగితే కాయిదం ఖర్చు. అచ్చు ఖర్చు పెరుగుతాయి. అన్ని కలిపి వంద చరణాలు అన్నారు.]

6) కవి తన వంశ వృత్తాంతము, వయస్సు, ఉద్యోగాదికములు ఉన్నచో బిరుదులు తెలుపవలయును.

7) కవి తాను రచించిన గ్రంథముల పట్టికనిచ్చుచు, వాని కథాంశము సంగ్రహముగా వివరించవలయును. ముద్రితా ముద్రిత గ్రంథములను వేర్వేరుగా చూపవలయును. ముద్రిత గ్రంథముల మా కార్యాలయమునకుఁ బంపిన స్వీకృతి ప్రకటింపబడును.

8) పద్యముల నిప్పటి నుండియే పంపుచుండవలయును. శ్రావణ మాసానంతరము వచ్చిన పద్యములను ప్రకటింపఁజాలము.

9) భావకవితఁ గూడ ప్రకటింపబడును.

10) ఉన్నచో తమ ఫోటోగ్రాఫులను (తస్వీరులను) పంపవలయును.

11) 1300 ఫసలీ నుంచి యుండు కవులను ఆధునికులుగా నిర్ణయించినాము కావున నెవ్వరేని 1300 ఫసలీ తర్వాత గతించిన యెడల నాకవి బంధుమిత్రులతఁడు రచించి యుండిన పద్యములను బంపఁగలరు'' **(గోలకొండ కవుల సంచిక, ప్రస్తావన. 2009, పుట.14)**

[1300 ఫసలీ అంటే ఎన్ని సంత్సరాలు అంటే, ఫసలీకి 590 కలిపితే క్రీ.శ. కు సమానం. అప్పుడు 1890 అవుతుంది.1890కి అటు ప్రాచీనం. ఇటు ఆధునికం. సరిగ్గా 1900 దాటితే మనం ఇరువయవ శతాబ్ది అంటున్నాము. అప్పుడు దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. లెక్కలు ఇప్పటి వలె క్రీ.శ. లెక్కలు కాదు. ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్నది నిజాం. క్రైస్తవుడు కాదు. మహమ్మదీయ ప్రభువు. వారి లెక్కలు వారివి. ఈ రాష్ట్ర ప్రజల లెక్కలు ఫసలీ పేరుతోనే. ఇప్పుడు మనము 1900 అంటున్న పద్ధతిలోనే బహుశః 1300 అని నిర్ణయించినట్టున్నారు ప్రతాపరెడ్డిగారు.]

కవి నిస్సంశయంగా నిజాం రాజ్యానికి చెంది ఉండాలన్న నిబంధన అన్నిటికంటే ప్రాథమికమైనది. కొందరు పుట్టుకచేత ఇతర ప్రాంతాలకు చెందిన వారయినప్పటికీ, హైదరాబాద్ రాజ్యాన్ని తమ స్వప్రాంతంగా స్వీకరించినవారు ఇందులో కనిపిస్తారు. మాడపాటి హనుమంతరావు పుట్టుకతో కృష్ణాజిల్లా వారు అయినప్పటికీ (జన్మస్థలం మధిర తాలూకా ఎఱ్ఱుపాలెం అని సంచిక కవి పరిచయంలో ఉన్నది (పేజీ.384) కానీ అది సరికాదు). ఆయన బాల్యం, విద్యాభ్యాసం, న్యాయవాద వృత్తి అన్నీ తెలంగాణలోనే గడిచింది. ఆయన ఆచరణ రీత్యా పూర్తిగా తెలంగాణకు అంకితమైన వ్యక్తి.అలాగే ముదిగొండ వీరేశలింగ శాస్త్రి జన్మస్థానం వరంగల్ అని ఉన్నది కానీ గుంటూరు జిల్లా నుంచి వచ్చి వరంగల్‌లో స్థిరపడినవారు.

అందుకే ఆయన "మా పూర్వులు నిజాము రాష్ట్రవాసులు, వారు నల్లగొండ జిల్లా దేవరకొండ తాలూకాలో చేరిన ముదిగొండ గ్రామము నివాసముగా జేసికొని యుండిరి. అందుకే మా యింటి పేరు ముదిగొండ వారు అని వచ్చినది" **(గోల్కొండ కవుల సంచిక,2009, పుట.358)** అని వివరణ రాసి పంపారు. వీరేశలింగశాస్త్రి కూడా వరంగల్‌లో అనేక వికాస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇంకా ఒకరిద్దరు కవులు బ్రిటీష్ ఆంధ్రలో పుట్టి నైజాంలో స్థిరపడినవారు కనిపిస్తారు కానీ, వారు తమను తాము నిస్సంశయంగా హైదరాబాద్ రాజ్య నివాసులని ప్రకటించుకుని ఉంటారు. ఆనాడు హైదరాబాద్‌లోనూ ఇతర పట్టణాల్లోనూ ఉద్యోగరీత్యా ఉన్న బ్రిటీష్ ఆంధ్రులు సుప్రసిద్ధులు ఎవరూ ఇందులో లేరు కాబట్టి, ఇక్కడ తమ ప్రాంతీయతను ఎంచుకునే అవకాశం ఉండి ఉండాలి. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారిని సంచిక సంపాదకులు స్వీకరించి ఉంటారు.

సంస్కృతంలో కవిత రాసిన వారిని తీసుకోవడం వెనుక ఉన్న ఉద్దేశం అప్పటికి తెలంగాణలో ఎక్కువ సంఖ్యలో ఉన్న పండిత కవులను సంచిక పరిధిలోకి తీసుకు రావడానికేనని భావించాలి. తెలంగాణకు అప్పుడున్న బలమైన అంశం ఉద్దండ పండితులు. వీరిని మినహాయించి ఒక అస్త్రాన్ని వదిలేయడానికి ప్రతాపరెడ్డి సిద్ధంగా లేరు. లేకపోతే నైజాము రాష్ట్రమున ఆంధ్ర కవులు పూజ్యము అన్న వ్యాఖ్యకు బదులుగా ప్రకటిస్తున్న సంచికలో ఇందరు సంస్కృత కవులు ఉండడంలో వేరు కారణం కనిపించదు. హోసదుర్గం వేదాంతా చార్యులు, హోసదుర్గం కృష్ణమాచార్యులు, బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు, వెల్లాల సదాశివ శాస్త్రి మొదలైన దిగ్దంతులు తెలంగాణకున్న సంపద అని సంపాదకులు భావించి ఉంటారు. ఆధునికమైన రీతులు అంత బలంగా ఉన్నాయని చెప్పలేనప్పుడు సాంప్రదాయ పాండిత్యంలో, కవిత్వంలో ఉన్న బలాన్ని వదులుకోవడం సమంజసం కాదు కదా!

"పద్యాలు మాత్రమే స్వీకరిస్తామని చెప్పడంలో ఉద్దేశం కవిత్వం మాత్రమేనని అయివుంటుంది. వచనం ఈ సంచిక పరిధిలోకి రాదని చెప్పడమే. పద్యం అన్న మాటను వెసులుబాటుతోనే స్వీకరించినట్టు డా. పింగలి లింబాద్రిరెడ్డి రాసిన ముత్యాల సరాలను, పుతుంబాక దుర్గాప్రసాదరావు రాసిన గేయాన్ని ప్రచురించడం బట్టి భావించవచ్చు" **(గోల్కొండ కవుల సంచిక,2009, పుట.283).**

3.3. తెలంగాణలో భావకవిత్వం ఆవిర్భావం:

అన్నిటికంటే ఆసక్తికరమైనది తొమ్మిదవ సూచన. భావకవిత్వం కూడా స్వీకరిస్తాము అన్నది. గోలకొండ కవుల సంచికను పురికొల్పిన వ్యాసం భావకవిత్వానికి సంబంధించింది. అప్పటికే హైదరాబాద్ రాజ్యంలో గ్రంథాలయాలు విస్తరించాయి. యువకులలో పఠనాసక్తి చాలా పెరిగింది. బ్రిటీష్ ఆంధ్రలో ప్రచురితమైన పత్రికలు, పుస్తకాలు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయి. కానీ, అక్కడి కవితాధోరణుల వల్ల ప్రభావితులై ఇక్కడ ఎందరు రాస్తున్నారో ఖచ్చితంగా అంచనా వేసే అవకాశం లేదు. అప్పటికే సుజాత పత్రిక పుట్టి మూడేళ్లు జీవించి గతించి పోయింది. అందులో కోదాటి రామకృష్ణారావు, మామునూరు నాగభూషణరావు, సిరుగూరు జయరావు వంటి వారి ***భావ కవితలు*** ప్రచురితమయ్యాయి. అయితే, తెలంగాణం మొత్తం మీద ఆ ధోరణి ఎంత ఉందో గోలకొండ పత్రిక వారికి కూడా అంచనా ఉండి ఉండదు. ఆ బాపతు కవిత్వాన్ని ప్రచురించరేమోనన్న అపోహను

తొలగించడానికి, కొత్త ధోరణిలో రాయాలని ఉత్సాహపడుతున్న వారి చేత ప్రయత్నింపజేయడానికీ సంపాదకులు ఆ సూచనను ఉద్దేశించి ఉంటారు. అయితే ఈ సూచనలో కొంత బలహీనత కూడా దాగివుంది. భావకవిత రాయడం ఒక అనివార్యమైన పరిణామం అనీ, అదే ధోరణి తెలంగాణలో కూడా తప్పనిసరిగా వస్తుందనీ సంపాదకులు కూడా భావించారు. 'మేం మాత్రం భావకవిత్వం రాయలేమా' అని సవాల్ స్వీకరించడంలో, ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసంతోపాటు భావకవిత్వం రాయడం ఒక ఘనకార్యం అని అంగీకరించడం కూడా ఉంది. ఇక్కడ భావకవిత్వం ఉండదు, మేం వేరే రకం కవిత్వం రాస్తాం, వేరే ఉద్యమంలో ఉన్నాం అని నిబ్బరంగా చెప్పుకోగలిగిన శక్తి అప్పటికి తెలంగాణ సాంస్కృతోద్యమానికి లేదనే భావించాలి. అయితే, భావకవిత్వానికి సంబంధించిన సూచనను అప్రధానం చేయడం ద్వారా సంపాదకులు ఈ బలహీనతను మరుగుపరచగలిగారు.

గోలకొండ కవుల సంచికలో ప్రచురితమైన కవిత్వాన్ని, వాటి కవులను సంపాదకులు కొన్ని తరగతులుగా విభజించారు. విషయం రీత్యా స్తోత్రములు, మహాపురుష ప్రశంస, శృంగారము, హితోపదేశము, సంచికా ప్రశంస, వివిధ వర్ణనలు, కథాలహరి, ప్రభోదము, నిజాం రాష్ట్ర ప్రశంస, కవిత్వ తత్వము, సంకీర్ణము అనే విభాగం చేశారు. వీటిలో అత్యధికంగా స్తోత్రాలు కావడం గమనార్హం. ఈ విభాగం కింద 94 మంది కవులు 358 పద్యాలు రాశారు. రెండో స్థానంలో వివిధ వర్ణనలు ఉన్నాయి. ఈ విభాగంలో 76 మంది కవులు 265 పద్యాలు రాశారు. సంకీర్ణము అన్న తరగతిలో 45 మంది కవులు, 110 పద్యాలు రాశారు. ఆధునిక భావ ప్రకటనకు, జాతీయ భావాన్ని, ఆంధ్రోద్యమ స్ఫూర్తిని ప్రకటించడానికి అవకాశం ఉన్న తరగతులు సంచికా ప్రశంస, హితోపదేశము, ప్రబోధము, నిజాం రాష్ట్ర ప్రశంస.

గోలకొండ కవుల సంచికలోని కవిత్వాన్ని, కవులను రకరకాల వర్గీకరణల ద్వారా సంపాదకులు పరిశీలించారు, విశ్లేషించారు. ఇందులో సంస్కృత కవుల సంఖ్య 72, తెలుగు కవుల సంఖ్య 283. పురుషులు 347, స్త్రీలు ఏడుగురు. అదేవిధంగా సంపాదకులు ఇందులో కులాల మతాల వారీగా విభజించడం కూడా జరిగింది.

కులాల వారీగా శ్రీవైష్ణవులు – 198, నియోగులు, గోల్కొండ వ్యాపారులు –74, వైదికులు – 66, రెడ్లు – చాత్తాద వైష్ణవులు – 16, కోమట్లు – 11, భట్రాజులు – 11, వీరశైవులు –

పద్మశాలీలు – 5, తెలగలు – 4, రాజపుత్రులు – 3, వెలమలు – 3, విశ్వబ్రాహ్మణులు – 3, క్రైస్తవులు – 3, ముసల్మానులు – 3, ఈడిగవారు – 2, కుమ్మరివారు – 1, యాదవులు – 1, ఆదిమాంధ్రులు – 1, అజ్ఞాత కులజులు – 15.

ఈ జాబితా నాటి తెలంగాణలోని సామాజిక పరిస్థితిని కనీసం ఒక పార్శ్వం నుంచి తెలియజేసింది. శ్రీవైష్ణవులు, వైదీకులు సాంప్రదాయికమయిన విద్యాధ్యాయన పద్ధతిలో కొనసాగుతున్నారు. ఆసక్తి ఉన్నవారికి పరంపరాగతమయిన విద్యావకాశాలు వారికి ఉన్నాయి. ఇక నియోగులు గోల్కొండ వ్యాపారులకు ఆధునిక, సాంప్రదాయిక విద్య రెండూ అందుబాటులో ఉన్నాయి. రెడ్లు, వెలమలు కొత్తగా వస్తున్న విద్యావకాశాలను వినియోగించుకుంటున్నవారు. చాత్తాద శ్రీవైష్ణవులు, భట్రాజులు సాంప్రదాయికంగా వీధిబడులు నిర్వహించడంలో ఉన్నారు. భట్రాజులకు కవిత్వంతో ఎప్పటినుంచో సంబంధం ఉంది. తక్కిన వెనుకబడిన కులాల వారు అప్పుడప్పుడే సంఘటితమవుతున్నారు. ఆదిమాంధ్రుడు అరిగె రామస్వామి ప్రాతినిధ్యం తెలంగాణ సాంస్కృతిక వికాసోద్యమానికి సమగ్ర ప్రతిబింబాన్ని కల్పించింది. ఇక్కడ ఒక పోలిక అనివార్యంగా వస్తుంది. ముద్దుకృష్ణ సంకలనం చేసిన 'వైతాళికులు' కవితాసంకలనం కాలం కూడా దాదాపు గోలకొండ కవుల సంచిక కాలమే. ఆ సంచికలో దళిత కులాలకు చెందిన కవులకు ప్రాతినిధ్యం లేదు. ఆనాటికి జాషువా, కుసుమ ధర్మన్న వంటి లబ్ధప్రతిష్ఠులైన కవులు ఆ కులాల నుంచి ఉన్నారు. కానీ, వారికి అందులో చోటు దొరకలేదు. ఆ విషయాన్ని 1990లలో దళిత సాహిత్యోద్యమవాదులు ప్రశ్నించారు. కానీ, తెలంగాణలో సమకాలీన సంకలనంలో సామాజిక న్యాయం పాటించడం, దానిని సంపాదకులు గర్వంగా పేర్కొనడం విశేషం.

"ఇక జిల్లాల వారీగా విభాగం చూస్తే మహబూబ్‌నగర్ జిల్లా – 87, వరంగల్లు జిల్లా – 85, నల్లగొండ – 57, కరీంనగర్ – 37, అత్రాపుబల్దా – 33, రాయచూరు – 23, మెదకు – 21, గుల్బర్గా – 5, నిజామాబాదు – 3, ఆదిలాబాదు – 3. ఇది కూడా తెలంగాణ పునర్వికాసోద్యమంలో ఏఏ జిల్లాలకు ఎంత భాగస్వామ్యం ఉన్నదో తెలియజెబుతుంది. తక్కువగా కనిపిస్తున్న మెదకు, నిజామాబాదు, ఆదిలాబాదు జిల్లాల్లో వికాసోద్యమం బలహీనంగానయినా ఉండాలి, లేదా ఉద్యమం బలంగా ఉండి నమోదు కాని పరిస్థితులయినా ఉండాలి. సంస్థానాలు అధికంగా ఉన్న

మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 87 మంది కవులుండటంలో ఆశ్చర్యం లేదు. సంస్కృత కవులు, పండిత కవులు అక్కడి నుంచే ఎక్కువ సంఖ్యలో వచ్చి ఉంటారు. సంస్థానాలు లేని నల్లగొండ, వరంగల్ జిల్లా నుంచి అంత సంఖ్యలో కవులు ఉండటానికి కారణం అక్కడ అప్పటికే వికాసోద్యమమం బాగా పుంజుకుని ఉండడం కావచ్చు. లేదా పోషణలతో సంబంధం లేకుండా కవిత్వ వ్యాసంగం స్వతంత్రంగా ఉండగలిగే పరిస్థితులు అక్కడ ఉండడం కావచ్చు. తెలంగాణలో సాంస్కృతిక పునర్వికాసోద్యమం కానీ, తరువాత ముందుకు వచ్చిన మిలిటెంట్ రాజకీయ పోరాటం కానీ నల్లగొండ, వరంగల్ జిల్లాలలోనే కేంద్రీకృతం కావడం ఈ సందర్భంగా గమనార్హం"**(గోల్కొండ కవుల సంచిక, ప్రస్తావన,2009, పుట.16-17)**

గోలకొండ కవుల సంచిక బలప్రదర్శన కోసం ఉద్దేశించిందే అయినా, అది సమకాలీన భావప్రకంపనల్ని సమర్థంగా నమోదు చేసింది. తెలంగాణ వాస్తవికతను ప్రతిబింబించడంలో అది నూటికి నూరుపాళ్లు విజయం సాధించకపోయి ఉండవచ్చు. కానీ భావోద్వేగ పరమయిన అంశాలను వాస్తవికతతో మాత్రం చూడవచ్చు. తెలంగాణ ఘనత గురించి, ఇక్కడి పండితుల గొప్పతనం గురించి, సంస్థానాల వైభవం గురించి 'పురాణం మల్లయ్య' , '*మందటి వేంకటకృష్ణ కవి*' రాసిన కవిత్వాలు ఈ విధంగా ఉన్నాయి.

"కానఁడా యష్టావధానముల్ సల్పి భూకాంతులతో మెప్పుఁగాంచు కవుల
నరయఁడా పెక్కు శతావధానము లనర్గళముగా నొనరించు కవివరులను
నెఱుఁగడా సకల శాస్త్రేతిహాసాది సారాంశముల్ చవిగొన్న యమలమతుల
యోజింపఁడా ప్రబంధోత్తమంబుల రచియించినయట్టి కవీంద్రతతి
నిట్టి పండిత సత్తములెందఱో ని
జాము రాష్ట్రంబునందు నెసంగుచుండఁ
గవులులేరన్న యతని వాగ్గరిమనెంచ
నంధుడు జగంబులేదని యనుటగాదె"

(పురాణం మల్లయ్య. గోలకొండ కవుల సంచిక. 2009, పుట.304)

"కవితాలతాంగా సత్కారాళిమెరయదే ప్రతివత్సరమున గద్వాల సభల

నాంధ్రభారతి మహదానందమొందదే ప్రతివత్సరము వనపర్తి సభల
పండితమండల ప్రాభవంబెసఁగదే ప్రతి వత్సరమున గోపాలుపేట
నాంధ్ర సాహిత్యవిద్యావినోదములేదె యాత్యకూర్పురిని ప్రత్యబ్దమందు
నిట్టి యాస్థాన చయములకింపుఁ బెంపు
తేజమొసఁగిన నైజాము దేశమున
తెలుఁగునకు నిక్కువైన యీ దేశమందు
కవివరేణ్యులు పండితుల్గలరు కలదు"

(మందటి వేంకటకృష్ణ కవి. గోలకొండ కవుల సంచిక. పుట.309)

పై రెండు కవితల్లో అవాస్తవం అనలేము, వాస్తవం అనలేము. కానీ ఆ ఘనత, పాండిత్యం, వైభవం అన్నీ అస్తిత్వ ఉద్యమాల చిహ్నాలు అయినప్పుడు ఆ భావావేశాల నిర్మాణానికి అవి అన్నీ ఉపయుక్తం అవుతాయి. అలాగే భాషాసాహిత్యాల పోషణ, వైభవాలు వంటి అంశాలు కూడా ఉపయుక్తం అవుతాయి. అయితే భాషాసాహిత్యాల పోషణ, వైభవాలు వంటి అంశాలను అధిగమించి, వాస్తవ ప్రజాప్రయోజనాల గురించి, వైరుధ్యాల గురించి ఆలోచించడం కూడా 1930ల నాటికి మొదలయింది. ఆ సూచనలు ఈ సంచికలో స్పష్టంగా కనిపిస్తాయి.

గంగుల శాయిరెడ్డి రాసిన మరో కవితలో సంస్థానాల, దేశముఖుల యొక్క తెలంగాణ పరాయితనాన్ని ప్రకటిస్తూ రాయడం ఈ సంచికలో విశిష్టంగా కనిపిస్తుంది. ఈ కవిత శీర్షిక – కర్షకా!

"నీ జాతి వారలు రాజులై యుండియుఁ గనఁజాలరైరి నీ కష్టమెల్ల
నీ కొలమందు జన్మించిన యా జమీందారులు గనరు నీ తాపమెల్ల
నీ శాఖలో ధననియులౌ కొందఱు పరికింపలేరు నీ బాధలెల్ల
నీ తెగలో విద్యనేర్చిన బియ్యేలు లిఖియించరైరి నీ లేములెల్ల
న్యాయవాదులు నీవారలడుగరైరి
న్యాయమూర్తులు నీ వారలరయరైరి
ఇంక పెఱవారి ముచ్చట లెందుకయ్య

కర్షకా! నీదు కష్టముల్ గాంతురెవరు?"

(తెలంగాణాలో భావకవితా వికాసం, పుట.139)

ఇది స్పష్టంగా మధ్య తరగతి రెడ్డి రైతుల (కాపుల) గొంతుక. ఇది తన కులానికి చెందిన సంస్థానాధిపతుల నుంచి దేశముఖుల దాకా అందరినీ నిలదీసింది. హైదరాబాద్ రాజ్యంలోని అన్ని రకాల భూసంబంధాలలోనూ రైతులు ఎట్లా కడగండ్లు పడుతున్నారో శాయిరెడ్డి చిత్రించిన తరువాత ఐదేండ్లకు గానీ జాగీరు రైతుల గురించి ఆంధ్ర మహాసభ మాట్లాడలేకపోయింది.

పౌరుషం, అభిమానం లేకుండా దాస్యంలో మగ్గుతున్న వారిని ప్రేరేపిస్తున్న ఈ పద్యం కూడా నాడు మారుతున్న జనమనోభావాలను సూచిస్తుంది.

"ప్రజల దుష్టుల నుండి రక్షించు వీరులు వారినిఁ బీడించు వారలైరి
అరిరాజ బృంద సంహరణాభిలాషులు పందలై మూలలఁ బడిరినేఁడు
రాజ్యనిర్మాణ దోర్బల మండితాగ్రణుల్ పరుల యేల్బడికిలోఁ బడిరినేడు
నిరత స్వరాజ్య సంస్కరణాభిలాషులు దాసులై బ్రదికిరి దర్పముడిగి
దిక్తట వ్యాప్త పౌరుషాధిక్యులిపుడు
సహజ భీరుత్వ బోధనాచార్యులైరి
ఆత్మబలిదానమునకు ముందంజ వేయు
వారు ప్రాణభీతిని తలలో వంచినారు"

('వైద్యవర' వేంకటరాజన్న అవధాని.పుట.287)

సంచికలోని ఏకైక ఆదిమాంధ్ర (దళిత) కవి, ఆనాటి ఆదిమాంధ్ర ఉద్యమ నాయకులలో ఒకరు అయిన అరిగె రామస్వామి మాలమాదిగల తరపున రైతులను సంబోధిస్తూ కవిత రాశారు.

"మాలమాద్గు లన్యమతములఁ జేరిరి
ధేడ్ చమారటంచు దిట్టుకతన
దేశమతము దిక్కు ధేడ్ చమార్లేకదా
రక్తబంధులార రైతులార
హిందుమతము జీవహింసను సోర్వదు

మాలమాద్గులన్న మండిపడును

దనను హింసఁజేయుఁ దగ సలాములఁజేయు

రక్త బంధులార రైతులార" –అరిగె రామస్వామి,రైతులారా

(తెలంగాణాలో భావకవితా వికాసం,పుట.208)

'హరిజన దీనాలాపములు' అన్న శీర్షికతో **జొన్నలగడ్డ హనుమంతరెడ్డి** రాసిన పద్యం కూడా విశేషమైనది.

"పుట్టినప్పటి నుండి వెట్టిచాకిరిఁజేయ శారీర బలమెల్ల సమసిపోయె

గలుకాంత పగలెల్లఁ గూలిఁజేసినఁగాని యొక్క పూటకె తిండి చిక్కదాయెఁ

గొడుకు గష్టించియుఁ గొలువుఁజేసినఁగాని కట్టుటకై గుడ్డ కరవువచ్చె

ఋణదాతలెల్లరు ఋణములు రెట్టించి యన్యాయముగఁజేలనాచికొనిరి

కటకటాజీవనముఁజేయఁ గష్టమయ్యె

నెవరికేనియు మామీఁద నెనరులేదు

బ్రతుకుఁదెఱువును జూపియు భద్రముగను

దీనులగు మమ్ముఁబ్రోవనే దేవదేవ"

(తెలంగాణాలో భావకవితా వికాసం,పుట.205)

అని దేవుణ్ణే ప్రార్థించినా కూడా ఆ రోజుల్లో గ్రామాల్లో 'హరిజనుల' పరిస్థితి ఏ విధంగా ఉందో ఉన్నదున్నట్లుగా పై కవితలో చిత్రించారు.

కవయిత్రులు రాసిన పద్యాలలో స్త్రీ సమస్యల గురించి ఎక్కువగా లేదు. పులుగోటి ఆనందమాంబ అనే కవయిత్రి మాత్రం ***స్త్రీ విద్య*** అనే శీర్షికతో రాశారు. ఇది సంఘసంస్కరణ శాఖకు చెందినదిగా చెప్పవచ్చు. స్త్రీలు పరభాషను నేర్చుకోకుండా మాతృభాషనే నేర్చుకోవాలని, మాతృభాషను కాదని పరభాషను నేర్చుకోవడం అనేది మంగళ సూత్రాన్ని పారేసి అనేక ఆభరణాలను ధరించినట్టుంటుందనీ ఆమె రాశారు. ఈ విధమైన ఖండికలు గోలకొండ సంచికలో అనేకం కలవు.

ఆనాటికి జాతీయోద్యమం గాంధీ నాయకత్వంలోకి వెళ్లి కూడా దశాబ్దం దాటిపోయింది. గాంధీని మహాత్మునిగా, అవతార పురుషునిగా చిత్రిస్తూ రూప్‌ఖాన్‌పేట రత్న దేశాయి 1924లోనే తెనుఁగు పత్రికలో పద్యాలు రాశారు. గోలకొండ కవుల సంచిక కూడా గాంధీ ప్రశంసను నమోదు చేసింది.

కవికేసరీకిశోర అవధాన కుశల **అచి వేంకట నృసింహాచార్యులు 'శ్రీకర్మచంద్రోదయము'** శీర్షికతో గాంధీ ప్రశంస చేశారు. "జనులను వంచించి హాయిగాను వాసిఁగాంచితి విందాక నో సనాతనాంధకారమా యిపుడె నీ యంత్యకర్మ చంద్రుడదయించెఁ దిన్నగా జాఱుకొనుము" **(అచి వేంకటనృసింహాచార్యులు,శ్రీకర్మచంద్రోదయము,గోలకొండ కవుల సంచిక.పుట86)** అని కర్మ చంద్రుణ్ని విడదీసి అంత్యకర్మకూ చంద్రుడికీ మధ్య చమత్కరించిన కవి, సనాతనత్వాన్ని అంధకారం అని అనగలగడం ప్రకర్ష కాదు. భావావేశమే.

పింగిలి లింబాద్రిరెడ్డి రాసిన "***ఉష్ణకాలము***" ముత్యాలసరాలు కూడా ఈ సంచికలో ఉన్నాయి.

"పరభృతావళి నదిగొ చూడుము
నిరతమును గొంతెత్తి పాడఁగఁ
తరతరంబుల రవమునొలుకఁ
బరఁగుచుండె పికముల్
మెకములప్పుడు బయలువెడలెను
మెరకచాటుల డాగు కొనుచును
మెదవుగను దమ యడుఁగులిడుచు
మేఁతజాడఁబట్టి..."

(తెలంగాణాలో భావకవితా వికాసం,2017, పుట.197)

పుతుంబాక దుర్గాప్రసాదరావు గేయరీతిలో గాంధీని ఇట్లా ప్రశంసించారు.

"అంతరించవలె నస్పృశ్యత యే నస్మజ్జీవిత మేని తదర్ధంబని

చాటి చెప్పు ధీరమూర్తి యగు నా మహాత్మునికి నా జోహార్, స్వీయ
సౌఖ్యసర్వస్వ త్యాగము జేసి మాతృదేశోద్ధరణార్థము కార్యరంగమున
కొదమ సంగముల కరణి దుముకు త్యాగులకిదె జోహార్"

(గోల్కొండ కవుల సంచిక,2009, పుట.104)

అని ఈ గేయం మార్చింగ్ నడకతో సాగుతుంది. అలాగే మహాపురుష ప్రశంస విభాగం కింద శివాజీ, బమ్మెరపోతన ప్రశంసలున్నాయి. రామరాజ భూషణుని గురించి అంబటి లక్ష్మీనరసింహరాజు, రామానుజుణ్ణి గోవర్ధనం నారాయణాచార్యులు, యాదవుల్ని జి.ఎం. దేవీప్రసాదు, ఘటబ్రహ్మ గురించి సిద్దప్ప రాజయోగి, ఏసుక్రీస్తు గురించి రెవరెండ్ యం.వై. జీవరత్నం ప్రశంసించినప్పుడు ఆయా కులాలలో, మతాలలోని చైతన్య ప్రతీకలుగా వారిని గ్రహించవలసి ఉంటుంది. ఇలాంటి ప్రశంస నీయమైన ఖండికలు గోలకొండ కవుల సంచికలో ఎన్నో కనబడుతాయి.

3.3.1. తెలంగాణ భావకవిత్వం– ప్రారంభ వికాసం:

మొదటగా తెలంగాణ భావకవిత్వ ప్రారంభ దశలో సురవరం ప్రతాపరెడ్డి గారు భావకవి రామ్మూర్తి పేరుతో అనేక భావకవిత సమీక్షలు రాశారు. వాటన్నిటిని సేకరిస్తే భావ కవిత్వం తెలంగాణలో ఇంకెంత వెలువడిందో తెలుస్తుంది. భావ కవిత్వ చరిత్రను పూర్తిగా మార్చి కొత్త చరిత్ర రాసుకోవాల్సిన అవసరాన్ని తీసుకోవచ్చింది తెలంగాణ భావకవిత్వం. తెలంగాణ భావకవితలో అనువాద కవితలు కూడా ఉన్నాయి. అనంతరం తెలంగాణలో వెలుబడుతున్న భావకవిత్వాన్ని వెక్కిరిస్తూ సురవరం ప్రతాపరెడ్డి గారు రెండు వ్యంగ్య కవితలు రాశాడు. కృష్ణపక్షాన్ని వ్యతిరేకిస్తూ శుక్లపక్షం సంకలనం వచ్చింది. ఈ కోణాల్లో తెలంగాణ భావకవిత వికాసాన్ని అధ్యాయనం చేయవలసిన అవసరం ఉంది. భావకవిత్వం 'గోలకొండ కవుల సంచిక'లో తగినంతగానే ప్రాతినిధ్యం పొందింది. అందులో భాగంగా **ఉదయరాజు శేషగిరిరావు 'మనోరమ'** అనే కవిత, అలాగే ఈయన రచనలో ఇంకా ప్రబంధాల ప్రభావం ఉన్న భావకవితలు కూడా కనిపిస్తాయి.

"పుత్తడి జగ్గునిగ్గుచినవబుచ్చెడు మేనిమెఱుంగు వెల్లువల్
మత్తడి దూఁక, బిట్టదరి మాఁటికి బెళ్కులచూఁపు మీలుపే

రొత్తడివార, చేతి వలనొప్పుచు నాయెదఁబోయ చిల్కరా

తత్తడి సామిగొల్వునకుఁదారుపఁడే నిను నా మనోరమా!"

(గోలకొండ కవుల సంచిక.2009, పుట.111)

పెండ్యాల హనుమచ్ఛర్మ 'హృదయ నిర్వేదము'

"దుర్భరనియోగ వారధిఁ ద్రోసిపోయి

వత్సరములెన్నో గడచెను వన్నెకాడ

తిరిగి యీ జన్మమున నీదు దరిసెనంబు

గలిఁగె నేనియుఁగాంతును గౌతుకంబు"

(గోలకొండ కవుల సంచిక.2009, పుట.116)

నల్లాన్ చక్రవర్తుల ప్రతాపం రాఘవాచార్యులు రాసిన 'రాధవలవంత',

"గీ. గహన సుమమాలికలు నీదు కంఠమందు – మెరయ మురళిని కరమున మీటిపాడు నీదు సుందర రూపంబు నేనుమరలం – జూచుటెన్నాళ్లకో చిత్తచోరకృష్ణ,

గీ మురళి యెంతటి మంచి నోములను నోచి – నీదు యధరసుధారసాస్వాది యయ్యె నట్టి నోముల నోచంగ నైతిగాన– నట్టి నాకెట్లు సంప్రాప్త మౌదువీవు.

గీ. మంత్రముల నేర్చుకొనినైతి మందుపెట్టు – టెరుగనైతిని తంత్రంబు లెవ్విలేవు కపటవలపంత కంటెను గానరాదు– యిట్టి నను బాధపెట్టుట యేరకృష్ణ.

గీ. వంశమో యెవ్రతంబుల ప్రాపుజేసి– యెట్టి పుణ్యంబు జేసి నీ ముకుందు దయకు పాత్రతవైతి వద్దానిదెలిపి మాన్పవేనావగపు బ్రతిమాలుకొందు".

(గోలకొండ కవుల సంచిక,2009, పుట. 117)

చిదిరె రాజేశ్వరరావు 'ఆశా భంగము'పేరుతో

"నీదు మోహనమూర్తినో నీరజాక్షి

హృదయఫలకంబుపై వ్రాసె సదయుఁడెవఁడొ

చిత్రకారుఁడు చిత్రవిచిత్రమైన

రంగులను ప్రేమరసమునఁబొంగఁజేసి

మాపఁదలఁచిన మాత్రాన మాసిపోవ

దెట్టిరంగులలో ప్రతిబింబముట్టిపడును

దలఁచినప్పుడు నా మనోదర్పణమున"

(గోలకొండ కవుల సంచిక.2009,పుట.120)

ఏటూరి సత్యనారాయణరావు 'నియోగము' మొదలైనవి ఈ కోవలోనికే వస్తాయి.

కోదాటి రామకృష్ణారావు 'సుమవిలాపము'ఇదే ఖండిక కుసుమకరుణమనే పేరుతో ముద్రితమైంది. ఇది ఒక హిందీ గీతానికి అనుసరణమని కోదాటి నారాయణరావు చెప్పారు. ఇది తెలంగాణ భావకవిత్వంలో ప్రత్యేకంగా పేర్కొనవలసిన ఖండిక. సుప్రసిద్ధ 'పుష్పవిలాపం'కు మూలం వంటిదైన ఈ ఖండిక. రామకృష్ణారావు భావకవితా రీతిని తెలియజేస్తుంది.

"స్వాంతహరుఁడగు పవను గిల్గింతలకును

సాకెనన్నెత పేరిమి శాఖ యొడిని

యందమఱి మలయ! నన్ను పల్యంకమందుఁ

బయడఁద్రోచితివీవు నా పరిమళంబు

బారవేయుదునను మంటిఁ బడి నశింప

పొందె సంక్షోభమక్కటా పీవు మొలక

మాలిహృదయంబు శోకానఁదూలిపోయె

గాంతిదీపిక చల్లారెఁగా యటంచు

శాఖ యేడ్చెడు నాకునుఁజావుఁగలదు

చచ్చెదవు నీవు నందఱు చావఁగలరు

తరుణ మరణంబు జగతికంతయు గదోయి"

(గోలకొండ కవుల సంచిక,2009, పుట.188)

అలాగే ఇటువంటిదే మరొక కవిత ఈ సంచికలో కనిపిస్తుంది. అది ఎం.వి. మాధవరావు అనే ఆదిలాబాదు జిల్లా చెన్నూరు కవి రాసిన 'కుసుమాపచయము'

"వికసిత మనోహరములైన విరులఁ గాంచి
కోసి యానందపడెదవు కొంతసేపు
తమకమొకయించుకేనియుఁ దగ్గగానె
మూలఁబడవైచెదవు దాని ముక్కలెల్లఁ
సుందరమైన వస్తువుల్ చూచినపుడు
భ్రాంతిఁజెందని మనుజుండు పరగఁగగలఁడె
చక్కఁదనమును బ్రేమించు హక్కె కాని
దానిఁజెరచు ప్రయత్నంబు తప్పుకాదె?"

(గోలకొండ కవుల సంచిక.2009, పుట.200)

అన్న కవిత కూడా భావకవితా శాఖ కు చెందినదే.

గోలకొండ కవుల సంచికలోని కవులలో గవ్వా అమృతరెడ్డి కవిత ఒకటి ఇటువంటి కోవలోకి వస్తుంది .

"ఆంధ్రులము కామె! మనమీ యనంతభూమి
ఆంధ్రదేశంబొ? యను సంశయంబు పొడము
తమ్ముఁడా! నిన్ను జూచిన తరుణమందుఁ
గారణంబేమొ యూ హింపఁగలిగినావె?"

(గోలకొండ కవుల సంచిక.2009,పుట.284)

[గవ్వా అమృతరెడ్డి నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకా పిల్లలమర్రికి చెందినవారు. ఈయన సోదరుడు గవ్వా జానకిరామిరెడ్డి కూడా కవి. అమృతరెడ్డి రచనలు అమృతగీతాలు సుప్రసిద్ధాలు. అంధ్రోద్యమంలో పాల్గొన్నారు].

వానమాముల జగన్నాథాచార్యులు, వానమాముల వరదాచార్యులు, మల్యాల దేవీ ప్రసాద్ యాదవ కవిత ఒకటి ఈ కోవలోకే వస్తుంది.ఈ విధంగా

"విశ్వమంతట మహావినుతమౌ యాదవ వంశంబు నిలఁబెట్టి వరలెనెవఁడు
ఖడ్గ తిక్కన స్నానఘట్టానపసుపుంచు దుర్విధిఁగూర్చిన దొడ్డయెవడు

ఆహ్లాదకరమైన యక్షగానాదుల రచియించి సత్కీర్తిఁ గ్రాలెనెవ్వఁ

దట్టి కృష్ణుడు, మైలారు నధిపుఁడైన కాటమవిభుండు యాదవ కవివరుండు

గలరువేల్పులు శూరులు కువులు చాలయాదవా! మేలుకొనుము నీ యాత్మఁదలచి"

(యాదవ ప్రబోధము,గోలకొండ కవుల సంచిక,పుట.97)

ఈ విధంగా మొదలైన వారు సాంస్కృతిక వికాసోద్యమంలో చాలా కృషి చేసినవారు.

గార్లపాటి రాఘవరెడ్డి గారు ఒకరు. ఈయన కాళోజీ నారాయణరావు గురువు. మడికొండలో అనేకులకు ప్రేరణ, స్ఫూర్తి, ఈయన లక్ష్మీకాంతరావు అనే ఆయన కలిసి లక్ష్మీకాంతరాఘవులనే పేరుతో జంట కవిత్వం రాశారు. సంచికలోని రాఘవరెడ్డి పద్యాలు శాయిరెడ్డి పద్యాలలాగా సూటిగా లేకున్నా ధనగర్వంతో మిడిసిపడే వారిని, అక్రమంగా ధనం అర్జించేవారిని విమర్శిస్తున్నాయి.

"మరచియుఁజేయఁబోవరొక మాఱుసహాయము నేరికేని సా

దరమున దీనమానవులఁదగ్గఱ దీయఁగలేరు సత్కవీ

శ్వరులను సత్కరింపఁగల వారలుఁగారిఁక నింతమాత్రకే

గురువముఁబూననేటికి? జగంబున మీరలికెండు మిన్నలో!"

(ధనగర్వితులు, గోలకొండ కవుల సంచిక. 2009, పుట.212)

దేవులపల్లి వేంకటాచలపతిరావు ఒకరు ఈయన "సాంస్కృతిక వికాసకాలంలో వరంగల్‌లో ముఖ్య కార్యకర్త. గ్రంథాలయాల స్థాపనలో నిర్వహణలో తూము వరదరాజులుతో కలసి పనిచేశారు. శాసనాల, ప్రాచీన కావ్యాల పరిశోధనలో శేషాద్రి రమణ కవులతో కలిసి పర్యటించారు.దేవులపల్లి రామానుజారావు తండ్రి. ఈయన ఈ సంచికలో పోతన గురించి పద్యాలు రాశారు". గంగుల శాయిరెడ్డి, అరిగె రామస్వామి, బోయినేపల్లి రంగారావుల నల్లగొండ జిల్లా చిత్తలూరుకు చెందిన ఈ కవి ఏటూరు సత్యనారాయణరావుతో కలసి జంట కవిత్వం రాశారు. ఆంధ్రకేసరి సంఘంలో ఉన్నారు.

ప్రాతినిధ్యం తదనంతర తెలంగాణ వికాసరేఖలను పరిచయం చేసింది. గోలకొండ సంచిక విశిష్టతల్లో ఒకటి నైజాము రాజ్య ఆంధ్ర మహాసభకు అధ్యక్షులుగా పనిచేసినవారు సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, పులిజాల వేంకట రంగారావు

– ఈ నలుగురి కవితలూ ఇందులో ఉన్నాయి. సురవరం ప్రతాపరెడ్డి 'హంసవీర సంభవము' అనే కథాఖండిక రాశారు. ఒక రాజస్థాన యోధుని గాధ అది. రావిచెట్టు రంగారావు స్మృతిలో గతంలో రాసిన పద్యాలను **మాడపాటి హనుమంతరావు** ఇందులో "**మిత్రస్మృతి**" పేరిట ప్రకటించారు. బూర్గుల రామకృష్ణారావు అచ్చమైనభావకవితను రాశారు.

"అతులవిషాద సంభృతగాన మొనరించు కలకంఠిరవము సంచలనమొంద
సాంద్రపుష్పనికుంజ సౌధంబుఁ జరించు ప్రియదంపతులకుఁ దబ్బిబ్బుగల్గ
ప్రియసమాగమకాంక్ష బయలెల్ల వీక్షించు నభిసారికలకెల్ల నాసఁగొలువ
నవవిలాసస్ఫూర్తి నవఘలింపఁగఁగోరు కన్నెయుద్ధమువద్దఁ గళవళింప
గఱిక గింజలు మునుపంటఁగొఱికియిచ్చి
పాలనముసేయ శాలికా జాలమునకు
సంభ్రమముగూర్పనల్లన సంచరించె
వాతపోతంబు సకల దిగ్వాప్తుండగుచు" –బూర్గుల రామకృష్ణారావు, మారుతము

(గోలకొండ కవుల సంచిక.పుట.182)

అదే విధంగా **పులిజాల వేంకట రంగారావు "సంఘ సంస్కరణ"** కోరే కవిత రాశారు.

"వీర్యసంపదచేత వెలుగొందవలెనన్న బాల్యవివాహముల్ వదలవలయు
మతభేదములు మాని నుతికెక్కవలయునన్న వెట్టివిశ్వాసముల్ వీడవలయు
భ్రూణహత్యాదులన్ బోఁద్రోలవలెనన్న విధవల పెండ్లి గావింపవలయు
అనుకూలదాంపత్య మమరంగవలెనన్న వరశుల్కములదోసి ప్రబలవలయు
బలము తేజంబు వృద్ధిగావలయుననినట
మనముకావింపఁదుగ ప్రయత్నమనయమిది
భవ్యమతులార భారతవాసులార"

(భవ్యమతులార.గోలకొండ కవుల సంచిక.2009, పుట.294)

ఆంధ్రమహాసభ నాయకుల కవితలన్నిటికీ తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ చైతన్యాల నేపథ్యం ఉన్నది. బూర్గుల రామకృష్ణారావు కవిత్వానికి ఆయనకున్న ఆధునిక సాహిత్య

స్పర్శతోపాటు, ఉర్దూ పారశీక భాషా ప్రభావం కూడా తోడయింది. ప్రతాపరెడ్డి కావ్యఖండికకు ఆయన చారిత్రక దృష్టి, మొగలులకు వ్యతిరేంగా పోరాడిన వారి నుంచి స్ఫూర్తి పొందాలనే ధోరణీ నేపథ్యంగా ఉన్నాయి.

హైదరాబాద్ రాజ్యం మీద భక్తితో ప్రేమతో రాసిన పద్యాలకు గోలకొండ కవుల సంచికలో ప్రత్యేకంగా ఒక విభాగమే కేటాయించారు.

గోలకొండ కవుల సంచిక గోలకొండ పత్రిక నిర్వహించిన సాంస్కృతిక కర్తవ్యాలకు ప్రతినిధి అని చెప్పవచ్చు.

"గోలకొండ కవుల సంచిక అవతరణ తెలంగాణ తెలుగు పద్య సాహిత్యమనకొక అలంకారము. తెలుగు పద్యరచన కొక మైలురాయి. నాటి నుంచి నేటివరకూ అట్టి బృహత్తర ప్రయత్నము ఏ పత్రికాధిపతియో, ఏ సాహిత్యాభిమానియో చేయలేదు. ప్రతాపరెడ్డి గారి పిలుపు తెలంగాణ కవులకి ఒక శంఖారావమై,కవితా విపంచికి సంక్రాంతియై వెలుగొందినది".(**శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారి జీవితము ,రచనలు,1973, పుట.43**) అని ముద్దసాని రామిరెడ్డి గారు అభి వర్ణించారు.

3.3.3. తెలంగాణ భావకవులు:

తెలంగాణలో ప్రధానంగా ఈ భావకవులు కనిపిస్తారు. వారిలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, కోదాటి రామకిషన్, శేష భట్టర్ రామానుజచార్యులు, బుక్కపట్నం, తిరుమలనరసింహచార్య, ఉదయరాజు శేషగిరిరాజు, గవ్వఅమృతారెడ్డి, గార్లపాటి రాఘవరెడ్డి, సిరిగురుజయరావు, కైరం భూమదాసు,మామునూరు నాగభూషణరావు, సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి, గంగుల శాయిరెడ్డి, వానమామలై వరదాచార్యులు, వెల్దుర్తి మాణిక్యరావు, బూర్గుల రంగనాథరావు, దేవులపల్లి రామానుజరావు, బోయినపల్లి రంగారావు, కాళోజీ నారాయణరావు, ఊటుకూరు రంగారావు లాంటి మరి కొంతమంది కవులు తెలంగాణ భావకవులుగా నిలపడం జరిగింది.

3.3.4. తెలంగాణ భావకవిత్వానికి ఆధారాలు :

"1920లో ఇనుగుర్తి నుంచి వెలువడిన తెనుగుపత్రిక,హనుమకొండ నుంచి వెలువడిన ఆద్రాభ్యుదయం,1926లో ప్రారంభమైన గోల్కొండపత్రిక, 1927 నుంచి ప్రారంభమైన సుజాత పత్రికలు తెలంగాణలోని భావకవిత్వానికి ప్రముఖస్థానం కల్పించాయి. ఈ పత్రికలను ప్రధాన ఆధారంగా స్వీకరించి తెలంగాణలో భావకవిత్వాన్ని గుర్తించవచ్చు.సుజాత పత్రిక భావకవిత్వాన్ని ఆధ్యాంతం పెంచి పోషించింది.దీనికి తొలి ఎడిటర్ బిన్ శర్మ,ప్రింటింగ్ అండ్ పబ్లిషర్ సురవరం ప్రతాపరెడ్డి. తర్వాతి కాలంలో కొండ బాలకృష్ణారెడ్డి ఎడిటర్ గా ఉన్నారు. పత్రికలే కాకుండా గోల్కొండ కవుల సంచిక,సురభి (బుక్కపట్నం తిరుమల నరసింహ)రామగిరి ప్రణయసౌరభం నివేదన(బూరుగుల రామకృష్ణారావు) ఉదయలక్ష్మి (శేషాద్రి వెంకటరమణ కవులు)రుతుసంహారం(గొట్టిట్టిముక్కల రాధాకృష్ణమూర్తి) భావప్రపంచం (శేశభక్తరురామాంజచార్యులు)ఇతర కవుల ప్రత్యేక సంకలనాలను కొన్నిటిని గ్రహించడం జరిగింది" (**సామిడి జగన్ రెడ్డి, తెలంగాణలో భావకవితా వికాసం, ప్రస్తావనం,2017, పుట.9–27**)

తెలంగాణ భావకవిత్వంలో మహిళలు కూడా భావకవిత్వం వ్రాయడం అనేది ఒక ప్రత్యేకమైన అంశంగా కనిపిస్తుంది. మాడపాటి హనుమంతరావు స్మారక ఆంధ్ర బాలికోన్నత పాఠశాల వారు 1934లో వెలువరించిన ఆరు వార్షిక సంచికలో ఒకటి లభ్యమయింది.అందులోంచి వెలికి తీసిన స్త్రీల భావకవిత్వాన్ని ఇందులో పొందుపరిచారు. మిగిలిన ఐదు సంకలనాలు దొరికితే మరింత మహిళ భావకవిత్వం వెలుగుచూసే అవకాశం ఉంది.

తెలంగాణలో భావకవిత్వంలో దాదాపు 8 మంది ఆంధ్ర రచయితల కవితలు కూడా ఉన్నాయి. వారి కవితలను స్వీకరించడానికి కారణం వారు తెలంగాణలో 150 సంవత్సరాలు ముందే స్థిరపడ్డారని వివరించడం జరిగింది. అందులో ముఖ్యంగా రాయప్రోలు సుబ్బారావు ఒకరు భావకవిత్వానికి అధ్యులైన వారిలో అయినా ఒకరని చరిత్ర చెబుతుంది. ఈయన భావకవిత్వం ఎక్కడి నుంచి రాశాడు ఈయన స్థిర నివాసం ఎక్కడుందని అంశాలను పరిశీలిస్తే భావకవిత్వం తెలంగాణలోనే ప్రారంభమైంది అన్న వాదన బలంగా నిలబడుతుంది.

3.3.5. తెలంగాణ భావకవితా శాఖలు:

తెలంగాణలో వెలసిన భావకవిత్వాన్ని విభజించిన రీతిలో చూస్తే "**ప్రణయం, ప్రకృతి**," అని భావించవచ్చు. అయితే ఇందులో ఇంకా వేరేశాఖ కవిత్వాలు కూడా కనిపిస్తున్నాయి. **"భక్తి, దేశభక్తి, సంఘసంస్కరణ, స్మృతి"** లో భాగమైన తాత్వికతతో కూడిన కవితలు గల శాఖలు మనకు కనిపిస్తాయి.

ముందుగా తెలంగాణలో వచ్చిన ప్రణయ కవిత్వాన్ని పరిశీలిద్దాం.ప్రణయకవిత్వాన్ని సి. నారాయణరెడ్డి ప్రధానంగా రెండు రకాలుగా విభజించారు. వస్తాశ్రయరీతి ఆత్మశ్రయరీతి,ప్రణయకవిత్వం విరివిగా తెలంగాణలో వచ్చింది. సురవరం ప్రతాపరెడ్డి రాసిన కవిత్వం అత్యంత సౌకుమార్యం,రమణీయం, బావగార్భితంగా ఉంది. వస్తాశ్రయ ప్రణయకవిత్వం విరివిగా ఉంది. నిశ్చయచరిత్ర, కుబేరవిజయము, శుకోపదేశము, గోపికసాంత్వానము, సూతఖ్యాయిక, ఓరుగల్లు, అనార్కలి మొదలైన కవితలు వస్తాశ్రయ ప్రణయ కవిత్వానికి ఉదాహరణలు. ప్రణయ కవిత్వంలో తలపోత కూడా ఒక అంశమే. అటువంటి తలపోతను గుర్తుచేసే కవితలు చాలానే ఉన్నాయి. భావకవి ఊహలకు ఎల్లలు లేవు. భావకవిత్వానికి కాలం,స్థలంతో సంబంధం లేదు. స్వేచ్ఛ ఆత్మశ్రయ కవిత్వంలో ఒక కొత్త పోకడ. అటువంటి కవిత్వ చాయలు తెలంగాణలో వెలిసిన భావకవిత్వ శాఖలలో కనిపించాయి.ప్రశ్నార్థక రూపంలో కృష్ణశాస్త్రి అటువంటి కవిత్వాన్ని వెలిబుచ్చాడు. అటువంటి రీతిలోనే బూరుగుల రామకృష్ణారావు ప్రేమ గీతిని తెలుపుతున్నారు. భావకవి తనను తాను ఓదార్చుకున్న తీరులో కూడా ఇక్కడ కవిత్వం కనిపిస్తుంది.సోంపు అనే కవితలో శేషభట్టరు వెంకటరామానుజచార్యులు ప్రేమంటే శృంగారానికి ప్రాధాన్యాన్ని కోరనంటాడు.

ప్రణయినికి కవితలు బూర్గుల రంగనాథరావు ప్రథమ సందర్శనమే ప్రణయ మూర్తి జనిస్తుందనే భావాన్ని వ్యక్తం చేశారు.నాటి ప్రేమకురంబు ఈనాడు నింగినట్టు శాఖల గల బూరుహముగబెరగే అంటూ ప్రేమ ఎంత బలియగా అయిందో మారుతుందో తెలిపాడు. భావకవిత్వం ప్రేయసి ప్రియుల మధ్యనే కాదు దంపతుల మధ్య కూడా ఉంటుందని తెలంగాణ నిరూపించింది. బండ ఆంజనేయులు ఉప్పరి దంపతులు వెంకి పాటలకు ఏమాత్రం తక్కువగానే రీతిలో ఈ భావగీతం

ఉంది ఉన్నంతలో ఎంత ప్రేమగా ఉంటున్నారో చెబుతూనే అంతర్లీనంగా సామాజిక పరిస్థితులను తెలిపిన గీతం ఇది. భావ కవిత్వంలో ప్రకృతి వర్ణన కూడా ఒక శాఖ ఈ ప్రకృతి కవిత్వంలో ప్రణయ కవిత్వం తొలి మెరుపు రూపంలో మీ గోపాలకృష్ణ రావు ప్రకటించిన బాబు కథను కోకిల కవితలో కాళోజి నారాయణరావు ధన్యాత్మకంగా ప్రకృతి రమణీయతను తెలిపారు. ఎండాకాలం వాన గురించి రాజయ్య తెలిపాడు.

భక్తి కవిత్వం కూడా భావ కవితా శాఖలలో ఒకటి నీతి ,తాత్విక కవిత్వం, దేశభక్తి కవిత్వం కూడా భక్తి కవిత్వంలో భాగము. అటువంటి కవితలలో దేశమాత శీర్షికలో వి లక్ష్మీదేవమ్మ ,శారద శీర్షికతో మోటుపల్లి కృష్ణమాచార్యులు రాశారు .తెలంగాణలో మహిళలు భావ కవిత్వం రాశారని మొట్టమొదటిసారిగా వాటిని నిరూపించడం జరిగింది. మాడపాటి హనుమంతరావు గారు బాలికోన్నత పాఠశాల వార్షిక సంచికలలో వారి కవిత్వాన్ని కనుగొన్నారు.

3.3.6. ముగింపు:

భావకవిత్వం 1940 ప్రాంతాల్లోని అంతరించింది అన్నమాట అవాస్తవమని దీని ఇంకాస్త పరిశోధనాత్మకంగా చూస్తే తెలంగాణలో భావ కవిత్వం 1966 వరకు వెలసిల్లిందని చెప్పవచ్చు. 1948 నుంచి 66 వరకు 65 కవితలను నుపేర్కొనడం జరిగింది. మొదటి దశ భావకవిత్వం ఉద్యమంగా వెలువడింది. మలిదశ భావకవిత్వం ఇతర కవిత్వ ధోరణుల నీడలలో వెలువడింది.

భావ కవిత్వం గానయోగ్యయోగ్యమైంది. భావ ప్రధానమైనది,ఆత్మ నాయకము ,ఏక భావాశ్రయమైంది. భావకవులు వియోగ శృంగారానికే ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ భావ కవిత్వంలో అన్ని రకాల శృంగార భావనలకు ప్రాధాన్యం కనిపిస్తుంది. భావ కవిత్వంలో అనుభూతి ఉద్వేగం వ్యక్తమవుతూనే ఏదో ఒక నీతిను తాత్వికతను ధ్వన్యాత్మకంగా తెలుపుతున్న శైలి కనిపిస్తుంది. నిజానికి భావకవిత్వంలో స్వేచ్ఛాయుతమైన వర్ణనలే ఉంటాయి .అలా ఉంటూనే కొత్త రకం భావు కథను ప్రవేశపెట్టిన తీరు కనిపిస్తుంది. ఎన్ని కల్పనల మీద ఆధారపడ్డ అనుభూతి మాత్రమే ప్రధానమైనది. అటువంటి అనుభూతిని వ్యక్తం చేస్తూనే కొత్త కోణంలో తమ భావుకతను వెలుబుచ్చారు తెలంగాణ భావకవులు.

తెలంగాణలో ఉన్న భావ కవితలు దేశి,మార్గ ఛందస్సులో ఉన్నాయి ఎక్కువగా సీసము, తేటగీతిలలో ఉన్నాయి .ఇవి గానయోగ్యమైన అనే భావన పండితులలో ఉంది .తెలంగాణను వెలిసిన భావ కవిత్వంలో కులాంతర ,మతాంతర ప్రేమలు ధనిక, పేద మధ్య ఉండే ప్రేమ విఫలాలు ,సఫలతలు కనిపిస్తున్నాయి. ఈ విధంగా తెలంగాణలో భావకవిత్వం ఆవిర్భవించిందిని చెప్పవచ్చు. తరువాతి అధ్యాయాలలో తెలంగాణ భావకవిత్వంలో గల వస్తువైవిధ్యాన్ని, శిల్పాన్ని, భాషను చర్చిస్తాను.

******

అధ్యాయం- 4

తెలంగాణలో భావకవిత్వం- వస్తు వైవిధ్యం

నాలుగవ అధ్యాయం

తెలంగాణలో భావకవిత్వం– వస్తు వైవిధ్యం

4.0. పరిచయం:

సాహిత్యంలో వస్తువు, శిల్పం అని రెండు అంశాలు ప్రధానంగా ఉంటాయి. కవి లేదా రచయిత ఏ విషయాన్ని ప్రధానంగా చెప్పదలుచుకుంటాడో అది వస్తువు అవుతుంది.ఎంచుకున్న వస్తువును రచనలో అభివ్యక్తీకరించే విధానమే శిల్పం అవుతుంది. వస్తు శిల్ప సమ్మిళిత రూపమే సాహిత్యం.

"కవి తాను చూచిన లేక వినిన విషయాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దితే అది వస్తువు అవుతున్నది. ఆ వస్తువునకు తొలి రూపం విషయం (Subject), వస్తువు యొక్క ముఖ్య ప్రయోజనం కవి సందేశాన్ని పాఠకునికి అందించడమే. అది ఎవరో ప్రబోధిస్తున్నట్లు కాక రచనలోంచి సహజంగా ఉద్భవించాలి. సహజోద్భూతత్వం కళలో రచయిత వస్తువు విషయంలో చూపే సంవేదన చేత కల్గుతుంది. అప్పుడే కవి రచనకోసం తీసుకొన్న విషయం (Subject) వస్తువు (Content)గా మారినట్లు మనం గణించాలి. సమాజంలో నుండి వస్తువు ఎన్నుకోబడుతుంది. అందుకే మానవుడు, అతని సామాజిక జీవితం, మానవ సంబంధాలు, మనుషుల మధ్య వైరుధ్యాలు మొదలైనవి సాహిత్యంలో కనిపిస్తాయి. వీటన్నింటి కళాత్మక ప్రతిఫలమే సాహిత్యంలో వస్తువు అవుతుంది"(**ముదిగొండ వీరభద్రయ్య,విమర్శ, కళాతత్వ శాస్త్రాలు,2004, పుట.199**)

ఏ వస్తువుకైనా మానవ జీవితమే పునాది. ఒక సంఘటనగాని, అనుభవంగాని, భావనగాని ఏదైనా వస్తువుగా ఉపయోగపడుతుంది. దీనిని బట్టి వస్తువును రెండు రకాలుగా విభజించవచ్చు.

ఒకటి ప్రత్యక్ష వస్తువు అంటే 'కవి భౌతిక ప్రపంచం వల్ల ఏర్పడిన సంబంధం నుండి గ్రహించింది'. రెండోది పరోక్ష వస్తువు. అంటే 'కవికి సంబంధించిన అదృశ్య మనఃస్థితి నుండి ఏర్పడినది'

ఆధునిక కవి ఎక్కువ భాగం సమాజంలో వాస్తవికమైన ప్రత్యక్ష జీవితాన్నే కవితా వస్తువుగా స్వీకరిస్తున్నాడు. ప్రాచీన కాలంలో వస్తువు ఎంపికలో కొన్ని పరిమితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆధునిక కాలంలో వివిధ సామాజిక నేపథ్యాలు, వివిధ సాహిత్య ఉద్యమాల కారణంగా వస్తు విస్తృతి పెరి ంది. మిగతా సాహిత్య ప్రక్రియలన్నింటికంటె కవిత్వంలో వస్తువైవిధ్యం ఎక్కువగా కనిపిస్తుంది.

4.1. వస్తువు నిర్వచనం – లక్షణాలు:

వస్తువుని ఆంగ్లంలో Content అంటారు. ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం, దానిలోని సమస్త వైరుధ్యాలు, వీటన్నింటి యొక్క కళాత్మక ప్రతిఫలం సాహిత్యంలో వస్తువు అవుతుంది.

కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానమైన 'Concept' ని వస్తువుగా చెప్పుకోవచ్చు. సాహిత్యం మానవీయమైన ఒక చైతన్య రూపం, ఉత్పత్తి సాధనాల మీద, వాటిని ఉపయోగించే సామూహిక శ్రమ మీదా మనిషి అనుభూతితో కూడిన సంబంధం పెట్టుకున్నప్పుడు సాహిత్య రూపాలు ఏర్పడ్డాయి. ఆత్మరక్షణ, ఆహార సంపాదనల నుంచీ ఆరంభమైన సాంఘిక జీవన క్రమం సాహిత్యంలో వస్తువైంది అని సాహిత్యంలో వస్తువుని వివరిస్తూ చాలా మంది విమర్శకులు అభిప్రాయపడ్డారు.

సాహిత్యంలోని వస్తువే కవిత్వంలో వస్తువు అవుతుంది. కవిత్వంలో అభివ్యక్తమయ్యే వస్తు లక్షణాలను కింది విధంగా అంచనా వేయవచ్చు.

"1. ఒక భావనను తీసుకోవటం ప్రధానం. దీన్నే కొంతమంది 'ఇతివృత్తం' అంటారు.

2. తీసుకున్న భావన లౌకిక, అలౌకికమైన దానిలో ఏదైనా కావచ్చు.

3. వస్తువు కళాత్మకత పొందటానికి ఆధారమవటం.

4. కవి చెప్పదలచుకున్న ఆశయం ఉండటం.

5. కవి చెప్పదలచుకున్న ఆశయం అనేక భావనలతో చెప్పగలగటం.

6. ఒకే భావన తీసుకున్నా కవికీ కవికీ మధ్య భేదం కనిపిస్తుంటుంది.

7. చలన శీలమై కాలంతోపాటు కొత్త కొత్త వస్తువులు తయారవుతుండటం

8. వస్తువు, రూపంతో కలిసి ఉంటుంది. వీటి మధ్యవైరుధ్యం లక్షణమై పరస్పర విరుద్ధమైనా రెండూ విడదీయరానివిగా ఉంటాయి.

9. వస్తువుని రూపం, రూపాన్ని వస్తువు అధిగమించే స్థితి కవి అభివ్యక్తిని బట్టి కలుగుతుంటుంది.

10. వస్తువు సరిగ్గా వ్యక్తం కావాలంటే సరైన 'రూపం' ఉంటేనే సాధ్యమవుతుంది.ఇలా రకాలుగా వస్తువులో గల లక్షణాలనువిడదీసి చూపవచ్చు" **(శరత్ జ్యోత్స్నరాణి, ఎస్, స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం,2003, పుట.26)**

4.1.1. వస్తువుని ఎన్నుకోవడం :

కవిత రాయడానికి ముందు కవి వస్తువు ఎన్నుకోవలసి ఉంటుంది. కవి వస్తువును ఎలా ఎన్నుకోవాలి? పైన తిరుగుతున్న ఫ్యాన్ ని చూసి

"ఎండాకాలంలో తిరుగుతుంది ఫ్యాను,

అప్పుడు చల్ల బడింది మేను అని రాస్తే సరిపోతుందా"

కాబట్టి కవికి వస్తువును ఎన్నుకోవడం విషయంగా సీరియస్నెస్ ఉండాలి. తనను ఆ వస్తువు గాఢంగా కదలించగలగాలి. ఆ వస్తువు వల్ల కలిగిన సంవేదన కవిని కుదిపి వేయాలి.

ఉదాహరణకు తన చిన్నప్పటి క్లాస్ మేట్ ముప్పై ఏళ్ళ తరువాత అకస్మాతుగా కలుస్తాడు. మామూలు వ్యక్తి అయితే సంభ్రమంతో కౌగిలించుకొని కుశల ప్రశ్నలు వేసి ఇంటికి ఆహ్వానించి విందు చేసి, ఇట్లా తన ప్రేమను ప్రకటించుకుంటాడు. అదే కవే అయితే ఇవన్నీ చేస్తాడు. అంతటితో ఆ స్నేహానుభవాన్ని మరచి పోడు. అది మరల మరల అతనికి గుర్తొస్తుంది. అతన్ని వెన్నాడుతుంది. చివరికి తన హృదయంలో కదలాడే స్నేహితుడు అక్షరమై బయటకు వస్తాడు. అదిగో.. అట్లా కవికి

వస్తువు స్ఫురిస్తుంటుంది. ఈ వస్తువు భార్యతో లేక స్నేహితురాలితో ప్రేమ కావచ్చు, కలహం కావచ్చు, జంతు ప్రదర్శన శాలలో పెద్ద పులిని చూసిన దిగ్రమ కావచ్చు. రోడ్డు పైన జరిగిన యాక్సిడెంట్ చూడడం కావచ్చు. ఏదైనా అతన్ని కదిలించేదిగా ఉండాలి. కవి వ్యక్తిత్వం, అతను జన్మించిన సామాజిక వర్గం, అతని విద్య, చాలా సార్లు కవిలోని తాత్విక చింతన కూడా వస్తువుని ఎన్ను కోవడానికి దోహదం అవుతాయి.

4.1.2. కావ్యవస్తువు:

పూర్వకవులు సాధారణంగా పురాణాలు ఇతిహాసాలు మొదలై నవాటినుండి కావ్యవస్తువుగా ఎన్నుకునేవాళ్ళు. సామాన్య మానవుడికి పరిచయం తక్కువగా ఉండే వ్యక్తులు నాయకులుగా, విషయాలు కావ్యవస్తువులుగా ఉండడం.

భావకవిత్వంలో వస్తువుకు ప్రాధాన్యం ఎక్కువగా లేకపోయినా భావ కవిత్వం కాదు. భావకవిత్వంలో కథ ఉండాలనే నియమం లేదు. కథ ఉన్నా కథాకథన శిల్పంతో అది పరిణతి పొందే అవసరం లేదు. కథా నియమం లేకపోవడంవల్ల కవి తాను వ్యక్తం చేయాలనుకున్న భావాలను ఏదో ఒక పాత్రద్వారా పలికించే అవసరం లేకపోయింది.స్వేచ్ఛగా కవి తన అభిప్రాయా లను ప్రకటించుకునే అవకాశం లభించింది.

భావకవిత్వంలో కవి అనుభూతే కావ్యవస్తువు. సామాన్య జీవితవిషయాలు, విశేషాలు, సాధారణ సంఘటనలు, మానసిక పరివర్తనలు, నిత్యజీవితంలో కవికి కనిపించే సమస్త వస్తువులు కావ్యవస్తువులే.

సామాన్య పాఠకుడికి అధికంగా పరి చయం ఉండే సాధారణ మానవులే నాయికా నాయకులు. కష్టకము, తృణకంక ణము, వనకుమారి,పూర్ణమ్మ' యెంకిపాటలు' వంటి ఆధునికుల రచనల్లోని పాత్రలు సర్వసాధారణంగా అందరికీ పరిచయమైనవే.

ఈ విధంగా ప్రాచీన కవులకు భిన్నంగా భావకవులు సామాన్యులను కావ్య నాయకులుగా చేసి వస్తువులో వైవిధ్యాన్ని,నవ్యవత్వాన్ని సృష్టించారు.

4.1.3. కవితా వస్తువు :

"కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ కాదేదీ కవితకనర్హం' అని శ్రీశ్రీ చెప్పిన విషయాన్ని 'కవితావస్తువు' ఎన్నిక సందర్భంలో అందరూ గుర్తుచేసుకుంటూ ఉంటారు. చూడ గలిగిన శక్తి ఉంటే, వర్ణించగలిగిన సామర్థ్యం ఉంటే అందుకు తగిన పదజాలాన్ని స్వంతం చేసుకోగలిగితే కవితారచన కొరకు 'వస్తువు'ను ఎన్నుకోవడం పెద్ద సమస్య కాదు. అయితే ప్రతి వస్తువుకు ఒక స్వభావం ఉన్నట్లే 'కవితావస్తువు'కు కూడా కొన్ని స్వభావాలుంటాయి. సార్వజనీనత, సార్వకాలీనత, సాధారణీకరణం అన్న గుణాలు 'కవితా వస్తువుకు' ఉండాలి. సార్వజనీనత, సార్వకాలీనత, ఇటీవల చర్చనీయాంశాలైనా 'సాధరణీకరణమన్న'గుణం లేకపోతే విషయం వస్తువయ్యే వీలు ఉండదు. సాధారణీకరణమయ్యే విషయాన్ని ఎన్నుకోవడంలోనే కవి ప్రతిభ, కవితా వస్తువు యోగ్యత ఆధారపడి ఉంటాయి". **(శివారెడ్డి, ఎల్లూరి, వచన కవిత్వం వస్తు శిల్పాలు,2020, పుట.121)**

ప్రాచీనులు కవితావస్తువు ఇతిహాస పురాణాల నుండి గ్రహించే వారు. అక్కడ వస్తువంటే కథ ఇతివృత్తం. ఆధునిక యుగంలో వస్తువు అంటే భావన content. ఆధునిక కవితావస్తువు సమాజం నుంచీ, సామాజిక అంశాల నుండీ వ్యక్తి అంతర్ముఖీనత నుండీ వెలువడుతుంది. ఈ వెలువరింతకు కారణం ప్రతిస్పందన.సామాజిక వాస్తవికవితకు ప్రతి చారిత్రక నన్నివేశంలో ప్రతికవీ అనుకూలంగానూ, ప్రజ్ఞాయుతంగానూ ప్రతిస్పందిస్తాడని నిర్ధారించరాదు. అతని ప్రతిస్పందన వస్తుగత అంశాలతో బాటు (Objective Elements) వ్యక్తిగత అంశాల మీద కూడా ఆధారపడి ఉంటుంది. అంటే బాహ్య సమాజంలోని ప్రజల జీవనస్థితిగతులు, సంస్కార సంప్రదాయాలు, అధికార వ్యవహారాలు మొదలైన వాటి ప్రేరణ కవి లేదా రచయితపై ఏవిధంగా ఉంటుందో దాన్ని బట్టి అతను తన రచనా విషయాన్ని నిర్ణయించుకుంటాడు. అంతే కాకుండా ఆ నిర్ణయం. వెనుక అతని సంస్కారం, కళాభిరుచి, భావజాలం, పాండిత్యం మొదలైన అంశాలన్నీ పనిచేస్తాయి.

కనుక సాహిత్యం ఎంతవరకు సామాజికమో (social) అంతవరకు వైయక్తికం కూడా. ఎంతవరకు వస్తుగతమో (Objectiv) అంతవరకు వ్యక్తిగతం (Subjective) కూడా. ఈ మాటల వల్ల కవితా వస్తువు ఎన్నిక కవి అంతర్బహిర్జగత్తుల నుండి జరుగుతుందని తెలుస్తుంది.

కవినేపథ్యం వాతావరణమే వస్తువుల్ని నిర్ణయిస్తుంది. కవి దృక్పథం, జీవితం, వ్యక్తిత్వం, సంస్కారం వస్తువుల్ని ఎన్నుకోవడంలో ప్రతిబింబిస్తాయి. వస్తువు హృదయాన్ని కదిలించాలి. ఆత్మీయంగా ఉండాలి. సమకాలీనత ఉండాలి. కవి ప్రత్యేకత అనేది వ్యక్తం కావాలి.

కవిత్వ రచన నైపుణ్యసాధన వ్యాసంలో నందిని సిధారెడ్డి. వస్తువులో కాల్పనికత పాలు కవి తనలోకి తాను చూసుకున్నప్పుడు ఎక్కువగా ఉంటుంది.

కవి తన హృదయాన్ని కదిలించిన విషయాన్ని కాల్పనికంగా వ్యక్తం చేయదలుచుకున్నాడా, సామాజికంగా వ్యక్తం చేయదలుచుకున్నాడా,అన్న దాన్ని బట్టి అతని అభివ్యక్తి ఉంటుంది. సామాజికమైన ఒక దృశ్యాన్ని కవి తనలోకి చూసుకున్నప్పుడు అనుభూతి కవిత ఆవిర్భవిస్తే,

ఆ సామాజికదృశ్యం తెప్పించిన ఆగ్రహాన్ని బట్టి,ఉద్వేగాన్ని బట్టి వాస్తవిక కవిత ఆవిర్భవించవచ్చు. వస్తువు తనను ఎంత కదిలించింది, అల్లకల్లోలానికి గురిచేసిందన్న అంశాలను బట్టి కవిత విశిష్టత ఆధారపడి ఉంటుంది.

ఒక కాల్పనికమైన, సామాజికమైన, తాత్త్వికమైన కవితావస్తువును ఎన్నుకొని కవితా రచన చేయడానికి ముందు కొన్ని చారిత్రక ప్రాంతాలు, సంఘటనలు, వ్యక్తులపై కవితారచన చేయడం వంటివి అలవాటు చేసుకోవాలి. దీనివల్ల ఒక దృశ్యాన్ని కవితగా మలచే తీరు తెలుస్తుంది.

ఉదాహరణకు కాళోజీ సురవరం ప్రతాపరెడ్డి పై వ్రాసిన, దేవులపల్లికృష్ణశాస్త్రి గురజాడ అప్పారావు పై రచించిన కవితలు. కొందరు కవులు గాంధీ, నెహ్రూ, తిలక్ వంటి జాతీయ నాయకులపై వ్రాసినవి. ఇవి వ్రాయడం మిగతా కవితా చెన వస్తువుల కంటే కొంచెం సులువు. అయితే ఎన్నుకున్న చారిత్రక వ్యక్తిని గురించి న సమగ్ర అవగాహన, అతడి పట్ల గాఢమైన అభిమానం, అనురాగం ఉండాలి. అలా లేకపోతే ఆవ్యక్తిని 'వస్తువు'గా నిరూపించలేము. సాధారణీకరణ దశకు చేర్చలేము. ఉత్త పొగడ్తల వాక్యాలుగా తయారౌతుంది ఆ కవిత.

ఇటువంటి కవితావస్తువులు కొంత సమాచారంతో కూడి ఉంటాయి. ఆతర అందువల్ల అందుకు తగిన భాషను, అభివ్యక్తిని ఎన్నుకొని చెప్పవచ్చు. అయితే ఎన్నుకున్న అంశం పట్ల గాఢమైన

అనుభూతి, చెప్పకుండా ఉండలేని తనం అది కలిగించాలి. అది అటువంటి స్థితిని కలిగించినపుడు వాక్యాల కోసం సాయి వెంపర్లాడవలసిన పరిస్థితి కనిపించదు. అటువంటి స్థితి వచ్చే వరకు కవి మథన పడడం 'కవితావస్తువుకు' గాఢతను నిర్దిష్టతను తీసుకువస్తుంది. సుప్రసిద్ధ సంఘటనలు, అంశాలు కవితారచనలోకి/వస్తువు కోసం వెతికే వారికి ద్వారాలుగా (Entry Points) గా ఉపయోగపడతాయి.

4.2. భావ కవిత్వంలో వస్తువు:

20 వ శతాబ్ద ప్రారంభంలో (1910) తొలిసారిగా తెలుగు సాహిత్యం లో "సంప్రదాయ ప్రభంద కవితా ధోరని"పై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం భావకవిత్వం. ఈ కవిత్వం మూడు దశబ్ధాల పాటు తెలుగు సాహిత్యాన్ని ఉర్రూతలూగించినది. అయితే ఈ భావకవిత్వాన్ని సి. నారాయణ రెడ్డి గారు కవితావస్తు స్వరూప స్వభావాలను బట్టి ప్రణయంకవిత్వం (love poetry) ప్రకృతి కవిత్వం(Nature poetry), స్మృతి కవిత్వం(Elegies) , భక్తి కవిత్వం (Mystic poetry) , దేశభక్తి (Patriotic poetry) , సంఘ సంస్కరణం (Reformativ poetry) అని విభజించారు. మరలా వాటిని కూడా విభజించడం వల్ల భావకవిత్వం వస్తువు పరిధి చాలా విస్తృత మైందని తెలుస్తుంది.

భావ కవిత్వ ప్రధాన గుణం అంతర్ముఖత్వం అని చెప్పి, దాని వల్ల కింది ఈ విధాలైన ఛాయలు కనిపిస్తున్నాయని అంటారు సి. నారాయణ రెడ్డి గారు.

"1. స్త్రీ పురుషుల బాహ్య సౌందర్యానికి బదులుగా ఆత్మ సౌందర్యం, గుణ సౌందర్యం కవిత్వంలో వర్ణింపబడడం,

2. కవి తనకు కలిగిన సుఖదుఃఖాలను ఏ విధంగానూ దాచకుండా బహిర్గతం చేయటం,

3. క్కొక్కసారి అవస్థాన భేదాల్ని బట్టి, కవికి కొండంత సహనం ఏర్పడడమే కాకుండా దానికి ఒక దార్శినిక దృక్పథం అలవడడం,

4. ప్రకృతి వర్ణనల్లో బాహ్య విషయాలకు బదులుగా సుకుమారమైన సౌందర్య తత్వాన్ని నిర్దేశించడం జరిగింది. అంటే చర్మ చదువుకి కనిపించిన ప్రకృతినే కాకుండా మనో నేత్రానికి భాసించే ప్రకృతినే వర్ణించడం జరిగింది.

5. కవి, తాను విన్న, చూసిన ఏ చిన్న సంఘటనైనా తన హృదయ తంత్రులను ఝుమ్మనిపించి, కవిత్వరూపంలో విరజిమ్ముకొని వచ్చింది.

6. ఆత్మార్పణతత్వం, ఆరాధనాతత్వం పాదులు తన్నుకొన్నవి. అంతశ్చేతనంలో చైతన్యం హద్దులు తెంపుకొని వెలువడింది.

7. సామాన్యమైన లౌకిక సంతోషానికి బదులుగా సర్వేసర్వత్ర అలౌకికానందం అంచులు చేరుకొన్నది.

8. కవి తన కొలబద్దలతో జీవితాన్ని కొలచుకొనే ప్రాధాన్యతను తగ్గించి తన వ్యక్తిత్వాల్ని విస్మరించి, ఇతరుల సుఖదుఃఖాల్లో లీనమైపోయే స్థితి ఏర్పడింది.దీన్నే కీట్స్ Negative Capability అన్నాడు. ఇది భావకవిత్వంలో కనిపిస్తుంది.ఇవన్నీ భావకవిత్వ వస్తువుని నిర్దేశించి కవిత్వాన్ని నడిపించగలిగాయి. తద్వార తెలుగు కవిత్వానికి స్వాతంత్ర్యోద్యమ చివరిపాదంలో ఒక శుభ పరిణామానికి కవిత్వం నాందిగీతమై నిలిచింది. అయితే రొమాంటిక్ పోయిట్రీని ఆలంబనగా చేసుకొని తెలుగులో భావకవిత్వం వచ్చింది" **(శరత్ జ్యోత్స్నరాణి, ఎస్ , స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం, 2003, పుట.12)**. లిలియన్(Lilianfurts) దృష్టిలో రొమాంటిసిజానికి....

1. వ్యక్తివాదం (Individualism)

2. ఆదర్శవాదం (Idealism)

3. సృజనాత్మక కల్పన (Creative Imagination)

4. వ్యక్తిగత ప్రకృతి అవలోకన (Subjective Perception of Nature)

5. స్పందనకు ప్రాముఖ్యం (Importance of Feeling)

6. ప్రతీక చిత్రాల వాడకం (Use of Symbolic Imagery)

అనే లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇంచుమించు ఈ లక్షణాలన్నీ భావకవిత్వంలో ప్రతిబింబించటం దీన్ని బట్టి రొమాంటిక్ పొయిట్రీ తెచ్చిన భావ విప్లవం తెలుగులో భావ కవిత్వానికి ప్రేరణగా నిలిచిందనీ, వ్యక్తి స్వేచ్ఛకు పతాక స్థానం లభించిందని అనుకొన్నప్పటికీ గత వైభవ పునరుద్ధరణ కూడా వచ్చింది. ఇది కూడా రెండు ప్రధాన విభాగాలుగా కనిపిస్తుంది. ఒకటి– రాచరికాన్ని పునరుద్ధరించడానికి తోడ్పడే విధానం, రెండు – భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు, దేశ సమైక్యతకు భంగం వాటిల్లే వర్ణ వ్యవస్థ నిరసన, తద్వారా దేశ వైభవ పునరుద్ధరణ దిశగా సంస్కరణ కవిత్వం కొనసాగడం.

మొత్తం మీద భావకవిత్వాన్ని చూసినప్పుడు తెలుగు ప్రజలు జీవించే సామాజిక సందర్భం వల్ల గానీ, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య సమరం, రాజకీయ చారిత్రక ప్రభావం తెలుగు దేశంలోని ప్రజలపైన ప్రసరించటం వల్ల గానీ, బెంగాల్ ప్రేమతత్వాన్ని బోధించిన చైతన్యుడి వైష్ణవమతం, పందొమ్మిదవ శతాబ్దం చివరి భాగంలో బెంగాల్ లోని బ్రహ్మ సమాజం, మైకేల్ మధుసూదనదత్, బంకిం చంద్రుల విశిష్ట రచనలు, 1905లో కర్టన్ కాలంలో జరిగిన బెంగాల్ విభజన, 1920లో ఉప్పెనలా దేశమంతా వ్యాపించిన సహాయ నిరాకరణోద్యమం వీటన్నింటి ప్రభావం కొద్దిగానో, ఎక్కువగానో ప్రత్యక్షంగానో తెలుగు కాల్పనికతకు ఒక ప్రత్యేకత, వైశిష్ట్యం చేకూరింది". అంతేకాకుండా సంస్కరణోద్యమాలు, వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు భావ కవులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. తత్ఫలితంగా వీరి ఆలోచనల్లో కూడా మార్పు మొదలైంది.బాల్య వివాహాల నిరసన, వితంతువు వివాహాల పునరుద్ధరణ, స్త్రీ విద్య మొదలైన వాటి భావకవులు వస్తువులుగా స్వీకరించారు.

ఇదే విధంగా తెలంగాణలో వెలసిన భావకవిత్వాన్ని కవితావస్తు స్వరూప స్వభావాలను బట్టి ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, స్మృతి కవిత్వం, సంఘ సంస్కరణ

కవిత్వం అని విభజించారు. వీటన్నింటినీ కవితా వస్తువులుగా తీసుకొని తెలంగాణలో భావకవిత్వం వెలువడింది.

అయితే ముందుగా తెలంగాణలో వచ్చిన ప్రణయ కవిత్వం లోని వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం. ప్రణయ కవిత్వాన్ని సి. నారాయణరెడ్డి గారు ప్రధానంగా రెండు రకాలుగా 'వస్త్వాశ్రయరీతి, ఆత్మాశ్రయరీతి' అని విభజించారు.

4.3. తెలంగాణ భావకవిత్వం–ప్రణయం:

భావ కవిత్వంలో ప్రణయ శబ్దం నాయికా నాయకుల మధ్య ఉన్న ప్రేమ అనే అర్థంలోనే వాడబడింది. భావకవులు సంయోగ వియోగ శృంగారాలలో వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. వీరు ప్రేయసీ ప్రియులకు పార్వతీ పరమేశ్వరత్వం ఆపాదించారు. వీరి సంయోగ శృంగారం సభ్యతా పరిధిలోనే ఉండిపోయింది. వీరి దృష్టిలో స్త్రీకి పూజ్య స్థానం కల్పించబడింది. స్త్రీని సహచరిగా, ప్రేయసిగా, ఇల్లాలిగా గౌరవ స్థానం ఇచ్చి పూజించారు. భావ కవులలో ప్రణయ సంకీర్తన చేయని కవి లేడని చెప్పవచ్చు.

"భావ కవులను ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలోని స్వచ్ఛంద ప్రణయం ఆకర్షించింది. వీరిలో కొందరు తాము చూచిన స్త్రీ గురించి కవితా గానమాలపించగా, కొందరు ఊహా ప్రేయసిని సృష్టించుకుని కవితలల్లారు. మరికొందరు ప్రేమ విఫలమై వియోగ విషాద గీతాలనాలపించి, ఒక అలౌకిక జగత్తును కల్పించుకుని, ఆ జగత్తులోని ప్రత్యణువులో తమ ప్రేయసీ స్వరూపాన్ని దర్శించి ఆరాధించారు. ఈ విధంగా భాష కవిత్వంలో ప్రణయం, ప్రేయసి అనేకావస్థలను అధిగమించాయి"**(ఆధునికాంధ్ర కవితా ధోరణులు, ఎం.ఎ. మొదటిసవత్సరం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ,2011,పుట.1.7)**

భావ కవిత్వంలో ప్రణయ కవిత్వం వస్త్వాశ్రయ, ఆత్మాశ్రయ రీతులుగా ప్రవహించింది. కథ, పాత్రలు ఉన్న కవిత్వాన్ని వస్త్వాశ్రయమని ఇవి లేనిది ఆత్మాశ్రయమని చెప్పుకోవచ్చు.

తెలంగాణ భావకవిత్వంలో గల ప్రణయ కవిత్వంలోని వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

బుక్కపట్టణము తిరుమల నరసింహాచార్యులు రచించిన **నిరాశ'** అనే ఖండిక అటువంటి ప్రణయ శాఖలో ఒకటి .

"కాఱుచీకట్లఁ గ్రక్కుచుం గడలనెల్ల /నొక్కకబళంబుగా నోటఁ గ్రుక్కి, భీక

రస్వరూపంబుతో నంబరంబునందు/నల్లుకొని వచ్చు మేఘాల నడుగుచుందు

అంధకారంబులో నెందునణఁగినావొ/యనుచు మిణుగురుపురుఁగునై యన్నిచోట్లఁ

బూవుపొదరిండలోఁగూడఁ బోయి, నిన్ను/ కానమిని యేడు మనసార కఱవుదీర.

కన్ను మఱఁగిన, నిదురలోఁ గలలతెరలఁ/ జేరి, నవ్వుచు, జీఱుచు జేయి విసరు

నంత దిగ్గున లేచి నే నాతురముగ /వచ్చునంతనే మాయమై పఱచెదేల?

ఒక్కఁడనె, యొక్కచోఁ జేరి, యొక్కకప్ప/ కన్నులుబ్బంగ, హృదయంబు కరిగిపోవ

గంఠనాళంబుఁ దెగ, నేడ్చి కాఱుమబ్బు/ లందు నినుఁ గాంచి, చూపు లయంబొనర్తు

ప్రతినిశీథంపు సమయాన బయలుదేరి/ తిన్నగా సాగి, శూన్యప్రదేశములను

పక్షినై పాడుచును బోయి బడలి తుదకు /మరల నాశూన్యగృహముకే మరలుచుండు."

(తెలంగాణలో భావకవిత వికాసం,పుట.34)

ఇందులో తన ప్రేయసి తన దరికి రాక తాను పొందే నిరాశే వస్తువుగా గ్రహించ బడింది. ప్రకృతిలో కనిపించే సహజ కార్య కలాపాలను తనకు ప్రతీకగా తీసుకొని తన ప్రేయసిపై వెతికి, వేసారి మరల తన శూన్య గృహానికి వచ్చేస్తానని కవి అంటున్నాడు.

ఈ రకం కవిత్వం పోకడ భావకవిత్వంలో అత్యధికంగా కనిపిస్తుంది. ప్రకృతిలో జరిగే సహజమైన కార్యకలాపాలకు తమను ప్రతీకగా చేసుకొని కవిత్వ రచన కొనసాగించడం ఒక రకమైన ప్రత్యేకత.

బూర్గుల రామకిషన్ రావు రచించిన **ప్రేమగీతి'** అనే ఖండిక కూడా ఈ కోవకు చెందినదే.

"ప్రేమమా! నీదు ప్రియమైన నామ మందు

ఇంత మాధుర్య ముండుట వింత గాదు!

ప్రేమ యను పేరు వినగనే నా మనంబు

తరణి కిరణాలు సోకిన తమ్మివోలె

వికసితంబౌచు వెలయుట వింతగాదు;

ప్రకృతి యెల్లెడ వ్యాపించి ప్రణయభావ

మవని సర్వంబు తన్మయంబై యెసంగ

సంతసించుట సహజంబె వింతగాదు;

ఘోరమగు గర్జనము చేత కొండలదర

జేయు శరదభ్రమునుజూచి, మా యురంబు

పంచములు విప్పి ఆడుట వింతగాదె

వృక్షశాఖాగ్రముల గూళ్ళ పక్షిగణము.. .. .."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.38)

ఈ ఖండికలో ప్రేమ ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది. 'ప్రేమ మయం ఇదం జగత్' అనే విధానంలో ఈ ఖండిక రచించబడింది. ఇందులో తల్లిదండ్రుల ప్రేమ, భార్యభర్తల ప్రేమ, గోపికా కృష్ణుల ప్రేమ, సూర్య కమలాల ప్రేమ అంచెలంచెలుగా వర్ణించబడి చివరకు కరుణ భావం, మైత్రి భావం, భక్తిభావం మొదలైనవి కూడా ప్రేమజనితాలే అని చక్కగా తెలిపారు.

ఈ ఖండిక చదువుతున్నంత సేపు కృష్ణశాస్త్రి రాసిన 'ఏల సలీలయంబు పారు గడపేలా విసరు, ఏల నా హృదయంబు ప్రేమించు నిన్నే' అన్న పక్తులు గుర్తుకు తెచ్చుకోకుండా ఉండలేము

ముసిపట్ల పట్టాభిరామరావు రచించన '**సుందరీ**' ఖండిక కూడా ఈ సంధర్భంలో ప్రస్తావించదగిందే.

" గీ. మృదుల పరిమళ కుసుమ సమ్మిళితమగుచు

లతలచే జుట్టుదట్టమై యితర దుర్ని రీక్ష్యమై

దంపతి రహస్య సాక్ష్యమగుచు

బదలు బదరిండ్లు జూడుమా పూవుబోడి,

చ. పొదిగొనే స్వేద బిందువులు మోమున వేనలి బల్పిరందపై

జెదరి నటింపగా దొడుగె శీతల వాతము లల్లనల్లనన్

గదరగ పట్టి వేర్వీసన కట్టను గైకొని వీతునా శ్రమం

ఋ దొలగు బూలుచుట్టి తుఱుమన్ గరమున్ గయినేతునా చెలీ

చ. వనలతలే సువాసినులు భావభవుండె పురోహితుండళి

స్వనములె మంత్రముల్ ప్రసవ పల్లవముల్ తలుబ్రాలు కోకిల

ధ్వనులె సుగీతముల్ హృదయతాపభవాగ్నియె హోమవహ్నియ.

య్యె నిచట నుత్సవంబున కికేమి కొఱంత వచింపు సుందరీ."

తెలంగాణలో భావకవితా వికాసం,పుట.96

ఇందులో కవి 'ప్రియుడు ప్రేయసీతో సాగిస్తున్న ప్రణయ సంభాషణ' అనేది వస్తువుగా తీసుకున్నాడు.ఈ ఖండికలో కవి తామున్న చోటుని ఒక ఉత్సవ వేదికగా చిత్రించడం ప్రత్యేకంగా

కనిపిస్తుంది.ఆ ఉత్సవ వేదిక ఎలా ఉందో ఓసారి చూడండి. చెట్లకు అల్లుకున్న తీగలు సువాసనులు (ముత్తైదువులు) మన్మధుడెమో బ్రాహ్మడు, భృంగాల ఝంకృతులే మంత్రాలు, చెట్ల చిగుర్లే తలంబ్రాలు, కోకిల కూతలే సంగీతం, హృదయంలో తాపంతో రగిలిన అగ్నియే హోమాగ్ని, ఇంకా ఉత్సవానికి తక్కువేమిటి అంటున్నాడు.

దామరాజు వేంకటరమణమూర్తి రచించిన '**ప్రేమగానము**'కూడా ఈ కోవకు చెందిన మరొక ఖండిక.

"విరహవేదనచేదూతి వివశమగుచు

దు: ఖమున గార్చు నా నేత్రతో యకణము

అవియె! మత్స్వాంతదీపితమైన ప్రణయ

జ్యోతి నార్పుచుండగజూచి యోర్వలేను

రమణి! భవదీయప్రేమ తైలములతోడ

సారములు దక్క కాంతి ప్రసారములకుం

బ్రాణములువోసి మామకస్వాంతవీధి

దివ్యవతరకాంతి శోభాప్రదీప్త కలిత

ప్రణయజ్యతి సుస్థిరముగా బాదుకొల్ప

తావకామల కారుణ్య భావమొలుకు

కృతులబాడెద నాప్రేమ గీతలనుచు....".

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.117)

ఇందులో ప్రేయసి ప్రేమ వరణ్య వస్తువు. కవి ఈ ఖండికలో తనకు కలిగిన విరహా వేదనచే తన మనసులోని ప్రణయ జ్యోతిని ఆర్పకుమని, దివ్యతరమైన కాంతితో,శోభప్రదీప్త కలిత ప్రణయ జ్యోతిని సుస్థిరంగా నెలకొల్పడం కోసం ప్రేయసిని గురించి ప్రేమ గీతాలను పాడుతున్నాడు.

ఒద్దిరాజు సీతారామచంద్రరావు రచించిన ' **ప్రేమ ప్రభావము'** అనే కవిత కూడా ఈ శాఖకు చెందినదే.

"అతండు నిష్ఠురభావుండ ట్లైనగాని/ కనుల కొకయింతయైనను గానంబడదు,

అతని కటువాక్యములు మధు రాతి మధుర/ దివ్య ఫలములకంటెను తీపిగొల్పు,

అతని రోషకషాయ చం. డాక్షియుగము/ ముగ్ధమౌ నా మనంబును మోహపెట్టు

అతని ముఖచంద్రదర్శన మయ్యెనేని /దు:ఖములు స్మృతినుండియు దొలగిపోవు,

అతని నిత్యతిరస్కార మగునునాత్మ /తృప్తికరణసుధారస ప్రాప్తియట్లు

అతని బొమముడిపాటున కగును దివ్య/ సౌఖ్యసామ్రాజ్యమెల్ల హస్తంగతంబు

లైనయట్టు, లనారత మతడు గొల్పు/ భ్రాంతి ముదదాయకంబయి బఱగు నాకు

హృదయమాతని పైయుండి యేలయిట్లు/ త్రిప్పినను తిరుగకున్నదో తెలియబడదు!"

(తెలంగాణలో భావకవిత వికాసం, పుట.125)

ఈ ఖండికలో వర్ణించే వస్తువు ప్రేమనే, సాదారణంగా భావకవిత్వంలో ప్రేయసి ఒలకబోయు ప్రేమ ప్రత్యేకమైనది.ఈ కవితలో ప్రియుని కటువాక్యాలు తీయగా, రోషము మోహపెట్టే విధంగా, ముఖ దర్శనం దుఖాలను తొలగచేయునట్లుగా,తిరస్కారం సుధారస ప్రాప్తిగా అనిపిస్తాయి ప్రియురాలికి. ప్రియురాలి హృదయం ప్రియుని పై నుండి మరోవైపుకు ఎంత తిప్పినా ఎందుకు తిరగట్లేదో తెలియట్లేదంటారు కవి.

సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి రచించిన '**నా ప్రేయసి**' ఖండిక కూడా ఈ సంధర్భంలో ప్రస్తావించదగినది.

"ఆ లలననెమ్మొగం బొకపూలతోఁట/ అందుఁగల పువ్వులుం బండ్లు ననుదింబుఁ

గాన్కగా నాకుఁ బంపును గాని తాను/ లక్ష వరహాలొసంగిన లాఁతి కిడదు.

ఆ లలిత గాత్రమొక్క రత్నాలరాశి/ యన్యులకు లోభనీయంబ యగునుగాని దాని

వెలఁగట్టఁగా లేఁడ నేను దక్క/దానిఁ గొనలేఁడ యన్యుండు నేనుదక్క

ఆరమణిచిత్త మనురాగమారుతంబు/ మలయు నంతఃపురోద్యానమంటపంబు అటకుఁ జన నాకు మాత్రంబె యాజ్ఞగలదు/ పరులు చొఱకుండ మూయఁగాఁ బడునుదలుపు. ఆవనిత మోవియందు లాస్యంబు సేయు/ చున్న చిఱునగ వమృతంపుజున్ను, నాకుఁ గానఁబడుఁగాని పరులకుఁ గావఁబడదు/పుట్లకొలఁది పుణ్యంబు సల్పుకొనియుంట."

(తెలంగాణలో భావకవిత వికాసం,పుట.181)

ఈ ఖండికలో ప్రేయసి ప్రియునికిచ్చిన కొన్ని అనితర సాధ్యమైన సౌలభ్యలే వర్ణ వస్తువులు. ఇందులో ప్రియుడు చేసిన పుట్ల కొలది పుణ్యమే తనకు పైవన్నీ లభించేలా చేసిందని కవి వివరిస్తారు.

బూర్గుల రామకిషన్ రావు రచించిన '**విరహిని**' అనే ఖండిక కూడా ఈ కోవకు చెందినదే. ఇందులో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"రవిరహాశ్రుధార లభిషేక మొనర్చెడు పట్టుపాన్పుపై

కొరలుచు నొక్కకాంత పతి దూరిత, తెన్నులు గాంచుచుండె, వ

త్సరముల నెంచుచున్ విధివశాన పరాన్ముఖుడైన భర్తకై

గురుతర కర్మభోగమున గుందుచు శోకకషాయితాక్తియై.

రతనిస్నాత పయోధరాశ్రుకణికా నిర్మేయహారప్రభా

తరళంబైన కృశాంగరాగములచే దళ్కత్తు నెమ్మోము దు

ర్భర నిశ్వాస కవోష్ణవాతముల వ్యాపారంబు సైరించుచున్

వరగంగాతట పత్తనాంక విలస ద్భాగస్థ సౌధంబుపై.

జీమూతమ్ములు దూతలై మునుపు నుంచే ప్రేమసందేశముల్

కామార్తుల్ బనిపింప కాదనకయే కష్టంబులన్ జెంది నా

రేమోకాని, మదీయభర్త యిపుడేయే దేశమందుండెనో

యే మార్గంబున వెళ్ళెనో యెరుగ నేమై పోయెనో యెచ్చటో?"

(తెలంగాణలో భావకవిత వికాసం,పుట.50)

ఈ ఖండికలో భర్త కోసం ప్రేయసి(భార్య) అనుభవిస్తున్న శోకం వర్ణించబడింది. కొన్ని సవంత్సరాలుగా భర్త కనిపించక పోయే సరికి ప్రేయసి విరహావేదన కళ్ళకు కట్టినట్లుగా చక్కగా వర్ణించబడింది.

సురవరం ప్రతాపరెడ్డి రచించిన 'ప్రణయినీ ప్రాప్రర్థనము' అనే ఖండికను ఈ సంధర్భంలో ప్రస్తావించదగింది.

ఉ. నీనును జెక్కులున్ మఱియు నీ చిఱునవ్వును దంత కాంతలున్

నీ నయగారముల్ కలికి! నీదు మిటారపు గుబ్బ దోయియున్

నీ నడయాడు గౌనరయ నీ చికురంబును గెంపు మోవియున్

జానర్! నాటె నాయెదను శంకలు గల్గిన జీరి చూడుమా

ఉ. ఎచ్చటి కేగినన్ మఱియు నేపనిచేసిన నీదు రూపమే!

యిచ్చ దలంచు చుందు, గృపయించుక పూనవదేమొ యోర్వగా!

వచ్చు నె యీ మనోవ్యధను వారిజలోచన నీ కటాక్షమున్

నచ్చితి నింక తాళగలనా లలనా? చలమూన బాడియే!!

ఉ. నీ సరసంపు ముచ్చటలు నీ తరళాయత నేత్ర యుగ్మమున్

వీసరవోని మోహమున వేమఱు చిత్తములో స్మరించుచున్

వేసర కెల్ల వేళలను బ్రేయసి! నిన్గన గోరు నాకయో!

యాసలు గొల్పి యేచ దగునా మగువా పగ హెచ్చెడింగదే

ఉ. వలపుల బొమ్మ! నీవుగనుబాటయి నంతనె మోదమందుదున్

చలమున గొంతసేపు కను చాటయినన్ బహు తాప మొందుదున్

కలికిరొ! నీ వెఱుంగుదె కకావికలైన మదీయ చిత్తమున్

తెలసిన నింత కస్తీపడ; దిప్పలు వెట్టకె నిన్ను వేడెదన్

(తెలంగాణలో భావకవిత వికాసం,పుట.32)

ఈ ఖండికలో తన ప్రేయసియే వస్తువు, ఆ ప్రేయసి అందాలు, నడకలు ,హొయలు,వీటి వల్ల తన మనసులో కలిగిన సంతోశం ,ఆ ప్రేయసి తనను చేరాలని ఆశించడం మనకు కనిపిస్తాయి.

గార్లపాటి రాఘవరెడ్డి రచించిన '**వేడుచునుంటి తండ్రి**' అనే కవితను సావిత్రి ఖండిక నుండి తీసుకోవడం జరిగినది. *ఈ సంధర్భంలో ఈ కవిత* ప్రస్తావించదగినది.

"పతిప్రాణంబులు దప్ప ఏ వరము లభ్యర్థించినన్ నాకు స

మ్మతమౌనంచును మూడుమార్లనితి ఎమ్మా రవ్విధిన్ దక్కి

'ఈ ప్పితమేదో వచియింపు మిత్తు' నని సంప్రీతుండవై యానతి

చ్చితి నా పుణ్యము పూచి కాచి ఫలియించెన్ ధన్యురాలన్ యమా!

వేడుచునుంటిఁ దండ్రి పతిభిక్ష దయామతివై యొసంగి కా

పాడు.తండు నా ప్రణయబంధురమూర్తి మనోధనమ్ము జా

రాడిన పశ్యతోహరుడు నాఱవప్రాణ మభీష్టదానసం

క్రీడనలోల : నిక్క మెఱిగించితి దోయిలిబట్టితిన్ యమా:

ప్రవితతరాజ్య వైభము బాసినవాడయి తల్లిదండ్రులన్ .. .."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.40)

భావకవిత్వంలో కవి తన ప్రేయసిని ఆరాధిస్తూ, ఆ ప్రేయసీలోనే మమేకమైపోవడం సాధారణంగా కనిపించే విషయం. కానీ ఈ ఖండిక దానికి వ్యతిరేకమైనది. సత్యవంతుని ప్రాణాలు తీసుకవెలుతూ ఉన్న యముడిని ఆపి సావిత్రి తన భర్తను గురించి తెలిపే సంధర్భంలోనిది ఈ ఖండిక. ఇందులో భర్త ప్రేమ కవితా వస్తువు. సావిత్రి తన పతిని గురించి ప్రణయ బంధుర మూర్తిగా, మనోవెధనగా,ఆరవ ప్రాణంగా యమునికి చెప్పడం మనం గమనించవచ్చు. ఇంకా అనంతాలైన ఆవిరాల భోగభాగ్యాలు తన పతి పాదాలలోనే తనకు ఉన్నాయని చెప్పడం అత్యంత రమణీ రమణీయం. ఇంతటి ప్రేమ ప్రియునిపై కనుపింపచేయడం ఒక రకంగా ప్రత్యేకమే.

ప్రధాన వస్తువు సావిత్రి సత్యవంతుల ప్రేమ. అది కాస్త భావకవిత్వం పాళ్ళను సంతరించుకొని అద్భుతమైన కావ్యంగా రూపుదిద్దుకుంది.

బుక్కపట్టణము తిరుమల నరసింహాచార్యులు రచించిన ***'ప్రణయ లేఖ'*** కూడా ఈ శాఖకు చెందినదే.

"వాయుదేవుడ! యిదిగో నా ప్రణయ లేఖ/నాదుకన్నీటిచే వ్రాసినాఁడ దీని

నమ్మహానందసాగర మవల స్వర్గ/ సౌధమున వెల్గుచునన నా సతికి నిమ్ము.

అల్లదేచూడు మట్టుల యాకసమునఁ/దేలియాడుచునుండెడు తెల్లమొయిలు

దానిపై నెక్కి ఱివ్వునఁ దరలితేని/ తరియుదువు నీవు తారాపథంబు త్రుటిని,

అట్లే తారాపథంబున సరిగితేని/ పాలసంద్రంబులో నొక్క పడవ నీకు

కానిపించును పదియాఱు కళలతోడ/ నెమ్మదిగ నీవు దానిపై నెక్కి పొమ్ము.

చల్లగా మెల్లగా నావ సాగిపోవు/ చుండు; ప్రొద్దిశ తెలవాఱు చుండు వేళ

దివ్యమణిరత్నమకుల మౌక్తికవిభాస/ మానమగు సౌధమది నీకుఁ గానుపించు".

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.73)

ఇందులో కవి తన ప్రేయసీకి వాయు దేవుడి ద్వారా ప్రణయ లేఖను పంపించడం ప్రధానమైన వస్తువుగా కనిపిస్తుంది. తన ప్రేయసికి లేఖ అందించడాన్ని వాయుదేవునికి కవి దిశానిర్దేశం చేస్తాడు. ఈ సంధర్భంలో వచ్చేసరికి కాళిదాసు మేఘ సందేశం, జాషువా గబ్బిలం అనే కావ్యం కచ్చితంగా గుర్తుకువస్తాయి. కానీ ఈ ఖండిక గబ్బిలం కావ్యం రాకముందే సురభి పత్రికలో 1927లో అచ్చయింది.దీనపై మేఘసందేశం ప్రభావం ఉన్నట్లు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

బుక్కపట్టణము తిరుమల నరసింహాచార్యులు రచించిన '**ఉన్మత్తత**' కూడా ఈ సంధర్భంలో ప్రస్తావించదగిన ఖండికల్లో ఒకటిగా చెప్పవచ్చు.

"పూర్వహర్షానుభవత నుప్పొంగియేను/ దేలియాడుచు నిశ్చలలీలఁ బోదు.

ప్రణయగీతికలన్నిటిఁ బాడుచెటకొ/ నిర్భరానంద సందోహనియతి నొక్కొ

కపుననేన్నేదియో నేనె యడిగికొంచు/ మాటలాడుచు నన్ననే మఱచిపోయి

వేయివిధముల వేషాల వేయుచుందు /తారనై; వెల్గుచుందు నుద్ధతిని మింట

బురుగునై, ప్రాకులాడెద పుడమిపైన/ నావనై సంద్రమునం దేలి నడుచుచుందు

మోడునై పాడువడియుందు మూలలందు.....".

(తెలంగాణలో భావకవితా వికాసం, పుట.74)

ఈ ఖండికలో ప్రణయం తారస్థాయికి చేరుకొని ప్రియుడి చేస్టలు, ఆలోచనలు వర్ణించే వస్తువులు. ప్రణయంలో తారస్థాయికి అందుకొని తాను ఏం చేస్తున్నాడో తనకే తెలియని ఉన్మత్తుడిగా మారిపోవడం మనం గమనించవచ్చు. కృష్ణ శాస్త్రి ఆకులో ఆకునై అని ప్రకృతిలో కలిసిపోయినట్లు ఈయన మాత్రం ఉన్మత్తతతో ప్రకృతిలో కలిసిపోతానంటాడు.

గవ్వా అమృతరెడ్డి రచించి**న నిర్వేదము**' అనే ఖండిక కూడా ఈ కోవకు చెందినదే.

"కఠినమగువినాంతరంబులు/ గాంచు చెన్నిదినంబులుండుదు

పఠనసేయుచు నీదు నామము/ పడతి! రాగదవే?

చలితకాల నదీతరంగం/ బులకు నిలువగలేదు జీవిత

లలితనౌకానుభవ రూపము/ లలన! రాగదనే?

రాత్రి మీరెను నాదు గృహమున/ రాజిల్లెడు దీపికకు దైలము

మాత్రమైనను బోసి చీకటి/ మాన్పుమో సకియా!

నిశితమగు వీక్షణాశగ/నిహితమైనను జాలు సాంతము

దిశలు మ్రోగుగు గొట్టుకొనునా/తీవ్రతను జూతున్ ఓ ప్రియా!.....

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.74)

ఇందులో కవి ప్రధానంగా ప్రేయసి రాక కోసం ప్రియుడు అనుభవిస్తున్న విరహ వేదనను వర్ణించడం జరిగినది. ఈ ఖండిక ముత్యాలసరంలో రచించబదిండి.

ఊటుకూరు రంగారావు రచించిన **'నవ విరహిని'** అనే ఖండిక కూడా ప్రణయ శాఖకు చెందినదే. ఈ కవితను కూడా ఈ సంధర్భంలో ఉంచదగినది.

"అన్నీ కలలేనా...../ కోరికలన్నీ వ్యధలేనా.... /జీవితమంతా వృధయేనా.../ఈ గాఢ తమోరాత్రులు ఏవో భయంకర స్వప్నాలతో../ నిట్టూర్పులు వెడలిస్తూ,/ ఇలాగే గడిపేయాలా..

ఎన్నడీస్థితికి అంతం.../ ఏమిటీ నా జీవితభావం.../ క్రమక్రమంగా గొలుసులవలె

గడుస్తున్నాయి వత్సరాలు/సంతతాశ్రుధారావాహిని /సాగిపోవలసిందేనా...?

విరబూసిన పువ్వుల నవ్వులు/విరియనున్న మొగ్గలనిగ్గులు.../ పరితాపం, బాధ, నిరీహత ప్రబలిస్తూన్నవి హృదయంలో/నా వాంఛిసుమమొకటైనా, విరియలేదు/ విరియదో యేమో... సౌకుమార్య, సౌందర్యాలను/ విరజిమ్మే యౌవనరేఖలు/ చెఱిగి, నశించడం తప్పదా.."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.547)

ఇందులో ప్రేయసి ప్రియుడి కోసం అనుభవించే విరహావేదనను కవి వస్తువుగా తీసుకోవడం జరిగినది. ఇందులో విరహానికి తారాస్థాయి వచ్చినట్లు కొన్ని పంక్తులు గమనిస్తే మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఎన్నో నవ యౌవ్వన వాంఛలు ఇక్కడ బలియవుతున్నట్లు కనిపిస్తుంది. ఈ ప్రేయసి ప్రతి ఘడియా వియోగ భాధను అనుభవిస్తున్నట్లు కనిపిస్తుంది.

సి. నారాయణ రెడ్డి రచించిన **'హృదయ వేదన'** ఈ శాఖకు చెందిన ఖండికగా చెప్పవచ్చు. ఈ కవితను ఈ సంధర్భంలో ప్రస్తావించవచ్చు.

"ఓ నవీన కిసలయాంగిరో! త్వదీయ/ విశ్వమోహన లావణ్య విమలమూర్తి

నస్మదీయ మనోమందిరాంతరమున /నిలుపుకొంటి ప్రణయపూజ సలుపనెంచి.

పత్రివలెనాదు జీవిత భారమంత/ నీదుమ్రోల నర్పించితినే లతాంగి!

జీవకళ సుంతయున్ లేని శిలవటంచు/ దెలిసెనిప్పుడు నీరంగు తెరలువీడ.

ఉ. హేనలినాంగి! నీవు లిఖియించిన అంతిమలేఖ జూచినా

మానస సీమలోపల తుపానులు, కంపము లెన్నొరేగె, గా

నీ, నినుగోరి నామదిని నిల్పినప్రేమ పవిత్ర బీజపు

ణ్యాన, మదీయమానస మహోస్థలి బ్రద్దలుగాక తప్పెనే!

ఉ. ఓ చెలి! నీయొయారముల నొప్పులగుప్పు విలాసహాసముల్

చూచి, త్వదీయ మానస ప్రసూనము ప్రేమ పరిమళాలనే

వీచిన దంచునెంచితిని, ప్రేమల తావులు లేనిహావముల్

పూచిన మోదుగుంబువుల పోలికయందు నెఱుంగ నైతినే...."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.585)

ఈ ఖండికలో కవి ప్రియుడి విరహావేదనను కవితా వస్తువుగా తీసుకోవడం జరిగింది.ఇందులో ప్రియుడు పూర్వం తన ప్రేయసితో తనకు గల అనుభవాలను వివరిస్తూ, విరహంతో ఎక్కడ చూసినా తన ప్రేయసియే కనిపిస్తున్నట్లు కవి వర్ణించాడు. తన విరహాబాధలో ఉన్నప్పుడు తన దేహం నుండి వెలువడుతున్న వేడి నిట్టూర్పు సెగలకు బండలు కూడా కరిగిపోతయేమో కానీ తన ప్రేయసి మాత్రం దరికి రాదని బాధపడుతున్నాడు.

కాళోజీ రామేశ్వరరావు ఉర్దూ లో రాసిన '***షాద్***' అనే కవితను తెలుగులో ***దేవులపల్లి సుదర్శన్ రావు*** '***మనగాధ***'గా అనువదించారు. ఈ ఖండిక కూడా ఈ శాఖకు చెందినదే.

"మనగాధ విన్పించ మనసాయె నాకు/ మరల నిన్నేడ్పించ మనసాయె నాకు

చాలులే: గుండెగూటిన సందెబాటున/ వెలిగించ నొక దివ్వె మనసాయె నాకు

భవనాలు పిడుగుబడి భస్మమౌ చోటునే/ ఇలుగట్టి జీవించ మనసాయె నాకు

పదిమందితోబాటు సైయంటె సై యంచు/ నుదుటి వ్రాతను మార్చ మనసాయెనాకు

ఎదురు తిరిగిన శిరసు లెగిరిపోయిన చోట/ నిలదొక్కు కొని నిలువ మనసాయె

నాకు విధివశమ్మున వెళ్ళగొట్టినట్టి చోటికే/మరల జెరగ 'షాదు' మనసాయే"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.424)

నాకుఈ కవితలో ఒక ప్రేమజంటను దూరం చేయడం వల్ల విరహంతో ప్రేయసిని వాళ్ళ కథను చెప్పి ఏడ్పించాలని , గుండెలో నిర్మించిన ప్రేమ భవనాన్ని కూల్చిన చోటే మళ్ళీ ఇల్లు కట్టి నుదటిరాతను మార్చుకోవాలని అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని ఉండాలని ఉన్న విధి మనల్ని విడగొడ్తుందని ప్రియుడు తన భగ్న హృదయ ఘోష ను ప్రేయసికి చెబుతున్నాడు.

వేంకట కృష్ణమాచార్యులు నండూరి రచించిన '***సంబంధమేమి***' అనే ఖండికను కూడా ఈ సంధర్భంలో ప్రస్తావించదగిందే.

"నీపేరు నేనెరుగ నాపేరు నీవెరుగ వోబాల

ప్రేమకును పేర్లకును సంబంధమేమి?

రూపవతివి నీవు రూపహీనుడ నేను ఓపడచు

ప్రేమకును రూపుకును సంబధమేమి?

నీవు మానిననేమి నిన్ను ప్రేమింతు ఓ కన్నె

ప్రేమకును ఫలమునకు సంబంధమేమి?"

(తెలంగాణలో భావకవిత వికాసం,పుట.293)

ఇరువురికి మన పేర్లు తెలియకున్న , నువ్వు అందంగా ఉండి నేను అందంగా లేకున్నా , నువ్వు నా ప్రేమను కాదన్నా నేను ఫలితం గురించి ఆలోచించక నిన్ను ప్రేమిస్తునే ఉంటానని పరిచయానికి , అందానికి ప్రేమతో ఏమి సంబంధముండదని ప్రియుడు తన ప్రియురాలికి చెబుతున్నాడు కవి వర్ణించడం జరిగినది.

అన్నగారి వేంకటకృష్ణారాయుడు రచించిన '**విరహిని**' అనే ఖండిక ప్రణయ కవిత్వానికి చెందిన కవితగా చెప్పవచ్చు. ఇందులో కవి ఏం వర్ణిస్తున్నాడో పరిశీలిద్దాం.

"సంతోషకరపుష్ప సముదయో ద్యానవ నంబులనంగ/ కానలనిదోచె కడుచిత్ర చిత్ర ప్రాకారసౌధాగ్రం దిరమును దలపోరు దిగులు దగిలె /మణిమయ సకల భూషణవితానమఱు లెల్లు గనిన బన్నగములగతివహించె వినుటకు సొంపుగా వింపువీణాదిగా/ నధ్వనుల్ సహ్య శూన్యంబులయ్యె

పతిని విడుచుట దేహమే పసదొలంగె/ నేమిదోచదు నింకనేనేమిసేతు

వేగనీవేగి శ్రీబీబి నగరవాసు/ గృష్ణమూరితిన్ని దేగదే కీరవాణీ

తెలుపవే నావెతల్ సలుపవే బహుమతుల్/ కలువవే యనుమతుల్ కాంతనకును

మలుపవే సతిజాడు గొలుపవే మరులీద/ నిలుపవే ననుగూడ నిజముతోడ

వద్దనే యాసుద్ది కద్దనే యతిరద్ది పద్దనే యీబుద్ధి పదుగురింట

రమ్మనే తగనేలు కొమ్మనే రతిమేలు లిమ్మనే తననమ్ము కొమ్మనననే

కొమ్మనాయెద మదనుండు గ్రుమ్మెననవె/ నన్ను మరుబారికోపింప కన్నదనవె

వేగనీవేగి శ్రీబీబి నగరవాసు/ గృష్ణమూర్తిని దేగదే కీరవాణి"

(సురవరం ప్రతాపరెడ్డి,గోలకొండ కవుల సంచిక,పుట.114)

కృష్ణునికి తన చెలికత్తె ద్వారా సందేశాన్ని పంపుతున్నట్లు మనకు స్పష్టంగా కనిపిస్తుంది. హైదరాబాదు దగ్గరున్న బీబీనగరమే పద్యంలోని బీబీనగరు. కవి జన్మస్థలమిదే. ద్వారకా కృష్ణునికి కాకుండ ప్రేమ సందేశాన్ని బీబీనగర వాసుడైన కృష్ణునికి ఒక విరహిణి పంపటం విశేషం. ఈ కవికి తన పుట్టి నూరు మీద ఎంత ప్రేమ ! ఎవరి దగ్గర ఏది ఉంటే దాన్ని చెప్పుకోవటమే మంచిదేమో ! జన్మభూమి స్వర్గం కంటె మిన్న యనే దేశీయ భావన ఈ కతలో కన్పిస్తుంది.

నల్లాన్ చక్రవర్తి ప్రతాపం రాఘవాచార్యులు రచించిన '**రాధవలసంత**' అనే ఖండిక ఈ సంధర్భంలో ప్రస్తావించదగిందే.

"గహన సుమమాలికలు నీదు కంఠమందు/ మెరయ మురళిని కరమున మీటిపాడు

నీదు సుందర రూపంబు నేనుమరలం/ జూచుటెన్నాళ్లకో చిత్తచోరకృష్ణ.

మురళి యెంతటి మంచి నోములను నోచి/నీదు యధరసుధారసాస్వాది యయ్యె

నట్టి నోముల నోచంగ నైతిగాన/ నట్టి నాకెట్లు సంప్రాప్త మౌదువీవు.

మంత్రముల నేర్చుకొనినైతి మందుపెట్టు/ టెరుగనైతిని తంత్రంబు లెవ్విలేవు

కపటవలపంత కంటెను గానరాదు/ యిట్టి నను బాధపెట్టుట యేరకృష్ణ.

వంశమో యెవ్రతంబుల ప్రాపుజేసి/ యెట్టి పుణ్యంబు జేసి నీ వీముకుందు

దయకు పాత్రతవైతి వద్దానిదెలిపి/ మాన్పవేనావగపు బ్రతిమాలుకొందు."

(గోలకొండ కవుల సంచిక,పుట.117)

ప్రణయము అనగానే కవులు రాధాకృష్ణులనే ప్రధానంగా చెప్తుంటారు. సత్యభామను కవులెందుకో చెప్పనే చెప్పరు. రాధ కోసం తప్ప సత్యభామ కోసం కృష్ణుడు మురళి ఊదినట్టు కవులు చెప్పలేదు. రాధ వంటి వాళ్లకు కృష్ణుడు మరింత ప్రియం కావటానికి క్షణం ప్రేమ కి అతడు మురళిని

బాగా ఊదటం కూడ ఒక చిన్న కారణమై ఉంటుందేమో అని చెప్పడం జరిగినది. ప్రేమ కృష్ణుడనగానే కవులతని చేతికొక మురళి నిస్తారు అని కవి ప్రధాన వస్తువుగా చెప్పారు.

నల్లాన్ చక్రవర్తి ప్రతాపం రాఘవాచార్యులు గారు రచించిన '**రాధ వలపంత**' ఖండికలోని మరొక కవిత కూడా ఈ శాఖకు చెందినదే.

తమకు నచ్చిన నాయకుణ్ణి తన వానిగా చేసికోవటానికి స్త్రీలు చేసే రక రకాల ఉపాయాల్లో 'మందు' పెట్టడం కూడ ఒకటి. ఏ మందు పెట్టి అయిదుగురిని నీ అదుపాజ్ఞల్లో ఉంచుకున్నావని ద్రౌపదిని సత్యభామ అడిగినట్లు భారతం వల్ల తెలుస్తుంది. ఈ కవీ ఆ 'మందు' విషయాన్నే చెప్పినాడు. మందు కాకపోతే మంత్రం. లొంగ దీసికోవటానికి ఏదో ఒకటి –

"మంత్రములు నేర్చుకొనునైతి, మందు పెట్టు

టెరుగనైతిని, తంత్రంబు లెవ్వి లేవు

కపట వల పంతకంటెను గానరాదు

యిట్టి నను బాధ పెట్టుట యేర కృష్ణ!"

(భూమయ్య, అనుమాండ్ల, తెలంగాణ భావ విపంచిక, పుట.59)

కపట వలపు ఉన్నవాళ్లకే మందో మాకో పెట్టాలన్న ఆలోచన వస్తుంది. వలపు తప్ప కపట వలపు తనకు లేదు కాబట్టి మందు, మంత్రాల ఆలోచన నాకు లేదంటుంది రాధ. మగవాళ్లు కూడ ఆడవాళ్లకు మందు పెడతారనే మాట కూడ వింటుంటాం. కపట ప్రేమ ఉన్నప్పుడు ఆడైనా మొగయినా ఒకే రకమైన ఆలోచన ఉంటుంది అని కవి చెప్తున్నాడు.

పెండ్యాల హనుమచ్ఛర్మ రచించిన '**హృదయ నిర్వేదం**' కూడా ప్రణయ శాఖ కోవకు చెందినదే. ఈ ఖండికలో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"దుర్భర వియోగ వారధి ద్రోసిపోయి/ వత్సరము లెన్నొగడచెను వన్నె కాడ

తిరిగి యీ జన్మమున నీదు దరిసెనంబు/గలిగె నేనియు గాంతును గౌతుకబు.

నీదు ప్రేమాతిశయమున నిష్కళంక/ వర్తనము గాంచి యానాడు ప్రాణనాథ

నీవు సర్వస్వమని నమ్మి నెమ్మితోడ/ బంగితిని గాని నేడు నన్బోలినట్టి

హీనభాగ్యలు లేరని యేడ్చుచుంటి/ యడవి గాచినవెన్నెల యయ్యె బ్రతుకు

క్షణము బాయక విహరించు చక్రవాక/దంపతుల సానురాగ విధంబు లరసి

మాటిమాటికి వచ్చి సంభ్రమ మెసంగు/ బుష్పరసమాన భృంగము పోల్కి జూచి

యింక సంతాపమెటుల సహింతునోయి/ ఆశిథిల ప్రేమ పాశము నట్టె త్రెంపి.

నైచితిని సఫలమాయె నీ వాంఛితంబు/ నాదు "మానస నిర్వేద నంబు" కాస్క

గాగ నర్పించు చుంటిని గడకునీకు....."

(గోలకొండ కవుల సంచిక,పుట.116)

ప్రేమ కేవలం ప్రేమ కోసం కాకుండ దాంపత్యానికి దారి తీసేదిగా ఉండాలన్నది ఈకవి దృష్టి. పై ఖండికలో నాయిక విరహాన్ని వస్తువుగా తీసుకోని వర్ణించడం జరిగినది. ఇందులో ప్రధనంగా ప్రేమ అనేది దాంపత్యం లో ఏలా ఉనడాలనేది కవి స్పష్టంగా చెప్పారు.

చిదిరె రాజేశ్వరరావు రచించిన '***ఆశా భంగము***' అనే ఖండిక కూడా ప్రణయ కవిత్వ శాఖకు చెందినదే. ఈ ఖండికను ఈ సంధర్భం లో ప్రస్తావించవచ్చు.

"ఆశకును మేర యుండదు లేశమైన నువిద సౌందర్య సామ్రాజ్య మొదవు ననుచు.

దెరపి లేకుండ ముద్దుల మరియు చుంటి మేర కలిగించితివి భంగ మిపుడు చేసి

నా మనోరథ మిట్లు నా నావిధాలు– బాడు సేయుగుదలుచిన ఫలమ దేమొ

వాసనలుజల్లు నుద్యాన వనము లందు నవనవ పరీమళము లల్కు పువులు లేవొ

యొకడు చూచినపువ్వు నిం కొకడు వెదకి కోయుదలుచు నిదేమి యన్యాయ మొక్కొ

యిదియె సృష్టిరహస్యమో వెదకియొక్క– విరినిగానమి యాశకు విలువలేదొ

యొకడు ప్రేమించు నది తన కొదవదేని యిప్పుడే మూల్యమింతని చెప్పగలుడు

నీదు మోహనమూర్తినో నీరజాక్షి హృదయ ఫలకంబు పైవ్రాసె సదయుడెమ

చిత్రకారుడు చిత్ర విచిత్రమైన రంగులను ప్రేమరసమును బంగజేసి

మాపదలుచిన మాత్రాన మాసిపోవ దెట్టిరంగుల ప్రతిబింబముట్టిపడును

దలుచినప్పుడు నామనో దర్పణమున....."

(గోలకొండ కవుల సంచిక,పుట.120)

ఈ ఖండికలో నాయకుని విరహమును వస్తువుగా తీసుకొని అది ఎట్లా ఉంటుందో ఆశాభంగము పేరుతో చెప్తున్నాడు చిదిరె రాజేశ్వరరావుగారు. ఈ కవి చిత్రకారుడుగా కనిపిస్తున్నాడు ఎందుకంటే రంగులను 'ప్రేమరసములో పొంగజే' యట మనే మాట వాడుతున్నాడు. చిత్రకారుడు కాకపోయినా ఆ విద్య కొంత తెలిసిన వాడైనా అయి ఉంటాడేమో.ఇందులో వియోగ శృంగారాన్ని వర్ణించేది సంయోగం కోసమే అని కవి చెప్తున్నాడు. పెండ్లి చేసుకోవాలనే కదా ప్రేమించుకునేది. ప్రేమ కోసమే ప్రేమించుకునే వాళ్లుండవచ్చు అని, పూర్వాలంకారికులు మాత్రం సంయోగానికి ముందు వియోగమన్నారు. సంయోగం కోసం వియోగమన్నారు అని కవి చెప్తున్నాడు.

వెంకటరామకృష్ణులు అనే జంట కవులు (గాదె వెంకట రావు,రామ కిషన్ రావు) రచించిన ***నేను*** అనే ఖండిక ప్రణయ శాఖకు చెందినదే. ఈ కవులు ప్రణయ కవులని ఈ ఖండికలో చెప్పడం అనేది చూడవచ్చు.

"నన్ను గనిమీరు నవ్వి నవ్వవచ్చు /దడువుకొననేల కవికుమారుడను నేను

అమలమోహనమైన కావ్యములలోన/ తరుచిర మృదుతరాలంకృతులు జేర్చు

హృదయశాంతికి నిర్జన పదనివాస / మర్హమనియెంచి తిరుగు నన్నాపవలదు!

స్నిగ్ధకవితాలలామ హృత్సీమయందు / ప్రసవములుగూర్చ నిండు యీప్రణయకవిని
ధర్మమనియెంచి యాకవితాలలామ /దృక్రసారాభిలాషదోదూయమాన

మానసంబును బచరింతు నేనుగాని/ సఖుడ, గాఢానురాగార్థ కలితకవిత

మేడ సోపానసరణియే జాదుగలదొ/ దారిజూపిన మెలమెల్లుజేరుబోదు.

నింపుగుల్కుచు నవనవోన్మేషరక్తి /ధారయనియెడి దూతిక దారిజూప

గలదు భయమున నేటికో కలతుజెందు/లేత ప్రాయమ్ము ధైర్యమ్ము లేదుసుమ్ము"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.178)

ఇందులో ఒక నవ్యత కనిపిస్తుంది. కొత్తదనాన్ని ప్రవేశపెడుతున్నామన్న భావన వీళ్లకుంది. అందుకే "నన్నుగని మీరు నవ్విన నవ్వవచ్చు''అంటున్నాడు.'నేను' అంటున్నారు. కాబట్టి, నేనూ ఏకవచనంగానే అంటున్నాను.కవి కుమారుడట. ఇంకా ప్రౌఢుడు కాదు. కవిని అని చెప్పుకోవటానికి నేనేం 'తడుము' కోనంటున్నాడు. కవి కుమారుడైన ధైర్యం మాత్రం ఉంది. సంచరిస్తుంది. 'నిర్జనపద' మట. హృదయ శాంతికి ఇదే సరియైన నివాస మంటున్నాడు.

నిర్జన పదంలో తిరిగే తన నాప వద్దంటున్నాడు. ఇది ఇతరులకు ఒక హెచ్చరిక. ఇది తన మార్గమని కచ్చితంగా చెప్తున్నాడు. ఇట్లా నిర్జన పదంలో తిరిగే నన్ను జూచి నవ్వవద్దంటున్నాడు.

తన కావ్యాన్ని 'అమల మోహన' మైందిగా చెప్తున్నాడు. ఈ పద్ధతి తెలంగాణాకు సంబంధించినంతవరకు నవ్య భావం. ఆ కావ్యానికి తాను అలంకారాలు కూరుస్తాడట.అలంకృతులు ఎంత నవ్యమైనవో చూడు– అవి 'మృదుతర'ములట. అవి రుచిరకు 'తత'చేరుస్తున్నాడు. 'తత–రుచిర–మృదుతర' ఇన్ని విశేషణాలను అలంకృతులకు చేర్చటం

కొత్తగా అనిపిస్తుంది. ఇట్లాగే 'కవితా లలామ'కు స్నిగ్ధ చేర్చినాడు.

ఈ కవి తనను 'ప్రణయకవి' నని చెప్పుకొన్నాడు. ఆ కవితా లలామకు 'ప్రసవముల' కూరుస్తాడట. సిగలో కాదు, మెడలో కాదు. 'హృత్సీమ'లోనట. కవిత లలామ హృదయాన్ని చూసిన కవి ఇతడు, చూపిన కవి ఇతడు, శరీరాన్ని ఎవరైనా చూస్తారు. హృదయాన్ని చూడగల్గటమే గొప్ప, చూపించటం గొప్ప. ప్రణయస్థానం హృదయం. కవితాలలామ హృదయాన్నే చూడగలిగిన కవి. నిజంగానే, 'ప్రణయకవి'. ఇట్లా ప్రేమించటం కొత్త కాబట్టి, అది అందరు సాధారణంగా చేసే పని కాదు కాబట్టి ఎవరైన తన పద్ధతిని కాదంటారేమోనని ముందే చెప్తున్నాడు 'ప్రసవముల గూర్పనిందు అని' ఇది ఒకరకంగా అనుమతిని పొందే పద్ధతి.

'నన్నాపవలదని ఇదివరకే అన్నదాన్ని బట్టి, 'ప్రసవముల కూరుస్తాను, నన్నాపవల'దన్న అర్థం ఇక్కడ చెప్పుకోవచ్చు. ఆ 'కవితా లలామ'ను అట్లా ప్రేమించటం ధర్మ మార్గ మనే స్పష్టం చేస్తున్నాడు. ఆమె 'దృక్రసారాభిలాష దోదూయ మాన మానసు'డట. ఆమె సమక్షంలోకి వెళ్ళదలచు కొన్నాడు.

'గాఢానురాగార్ద్ర కలిత కవిత' ఆ కవితా లలామ అనురాగమెట్టిదో ఈ ప్రణయు కవికి తెలుసు. కాని ఆమె ఉన్నది మేడ పైన. ఆ 'మేడసోపాన సరణి' ఎక్కడ ఉందో తెలియదు. ఆ సోపానాలను చూప గలిగింది ఒక దూతిక. ఆమె పేరు 'ధార' ఈమె ద్వారానే ఆ 'కవిత'ను చేరవచ్చు. కవిత దారి చూపినప్పటికీ పోలేని వాళ్లుంటారు. కాని తాను మాత్రం'మెల్ల మెల్ల'గా వెళుతానంటున్నాడు. తప్పకుండా ఆమెను చేరుతానన్నది. కవి విశ్వాసం. కాని దూతికది 'లేత ప్రాయం' కాబట్టి ధైర్యం లేదు, భయంతో కలత పడుతుంది. అంటున్నాడు. ప్రణయకవి కౌమారావస్థను తెలిపే కవిత ఇది. నూతనత్వానికి అద్దం పడుతుంది. ఒకటి రెండు చోట్ల యతి కనిపించటం లేదు.ఇన్ని విషయాలను కవితా వస్తువులుగా తీసికొని కవి చెప్పడం జరిగింది. ఈ కవిత, కృష్ణశాస్త్రి కవితను స్మరింపజేస్తుంన్నట్లు ఉంది.

శ్రీరామ కవచం ఆనంతశాస్త్రి రచించిన '***కపోత విలాపము'*** అనే ఖండిక ఈ కోవకు చెందిందిగా చెప్పవచ్చు.

"ఎంతటి దూర మేగినదో యెంతటి దుర్దశ ధూళి యున్నదో

కాంత దురంత సంతమసకాల నిరంతర బాధ లొందెనో

వంతల జిక్కి సొక్కీ బలవంతపు వేదన నంత మొందెనో

యింతినిబాసి యెట్లు భరియింతును బ్రాణము దోచ దింతయున్.”

(అనుమాండ్ల భూమయ్య, తెలంగాణ భావ విపంచిక, పుట.84)

తిండి కోసం పోయి తిరిగి రాని అర్ధాంగి కోసం ఒక కపోతం విలపిస్తున్న తీరును కవి వస్తువుగా తీసుకొని ఈ ఖండికలో వర్ణించినాడు. దిక్కుల్లో ఒక భయంకరమైన చీకటి ఆవరిస్తుంది. ఆహార సముపార్జన కోసం వెళ్ళిన నా భార్య ఎక్కడుందో కదా! ఎంత దూరం పోయిందో? పోయిన చోట ఎంత ఇబ్బంది పడుతుందో? ఆమె లేకనేనెట్లా ప్రాణాలు నిలబెట్టుకోవాలి? ఏ ఊరుల్లో చిక్కి ఎంత పరితపిస్తుందో భార్య కోసం భర్త పడే మనోవేదనను కవి వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు.

వి. లక్ష్మీ దేవిగారు రచించిన *‘వియోగం’* అనే పద్య ఖండిక ప్రణయ కవితా శాఖకు చెందినదిగా చెప్పవచ్చు. ఈ సంధర్భంలో దేనిని ప్రస్తావించదగినదే.

“గీ॥ సీతంగనక రాముడు చింతతోడ/నడలు చుండంగ, లక్ష్మణుం డాత్మగుంది

ఎన్నో విధముల కోదార్పం బృథ్వీపతియు/వెడలె ననుజసమేతుండై వెలదికొఱకు ॥

అట్లు చనుచుండ మార్గమ ధ్యంబునందు/ గొండవోలె జటాయువు గోచరించి

అవనిసుత వార్తందెలిపిన యంతవఱకు/ దెలుపుటయు, వారు. దక్షిణ దిక్కునుబట్టి ॥

అరుగుచో, నొక్కయెడంగబం ధాసురుండు/ అడ్డగించటయును వారు నట్టె యతని

పయికి లంఘించి తద్దీర్ఘ బాహువులను/ నిమిషమాత్రాన ఖండించి నిలిచి రంత ॥

వేగ నా దనుజుండును వింతయఱపు/ లఱచి, గంధర్వరూపమునవధరించి

నాదు శాపంబు నెడబాపి నన్నుంబ్రోచి /నట్టి మీకు నమస్కరింతు అనుచు జనియె” ॥

పై ఖండికలో రాముని యొక్క వియోగాయాన్ని రచయిత్రి కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నారు. రామాయణంలోని సీత వియోగ దుఃఖంతో ముందుకు సాగుతున్న విషయాలను,అలాగే రాముని గురించి వర్ణించబడింది.

4.4. తెలంగాణ భావకవిత్వం– ప్రకృతి

ప్రకృతి శబ్దం దృశ్యమాన జగత్తులోని చెట్లు, గుట్టలు, నదులు, తీగలు, పూలు, కోకిలలు, తుమ్మెదలు మొదలైన వాటికే రూఢమైపోయింది. స్వభావోక్తి రమ్యాలైన ప్రకృతి వర్ణనలు వేదాల్లోనే కన్పిస్తాయి. ఆది కావ్యమైన రామాయణంలో ప్రకృతి వర్ణన సర్వతో ముఖంగా భాసించింది. ప్రాచీనాంధ్ర కావ్యాల్లో భారత రామాయణాదుల్లో ప్రకృతి స్వభావోక్తి రమ్యంగానే చిత్రింపబడింది. ప్రబంధాల్లోని ప్రకృతి చిత్రణలో కొన్ని చోట్ల సహజత్వం తగ్గి కృత్రిమత్వం చోటుచేసుకుంది..

భావకవుల దృష్టిలో ప్రకృతి చర్మచక్షువును దాటి హృదయనేత్రంలో ప్రవేశించింది. వీరు ప్రకృతిని స్వీయ సుఖదుఃఖ ప్రకటనకు, ఆత్మానుభూతిని ఆలంబంగా గ్రహించారు. ప్రకృతి భావకవులను దేవతామతల్లియై చేరదీసి లాలించింది. గురువులా దీవించింది. మిత్రునిలా ఓదార్పునిచ్చింది. వస్తువులంగా సష్టించి కవిత్యం రామము చేస్తారు.

భావ కవికి ప్రకృతి అనేక రూపాలలో ప్రత్యక్షమైంది. వేంకట పార్వతీశ్వర కవులకు ప్రకృతి ''రమణనొకసారి నీలాంబరంబు దాల్చి చెలగి యొకసారి వెన్నెల చీర దాల్చి పాసగ నొకసారి మంచు మేల్ముసుగు దాల్చి లీలనొకసారి మేఘ మాలికను దాల్చి''గడియకొకరీతిగా దర్శనమిచ్చింది

భావకవి తనకు కవితా ప్రేరకమైన ప్రకృతిని ప్రేమించడం, మల్లెలను, మొల్లలనే గాక గడ్డిపూలను చూచి కూడ ఆనందంతో పరవశించడం, పూలను త్రుంచటానికి సైతం అంగీకరించకపోవడం కన్పిస్తుంది. విశ్వనాధవారు మనుజుల మాటలకన్న కోకిల కూజితాలే మహితమైనవనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ప్రకృతిని ఆనంద హేతువుగా భావించి, ప్రకృతిలో లీనం కావాలని తహతహలాడటం 'ఆకులో ఆకునై, పూవులో పూవునై కొమ్మలో కొమ్మపై ఈయడవి దాగిపోనా' అన్న కృష్ణశాస్త్రి గారి పలుకుల్లో కన్పిస్తుంది. 'పగడాల చిగురాకు తెరచాటు తేటినై పరువంపు విరిచేడే చిన్నారి పిగ్గునై' అని ఆయన అడవిలో దాగిపోవాలనే ఉత్కంఠ ప్రదర్శించారు.

ఈ సంధర్భంలో తెలంగాణలో వచ్చిన భావకవిత్వంలోని ప్రకృతి కవిత గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

'మామునూరు నాగభూషణరావు' గారు రచించిన **'*కోయిల*'** అనే ఖండిక ప్రకృతి కవిత్వ శాఖకు చెందినదే. ఈ ఖండికను ఈ సందర్భంలో ప్రస్తావించదగినది.

"పరభృతంబులు పాడెడి పాటలోన/ అమలమంజులగీత రాగములు గలవు;

కలికి కోయిలకూనరాగములలోన /రామణీయక సృష్టి మర్మములు గలవు;

సమద పికరాగ శ్రావ్యసంస్మరణ మందు /విమలసుజ్ఞాననీతి మార్గములు గలవు:

ప్రవిమల నిశాప్రశాంత సంపదలలోన /లలితశారద చంద్రికావిలసనమున
మధురమధుసారములగ్రోలి, మావినుండి/గాన కళజిమ్మి, హృదయ మాకర్షణంబు

జేయజాలెడు సద్వృత్తి కోయిలలదె!/ కలికి ! భవదీయ మంజుల గానసమితి

చిగురుటాకులు మేయుటచేతనేమో/ గలిగె కాబోలునంచు నాగళముకూడ

కిసలయంబుల రకఱకున గీసుకొంటి;/ మృదులతర పల్లవంబుల కదిసిమేసి

తెచ్చుకొంటివొ యేమో నీ దివ్యరవ ము/ టంచు నింపైన పాయసాన్నంబు వీడి

చిగురుటాకులు తిని కృశించితిని నేను ....."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.80)

ఈ ఖండికలో కోయిల పాటనే ప్రధాన వస్తువు. ఇందులో గానాన్ని అనుకరించాలనుకొని కవికూడ పాయస్నానాలను తిరస్కరించి మృదు పల్లవాలను(చెట్ల చిగుర్లను) తిన్నట్లుగా ఎప్పుడు కోయిల లాగా తీయని రాగాలు తీస్తానో అన్న ప్రశ్న వెలయించడం పాటకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

శేషాద్రి రమణకవులు రచించిన '**ప్రసూన సుందరి**' అనే ఖండిక కూడా ఈ కోవకు చెందినదిగా చెప్పవచ్చు.

"పుడమి నెలతుక నెమ్మేను పులకరించె/ గమ్మ తెమ్మెరలఖిల దిప్తటులవీచె

గంధలీక సుగంధముల్ కందలించె/ దరుణ శాద్వల లక్ష్మి చైదన్యమొందె.

ప్రకృతియంతయు నూత్న వైభవముం నొందే / గ్రీష్మతాపంబునోర్చి కార్చిచ్చు సైచి

మండు వేసంగి గాడ్పుల/ మంటకాగి సుష్కమృత్పిండ సమాని స్రుక్ స్రుకి

చిక్కి ప్రాణావశిష్టమై చెన్నుదొలంగి/ జీర్ణమందినయొక తీవచిగురువైచె

శీఖరాంజలి నర్పించి సేదదీర్చి/ విమల కిరణామృతంబున విందుపెట్టె"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.100)

శుష్కించి పోయిన తీగ చిగురించి పూవు పూయడమే ఈ ఖండికలోని ప్రదాన వస్తువు. పుడమి తల్లినేను పులకరించగా,తరుణ శాద్వాల లక్ష్మి చైతన్య ముందగా,ప్రకృతి నూతన వైభవాన్ని పొందగా ఒకానొక పుష్ప సుందరి మేల్కొన్నది. ఈ ఖండిక పైకి చూడటానికి కేవలం ఆత్మాశ్రయ కవిత్వంగా తోచిన అంతర్గతంగా మాత్రం అభ్యుదయాన్ని ఇముడ్చుకున్నట్లుగాదీన్ని లెక్కగట్టవచ్చు. అంతకు ముందువరకు కష్టాలకు ఓర్చుకోని,దుఃఖంతో బడలిపోయి జీర్ణమైన తీవను పోలీనవాడు చైతన్యమందు విజయకేతనమెగుర వేయడం ఈ ఖండికలో గర్భితమైన భావం.

వి. ఆర్. కోమలవల్లి గారు రచించిన ***'సూర్యోదయము'*** అనే ఖండిక కూడా ఈ ప్రకృతి కవిత్వ శాఖకు చెందినదిగా చెప్పవచ్చు.ఇందులోని వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"తూర్పుదిక్కున నెఱ్ఱనై/తోచె గనన, మంతంగరెకలునుదయించె

నహిమకరుడు ఎలమి గొల్పుచునున్నదా/ యెఱ్ఱంగు, తీరుతురుల నెంతయు మాఱుచుండి

కొంతతడవునుం బ్రసరించెం/ గాంతులెల్ల, పుష్పితోదాన లతలపై

బొలుపుమీఱ లేతయాకులు బంగారు/ పూతవడసి, చెట్లకంతకు వన్నె హె చ్చింపజొచ్చె ॥

తూర్పుదెసనుండి పడమర/ త్రోవబోవ బాటసారి వితంబున/ బాలుపడు సూర్యునింజూచి పంకజములు, సత్కరించుచన్నవి సంతసమున ॥"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.163)

సూర్యుడు ఉదయిస్తున్న వేళ ప్రకృతిలో కలిగే మార్పులు ఈ ఖండికలో వర్ణించే వస్తువుగా కవి తీసుకున్నాడు. ఈ రకమైన వర్ణన కూడా ప్రకృతి కవితా పరిధిలో వస్తుంది.

కోదాటి రామకృష్ణరావు గారు రచించిన '**సుమవిలాపాము**'అనే ఖండికను కూడా ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే. ఈ ఖండికలో వస్తు విషయాన్ని పరిశీలిద్దాం.

'త్రుంచినాడవు కఠిన! నాదోషమేమి విడువలేవె జీవంబుల వీడువరకు

శాఖలో దుఃఖపర్యవసానమిట్టి– ముఱిపెమని నేనెరింగిన మఱవకుందు

స్వాంతహరుడగు పవను గిల్గింతలకును...

సాకె నన్నెంత పేరిమి శాఖ యొడిని యందమణి మలయ! నన్ను పల్యంకమందు బడయుద్రోచితినీవు నా పరిమళంబు శయ్యనింపుదు రాత్రి నిశావిముక్తి

బారవేయుదునను మంటిబడి నశింప.....

ఎగిరిపోయెడి చెదరినా యింపులొలుకు రేకులు క్రమానుగతిని విస్మృతినిగనెడి

మన్నులో మన్నయి నిమేషమాన్య శోభ కై యచిరసౌఖ్యలాలసతాప హతుడ

వైహరించితోయి నా యసువులకట.....

చారురుచిహీనమయ్యెడు శాఖ మద్వి యోగమున నక్కటా తల్లియొడినిబిడ్డ

బాసి కన్నీరునించునన్ బడయలేక– తేనెటీగలు చింతించు దీర్ఘదుఃఖ

వార్ధిలోమును గోకిలత బంభరములు.....

పొందె సంక్షోభమక్కటా పూవు మొలక మాలిహృదయంబు శోకాను దూలిపోయె

గాంతిదీపిక చల్లారెగా యటంచు శాఖ యేడ్చెడు నాకును జూవుగలదు.

చచ్చెదవునీవు నందఱు చామగలరు తరుణమరణంబు జగతికంతముగదోయి”

(తెలంగాణలో భావకవితా వికాసం, పుట.176)

పుష్పాలను కోసినందుకు అవి అనుభవించే వేదన ఈ ఖండికలో వర్ణించే వస్తువు. ఈ ఖండిక చదువుతుంటే కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పుష్పవిలాపం గుర్తుకువస్తుంది. అయిన ఇద్దరు కవులు ఒకే భావంతో ఒకే కవితా వస్తువును తీసుకొని రాయడం తెలుగు సాహిత్యంలో మామూలు విషయమే.

తాను చెట్టు నుండి దూరం చేయబడుతున్నందుకు పూవు బాధపడటం సరే. కాని తాను లేకుండా పోతున్నందుకు చెట్టు కొమ్మ అందం పోతుందట. తానేడుస్తుంటే తుమ్మెద లేడుస్తున్నాయట. కోకిలలూ ఏడుస్తున్నాయట. ఇది విశేషం. తన కాంతి దీపిక ఆరిపోయిందని చెట్టుకొమ్మ ఎడుస్తుందట. తన్ను పెంచి పోషిస్తున్న తోటమాలి గుండె పగిలేట్టు ఏడ్చినాడట అందమైన పూవును చూస్తే చూడు. చూచి ఆనందించు. అంతే కాని తెంపకు, తుమ్మెద కంటె చెడిపోయినావు. అది మధువును ఆస్వాదిస్తుందే కాని పూవును ముక్కలు చేయదు. చక్కదనాన్ని చూచి ప్రేమించే హక్కుంది

కాని దాన్ని చెరచే హక్కు లేదంటున్నాడు. అది తప్పు అని తీర్పు చెపుతున్నాడీ కవి. చెట్టు నుండి తమను తెంపి వేరు చేసినందుకు విరులు విలపించినాయీ అని కవి అంటున్నాడు.

వేలూరు మాణిక్యరావు గారు రచించిన '**కోయిల పాట**' అనే ఖండిక ఈ కోవకు చెందినదే. ఇందులో గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"శ్రీనాథాది కవీంద్రులచె నుతిగొను కోయిలా /గానాలంకారంబులు గానబడిన కోయిలా లవసంతమే ప్రియమని యతిచతురత కోయిలా/ తలతల మను లేమావుల తావు జేయుకోయిలా పంచమ స్వరముచేత బయలు నెల్ల కోయిలా/ అంచితముగ ప్రతిధ్వనుల నందజేయు కోయిలా తాలమావి లేజిగురును భక్షించెటి కోయిలా/ కాలముగని కేకవేయు గనుదులుతువు కోయిలా నీవులేని వనము సతము లావురుమను కోయిలా/ ఆవుల విడియాల బోతు బోవుగతిని కోయిలా గానమందు నీధ్వని సంక్రమము గానకోయిలా/ జాడగతిరమై యుండుట గాన బడును కోయిలా పులుగులన్ని వేకువనే బలుకుచుండు కోయిలా/కిలుకవు వాని గూడియు కింతమేమొ కోయిలా సాయంతన మందున విస్తారముగను కోయిలా/ కాయము గదలగు బల్కితి వయితివేమొ కోయిలా శివునితాండవమనకునై శీఘ్రగతిని కోయిలా/ సవినయముగ బిలచితివో స్వరసంజ్ఞను కోయిలా దినమంతయు కష్టపడుట గనిభానుని కోయిలా/ అనువగు బరమాద్రికిబమ్మని యంటివొ కోయిలా అదిగాకను యర్ఘ్యమిడుగ నిదితఱియని కోయిలా/ ముదమునవిప్రులకు దెలుపబదరెదవో కోయిలా అవిరళముగ వణిన్‌చెదరట ప్రియమున కోయిలా..."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.46)

ఇందులో కోయిల పాటను కవి ప్రధాన వస్తువుగా తీసుకున్నాడు.కోయిల పాటను కవి తనువితీరా కొనియాడటం ఈ కవితలో కనిపిస్తుంది. కోయిల లేని వనాలు ఆవురావురంటాయంటూ వర్ణించిన పంక్తులు గమనిస్తే కోయిలకి ప్రకృతిలో ఎంతటి ప్రాముఖ్యాన్ని ఇస్తున్నాడో అర్థమౌతుంది.

బూర్గుల రంగనాథరావుగారు రచించిన '**సూర్యోదయము**' అనే ఖండిక ప్రకృతి శాఖాకీ చెందినదిగా చెప్పవచ్చు.

ఈ ఖండికలో గల కవి వస్తువును వర్ణించిన విధమును ఒకసారి పరిశీలిద్దాం.

"ప్రాగ్దిశాసతి చెంగావి వలువగట్టి

భూనభోంతరముల బూయబూని, పాణి

పద్మమున దాల్చి పట్టిన పసుపు ముద్ద

వలెను గన్పట్టె హరిదశ్వభద్రుడపుడు....."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.439

తూర్పు దిశలో ఒక వ్యభిచార స్త్రీ లేత ఎరుపురంగు వస్త్రాన్ని కట్టుకొని భూమి ఆకాశానికి మధ్యన పద్మాలు వంటి తన చేతుల్లో పట్టిన పసుపు ముద్ద వలె సూర్యుడు కన్పిస్తున్నాడని సూర్యోదయాన్ని పోల్చి వర్ణించడం ఈ ఖండికలో ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది.

బూర్గుల రంగనాథరావుగారు రచించిన మరొక ఖండిక **'సూర్యాస్తమయము'**. ఈ ఖండిక కూడా ప్రకృతి శాఖకు చెందినదే. ఇందులో గల వస్తు విశేషాలను పరిశీలిద్దాం.

"వెలుగుకాంత పరుగు వెట్టగ నస్తాద్రి

నామె కొప్పుమీద నందముగను

మడచి ముడుచుకొన్న, మందారపూవునా

భానుడపుడు సంజ గానబడియె....."

(తెలంగాణలో భావకవితా వికాసం, పుట.439)

వెలుగుకాంత పరుగు పెట్టినప్పుడు పడమటి కొండల్లో ఆమె కొప్పు మీద అందంగా మందార పువ్వును మడిచి పెట్టుకున్నట్లు సాయంకాలాన సూర్యుడు కనబడుతున్నాడని సూర్యాస్తమయాన్ని కవి వస్తువుగా తీసుకొని ఉత్ప్రేక్షంగా చెప్పడం చాలా బాగుంది.

బూర్గుల రంగనాథరావుగారు రచించిన **'వెన్నెలా'** అనే ఖండిక కూడా ఈ కోవకు చెందినదే. ఈ ఖండికలో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"వెన్నపూసల తెలుపులో /చిన్నిపూసల మెరుగులో

కన్నెవలపుల కలలలో /నన్ను మరచిన వెలితిలో కలిసిపోవే వెన్నెలా

కరగిపోవే వెన్నెలా/ చుక్కల పందిరలో

చిక్కని చూపులలో/చెక్కిలి నునుపులలో

చక్కని నవ్వులలో/ స్రుక్కిన పువ్వులలో

దక్కని ఆశలలో/ కలసిపోవే వెన్నెలా

కరగి పోవే వెన్నెలా....."

(తెలంగాణలో భావకవితా వికాసం, పుట.454)

రాత్రివేళ ఆకాశంలో వెన్నెలా లేనందున వెన్నెలా తెల్లని కాంతిని కరిగిస్తూ కలిసిపోవాలని, వెన్నెలను ఇష్టపడే ప్రేమికులను తన ఆగమనంలో ఆనందపర్చాలని కవి వెన్నెలాను వస్తువుగా తీసుకొని పిలవడం జరిగింది.

సురవరం ప్రతాపరెడ్డి గారు రచించిన ***'వసంతం'*** అనే ఖండికను కూడా ఈ సందర్భంలో ప్రస్తావించదగినదే.ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"పూల రంగులకును మల్లె పొలతలకును

ప్రణయ మధుర వార్తల రాయబారులగుచు

కుంజముల జేరి గీతికల్ మంజులముగ

గానములను చేసే భ్రమర సంఘీతమొల్ల

చిగురులను మెక్కి మామిడి చెట్ల కెల్ల

తనియ వినిపించే 'కోవెల' తనదు పాట

తేటి మధువాని తియ్యని పాట వినెచె

మంచివారల గుణములు మాన్యమిటుల"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.438)

తుమ్మెదలు పొదరిళ్ళలో చేరి పూలరంగులకు మల్లె స్త్రీలకు ప్రియమైన, మధురమైన సమాచారాన్ని తీసుకెళ్ళే రాయబారులై చక్కని పాటను పాడుతుంది. కోకిల లేత చిగురును తిని మామిడి చెట్లకు తృప్తిపరచే విధంగా తన పాటను వినిపిస్తుంది. తుమ్మెద మధురమైన పాట విన్నట్టుగా మంచివాళ్ళ గుణాలు ఈ ప్రకారంగా గౌరవదగినదిగా ఉంటుందని కవి వసంతకాలం గురించిన వర్ణించడం జరిగింది.

జి. రాధాకిషన్ రావు గారు రచించిన '**వసంత ఋతువు**' అనే ఖండిక కూడా ప్రకృతి కవితా శాఖకు చెందినదే. ఈ ఖండికను ఈ సందర్భంలో ప్రస్తావించదగినదే. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"కొదమ తుమ్మెద గమి ధనుర్గుణము చేసి/ పుల్ల చూతాంకురముల నమ్ములుగుజేసి

కాముకుల డెందములు జీల్పగా దలంచి/ చా! చనుదెంచె యోజ వసంతుడదుగో!

రమ్య దీర్ఘ కాంబువులకు రత్న కాంచి/ కావితతికి విలాసినీ గణములకును

సోమరుచులకు పుష్పిత చూతములకు/ నొసుగు సౌభాగ్యమీ వసంతోదయంబు

కర్ణములయందు నవకర్ణి కారములను/ కలితచంచల నీలాల కమ్ములందు

పుల్లనవమల్లి కాశోక పుష్పవితతి/ దాల్చి వెలయింతురౌ ప్రమదాజనమ్ము

చందనాద్రన్ హారంబులస్త నములందు/ వలయముల నంగదంబుల బాహులందు

నవ్యకమనీయ కాంచుల నడుములందు/ తరుణులు ధరిత్రు కామసంతప్తలగుచు.

కామశిథిలంబు లైనట్టి గాత్రములను/ వాడి యుచ్ఛ్వాసచేవీడు బంధములను

గలిగి దగ్గఱనేయున్న కాంతులందు/కమలనేత్రలు కడుప్రేమ గలిగియుంద్రు"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.184)

పై ఖండికలో కవి కాముకులనో ప్రేమికులనో ఒక్కటి చేయటమే వసంతుని పని లాగా కన్పిస్తుంది అని చెప్పడం జరిగినది. కాలమంటే గుర్తుకు వచ్చేది వసంత ఋతువు. ప్రణయంలో పడి కాలం మర్చినం. ఇందులో ప్రధానంగా కాముకుల ప్రేమను వసంత ఋతువుపై ఎలా ఉందో చెప్పడమే ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది.

అవధానం శేషశాస్త్రిగారు రచించిన '**వసంతము**' అనే ఖండిక ఈ కోవకు చెందినదిగా చెప్పవచ్చు. ఇందులోని వస్తువును పరిశీలిద్దాం.

"వేలకుమించు బల్ వింతజాతులుగల్గు నంటుమామిళ్లు సౌఖ్యంబు దెల్ప

నుల్లంబుదనియంగ ఝుల్లుఝుల్లనరాలు పూలప్పుచెట్లు సొంపులుఘటింప

చిన్న కాల్వలగుండ సన్నగా బ్రవహించు లహరీ విశేషముల్ లలిదలిర్ప

పలురహస్యముల కొమ్ములుగాగుదనరారు బహునికుంజమ్ములు పరిఢవిల్ల

భళిరభాసిల్లు చిత్రసంపన్నమగుచు/జూచువారికి మిగుల దృష్టులకుభ్రమము

గలుగు జేయుచు లక్ష్మికా కరమునగుచు/ భద్రకరమైన సుందర భవనమనుగ

చివురుటాకులమెక్కి చెలుగిజంపములందు నిలచి కోకిలలు వా నేర్పునెరప

విహతపత్రములైన వృక్షజాలములెల్ల కిసలయంబులతోడ నెసక మెసుగ

కమనీయతరములై గంధవాహంబులు జనులకు మిక్కిలి సౌఖ్యమొసుగ

దినములకంటే రాత్రిగణంబులేచాల సౌఖ్యకారణవిశేషము వహింప

నెందుజూచిన మల్లెపూల్విందునేయ /మహిమ పెంపొంది సౌఖ్యధామంబుగాగ

నలరెడి వసంతఋతువెన్న నగునె మాకు/ బ్రహ్మకైనను వేనోళ్ల వానికైన."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.185)

ఈ ఖండికలో వసంత ఋతువు గొప్పతనాన్ని చెప్పడమే కవి వస్తువుగా తీసుకున్నాడు.కోకిలలు, చివుళ్లు, చల్ల గాలులు, మల్లెపూలు మెదలైనవి వసంత ఋతువులోనే కదా దర్శనమై సుఖమునిచ్చేది.కాబట్టి ఇలాంటి ఋతువు గొప్ప తనాన్ని చెప్పటం బ్రహ్మతరం కూడా కాదు అని కవి చెప్తున్నాడు.

శేషం జగన్నాథాచార్యులు గారు రచించిన '**వర్ష ఋతువు**' అనే ఖండిక ప్రకృతి కవిత్వ శాఖకు చెందినదిగా చెప్పవచ్చు. ఇందులో వస్తువును ఏ విధంగా ఉందో చూద్దాం.

"వారిదబృందముల్ దివిగి వ్యాప్తములైదిననాధుదీప్తుల

న్నారయమ్రగ్గుజేసి హలికావళి భూమిబెకల్చిబీజముల్

వారకజల్లుచుండిరిక వావిరి పంకిల భాజియయ్యె నీ

ధారుణి పల్లవాంకురిత ధామము నై విలసిల్లె నెల్లెడన్.

విద్యుల్లతాజాల విభ్రమభ్రమణచే భయదగర్జిత సముద్రాంతమగుచు

గాఢాంధకారమైన కప్పెవారిదపంక్తి గగనభాగము కడు సొగసుదనరె

చల్లనిగాడ్పులు చాలమీమగ జచ్చె బక్షుల రావముల్ పరగహెచ్చె

పుష్పఫలాదులు భూరిమైధరవ్రాలె వడి పరాగంబు దిగ్వ్యాప్తమయ్యె

నింతవింతయునెన్నడు నెఱుగనహహ వానగురియంగుజచ్చె నిబ్బరముచాల”

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.180)

ఇందులో కవి వర్షంను కవితా వస్తువుగా తీసుకొని వర్ణించడం జరిగినది. ఎండలు మండీ మండీ వానలు వస్తే ఎలా ఉంటుందో కవి చెప్తున్నాడు. కురిసే వర్షం కంటికి ఎలా కనిపిస్తుందో కవి వర్ణించాడు. వర్షం పడే ముందు చల్లటి గాలులు ఏ విధంగా వస్తాయో కవి చెప్తున్నాడు.

ఎం. వి. మాధవరావు గారు రచించన **‘కుసుమాపచయము’** అనే ఖండిక కూడా ఈ కోవకు చెందినదె. ఈ సంధర్భంలో ఈ ఖండిక ప్రస్తావించదగినదే.

“వికసిత మనోహరములైన విరులుగాంచి/ కోసి యానంద పడెదవు కొంతసేపు

తమక మొకయించు కేనియు దగ్గగానే/ మూలుబడనైచెదవు దాని ముక్క లెల్లు

దరువుబాసిన కుసుమంబు దక్కదనుచు/ బూర్వలావణ్యమంతయు బోవుననుచు
దెలిసియునుగోయ యత్నించుదెలివిలేని/ పనిని, నేమనుటో? పిల్లతనముగాక

కొమ్మనున్నట్టి పుష్పంబు గోయుబోక/ తావులనుగ్రోలు టుచితంబు దాపునుండి

మధువునాస్వాదన మొనర్చు మధుకరంబు/ హానిసేయుటకలదె? ప్రసూనములకు

సుందరములైన వస్తువుల్ చూచినప్పుడు/ భ్రాంతిజెందని మనుజుండు పరగుగలుడె”

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.179)

ఇందులో కవి ప్రకృతిలో దొరికే అందమైన పువ్వులను కవితా వస్తువులుగా తీసుకొని వర్ణించడం జరిగినది. అందమైన పూవును చూస్తే చూడు. చూచి ఆనందించు.అంతే కాని తెంపకు,తుమ్మెద కంటె చెడిపోయినావు. అది మధువును ఆస్వాదిస్తుందే కాని పూవును ముక్కలు చేయదు. చక్కదనాన్ని చూచి ప్రేమించే హక్కుంది కాని దాన్ని చెరచే హక్కు లేదంటున్నాడు.అది తప్పు అని తీర్పు చెపుతున్నాడు ఈ కవి. మనిషి కంటే తుమ్మెద నయం అన్నట్లు చెప్తున్నాడు ఈ కవి

జాతక మార్తాండ ఆరుట్ల వేంకటనృసింహాచార్యులు రచించిన **'చిలుక'** అనే ఖండిక ఈ కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"సలలితోద్యాన వనముల సంచరించి/ పుష్పసౌధాగ్రముల యందుబంచి నిద్ర
మందనిలయానిలనినాద మహిమతోడ/ నీదు మృదుమధుర వ్యక్తి నిస్వసంబు
మేళవించియు తరుల సమ్మేళనమగు/ గూడి ప్రకృతి విచిత్రముల్ పాడుకొనుచు
గవికుమార సుఖంబులుగాంచినావు/ బరగ స్వేచ్ఛాను సంచార నిరతవగుట
సౌఖ్యమును గాలమంతయు జరిపినావు/ చిలుక నీకీసుఖంబు శాశ్వతమెయెపుడు
మిగుల సుందరమగు నీదు మేనుగాంచి/ మధురసముజిల్కు త్వర్గాన మహిమనరసి
చిన్ని బాలుండు పాల్రావ చన్నుమరచె/ నేడుప్పుజాలించి తల్లిరాకెరుగడయ్యె
పంజరంబున బంధింప బడుదువీవు/ నైన దుఖింపవలదు నా యానసుమ్ము
బ్రహ్మ లిఖియించువ్రాతు దప్పంగుదరమె/ బంధమున మోక్ష మొదవు నిర్భంధముగను
జిలుక దీనినెరుంగు నిశ్చింతసుఖము....."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.194)

భూ ప్రపంచంలో ఉన్న ప్రతి జీవరాశి ప్రకృతిలో భాగమే. అనగా చెట్టు,చేమ,పక్షులు ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే వస్తాయి. ఇలా ప్రతి జీవి కూడా ఉంటుంది. ఇలాంటి సంధర్భంలో కవి ఒక చిలుకను కవితా వస్తువుగా తీసుకొని వర్ణించడం అనేది చాలా గొప్ప విషయం. కవిత్వం కేవలం విషయం కోసం మాత్రమే కాదు. కవిత్వంలో విషయం కూడ ఉంటుంది. కొంతమందికి కవిత్వం అస్సలు గిట్టదు. గిట్టదు అని అనరు. వాళ్లు విషయం కోసం, కావ్యంలో కావలసిన సన్నివేశాన్ని చదువుకొంటారు. అలంకారాలు, వర్ణనలు, రచన, విశిష్టమైన అభివ్యక్తి – ఇట్లాంటివి వీళ్లకు,

నడుస్తున్న దారిలో ముళ్ల డొంకల వలె కనిపిస్తాయేమో తెలియదు. ఇలాంటి సంధర్భంలో చిలుకను వర్ణించడం కవి గొప్పతనం.

బూర్గుల రామకృష్ణారావు గారు రచించిన '**మారుతము**' అనే ఖండిక ప్రకృతి కవిత శాఖకు చెందినది. ఈ ఖండికను ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"లలితరసాల వల్లపఖాది కోకిల గానంబుతోడ సంగతమొనర్చి

విభామకాపగా వీచికాసందోహ నినదంబుతోడ నిన్వనము నేసి

విరహిణీజన దీర్ఘ తరతప్త నాంద్రోష్ణ నిశ్వాసములతోడ విశ్వసించి

యుద్యానవిహరణ ప్రోత్సుకితాంగనా కిలకిలారవములు గలిసి నవ్వి

వనవిహంగమ కుహుకుహూస్వనముగూడి/ ప్రౌఢకాంతాకరముల విపంచి గలిసి

గాన నిస్వస నిశ్వాస కలితహాస/వివిధవిభ్రమములుదేలే పవనుండరి

అతులవిషాద సంభృతగాన మొనరించు కలకంతిరవము సంచలనమొంద

సాంద్రపుష్పనికుంజ సౌధంబులు జరించు ప్రియదంపతులకు దబ్బిబ్బుగల్గ

ప్రియసమాగమకాంక్ష బయలెల్లవీక్షించు నభిసారికలకెల్ల నాసుగొలుప

నవవిలాసస్ఫూర్తి నవఘళింపగుగోరు కన్నె యద్దమువద్దు గళవళింప

గణికగింజలు మునుపంటు గొణికియిచ్చి/ పాలనమునేయు శాలికా జాలమునకు సంభ్రమముగూర్ప నల్లన సంచరించె/వాతపోతంబు సకల దిగ్వ్యాప్తుడగుచు."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.166)

ఈ కవి ప్రకృతిలో భాగమైన పంచభూతాలను కవితా వస్తువుగా తీసుకున్నాడు.మనిషిలో పంచభూతాలున్నట్టు ఈ పవనునిలో కోకిల గానముంది. నదీ తరంగ నిస్వనముంది. విరహిణీ జనుల

వేడి నిట్టూర్పులున్నాయి. అంగనల కిలకిలారవములున్నాయి. వన విహంగాల కుహూస్వనముంది. పరీక్షించి చూస్తే ప్రౌఢ కాంతలు వాయించే విపంచికా స్వనమున్నట్లు కూడ కనిపిస్తుంది. ఇది పవనునిలో 'ఎక్స్ట్రా'. పోతన గారి మీది గౌరవం చేత ఆయన రాసిన ఫేమస్ 'మందార మకరంద' పద్యంలోని ఒక సగం పాదం తెచ్చుకొని దానితోనే ప్రారంభించినాడు.

చింతామణి నరసింహాచార్యులు గారు '**ప్రభాతము**'అనే పద్య కావ్యాన్ని రచించారు.ఈ పద్య కవిత ప్రకృతి శాఖ కోవలోకే వస్తుంది.

"నళినీ పుణ్య ఫలంబు కోక మిధునానందాలవాలంబు ది

గ్వలయాలంకరణంబు మోక్షపదవీ ఘంటాపథం బంబర

స్థల మాణిక్యము బ్రహ్మ విష్ణు శివ తేజఃపుంజ మౌపాసకో

జ్వల నిక్షేపము భానుబింబము ప్రకాశం బయ్యెఁ బ్రాచీదిశన్

పూర్వపశ్చిమ దిగ్భాగముల నలంకృ

తింబులై సూర్యశశిమండలంబు లొప్పె

హరుని తేరికి బండికండ్లైన నాటి

చంద మిటువంటి ని తెల్ప జగములకును"

(గోలకొండ కవుల సంచిక,పుట.229)

ఇందులో కవి సూర్య వర్ణనను కవితా వస్తువుగా తీసుకున్నాడు.కమలాల పుణ్య ఫలం సూర్యుడట. పుణ్యం చేసుకున్న వాళ్ల బ్రతుకులు ప్రకాశిస్తాయని కవి ఉద్దేశ్యము. చక్రవాక పక్షుల జంట ఆనందిస్తుందట. ఎడబాటు తొలగి సూర్యదర్శనంతో సంయోగం వాటికి సిద్ధిస్తుందట. సూర్యుడు ఆకాశానికి అలంకరణమట. ఇది సరే, బ్రహ్మ, విష్ణు, శివుల యొక్క తేజఃపుంజమట సూర్యుడు. 'ఔపాసకోజ్జ్వల నిక్షేప' మంటున్నాడు. 'నళినీ పుణ్యంతో మొదలు పెట్టి ఉపాసన కడకు

చేర్చినాడు సూర్యవర్ణనను. భారతీయ కళల పరమార్థం భగవంతుణ్ణి చేరటాని కని చెప్తుంటారు. కవిత్వం ఒక కళ. ఇది ఒక సాధనా మార్గం. రాస్తున్న పద్యంతో, మోద మార్గం చూపిస్తున్నాడు కవి. సూర్యవర్ణన మిష, ప్రకృతి వర్ణనను కవి ఈ ఖండికలో కవితా వస్తువులుగా వాడుకున్నారు.

చిరుమఱ్ఱి నారసింహ కవిగారు రచించిన '**నిశీధము**' అనేపద్యకావ్యాన్ని ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"జలజాప్తు డబ్ధి గ్రుంకు లిడంగా బై కుబ్బు/పూన్కి పెల్లెగయు తుంపురు లనంగ

కడు వియలక్ష్మి శృంగార కలా పోన్న/ తములకై కూర్చు ముత్యము లనంగ

లలిదేణి కాలమాల్య కరిఁ దా గగన దే/వత పైనిఁ జల్లు పుష్పము లనంగ

సమరు లా శశికళోత్రృమముఁ గ్రోలెడి వేళ/లను జారనగు సుధాకణము లనగ

ప్రాగ్వధూ ఘన హేలానుభవ కరండ/ మటుల బిస నళ్లి చిత్రంబు లలవరింప

బరగి విరిసిన కపురంపుఁ బలుకు లనగఁ/ బెక్కులై క్రిక్కిఱిసె మింట రిక్క గుంపు"

(గోల్కొండ కవుల సంచిక,పుట.214)

ఇందులో కవి గగనంలో గల చుక్కల అందాన్ని వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. సూర్యుడు పడమటి సముద్రంలో మునకవేస్తే చిల్లిన తూమారులో ఉన్నట్లున్నాయట చుక్కలు. ఇలా ఆకాశంలో మెరిసే చుక్కల్ని రకరకాలుగా వర్ణిస్తున్నాడు కవి. ఇందులో ఉత్ప్రేక్ష అలంకారం ఉన్నట్లు కనిపిస్తుంది.

గంగుల శాయిరెడ్డి గారు రచించిన '**కాపుబిడ్డ**' అనే పద్యకావ్యం ఈ కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"సీ॥ మండువేసవియెండ। మంటలోఁగ్రాగుచు/ బూని పనిసేయు మౌను లెవరు?

వానలో నానుచు వణకుచు హల మూని/ చలియందు దున్నెడి, సాధులెవరు?

వాళ్లలో నడవిలో రాతిరిం బవలును/ తడబాటు లేనట్టి తపసులెందరు?

తలక్రింద చేయి, గులకశిలలపైన/ వెతలేక నొరగిన వేత్తలెవరు?

గీ. కష్టసుఖముల నొకరీతి। గడుపువారు/ శత్రుమిత్రుల సమముగా। సైచువారు

సైరికులు దప్ప సంతటి శాంతు లెవరు?/ కాన మోడ్చి వారి నే గౌరవింతు

క. పుట్టితిరా మేదకులకున్/ బట్టితిరా యరకచేత మట్టిని దున్నన్

దట్టడవులు దిరుగు మీరు। తపసులుగారే!.....”

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.110)

మండే వేసవి కాలం ఎండమంటలో కాగిపోతూ పట్టిన పని విడవకుండా చేసే ఆ మౌనులెవరు? వానల్లో నానుతూ వణకుతు కూడా నాగలిపట్టి చలిలోనూ దున్నేటి ఆ సాధువులెవరు? రాళ్ళల్లోనూ అడవుల్లోనూ రాతిరి పగలు నడుస్తూ ఏమాత్రం తడబడ నట్టి ఆ తపస్వులెవరు? తలక్రింద చేయి పెట్టుకొని ఏ మాత్రం బాధపడకుండా గులక రాళ్ళపై పడుకొన్న అజ్ఞానులెవరు? వారు కష్టాల్లోనూ, సుఖాల్లోనూ ఒకే రీతిగా గడుపుతారు. శత్రువులనూ మిత్రులను సమానంగా చూస్తారు. అంతశాంతంగా ..ఉన్న వారు వ్యవసాయదారులు గాక మరెవరై ఉంటారు. అందుకే వారికి చేతులె నమస్కరిస్తాను; నమస్కరిస్తూనే ఉంటాను అని రైతు వర్ణనను కావ్య వస్తువుగా తీసుకున్నాడు.

గంగుల శాయిరెడ్డి రచించిన మరొక కావ్యం ‘***కర్షకా’*** అనే పద్య కావ్యం. ఇందులో ప్రకృతి వర్ణనను కావ్య వస్తువుగా ఎలా తీసుకున్నాడో పరిశీలిద్దాం.

“సీ॥ నీజాతివారలు రాజులైయుండియు/ గనజాలరైరి నీ కష్టమెల్ల

నీకులమందు జన్మించిన యానమీం/దారులుగనరు నీ తాపమెల్ల

నీశాఖలో ధననిలయులౌకొందఱు/ పరికింపలేరు నీ బాధలెల్ల

నీ తెగలో విద్యనేర్చిన బియ్యేలు/ లిఖియించరైరి నీ లేములెల్ల

గీ. న్యావాదులు నీవార రలడుగరైరి/ న్యాయమూర్తులునీవార లరయరైరి

ఇంక పెఱవారిముచ్చట లెందుకయ్య/ కర్షకా! నీదు కష్టముల్ గాంతురెవరు?

సీ. జాగీరుపౌరులు స్థానంబులేకను/ వరుల పంచలంజేరి బ్రతుకవలపై

అగ్రహారపుంబ్రజ హక్కులన్నిటివీడి/ దశదిశలంజూచి తారవలసె

కౌలుదార్లెప్పుడు కడగండ్లంబడుచును/ స్థిరముగుర్తెఱుంగక తిరుగవలసె

గీ. గొట్టెమేకలనావులంగుడువంబెట్టి/ పల్లెలోనున్న పైరుల నిల్లు విడిచి

ఆలుపిల్లలు దు:ఖింప నడలవలసె/కర్షకా! లెమ్ము వేగమే కనులు విప్పి"

(గోలకొండ కవుల సంచిక,పుట.286)

ఈ కవి కాపుబిడ్డ పేరుతో కర్షకులు కడగండ్లను చిత్రిస్తు ఒక కావ్యాన్ని ప్రచు ంచినాడు. తెలంగాణా రైతు దయనీయ స్థితి ఇందులో ఉంది. కవి కర్షకుడు బట్టి కర్షకులు పడే రక రకాల బాధలను వస్తువుగా తీసుకొని వర్ణించగలిగినాడు. ప్రకృతి వర్ణన కూడ కావ్యంలో ఉంది. కర్షకుల దైనందిన జీవితం, ఆయా ఋతువులు, ఋతువుల్లో సాగే వసాయపు పనులు ఇందులో చిత్రింపబడినాయి.

గంగుల శాయిరెడ్డిగారు రచించిన '**వ్యవసాయకుల కష్ట నిష్ఠురములు**' అనే పద్య కవిత ***కాపుబిడ్డ*** అనే పద్యకావ్యం నుండి తీసుకోబడింది. ఇది ఈ కోవకు చెందినదే.

"సీ. జాలునీటికి రైతు జనుని హక్కేదని/ దండ్రు గలడిగెడి మొండివాండ్రు

సోదరులకుగూడ, భేదముగల్పించి/ కోర్టులెక్కించెడి కొండెగాండ్రు

కల్పిత లెక్కల, గామిచియెప్పుడు/ తిప్పలబెట్టె డిండికాండ్రు

తిన్నగాదిని గూర్చుండె; వన్నె కాండ్రు/ చిన్న పనులైన సేయని కన్నగాండ్రు

నన్ని చెద పనులను జేసే దున్న గాండ్రు/ కర్షకానీదుకష్టముల్ గాంచగలరే

సీ.జమబందిదాటులు యమమందిరమువచ్చి/ దానను రాఫలుదాపరించె

చేతిలోపలజూడ, చిల్లిగవ్వయులేదు/ కుదువనుంచెడినగల్ గూడలేవు

పన్ను రాబట్టు గాపాడిగేదెనుబట్ట నాలు పిల్లలుచాల యరచుదుండ్రు

నెద్దులబట్టియు నీడ్చుకవెళ్ళగా/ సేద్యము పనులన్ని చెట్లుబట్టు

పన్నుదప్పదు పంటలు మంటగలసె/ నందటికి గూడుగద్దలు జెందవలెను

భావికాలంబుయోజించి బాలుపట్ట/ కర్షకాలెమ్మివేగమే కనులు విప్పి"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.366)

ఓయి కర్షకా! జాలుగా పారే నీటితో సాగు చేశావన్న నెపంతో కొంతమంది తిండిపోతులు నిన్ను తిప్పలు (కష్టాలు) పెడతారు. అన్నదమ్ముల మధ్య భేదాలు సృష్టించి కొందరు కొండెగాండ్రు కోర్టుల కెక్కిస్తారు. అయీ లెక్కలెన్నోచేసి పేదలను బాధించి కొందరు తులువలు కష్టాల పాలుజేస్తారు. అల్పబుద్ధులు కొందరు ఎన్నో మోసాలు చేసి ఎప్పుడూ లంచాలు అడుగుతుంటారు. అందంగా అలంకరించుకొని (వన్నెకాండ్రలు) హాయిగా తిని కూర్చుంటారు. ఇతరులు కావచ్చు కర్షకుని పడుచు పిల్లలే కావచ్చు. కొద్దిపాటి చిన్న చిన్నపనులైనా చేయకుండా కన్నయ్యల్లా (చిన్నపిల్లాల్లా) కొందరు కూచుంటారు. కొంతమంది దున్నపోతులైతే అన్నీ చెడుపనులే చేస్తారు. ఈ తిండికాండ్రు, కొంచెగాండ్రు, తులువగాండ్రు, కొండెగాండ్రు, వన్నెకాండ్రు, కన్నగాండ్రు, దున్నగాండ్రు, వీరెవరూ కూడా నిన్ను నీ శ్రమను చూచి అయ్యో అనరు, జాలిపడరు అని ఒక రైతుపడే కష్టాలను కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. **గంగుల శాయిరెడ్డిగారు** రచించిన '**సందేశం**' అనే పద్య కవితను '**కాపుబిడ్డ,** అనే పద్య కావ్యం తీసుకొనబడింది. ఈ కవిత కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"వనలక్ష్మి పాదముల్ నెనరుతో నింద్రుండు/ కడగెనో నీరెల్ల కడలి నిండె

పాదంబులకు రుద్దు పసుపుముద్దలవోలె/ భేకంబు లందులోఁ బ్రేలుచుండె

మొగిలిరేకులకంటె జిగిమించు నఖములో/మీలయి మిలమిల మెఱయుచుండె

మీఁగాళ్ళబోలెను మెదలక నీటిపై/ కూర్మముల్ తలలెత్తి గూడుచుండె

గీ. తెల్లచీర వదలుచు మెల్లగాను/ గగనలక్ష్మి భూలక్ష్మికి కాంతి హెచ్చ

వన్యలక్ష్మి ధరించు నా పచ్చకోక/ కనులపండువు కర్షకా గాదె నీకు"

(కాపుబిడ్డ,*పుట.32*)

వనలక్ష్మి పాదాలను ఇంద్రుడు ప్రేమతో కడిగాడో అన్నట్లుగా ఒక చుక్కలేకుండా ఆకాశమంతా సముద్రాన్ని నింపివేసింది. ఆ సముద్రంలో పాదాలకు రుద్దుకొనే పసుపు ముద్దలన్న విధంగా కప్పలు బెక బెకలాడుతున్నాయి. మొగిలిరేకుల కంటే అందంలో మించిపోయినట్లుగా కనిపించే గోరులో అన్నట్లుగా చేపలు ఆ నీటిలో మిలమిల మెరుస్తున్నాయి. మోకాళ్ళవలె కనిపిస్తూ నీటిపై మెదలకుండా ఉన్న తాబేళ్లు తలలు పైకెత్తు తున్నాయి. ఆకాశలక్ష్మి తెల్లచీరను మెల్లగా పదలగా భూలక్ష్మికి కాంతి ఏకమైనట్లు కనిపిస్తున్నది. ఓ కర్షకా అటువంటి పచ్చటి చీరను వనలక్ష్మి ధరించగా ఆ దృశ్యం నయనానందకరంగా ఉంటుంది అని కవి వర్ణిస్తున్నాడు.

గంగుల శాయిరెడ్డిగారు రచించిన కవితను'**కాపుబిడ్డ**' అనే పద్య కావ్యం తీసుకొనబడింది. ఈ కవిత ఈ కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"అడవి చేమంతి పూలొడినిండ గోయుచు/తంగేడు పూ ద్రుంచు తరుణులెవరు?

గుమ్మడి ప్రత్తిపూ గునుగు పూ గోయుచు/కట్లపూవుల త్రెంపు కాంత లెవరు?

సీతమ్మ కురులను సిగచుట్టు గట్టుచు/చెవులందు పూలుంచు చెలువలెవరు?

బంతిపువ్వులు పోక బంతిగన్నేరులు/గోరంట విరులేరు కొమ్మలెవరు?

గద్ద గోరంట యలరుల గడ్డిపూల/ సందె మల్లెల దెంపుచు సకులతోడ

గూడి కంచెల నాడు పూబోడు లెవరు/కర్షకా వసదేవతల్ కారె వారు?"

(కాపు బిడ్డ,పుట.74)

పూలు త్రుంచే స్త్రీలందరు వనదేవతలుగా కనిపిస్తున్నారంటున్నారు కవి. అడవి చేమంతి పూవులు ఒడినిండుగా కోసుకొంటూ తంగేడు పువ్వులను త్రుంచుకొనే ఆ స్త్రీ లెవరు? గుమ్మడి పూలు, ప్రత్తిపూలు,గునుగుపూలు కోసుకొంటూ కట్ల పూవులను త్రెంపుతున్న ఆ మహిళలెవరు? సీతమ్మగారి వెంట్రుకలను సిగచుట్టు కట్టుకొంటూ చెవుల్లో పూలు పెట్టే ఆపూబోడులెవరు! బంతిపువ్వులు, పోకబంతులు,గన్నేరుపువ్వులు,గోరంట పుష్పాలను ఏరేటటువంటి ఆ పుణ్యస్త్రీలెవరు? గద్దగోరంట పువ్వులను, గడ్డి పువ్వులను, సందెవేళల్లో పూచే సందె మల్లెలను త్రెంపుతూ స్నేహితురాండ్రతో కలిసి, కంచెల్లో ఆటలాడుతున్న ఆ మహిళలెవరు? కర్షకా నిజానికి వారు వనదేవతలు కారుగదా అని ప్రకృతి వర్ణన చేస్తున్నాడు.

గంగుల శాయిరెడ్డిగారు రచించిన '**సందేశం**' అనే మరొక పద్య కవితను **కాపుబిడ్డ** అనే పద్య కావ్యం తీసుకొనబడింది. ఈ కవిత కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"వనలక్ష్మి కాంతిని వర్ణించి వర్ణించి/ శతకంబులనుజెప్ప వెతకుడయ్య

సైరికచర్యల చర్చించి చర్చించి/ సేయుచు శాస్త్రముల్ వ్రాయుడయ్య

కర్షక వీరుల గమనించి గమనించి/ నర్తన వర్తన నడుపుడయ్య

కాపులయాపదల్ ! గనికని వినివిని/ క్రొత్తవింతలకథల్ గూర్పుడయ్య

చట్టములు దేశభాషలో జాటుడయ్య/ పత్రికల కెల్ల వార్తల బంపుడయ్య

సభలలో సైరికులపాటు జదువుడయ్య/ సాయ మన్నివిధంబుల సేయుడయ్య"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.368)

కవులు, పండితులు, రచయితలు, బోధకులు ఎవరైనా సరే బాధ్యతగలవారు వ్రాసే, చెప్పే స్తోమత ఉన్నవారు కర్షకులకూ, సామాన్యులకు అనేక విషయాలు తెలియజేయాలని కవి సందేశమిస్తున్నారు.

వన సంపద విశేషాలను బాగా వర్ణించి శతకాలలో చెప్పడానికి ప్రయత్నించాలి. కర్షకుల పనులను బాగా చర్చించి శాస్త్రాలుగా వీరులైన కర్షకులను బాగా పరిశీలించి వారి నర్తనల్ని ప్రవర్తనల్ని అనుసరించండి. కాపుబిడ్డల కష్టాలను బాగా కవి కూర్పుచేసి వినిపించండి. దేశభాషల్లో చట్టాలను ప్రకటించండి.జరిగిన జరుగుతున్న విశేషాలన్నీ పత్రికలకు వార్తలుగా చదివి వినిపించండి. అన్ని విధాల అందరూ హాలికులకు సహాయమందించండి కవి వర్ణిస్తున్నాడు.

4.5. తెలంగాణ భావకవిత్వం– భక్తి:

పూజ్య పూజక భావమే భక్తికి మూలబీజం. 'సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా' అని నారదభక్తి సూత్రాలలో భక్తి నిర్వచింపబడింది. భగవంతుని పట్ల ఉండే అవ్యాజమైన, అహంకార రహితమైన ప్రేమతో చిత్రం భగవదధీనం కాగా భక్తుడు పరమాత్మలో లీనం కావాలని పరితపిస్తాడు. రామాయణ భారతాది గ్రంథాల్లో నవవిధ భక్తులకు లక్ష్యాలు కన్పిస్తాయి. భావ కవుల్లో భక్తి కవిత్వాన్ని వెలయించినవారు పలువురున్నారు. వీరిలో కొందరు త్రిమూర్తుల ప్రతినిధియైన జగదీశ్వరిని ఉపాసించినవారున్నారు. ఆ జగదాంబను సమీపించటానికి పంచ భూతాత్మకమైన ప్రకృతిని ఆశ్రయించారు. భావకవుల్లో అధికులు మధుర భక్తి మార్గాన్ని ఆశ్రయించారు.

"ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలో కూడ భక్తి కవిత్వం ప్రధాన స్థానమాక్రమించింది. మనం 'భక్తి' అన్నదానినే వారు (Mysticism) మిస్టినిజంగా భావించారు. భగవంతుని ప్రత్యక్షంగా చూడటానికి, అతనిలో లీనం కావడానికి భక్తుడు పొందే ఉత్కంఠను మిస్టిసిజమని చెప్పవచ్చు. కావున పాశ్చాత్యుల వాస్టిక్ కవులకు, ప్రాచ్యుల భక్త కవులకు భేదం లేదు. భావ కవులు సృష్టిలో పరమాత్మ అంశను దర్శించాడు. అంతర్ముఖత్వం ద్వారా, ఆత్మ దర్శనం ద్వారా వారి చరమలక్ష్యం సాధింపబడింది. భావ కవులు వ్రాసిన భక్తి కవిత్వాన్ని మూడు శాఖలుగా విభజించవచ్చు. ఒకటి

పారమాత్మిక కవిత్వం, రెండు మధుర భక్తి కవిత్వం, మూడు తాత్విక కవిత్వం. వీటిని అనుసరించి భక్తి కవిత్వ శాఖ భావకవిత్వంలో వచ్చింది" **(ఆధునికాంధ్ర కవితా ధోరణులు, ఎం.ఎ. మొదటిసవత్సరం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, 2011, పుట.1.11)**

ఈ సంధర్భంలో తెలంగాణలో వచ్చిన భక్తికవిత్వాన్ని పరిశీలించి, అందులో గల వస్తు వైవిధ్యాన్ని ప్రస్తావించుకుందాం.

చాగంటి భాస్కర లింగం గారు రచించిన **'విఘ్నేశ్వరా'** అనే పద్య కావ్యం భక్తి కవితా శాఖకు చెందినదే. ఇందులో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"సరసీజాసన వాసవాది సుమన స్సంఘంబు లెవ్వాని పత్

సరసీజంబుల భక్తి యుక్తులగుచున్ ధ్యానించి విఘ్నావళిన్

జెరుపన్ జాలియు కీరితిన్ గనియు వాసిన్ గాంచినారయ్య నీ

చరణాంభోజములన్ స్మరించియె కదా చర్చింప విఘ్నేశ్వరా !"

(గోలకొండ కవుల సంచిక,పుట.25)

వెనుకటి కాలంలో రాజు ఏ మతం పుచ్చుకుంటే ప్రజలు ఆ మతాన్నే పుచ్చుకునే వాళ్లు. "యథా రాజా తథా ప్రజా", రాజుకు తెలిసినదంత మనకేం తెలుస్తుంది? ఏది మంచో ఏది చెడో మనమేం ఆలోచించగలం ? రాజు మార్గాన్ని అనుసరించడం ఎందుకైనా మంచిదనుకునేది సామాన్య జనం. ఇది ప్రజాస్వామ్య కాలం. ప్రజానీకం ఎవరి వెంట ఉంటారో అతడే దేశాధినేత. ఎక్కడా జనం లెక్కే ఎక్కువ మంది ఎవరి వెంట పడుతున్నారో చూస్తామంతే. దేవతలను అనుసరించేప్పుడూ అంతే జరుగుతుందేమో.నాయకులు జనాకర్షక పద్ధతుల ననుసరించినట్లే ఈ రోజుల్లో స్వాములు కూడ ఈ పద్ధతుల ననుసరించినట్లే కన్పిస్తున్నారు. ఎవరైనా ప్రజాస్వామ్య పద్ధతుల ననుసరించ వలసిందే. ఈ కాలంలోని దేవతల కైనా ఇది తప్పదు.

కవి ఇందులో దేవుళ్ళను ఏ విధంగా మొక్కుతున్నాడో ఆ విషయాలను వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. ఏమనీ అంటే ' బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన దేవతలు నీకు మొక్కి తమతమ విఘ్నాలను తొలగించుకొన్నారు. కీర్తిని పొందినారు కదా అని, తన సంగతి ఏమిటో ఈ కవి చెప్పుకోలేదు. ఆయా దేవతలు మొక్కిన విషయం ఈ భక్తునికి ఎందుకు వాళ్లు మొక్కకపోతే ఈ కవి మొక్కడా ? మనం మొక్కదలచుకున్న దేవుడు సామాన్యులు కాదు సుమా బ్రహ్మాదులే మొక్కుతుంటారు ఈ దేవునికి అని చెప్పుకోకపోతే ఆ దేవున పట్ల తనకు భక్తి కుదురదా ? దేవుని హృదయానికి తన హృదయం తాకించటము అనేది లేనే లేదు ఇక్కడ. అయినా ఎవరి దృష్టి వారిది అని' కవి చెప్తున్నాడు.

కొండపల్లి రామచంద్రరావు *గారు* రచించిన '**చవితి గణపతి**' అనే పద్య కావ్యం ఈ కోవలోకే వస్తది. ఈ సంధర్భంలో దీనిని ప్రస్తావించుకుందాం. ఇందులో స్వామిని స్తుతిస్తూ కొన్ని పద్య కవితలు రాసినాడు.

"మ. తనపైఁబడ్డ వృథాపవాదమున కాత్మం గుందుచు తన్ని వా

రణకై కష్టము లోర్చియం బిదప సత్రాజిత్సుతక్ సన్మణిం

గొని కీర్త్యుజ్వలు డౌచు దంగోలుచు నా గోపాలు భవ్యాత్ముగా

నొనరం జేసిన విఘ్ను రాజు కృతి బ్రత్యూహంబు పోకా ర్చుతన్.

మ. నిను విఘ్నాధిపు మున్ను గొల్చి పిదప దేవావళిం బూజ సే

యును లోకావళి సర్వకార్యముల విధ్యుక్తంబుగా, "మొట్టు దే

వుని గా కెవ్వఁడు పెట్టు దేవరను దాఁ బూజించు" నవ్మాట యిం

దు నిజం బై చెలువారిగా, సుదవబంధూ! దేవ! విఘ్నేశ్వరా!.

ఉ. ముజ్జగముల్ రచించు ఫలముల్ పలు బప్పులు మోదకంబులున్

బొజ్జను నింపుకొన్న నిను మూషక మొక్కడు మోయు టెట్లొ వి

ద్విజ్జన వంద్య? యౌఁగద ! భవత్కృపఁ గల్గినఁ జాలు గాని పెన్

రజ్జువు చేత నీడ్వబడు రమ్య కులావని భృచ్ఛయంబులున్".

(గోలకొండ కవుల సంచిక,పుట.68)

కవి వినాయక చవితి రోజు చంద్రుణ్ణి చూస్తే దోషం కలుగుతుందన్న విషయాలను కవి వస్తువుగా తీసుకున్నాడు. తన మీద వచ్చిన అపవాదాన్ని తొలగించుకోవటానికి కృష్ణుడు ఇబ్బంది పడి తరువాత సత్యభామను శమంతకమణిని పొందిన కథను ఒక పద్యంగా రాసినాడు. చవితి నాటి చంద్రుణ్ణి చూస్తే అపనిందలు వస్తాయంటారు. ఆ దోష నివారణార్థం కృష్ణుని ఆ కథను పారాయణం చేయాలంటారు.

గణపతి వాహనం ఎలుక. అంత బొజ్జ గణపతి గారిని ఈ ఎలుక గారు ఎట్లా మోస్తారు? అని సందేహం. నిజమే. శివుని వాహనం నందీశ్వరుడు. బాగానే ఉంది. స్వామిని వీరు మోయగలరు. గరుత్మంతుడు గారు కూడ విష్ణుమూర్తిని మోయగలిగిన గొప్ప శరీరం కలిగినవారే. కాని ఇక్కడ మోసేవారి సైజు వేలెడంత. వీరిని అధిరోహించే ఆ దేవుడి గారి సైజు ఏనుగంత. ఈయన ఎక్కటం ఎలా అని ఆయన మోయటం ఎట్లా అని ఈ సందేహం ఎవరికైనా వస్తుంది కదా. ఈ కవి ఆ ప్రశ్న వేసికొని సమాధానం చెప్పినాడు. ఆ గణపతి కరుణ ఉండటం వల్లనే ఆ ఎలుక గారు మోయగలుగుతున్నారు. అని.మోయట మొక్కటే కాదు గదా పని? పరుగెత్తాలి. పరుగెత్తక పోతే వాహన మెట్లా? అని కవి ప్రశ్న వేసుకొని సమాధానం చెప్పినాడు.

భాగవతము సీతారామశర్మ గారు రచించిన **రాజ రాజేశ్వరీ'** అనే పద్య ఖండిక భక్తి కవిత శాఖకు చెందినదే. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"మ. జననీ త్రాహి యటంచుఁ దావక పదాబ్జాతంబులన్ భక్తియున్

వినయం బుట్టిపడంగ మ్రొక్కు నెడ సంప్రేమంబుగా గ్రుచ్చి యె

త్తి నయం బొప్పగ వీపు దట్టి ఘన కీర్తింగాంచుమీ యన్న నీ

ఘన రూపంబును నెప్డు చూపెదవొ దుర్గా ! రాజ రాజేశ్వరీ

మ. పరిహాసంబు లొనర్స నీసభల విద్వద్వర్యులీతండు దు

శ్చరితుండంచువచించనీ కవులుభాషాజ్ఞానహీనుండటం

చు రహింబల్కిన జంక నిన్ బొగడ సంస్తుతంబుగా వాక్కునన్

గరమింపారగ నిల్చిబ్రోవగదెదుర్గా రాజరాజేశ్వరీ.

మ. పతిభావంబు నెఱింగిసంతతము లోపంబింత లేకుండ స

స్మృతిచేసేవనమాచరించుసతికిన్ మాన్యంబుచేకూరు సం

తతియుంగీర్తియు శోభనంబుగలుగున్ ధర్మంబువర్ధిల్లు నీ

గతి వర్తించెడు కాంత ధన్య యగు దుర్గా రాజరాజేశ్వరీ."

(గోలకొండ కవుల సంచిక, పుట. 52)

ఇందులో కవి తల్లి ప్రేమను అనగా శైశవ ప్రేమను కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు.కవికి కావలసింది కీర్తి. నాకు కీర్తి వచ్చేటట్టు చేయమని కోరవచ్చు కదా సూటిగా. 'ఘనకీర్తి' పొందుమని ఆ దేవత అనవలెనట. అది తన వీపు తట్టి. తానేమో తల్లి పాదాలకు మ్రొక్కుతాడట. అప్పుడు ఆ దేవత ఏమనాలో ఇతడు చెపుతున్నాడు. సరే, ఏవిధంగా అనాలో ఇతడొక సినిమా డైరెక్టర్లాగా ఆదేశిస్తున్నాడు. మొక్కిన తనను గ్రుచ్చి ఎత్తాలట. అదీ ప్రేమతో నట. కవి అయినవాడు దేవత చేయవలసిన పనిని తానే ఆదేశింపవచ్చునేమో. ఇంత శక్తి ఉన్నవాడు ఆ దేవతకు ఎందుకు మొక్కాలో తెలియదు. మొక్కకుండా ఆ కీర్తిని ఇమ్మనవచ్చు కదా. పైగా తనకు భక్తి ఉందంటున్నాడు. వినయము ఉన్నది అంటున్నాడు. ఇన్ని తనకు ఉన్నాయని చెప్పుకోవటము ఎందుకు? అవి చేతల్లో కనిపించాలి కాని. మాటల్లోని భక్తి చేతల్లో కనిపించదు. అమ్మా నీకు నమస్కరిస్తున్నాను. నీ వాణ్ణి, నీ దయ, నీ ఇష్టం అంటే సరిపోదా ? ఎవరి భక్తి వారిది. మనకెందుకులే

ఆ పోయిన వాళ్ల గొడవ. ఇంతకూ ఈ పద్యంలో కన్పించేది శైశవ ప్రేమ. ఆ పార్వతి తల్లి; తాను బిడ్డ. 'కొడుకును కన్న తల్లి కదా తల్లి తల్లే,జగాలకు తల్లి, జగజ్జనని'అని పార్వతి దేవిని ఈ విధముగా వర్ణిస్తున్నాడు.

శ్రీ చంద్రమౌళి గారు రచించిన **'శ్రీ అర్ధనారీశ్వరస్తవము** 'అనే భక్తి పరమైన పద్య కావ్యం ఈ కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"శా. శ్రీవిశ్వేశ్వర చంద్రమాళిధర కాశీ వాససర్వేశ మం

త్రావిర్భావప్రసన్న రూపధనదార్త త్రాణపారీణబు

ద్ధి విద్యాది కవిత్వ సత్పటిమహృ ద్ధీరత్వమైశ్వర్యముం

దేవబ్రాహ్మణభక్తి ముక్తులిడు దేవాయర్ధనారీశ్వరా.

మ.వరకై లాసనివాసయీశ త్రిజగద్ వంద్యావిరాద్రూపహృ

త్సర సీజాంతరవాసభక్త వరదా సర్వేశత్రై నేత్రశం

కరమృత్యుంజయ కృత్తి వాసహిమవత్ కన్యాప్రియాయంచునే

నొరిగల్ జేసిస్తుతింతు నెప్డు సుమనోన్మోదార్ధనారీశ్వరా

మ.బతిమాలన్ బని లేదు భూ విభుల, నిం బ్రార్థించినం జాలు స

మ్మతితో శ్రీల నొసంగి ప్రోచెదవు సు మ్మా సర్వ జీవాళులన్

పతివై రక్షణ సేయు దేవరవు, త్వత్పాదంబు లర్చింతు దు

స్థితి బాపంగదె తండ్రి దైవమ కృపాబ్ధి యర్ధనారీశ్వరా !"

(గోలకొండ కవుల సంచిక,పుట.80)

ఇందులో కవి పార్వతీ దేవితో సగమై ఉన్న శంకరుణ్ణి వర్ణనను కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు.ఈ భక్తి కావ్యంలో ఉన్న 'శ్రీ అర్ధనారీశ్వరస్తవము' లోను 'అర్ధనారీశ్వర' అన్నది సంబోధన. సంభోదన వరకే తప్ప అర్ధనారీశ్వర తత్త్వం ఇందులో ఉన్నట్టు కన్పించదు. ఉన్న సంబోధనలు శివునికి సంబంధించినవే. శ్రీ విశ్వేశ్వర, చంద్రమౌళిధర, కాశీవాస, సర్వేశ, వరకైలాస నివాస, ఈశ, త్రైనేత్ర, శంకర, మృత్యుంజయ, కృత్తివాస ఇవి పద్యాల్లో కనిపించే సంబోధనలు. తన కావ్యంలో తనకు సంపదలు ఇవ్వమని,దుస్థితిని తొలగించుమని ప్రాతిస్తున్నాడు కవి.

గుండ్ల రాజమౌళి గారు రచించిన '**సాంబమూర్తి స్తవము**' అనే భక్తి పద్య కవుత ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంలో ఈ భక్తి కవిత ప్రస్తావించదగినదే.

"ఉన్న దనరాదు లే దను కొన్నబోదు/పట్టుకొనరా దదెపు డెడబాసిపోదు

ఇట్టిదౌ మాయలేని నీ గట్టి పాదు /సచ్చిదానంద గురుమూర్తి సాంబమూర్తి !

బ్రహ్మ విష్ణు మహేశ్వర బల మనంగ/త్రిగుణ మాయావశిష్టమై తేజరిల్లు

దానిపై నుండు చోట నీ స్థాన మయ్య/ సచ్చిదానంద గురుమూర్తి సాంబమూర్తి!

ఈశ్వరా నిన్ను నెడబాసి యెంత కాల/ మేగెనో దేవ ! యిక ముందు నెంత కాల

మునకు నిను జేరుదునో తెల్పు ముదము తోడ /సచ్చిదానంద గురుమూర్తి సాంబమూర్తి!"

(గోలకొండ కవుల సంచిక, పుట. 33)

కవి అంటున్నాడు 'నిన్ను విడిచి వచ్చి చాలా కాల మయింది. నిన్ను చేరుకొనేది ఎప్పుడో కదా' అంటున్నాడు. అంటే భగవంతుణ్ణి చేరుకోవాలని ఆరాట పడే కవి మదన బాదను వస్తువుగా తీసుకొని చెప్తున్నాడు. అంటే ఐహిక వాంఛలేం తనకున్నట్లు చెప్పటం లేదు కానీ తను త్రిమూర్తులయిన బ్రహ్మ,విష్ణు ,మహేశ్వరులను విడిచిపెట్టి చాలా కాలం అయింది. మల్ల చేరుకునేది ఎప్పుడు అని కవి అంటున్నాడు.

తెలంగాణ భావకవిత్వంలో ఎక్కువగా వైష్ణవానికి సంబంధించిన కవితలు ఉన్నాయి అందులో ప్రధానంగా రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వరుడు, ఈ దేవతాస్తుతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. మరికొన్ని భక్తికవిత్వంలోని వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

ముదల్ ఘర నరహరిరావు గారు రచించిన '**శ్రీహరీ**' అనే భక్తి కావ్యం ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే. ఇందులో గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"ఉ. శ్రీవనిత ప్రకోష్టయుగ శింజిత కంకణ ఘట్టి తాఘ్ను రా

జీవ విరాజితార్క భవ సీమ, పయోనిధి భోగ, భోగిభో

గా విరతస్ఫుర న్మణి సహస్ర వికస్వర దేహ, దేవసం

భావిత సచ్చరిత్ర, సత భక్త హృదబ్జ పవిత్ర శ్రీహరీ

చ. సరస గుణాభిరామ నయజాల, యశోజిత సోమ, సోమ శే

ఖర నుత భవ్యనామ, రిపుగర్వ విరామ, భవౌఘభీమ, భా

స్కర శతకోటి ధామ, నత సర్వసుర ప్రజ సార్వభౌమ, దృ

గ్వర కృత సూర్య సోమ, త్రిజగన్నుత దైవలలామ శ్రీహరీ!"

(గోలకొండ కవుల సంచిక,పుట.26)

ఇందులో కవి గుణాలను వరుసగా పేర్చుకుంటు పోయినాడు. తనకేం చేయాలో తోచటం లేదు, నీవే రక్షించుమని తన బాధలు ఏ విధంగా వినిపిస్తున్నాడోరచయిత వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు శ్రీ హరి నీకు శతకోటి నమస్కారాలు,నాకు ఎం చేయాలో తోచడం లేదు. నాకు కొంచెం ధైర్యం ఇచ్చి నా బాదల నుండి నన్ను రక్షించు అని వేడుకుంటున్నాడు.

ఆవుల పురుషోత్తమదాసు గారు రచించిన '**మాధవనుతి**' అనే భక్తి కావ్యం ఈ శాఖకు చెందినది. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"ఉ .ఆయువు చూడ స్వల్ప, మడియాసలు మెండు, మనోవికారముల్

పాయకయుండు, సంతతము బాధల గూర్చుచునుండు రుగ్మతల్

ప్రాయము సర్వమున్ గలుషమై భాజనమై గనుపట్టుచుండు, నా

కేయది రక్షణంబు పరమేశ్వర! దెల్పగదే రమాధవా !"

(గోలకొండ కవుల సంచిక,పుట.20)

ఈ ఖండికలో కవి తన బాదలను వస్తువుగా తీసుకొని భగవంతునికి విన్నవించుకుంటున్నాడు.

మాటేటి వరవరరా గారు రచించిన **'గోపాల చూడామణీ'** అనే పద్య కావ్యం ఈ కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

"జీవిన్ జీవియె పొట్టకూటికయి భక్షింపంగ సృష్టించి యా

జీవిన్ బ్రహ్మ నిజాంశ మంటకుఁ దగన్ చిత్రించి, కర్మంబునన్

జేవన్ జీవినిఁ జిక్కఁ జేసి తుది రక్షింపంగ నీ వంచహో

గోవిందా ! వినజెప్పినావు భళిరా ! గోపాల చూడామణి !"

(గోలకొండ కవుల సంచిక,పుట.21)

ఇందులో కవి భగవంతుడు జీవులను రక్షించే విధమును వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. జీవిని కర్మబంధుని కావించి చివరకు నీవే రక్షిస్తున్నావు అని, ఇదంతా ఏదో మాయగా ఉందన్నట్టు చెప్తున్నాడు.

కవి ఘంటంబట్ల వేంకట భుజంగ గారు రచించిన **'కృష్ణ వినతి'** అనే భక్తి కావ్యం ఈ కోవకు చెందినదే. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"సీ.చనుబాలొసంగ వచ్చిన పూతనను గాంచి దుష్టురాలిది యని త్రుంచినావు

గార్దభాసుర ముఖ్య కఠిన రక్షో రాజిఁ దెంపుమై జము ప్రోలి కంపినావు

కార్చిచ్చు దిక్కుల గ్రమ్మ గోపగణంబు మేలుకై దావాగ్ని మ్రింగినావు

సంతసంబున గోప కాంతామణుల వల పించి పల్మారు భోగించినావు

గీ. నిఖిల లోకైక విభుడన నెగడినావు/ సంశ్రితావళి గరమర్ది సాకినావు

సరస గుణధామ యదుకుల సార్వభౌమ/నన్ను గాపాడరావె యో చిన్ని కృష్ణ"

(గోలకొండ కవుల సంచిక,పుట.55)

పై పద్య కవితలో కృష్ణుడు చేసే చిలిపి పనులను వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు.ఏ విధంగా అంటే కృష్ణుడు చేసే చిలిపి పనులన్నీటినీ చెప్తూ,ఆ పనులన్నీటికి నేనే బాధ్యున్ని నన్ను రక్షించు అని కృష్ణ వినతి చేస్తున్నాడు.

శిలిగం జగన్నాధం గారు రచించన '*నీరజాక్షి'* అనే పద్య కవిత భక్తి శాఖలో ఒకటి. దీనిని ఈ సంధర్భంలో ప్రస్తావించదగిందే. ఇందులో గల వస్తువును చూద్దాం.

"గీ. పుండరీకంబు నా క్రిష్ణ పుండరీక/ మయ్యె,శరము శరంబయ్యె,నా శుగంబు నాశుగంబయ్యె, బన్తియు నయ్యె బర్తి, /నీ వియోగంబుచేత నో నీరజాక్ష

గీ. నీ వియోగంబు భరియింప నేర కేరు/ మదన తాపంబు తోడను మ్రగ్గు చుంటి

జంద్రికల వెదఁ జల్లెకు చంద్రు బోలు/ నీదు వదనంబుఁ జూపు మో నీరజాక్ష

గీ.అంచితంబగు నీ యధరామృతంబు/ తవిలి పానము సేయంగఁ దలపు గలదు

ఆశ్రితాభిష్ట సంధాత ! యమృత మొలుకు/నీ యధర మానగా నిమ్ము నీరజాక్ష

గీ.విశ్వ మోహనమైన నీ వేణుగాన/మాధురిం గ్రోలి తడవాయె, మరల నొక్క

సారి నీ మోవిఁ గ్రోవిని సరగ జేర్చి/ నీవు గానము సేయుమో నీరజాక్ష !"

(గోల్కొండ కవుల సంచిక,పుట.29)

ఇందులో కవి గోపికకు కృష్ణుని పట్ల ఉన్న విరహాన్ని వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు.భక్తుడు తనను గోపికగా కృష్ణుణ్ణి నాయకుడిగా భావించి సాగించే భక్తిని మధురభక్తి అంటున్నారు. కృష్ణుడు ఆ కాలంలో అట్లా గొప్ప పేరు తెచ్చుకున్నాడు. ఈ కాలంలో కవుల రచనల ద్వారా ఇట్లా పేరు తెచ్చుకొంటున్నారు. కృష్ణుణ్ణి ఆశ్రయించి తెలుగులో వచ్చిన సాహిత్యం ఇంతా అంతా కాదు. ఒక్క కవిత్వంలోనే కాదు. నాట్య కళారంగంలో, గానకళా రంగంలో కూడ తానే కొలువు తీరి ఉన్నాడు. ఈ మహానుభావుడేం సామాన్యుడా...

ఆడినాడాయె, పాడినాడాయె, అందులో ఆడవారిని కూడి. ఇంతకాలం గడచిపోయినా ఆ కృష్ణుని గారి 'గ్లామర్' తగ్గటం లేదు. ఆయన పట్ల ప్రేమ చెక్కుచెదరటం లేదు. ప్రేమకు ప్రేమ, భక్తికి భక్తి. వారి మీద రెంటికి రెండున్నాయి. పాపం, మన రామచంద్ర ప్రభువు మీద ఒక భక్తి మాత్రమే. ఈయన గారి చేతిలో కోదండముంటే కలిగేది భయమే కదా. ఆ కృష్ణుని దగ్గర వేణువుంది. చక్రం కూడా ఉంది. అందుకే ప్రేమ, భక్తి రెండు అని కవి చెప్తున్నాడు.

కేశవపట్నం నరసయ్యగారు రచించిన **'జీడికంటి రామ'** అనే పద్య కావ్యం ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంలో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.ఈ కవితలో చిన్న చిన్న ఉర్దూ పదాలు మనకు కనిపిస్తాయి.

"సీ.నాక లోకము నీకు ఠీకు దివాన్ ఖాన

నిగమ పదార్థంబు నీ ఖజాన

యెన్న శక్యము గాదు రన్న నీ కార్ఖాన

నిత్యంబు హెచ్చురా నీ ఘరాన

సనకాది మునుల కొసంగితా రోజీన

యెఱుగలే డింత ని న్నీ దినాన

యిచ్ఛతో నన్ను నీ కిచ్చితి నజరాన

పడద్రోయ కయ్య నన్ బందిఖాన

గీ.నైజవిభవంపుఁ బుట్టిల్లు నీ జనాన

ప్రష్టతమ కిచ్చుఁ దగు హిసా షాదియాన

సిరుల కిరవైన జుంటి శ్రీ జీడికంటి

ధామ సుగుణాభిరామ శ్రీరామ రామ."

(గోలకొండ కవుల సంచిక,పుట.34)

పై పద్య కవితలో శ్రీ వేంకటేశ్వరుని మహిమలను కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు . ఈ దేశంలో మహా మహా ధనవంతుడైన దేవుడు వేంకటేశ్వర స్వామియే. స్వామి ప్రభావము ఎంతటిదో దిన దినం కొండకు పోయే భక్తుల సంఖ్యను బట్టి తెలుస్తుంది అని స్వామి గూర్చి వర్ణిస్తున్నాడు. ఈ కవితలో చిన్న చిన్న ఉర్దూ పదాలు కూడా మనకు కనిపిస్తాయి.

వేంకటగిరి రామాచార్యులుగారు రచించిన '**వేంకటేశ్వర స్తవము**' పేరిట రాసిన ఒక భక్తి కవిత్వం. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"నిరవధి కానంద నిలయంబు నీ ప్రాపు

నిగమాంతముల కేపు నీదు చూపు

జగము లన్నియు నిండు సొగసైన నీ రూపు

సాటిలే దెందు నీ మాట తీపు

నీపద స్మరణంబు నిరయంబు నెడబాపు

దయతోడ నాకు నీ దాపు చూపు

కడలి కవ్వపుఁ గొండఁ గడతేర్చె నీ వీపు

భేదించు కుజనుల నీదు తూపు

పాపరాయడు నీకు రే బవలు కాపు

పరము నీ కీర్తనము మోక్ష పదముఁ జేపు

సరస గుణజాల వేంకట శైల ఖేల

భక్త జన గోపాల భర్మ చేల".

పై కవితలో శ్రీమన్నారాయణుడిని వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. ఆ శ్రీమన్నారాయణుడే ఈ వేంకటేశ్వర స్వామిగా అవతరించినాడు. కవి అంటున్నాడు నీ పద స్మరణంబు ఎప్పుడు విడనాడను అని చెప్తున్నాడు.ఇంకా అనేక మున్నాయి భక్తి స్తోత్రాలు. ఇవి ప్రత్యేకంగా పరిశీలించదగినవిగా ఉన్నాయి. 1934 ప్రాంతంలో ప్రజలు ఏయే దేవతలను కొలుస్తుండేవారో తెలుస్తుంది. దేవతలు మరికొందరు కొత్తగా, వెలుగు చూస్తున్నారని కాదు, వెలుగు చూపిస్తున్నారు. నమ్మినవారికి. కాలం గడుస్తున్నా కొద్ది కొత్త కొత్త దేవతలు ప్రజల చేత పూజింపబడు తున్నారు.

నన్నయ భారతావతారిక, విజయ విలాస కర్త ఆ కావ్యంలో రాసిన అవతారిక. నన్నయ స్మరించిన దేవతలను, చేమకూర వేంకట కవి పేర్కొన్న దేవతలను చూచి నట్లయితే దేవతల సంఖ్య ఆరువందల సంవత్సరాల మధ్యకాలంలో తగినంత పెరిగినట్లు గమనిస్తాము.ఇది ఆయా కాలాల్లోని మత పరిస్థితులకు ఒక నిదర్శనం. ఈ గోలకొండ కవుల సంచికలోని భక్తి స్తోత్రాలు, ఆ కాలంనాటి మత పరిస్థితులను తెలిసికోవటానికి ఒక ఆధారం.

శ్రీమతి బి. లక్ష్మీనరసమ్మగారు రచించిన ఖండిక పేరు **'భక్త వత్సలా'** ఈ ఖండిక కూడా భక్తి కవిత్వం శాఖలోకి వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం. రచయిత్రి ఇందులో దేవుడు రాముడడిని వస్తువుగా తీసుకొని స్తుతిస్తుంది. ఏమని అంటే–

"స్వామి ! జగత్పతే హృదయ శాంతి నొసంగి త్వదీయమౌ పరం

ధామము జేర్చుకొమ్ము, భవతారక నామ, యనంత మూర్తి, స

త్ప్రేమ సుధానిధీ ! పతిత దీన జనావన భక్త వత్సలా !"

(గోల్కొండ కవుల సంచిక,పుట.51)

భగవంతుణ్ణి తండ్రిగా, తనను కూతురుగా చెప్పి తన చిక్కులను తొలగించుమని వేడుకొంటుంది ఈ కవయిత్రి. ఆత్మ శాంతిని ఇచ్చి పరంధామాన్ని చేర్చుకొమ్మన్న ఈమె ప్రార్ధనలో లౌకికమైన విషయాలు చెప్పుకోవటం కన్పించదు. 'శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదను'అన్నట్లే ఉంది.

ఈ పద్యాల్లో కవయిత్రి చేసిన భావన ప్రత్యేకంగా ఏమీ కన్పించదు. భగవంతుని గుణ గణాలను పేర్చి చెప్పటమే ఎక్కువ. నాల్గింటిలో ఒక పాదంలోనే వినతి కన్పిస్తుంది. అన్ని పద్యాలు ఇంచు మించు ఇంతే. ఇంకో పద్యాన్ని పరిశీలించి చూస్తే–

"ఉ.శ్రీకర, దీన బంధు, సరసీరుహలోచన, భక్త లోక ప్రే

మాకర, నీ పదాబ్జముల ధ్యానము నా మదికిమ్ము సర్వ లో

కైక గురూ ! కృపాకర, నిరీహ నిరామయ నిష్ప్రపంచ మో

క్షాకర, సర్వ దుఃఖహరణా, కరుణామయ, భక్తవత్సలా!"

ఇందులో 'నీ పదాబ్జము ధ్యానము నా మది కొమ్ము' అన్నది ఒక్కటే విషయం. చివరి పద్యంలో మాత్రం కవయిత్రి భావముంది. ఇందులో 'భక్త వత్సలా' అన్న మకుటాన్ని వదిలితే, 'రామ' అన్న ఒక్క సంబోధన మాత్రమే ఉంది.

"ఉ.ఎమ్మె లవేల రామ ! భవదీయ పదాంబుజ సేవ గోరు న

న్ని మ్మొయి చిక్కులం గలచ నెవ్వరి వేడుదు, నెందుబోదు నో

యమ్మకచెల్ల ! యిట్లు తన యాత్మజ నేనియు గావలేని వా

రిమ్మహి నుందురే, కృపవహింప వదేటికి భకవత్సలా".

ఇందులో సాక్షాత్కరించిన భగవంతుణ్ణి భక్తి నిండిన హృదయంతో ప్రార్థించినట్లు ఉంది.కవయిత్రి భక్తి హృదయం ఏ విధంగా ఉందో పై పద్యంలో తెలుస్తుంది. 'భక్త వత్సలా' పేరుతో రాసిన ఈ ఖండిక ఆమెలో భక్తి భావం ఈ విధంగా ఉందో చెప్తుంది.

శ్రీ రాణీ వేంకట లక్ష్మాయమ్మ సర్ దేశాయి రాసిన కవిత పేరు **'మానస బోధ'** ఈ ఖండిక భక్తి కవిత్వ శాఖ పరిధిలోకి వస్తుంది.

"గీ.అంగమా యిది కడు క్షణ భంగురంబు/సంప దది యెన్న మిగుల చంచలము గాంచc

గాలుడు సమీపవర్తియై కాచుచుండు/హరిని ధ్యానించు మానంద మబ్బు మనస !

గీ.బాహ్య శత్రు జయంబునc బ్రాభవంబు/ గలుగ దెప్పుడు జగతి నిక్కంబు సుమ్మి

యెదుగు కామాది షడ్వర్గ మదిమి, భక్తి/ హరిని భజియించు, మానంద మబ్బు మనస !

గీ.సారమును లేని సంసార సాగరమున/మునిగి పుట్టుచు గిట్టుచు మోహమంది

దరిని గానవు నీబాట నెరుగ లేవు/ హరిని ధ్యానించు మానంద మబ్బు మనసా!"

గీ.బలవదింద్రియ నిగ్రహ పరతగల్గి/వీతరాగాత్మయుతమవై వెలసి రంభ

వృత్తి బోనాడి విమల సద్వృత్తి చేత/హరిని భజియించు మానంద మబ్బు మనస !"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.113)

పై ఖండికలో కవయిత్రి ఈ విధంగా చెప్తుంది. శరీరం శాశ్వతం కాదు, సంపదలూ కాదు. 'కాలుడు సమీపవర్తియై కాచుచుండు'నట ఎంత బాగా చెప్పిందో కదా, గొర్రెలను మేకలను కాచే వారిని చూసి ఉంటావు. ఏ వైపు నుండి ఏ ప్రమాదం రాకుండా గొర్రెలను కాపాడుతుంటాడు. తోడేలు

వంటివి వస్తే వాటిని తరుమటానికి ఒక కుక్కను పెంచుతుంటాడు. పసి పిల్లలను వలెనే వాటిని కాపాడుతుంటాడు. ఇట్లా కాపాడే వాడే ఆ గొర్రెలను కోసి తింటాడు. కోతకు అమ్ముతాడు. తాను చంపటం కోసమే వాటిని కాపాడే గొర్రెల కాపరి వంటి వాడే ఈ కాలుడట. యముడు సమీపంలోనే తిరుగుతుంటాడు. కాచుతుంటాడు. కాచుకొని ఉంటాడు. ఈ సంగతి తెలిసి, ఓ మనసా 'హరిని ధ్యానిస్తుండు' నీకు అసలైన ఆనందం కలుగుతుంది అని అంటుంది ఈ కవయిత్రి.

ఇంకా ఈ విధంగా అంటుంది.ఈ పంచేంద్రియాలు ఉన్నాయే వీటిని గెలువటం వల్ల కాదు. ఇవి చెప్పినట్టు మనిషి వినవలసిందే. వీటితో పెట్టుకున్నామనుకో. మనం ఓడటం ఖాయం. అవి అంత బలమైనవి. వాటిని గెలువలేం కాని, నిగ్రహించవచ్చు. ఈ పని చేయుమంటుంది కవయిత్రి. కపట వృత్తి వద్దు. సద్వృత్తితో మెలగమంటుంది. ఇది ప్రయత్నిస్తే సాధ్యం కాకపోవచ్చు.ఎందుకైనా మంచిది, హరిని భజించుమంటుంది. ఆనందం కలుగుతుంది అని అంటుంది. ఈ విధంగా తన మనసుకు తాను చెప్పుకుంటుంది. మనసుకు చేసే బోధ 'మానస బోధ'. ఇందులో రచన సరళంగా , విషయం సుబోధకంగా ఉంది.

జ్ఞానమాంబగారు రాసిన పద్య కవిత పేరు **'సూర్యనారాయణ స్తోత్రము'** ఇది భక్తి కవిత్వ శాఖ కోవలోకే వస్తుంది. దీనిని ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"శా.స్వామీ ! నీ పద పంకజ ద్వయమె సంభావించి సేవింతు, నీ

నామం బొక్కడు దక్క నే యితరమౌ నామంబు నా బుద్ధిలో

బ్రేమింపన్ వినవొల్ల, బల్క దలపన్, వీక్షింతు నీ రూపము

ద్దామావ్యాజకృపన్ ననున్ దనుపు నాథా! సూర్యనారాయణా !

మ.హృదయేశుండ వుపాస్యదేవుతవు నీవే కాని వేరేమి లే

దిది నిక్కంబు మదీయమానసము నీకే యర్పణంబయ్యె నా

యెదలో దప్ప మరేడ దాచేదను నే నేయ ర్థ మక గాని త్వ

త్పద పంకేజములే శరణ్యమగు నాథా సూర్యనారాయణా

శా.నాకుం దావక దర్శనంబె సుదినానందంబు జేకూర్చు నీ

వే కన్పట్టక యున్న దుర్దిన మగున్, వేదంబులున్ శాస్త్రముల్

నీకున్ మ్రొక్కుటయే విశేష మనియెన్, నిన్నెంతు, నిన్గల్తు, మ

లోకాప్తుండవు నీవ, నీ కొలువె చాలున్ సూర్యనారాయణా.....”

(గోల్కొండ కవుల సంచిక,పుట.46)

పై పద్య ఖండికలో రచయిత్రి చనిపోయిన తన భర్తను వస్తువుగా తీసుకొని వర్ణిస్తుంది.‘నా భర్త పేరు సూర్యనారాయణుడు అగుట చేతను, నా యుపాస్య దేవత సూర్యనారాయణుడు అగుట చేతను వీరి యందు నాకు గల ప్రేమ చేతను ‘ద్వ్యర్థి’గా సూర్యనారాయణా అనే మకుటముచే రాసితిని.

నిన్ను పద్యాలతో పాటలతో కృతులతో నిజమైన భక్తితో వినుతి చేస్తాను. మానినినైన నన్ను నీ కరములతో నీ హృద్వీధిని చేర్చుకొని దయతో చూచి పోషించు. నా తనువు ప్రాణం నీకే అర్పితము చేస్తాను అని అంటుంది. ఎవరైనా సరే దేవుణ్ణి కొలిచేది ప్రతిఫలము ఆశించే. ‘నిన్ను నుతిస్తా , నన్ను పోషించుము అని అంటుంది ఈ భక్తురాలు, ‘చూచి పోషింపుము’అన్న పదాలు విను. చూచేవాడు సూర్యుడు,వెలుగిచ్చేవాడు అలాగే పోషించేవాడు సూర్యనారాయణ నామధేయుడైన భర్త.

ఇంకా అంటుంది ‘హృదయేశుడు’ భర్త. ఉపాస్య దేవత సూర్యుడు. సూర్యనారాయణ స్వామి పేరే భర్త పేరు కావటం వల్ల ఏ పదం ఎవరికి మార్చుకున్నా నష్టం లేదు.

నిన్ను జూస్తేనే నా కళ్ల చీకట్లు పోయి ‘శుభౌన్నత్యంబగు దారి’ తోస్తుందని అంటుంది. ‘దారి’కి కవయిత్రి వేసిన విశేషణం చూస్తే శుభ్రము, ఔన్నత్యము. రెండు. శుభ్రమంటే తెలుపు కదా, సూర్యుని ప్రకాశం తెల్లనిది. ఈ శుభ్రం సూర్యునికి. ఔన్నత్యం భర్త కోసం వాడిన విశేషణం. చివరి పద్యంలో ఇంకా ఇలా అంటుంది. మబ్బు వట్టి పొద్దు కన్పించకపోతే, ‘దుర్దిన’ మంటారు. తన భర్త తన కళ్ల

ముందు లేకపోతే తనకు అంతేనట. భర్తకు, ఉపాస్య దైవాన్ని కలిపి చెప్పిన ఈ విధానం ఒక ప్రత్యేకంగా ఉంది. 'పతియే ప్రత్యక్ష దైవము'అన్న భావాన్ని కవయిత్రి ఇట్లా కవిత్వీకరించినట్లు ఉంది.

4.6. తెలంగాణ భావకవిత్వం–దేశభక్తి:

విశ్వనాథవారు అన్నట్లు ఒక మహాఉద్యమం జాతీ మొత్తంమీద సకల జనుల గుండెల్లో మండే జ్వాలాస్వరూపం,ఆ జ్వాల ఒకప్పుడు పద్యంగా, మరొక్కప్పుడు గేయంగా అవతరిస్తుంది. అనే అంతర్గర్భితమైన ప్రజాశక్తిని ప్రజ్వ లింపచేసి కర్తవ్యతా ప్రబోధంచేసి, జాతిని ఉత్తేజపరుస్తాయి.

వాస్తవానికి దేశభక్తి కవిత్వానికి మన జాతీయభావనయే భూమిక, దేశంలో ప్రజ్వరిల్లిన స్వాతంత్ర్య దీక్షయే ఊపిరి, 1905 లో జరిగిన వంగదేశవిభజనతో ఆరంభమైన వందేమాతర ఉద్యమం క్రమంగా దేశమంత వ్యాపించింది. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రప్రదేశ్ పర్యటనతో తెలుగువారి హృదయక వాటాలను తెరిచింది. కవికి ఆత్మీయ అనుభవం కలిగించినంత ఆవేశమూ, వేడీ ఈ జాతీయ ఉద్యమం కలిగించడంతో పరదాస్యశృంఖలాలను పటాపంచలు చేయండని ఉద్బోధిస్తూ ఎన్నో పద్యాలూ గేయాలూ రచించబడ్డాయి. ఆ విధంగా భావకవులకూ ఈ తెగ కవిత్వంతో ఒక సంబంధం ఏర్పడింది.

ఆంగ్ల కాల్పనిక కవుల 'బాలెడ్స్' లాంటి వాటి ప్రభావంకన్నా మన దేశ రాజకీయ వాతావరణానికి సంబంధించిన పరిస్థితులే మన దేశ భక్తి కవిత్వ ఆవిర్భావానికి దారితీశాయి. అయితే నాటికవుల అందరిలోనూ అటు ప్రభుభక్తి పరాయణత్వమూ, ఇటు దేశస్వాతంత్ర్య అభిలాష కలగలసి ఒక ద్వైధీభావం పెంపొందింది. గురజాడ, వెంకట పార్వతీశ్వరకవులు, కొంపెల్ల ప్రభృతులందరూ మాతృ దేశసంకీర్తనంతో పాటు, ఆంగ్లప్రభుత్వాధి నేతలను స్తుతించి, వారి శాసనాలను జాజిపువ్వులదండలుగా ధరించడమే దానికి నిదర్శనం.

"దేశమంటే మట్టికాదు మనుషుల"ని గురజాడవారు చాటి చెప్పినా, చిలకమర్తి వారి తరువాత 'భరతఖండంబు చక్కని పాడి యావు ...' దేశమనీ, ప్రజలనీ మళ్ళీ ప్రాకులాడినవారు రాయ ప్రోలువారే. కాబట్టి దేశ అభిమానకవిత్వానికి ఆయనే అద్యులు. తరువాత విశ్వనాథ, దువ్వూరి,

కొడాలి, బసవరాజు, తుమ్మల,కవికొండల, జాషువా ప్రభృతులు ఈతెగ కవిత్వాన్ని రచించిన వారిలో ప్రముఖులు. భారత దేశ స్వాతంత్ర్య సమరంతో పాటు చెలరేగిన ఆంధ్రరాష్ట్రో ద్యమం, తెలంగాణా ఉద్యమంకూడా శక్తిమంతమైన దేశభక్తి కవిత్వాన్ని వెలువరించాయి. ఈ సందర్భంగా 'గతవైభవస్మరణ' (Glory of the past) చేస్తూ కవిత్వం రచించిన రాయప్రోలు, విశ్వ నాథ, కొడాలి, పుట్టపర్తి, రాళ్ళపల్లి, ఇంద్రగంటి ప్రభృతులూ, తెలంగాణా ప్రజల కష్టనష్టాలను చిత్రీకరించిన దాశరథి, గంగినే , కుందుర్తి, సోమసుందర్ ప్రభృతులూ పేర్కొనదగిన వారు. నిర్వీర్యంగా మారిన భరతజాతిని స్వాతంత్ర్య సమరోన్ముఖంగా నడిపించే శక్తికి దేశభక్తి కవిత్వమే ఊపిరిపోసింది. నాదేశం, నావాళ్ళూ అనే జాతీయ భావానికి ప్రోదిచేసింది ఈ కవిత్వమే"**(ప్రకాశరావు, శివలెంక , భావకవులు ప్రతిభావిస్ఫూర్తి, పుట.80–81)**

ఈ సంధర్భంగా తెలంగాణలో వచ్చిన దేశభక్తి కవిత్వాన్ని పరిశీలించి,అందులో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

మందడి వేంకటకృష్ణకవి గారు రచించిన '**నిజాం రాష్ట్రము**' అనే పద్య కావ్యం దేశభక్తి కవిత్వం కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తువును ప్రస్తావించుకుందాం.

"సీ. గుణదోషములెఱింగి కొమరారుకబ్బముల్ చవులూర రచియించు కవిగణంబు

సదమలానుప్రాస పదవిరాజద్గంధ రచనా ప్రవీణులౌ ప్రాజ్ఞమణులు

పదపదంబున రసా స్పదపు బెంపొనరించి/ కృతులరచించు బుధేంద్రచయము

నలుడెఱుంగులకై త లలపడ నిబసమీర/ నవధానములు సేయ నార్యవరులు

గీ. నలయు నాస్థానరాజముల్గల నిజాము/రాష్ట్రమును గవిలేదని వ్రాయనగునె

తెలుగునకు నిక్కమైన యీ దేశమందు/ కవివరేణ్యులు పండితుల్ గలరు కలరు.

సీ, కవితాలతాంగి సత్కారాళిమెరయ దే ప్రతివత్సరమున గద్వాలసభల

నాంధ్రభారతిమహ దానందమొందదే/ ప్రతి వత్సరము వనపర్తి సభల

పండితమండల ప్రాభవంబెసుగ దే/ప్రతివత్సరమన గోపాలుపేట

నాంధ్రసాహిత్య విద్యావినోదములేదె యాత్మకూర్పురిని ప్రత్యబ్దమందు

గీ. నిట్టియాస్థాన చయముల కింపుబెంపు/ తేజమొసుగిన నైజాము దేశమందు

తెలుగునకు నిక్కమైన యీ దేశమందు కవివరేణ్యులు పండితుల్ గలరు కలరు."

(తెలంగాణలో భావకవితా వికసం,పుట.215)

ఇందులో కవి నిజాం రాష్ట్రం గొప్పతనాన్ని, నిజాం రాష్ట్రంలో గల సంస్థానాల గొప్పతనాన్ని వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు.ఏమని అంటే సంస్కృత ఆంధ్ర భాషల్లో పండితులైన వారు గద్వాల సంస్థానంలో ఉన్నారు. ప్రబంధ నాటక, శతక కవులున్నారు. శాస్త్రవేత్తలూ ఉన్నారు అంటున్నాడు ఈ కవి. కవిపండిత, శాస్త్రవేత్తలకు నిలయమైన గద్వాల సంస్థానం తెలంగాణంలో ప్రముఖమైంది. ఇట్లాంటి సంస్థానాలు తెలంగాణంలో ఇంకా ఉన్నాయి. అలాగే గద్వాల, వనపర్తి, గోపాలుపేట, ఆత్మకూరు ఈ సంస్థానాల్లో ప్రతియేటా కవిపండిత గోష్టులు , సత్కారాలు ఉన్నాయి అని కవి అంటున్నాడు. ఈ విధంగా నిజాం రాష్ట్ర గొప్పతనాన్ని కొనియాడుతున్నాడు.

టి. ధర్మయ్యాచార్యులు గారు రచించిన **'నిజాముభూమి'** అనే పద్య కావ్యం దేశభక్తి కోవలోకే స్తుంది. ఇందులోగల వస్తువును పరిశీలిద్దాం.

"సీ. జీవనదులచేత జెన్నారుచుండెడి సష్యాధ్యమైనట్టి చారువసతి

సోమనపోతన భీమకవ్యాదులు పుట్టివర్ధిల్లిన పుణ్యభూమి

ప్రతిభగావించినయట్టి ప్రభువరుండు స్మాన్సు ధీవరుబేలెడి దివ్యభూమి

శిల్పచాతుర్యమున్ దెల్పు దేవాలయం బులు మసీదులుగల్గి చెలుగుభూమి

గీ. నిధులచే ధాన్యతతులచే నెగడుభూమి

వీర రాజన్యులుసుగల్గి నెలయుభూమి

విజ్ఞలకు నాకరంబయి వివిధకళల

స్థానమైఖ్యాతిగాంచె నిజాముభూమి,"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.212)

పై పద్య కావ్యంలో రచయిత జీవనదులు, కవులు, వీరులు, విజ్ఞులు, కళలు, ఆలయాలకు నిలయమైన భూమి నిజాముభూమి అంటున్నాడు. ఇది వింటుంటే 'మా తెలుగు తల్లికి మల్లెపూ దండ' అనే పాట గుర్తుకు వస్తుంది. 'జీవనదుల చేత జెన్నారు చుండెడి సస్యానం చారు వసతి' ఈ 'చారు వసతి' లోని వసతికి బదులు భూమి అనే పదం ఉంటే బాగుండేది. ఎందుకంటే మిగిలిన అన్ని సీస పద్య పాదాల చివర 'భూమి' అని ఉంది. ఈ విధంగా కవితా వస్తువును వర్ణించాడు.

తోపు వెంకటాచార్యులు గారు రచించిన **'నిజాము రాష్ట్ర ఘనత'** అనే ఖండిక ఈ కోవలోకే వస్తుంది.

"సీ.పటు కవిత్వాభ్యాస పారీణ కవిరాజ

పటల సమాక్రాంత భవ్య పురము

ఆశ్రిత జన రక్షణాసక్త మానస

సామంత భూపాల సంచయంబు

సంత తేజ్యా శీల సవన సాహాయ్యక

ధార్మిక భూయిష్ట ధనిక కులము

వేద వేదాంగాది వివిధ శాస్త్రపురాణ

వాచనాశీల సుధీ చయంబు

గీ.సంతతార్థిక మానుష సంతతికిని

దిన దినము జీవనం బిచ్చి తేజరిల్లు

మహిత నైజాము రాజ్య మిమ్మహి వెలుంగు

దీని కెనయగు దేశంబుఁ గాన మెందు.”

(గోలకొండ కవుల సంచిక,పుట.301)

పై పద్య కావ్యంలో కవి రాజులు, సామంత రాజులు, ధార్మికులు, విద్యవేత్తలు వీరందరిని కవితా వస్తువులుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. ఈ కవి తాను నివసిస్తున్న దేశంమీద తనకు ఉన్న అభిమానాన్ని చాటుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.అలాగే తాను నివసిస్తున్నా ప్రాంతం గొప్పతనాన్ని చెప్తుతున్నట్లు కనిపిస్తుంది.

సి.ఇ. ఆండ్రూస్ గారు రచించిన ‘**తెలంగాణా**’అనే పద్య కావ్యం దేశభక్తి కవిత్వం శాఖలోకి వస్తుంది. ఈ సంధర్భంగా ఈ కావ్యం లోని కొన్ని పద్యాలలోని వస్తువును పరిశీలిద్దాం.

“వెలయుచున్నది దేశభాషలకుమిన్న

యాంధ్రభాషామతల్లి ప్రయాసమనక

ప్రబలుచున్నది తెనుగు కబ్బము చెలంగి

నివురుగప్పిన యలమై కవులమదిని”

ఇది ‘తెలంగాణా’ ‘నా తెలంగాణ కోటి రత్నాల వీణ’ అన్న దాశరథి కంటే ఒ పన్నెండేళ్లకు ముందే ఈ పేరుతో సి.ఇ. ఆండ్రూస్ ఒక మూడు పద్య కవితలు రాసాడు వాటిలో గల వస్తువును పరిశీలిద్దాం.

‘నివురు గప్పిన యనలమై’ఎంత మంచి మాటన్నాడోయి ఈ కవి. తెలంగాణా కవులు నివురు గప్పిన నిప్పులు. పైకి అట్లా కన్పించరు. లోపల కవిత్వముంటుంది ఆరి పోకుండ. మొదటి తెలంగాణా

కవి పాల్కురికి సోమనాథుడు సరే. అంత భాగవతం రాసిన పోతన 'పలికించు విభుండు రామ భద్రుండట' అనే అన్నాడు కాని, నేను దేశాన్ని అదరగొట్టే కవిత్వం రాస్తున్నాను అనలేదు. ఉన్నచోటు కదలలేదు. నా గొప్పతనం చూడండి అంటు తిరుగలేదు. ఎవని కంచు ఢక్క పగులగొట్ట లేదు. తనను తాను మరువలేదు. తనను విడిచి పోలేదు. బ్రతుకు మొదటి నుంచి చివరిదాకా ఒక పద్ధతిలో సాగింది. తనలో లేనివి ఎక్కడనో ఉన్నవని భ్రమించి పరుగెత్తిందిలేదు. చివరకు పడిపోయింది లేదు. ఆకర్షణలు లేవు. ఆర్భాటాలు లేవు. భ్రమ పెట్టింది లేదు. పోతన సమకాలికుడైన శ్రీనాథుణ్ణి చూడు తేడా తెలుస్తుంది అంటూ ...

"ఓరుగంటి యగడ్తల నొరసి వేయు

స్తంభముల గుడిలోపల దవిలి శిధిల

శాసనములందు వేడి నిశ్వసనమిడుచు

బహుళ వైచిత్ర్య శిల్పవైభవము వెలయు."

తెలంగాణ శిల్ప వైభవానికి పెట్టింది పేరు అనడానికి నిదర్శనం ఓరుగల్లు కోట, వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి. ఓరుగల్లు కోట లోని కీర్తి తోరణం, ఓరుగల్లు కోటలోని ఈ కీర్తి తోరణం మాడల్ మన కాకతీయ యూనివర్సిటీ రెండు ద్వారాల దగ్గర నిర్మింపబడి ఉండటం ఇవన్నీ బహుళ శిల్ప వైభమునకు నిదర్శనం.

"సోమనాథ విద్యానాథ సుప్రసిద్ధ

కవివరేణ్య వాఙ్మయవిహార గములవిమల

గీతికా నినాదంపుబ్రభాతకిరణ

జాలమున దేలుచున్న నిజామువెలయు"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.213)

తెలంగాణాలో మొదటి కవి పాల్కురికి సోమనాథుడు. బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర ఈ కవి ప్రముఖమైన రచనలు. రాజమహేంద్రవరంలో అప్పటి నన్నయ తెలుగు కావ్యాన్ని ప్రారంభించినాడు. ఇక్కడ తెలంగాణాలో, నన్నయ తరువాత వంద ఏండ్లకు, పాల్కురికి సోమనాథు కావ్యాన్ని ప్రారంభించినాడు. ఇది ద్విపద. నన్నయ వలె చంపూ మార్గం కాదు. ద్విపద గానయోగ్యమైన ఛందస్సు, సామాన్య ప్రజానీకానికి సులభంగా అర్థమయ్యే భాష స్థూలంగా చెపితే నన్నయది పండిత భాష, సోమనది పామర జన భాష ఆ నన్నల కావ్య భాషను దృష్టిలో పెట్టుకొని సోమన 'ఉరుతర గద్య పద్యోక్తుల కంటే సరస బరగిన జాను తెనుగు'అన్నాడు. ఆ నన్నయ మార్గాన్ని సోమన అనుసరించలేదు. అతడు ఒక మార్గాన్ని అక్కడ వేస్తే, ఇతడు మరో మార్గాన్ని ఇక్కడ వేసినాడు. ప్రాంతాలు వేరు ఆలోచనలు వేరు, పాల్కురికి ఈ మార్గమే అనంతర కాలంలో తిక్కన రచనల మీద ఒక రకంగా ప్రభావాన్ని చూపింది. చదువుకున్న వాళ్లుంటారు కాని కేవల పండితులు సమాజంలో తక్కువగానే ఉంటారు. అందుకే సులభమైన రచనవైపే ప్రజలు ఉంటారు. ప్రజల వైపే కవులుంటారు. నన్నయ వలె సంస్కృతానికి కాకుండ తెలుగు పదాలకె ఎక్కువ ప్రాధాన్యం తిక్కన ఇవ్వటానికి కారణం సోమన జాను తెనుగు ప్రభావం. వచనం లేకుండ మొదట 'నిర్వచనోత్తర రామాయణం' రాసిన తిక్కన, తరువాత తన మార్గం మార్చుకొని చంపూ మార్గానికి వచ్చి భారతం రాసినాడు కాని, నన్నయ వలెనే సంస్కృత పదాలు ఎక్కువ వాడలేదు. తెలుగు పదాలెక్కువ ఉన్న రచనా మార్గాన్ని తొక్కినాడు. ఇక్కడ తెలంగాణంలో తన సరళమైన రచనతో తాను ప్రచారం చేయదలచుకొన్న శైవ మతాన్ని సోమన ప్రారంభించి విజయుడౌతున్నాడు. ప్రజలకోసం కవిత రాసిన మొదటి కవి సోమన. రచనకు తనంత తాను పూనుకున్నాడు. నన్నయ రచనకు రాజు కారకుడు సోమన రచనకు ప్రజలు కారకులు. అందుకే ప్రజల భాషలో రాసినాడు. ప్రజల బ్రతుకులు రాసినాడు. ఈ విధంగా తొలి ప్రజాకవి పాల్కురికి సోమనాథుడు. అంటూ కవి ఈ తెలంగాణ పద్య కవితలో వర్ణిస్తున్నాడు.

కె.ఎస్. జాషువగారు రచించిన **'హైద్రాబాదుప్లేగు'** అనే పద్య కవిత ఈ కోవలోకే వస్తుంది. దీనిని ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"ఉ. ఆవుల దొడ్డిలోదుముకు వ్యాఘ్రముకై పడి గొట్టెలందు సా

లావృకమట్లు 'ప్లేగు'నెడు రక్కసియొక్క తె నేడు హైద్రాబాద్

లోపడిజచ్చి యిట్టునటు లోపము జోపము గాపురస్థలం

దావులుబాపై దానిదగు తాడనమేమని చెప్పుదక్కటా.

చ. నెలవులయందు రాత్రమున నెమ్మదినుండిన లేళ్లపుంజముల్

వెలువడు సింహగర్జనము వీనులసోకుగ భీతి నష్ట ది

క్కులుబరు వెత్తు మాడ్కిదగు క్రూరతరంబగు ప్లేగుగర్జనన్

బలుదిశలేగి క్యాంపులను బన్న రె యీపురవాసులెల్లరున్.

చ. ధరపతి యెవ్వడోతనదు తండ్రికి ద్రోహముసేయ క్షాత్రులౌ

పురుషులమాత్రమే దనియె బూనిక భార్గవరాముడాతఱిన్

దరుచుగ ప్లేగుతండ్రికిని దాతకు నే నరుడేమిచేసెనో

వరుసగ మ్రింగనాయె ప్రతివారిని జాలియొకింత లేకయున్."

(గోలకొండ కవుల సంచిక,పుట.183)

సమ కాలంలో జరుగుతున్న సంఘటనలను వస్తువుగా తీసుకొని వాటి పట్ల ప్రభావితుడై రాసినది 'హైద్రాబాదు ప్లేగు' అనే ఖండిక.

ఆవుల దొడ్లో దుమికిన వ్యాఘ్రం వలె ఉందట ఈ ప్లేగు. రాత్రివేళ నిద్రించిన లేళ్లు సింహగర్జన విని దిక్కు క్కులకు పారిపోయినట్లు హైద్రాబాదు ప్రజలు, ప్లేగు కారణంగా, క్యాంపుల్లో ఉంటున్నారట. ఒక చోట చనిపోయే వాళ్లు, వాళ్లను పూడ్చటం, కాల్చటం, మరోచోట, ఏడ్చే వాళ్లొకచోట మొత్తం మీద హైదరాబాదు అంతా ఈ ప్లేగు కారణంగా యుద్ధ భూమి వలె ఉందంటాడు

కవి. కసువును కోస్తుంటే క్రమంగా కత్తి అయినా మొండిపోతుంది కాని ఇంత మందిని పొట్టన పెట్టుకున్నప్పటికి ప్లేగుకు విసువు కలుగటం లేదు. ముసలితనం కావటం లేదంటాడు కవి.

ఈ వర్ణన కళ్లకు కట్టినట్లుంది ఉంది. కరుణ రసాత్మకంగా ఉంది. ఈ కవి జరుగుతున్న సంఘటనకు స్పందించిన లక్షణం ఇందులో ఉంది.

ప్లేకు కారణంగా చాలామంది బలియై పోయినారంటే జ్ఞాపకం వచ్చింది.మరో ఖండిక. ఈ ఖండిక పేరు ***'బలి'***కోళ్లను గొర్రెలను శక్తికి బలి ఇస్తున్న ప్రజల మూర్ఖత్వాన. **నల్లాన్ చక్రవర్తి ప్రతాపం రాఘవాచార్యులు** తెలియజేస్తున్నారు.

ఇంట్లో పిల్లవానికి కలిగి ఏ రోగం వచ్చినా, సంతోషంగా గొర్రెలను ఆదిశక్తికి బలి ఇస్తున్నారు.దేవత ఆక్రందన రూపమే ఈ రోగాలంటారు. శివం పూనినట్ల కల్లరి వేషాలు వేస్తు వామ మార్గులై పాడవుతున్నారు. నిన్ను నిందపాలు చేస్తున్నారి దుష్టులు, ఈ హింసను మా అహింస పరమ ధర్మమని చాటనేమి ఈశ్వరీ అంటున్నాడు కవి–

"ఉ.ముదివిమందుఁ బుత్రికిఁ గుమారున కెడి యట్టి దోషసం

బంధములైన రోగముల పాటన మెచ్చిన తుచ్ఛులందరా

సందమతోడ గొట్టెల ఘనంబుగఁదెండిది యాదిశక్తి యా

క్రందనమే యటంచనిరి కాలముగాదె యిదేమియీశ్వరీ.

చ.గొరియలఁ గోళ్ల దున్నలను ఘోరముగా బలి వెట్టనేది? కా

పురుషులు గారె వీర, లల పుణ్యము భక్తియోగా యటున్న సం

బరమునఁ గన్న పుత్రులను బట్టి వధింప రదేలనో మహే

శ్వర్ ! విను నిందపాలు మనసారగ జేసిరి దుష్ట లక్కటా!

చ. జ్వరముల నీతి బాధలను జంతుభయంబులఁ గల్లఁ జేసిము

ష్కరుల మదంబడంచి కలికాలమాహాత్మ్యముఁ జూపి దోర్బలో

దరపరిపూర్తుల ఖలుల దండన కంతకు తోడఁజెప్పి యీ

ధరణి సహింసయే పరమ ధర్మమటం చని చాటు మీశ్వరీ.”

(గోలకొండ కవుల సంచిక,పుట.179)

అజ్ఞానులై జంతుబలులు చేస్తున్నందుకు కవి పడుతున్న వేదన ఇది. ప్లేగు వచ్చి మనుషులను చంపితే ఒక కవి బాధవడితే, కోళ్లు, గొర్రెల కారణం మరో కవి బాధపడుతున్నాడు. అక్కడా ఇక్కడా ఉన్నది సామాజిక సంఘటనలకు కవి స్పందించ గలుగడమన్న విషయం.

తెలంగాణ కవులు సామాజిక పరిస్థితులకు స్పందించి రాయగలుగుతారు అనటానికి కొన్ని ఈ కవితలు నిదర్శనాలు. ఇట్లాంటివి ఇంకా ఉన్నాయి. అన్ని జిల్లాల కవులు సమకాలీన విషయాలను వర్ణించినారు. 1934 ప్రాంతం నాటి తెలంగాణా సామాజిక పరిస్థితులకు ఈ గోలకొండ కవుల సంచిక అద్దం పడుతుంది. ఖండికలను జాగ్రత్తగా పరిశీలిస్తే మనకు తెలియని అనేక విషయాలు సామాజిక వస్తుపరంగా చూచినట్లయితే ఈ సంచిక చాలా విలువైందిగా వస్తువుకు వస్తువుంది. కవితకు కవిత ఉంది. వస్తువు. కవిత్వం ఇందులో ప్రదానంగా కన్పించే అంశాలు.

ఆచివేంకట నృసింహాచార్యులు గారు రచించిన ‘**కర్మచంద్రోదయం**’ అనే పద్య ఖండిక ఈ కోవలోకే వస్తుంది. దీనిని ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే.

“న్యాయ వాదాంత విద్యాభ్యాస మొనరించి/ కృతకృత్యుడౌ రాజ కీయవేత్త

కఠినోప వాసదీక్షలచేత నాత్మీయ /యౌవనంబును గన్న యోగికుండు

హరిజనాబ్యుదయ పుణ్యాంభోజ పుంజ వి/ కాసంబునేసిన కర్మసాక్షి

పత్నీసుతాలయ పశు ధనాదికము ను/ దాసీనతగుజూచు త్యాగ యుతుడు

భూరి భూమిమాత్ఋణ విముక్తి కొఱకు/ బంధానాలయావాసి యౌ భాగ్యశాలి

ధన్యమోహన దాస చైతన్యమూర్తి/ కర్మచంద్రుడు బడిచె లోకము సుఖింప."

(గోల్కొండ కవుల సంచిక,పుట.86)

పై ఖండికలో స్వాతంత్ర్య ఉద్యమ సారథి అయిన గాంధీ గారి గురించి వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. డబ్బు బాగా వచ్చే ఉద్యోగం వల్ల సుఖము ఉంటుందేమో కాని స్వేచ్ఛ ఉండదు. సుఖం కంటే స్వాతంత్ర్యం ప్రియం కదా. స్వాతంత్ర్యం ఎవరికి ప్రియంకాదు. నిరంకుశ ప్రభువు నిజాం ఏలుబడిలో ఉన్నవాళ్లకు స్వాతంత్ర్యం ఎట్లాగూ ప్రియమే అంటూ స్వాతంత్ర్య ఉద్యమ రథ సారథి అయిన గాంధీ గారిని తలుచుకొని పై ఖండిక రాశాడు.

పురాణం మల్లయ్యగారు రచించిన '**రాష్ట్రాధిక్యత**' అనే పద్యకావ్యం ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"సీ.ఆంధ్ర గీర్వాణ విద్యా విశేషములచే

గణుతి కెక్కిన సుధీమణులు గలరు

జ్యోతిష ప్రముఖ శాస్త్రోత్తమ వేత్త లై

చతురత మెలగు పండితులు గలరు

సకల ప్రబంధ నాటక శతకంబుల

గృతు లొసంగిన కవితతులు గలరు.

కమనీయ సంగీతకలిత బోధకులైన

గాన విద్యాధిక ఘనులు గలర

గీ.దెందునో గాదు గద్వాల యందె వినుడి

యిట్టి విద్యాధికులను బోషించునట్టి

యాదిలక్ష్మి మహారాణి ననవరతము

కేశవ స్వామి కరుణ రక్షించుగాత."

(గోలకొండ కవుల సంచిక,పుట.304)

పై పద్య కవితలో కవులకు,కళలకు కవి పోషకులకు నిలయం కావటమే ఈ నిజం రాష్ట్ర గొప్పతనం అని రచయిత అంటున్నాడు. సంస్కృత ఆంధ్ర భాషల్లో పండితులైన వారు గద్వాల సంస్థానంలో ఉన్నారు. ప్రబంధ, నాటక, శతక కవులున్నారు. శాస్త్రవేత్తలూ ఉన్నారంటున్నాడు ఈ కవి. కవి, పండిత, శాస్త్రవేత్తలకు నిలయమైన గద్వాల సంస్థానం తెలంగాణంలో ప్రముఖమైంది. ఇట్లాంటి సంస్థానాలు తెలంగాణంలో ఇంకా ఉన్నాయి.తెలంగాణ కవుల గొప్పతనాన్ని వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు.

వడగం రాజేశ్వర రావు గారు రచించిన **'ఆంధ్ర పుత్ర'** అనే పద్య కావ్యం ఈ శాఖలోకి వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"స్వీయ దేశము నందుండి చిద్విలాస

మొసగు వస్త్రమున్ వీడి నేర్వసనమునకుఁ

జేతులన్ జాచు టెంతయు సిగ్గటంచు

నరయ లేకున్న బ్రతుకేల ? నాంధ్ర పుత్ర !

తనువునన్ వికలాంగుడుద్భవము నొందె

నేని, నీ ప్రేమ నిలువదా వానిపైన

నటుల నీ దేశ వస్త్రము నాదరించి

ముతక దైనను దాల్చుటే ముఖ్యమంచు

నరయలేకున్న బ్రతుకేల ? నాంధ్రపుత్ర ....."

(గోలకొండ కవుల సంచిక,పుట.296)

పై పద్యకవితలో దేశీయ వస్త్రాలను వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. మిల్లు గుడ్డలు కాదు, దేశీయమైన వస్త్రాలను ధరించాలన్న విషయముంది. ఇది స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో వచ్చింది. విదేశీ వస్తువులను బహిష్కరించాలన్న పిలుపు ఒకటి ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.

వి. లక్ష్మీ దేవమ్మ గారు రచించిన **'దేశమాత'** అనే పద్య ఖండిక దేశభక్తి శాఖ పరిధి కోవలోకే వస్తుంది. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"సీ. ఎండిన మ్రోడులే నిగురులత్తగ గీతి కలుబాడరేల త్యాగయ్యపగిది

శతవృద్ధుకైన మేన్జలదరింపగగైతు గావింపరేల తిక్కన్న భాతి

డీకొన్న జమునైన డీలువోసనిజేయ రదియేల కృష్ణరాయలనుబోలి

కృతులందివేగసత్కీర్తిని గొనరేల ఆరఘునాథ రాయలవిధాన

గీ. ప్రాజ్యసామ్రాజ్య కార్య చక్రంబుద్రిప్పు/ మంత్ర మొనరుపరేల తిమ్మరసురీతి

కోటికొకడైన నేటి నీకొడుకులందు/దివ్యవిఖ్యాతగుణజాత దేశమాత.

గీ. ఆయురారోగ్య సంపద లతిశయిల్ల/ నైహికాముష్మికంబుల కాటపట్టు

పరమకల్యాణ గుణపూత భరతమాత/మమ్ము బునరుద్ధరింపగా నమ్మికొలుతు.

వీరధర్మంబు దివికేగి విశ్రమించె/ బ్రహ్మ తేజంబుడస్సి విశ్రాంతిగనియె

భారతీయులు దౌర్భాగ్య పరతగనిరి/ తిరిగి మమ్ముద్ధరింపుమో దేశమాత"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.202)

పై ఖండికలో గతకాలం నాటి దేశవైభవం నేడు లేదు అన్నది ఈ పద్యాల లోని వస్తువు. త్యాగయ్య, తిక్కన్న, కృష్ణరాయలు, తిమ్మరుసు వంటి వాళ్లు నేడు లేరు అంటుంది ఈమె. దేశాన్ని మాతగా చెపుతుంది కాబట్టి ఆ అందరిని కొడుకులు అంటుంది. త్యాగయ్య వలె పాడలేరు అని, ఊరక అనకుండా ఎండిన మోళ్లు చిగిర్చేట్లు అని చెప్పింది. తిక్కన వలె కవిత అని చెప్పలేరు అనటానికి 'శత వృద్ధుకైన మేను జలదరించేట్లు' అని చెప్పింది. 1934 నాటికే నిజాం రాష్ట్రంలో స్వాతంత్ర్య వాయువులు వీస్తున్నాయి అనటానికి ఈ కవయిత్రి పద్యాలు నిదర్శనం అని చెప్పవచ్చు.

భో. అండాళమ్మగారు రచించిన '**భారతమాత**' అనే పద్య ఖండిక దేశభక్తి కవిత్వ శాఖ పరిధిలోకి వస్తుంది. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"సీ. అనుపదోజృంభ మాణాన్యదుర్మత ఖండనాఖండ ప్రచండమతులు

సర్వవిద్యాసార సంప్రదాయవిచార బోధనాచరణ ప్రపూర్ణధృతులు

ప్రకటాగమాంత మార్గప్రతిష్ఠానాధ్య ధీరాతిధీరతో దారమతులు

అఘటనాఘటన నిరాఘాట భువనైక భావుకాత్యంత ప్రభావయుతులు

గీ. అజ్ఞసముదయోజ్జీవనా భిజ్ఞసహజ/ మంగళకర కరుణాసమాలింగితులుసు

నైనశంకర రామాను జార్యసముల/దొరయు పుత్రుల గనవేమి భరతమాత.

సీ. యమనియమా సనధ్యాన ధారణముఖ్య యోగవిఖ్యాతులై యొప్పుద్విజుల

నిజవిక్రమక్రమ నిర్భిన్న ధర్మేత రారంభదక్షులై యలరున్నృపుల

నిజకులోచితధర్మ నియతివిఖ్యాతులై యూర్జితస్థితిగాంచు నూరుభవులు

ద్వైవర్ణికార్చనారంభ సంవర్ధిత భద్రసంయుక్తులౌ శూద్రకులలు"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.200)

పై ఖండికలో కవయిత్రి ఈ విధంగా అంటుంది. ఒకనాటి మహామహులు నేడు లేరు అన్న బాధను ఈ కవయిత్రి వ్యక్తం చేసింది. ఇదొక రకమైన గతవైభవ సంకీర్తనం. గతకాలం నాటి చాతుర్వర్ణ్య వ్యవస్థ లేదన్న బాధ కూడ ఈమెకు ఉంది. ఇంకా అంటుంది ఎప్పటి కాలము అప్పుడే. వెనుకటి ఆ పద్ధతులు ఇప్పటికేం సరిపోతాయి అని నిజాం రాజు కాలంనాటి మాట కదా, ఈ నిజాము మహమ్మదీయుడు. వెనుకటి తమ రాజుల వంటి వారిప్పుడు లేకపోయినారు అన్న విచారము ఈమెది. 'నిజ విక్రమక్రమ నిర్భిన్న ధర్మేత రారంభదక్షులై యలరు నృపులు''పూర్వీకులు. 'యమ నియమాసన ధ్యాన ధారణ ముఖ్య యోగ విఖ్యాతులై యొప్పుద్విజు' లిప్పుడు లేరంటుంది కవయిత్రి. 'భారతమాత' అన్న ఖండిక పేరును బట్టి ఈమెలో దేశభక్తి భావన ఉన్న విషయం మాత్రం తెలుస్తుంది.

4.7. తెలంగాణ భావకవిత్వం– స్మృతి:

ఆప్తుల మరణాన్ని గూర్చి స్మృతి రూపంగా వెలువడ్డ ఒక గేయమో, కావ్యమో స్మృతికవిత్వం అనబడుతుంది. 'ఎలి గాన్'అనే గ్రీకుపదానికి 'శోకం' అని అర్థం. దానినుంచి పుట్టినదే 'Elegy' అంటే స్మృతిగీతం. అయితే విషాదంకల 'ఎలిజాయిక్' (Elegaic) ఛందస్సులో రచించబడ్డ ఏపద్యమైనా 'ఎలిజీ'గా పరగణించబడ్డది. అందుకే యుద్ధాలనూ, రక్తపాతాలనూ, రాజకీయ పరిస్థితులనూ, వివాహాలనూ, సమకాలీన సమాజ జీవనాన్ని గూర్చి కల్గిక శోక ఆవేశాన్నీ పండగల్లో పొందే ఆనందాన్నీ, నీతిని ఉద్బోధించే తత్వాన్నీ ఈగీతంలోనే కవులు ప్రకటించారు.అంతేకాదు, శ్మశానాన్నీ, అక్కడి ప్రశాంత వాతావరణాన్నీ, చిత్రీకరించే గీతంకూడా 'ఎలిజీ'గా చెప్పబడింది.

"సాంస్కృతిక పునరుజ్జీవనం తర్వాత ఇంగ్లాండులో అడుగు పెట్టిన ఈ ధోరణి ఎక్కువగా ఆపస్మృతి పరంగానే అభివృద్ధిగాంచింది. అదే తెలుగుభావకవితా యుగంలో ఒక స్థానాన్ని సంపాదించుకున్నది. పూర్వాంధ్ర సాహిత్యంలో కూడా తారావిలాపం, మండోదరీ విలాపం, అభిమున్యుడికై పాండవుల దుఃఖం, కృష్ణనిర్యాణం, గూర్చి అర్జునవిషాదం, అజవిలాసం, రతివిలాపం ఇత్యాదులు కాన వస్తాయి. అలాగే శ్రీనాథుడూ,పెద్దన లాంటికవుల చాటువులలో స్మృతి గీతాల లక్షణం గల పద్యాలున్నాయి.

అయితే 19 వ శతాబ్దిలో వావిలాల వాసుదేవశాస్త్రిగారి పిత్ర ఆరాధనం, రుక్మిణీస్మరణం, వడ్డాది సుబ్బారాయుడుగారి సతీ స్మృతి, సుతస్మృతి, ఆదినారాయణమూర్తిగారి ప్రేయసీస్మృతి (1904), డి. జగన్నాథరావుగారి మిత్రస్మృతి (1910) లాంటివి రచించబడినా వాటిలో నవ్యతలేదనీ గోపాలకృష్ణ గోఖలే మరణం గూర్చి రాయప్రోలువారు రచించిన స్మృతిగీతమే మొట్టమొదటి స్మృతి గీతమనీ డా. సి. నారాయణరెడ్డిగారు అభిప్రాయపడ్డారు. 'ఎలిజీ'ని తాపీ ధర్మారావుగారు 'కారుణ్యహా'మనీ, డా.సి. నారాయణ రెడ్డి గారు 'స్మృతికావ్యము' అని పేర్కొన్నారు.

స్మృతికవిత్వానికి ఆత్మీయత జీవనాడి, విషాద ప్రకటనం ముఖ్య అంగం. థామస్ గ్రే, మిల్టన్, బ్రౌనింగ్, వర్డ్స్ వర్త్, ఆర్నాల్డ్ మొదలైన వారు రచించిన స్మృతికవిత్వం పేర్కొనదగింది.అలాగే తెలుగులో విశ విశ్వనాథవారి 'వరలక్ష్మీత్రిశతిః' దువ్వూరి వారి 'భగ్న హృదయం' నాయనివారి'విషాదమోహనం' జాషువాగారి 'బాపూజీ' ఇత్యాదులు ఈ కోవకు చెందినవే"**(ప్రకాశరావు, శివలెంక, భావకవులు ప్రతిభావిస్ఫూర్తి,1978, పుట.83-85)**

ఈ సంధర్భంలో తెలంగాణ భావకవిత్వంలో వచ్చిన స్మృతి కవిత్వంలో గల వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

దొంతిరెడ్డి పట్టాభిరామారెడ్డిగారు రచించిన **'పరిదేవనము'** అనే పద్య కావ్యం భక్తికవిత్వ శాఖలోకి వస్తుంది. ఈ సంధర్భంలో దీనిని ప్రస్తావించుకుందాం.

"సీ. సిరిగుల్కు బంగారు చెలువంబుకళలీను తిరుమేను సేవింప దివురుటెపుడు

నిండుపున్నమనాటి పండువెన్నెలనేలు చిరునవ్వుగనుగొని చెలుగుటెపుడు

పరువంపుజాబిల్లి గరువంబణపజాలు నగు మోమువీక్షించు నయమదెపుడు

తరికొండజననమౌ పరసుధారసమును మించుబల్కుల నాలకించుటెపుడు

గీ. నాగురుస్వామి నాతండ్రి నాదువేల్పు/నాదు పెన్నిధిగురుని నానాడుబాపె విధియటంచునుదూరుచు వెతలనొంది/ యొక్కయెడ చిత్తమునకొక్క యూహదోచె.

ఉ. పోకమెలంగరాదు మతిబోయినపిమ్మట సేమజేయు కే

రాకకు వీలులేదు యతిరాజుల పాలికి నేడెపోయి వే

నాకుజనించెగాకలత నాదగు భ్రాంతి నెఱుంగుబల్కెదన్"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.181)

పై కవితలో కవి గురువును స్మరించుకునే విధానాన్ని కవితా వస్తువుగా తీసుకున్నాడు.తన గురువు పట్ల ఈ కవికి అభిమానం బాగా ఉన్నట్లు కనిపిస్తుంది. శరీరము అంటున్నాడు. వెన్నెలాల వంటి నవ్వు, నగుమోము పున్నమి చంద్రుడు అని గురువు యొక్క రూప వర్ణన చేస్తున్నాడు. మాటలు అమృత బిందువు అంటున్నాడు. మాటలు అమృత బిందువు కాబట్టే గురువు పట్ల అభిమానం. మాటలు అమృత బిందువులే అయిన గురువు తన వేల్పు కాకుండా ఉంటాడా,గురువును పెన్నిధిగా భావించినాడు కాబట్టే గురువు తనువు చాలిస్తే పెన్నిధిని కోల్పోయినట్లు ఈ భక్త కవి పరితపిస్తున్నాడు.

శ్రీ మాడపాటి హనుమంతరావు గారు రచించిన '**మిత్రస్మృతి' అనే** పద్య కవిత ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"చ. ఫలములచేత గొన్నిటిని; బల్లవసంతతి చేత గొన్నిటి

సలలిత సౌఖదాయియగు చానుగొన్నిటి; వేవిధాల నీ

యిలను ననేక జీవుల కహీనసుఖంబిడు వృక్షరాజము

బలువడి బీకివైచితె? తుపాన! వినాశము చేసివైచితే

చ. నయగుణభూషణుండు; పరనారుల కెల్లను సోదరుండు;

ని ర్భయశుడునన్యలభ్యసముదార చరిత్రుండు; సాహసాత్ముడున్

దయకును సౌహృదంబున కుదాత్త నిదానుడు; సర్వ సజ్జన

ప్రియుగువాని నిట్లు విపరీతపుగాలమ! మ్రింగివైచితే.

మ. స్వయకుటుంబమ్మును రక్షసేయుటకె యీసర్వంబటంచుస్థలం

చి, కడు స్వార్థపరాయణశ్వమున నిశ్చింతాత్మతోనుండు, లు

బద్దకులోత్తంసులుకొనరారయిరెనీ పాపుంపు గందోయికి

ట్లకటా! మృత్యువ! ఏమనంగందగు నీయంధత్వమాహాత్మ్యము"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.365)

పై పద్య కవితలో తన మిత్రుడు రంగారావు చనిపోయిన విధానాన్ని,అతని గుణాలను కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. అతని మిత్రున్ని 'పొమ్మిక రంగరాయ' అన్నాడు. తుపాకికి బలియై పోయిన వృక్ష రాజంతో అతన్ని పొలుస్తున్నాడు. ఆ చెట్టు 'అనేక జీవుల కహీన సుఖము' ఇచ్చేదట. అతను సమాజాసేవ కూడా చేసినాడట. అతడు చని పోవడం నిజాం రాష్ట్రానికి పెద్ద లోటుగా కవి భావిస్తున్నాడు.

షబ్నవీస్ వేంకటరామనరసింహారావుగారు రచించిన **'స్మృతి'** ఈ కోవకు చెందినది. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"సీ.సకలసత్కృతులందు జాయపోలికనన్ను ననుసరించినయట్టి వినయభరిత!

ప్రాణంబుకంటే సత్యధికంబుగను నన్ను బ్రేమించినట్టి సత్ప్రమధామ!

స్వర్లోకమునకేగు సమయమందైననా మాటదాటనియట్టి మహితశీల!

పెనుగష్టములయందు బెగడొందనీక న న్నూరడించెడునట్టి ధీరచరిత్ర

తే.గీ. మగువ! నీ ఋణ మెన్ని జన్మములకైన/ నగునె చెల్లింప నీదు సాయంబులేక?

జానకీ! నాయుదయలక్ష్మి సమసిపోయె,/నదయవైనీవె ననువీడి యరుగుక తన!"

పై పద్య కవితలో కవి చనిపోయిన తన భార్యను గురించి వస్తువుగా తీసుకొని చెప్తున్నాడు.ఇందులో తన భార్య మరణిస్తే ఎడుస్తున్నాడు. మిత్రులను కోల్పోతే ఏడిచే మనుషులు భార్య చనిపోతే ఏడువకుండా ఉంటాడా. విశ్వనాథ సత్యనారయణ తన భార్య చనిపోతే ' వరలక్ష్మి త్రిశతి' తో మూడు వందల పద్యాలు రాశాడు. ఇది స్మృతి కవితలొకే వస్తుంది. పై పద్య కవిత కూడా ఈ కోవలోకే వస్తుంది.

వాడాల నరసింహంగారు రచించిన '**దంత స్మృతి**' అనే పద్యకావ్యం ఈ కోవలోకే వస్తుంది.

ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"సీ .స్వాచేష్ట నవ్య యోషా శిరోరత్నాంచి

తాధర పీయూష మాని యాని

చటుల నూత్న ముకురచ్ఛవిగల జవరాండ్ర

గండస్థల క్షేతుల్ గడపి కడపి

లవణామ్ల తిక్తాది లలిత షడ్రసయుక్త

దివ్యాన్న రుచులెల్లఁ దెలిసి తెలిసి

ఘృత తైల గుడ పిష్టయుత పక్వ పంచ భ

క్ష్యాంచిత సారంబు లరసి యరసి

గీ. వేసరితో, వృద్ధతను జూచి రోసినావొ

ఉదయ సమయాంగుళీ ఘాత కోర్చవైతొ

మిట్టి పడి కదలి విడి తోబుట్టువులను

బాసి చను టొప్పునే యగ్రభాగ రదమ.''

(గోలకొండ కవుల సంచిక,పుట.207)

పై పద్యంలో కవి రాలిపోయిన దంతమును కవితా వస్తువుగా తీసుకున్నాడు. ముత్యాల వంటి పళ్లను కాదు కానీ ఈ కవి రాలిపోయిన ఒక దంతమును గురించి వర్ణిస్తున్నాడు.కవులు కదా దేని మీదైనా రాస్తారు. ఇది దంతమును గురించి స్మృతి కవిత. మనుషులు చనిపోయినప్పుడు వారి గుణ గణాలను తలచుకున్నట్లే ఉంది. ఆ పన్ను ఇదివరకు ఏమేం చేసేదో వర్ణించినాడు. యువతీమణుల అధరపీయూష మానిందట. జవరాండ్ర గండస్థల క్షతులు చేసిందట. షడ్రసోపేతమైన దివ్యాన్నపురుచులు తెలిసిందట. పంచభక్ష్యాల సారమెరిగిందట. ఇన్నిటిని చూసీ చూసి అలసిపోయినావా ఏమిటి, నీ తోబుట్టువులను ఎందుకు విడిచిపోయినావు? పొద్దుటి పూట తోము తున్నప్పటి బాధకు తట్టుకోలేకపోయినావ అని కవి అంటున్నాడు.

వానమామలై వరదాచార్యులుగారు రచించిన **'రవి కవిస్మృతి'** అనే పద్య ఖండిక ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"రవి నగుచు గ్రహించెద విశ్వరసము లెల్ల/ నింద్రుడయి సుధగ దాని నిత్తు ధరకు

నను జగజ్జీవనాధార మగు వెలుంగె/యా రవీంద్రుల నొకపేర నతికి చూపె

రవి వగుటన్ భవత్కృతులు రాజీలు విశ్వతమోహర ప్రభన్

దవిలి మహేంద్రు డౌట నమృతమ్ముగు నీ కృతులెల్ల నన్యమా

నవకృతు లిట్టె వెల్లవలెను బ్రతివాడు రవీంద్రు డెట్టులౌ

బవలె రవీశు జూపుటకు బట్టిన కాగడ నా కల మ్మిటన్

పుట్టెనొ పుట్టలేదొ నిను బోలు మహాకవి భారతాంబ కె

ట్టెట్టుల చుక్క రాలిపడెనే యనుకొంటిమి నీ వదృశ్యమై

యిట్టులు నామె యేడ్వ ధర నింకి గతించెడి కంటిధారలో

బుట్టిన నీటి చుక్కవయి పోదు వటంచు దలంప మింతకున్"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.410)

పై పద్య కవితలో రవీంద్రుడు చనిపోయిన విధానాన్ని వస్తువుగా తీసుకున్నాడు.1941 లో కవి రవీంద్రుడు చనిపోయినప్పుడు ఈ స్మృతి గీతాన్ని రచించాడు. విశ్వకవి రవీంద్రుని రచనల ప్రభావం ఈయన మీద చాలా ఉన్నట్లు కనిపిస్తుంది.అతనిపై తమకు గల గౌరవ భావమునకు చిహ్నముగా ఈ కళాఖండమును సృష్టించారు.

4.8. తెలంగాణ భావకవిత్వం–సంఘ సంస్కరణం:

భావకవులు రచించిన సంఘ సంస్కరణ కవిత్వంపై మానవ ఉద్యమ ప్రభావం, గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాల ప్రభావం ప్రసరించిందే. అంతే కాకుండా కాల్పనిక కవిత్వ ప్రభావం కూడా అంతంత మాత్రము కనిపిస్తుంది. రామమోహన రాయలు వంగదేశంలో ఎగురవేసిన మానవ ఉద్యమ ధ్వజాన్ని తెలుగునాట వీరేశలింగం గారు అందుకున్నారు.

రాజారామమోహనరాయల ఉద్యమానికి బ్రహ్మ సమాజం వాహికగా ఉండేది. వీరేశలింగంగారు ఈ సంఘాన్ని ఆంధ్ర దేశంలో స్థాపించి దీని ద్వారా తమ సంస్కరణ కార్యాలు జరిపారు. వీరేశలింగం గారు నడుపుతున్న సంఘ సంస్కరణ మహోద్యమ నిర్వహణలో రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు కుడిభుజమై నిలిచారు. వీరేశలింగం గారు ప్రారంభించిన బాల్య వివాహ ఖండనం, కన్యాశుల్క నిరసనం మున్నగువానితో పాటు ఆ కాలంలో వర్ణవ్యవస్థ నిరసనం కూడ తలెత్తింది. కొంతకాలం తర్వాత సంఘ వ్యవస్థా నిరసనం ప్రారంభమైంది. దీనికి త్రిపురనేని రామస్వామి చౌదరిగారు మూలపురుషులు, ఇవన్నీ మానవ ఉద్యమ లక్షణాలే. మానవ ఉద్యమం రెండవ తరంలో గాంధీయ దృక్పథంగా రూపొందింది. మానవ ఉద్యమంలోని ఈ రెండు శాఖలను దృష్టిలో పెట్టుకొని భావకవితా కాలంలో సంఘ సంస్కరణ కవిత్వం వెలువడింది.

"కొందరు భావ కవులు వితంతు విలాపాన్ని వినిపించారు. కొందరు కన్యాశుల్కాన్ని నిరసించారు. కొందరు దీర్ణవిభేద పిశాచానికి ఎదురు తిరిగారు. కొందరు గాంధీజీ నడిచిన బాటలో కాలు మోపి హరిజన సమస్యను కావ్య వస్తువుగా చేసికొన్నారు. ఇంక కొందరి బాటలోనే విశ్వమానవ ప్రేమము పతాకగా స్వీకరించి ప్రస్థావించారు" **(ఆధునికాంధ్ర కవితా ధోరణులు, ఎం.ఏ. మొదటి సం. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ,2011, పుట.2.7)**

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో వచ్చిన సంఘసంస్కరణ కవిత్వాన్ని అనుసరించి తెలంగాణ భావకవిత్వంలో గల సంఘసంస్కరణ కవిత్వంలోని వస్తు వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

జొన్నలగడ్డ హనుమంతరెడ్డి గారు రచించిన '**హరిజన దీనాలాపములు**' అనే పద్యకావ్యం ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే.

"పుట్టినప్పటినుండి వెట్టిచాకిరిజేయ/ శారీర బలమెల్ల సమసిపోయె

పగలెల్లుగూలిజేసినగాని/ యొక్క పూటకె తిండి చిక్కదాయె

గొడుకు గష్టించియు గొలువుజేసినగాని/ కట్టుటకై గుడ్డ కరవువచ్చె

ఋణదాతలెల్లరు ఋణములు రెట్టించి/ యన్యాయముగుజేల నాచికొనిరి

కటకటాజీవనముజేయ గష్టమయ్యె/ నెవరికేనియుమామీద నెనరులేదు

బ్రతుకుదెఱువును జూపియు భద్రముగను/ దీనులగు మమ్ము బ్రోవవే దేవదేవ."

(తెలంగాణలో బావకవితా వికాసం,పుట.205)

పై పద్య కవితలో హరిజనులు చేయు వెట్టి చాకిరిని కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. గాంధీగారి హరిజన ఉద్యమ ప్రభావంతో కవి ఈ రచన చేసినాడేమో అని అనిపిస్తుంది. కష్టాలప్పుడు దేవ దేవునికి చెప్పుకున్నారు. లాభం లేదని ఇప్పుడు తామే పూనుకున్నారు. కష్టాలను పోగొట్టుకొని బ్రతుకు దెఱువును చూడగలుగుతున్నారు. అని హరిజనుల గూర్చి వర్ణన కలదు.

తిరుమల బుక్క పట్టణం రంగాచార్యులు గారు రచించిన '**వేశ్యా గర్హణము**' అనే మరొక పద్య కావ్యం ఈ కోవలోకే వస్తుంది. దీనిని ప్రస్తావించుకుందాం.

"గవ్వకైననుగాని గతిలేకయుండిన పండుగ దినములు పరిఢవిల్ల

అంగటింటికిబోయి రంగుగా బంకించి దీనతతోనైన దినుసుతెచ్చి

పంచభక్ష్యంబులు పరమాన్నములు చేసి నీకుజూపింపక నీరజాక్ష

నాయకసానికి నైవేద్యమిచ్చిన తలిదండ్రులును స్వర్గతలముజెంది

నటుల హర్షించి యవనిలో విటజనంబు/ తుదకు దారిద్ర్య రోగజవ్యధలు చెంది

బ్రతికి చచ్చియు నరకంభు గాదె/ శీత కాహాన కురుమతి శ్రీనివాస.

వేశ్యతో మాటలే వేదపాఠంబులు వేశ్యయే దైవంబు వేరెలేదు

వేశ్య వేశ్య యటన్న వివిధ పాప హరంబు వేశ్య సంపర్కమే వృద్ధికరము

వేశ్యల పాటలే వీనులకందంబు వేశ్యలు జూచుటే వేడ్కమాకు

వేశ్యలుండినచోట వృషభవాహనుడుండు వేశ్యలుండినచోట విష్ణువుండు

ననుచుమూర్ఖుండు నరకంబు లందుబడిన....."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.101)

పై కవితలో ఒక వేశ్యను కవితా వస్తువుగా తీసుకొని కవి వర్ణిస్తున్నాడు. ఏ విధంగా అంటే తన కడకు వచ్చిన వాణ్ణి వేశ్య ప్రేమించక పోవచ్చు. కాని వేశ్య కడకు వెళ్లిన వానికి ప్రేమ ఉండే వీలుంది కదా. ప్రేమ ఉన్నప్పుడు వేశ్య మాటలే వేద పాఠాలు, వేద వాక్కును పలికిన వేశ్య దేవతగా తోచవచ్చు. వేశ్యల కడకు వెళ్లే వాళ్ల పరిస్థితిని గూర్చి కదా కవి చెప్పింది. ప్రాచీన కావ్యాల్లో నగర వర్ణన చేస్తూ నగరంలో ఏయే జాతుల వాళ్లు ఉండే వారో చెప్తూ, వేశ్యలున్నారన్న విషయాన్ని కూడ

కవులు చెప్పేవాళ్లు. చూడబోతే ఏ కాలంలోనైనా ఏ ప్రాంతంలోనైనా వేశ్యలుండే వారని కవుల రచనల వల్ల తెలుస్తుంది. ఇది 'వేశ్యా గర్హణము' వేశ్య కడకు వెళ్లేవాడు 'తుదకు దారిద్ర్య రోగజ వ్యధలు చెంది, బ్రతికి చచ్చియు నరకాళి భాక్కుగాడె' అని కవి అంటున్నాడు.

తిరువాయిపేట రంగకవిగారు రచించిన '**బాలవితంతువు**' అనే పద్య ఖండిక ఈ శాఖకు చెందినదే. ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే.

"తమ్ముపాలించు నాత్మజులసైగల ప్రేమ కన్న బాలికలపై నున్నటండ్రు

ఆత్మజులాకాంత లైపునర్లగ్నముల్ జేయుటేయొప్పని చేయుచుండ్రు

బాలవితంతువై పసుపు కుంకుమలేక ముంగిటనున్నను ముదమటండ్రు.

మరుపెండ్లితండ్రు లౌమగవారలకెకాని స్త్రీకిలేదనుమాట స్థిరమటండ్రు

ధర్మశాస్త్రప్రమాణము లాచిదోచి/ బాల్యనైవాహములుచేసి భంగపఱచి

విధవలనుజేసి దుష్క్రియా విధమురోసి/ సేలుగానుండ్రు జనకులిక్కాలమునను"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.207)

పై ఖండికలో కూతుళ్లను బాల వితంతులుగా చేస్తున్న విషయాన్ని వస్తువుగా తీసుకొని కవి వర్ణిస్తున్నాడు. కూతుళ్లకు బాల్యవివాహాలు చేస్తున్న తల్లితండ్రులను ఈ కవి విమర్శిస్తున్నాడు. ఆడ పిల్లలకు పెళ్లిల్లు చేసి, పెళ్లి భంగపరిచి విధవలుగా చేస్తున్న తండ్రుల పద్ధతిని విమర్శించటం 1934 ప్రాంతం నాటికే కన్నిస్తుంది. పిల్లలున్న తండ్రులు పునర్వివాహం చేసుకుంటున్నారు. కాని బాల వితంతువులైన కూతుళ్లకు మళ్లీ పెళ్లి చేయటం లేదేమిటి? అన్నది ఈ కవి ప్రశ్న. ఈ విధంగా కవి వర్ణిస్తున్నాడు.

పులిజాల వేంకట రంగారావుగారు రచించిన '**భవ్యమతులార**' అనే పద్యఖండిక ఈ శాఖ పరిధిలోకి వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే.

‘సీ. వీర్యసంపదచేత వెలుగొందవలెనన్న బాల్యవివాహముల్ వదలవలయు

మతభేదములుమాని నుతికెక్కవలెనన్న verriవిశ్వాసముల్ వీడవలయు

భ్రూణహత్యాదులన్ బోద్రోలవలెనన్న విధవలపెండ్లి గావింపవలయు

అనుకూలదాంపత్య మమరంగవలెనన్న వరశుల్కములరోసి ప్రబలవలయు

గీ.బలము తేజంబు వృద్ధిగాపలయుననిన

దురితభోగములందుండి తొలుగవలయు మనము

కావింపదగు ప్రయత్నమనయమిది

ధన్యమతులార భారతవాసులార..

శా. ఈ రాజ్యంబు సమస్తమున్ మనది నేడిద్దానిబాలించునా

రారాజేంద్రుడు నెల్లవారలకు సర్వశ్రేయముల్ గూర్చుచున్

దారిద్ర్యంబడగింప బూనుకొనే మీ త్యాగంబుజూపించి దే

శారాధ్యైకహితంబు సేయుదగు నైజామాంధ్రులారాయికన్.”

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.208)

పై పద్య ఖండికలో బాల్యవివాహాలు,వెర్రివిశ్వాసాలు, వరశుల్కం మొదలైన విషయాలను కవి కవితా వస్తువులుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. బాల్య వివాహాలు,పెట్టి విశ్వాసాలు, వరశుల్కం మొదలైనవి తమ కాలంలో కన్పిస్తున్నాయని కవి అంటున్నాడు.

‘వీర్య సంపద చేత వెలుగొందవలెనన్న బాల్య వివాహముల్ వదలవలయు’ ఇంకా ‘వెర్రి విశ్వాసముల్ వీడవలయు’ ‘విధవల పెండ్లి గావింపవలయు’ అని అంటున్నాడు.

'అనుకూలదాంపత్య మమరంగవలెనన్న వరశుల్కలముల రోసి ప్రబలవలయు' అని చెప్తున్నాడు. చాలా వరకు తగ్గినప్పటికీ బాల్య వివాహాలు కావటం ఇప్పటికీ కనిపిస్తున్నాయి. 'వెర్రి విశ్వాస'మన్నది సరే. తాను నమ్మిందాన్ని తాను 'వెర్రి'దని అనుకొననే లేదు. అది మరొకరికి వెర్రిగా కన్పిస్తుంది. 'ఎవని పిచ్చి వానికి ఆనందము అని అంటుంటారు. వరశుల్కాలు పోవాలి పోవాలి అని ఎవరెంతగా చెప్తున్నా అది మనిషిని వీడి పోవటమే లేదు. వరశుల్కాల వల్ల అనుకూల దాంపత్యం ఉండదంటున్నాడు కవి. అనుకూల దాంపత్యం సంగతి దేవుడెరుగు, వివాహిత స్త్రీలు ఘోరంగా చంపబడుతున్నారు కదా ఈ వరశుల్కాల కారణంగా. అరువయి ఏండ్ల నుంచి కవులు ఎంత చెప్త వస్తున్నా ఏం మారింది, అది దిన దినాభివృద్ధి చెందుతూనే ఉంది. కవులు ఈ విషయాలను ఇట్లా చెప్పటం సమకాలీన పరిస్థితులను తెలియపరుస్తున్నట్టుగా గమనిద్దాం. వరశుల్క చట్టాలున్నప్పటికి ఆశయం నెరవేరటం లేదు. మార్పు విషయంగా మనిషి, ఆహా! ఎంత గట్టివాడు, చెప్పినా మారడు, భయపెట్టినా మారడు, శిక్షించినా మారడు, అని కవి వర్ణిస్తున్నాడు.

గంగా లక్ష్మన్న గారు రచించిన '**మాతృ భాష**' అనే పద్య ఖండిక ఈ కోవలొకే వస్తుంది. ఈ సంధర్భంలో దీనిని ప్రస్తావించదగినదే.

"మనమీరీతిగ మాతృభాషలను సన్మానింపుచున్ వేడ్కమై

మనుపంజాలక మూలుద్రోసిన ఘనంబాయంచు జాత్యేతరుల్

మనమందక్కటికంబు దక్కికడు పెల్చన్ వారలెగ్గాడ నే

మనుజాలంగలనయ్య మానములు పోనైయుండుగా నీయెడన్

ఆంధ్రులేతప్ప నితరు లేరైనగాని/మాతృభాషను గాదని మారుభాష

నభ్యసించి రె భూలోకమందు నెందు/ మానధనులార భాషాభిమానులార.

కరుణాసార పరంపరల్ చిలుకుచున్ గౌతూహలంబప్ప శ్రీ

కరులారా! మతి మీరు నాదరమునకో గల్గించు సొంపారుగా

గరమున్మాతృకయైన యాంధ్రసుకలాకాంతామణిం బ్రోమగా

గరమున్మాతృకయైన యాంధ్రసుకలాకాంతామణిం బ్రోమగా

నరుదా మాతృక కీర్తికై బరుగదే యాచుద్ర తారార్కమన్.

మానసమునందు కడునభిమానముంచి/ మనుపుడీ మీరు దయతోడ నాంధ్రభాష

దాన మీ గౌరవములేమి తగ్గిపోవు/ కులము వెలిగాదు కీర్తియుగోలుపోదు."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.188)

పై పద్య ఖండికలో మాతృ భాష అభిమానాన్ని వస్తువుగా తీసుకొని కవి వర్ణిస్తున్నాడు. ఇంగ్లీషు చదివితే ఉద్యోగాలు దొరికే పరిస్థితి ఆ కాలంలో ఉందనటాన్ని ఈ పద్యం తెలుపుతుంది. కాలం ఇంత గడుస్తూ వస్తున్నప్పటికీ తెలుగు పట్ల ఉండవలసిన గౌరవం ఉండటం లేదు. అంతర్జాతీయ భాష కావటం ఇంగ్లీషు భాష పట్ల అబిమానం, చదువాలనే పట్టుదల విద్యార్థుల్లో పెరుగుతూనే వస్తుంది. పనిమీద ఆఫీసుల్లోకి పోయి. ఇంగ్లీషులో మాట్లాడితేనే విలువ ఇవ్వబడుతుంది.తెలుగు మాట్లాడినవాడు తేలికగా చూడబడుతున్నాడు. మాతృభాషయైన తెలుగును కాదంటున్న మొదటి కాలాన్ని చూస్తున్న కవి తెలుగు పట్ల గౌరవం కలిగి ఉండడయ్యా అంటున్నాడు.ఇంగ్లీషు చదువటం వల్ల ఉద్యోగాలు పొందగలుగుతామన్న ప్రయోజనము ఒకటి కనిపిస్తుంటే తెలుగును కాదన కండయ్యా అంటే ఎవరైన వింటారా? ఎవరో వింటారని ఈ కవి చెబుతున్నట్లుగా మనకు కనిపిస్తుంది. ప్రజల్లో ఆంగ్ల భాష పట్ల అభిమానం పెరుగుతుందనటానికి ఈ కవిత నిదర్శనం మాతృ భాషా అభిమానాన్ని కవులు ప్రచారం చేస్తున్నారు అనటానికి గుర్తుగా ఈ కవితను చెప్పవచ్చు.

గవ్వాజానకి రామరెడ్డి గారు రచించిన '**పారతంత్ర్యము**'అనే పద్య ఖండిక ఈ శాఖ పరిధిలోకి వస్తుంది. ఈ సంధర్భంలో ఇది ప్రస్తావించదగినదే.

"మ. ధర స్వాతంత్ర్యమె స్వర్గతుల్యమను తత్త్వజ్ఞాన లేశంబు లో

నరయన్ జాలని మందబుద్ధులిటు లాహా! మాదృశుల్ విత్తలో

భరతిన్ తుచ్ఛసుఖానురక్తి నిజ యావచ్ఛక్తులున్ రిత్త వో

బరతంత్రంబున బద్ధులౌదు రిదియే ప్రారబ్ధ కర్మంబకో.

స్వర్గమ్మునకుమించు సమ్మోదమొనరించు జన్మభూమిని బరస్థలముచేసి

కనిపెంచి కఱపిన జననీ జనకుల శు శ్రూషా పరత్వంబు నున్న చేసి

పిన్న నాటనుగోలె ప్రీతి బోషించిన పోషకావళిమేలు బూదిచేసి

తమశుభాశుభములన్మమతు బాల్గనునట్టి బంధుసంతతి జూడు బ్రాలుమాలి

గీ. నిజ సహోదరబృందమ్ము నెచ్చెలులను/ నతి నుతాదులవిడిచి దుశ్శాంతిగంది

ఐహికామష్మిక సుఖంబులందుజెడుచు/ దుర్విధిం జెందుచుందు రుద్యోగవశత.

మ. వ్యవసాయంబుననో వణిక్సరణి నేవ్యాపారమందో స్వశ

క్తి వశంబౌ మఱియేక్రియాకళలనో! ధీపారగుండై దృఢా

ధ్వవసాయాత్మక వృత్తిబూని విలసద్ధర్మార్థ కాముండునై

యవనిన్ జీవితకాలయాత్ర నడుపన్న్యాయ్యంబు మోక్షారికిన్"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.204)

పై ఖండికలో కవి తల్లిదండ్రులను వదిలేసి ఉద్యోగాలు చేసేవారిని కవితా వస్తువులుగా తీసుకొని వర్ణిస్తున్నాడు. చదువుకోవటానికే చదువుకుంటే మంచిదే, కాని కనిపెంచిన తల్లి దండ్రులకు, భూమికి దూరంగా ఎక్కడో ఉద్యోగాలు చేయటం కొందరికి నచ్చదు. ఉద్యోగమంటే కింద పనిచేయటమే కదా. ఒకరి కింద పనిచేస్తున్నామంటే స్వాతంత్ర్యం కోల్పోవటమే ఈ విధమైన 'పారతంత్ర్యము' వద్దంటున్నాడు కవి.

ఆత్మకూరు అంజనిదాసు గారు రచించిన '**హితబోధ**' అనే పద్య ఖండిక ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంలో ప్రస్తావించదగినదే.

"గీ.వలదురా కల్లు సార నీ తెలివిఁ జెఱచు

నూడఁబై బట్ట తైతక్క లాడజేయు

సిగ్గు విడగొట్టుఁ బట్టించు సిగలు సిగలు

సకల పాపంబులకు నిల్లు సార కల్లు.

గీ.కల్లు భంగు సారాయిచే నిల్లు గుల్ల

గా బికారులై చెడెడి మూర్ఖత్వ మేల.....

నీచ దుర్వ్యసనంబుల న్వీడి సకల

భూతదయఁగల్గి వర్తింప నీతియగును.

గీ.చాలుచాలు వాదన గురులీలఁ దెలియ

కేల వాగెను ధనమద మేలఁజూప

తను బలములకు గర్వింపఁ దగదుసాధు

జనుల దూషింపఁబ్రోకు నాశనముగల్గు"

(గోలకొండ కవుల సంచిక,పుట.141)

పై ఖండికలో కవి తమ కాలంలో ఉన్న రక రకాల సామాజిక రుగ్మతలను వస్తువుగా తీసుకొని కవి వర్ణిస్తున్నాడు. కల్లు సారా వల్ల ఇల్లు గుల్ల చేసికొనే వారిని గురించి పై ఖండికలో కవి చెప్తున్నాడు. తనను తాను మరచిపోయేంత వరకు తాగితే కట్టుకున్న బట్టలు ఊడిపోయేది ఏం తెలుస్తుంది? బట్టలే ఊడిపోతే సిగ్గు మాత్రం పోకుండా ఉంటుందా ? అంతగా తాగితే ఇల్లు గుల్ల కాక

ఏమవుతుంది. అప్పుడు అతడు బికారి కాక ఏమౌతాడు, అని ఆనాటి సామాజిక రుగ్మతలను కవి వర్ణిస్తున్నాడు.

పట్టెము నరహరి కవి గారు రచించిన **'యువకులారా'** అనే పద్య ఖండిక ఈ కోవలోకే వస్తుంది. ఈ సంధర్భంగా దీనిని ప్రస్తావించుకుందాం.

"సీ.చాళుక్య రాజుల శాసనాంగమ్ములు

భూగర్భమున నింకి పోవుచుండె

జీర్ణావశిష్టముల్ జినదేవళంబులు

పూర్వ చిహ్నములఁ గోల్పోవుచుండె

ప్రాచీన సత్కావ్య పటలంబు లాంధ్రుల

యిండ్లలోపల నంతరించుచుండె

పూర్వ చరిత్రాంశముల నుద్ధరింపగా

దేశీయు లెవరు యత్నింపరైరి

గీ. మాతృ భాషాభిమాన సంపన్నులైన

నాయకులు మార్గ దర్శులై నడువరైరి

యువకమణులార మీరిక మారకున్న

రాదు కీర్తింత నైజాము రాజ్యమునకు"

(గోలకొండ కవుల సంచిక,పుట.297)

పై ఖండికలో మాతృభాష అభిమానాన్ని వస్తువుగా తీసుకొని కవి వర్ణిస్తున్నాడు. మాతృభాష అభిమానాన్ని యువకులు పెంచుకొని పూనుకోకపోతే తెలుగు భాషా వైభవం అంతరించిపోవచ్చును

అన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నాడు పట్టెము నరహరి కవి. అదే విధంగా భాష అభిమానులు చేయవలసిన పనులు ఏమేం ఉన్నాయో చెప్పినాడు. తాను ఉద్ధరించు కోవలసిందే తప్ప తనను ఎవడో వచ్చి ఉద్ధరించడు. మాతృ భాషను సముద్ధరించటానికి దేశీయులే కదా పూనుకోవలసింది. చేతనైనంతలో ఏదో చేస్తుండాలి. ఇదిగో ఈ సురవరం ప్రతాపరెడ్డి గారు ఈ ప్రయత్నమంటూ చేయకపోతే ఇంత మంది కవుల కవితలు మనకు దొరికి ఉండేవి కాదు. నాటి సాంఘిక స్థితిగతులను ఇట్లా తెలుసుకొనే వీలు చిక్కేది కాదు.ఆ ప్రయత్నం ఎందరు భాషాభిమానులకు స్ఫూర్తి నిచ్చిందో అని కవి వర్ణిస్తున్నాడు.

కె. సీతాపిరాట్టమ్మగారు రచించిన **'కలిరాజు'** అనే పద్య ఖండిక సంఘసంస్కరణ కవితా శాఖకు చెందినది. ఇందులో గల వస్తువును పరిశీలిద్దాం.

"సీ. యజ్ఞయాగాది నిత్యాగ్ని హోత్రములెల్ల జుట్టబీడీలలో జుట్టుబడియె

వేదపురాణముల్ విపరీతములటంచు నందఱిభావంబు లమరియుండె

భక్తి విజ్ఞానముల్ పరిపూర్ణమై తలన్ గ్రాపురూపంబుతో గ్రాలుచుండె

నేయింటిపైజూడ వింగ్లీషు భాషలో బేర్లనుజెక్కించి పెద్దలైరి

గీ. యాడువారలు మగవారలందఱిల్ల/ నొక్కసీమంతమునైక్య మొందిరిపుడు.

సెప్పగా లేము నీయొక్క గొప్పదనము/ లౌర! కలిరాజ నీ మహిమాద్భుతంబు"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.210)

పై ఖండికలో రచయిత్రి బ్రహ్మణులకి సంభందించిన విషయాలను కవితా వస్తువుగా తీసుకున్నారు. యజ్ఞయాగాది నిత్యాగ్ని హోత్రములు లేకపోవటము అన్నది బ్రాహ్మణులకు సంభందించిన విషయంగానే కనిపిస్తుంది.పై ఖండికలో గల విషయాలన్నీ ఇదివరకు ఉన్నాయి ఇప్పుడు లేవన్న కవయిత్రి మాటలు 1934 నాటి సామాజిక స్థితిని తెలిపే విషయాలు అని స్పష్టంగా తెలుస్తుంది. ఇవి కలిరాజు మహిమగా రచయిత్రి చమత్కరిస్తుంది

పులిగోటి ఆనందమాంబగారు రచించిన **'స్త్రీ విద్య'** అనే పద్య ఖండిక ఈ శాఖ పరిధి లోకి వస్తుంది. ఈ సంధర్భంగా దీనిని ప్రస్తావించదగినదే.

"విద్యయన్నను స్త్రీలకు వెగటుగల్ల

వనితలజ్ఞానులనుచును వాడుకొనుట

యబ్బురంబేమి దీపంబునవలంద్రోయ

నున్న యింటిలో జీకటి యుండకున్నె

కాంతలు మాతృభాషపయి గౌరవముంచకనవ్యభాషన

శ్రాంతమునేర్చినంతటను సారములేదికగొప్పయైన శ్రీ

మంతముగల్గియున్నదని మంగళసూత్రముబారవైచియ

త్యంత సుభూషణంబులను దాల్చినరీతిని యెంచి చూడగన్"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.68)

పై పద్య ఖండికలో రచయిత్రి విద్యను కవితా వస్తువుగా తీసుకొని వర్ణిస్తున్నారు. ఏ విధంగా అంటే హిరణ్యకశిపుడు తన కొడుకు ప్రహ్లాదునితో చెప్పిన మాట. చదువని వాణ్ణి అజ్ఞానుడు అంటుంది ఈ లోకం. సద సద్వివేకాన్ని కలిగించేదే చదువు. చదువుకున్న వాళ్ళల్లో ఆనాడు మొగవాళ్లే ఎక్కువ, ఆడవాళ్ళకు చదువెందుకు? అనే తల్లి తండ్రులున్న కాలంలో ఆడవాళ్ళు చదువుకున్నవాళ్లు కాదు. చదువుకోకుండ చేస్తారు, చదువురాదని వెక్కిరించి వెక్కిరిస్తారు. 'వనిత లజ్ఞాను' లని అంటుంటారు. ఈ విషయాన్ని గ్రహించిన పులిగోట ఆనందమాంబ ఆడవాళ్లు చదువుకోవాలని చెబుతుంది. ఈ విధమైన ప్రబోధం చేయగల్గడం ఆడవాళ్లలో ఒక చైతన్యాన్ని తీసుకొని రావాలన్న ఒక మంచి ఆశయం, పట్టుదల, తపన ఈ కవయిత్రిలో కన్పిస్తుంది. చదువు వచ్చిన వారుంటే ఇంట్లో దీపమున్నట్లే. దీపముంటే చీకటి ఉండదు కదా.

సాటి స్త్రీలు చదువుకోవాలన్న తపన ఉన్న స్త్రీలు ఆ కాలంలో కూడా ఉన్నారు అనటానికి నిదర్శనం. సంపన్న కుటుంబ స్త్రీలు మాతృభాషయైన తెలుగును కాదని ఇంగ్లీషు చదువుప వ్యామోహం చూపుతున్న వాళ్లు అప్పుడున్నారని ఈ కవయిత్రే చెబుతుంది. ఇతర రత్నాభరణాలు విలువ కలవి కావచ్చు కాని, గౌరవం మాత్రం మంగళసూత్రం మీదనే. తెలుగును కాదని ఇంగ్లీషు వెంటబడితే శ్రీమంతము ఉన్నదని స్త్రీలు మంగళ సూత్రాన్ని తీసేసి రత్న అభరణాలు దాల్చినట్లు అని రచయిత్రి అంటున్నారు.

జ్ఞానమాంబగారు రాసిన పద్య కవిత పేరు **'సూర్యనారాయణ స్తోత్రము'** ఇది భక్తి కవిత్వ శాఖ కోవలోకే వస్తుంది. దీనిని ఈ సంధర్భంలో ప్రస్తావించుకుందాం.

"శా.స్వామీ ! నీ పద పంకజ ద్వయమె సంభావించి సేవింతు, నీ

నామం బొక్కడు దక్క నే యితరమౌ నామంబు నా బుద్ధిలో

బ్రేమింపన్ వినవొల్ల, బల్క దలపన్, వీక్షింతు నీ రూపము

ద్దామావ్యాజకృపన్ ననున్ దనుపు నాథా! సూర్యనారాయణా !

మ.హృదయేశుండ వుపాస్యదేవుతవు నీవే కాని వేరేమి లే

దిది నిక్కంబు మదీయమానసము నీకే యర్పణంబయ్యె నా

యెదలో దప్ప మరేడ దాచేదను నే నేయ ర్థ మక గాని త్వ

త్పద పంకేజములే శరణ్యమగు నాథా సూర్యనారాయణా

శా.నాకుం దావక దర్శనంబె సుదినానందంబు జేకూర్చు నీ

వే కన్పట్టక యున్న దుర్దిన మగున్, వేదంబులున్ శాస్త్రముల్

నీకున్ మ్రొక్కుటయే విశేష మనియెన్, నిన్నెంతు, నిన్గల్తు, మ

లోకాప్తుండవు నీవ, నీ కొలువె చాలున్ సూర్యనారాయణా.....”

(గోల్కొండ కవుల సంచిక,పుట.46)

పై పద్య ఖండికలో రచయిత్రి చనిపోయిన తన భర్తను వస్తువుగా తీసుకొని వర్ణిస్తుంది.‘నా భర్త పేరు సూర్యనారాయణుడు అగుట చేతను, నా యుపాస్య దేవత సూర్యనారాయణుడు అగుట చేతను వీరి యందు నాకు గల ప్రేమ చేతను ‘ద్వ్యర్థి’గా సూర్యనారాయణా అనే మకుటముచే రాసితిని.

నిన్ను పద్యాలతో పాటలతో కృతులతో నిజమైన భక్తితో వినుతి చేస్తాను. మానినినైన నన్ను నీ కరములతో నీ హృద్వీధిని చేర్చుకొని దయతో చూచి పోషించు. నా తనువు ప్రాణం నీకే అర్పితము చేస్తాను అని అంటుంది. ఎవరైనా సరే దేవుణ్ణి కొలిచేది ప్రతిఫలము ఆశించే. ‘నిన్ను నుతిస్తాను, నన్ను పోషించుము అని అంటుంది ఈ భక్తురాలు, ‘చూచి పోషింపుము’అన్న పదాలు విను. చూచేవాడు సూర్యుడు,వెలుగిచ్చేవాడు అలాగే పోషించేవాడు సూర్యనారాయణ నామధేయుడైన భర్త.

ఇంకా అంటుంది ‘హృదయేశుడు’ భర్త. ఉపాస్య దేవత సూర్యుడు. సూర్యనారాయణ స్వామి పేరే భర్త పేరు కావటం వల్ల ఏ పదం ఎవరికి మార్చుకున్నా నష్టం లేదు.

నిన్ను జూస్తేనే నా కళ్ల చీకట్లు పోయి ‘శుభౌన్నత్యంబగు దారి’ తోస్తుందని అంటుంది. ‘దారి’కి కవయిత్రి వేసిన విశేషణం చూస్తే శుభ్రము, ఔన్నత్యము. రెండు. శుభ్రమంటే తెలుపు కదా, సూర్యుని ప్రకాశం తెల్లనిది. ఈ శుభ్రం సూర్యునికి. ఔన్నత్యం భర్త కోసం వాడిన విశేషణం. చివరి పద్యంలో ఇంకా ఇలా అంటుంది.

మబ్బు వట్టి పొద్దు కన్పించకపోతే, ‘దుర్దిన’ మంటారు. తన భర్త తన కళ్ల ముందు లేకపోతే తనకు అంతేనట. భర్తకు, ఉపాస్య దైవాన్ని కలిపి చెప్పిన ఈ విధానం ఒక ప్రత్యేకంగా ఉంది. ‘పతియే ప్రత్యక్ష దైవము’అన్న భావాన్ని కవయిత్రి ఇట్లా కవిత్వీకరించినట్లు ఉంది.

*** * ******

అధ్యాయం- 5

తెలంగాణలో భావకవిత్వం - శిల్పం, భాష

ఐదవ అధ్యాయం

తెలంగాణలో భావకవిత్వం – శిల్పం, భాష

5.0. పరిచయం:

ఆధునిక కాలంలో వస్తువుకు ఎంత ప్రాధాన్యముందో శిల్పానికి కూడా అంతే ప్రాముఖ్యముంది. సాహిత్యంలో ఏ ప్రక్రియలోనైనా వస్తు శిల్పాలు ఉంటాయి. కవి చెప్పదలుచుకున్న విషయం వస్తువు అయితే, చెప్పే విధానం శిల్పం అవుతుంది. "'టెక్నిక్' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా 'శిల్పం'అనే పదాన్ని వాడుతున్నాం. 'రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని 'వస్తువు'గా చెప్పవచ్చు. ఆ వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని ***'శిల్పం'*** అంటారు''అని ప్రముఖ సాహిత్య విమర్శకులు త్రిపురనేని మధుసూదనరావు పేర్కొన్నారు"**(సాహిత్యంలో వస్తు శిల్పాలు, త్రిపురనేని మధుసూదనరావు,2011, పుట. 13.)**

శిల్పం వస్తువును దాచి ఉంచకుండా సులభంగా పాఠకునికి వివరించేదిగా ఉండాలి. మారుతున్న సమాజానికి అనుగుణంగా వస్తువు మారుతుంది. అదే క్రమంగా వస్తువును ఆనుసరించి ఉన్న శిల్పం కూడా మారుతుంది.

ఒక ఇంటి నిర్మాణాన్ని చేపట్టినపుడు సిమెంట్, ఇటుక, ఇసుక వంటి వాటి అవసరం ఉంటుంది. వాటిని తగిన పాళ్ళలో వినియోగించినపుడే చక్కటి నిర్మాణం రూపుదిద్దుకుంటుంది. అలాగే కవిత్వ నిర్మాణానికి కొన్ని శిల్పాంగాల అవసరం ఉంటుంది. వాటి నిర్వహణ సమర్థవంతంగా జరిగినపుడు మాత్రమే కవిత్వం తన అస్తిత్వాన్ని పొందుతుంది.

5.1. కవితా శిల్పం :

"కవితాశిల్పం కేవలం వస్తువు/శీర్షిక/అభివ్యక్తి భాషలపై మాత్రమే ఆధారపడి ఉండదు. వీటన్నిటి సంయోజనం వల్ల 'శిల్పం'కవితలో ఏర్పడుతుంది. వస్తువును వ్యక్తీకరించే విధానం శిల్పం.

శిల్పాన్ని 'Technique' అని భావిస్తారు. కొంచెం వ్యత్యాసంతో శిల్పాన్ని రూపం (Form) అనీ నిర్మాణం (Stucture) అనీ సంవిధానమని పిలుస్తుంటారు.'వస్తువును' కవితలో కవి చేస్తున్న ప్రయత్నం శిల్పమనీ, నిర్మాణమనీ, సంవిధానమనీ చెప్పవచ్చు. అదేవిధంగా కవి యొక్క రచనా విధానాన్ని శిల్పమని, వస్తువుకు ఎన్నుకున్న మూసను రూపమనీ, రూపానికి తగిన శబ్దాలు, వాక్యం, లయ, నిర్మాణమని అభిప్రాయపడవచ్చు.

ప్రాచీన కావ్యాలలో కవితలలో శిల్పం ఇతివృత్త సంబంధమైనదైతే ఆధునిక కవిత్వంలో భావ నిర్వహణ సంబంధమైంది. విశ్వనాథ సత్యనారాయణ శిల్పానికి రెండు లక్షణాలను చెబుతూ "ఒకటి ఏక వాక్యత, రెండు బహ్వర్థములు ఏకత్ర సమావేశ పరచి పఠిత యొక్క మనస్సును భావనామయం చేసి ఉత్పథము నందు సంచరింప చేయుట" (**అల్లసాని వాని అల్లిక జిగిబిగి. విశ్వనాథ సత్యనారాయణ ,2007 .పుట.5**). ఇది ప్రాచీన కావ్య రచన సందర్భంలో ప్రస్తావించినా కవితా శిల్పం విషయంలో సార్వకాలిక మైనది. కవిత అంతా ఒక ఉద్దేశ్యాన్ని, దృక్పథాన్ని భావాన్ని వ్యక్తం చేయాలి. అదే ఏక వాక్యత. కవితలో చెప్పబడిన భిన్న భిన్న దృశ్యాలు, సంఘటనలు పోలికలు ఇస్తున్న భిన్న అర్థాలు ఒక దగ్గరికి సంయోజించ బడాలి. అది శిల్పం.

కవి తానెన్నుకున్న వస్తువుకు ఎటువంటి అలంకారాలను, ప్రతీకలను. శీర్షికను, భాషను, వాక్య లయను ఎన్నుకున్నడన్నా విషయాలన్నీ శిల్పంలో భాగమే అవుతాయి. శిల్పం ఒక రకంగా కవితా నిర్మాణ వ్యూహం వస్తువు, రూపం, అన్న వరుసలో ఈ వ్యూహం ఉంటుంది. వస్తువు కవి దృక్పథమైతే రూప నిర్మాణాల ప్రక్రియ పరమైనవైతే వీటన్నిటిని సంయోజించడం ఒక సంవిధానంలోకి తేవడం శిల్పం. అందుకే శ్రీశ్రీ "సంవిధానము వ్యాకరణ ఛందస్సులే గాక తదధీతమైన ఒక విపుల వ్యవస్థ, కవి తనలో అంతర్లీనమైన రసాన్ని బహిర్గతము చేయగలుగుతున్న కార్యమే సంవిధానం" (**శ్రీ శ్రీ , మన గురజాడ, ముత్యాలసరం ఒక కృషి ,2000,పుట.228**)

కవి తన కవితావస్తువును పాఠకునిలోకి పంపించడం, తాను పొందిన అనుభవాన్ని, ఉద్వేగాన్ని, వేదనను అనుభూతిగా మార్చుకుని పాఠకుడిలో అదే అనుభూతిని బహిర్గతం చేయడానికి

చేసే ప్రయత్నం 'శిల్పం'. అందువల్ల కవితలోని వివిధాంశాలన్నీ ఎట్లా సమన్వయించబడ్డాయి, ఎట్లా వ్యక్తమై పాఠకునిలో అభివృక్ష శిల్పానికి పరమావధి. దాన్ని కవి అభ్యాసం ద్వారా సాధించాలి.

కావ్యంలో శిల్పమన్నది కేవలం సౌష్టవంతో గాని, అంగాంగీ భావాన్ని సాధించడంతో కాని సువిభక్త అంగ సంస్థితితో కాని అగిపోయేది కాదు. ఒక శిల్పానికి జీవాన్ని తెచ్చేది ఆ శిల్పి పనితనం అతని చేతిలోని మార్దవం తాను చెప్పినట్లుగా రాయి తన మాటను వినడం, తాను మలచిన రీతికి రాయి ఒదగడం.. మహా శిల్పిచే నిర్వహింపబడిన కావ్యం కూడా అంతే. ఆ కవి పనితనం ఎక్కడ గోచరిస్తే అక్కడ శిల్పం ఉన్నదని మనమనుకోవాలి.

కవి కవితను నిర్వహించిన రీతి అక్కడ చూపిన పనితనం కవితలో చూపిన నైపుణ్యం 'శిల్పం' అవుతుందని పాఠకుడిని గాఢమైన భావనలోకి తీసుకెళ్ళడం దాని ప్రయోజనమని తెలుస్తుంది. భావాన్ని కవిత్వం చేసే తీరును 'చేరా' వ్యూహం అంటే 'జి.లక్ష్మీనరసయ్య'నిర్మాణం అన్నారు. అయితే చేరా భాష దృష్టితో అన్నారన్నది గమనించాల్సిన విషయం.**(శివారెడ్డి, ఎల్లూరి, వచన కవిత్వం వస్తు శిల్పాలు, 2020,పుట.134–135)**

5.1.1. శిల్పం–లక్షణాలు:

'శిల్పం' విషయంలో కవులూ, విమర్శకులూ ఎన్నో నిర్వచనాలను చేశారు. 'శిల్పం'ను ఆంగ్లంలోని 'Technique' అనే పదానికి సమానార్థంలో వాడుతున్నాం. 'వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని 'శిల్పం' అంటారు. ప్రక్రియ, భావ ప్రతిమలు, భాష శిల్పంలో ముఖ్యమైన అంగాలు. ఈ మూడు అంశాల్ని కలిపే 'శిల్పం' అంటారు.

'వస్తువుని నలుగురు నాలుగు విధాల దర్శించవచ్చు. దర్శనంలో ఇలా భిన్నత్వం ఉండడం వల్ల వస్తువూ, శిల్పమూ అనే విచక్షణ కలుగుతోంది. ఇది భ్రమ. వస్తువుకి ఆకృతి లేదు. రచయిత దర్శనమే వస్తువుకి ఆకృతి కల్పిస్తుంది. అన్నీ భిన్నమైన నిర్వచనాలే. వీటిని అన్నింటిని విశ్లేషిస్తే శిల్పానికుండే లక్షణాలు అవగతమవుతాయి.

లక్షణాలు :

"1. కవి సృజనశీలతలోగల గొప్పతనాన్ని బట్టి అభివ్యక్తం కావటం.

2 శిల్పాన్ని 'కళ' అని కూడా వ్యవహరించడం.

3. వస్తువు, రూపం సరైన రీతిలో అభివ్యక్తం అయ్యేటప్పుడు దానిలో ఏదో ఒక శిల్ప పద్ధతి తప్పకుండా ఉండడం.

4. శిల్పంలో భాష, అలంకారాలు, శైలీ, సంవిధానాలు ఇమిడిపోతాయి. కొన్నిసార్లు వాటి ద్వారా కూడా 'శిల్పం' శోభిస్తుంది.

5. కవితలోని వస్తువు, రూపం ఎన్నుకోవటాన్ని బట్టి కూడా శిల్పం ఆధారపడుతుంది. సరైన 'శిల్పాన్ని' ఎన్నుకుంటే ఔచిత్యవంతంగా పాఠకునికి చేరి, కవి ప్రయోజనం నెరవేరటంలో సహకరించటం.

6. వస్తువు, రూపాలపైనే 'శిల్పం' ఆధారపడుతుంది. అవి శిల్పంపై ఆధారపడే సందర్భాలు కూడా కనిపిస్తుంటాయి" **(శరత్ జ్యోత్స్నారాణి, ఎస్, స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం, 2003, పుట.27–28)**

కవిత్వంలో వస్తువు రూపం, శిల్పాలలో ఏది ప్రధానమనే విషయంలో వస్తువే. ప్రధానమనేవాళ్లూ, శిల్పమే ప్రధానమనేవాళ్లూ, సమన్వయవాదులూ కనిపిస్తున్నారు. ఒక రచన వెలువడడానికి ప్రధానంగా కావాల్సింది వస్తువే కాబట్టి, వస్తువు లేనిదే కళ లేదని కొంతమంది వాదించగా, లోకంలో ఎన్నో వస్తువులు ఉన్నప్పటికీ, ఏదో ఒక శిల్పం చేతనే దానికొక అస్తిత్వం కలుగుతుంది అని కొందరు వాదించారు. కనుక ఏమి చెప్పామనే దానికంటే, ఎలా చెప్పామనే దాన్ని బట్టే దాని విలువ పెరుగుతుంది. అప్పుడు 'శిల్పపు ప్రధానమని తెలుస్తుంది'అని వాదించే వారూ ఉన్నారు. ఈ వాదనలను బట్టే సాహిత్యంలో 'కళ కళ కోసమే', 'కళ ప్రజల కోసమే' అనే నినాదాలు

బయలుదేరాయి. 'కళ కోసమే' అనే వారు శిల్పవాదులు. ప్రాచీన సాహిత్య పరిభాషలో చెప్తే వీరిని 'రీతి వాదులు' అనవచ్చు.

కళ ప్రజలకు ఉపయోగపడాలనే సిద్ధాంతం మన సాహిత్యంలో మార్క్సిస్ట్ భావజాలం ప్రవేశించిన తర్వాత బయలుదేంది. అప్పటికే మన సాహిత్యంలో 'కళ ప్రజల కోసమే ఉన్నప్పటికీ, సామాజికంగా ఉన్నత స్థితిలో ఉన్న కొంతమంది ఆనందం కోబ ఎక్కువగా ఉపయోగపడిందనీ, దాని ఆంతరిక నిర్మాణంలో భాగంగానే 'ఉపదేశం'గా పనిచేసిందని అన్నారు. ఆర్థిక పరిస్థితుల్ని, ఉత్పత్తి శక్తుల్ని నిర్లక్ష్యం చేసి, కళలను సౌందర్యోపాసనకు వినియోగించుకున్నారని భావించేవారున్నారు. దీనితో సాహిత్యంలో వస్తువు, రూపం, శిల్పం మొదలైన విషయాల్లో సాహిత్యవేత్తల్లో ఒక ఆలోచనకు దారితీసిం ఈ నేపథ్యంతోనే ఈ అధ్యయనం కూడా కొనసాగుతుంది. మన సాహిత్యంలో వీటికి దేనికి ఎక్కువ ప్రాధాన్యమివ్వబడిందీ, ఇస్తే ఎందుకివ్వబడిందీ, దాని చారిత్రక పరిస్థితిన తర్వాత వచ్చిన మార్పులు అన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయమైన విల్లె చేయటం జరుగుతుంది. ఇలా అధ్యయనం చేసేటప్పుడు వస్తువు, రూపం, శిల్పాలకు ప్రాతినిధ్యం వహించే కొన్ని కవితలను, కొంతమంది కవులనే పరిశీలించి సాధ్యమవుతుంది.

20వ శతాబ్దం ప్రారంభంలో తొలిసారిగా తెలుగు సాహిత్యంలో సంప్రదాయ ప్రబంధ కవితా ధోరనిపై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం భావకవిత్వం. ప్రణయం,ప్రకృతి,దేశభక్తి,భక్తి ,స్మృతి,సంఘసంస్కరణం అనే లక్షణాలను కలిగి రూపంలో,శిల్పంలో అద్భుతమయిన పోకడలు పోయింది. ఈ లక్షణాలను అనుసరించి భావమును మాత్రమే ప్రధానముగ ఆశ్రయించి రాసే కవిత్వాన్ని భావకవిత్వం అనవచ్చు. భావము యొక్క కవితా స్వభావాన్ని భావకవిత్వం అని చెప్పవచ్చు.

శిల్పంలో అనేక అంగాలుంటాయి. కవి స్వీకరించిన వస్తువుననుసరించి ఈ శిల్పాంగాల ఉనికి స్థిరపడుతుంది. వాటిలో ముఖ్యమైన వాటిని కింద ప్రస్తావించుకుంటున్నాం. ఆ శిల్పాంగాల ద్వారా భావకవిత్వ నిర్మాణాన్ని పరిశీలిద్దాం.

5.2. శిల్పాంగాలు:

శిల్పం – దీనికి కల్పనలోని వైచిత్రి అని అర్థం చెప్పవచ్చు. ఈ 'వైచిత్రి' అనేది చూసే కంటికి అనుభూతికి రావాలి. అప్పుడే చూడబడే వస్తువు 'రమణీయంగా' కనిపించి, హాయిని కలుగజేస్తుంది. ఉదాహరణకి, ఒక బండరాతిని చూసినపుడు చలించని మనస్సు, అదే బండరాతిని అన్ని వైపులా ఉలితో ఒలిచి అందమైన స్త్రీగా చెక్కినప్పుడు ఒక పొంగుకి లోనవుతుంది. ఆ బండరాయి పెద్దగా, అండాకారంలో ఉన్నప్పుడూ, అలాగే స్త్రీగా మారినప్పుడూ కూడా ఆ వస్తువులోని తత్వం కానీ స్త్రీరూపంగా మారిన రాతిలోని ఆ ఒంపులూ, నున్నతనాలూ, ఎత్తులూ, లోతులూ, హొయలూ వయ్యారాలూ, చూపరి మనసుకి హత్తుకుంటాయి. అప్పు నిరాకారమైన ఒక ఆనందం అనుభవానికి వస్తుంది. ఈ ఆనందం జనించడానికి తోడ్పడిన వస్తువులే శిల్పంగాలు. ఈ శిల్పంగాల గురించి ప్రస్తావించుకుందాం.

5.2.1. శీర్షికలు:

వచన కవిత్వ నిర్మాణంలో ఒకానొక ప్రధాన అంగం శీర్షిక. మనిషి శరీరంలో శిరస్సుకు ఎంత ప్రాధాన్యముందో సాహిత్యంలో శీర్షికకు కూడా అంతే ప్రాధాన్యముంది.

శీర్షిక ప్రధానంగా పాఠకుడిని ఆకర్షించేదిగా ఉండాలి. చక్కటి అభివ్యక్తితో వస్తువును పాఠకుడి ముందు పరిచి, దానికి తగ్గట్టుగా శీర్షికను పెడితే అది గొప్ప కవితగా రూపు దిద్దుకుంటుంది. వార్తా పత్రికలను గమనించినట్లయితే చాలా మంది పాఠకులు కేవలం శీర్షికలను మాత్రమే చూస్తూ పోతారు. శీర్షికలో వైవిధ్యం, వినూతనత్వం కనిపిస్తే పాఠకుడు విషయం తెలుసుకోవడానికి ఆసక్తిని కనబరుస్తాడు. ముఖ్యంగా వచన కవిత్వంలో కవితా వస్తువు, దాన్ని నడిపే తీరు, సంవిధానం ఒక ఎత్తు అయితే; గొప్పగా మలిచిన ఆ కవిత్వ సారాన్ని పాఠకుడికి అందించే శీర్షికను పెట్టడం మరో ఎత్తు. కవిత్వ నిర్మాణ శిల్పంలో శీర్షికను నిర్ణయించడం అత్యంత ప్రాధాన్యత గల ఒక విషయంగా చెప్పవచ్చు.

భావకవిత్వంతో మొదలు అభ్యుదయ, దిగంబర, విప్లవ వాదాలు; స్త్రీవాద, దళితవాద, బి.సి.వాద, మైనారిటీవాదాలు: ప్రాంతీయ అస్తిత్వ వాదం, ప్రపంచీకరణ ప్రతిఫలనం మొదలైన అనేక రకాల కవితా ఉద్యమాల వల్ల కవుల వస్తు స్వీకరణలో వైవిధ్యం పెరిగింది. విపరీతమైన కవితా సృష్టి కూడా జరిగింది. నేటి ప్రపంచీకరణ యుగంలో పాఠకుడు అనేక రకాల వ్యాపకాలతో తీరికలేని జీవితాన్ని గడుపుతున్నాడు. ఇలాంటి సందర్భంలో కవితా సంపుటినో, కవితా సంకలనాన్నో తీసుకుని పేజీలు తిప్పుకుంటూ పోతూ ఉన్నవేళ, మంచి శీర్షిక పాఠకుణ్ణి ఆపే ప్రయత్నం చేస్తుంది. ఆ విధంగా పాఠకుణ్ణి అక్కడ ఆపడం కవి శీర్షిక ద్వారా చేసిన శిల్ప నైపుణ్యంలో భాగంగా చెప్పవచ్చు. అలాంటి శీర్షిక ఆ కవితా ప్రయోజనాన్ని కొంతమేర నెరవేర్చినట్లుగా భావించవచ్చు.

భావకవిత్వంలో వస్తు శిల్ప పరంగా అనేక నూతన పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందులో ప్రధానంగా ప్రకృతిప్రీతి ,స్వేచ్ఛ ప్రియత్వం ,ప్రణయం,ఊహాసుందరి ,విరహం,వేదన ,భక్తి,దేశభక్తి,సంఘసంస్కరణాభిలాష,మార్మికతలో సూఫీతత్వం,స్త్రీ ఉదాత్తచిత్రణ, మానవ సామాజిక సృహ,స్మృతి–సంస్కృతి మొదలైనవి కవితా వస్తువులుగా మారాయి.ఈ విధంగా భావకవులు మిగత కవులకంటే భిన్నంగా వస్తువును ఎంచుకొని కవితా నిర్మాణంలో చక్కటి శిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వస్తు స్వభావాన్ని అనుసరించి తదనుగుణమైన, ఔచిత్యమైన, ఆకర్షణీయమైన శీర్షికలను కవితలకు ఎంపిక చేయడం ప్రధానంగా గమనించదగ్గ అంశం. ఇప్పుడు శీర్షికల నిర్ణయంలో భావ కవుల శిల్ప చాతుర్యాన్ని, వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

5.2.1.1. ప్రతీకాత్మక శీర్షికలు:

చెప్పదలుచుకున్న అంశాన్ని ప్రత్యక్షంగా కాకుండా, వాటికి సంబంధం ఉన్న ఇతర అంశాల ద్వారా, అనగా ప్రతీకల ద్వారా చెప్పడమే ప్రతీకాత్మక.ఇలాంటి శీర్షికలు భావకవిత్వాన్ని నిర్మాణ పరంగా మరింత ముందుకు తీసుకువెళ్ళాయి.అందులో ప్రధానంగా ప్రకృతిప్రీతి, స్వేచ్ఛప్రియత్వం, ప్రణయం, ఊహాసుందరి, విరహం, వేదన, భక్తి, దేశభక్తి,సంఘసంస్కరణాభిలాష, మార్మికతలో సూఫితత్వం, స్త్రీ ఉదాత్తచిత్రణ, మానవ సామాజిక సృహ,స్మృతి–సంస్కృతి మొదలైనవి కవితా శీర్షికలుగా మారాయి. ఇలా అనేక రకాల శీర్షికలు భావకవిత్వం నుండి వెలువడ్డాయి. ఈ శీర్షికా

విభజన గమనిస్తే భావ కవులు కవితా నిర్మాణంలో భాగమైన శీర్షికా శిల్పానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చారో తెలుస్తుంది.

5.2.2. ఎత్తుగడ:

"కథా శిల్పంలో ప్రారంభాన్ని 'ఎత్తుగడ' అంటాం. రచయిత తాను ఎంచుకున్న కథా వస్తువును, రూపొందించుకున్న ఇతివృత్త ప్రణాళికలను అనుసరించి కవి కవిత ప్రారంభాన్ని ఎంచుకుంటాడు. ఈ ఎత్తుగడకు వచన కవిత్వంలో కూడా ఎంతో ప్రాధాన్యముంది. కవి మనస్సులో మెదిలిన భావానికి కవితాకృతి ఇచ్చేందుకు, మంచి కవితను రూపొందించేందుకు తనలో తాను సంఘర్షణకు గురవుతాడు. కవితను ఎక్కడ ప్రారంభించాలి? ఎలా ప్రారంభించాలి? పాఠకున్ని ఎలా ఆకట్టుకోవాలి? అని కవి మనస్సు పలు విధాలుగా ఆలోచిస్తుంది. కవిత ఎలా ప్రారంభించాలి అనే దానికి పరిష్కారం ఒక్కోసారి కొన్ని క్షణాల్లోనే లభిస్తుంది. కొన్ని సార్లు చాలా సమయం కూడా పట్టవచ్చు. అందుకే శ్రీశ్రీ "ఆరంభం పెద్ద అవస్థ" (**శివారెడ్డి కవిత్వం, పరిణామ వికాసాలు పెన్నా శివరామ కృష్ణ, 2020, పుట.83**)అని అన్నాడు. కవితా శీర్షికలాగే ఎత్తుగడ కూడా పాఠకున్ని ఆకర్షించేదిగా ఉండాలి.

కవితా నిర్మాణ శిల్పంలో "ఎత్తుగడ" (ఆరంభం)కు కూడా అధిక ప్రాధాన్యం ఉంది. దళిత కవులు వైవిధ్యమైన, ఆసక్తికరమైన ఎత్తుగడలతో కవితల్ని రాసి నిర్మాణ పరంగా భావ కవిత్వానికి ధృడత్వాన్ని చేకూర్చారు.

పొట్లపల్లి రామారావు గారు రాసిన " **నా జీవన సహచరి**" అనే కవిత ఈ కింది విధంగా ప్రారంభమవుతుంది. ఈ కవితలోని ఎత్తుగడను పరిశీలిద్దాం.

"నా జీవన సహచరీ!

ఈ సృష్టి ఏనాడు ఏర్పడ్డదో,

ఆనాడే నీవు నేను ఈ భూమి పై జన్మించాము.

ఈ అనంత కాల ప్రవాహంలో సంయోగ వియోగాలకు గురియౌతూ

కాల ప్రవాహంలో మునుగుతూ తేలుతూ

కాలప్రవాహంతో పాటు పయనిస్తున్నాము.

స్త్రీ ధర్మము నిర్వహిస్తూ ఉన్న నీవు స్త్రీవి కావు.

పురుష ధర్మము నిర్వహిస్తూ ఉన్న నేను పురుషుడిని కాను.

సృష్టి యొక్క నాటకరంగంలో నీవు ఒక పాత్రవు , నేను ఒక పాత్రను''

(తెలంగాణలో భావకవితా వికాసం. పుట.593)

స్త్రీ పురుషులిరువురు సృష్టి ఏర్పడినప్పుడే జన్మించారని, స్త్రీపురుష ధర్మాలను నిర్వహిస్తున్న ఇరువురు స్త్రీపురుషులు కారు. వారు జీవన నాటకంలో నటించబడుతున్న పాత్రలు. కాబట్టి ఎప్పుడైతే స్త్రీ , పురుషుడు అని విడదీసి ఎక్కువ తక్కువ అనే భావనలు ఉంచకుండా సృష్టి నిర్మించిన నాటకరంగం పై నటించే సమాన యోగ్యత కలిగిన పాత్రలని భావిస్తూ జీవితాన్ని లంఘించాలని కవి ఎత్తుగడలో తెలపడం జరిగింది.

ఈ విధమైన రీతిలో ఎత్తుగడ పాదాలు కలిగిన ఇటువంటి కవితలు భావకవిత్వంలో మరికొన్ని ఉన్నాయి. ఎత్తుగడల్లో ఎన్ని వ్యత్యాసాలున్నా ఈ ఎత్తుగడ పాదాలకు కవితా వస్తువుకూ, అభివ్యక్తి పద్ధతికీ అవినాభావ సంబంధం ఉండటాన్ని మనం గమనించగలం.

5.2.3. ముగింపు:

వచన కవిత్వ నిర్మాణంలో 'ఎత్తుగడ'కు ఎంత ప్రాధాన్యం ఉందో 'ముగింపు'కు కూడా అంతే ప్రాధాన్యముంది. కవి ఏ విషయాన్ని కవిత్వంలో చెప్పాలని లక్ష్యంగా పెట్టుకున్నాడో, అప్పుడే ఎత్తుగడ, ముగింపులు రెండూ నిర్ణయించబడతాయి. ఎత్తుగడను బట్టి ముగింపుగానీ, ముగింపును బట్టి ఎత్తుగడ కానీ ఉండదు. ఈ రెండింటి మధ్య ఒకానొక సమన్వయం ఉంటుంది.

కవి అంతిమంగా పాఠకునికి ఏ సందేశం ఇవ్వాలనుకుంటాడో అది ముగింపు ద్వారా అందుతుంది. 'ఎత్తుగడ' ఆసక్తిని రేకెత్తిస్తే 'ముగింపు' పాఠకున్ని ఆలోచనలో పడేస్తుంది.

భావకవులు కవితను ఆరంభించడంలోనే కాకుండా ముగించడంలోనూ తమదైన ప్రత్యేకతను చాటుకున్నారు.

భావకవితలోని ప్రణయ కవితా శాఖకు చెందిన **కాళోజీ నారాయణరావు** గారు రాసిన "**అవసరము**" కవితలోని ముగింపు వాక్యాల్ని పరిశీలిద్దాం.

"నేడు నీ కింతటి సిగ్గు బిడియంబు

ఈడుమీరిన నిన్ను అడిగేదెవంబు.

ఏ చూపులకు కసిరి తల విసురుతావో

ఆ చూపులను తలచి నిట్టూర్చగలవు

తేప తేపకు వీలు చిక్క దివ్యులమా?

రేపు ఈ పాటికి ఎవ్వరెక్కడనో?

తుఫానులో తెప్ప దోనెల జంట

ఏపాటిదో ఏమో చెప్పనవసరమా?

కామతృష్ణల తృప్తి కోరు దేహాలు

ప్రేమగీమల గొడవలోన పడనేల?

దేహాల దాహాలు తీర్చ జంకేల?

మోహాలు జనియింప మొగమాటమేల?

ఆకలికి అన్నంబు దొరకవలె కాని

అడుగుకొని తింటేమి అత్త పెడితేమి?

అరువు సొమ్మైతేమి, అప్పుదైతేమి?"

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.395)

" ఆకలికి అన్నంబు దొరకవలె కాని

అడుగుకొని తింటేమి అత్త పెడితేమి ?

అరువు సొమ్మైతేమి , అప్పుదైతేమి?"

వయసులో ఉన్న అమ్మాయికి సిగ్గు , పొగరు ఉంటే ఆమెను కోరినవాడిని భవిష్యత్తులో తలిచే క్షణమొస్తుంది. భవిష్యత్తులో ఎవరెక్కడ ఉంటారో ? కామాన్ని కోరే దేహాలకు ప్రేమతో పనేముంది. దేహదాహం తీరితే చాలు . అలాగే ఆకలిని తీర్చడానికి అన్నము దొరకాలి కాని అడుక్కొని తిన్నామా? అత్త పెట్టిందా? అరువు సొమ్మా? అప్పు తీసుకున్న సొమ్మా? అని అనుకుంటే ఎలా? మనకు అవసరముంటే అవసరాన్ని తీర్చాలని ముగింపు వాక్యాల్లో చాలా చక్కగా చెప్పడం జరిగింది.

5.2. 4. ఆద్యంతాల సమన్వయం:

కవి ఏ లక్ష్యంతో కవితను ప్రారంభిస్తాడో, ముగింపుతో ఆ లక్ష్యాన్ని చేరేందుకు ప్రయత్నిస్తాడు. స్వీకరించిన వస్తువును అభివ్యక్తీకరించడానికి కవి ఒక ప్రణాళికను ఏర్పాటు చేసుకుంటాడు. ఎత్తుగడ ముగింపులు దేనికదే విరుద్ధమైన, అసంబద్ధమైన భావాలను వ్యక్తపరచడం వల్ల వస్తు నిర్దేశిత భావం దెబ్బతినే అవకాశం ఉంది. ఆదిలో చెప్పిన భావానికి అంతంలో వివరించిన విషయానికి పొంతన ఉండాలి. అలా ఆద్యంతాల మధ్య సమన్వయాన్ని కుదిర్చినపుడే ఆ కవితా ప్రయోజనం నెరవేరుతుంది.

విశ్లేషించే వస్తువుపైన కవికి సమధికమైన అధికారం, సామాజిక జీవితం పట్ల గొప్ప అవగాహన ఉన్నప్పుడే ఆద్యంతాల మధ్య చక్కని సమన్వయాన్ని కుదుర్చగలడు. కేవలం వస్తువును

పాఠకుడి ముందు పరిస్తే చాలన్న వాదాన్ని కాకుండా; చక్కటి శిల్ప రీతులతో, ప్రత్యేకతలతో వచ్చిన భావకవిత్వంలో ఆద్యంతాల సమన్వయం స్పష్టంగా కనిపిస్తుంది.

కింద ఉదహరించిన భావకవిత విభాగానికి చెందిన **దాశరథి కృష్ణమాచార్యులుగారు** రాసిన **"దీపావళి**" కవితలోని ఆద్యంతాలను పరిశీలిద్దాం.

" భూపావళి బుగ్గి చేసి

కోపావళి నగ్గి ద్రోసి

దీపావళి జరుపండో

దేశ దేశజనులారా!

తెలంగాణ నఘనులారా!"

దీపావళి కవితలోని ఎత్తుగడ పాదాలు ఇవి. ప్రజల జీవితాల్లో చీకటి నింపిన రాజులను బూడిద చేసి, వాళ్ళ కోపాల చూర్ణాన్ని కైవసపర్చుకొని స్వతంత్రులై తమ జీవితాల్లో వెలుగు నింపుకోవాలని కవి ఎత్తుగడ పాదాల్లో తిరుగుబాటు గోచరిస్తుంది.

"కాలపు కళ్ళెమును లాగి

కదం వెనక్కు తొక్కించే

ఘనులంతా నడుం విరిగి

కదల్లేక నశించారు

మనం వెనక్కి నడవం!

జనం వెనక్కి నడవరు

మనం జనం , జనం మనం

జనం లేంది మనం లేము”

(తెలంగాణలో భావకవితా వికాసం, పుట. 608)

దీపావళి కవితలోని ముగింపు పాదాలు ఇవి. ముందుకెళ్తున్న వాళ్ళను వెనక్కి లాగేవారిప్పుడు నడుం విరిగి కదలకుండా ఉన్నారు. ఇప్పుడు మన జీవితాల్లో వెలుగు తీసుకురావడానికి మనం ముందుకు దూసుకెళ్తే మన వెంట జనం కదంతొక్కుతుంది.

ఎత్తుగడలో అంధకార జీవనానికి స్వస్తి చెప్పి వెలుగు నింపుకోవాలని సూచిస్తూ ముగింపులో ముందు మనం కదం తొక్కితే ఆ బాటలో దీపాలను వెలిగిస్తూ చీకటిని తరిమేస్తూ జనం కూడా కదం తొక్కుతుందని కవి ఆద్యంతాల మధ్య సమన్వయాన్ని చాలా చక్కగా కుదిర్చడం జరిగింది. ఆద్యంతాల సమన్వయం గొప్పగా అమరిన ఇటువంటి ఖండికలను భావకవిత్వంలో కొల్లలుగా గుర్తించగలం.

5.2.5. నిర్వహణ:

వచన కవిత నిర్మాణ శిల్పంలో మరో ప్రధానమైన అంశం నిర్వహణ. కవి చెప్పదలుచుకున్న అంశాల్ని సూటిగా, స్పష్టంగా, ప్రణాళికాబద్ధంగా పాఠకుడికి అందించే విధానమే నిర్వహణ. ప్రతి కవికీ తాను ఎంపిక చేసుకున్న పాఠకుడు ఉంటాడు. అది దృష్టిలో ఉంచుకొని కవి వస్తువు పట్ల నిబద్ధతతో ఉన్నప్పుడు మాత్రమే ఆ కవితలో నిర్వహణ కుదురుగా ఉంటుంది. దానికి తగ్గట్లుగా ప్రతీకలను ఎంచుకొని కవి కవితకు సమగ్రత చేకూరుస్తాడు. దీనినే ‘నిర్వహణ శిల్పం’ అంటాం.

భావకవులు కవితా నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తుంది. భావకవిత్వంలోని కొన్ని కవితల ద్వారా నిర్వహణ శిల్పాన్ని పరిశీలిద్దాం.

కింద ఉదాహరించిన **అనుముల కృష్ణమూర్తి** గారు రాసిన **“ఎవరవో?”** కవితలో నిర్వహణను పరిశీలిద్దాం.

“కనుల మీదికి మబ్బు కొట్టుకొచ్చే వెళ

ఒళ్ళంతా ఒకచోటి కొరిగిపోయేవేళ

ఎవరవో నన్ను నీ వింత రాతిరివేళ

కడుపులో గరిటేసి కలెబెట్టి పోతావు! ఎవరవో?

దిక్కుమాలిన రాత్రి తెల్లబోయెడు వేళ

తొలి కోడి సూర్యుణ్ణి పిలువ వచ్చే వేళ

ఎవరవో నన్ను నీ వింత ప్రొద్దటి వేళ

వ్రాయమని నా గుండె పై బాది పోతావు! ఎవరవో ?

భానాల నిచ్చి నా బాధలను మాపేవు

వ్రాయమని నా పచ్చి గాయముల రేపేవు

ఎవరవో నన్ను నీ వెపటి కప్పుడె మలిపి

వెలిగించి వెళ్ళెవు నా యంతరాత్మవా! ఎవరవో?"

(తెలంగాణలో భావకవితా వికాసం, పుట.591)

పన్నెండు పాదాలతో కొనసాగిన కవిత ఖండిక ఇది. మూడు భాగాలుగా రూపొందించిన ఈ కవితలో మొదటి భాగంలో రాత్రివేళ పడుకునే ముందు జ్ఞాపకాలుగా కరుగుతావని , రెండో భాగంలో పొద్దున్నే లేచినప్పుడు ఆ జ్ఞాపకాలను వ్రాయమని గుండె మీద కొట్టి వెళ్ళిపోతావని , మూడో భాగంలో కాంతిని ప్రసాదించి బాధలను పటాపంచలు చేసి, పచ్చి గాయాలను రాయమని ఎప్పటికప్పుడు నాకు ఆనందాన్ని ప్రసాదిస్తావు నీవు ఎవరు ? నా అంతరత్మవా ? అని ఈ కవితలోని నిర్వహణ శిల్పం చాలా బాగుంది. చిక్కనైన నిర్వహణ కలిగిన ఇటువంటి భావకవితలు తెలంగాణలో మరికొన్ని లేకపోలేదు.

5.2.6. ఛందస్సు:

'Free Verse' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా మనం వచన కవిత అనే మాటను ఉపయోగిస్తున్నాం. Verse అనే పదానికి ఛందస్సు అనే అర్థం ఉంది. Free Verse అంటే ఛందస్సు లేని కవిత్వం. కానీ భావకవిత్వంలో కూడా ఛందస్సు ఒక లక్షణంగా ఉందని కొందరు విమర్శకుల అభిప్రాయం. శుద్ధ వచనానికి, వచన కవిత్వానికి చాలా భేదం ఉంది. అయితే ఆ భిన్నత్వం ఎలా ఏర్పడిందో దాన్నే మనం ఛందస్సుగా పరిగణించవచ్చు. వచన కవిత్వంలో ఛందస్సుకు సంబంధించిన చర్చలు 1960 ప్రాంతం నుండి జరుగుతూ ఉన్నాయి. ఈ విషయమై ముఖ్యంగా సంపత్కుమారాచార్య, చేకూరి రామారావు గారికి మధ్య జరిగిన సుదీర్ఘ చర్చ తెలుగు విమర్శాలోకానికి సుపరిచితమే. వీరి చర్చ అనంతర కాలంలో కొన్ని వచన కవిత్వ లక్షణాలు, ముఖ్యంగా ఛందస్సుకు సంబంధించిన అంశాలు తెరపైకి వచ్చాయి.

5.2.6.1. భావాంశం–భావగణం:

వచన కవితకు పాదవిభజన అనేది ప్రధాన లక్షణం. ఈ లక్షణమే వచన కవితను 'వచన గద్యం' నుండి వేరు చేసి కవితగా మారుస్తున్నది. పాద విభజన ఛందోబద్ధమైన పద్య లక్షణానికి సంబంధించినది. ఆ కోణంలో గమనిస్తే పాద విభజన చేయబడ్డ వచన కవితలో కూడా ఛందస్సు దాగి ఉందని విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వారిలో కోవెల సంపత్కుమారాచార్య ముఖ్యులు. ఛందో బద్ధమైన కవిత్వంలో గణాల ప్రాధాన్యం ఉంటుంది. అదే విధంగా వచన కవిత్వంలోనూ గణాలు ఉన్నాయని ఆయన గుర్తించారు. వాటిని భావగణాలుగా గుర్తించారు. ఛందస్సు పై జరిగిన చర్చను బట్టి వచన కవిత్వంలో భావగణాలు, భావాంశాలు ఉంటాయని తెలుస్తున్నది. భావగణాలను అనుసరించి పాదవిభజన ఉంటుంది. ఒక భావగణం ఒక పాదంతో పూర్తి కావచ్చు. అంతకంటే ఎక్కువ పాదాలతో కూడా పూర్తి కావచ్చు. ఒక భావగణంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ భావాంశాలు ఉండవచ్చు.

భావకవిత్వంలోని కొన్ని ఉదాహరణల ద్వారా భావగణాలు, భావాంశాలపై ఒక స్పష్టతను ఏర్పరచుకునే ప్రయత్నం చేద్దాం.

ఈ సంధర్భంలో **సుశీలమ్మగారు** రాసిన "**వాడు దొరికాడురా**" కవితలోని భావాంశాలను, భావగణాలను పరిశీలిద్దాం.

"దొరికాడురా మన గురుడు

వాడు పరమేశుడైనట్టి నరుడు

చెంతజేరినవేళ చరణసేవకు బిల్చి

అభయహస్తము శిరంబందుంచితే చాలు

మోహంబు నిధిలోన నులుగు భక్తులనెల్ల

తన దర్శనంబిచ్చి దరిజేర్చు దైవమై

అతని చెంతలోన బ్రతికితే మనమంతా

భయము లేదని యేటి అభయమిచ్చే దాత

తూడుకుర్తి నివాళితోడ మనముంటేను

పాదువీడని వాదులాట మనకేలరా

పరము జూపేవాడే పరమగురుడై ఉండు

పరుల మాటలతోటి పనియేందిరా"

(తెలంగాణలో భావకవిత వికాసం, పుట.602)

పైన ఉదహరించిన కవితలో 12 పాదాల్లో ఏడు భావగణాలు ఉన్నాయి. 1, 2 పాదాలు వేటికవే భావగణాలు. 3,5,7,9,11 పాదాలు అసమాపక క్రియల్ని కలిగి ఉన్నాయి కాబట్టి ఇవి

భావాంశాలు. 4,6,8,10,12 పాదాలు సమాపక క్రియతో ముగుస్తున్నాయి. కావున వీటిని ఒక్కొక్క భావాంశాలను (3,5,7,9,11 పాదాలు) కలిగిన భావగణాలుగా పెర్కొంటాము.

ఈ కవితలో భావాంశాలు, భావగణాలకు మధ్య స్పష్టమైన తేడాను గుర్తించవచ్చు. మొదటి రెండు పాదా వేటికవే భావగణాలు. అలాగే 3,5,7,9,11 పాదాలు అసమాపక క్రియలతో ముగిశాయి. కాబట్టి ఆ పాదాలు పూర్తి భావాన్ని అందించలేదు. అలాగే. 4,6,8,10,12 పాదాలు సమాపక క్రియలతో ముగిసి పూర్తి భావాన్ని స్ఫురింపజేస్తున్నాయి. కావున వీటిని ఒక్కొక్క భావాంశాలను (3,5,7,9,11 పాదాలు) కలిగిన భావగణాలుగా పేర్కొనవచ్చు. ఈ విధంగా భావకవిత్వం నుండి ఇటువంటి కవితలను మరికొన్నింటిని మనం గుర్తించగలం.

5.2.7. అంతర్లయ:

ఛందోబద్ధమైన పద్యంలో పాదాలలో ఒక క్రమనియతి ఉంటుంది. కానీ వచన కవిత్వం భౌతిక రూపాన్ని గమనిస్తే అలా ఉండదు. కొన్ని పాదాలు పొట్టిగానూ, కొన్ని పాదాలు పొడుపుగానూ కనిపిస్తాయి. ఈ ఎగుడు దిగుడు పాదక్రమం చూసే కళ్ళకు మాత్రమే పరిమితం. కవిత్వాన్ని పఠిస్తున్నపుడు పాఠకుడికి ఈ క్రమరాహిత్యం స్ఫురించదు. ఆ కవితలో దాగి ఉన్న అంతర్లయ పాఠకుణ్ణి ఆకట్టుకొని ఆ వ్యత్యాసాన్ని కనిపించనివ్వదు. ఈ రకమైన కవితా నిర్మాణాన్నే మనం 'తూగు' అంటున్నాం. దీన్నే ఆంగ్లంలో 'ఫోర్స్' అని వ్యవహరిస్తున్నాం. భావాన్ని వ్యక్తం చేసే మంలో కవి పాదాల విరుపులో ప్రతిభను ప్రదర్శించి కవితకు తూగును కల్పిస్తాడు. కవి భావావేశాన్ని ఇంచుమించుగా అందుకున్న పాఠకుడు అందులోని అంతర్లయను గమనించి కవి పొందిన అనుభూతిని తాను కూడా పొందుతాడు.

భావకవిత్వంలోని కవితా ఖండికల ద్వారా తూగు అంతర్లయకు సంబంధించిన అంశాలను పరిశీలిద్దాం. **ఊటుకూరు రంగారావు** రాసిన **"ఇనుప గోడలు"** కవితలో తూగు అంతర్లయను పరిశీలిద్దాం.

“ ప్రేయసీ!

అహో! ఎన్నాళ్ళకి నీ రాకడ?

నీ నవయౌవన తేజంతో

నా నయనాలు జిగేల్మనిపించి వెళ్ళిపోయావు

మళ్ళీ యెందుకీ పోకడ....?

మన యిద్దరి మధ్యన

యెందుకింత దూరం.....?

నా ననూతనజీవిత నీలాకాశంలో;

నిగనిగమెరిసే సువర్ణనక్షత్రంలా

ఉదయించావొకసారి.

నీ చిరునవ్వు గంటల గణగణలో

నా భావావేశం మునిగి,

నన్ను నను విస్మృతిపథంలో నెట్టుకొని

కన్నార్పక తిలకించిన రోజులు లేవా....?

ప్రణయసాగర తరంగాల పై

నడవను సరవడి త్రొక్కిస్తూ,

ఏ దూరతీరాలకో మనం

వెళ్ళిపోతున్నప్పుడు

వినువీధినిండ,

పెనుగాలిరేగి,

ఘనజలధి పొంగి

మననావ మునుగ,

ఇద్దరం చెరొక తీరానికి

విసిరివేయబడ్డాం తరంగాల ద్వారా.

ఆనాడు నా విశాల హృదయాన్ని

పిడుగు తొలచినట్లయింది ఈనాడు....."

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట. 545)

పై ఉదాహరణలో పాదాలు పొట్టిగానూ, పొడవుగానూ కన్పిస్తున్నాయి. వీటిని చూసినప్పుడు అలా కనిపించిన చదువుతున్నప్పుడు మాత్రం లయ కారణంగా భావం సమాంతరంగా స్ఫురిస్తుంది. పెద్ద పాదాలను రెండు మూడు భావాంశాలుగా విడగొట్టె అవకాశమున్న కాని విడగొట్టక సుదీర్ఘంగా పాఠకుడికి చదివించే గుణాన్ని కలిగిస్తూ, పాఠకుడిని విశ్రాంతి తీసుకోనివ్వకుండా తన వెంట వేగంగా నడిపించే ప్రయత్నంలో భాగంగా కవి ఆ పాదాలను సుదీర్ఘమైనవిగా నిర్మించాడు. ఈ విధంగా ఈ పాదాల నిర్మాణంతో కవి అంతర్లయకు నష్టం కలుగకుండా జాగ్రత్తపడ్డాడు.

ఈ విధమైన నిర్మాణ దక్షత కలిగిన ఇటువంటి ఖండికలను భావకవిత్వంలో విరివిగానే గుర్తించగలం.

5.2.8. నిర్మాణ వైవిధ్యం:

వచన కవిత నిర్మాణం ఇలానే ఉండాలి అనే నిబంధన ఏమీలేదు. ఎంచుకున్న వస్తువుకు ఎలాంటి నిర్మాణం ఉంటే బాగుంటుందో కవి ముందే నిర్ణయించుకుంటాడు. కొన్ని సార్లు అధికశాతం

మంది కవులు సాధారణ నిర్మాణ పద్ధతినే ఎంచుకుంటాడు. ఒక్కోసారి నిర్మాణంలో వైవిధ్యం చూపించి పాఠకున్ని మరింత మెప్పించే ప్రయత్నమూ చేస్తాడు.

వచన కవితను నిర్మించడంలో భావకవులు తమదైన ముద్రను వేశారు. అక్షరాల పొందికలోనూ, పాదాల విరుపులోనూ లయను కల్పించి భావకవిత్వానికి నిర్మాణ పరంగా ఒక ప్రత్యేకతను చేకూర్చారు.

5.2.8.1. దీర్ఘ పాదాలు:

భావకవితా విభాగానికి **చెంది లక్ష్మీపతి** గారిచే రచించబడిన **"కల్లోలం"** అనే కవితలోని దీర్ఘ పాదాలను పరిశీలిద్దాం.

"అది అనంత మహాసముద్రం అలలమీద అలలు పుడుతున్నాయ్.

ఉవ్వెత్తు లేస్తున్నాయ్ నీ నవ్వు నురగలు రువ్వుకుంటున్నాయ్.

ముందు ముందుకు త్రోసుకుంటూ క్రిందు మీదు పడుతూ లేస్తూ

తూగిపోతున్నాయ్ గబ గబా సాగినడుస్తున్నాయ్ ....

ఊపుతో లేచింది ఒక అల మంద మంద హాసములతో

క్రిందబడ్డా చిన్ని అలలకు – క్రిందు మీదూ భేదబుద్ధి ....

(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.591)

పైన ఉదాహరించిన ఖండికలోని పాదాల్లో నాలుగు కంటే ఎక్కువ పాదాలున్నాయి. పాదాల్లో భావాంశాలుగా విడగొట్టె అవకాశం ఉన్న కూడా చదివించే గుణాన్ని పాఠకులకు కలిగించేట్టుగా దీర్ఘ పాదాల నిర్మాణం జరుగుతుంది. ఈ విధంగా ఈ కవితా పాదాల నిడివి కూడా సుదీర్ఘంగా ఉండి పాఠకుడి చూపు పక్కకు మరలకుండా చదివింపజేయగలవు. ఇలా దీర్ఘపాదాలు కలిగిన కవితలు తెలంగాణ భావకవిత్వంలో లెక్కకు మించి కనబడతాయి.

5.2.8.2. పొట్టి పాదాలు:

ఒక్కోపాదంలో ఒకటి లేదా రెండు పదాలు మించకుండా ఉంటే వాటిని పొట్టి పాదాలుగా చెప్పవచ్చు ఒక్కోపాదంలో ఒకటి లేదా రెండు పదాలు మించకుండా ఉంటే వాటిని పొట్టి పాదాలుగా చెప్పవచ్చు.

సి. నారాయణరెడ్డి గారు రాసిన **"శోధన"** అనే కవిత ఈ సందర్భంలో పరిశీలించదగిన ఖండిక .

"ఎగిసిపోతున్న

భావాక్షరాల్ని

ముద్రిస్తున్నా

నిద్రాఫలకంపైన

భద్రపరచాలని

ముగిసిపోనున్న

భావికావ్యాన్ని

పొడిగిస్తున్నా

జీవన రహస్యాన్ని

తరచి తరచి

అభ్యసించాలని

నినదిస్తున్న

వినోద వీణాతంత్రుల్ని

బిగిస్తున్నా....." (తెలంగాణలో భావకవితా వికాసం, పుట.573)

పైన ఉదాహరించిన కవితలో ఒకపదం లేదా రెండు పదాలు కలిగిన పాదాలు మాత్రమే ప్రయోగించబడ్డాయి. పొట్టి పాదాలు పాఠకులకు త్వరగా భావాన్ని అర్థం చేసుకోవడానికి చాలా దోహదపడతాయి. అలాగే చిట్టి పాదాలు నిర్మాణంలోనూ చూడడానికి, చదవడానికి చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ విధంగా రచయిత పొట్టి పాదాలతోనే నడిపించి, ఒక చక్కటి భావాన్ని ఈ స్వల్ప వాక్యాల్లో బంధించగలగడం కవి ప్రతిభకు నిదర్శనం. ఈ విధమైన పొట్టి పాదాలతోనే నడిపించి భావాన్ని చేకూర్చే ఇటువంటి పొట్టి పాదాల కవితలను భావకవిత్వంలో విరివిగానే గుర్తించగలం.

5.2.8.3.పొట్టి కవిత:

పొట్టి కవిత వేరు; పొట్టి పాదాల కవిత వేరు. కవి చెప్పదలుచుకున్న విషయాన్ని వీలైనంత తక్కువ పాదాలతో చెప్పే ప్రక్రియను పొట్టి కవిత లేక మినీ కవితగా భావిస్తున్నాం. స్వీకరించిన వస్తువుకు స్పష్టత, క్లుప్తత, సూటిదనం కల్పించడం ఈ రకమైన నిర్మాణానికి అవసరం.

తిప్పిరెడ్డి సత్యం గారు రచించిన **'కలువకన్య'** అనే కవితను ఈ సంధర్భంలో పరిశీలవంచుకుందాం.

"అవునే సంధ్యారాణి

కాల్చితి ప్రేమాగ్నిలో నా మైని

కడలిరాజు నెడబాసి

విడచితి ఆశలు జీవితముపై

కాచి ఇంతవరకు

ఎదురుతిన్నెలు ప్రియుని కొరకు

మాడితి పవలెల్ల

భార్గ వుని వేడివల్ల....." (తెలంగాణలో భావకవితా వికాసం,పుట.612)

ఈ కవిత ప్రణయశాఖకు చెందినది. ఈ కవితలో తీవ్రమైన విరహ వేదన కనిపిస్తుంది. ఈ కవితలో నిశ్శబ్దమైన వాతావరణం. మదిని మత్తెక్కించె చల్లని గాలిమెల్లగ వీచుచుంటుంది. అప్పుడే శశాంకుడు ప్రవేశించి విరహ వేదనతో శుష్కించిన కలుపు కన్యను మాటలాడించే ప్రయత్నం చేస్తున్నాడు. ఇలాంటి కవితల వల్ల కవి వ్యక్తపరచాలనుకున్న విషయం సూటిగా పాఠకుడికి చేరుతుంది. ఇలాంటి పొట్టి కవితలు భావకవిత్వంలో కోకొల్లలుగా కన్పిస్తాయి.

5.2.8.4. 'స్టాంజా' కవిత్వం:

కవిత్వాన్ని భావాన్ని అనుసరించి 'స్టాంజాలు'గా విభజించుకోవాలి. మొదటి 'స్టాంజా'లో ఏ రకమైన లయ ఉంటుందో మిగిలిన 'స్టాంజా'ల్లో కూడా అలాంటి భావ లయే కలిగి ఉండడం ఈ కవితా నిర్మాణ ప్రత్యేకత.

సి.నారాయణరెడ్డి గారు రాసిన " నిశ్శబ్దత" కవితలో స్టాంజా కవిత్వ నిర్మాణాన్ని పరిశీలిద్దాం.

" నిశ్శబ్దత – నిశ్శబ్దత

జీవధ్వని చితికిన స్తబ్దత

నిశ్శబ్దత – నిశ్శబ్దత

శీతలశీర్ణ సమాధిలో

లోతుల్లో దాక్కొన్న అంభోదిలో

పచ్చదనం చచ్చిన ఎడారిలో

బ్రతుకు పయనించని ముళ్లదారిలో

నిశ్శబ్దత – నిశ్శబ్దత

పెదవి కదల్చని శిధిదాలలో

బెదరక నిల్చున్న నగ్నకుడ్యాలలో

జలధరాల నీడలునడిచే బాటలో

నృత్యించే మృత్యువు సయ్యాటలో

నిశ్శబ్దత – నిశ్శబ్దత

మూల్గుతున్న మందానిల గమనంలో

వెల్గుల దిగమ్రింగిన చీకటివదనంలో

గతకాలం గురుక వెట్టు 'గడి'లో

భగవానుడు కట్టువడిన " గుడి"లో

నిశ్శబ్దత – నిశ్శబ్దత

జీవధ్వని చితికిన స్తబ్దత " (తెలంగాణలో భావకవితా వికాసం,పుట.569)

ఈ కవితలో ప్రధానంగా మూడు స్టాంజాలు ఉన్నాయి. ఎత్తుగడలో ముగింపులో ఒక విధంగా అవే పాదాలు ప్రయోగించడం జరిగింది. మధ్యలో ఉన్న మూడు స్టాంజాలు ఒకే విధమైన నిర్మాణాన్ని కలిగి ఉన్నాయి. ఇలాంటి ప్రయోగాల వల్ల పాఠకులకు కవిత్వాన్ని సంపూర్ణంగా, విస్తారంగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది. ఈ విధమైన స్టాంజా నిర్మాణ పద్ధతి కలిగిన ఇంటువంటి కవితలను భావవిత్వంలో విరివిగానే పరిశీలించగలం.

ఈ విధమైన కవితా రూపంలో గల కవితలు తెలంగాణ భావకవిత్వంలో మరికొన్ని లేకపోలేదు.ఈ విధంగా తెలంగాణ భావకవిత్వంలోని నిర్మాణ శిల్పానికి సంభందించిన అనేక

అంశాలను సోదాహరణంగా విశ్లేషించుకున్నాం. ఇదే విధంగా తెలంగాణ భావకవిత్వంలోని భాషా వైవిధ్యాన్ని పరిశీలిద్దాం.

5.3. తెలంగాణ భావకవిత్వం– భాష:

ఒక ప్రక్రియలో గల భాషను గురించి పరిశీలన చేస్తున్నామంటే ఆ ప్రక్రియలో గల భాషలోని ప్రత్యేకతను చూడాలి . తెలంగాణ భావకవిత్వంలో భాషా ప్రయోగం ప్రత్యేకత ఆయా కవితల్లో కనిపిస్తుంది. ఆ కవితలను పరిశీలిస్తే పాఠకుడికి అర్థం అవుతుంది. కవిత్వంలో వాడిన పద ప్రయోగంలో గ్రాంధిక భాషను, సాధారణ భాషను ఉపయోగిస్తూ, మాండలిక పద ప్రయోగాలను తక్కువగా వాడుతూ, కవిత్వ రచన చేయడం జరిగింది.

"మానవుడికి ఉన్న అమూల్యమైన శక్తి భాష మాట్లాడగలగడం, భాష, మాట్లాడలేని మానవుడు లేనట్లే భాష మాట్లాడగలిగిన మానవేతర ప్రాణి ఏదీ లేదు. మెదడులో గాని ముఖయంత్రంలో గాని లోపాలున్న కొద్దిమందికి తప్ప మిగిలిన మానవులందరికీ మాట్లాడే శక్తి ఉంది. మానవుడు తన మనస్సులోని అభిప్రాయాలని బహిర్గతం చెయ్యడానికి నోటి ద్వారా చేసే ధ్వనులే భాష, మనకు తెలియని భాష ఒకరు వ్యవహరిస్తున్నప్పుడు మనం వినేవి ఆ వ్యక్తి నోటి ద్వారా చేసే రకరకాల ధ్వనులే. ఆ భాష తెలిసినవారికి ఆ ధ్వనుల అర్థం బోధపడుతుంది; తెలియనివారికి వాటి అర్థం బోధపడదు. కాబట్టి భాష అంటే కొన్ని ధ్వనుల సముదాయమేనని దీనివల్ల తెలుస్తుంది. కోతులు, పశుపక్ష్యాదులు కూడా భయం, ప్రేమ, కోపం, ఆకలి మొదలైన భావాలని సూచించడానికి అరుపులు అరుస్తాయి. అయితే మానవభాషకీ, పశుపక్ష్యాదుల అరుపులకి మధ్య ఎంతో భేదం ఉంది. జంతువుల అరుపులలో ఏడెనిమిది లేక పది కన్న ఎక్కువ రకాలు ఉండవు. కాని మానవభాషలో రకరకాల ధ్వనులు కలిసి మాటలుగా ఏర్పడడం, రకరకాల మాటలు కలిసి రకరకాల వాక్యాలు ఏర్పడడం ఉంది. అందువల్ల జంతువుల అరుపులలో కన్న మానవభాషలో వైవిధ్యం చాలా ఎక్కువగా ఉంది".(**సుబ్రహ్మణ్యం, పి.ఎస్ , ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు ,1997, పుట :03**)

5.3.1. అన్యదేశ్యాలు (Foreign):

"ఏ భాషలోనైనా పదాలు దేశ్యాలు (indigenous), అన్యదేశ్యాలు (Foreign) అని రెండురకాలుగా ఉంటాయి. మూలభాషలనుంచి సంక్రమించినవి దేశ్యాలు; తదితరాలు అన్యదేశ్యాలు. భాషలో కొత్తపదాలు చేరడానికి ముఖ్యమైన కారణం ఆదానం (Borrowing). సాధారణంగా ఒకభాషను మాట్లాడే ప్రజలు భౌగోళికంగా సమీపవర్తి భాషలనుంచిగాని, సాంఘిక, రాజకీయ, మత, సాంస్కృతిక, వాణిజ్యసంబంధాలవల్ల దూరవర్తిభాషలనుంచిగాని కొత్తపదజాలాన్ని గ్రహిస్తారు. ఒకభాషావ్యవహర్త ఒక వస్తువునుగాని, ఒకభావాన్నిగాని సూచించడానికి తగినపదం తన భాషలో లేనప్పుడు తనకు సన్నిహిత సంబంధం గల వ్యవహర్త భాషలో ఆపదంఉంటే దాన్ని స్వీకరిస్తాడు. పరిపాలనా వ్యవస్థలో పరిపాలకులభాషలోని పదజాలం పరిపాలితులభాషలో చేరే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వాణిజ్యసంబంధాలవల్ల భాషలు పదాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటాయి. ఇలాటి పదాలనుబట్టి భాషావ్యవహర్తల సంబంధస్వభావాన్ని ఊహించవచ్చు"**(కృష్ణమూర్తి, భద్రిరాజు, తెలుగు భాషా చరిత్ర, 2022 పుట.**314) తెలంగాణ కవులు భావ కవిత్వంలో వాడిన భాషా స్వరూపాన్ని ఇక్కడ తెలియజేశాను.

5.3.1.1. తెలంగాణ భావకవిత్వం – ఆంగ్ల భాషా పదాలు:

కోర్టు:

- జాలూనీటికి రైతు జనుని హక్కేదని .....

  కోర్టు లెక్కించండి కొండే గాండ్రు... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.366]

సిగరెట్లు :

- యజ్ఞ మన భ్రూణ హత్యకు నగ్నిహోత్ర

  మునగ **సిగరెట్లు** కాలు ట కాఖ్య లమరు.... [గోలకొండ కవుల సంచిక,పుట.171]

5.3.1.2.తెలంగాణ భావకవిత్వం–ఉర్దూ భాషా పదాలు

సర్కారీ :

- మాతృభాషే గాక మరి రాజభాషను/.....

  సర్కారీములను చక్కగా గుర్తించి .... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.367]

ఠీకు :

- నాకు లోకము నీకు **ఠీకు** దివాన్ ఖాన [గోలకొండ కవుల సంచిక,పుట.34]

ఖజాన:

- నిగము పదార్థంబు నే **ఖజాన** [గోలకొండ కవుల సంచిక,పుట.34]

కార్ఖాన:

- యెన్న శక్యము గాదు రన్న నీ **కార్ఖాన** [గోలకొండ కవుల సంచిక,పుట.34]

ఘరాన:

- నిత్యంబు హెచ్చురా నీ **ఘరాన** [గోలకొండ కవుల సంచిక,పుట.34]

దినాన:

- యె రుగలే డింత ని న్నీ **దినాన** [గోలకొండ కవుల సంచిక,పుట.34]

నజరాన:

- యిచ్చతో నన్ను నీ కిచ్చితి ***నజరాన*** [గోలకొండ కవుల సంచిక,పుట.34]

బందిఖాన:

- పడ ద్రోయ కయ్య నన్ ***బందిఖాన*** [గోలకొండ కవుల సంచిక,పుట.34]

షాదియాన:

- స్రష్ట తమ కిచ్చు దగు హిసా ***షాదీయాన*** [గోలకొండ కవుల సంచిక,పుట.34]

జమబంది:

- ***జమాబంది*** దాటులు యమమందిరమవచ్చి

  దానను రాఫలు దాపరించే .... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.366]

మసీదు :

- శిల్ప చాతుర్యమున్ దెల్పు దేవాలయం [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.212]

  బులు ***మసీదులు*** గల్గి చెలగు భూమి..

జాగీరు:

- ***జాగీరు*** పౌరులు స్థానంబు లేకను

  పరుల పంచల జేరి బ్రతుక వలసే.. [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.139]

కౌలు:

- ***కౌలు*** దార్లేప్పుడు కడగండ్లం బడుచును

  స్థిరము గుర్తే ఎరుంగక తిరగవలసె... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.139]

సభ:

- ***సభ***లో హాలీకుల పాట్లు జదుపుడయ్య

  సాయమన్న విధంబుల సేయుడయ్య.. [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.368]

చాకిరి:

- పుట్టినప్పటి నుండి వెట్టి ***చాకిరి*** జేయు

  శారీర బలమెల్ల సమసిపపోయె.... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.205]

సంస్థానం:

- ఇట్టి ***సంస్థాన***ములయందు దిట్టమైన

  వసుమతీపాల జాలక మెసుగుచుండు ..... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.211]

బికారు*:*

- కల్లు భంగు సారాయిచే నిల్లు గుల్ల

  గా ***బికారు***లై చెడెడి మూర్ఖత్వ మేల [గోలకొండ కవుల సంచిక,పుట.141]

5.3.1.3. తెలంగాణ భావకవిత్వం– సంస్కృత భాషా పదాలు:

శశిధరుండు:

- చక్రరముంచు కొనియె ***శశిధరుండు*** తోళ్ళు

  గట్టి నొదుట జిచ్చు బెట్టుకొనియె..... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.368]

దర్పణం :

- మాపదలుచిన మాత్రాన మాసిపోవ ....

  దలుపు నిచ్చినప్పుడు నామనో ***దర్పమున...*** [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.91]

నీరజాక్షి *:*

- నీదు మోహన మూర్తినో ***నీరజాక్షి..***

చిత్రకారుడు చిత్ర విచిత్రమైన.... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.211]

హృదయగర్భము :

- మా ***హృదయగర్భము***ల మాటు మరగి యున్న

  కారుమేఘాల నెవరైన గదిపిరేణి [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.211]

మాధుర్యం:

- ప్రేమమా నీదు ప్రియమైన నామ మందు

  ఇంత ***మాధుర్య*** ముండుట వింత గాదు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.38]

శిశువు :

- ***శిశువు*** తన తల్లి గాంచినన్ శ్రీఘ్రముగనె

  ఏ డుపులు మాని చేతుల నిచ్చుటేల [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.39]

తరుణి :

- ***తరుణి*** నీ మదనాగ్ని కిందన మయ్యెతి

  పాలి చంపకిపై వ్రాలు భ్రమరమట్లు ... [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.43]

క్షణము:

- అడవి గాచివెన్నెల యయ్యే బ్రతుకు

  క్షణము బాయక విహరించు చక్రవాక [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.81]

మురళి:

- ***మురళి*** యెంతటి మంచి నోములను నోచి

నీదు యధరసుధారసాస్వాది యయ్యే [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.87]

మనోరధము :

- నా ***మనోరధ*** మిట్లు నా నావిధాలు

  బాడు సేయుగుదలుచిన ఫలమ దేమో [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.90]

ప్రకృతి:

- **ప్రకృతి** యంతయు నూత్న వైభవము నొందే

  గ్రీష్మ తాపంబు నోర్చి కార్చిచ్చు సైచి [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.101]

కారుచీకట్లు:

- ***కారుచీకట్లు గ్ర***క్కుచుం గడల నెల్ల

  నొక్కక బళం బుగా నోట గ్రుక్కి భీక [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.76]

లావణ్య:

- అతుల సుకుమార సౌందర్యమైన నీదు

  రుచిర ***లావణ్య*** వీక్షణ లో రోచి యకట [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.214]

5.3.2. మాండలిక పదాలు:

ఒక ప్రాంతంలో ఎక్కువ మంది మాట్లాడే భాషను మాండలిక భాష అంటారు. ప్రతి భాషకు మాండలిక భాష ఉంటుంది. మాండలిక భాష అనేది ప్రత్యేకమైన భాష కాదు. ఇది ప్రధాన భాషలో అంతర్గత భాషగా ఉంటుంది. మాండలిక భాషల్ని అవగాహనా చేసుకోవడము అనేది ఆయా ప్రాంతాలలో ప్రత్యక్ష సంభంధం కలిగినప్పుడు సులభం అవుతుంది. ప్రధాన భాషలు పరిసరాల భాషల ప్రభావం వల్ల భాషా స్వరూపం మార్పుకు లోనవుతూ ఉండటం చేత మాండలిక పదాలు

ఏర్పడుతూ ఉంటాయి. ఆ విధంగా ఏర్పడిన మాండలిక భాషా పదాలు తెలంగాణా భావకవిత్వంలో ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఈ నా పరిశోధనలో చర్చించడం జరిగింది.

- దంతెల కాఁడిని త్రాళ్ళకట్ట [**గడ్డపాఱ–తెలంగాణ**]

  గడ్డపాఱను కొండి కఱ్ఱుల జిమ్మట ***(కాపుబిడ్డ,పుట.22)***

  వివరణ: గునపం/కళింగ; గడారు/రాయలసీమ; గడ్డపాలుగు/కోస్తా

- తెల్లచీరల మురియును

  నల్ల ***రైక***ల తొడుగునూ ***(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.247)***

- రైక=కోక; ఇతర మాండలికల్లోని కొన్ని ప్రాంతాల్లో రైకను కోకగా వ్యవహరిస్తారు.
- తెల్లంగా నవ్వుతాడు

  సల్లంగా ***సూత్తాడు*** ***(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.285)***

- ఇలాంటి పదాలు తెలంగాణ ప్రాంతంలోని పామర భాషలో ఎక్కువగా కనిపిస్తాయి.
- ఆ సిన్న చంద్రుడు ***మామాటీలె*** లిగిస్తాడు

  మల్లీ ***పొద్దు***న్నే మాయమవుతాడు ***(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.285)***

  వివరణ:మాపటీల=సాయంకాలం;

- ఇలాంటి పదాలు తెలంగాణ ప్రాంతంలో తప్ప ఇతర ప్రాంతాలలో కనిపించవు.
- ముకుపచ్చలారని ముద్దుబిడ్డల విడి.....

  రాయిజేసికొని ***బిరాన*** యెగసిపోయి.. ***(తెలంగాణలో భావకవితా వికాసం,పుట.425)***

  బిరాన=తొందర

  ఇలాంటి పదాలు తెలంగాణ ప్రాంతంలోని పామర భాషలో ఎక్కువగా కనిపిస్తాయి

- ముద్దు బెట్టికొనుచు మూర్కొనుచును

  ఏగి యందందు చిక్కిన *ఏగిరమ్ము .. .. (తెలంగాణలో భావకవితా వికాసం,పుట.425*)

  ఏగిరాం=తొందరపాటు;

- ఇలాంటి వైవిధ్యమైన మాండలిక పదాలు తెలంగాణ ప్రాంతంలోని పామర భాషలో ఎక్కువగా కనిపిస్తాయి.

5.3.3. ధ్వని పరిణామం:

ప్రాచీన సాహిత్యం ఉన్న ఏ భాషను పరిశీలించినా భాష కాలక్రమంలో మారుతుందనే విషయం తెలుస్తుంది. ఉదాహరణకు వాఁడు, మూఁడు, తూఁగు మొదలైన పదాల్లో ఉన్న అరసున్న ఆధునిక భాషలో లోపించింది. "ఒక భాషలో ఒక కాలంలో ఉన్న ఒక ధ్వని తరువాత కాలంలో ఒకటిగాని లేక అంతకన్న ఎక్కువ ధ్వనులుగా మారటాన్ని ధ్వనిపరిణామం" (Sound Change) అంటారు. (**సుబ్రహ్మణ్యం, పి.ఎస్., ఆధునిక బాషశాస్త్ర సిద్ధాంతాలు,1997, పుట.** 22)

5.3.3..1. వర్ణ సమీకరణం:

వేరువేరు అచ్చులు పొరుగు అచ్చుల ప్రభావం వలన మార్పు చెందడాన్ని వర్ణ సమీకరణం అంటారు. ఈ వర్ణ సమీకరణం రెండు విధాలు **1. పరవర్ణ సమీకరణం 2. పూర్వవర్ణ సమీకరణం**.

5.3.3.1.1. పరవర్ణ సమీకరణం

చివరి అచ్చు వలన ముందు అచ్చు మార్పు చెందడమే "**పరవర్ణ సమీకరణం**"

ఉదా:

బాటలు – బాట+లు [గోలకొండ కవుల సంచిక. పుట.286]

రైతులు – రైతు+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.208]

మసీదులు –మసీదు+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.212]

వివాహములు–వివాహము+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.207]

మంత్రములు–మంత్రము+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.87]

మేకలు–మేక+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.139]

కనులు–కను+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.170]

చట్టములు–చట్టము+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.368]

చీరలు –చీర+లు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.204]

5.3.3.1.2. పూర్వ వర్ణ సమీకరణం:

ముందు అచ్చుతో చివరి అచ్చు ప్రభావం చెంది మార్పుని పొందడాన్ని **"పూర్వ వర్ణ సమీకరణం"** అంటారు.

నల్లని –నల్ల+ను [కాపుబిడ్డ,పుట.30]

దాటని–దాట+ను [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.180]

భూమిని–భూమి+ను [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.205]

కవిని–కవి+ను [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.215]

అతని –అత+ను [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.125]

తిన్నని –తిన్న +ను [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.102]

5.3.3.2. స్వర లోపం:

పదంలో అచ్చు లోపించడాన్ని "స్వరలోపం" అంటారు.

పల్కు-పలుకు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.181]

పోల్కి-పొలికి [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.81]

పూన్కి –పూనికి [గోలకొండ కవుల సంచిక,పుట.214]

వేల్పు –వేలుపు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.181]

వేడ్క –వేడుక [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.197]

గాడ్పు-గాడుపు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.197]

గుల్కు-గులుకు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.79]

మేల్మి –మేలిమి [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.499]

నిల్చు –నిలుచు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.611]

5.3.3.3.స్వరభక్తి :

సంయుక్తవర్ణాల మధ్యలో స్వరాన్ని చేర్చి సంయుక్తతను విడగొట్టడం లేదా ఉచ్చారణ క్లేశాన్ని తొలగించడం ***స్వరభక్తి***.

ఉదా:

రాత్రి-రాతిరి [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.176]

నిద్ర –నిద్దుర [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.194]

5.3.3.4. లోప దీర్ఘత:

ఒక పదాన్ని ఉచ్చరించేటపుడు ఒక వర్ణం లోపించినపుడు దాని ముందు వర్ణానికి దీర్ఘం రావడం. ఒక అక్షరం బలహీనమై లోపిస్తే ఆ లోపాన్ని పూర్తిచేయడానికి దాని పూర్వస్వరం దీర్ఘమౌతుంది.

> శాస్త్రాలు-శాస్త్రములు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.187]

5.3.3.5. తాలవ్యీకరణం [palatalization]

మూల ద్రావిడంలో ఇ ఈ ఎ ఏ ముందు ఉండే పదాది కకారం తెలుగులో చకారంగా మారడాన్ని తాలవ్యీకరణం అంటారు.

ఉదా.

- ***చిలుక*** =కిళీ [మూలాద్రవిడంలో]

చిలుక నీ కీ సుఖంబు శాశ్వతమే యెపుడు [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.194]

5.3.4. అర్థ పరిణామం:

భాషాపరిణామం ప్రధానంగా రెండురకాలు అవి: (1) భాషకు బాహిరరూపమైన శబ్దస్వరూపంలోను నిర్మాణంలోనూ జరిగే మార్పు. (2) పదజాలానికి సంబంధించినట్టి అర్థంలో కలిగే మార్పు. దీన్నే అర్థపరిణామము (semantic change) అంటాం. పద స్వరూపం మారినప్పుడు అర్థంకాని, అర్థవిపరిణామం జరిగినప్పుడు పద స్వరూపంగా మార్పు చెందాలనే నియమం లేదు. కాబట్టి భాషాపరిణామంలో శబ్దాపరిణామాలు భిన్నాలేకాని పరస్పరాశ్రయాలు కావు. భాషలో గోచరించే పరిణామం ముఖ్యంగా అర్థపరిణామం. ఎందుకు జరిగిందో నిరూపించలేము. కాని అది ఎలా జరిగిందో మాత్రం వివరించవచ్చు. తెలుగులో జరిగిన

అర్థపరిణామస్వరూపాన్ని తెలుసుకోవడానికి ముందు అర్థతత్వాన్ని గురించి కొంతగ్రహించడం అవసరం. **(రెడ్డి, జి. ఎన్. అర్థపరిణామం ,442)**

భాషాపరిణామంలో ధ్వనులమార్పుకు సంబంధించి ధ్వనిసూత్రాలను ప్రతిపాదించినట్లు భాషాశాస్త్రజ్ఞులు అర్థపరిణామానికి సంబంధించిన సూత్రనిర్ణయం చేయడం సులభసాధ్యం కాదు. సాధారణంగా భాషలో జరిగే అర్థపరిణామవిధానాలు గుర్తించవచ్చును. కాని అర్థపరిణామహేతువుల్ని మాత్రం నిర్ణయించలేము. ఈ శతాబ్దాదిలో 'Breal' అనే ఫ్రెంచిభాషాశాస్త్రజ్ఞుడు (Breal,1900) భాషల్లో జరిగే అర్థపరిణామాన్ని కొన్ని రకాలుగా వర్గీకరించాడు. అతడు ప్రతిపాదించిన వర్గీకరణ విధానాన్ని ఆధారంగా జేసుకొని తెలుగుభాషా చరిత్రలో జరిగిన అర్థపరిణామాన్ని ఈకింద స్థూలంగా పరిశీలిస్తాను. **(రెడ్డి, జి. ఎన్. అర్థపరిణామం,461)**

5.3.4.1. అర్థ వ్యాకోచం (Extension of meaning or generation of meaning):

ఒక దశలో పరిమితార్థబోధకమైన ఒక పదం అర్థవిస్తృతిని పొంది జాతివాచకమైనప్పుడు ఆపదంలో కలిగిన పరిణామం అర్థవ్యాకోచం.

ఉదా:

- గంగ =భాగిరథి
- ఓ *గంగ*నివాసీ ..

  ఓ శశాంక ప్రేయసీ .... **[తెలంగాణలో భావకవితా వికాసం,పుట.187]**

- *గంగ*నీ వొందు వదలి గాంచి వేగ [కాపుబిడ్డ,పుట.102]

5.3.4.2. అర్థ సంకోచం (Elevation of meaning or amelioration):

విస్తృతార్థమున్న ఒకపదానికి పరిమితార్థ మేర్పడినప్పుడు పరిణామానికి అర్థసంకోచమని అంటారు.

ఉదా:

- ***చీర*** = అందరూ ధరించే వస్త్రం ఆడవారి వస్త్రం– (ఆడవారి వస్త్రం)
  [కాపుబిడ్డ,పుట.40]
- **కోక** =ఆడవారు దరించే వస్త్రం [కాపుబిడ్డ,పుట.40]
- **వ్యవసాయం**= రైతులు చేసే పని[తెలంగాణలో భావకవితా వికాసం,పుట.368]

5.3.4.3. అర్థాపకర్ష (Degradation of meaning or pejoration):

రూఢిలో మౌలికార్థానికి నష్టంకలిగి పరిహాసార్థంలోగాని, నిందార్థంలోగాని, నిమ్నార్థంలోగాని జరిగిన అర్థపరిణామానికి అర్థాపకర్ష అని అంటారు

- **ముండ-వితంతువు [ఒక తిట్టు]**
- గుడిసె వ్రేటు మంచు కొనుటచే బెండిలి

  కానివాడు పెండ్లి కాక ***ముండ***. **[గోలకొండ కవుల సంచిక,పుట.171]**

5.3.4.4. వస్తు పరిణామం:

ఒక పదం భాషలో మిగిలినా అది సూచించే వస్తువు రూపం, నిర్మాణం మొ॥ వాటిలో కాలక్రమేణా చాలా భేదం రావచ్చు. ఇదే వస్తుపరిణామం. ఇది కూడా ఒక రకమైన అర్థవ్యాకోచమే.

ఉదా:

- **ఇల్లు**: గడ్డితో చేసిన ఇల్లు (అన్ని రకాలైన ఇండ్లు)
- ప్రాచీన సత్కవ్య పటలంబు లాంధ్రులు

ఇండ్ల లోపల నంత రించుచుండె [గోలకొండ కవుల సంచిక ,పుట.297]

5.3.5. ధ్వన్యనుకరణపదాలు (onomatopoetic words):

కాకి, మేక, గురక, దప్పు(వాధ్యవిశేషం) ఇత్యాది నామవాచకాలు కొన్ని, ధామ్మని, టపీమని బుడుంగుమని, ఇత్యాది క్రియావిశేషణాలు కొన్ని: గణగణ, గుడగుడ, కుతకుత, కిచకిచ, పరపర, ఇత్యాది ఆమ్రేడితక్రియావిశేషణరూపాలు కొన్ని నేటి తెలుగులో ఉన్నాయి. కాని శబ్దానుకృతులైన ఇట్టి పదాలసంఖ్య అతి స్వల్పం. (తెలుగు భాషా చరిత్ర –జి.ఎన్.రెడ్డి పుట:443)

5.3.5.1. తెలంగాణ భావకవిత్వం– ధ్వన్యనుకరణ పదాలు:

జల జల:

- తుమ్మెదలు తేనెటీగలు జుమ్ము మనగ

రాల పొన్పు పై ***జలజల*** పూలు రాల [కాపుబిడ్డ ,పుట.37]

మిలమిల:

- మీలయి ***మిలమిల*** మెరయుచుండె [కాపుబిడ్డ,పుట.40]

కటకట:

- **కటకటా** జీవనము జేయ గష్టమయ్యే [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.205]

5.3.6. జంట పదాలు:

జంట పదాలను సాహిత్యకారులు ఇలా "భాషలో సౌందర్యం కొరకు ఉపయోగించే పదాలు" ***(దళిత కథా సాహిత్యం, మాండలిక భాషా పరిశీలన, 2014:193)*** పేర్కొన్నారు. తెలుగు భాషకు సౌందర్యాన్ని అందించిన పదాలలో జంట పదాలు ఎంతో ప్రత్యేకమైనవి. వెంటవెంటనే

ఉపయోగించబడి మాట్లాడే రాసేభాషకు అందాన్ని చేకూర్చే విధంగా జంట పదాలు ఉంటాయి. ఈ పదాలను జంటగా కాకుండా ఒంటరిగా ఊహించడం కష్టం.

5.3.6.1. తెలంగాణ భావకవిత్వం – జంట పదాలు:

దేవదేవ:

- దీనులగు మమ్ము బ్రోవవే ***దేవ దేవ*** [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.205]

విచ్చలవిడి:

- ***విచ్చలవిడి*** యేగ పచ్చికయే గాని

  పల్లేయం దుద్యాన వనము లేదు [కాపుబిడ్డ, పుట.45]

కష్టసుఖములు :

- ***కష్టసుఖములకష్ట*** నొకరీతి గడుపువారు ...{కాపుబిడ్డ,పుట.29]

శత్రువులుమిత్రువులు:

- ***శత్రువులు మిత్రువులు*** సమముగా సైచువారు ..[కాపుబిడ్డ,పుట.29]

చిలుకపలుకులు:

- అగరు తిలకంబు భమ్మల నందగింప

  చిలుకపలుకులు పలికెను చిన్న పల్లె [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.479]

హడావిడి:

- ఆ రోజు చాలా ***హడావిడి***గా ఉంది శబ్దం

  ఏమిటి నాయన***హడావిడి*** అనినిశబ్దంప్రశ్నించింది

  [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.605]

భయము భయము:

- ఆత్మ విశ్రాంతి కిది యొక ఆశ్రయమ్ము
- ***భయము భయము*** తెరతీసి వచ్చేదేల[తెలంగాణలో భావకవితా వికాసం,పుట.610]

కణకణ:

- ***కణకణ*** మంటున్నాయేందుకు క
  నిద్దురా రాలేదా యేమిటి? [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.575]

5.3.7. అలంకారాలు:

"అలంక్రియతే ఇతి అనేన ఇత్యలంకార" అని అలంకార శబ్ద వ్యుత్పత్తి అనగా వస్తువును దరంగా తీర్చిదిద్దే దానికి 'అలంకారం' అని పేరు. లౌకిక వ్యవహారంలో అలంకారాలను సొమ్ములు, నగలు అంటారు.

అలంకారికులు కావ్యాన్ని శరీరంతో పోల్చారు. ఏ విధంగానైతే మనిషి అందంగా ఉండడానికి అలంకారాలు పెట్టుకుంటాడో అదేవిధంగా కవిత్వంలో కూడా. అలంకారాలను వినియోగించి ఆ రామణీయకతను, సొగసును, సౌందర్యాన్ని సాధిస్తారు.

శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని అలంకారాలు రెండు విధాలు. శబ్దాన్ని ఆశ్రయించుకొని ఉండేవి శబ్దాలంకారాలు, అక్షరాల పదాలు అవృత్తి వల్ల శబ్దాలంకారాలు ఏర్పడుతాయి. ఇవి చెవులకు ఇంపును కలిగించి, బాహ్యశోభకు కారణమౌతాయి. అర్థాలంకారాలు అర్థాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి అవి అందించే అర్థమే ప్రధానం.

5.3.7.1.శబ్దాలంకారములు:

శబ్దమును ఆశ్రయించుకొని, శబ్దమే ప్రధానంగా గల అలంకారాలు శబ్దాలంకారాలు.

5.3.7.1.1 వృత్త్యను ప్రాసాలంకారం:

ఒక వాక్యంలో కాని, పద్యంలో కాని ఒక హల్లు మరల మరల వస్తే దానిని వృత్త్యనుప్రాసమంటారు.

ఉదా:

- మంచు చుక్కల తోడి మించు పచ్చిక బయల్[గోల్కొండ కవుల సంచిక,పుట.193]
- కల్లు సారా వల్ల ఇల్లు గుల్ల ... [గోల్కొండ కవుల సంచిక ,పుట.141]

5.3.7.1.2. లాటానుప్రాసాలంకారం:

అర్థభేదం, శబ్దభేదం లేకుండా అవే పదాలు తాత్పర్యభేదం కలిగి అవ్యవధానంగా ప్రయోగించబడటం లాటానుప్రాసము.

ఉదా:

- దీనులగు మమ్ము బ్రోవవే ***దేవ దేవ*** [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.205]
- లలిత ర***సాల సాల*** పల్లవ ఖాదీ కోకిల [తెలంగాణలో భావకవితా వికాసం,పుట.166]

5.3.7.1.3. అంత్యాను ప్రాస:

ఒక పదము చివర కాని, పాదము చివర కాని ఒకే విధమైన వర్ణాలు కాని, వర్ణసముదాయముకాని మరల మరల వస్తే అది అంత్యాను ప్రాసమౌతుంది.

శ్రీజనుంపలి కులక్షీరాబ్ధి జని***యించి***

కంజారి సంపూర్ణ కళల ***మించి***

కకుబంతముల నెల్ల ఘనకీర్తి బర***గించి***

చాతుర్య మొప్ప భూచక్రంబు పా***లించి*** **[తెలంగాణలో భావకవితా వికాసం,పుట.540]**

5.3.8. ముగింపు:

తెలుగులో తెలంగాణ తెలుగును పోల్చితే తెలంగాణా భాషలో అనేక ప్రత్యేకతలు కనిపిస్తాయి. తెలంగాణా తెలుగు కావ్యభాషకు, గ్రాంధిక భాషకు చాల దగ్గరగా ఉంది. వేలకొలది అచ్చతెలుగు పదాలతో మనల్ని ఆశ్చర్యాచకితుల్ని చేస్తుంది. ద్రావిడ భాష పదాలు అనేకం తెలంగాణ భావకవిత్వంలో కనిపిస్తాయి. ఉర్దూ పదాలను కూడా చాల చక్కగా స్వాంగీకరణం చేసుకున్నది తెలంగాణ భావకవిత్వం. అంతే కాకుండా అద్భుతమైన జాతీయాలతో, సామెతలతో, మాండలిక పదజాలంతో, అన్యదేశ పదజాలంతో సజీవంగా ఉంది. అదేవిధంగా ప్రజలు తమ నిత్య వ్యవహారంలో మాట్లాడుకునే మాటల్లో, వ్యాక్యాల్లో, యతిప్రాసలు అలవోకగా తెలంగాణా భావకవిత్వంలో దొర్లుతుంటాయి. ఈ విధంగా తెలంగాణ భావకవిత్వంలోని భాషను అనేక కోణాల నుంచి అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ లెక్కన తెలంగాణా భాషా పరిశోధనను కేవలం భాషా పరమైన అంశాలకు మాత్రమే పరిమితం చేయకుండా, భౌగోళికంగా ప్రాంతాలవారిగా, వృత్తులవారిగా కూడా అధ్యయనం చేయవలసి ఉంది.

******

సింహావలోకనం

సింహావలోకనం

"తెలంగాణలో భావకవిత్వం– వస్తువు, శిల్పం" అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాను. ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశోధించి పరిశీలించిన అంశాలను కింద పొందుపరుస్తున్నాను..

మొదటి అధ్యాయం:

" భావకవిత్వం–స్వరూప స్వభావాలు" అనే అధ్యాయంలో భావకవిత్వ ప్రారంభ వికసాలు అనగా *20*వ శతాబ్దంతో తెలుగు సాహిత్యంలో ఎన్నో కొత్త ధోరణులు ప్రారంభమయ్యాయి. ప్రబంధాలకు కథా కావ్యాలకు విరేశలింగం పంతులు రోజుల నుంచే ప్రాధాన్యం తగ్గి ఈ కొత్త ధోరణులకు ప్రాధాన్యం పెరిగింది. వస్తువులో, స్వరూపంలో ప్రాచీన కవిత్వం కన్నా భిన్నత్వాన్ని సంతరించుకున్న ఈ కవిత్వాన్ని 'ఆధునిక కవిత్వం' అంటున్నారు. ఒక విధంగా ప్రాచీన కవిత్వ స్వరూపాన్ని కొనసాగిస్తున్న, నవ్య సాంప్రదాయ కవిత్వం కంటే ఈ కవిత్వం భిన్నమని గుర్తించడానికి కూడా 'ఆధునిక కవిత్వం' అనే పదం ఉపయోగపడుతుంది. పంతొమ్మిదోశతాబ్దం మొదటి అర్ధభాగంలో ఆంగ్లసాహిత్యంలో వచ్చిన కాల్పనిక కవిత్వం (*Romantic Poetry)* ప్రభావంతో ఈ భావ కవిత్వం తెలుగునాట 1910 – 40 సంవత్సరాల మధ్య భాగంలో వర్ధిల్లింది. భావకవిత్వాన్ని తొలి తెలుగు సాహిత్యోద్యమంగా విమర్శకులు భావించారు. గురజాడ మొదటిగా సాహిత్యంలో కొత్త పోకడలకు తెరవేసినా సంఘసంస్కరణ దృష్టితోనే సాహిత్యాన్ని సృజించారు. అయితే భావకవిత్వం ఈ సంఘసంస్కరణ ఉద్యమాన్నీ, నవ్యకవిత్వోద్యమాన్నీ భూమికగా తీసుకొన్నప్పటికీ స్వతంత్రంగా ఒక సాహితీ ఉద్యమంగా కొంతకాలం పాటు నిలబడింది. ఈ ఉద్యమం ఎంత ఆదరణ పొందిందో అంతగా ఖండనలకీ, హేళనలకీ గురిఅయింది. అయితే కేవలం మూడు దశాబ్దాల్లో వర్ధిల్లిన ఈ కవిత్వం తరువాతి కాలంలో తెలుగు నేలపై వికసించిన అనేక సాహితీ రూపాలకు మార్గం చూపింది. అలాగే భావకవిత్వ నిర్వచనాలు, భావకవిత్వ లక్షణాలను పరిశీలిస్తే కొన్ని అంశిక లక్షణాలను కనబడతాయి. అవి ఆత్మాశ్రయత్వం, స్వేచ్ఛాప్రియత్వం, ఉత్తమ పురుషలో

వ్యక్తీకరణ, గానయోగ్యత, శృంగారం, ప్రకృతి, భక్తి, స్మృతి భావకవిత్వ శాఖలను గూర్చి అలాగే భావకవుల ఊహప్రేయసీల గురించి చర్చించాను. భావకవులు ఎక్కువగా ఊహా ప్రేయసులపై కవిత్వం రాశారు. సహధర్మచారిణులపై కవిత్వం అల్లారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఊర్వశి', అడవి బాపిరాజు 'శశికళ', తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి 'హృదయేశ్వరి', నాయని సుబ్బారావు 'సౌభద్రుని ప్రణయ యాత్ర', విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని పాటలు', నండూరి సుబ్బారావు 'యెంకి పాటలు' ఇందుకు నిదర్శనాలు. వీటి పరిశీలన మూడవ అధ్యాయంలో ఉంది భావకవిత్వ నేపథ్యం, భావకవిత్వ అభివృద్ధి వికాసాలు మొదలైన విషయాలను పరిశోధన ద్వార తెలిపాను.

రెండవ అధ్యాయం:

"భావకవిత్వంపై ఆంగ్ల రోమాంటిక్ కవిత్వం–ఇతర ప్రభావాలు" అనే ఈ అధ్యాయంలో భావకవిత్వంపై గల ప్రభావాల గురించి చర్చించాను. ముఖ్యంగా దీనిపై ఆంగ్ల, బెంగాలీ సాహిత్యాల ప్రభావాన్ని గుర్తించవచ్చు. అందువల్ల భావకవిత్వ ఉద్యమం గురించి తెలుసుకునే ముందు, ఆంగ్ల సాహిత్యంలోని రొమాంటిక్ కవిత్వం గురించి, బెంగాలీ సాహిత్యంలోని రవీంద్రుని కవిత్వం గురించి తెలుకోవలసిన అవసరం చాలా ఉంది. బ్రిటీష్ వారి రాకతో ఆంగ్ల రొమాంటిక్ సాహిత్యం మొట్టమొదటగా బెంగాల్ సాహిత్యంలోకి ప్రవేశించింది. దీంతో బెంగాల్ కవులు ఆంగ్ల గ్రంథాలను అనువదించారు. రవీంద్రుడు తన కవిత్వంలో క్రొత్తదనాన్ని ప్రవేశపెట్టాడు. కొంత మంది భావకవులు రవీంద్రుని సాంగత్యంలో గడపడం వల్ల బెంగాల్‌లోని నవ్య కవిత్వం కూడా తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది అందులో ముఖ్యంగా ఆంగ్ల రొమాంటిక్ కవిత్వ ప్రభావం మొదటగా క్రీ.శ.1660 ఇంగ్లాండులో రాజరికం తిరిగి నెలకొనడంతో సంప్రదాయవాదం వచ్చింది. డ్రైడెన్, పోప్, జాన్సన్ సంప్రదాయవాదులు. వారు గ్రీకు, లాటిన్ సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఆరిస్టాటిల్ అడుగుజాడల్లో నడవాలన్నారు. హేతువాదబద్ధులై ఔచిత్య నిర్ణయం కవితాభావం కన్నా ముఖ్యం అన్నారు. సృష్టికర్త నియమపాలనను సాహిత్యం ప్రతిఫలించాలన్నది వీరి వాదం. ఇటువంటి సమయంలో పూర్వ సాహిత్య నియమాలను వదిలించుకుంటూ రొమాంటిక్ కవిత్వం (క్రీ.శ.1798–1832) ఆంగ్ల సాహిత్యంలో ప్రవేశించింది. రొమాంటిక్ (*Romantic)* అనే పదం మొదట

భాషాపరంగా వాడబడింది. ఇటలీ దేశాన్ని అనాగరికులైన ఔత్తరాహులు జయించారు. వారి వల్ల దేశీయుల వాడుకలో ఉన్న లాటిన్ భాషకు అనాగరికుల భాషతో సంపర్కం కలిగి క్రొత్త భాష ఏర్పడింది. ఆ భాష పేరు రొమాంటిక్ లేక రొమాన్స్. ఫ్రాన్స్ దేశంలో ఆ పదం బహుళ ప్రచారం పొందింది. క్రీ.శ.11, 12వ శతాబ్దాలలో ఈ భాషలో సాహితీ ప్రక్రియలు ఆవిర్భవించాయి. ఆ దశలో రొమాంటిక్ పదం సాహిత్యపరంగా ఉపయోగింపబడింది. అలాగే భావకవిత్వ ఆవిర్భావం, నిర్వచనాలు, లక్షణాలు, ఆంగ్ల రొమాంటిక్ కవులు, భావకవిత్వంపై రొమాంటిక్ కవుల ప్రభావంగూర్చి, రవీంద్రుని బెంగాలి కవితాతత్వం, భావకవిత్వంపై రవీంద్రుని కవిత్వ ప్రభావం, అలాగే భావకవిత్వంపై మత సాంఘీకసంస్కరణోద్యమాల ప్రభావం అనేది ఏ విధంగా ఉందో చర్చించాను. అది మొదటగా క్రీ.శ.19వ శతాబ్దంలో వచ్చిన క్రైస్తవ మతం హిందూ మత సంప్రదాయాల మీద ప్రభావం చూపింది. క్రైస్తవ మత ప్రచారం కోసం స్థాపించిన మిషనరీలు తమ నాగరికతను, ఆచారాలను భారతదేశంలో ప్రవేశపెట్టాయి. దాని వల్ల హిందూ మతంలో వస్తున్న మార్పులకు వ్యతిరేకంగా మత సాంఘిక సంస్కరణోద్యమాలు భారతదేశంలో మొదలయ్యాయి. 'బ్రహ్మ సమాజం' అటువంటిదే, ఈ బ్రమహాసమాజం మొదటగా భారతదేశం పైన, ఆ తరువాత ఆంధ్రదేశం పైన, అలాగే సాహిత్యం పైన ఏ విధంగా ప్రభావం చూపిందో చర్చించాను. ఇలా మొదలైన అంశాలను ఇందులో పొందుపరిచాను.

మూడవ అధ్యాయం:

"తెలంగాణలో భావకవిత్వం–ప్రారంభ వికాసాలు" అనే ఈ అధ్యాయంలో ముందుగా తెలంగాణ ప్రాచీన సాహిత్యంలో గల భావకవిత్వ ఛాయాలను పరిచయం చేశాను. తెలంగాణ భావకవిత్వ పూర్వ దశను పరిచయం చేశాను. అలాగే తెలంగాణలో భావకవిత ఖండికలు ముందుగా గోలకొండ కవుల సంచికలో కనిపిస్తాయి. అందుకే గోలకొండ సంచిక ఆవిర్భావం గూర్చి, తెలంగాణ భావకవితా ఆవిర్భావం గూర్చి, తెలంగాణ భావకవితా నేపథ్యం గూర్చి,తెలంగాణ భావకవులు అనగా సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, కోదాటి రామకిషన్, శేష భట్టర్ రామానుజచార్యులు,బుక్కపట్నం,తిరుమలనరసింహచార్య,ఉదయరాజుశేషగిరిరాజు,గవ్వఅమృతా

రెడ్డి,గార్లపాటి రాఘవరెడ్డి, సిరిగురుజయరావు, కైరం భూమదాసు,మామునూరు నాగభూషణరావు, సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి,గంగుల శాయిరెడ్డి,వానమామలై వరదాచార్యులు,వెల్దుర్తి మాణిక్యరావు,బూర్గుల రంగనాథరావు,దేవులపల్లి రామానుజరావు,బోయినపల్లి రంగారావు,కాలోజి నారాయణరావు, ఊటుకూరు రంగారావు తదితరులను తెలంగాణ భావకవులుగా నిలపడం జరిగింది.ఆ తరువాత తెలంగాణ భావకవిత్వానికి గల ఆధారాలు అనగాఈ సంకలనం కూర్పునకు కవితలను సేకరించిన పత్రికల వివరాలు పొందుపరిచాను. అందులో ప్రధానంగా ,

తెనుగు పత్రిక : ఇందులో 1921 నుంచి 1924 వరకు పది సంచికల జిరాక్స్ ప్రతులు లభ్యమయ్యాయి. ఇనుగుర్తి నుంచి వెలువడింది. సంపాదకులు ఒద్ది రాజు సోదరులు.

ఆంధ్రాభ్యుదయం: 1921 నుంచి 23, హనుమకొండ నుంచి వెలువడింది. ఐదు సంచికలు మాత్రమే వెలువడ్డాయి. సంపాదకుడు: పోకల సీతారామ శర్మ.

గోలకొండ పత్రిక: మొదటి సంచిక నుంచి 1940వరకు వెలువడిన సంచికలు. హైదరాబాద్ కేంద్రం. ఆయా గ్రంథాలయాలలో ఉన్నాయి. సంపాదకుడు సురవరంప్రతాపరెడ్డి. ఇందులో మొదటి రెండు సంచికలు ఎక్కడా లభ్యం కావడం లేదు. ఈ పత్రికలో అత్యధికంగా చోటు చేసుకున్న కవితలు ఇందులోనివే.

సుజాత : 1927 నుంచి 1934 వరకు వెలువడింది. దాదాపు 32 సంచికలు వెలువడింది. దీనికి ప్రింటర్, పబ్లిషర్ సురవరం ప్రతాపరెడ్డి. 8 సంచికలకు మాత్రమే ఎడిటర్ బి. ఎనశర్మ. మిగతా వాటికి ఎడిటర్ కొండా బాలకృష్ణారెడ్డి. 1952లో కూడ కొన్ని సంచికలు వెలువడింది.

వైజయంతి: 1934 35, పాలమూరు జిల్లా కొల్లాపూర్ కేంద్రం. ఎడిటర్, ఆంధ్రకు చెందిన చేబ్రోలు సరస్వతీ దేవి. ఎనిమిది సంచికలు మాత్రమే వెలువడింది. మాడపాటి బాలకోన్నత పాఠశాల వార్షిక సంచిక: ఇది ఆరు సంచికలు వెలువడింది. 1935 నుంచి ఏటా ఆరు సంచికలు వెలువడింది. యువతులు సంపాదుకులుగా ఉన్నారు.

దక్కన్ కేసరి: 1934లో వెలువడింది. ఈ పత్రికకు ఎడిటర్ అడుసు మిల్లి దత్తాత్రేయ శర్మ. ఇది ద్విభాషా పత్రిక. రెండు మూడు ప్రతులు మాత్రమే లభ్యమవుతున్నాయి.

శోభ: ఈ పత్రిక ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విద్యార్థులు 1950లలో వెలువరించారు. ఆరు ప్రతులు వెలువడింది. దీనికి సంపాదకులుగా సినారె, బిరుదు రామ రాజు వ్యవహరించారు. 1957లో కూడ ఒక సంచిక వెలువడింది. దీని ఎడిటర్ వల్లపు బుచ్చారెడ్డి రెండవ దశ కవిత సేకరణకుఈ సంచిక ఎంతో ఉపకరించింది.

విభూతి : 1936 నుంచి 1940 ల వరకు వెలువడింది. ఎడిటర్ చిదిరెమఠం వీరభద్రయ్య.

తమ జీవితాలను ఫణంగా పెట్టి తాము పుట్టిన పెరిగిన సమాజాల వికాసానికి ఎంతో పనిచేసి ఎటువంటి మన్నన లేకుండా చరిత్ర సొరుగులలో చేరిపోయిన ఈ పత్రికల సంపాదకులకు వినమ్రతతో గౌరవంతో నివాళులర్పిస్తున్నాను. ఎందుకంటే దాదాపుగా వందేళ్ల తర్వాత కూడా ఈ భావకవితలు తెలుగు సాహిత్యానికి అందించడానికి ఈ పత్రికలు ఎంతో ఉపయోగ పడ్డాయి. అందుకు సంపాదకుల మహాశయులకు ఎల్లవేళలా రుణపడి ఉంటాను. అదే విధంగా తెలంగాణ భావకవితా లక్షణాల గురించి, ఇలా మొదలైన అంశాలను ఈ అధ్యాయనంలో కూలంకషంగా వివరించాను.

నాల్గవ అధ్యాయం:

"తెలంగాణలో భావకవిత్వం– వస్తువైవిధ్యం" అనే ఈ అధ్యాయంలో తెలంగాణ భావకవులు రాసిన ఖండికలను తీసుకొని అందులో గల వస్తువైవిధ్యాన్ని పరిశీలించాను. ఇందులో ముందుగా వస్తువు నిర్వచనం అనగా ఏ వస్తువుకైనా మానవ జీవితమే పునాది. ఒక సంఘటనగాని, అనుభవంగాని, భావనగాని ఏదైనా వస్తువుగా ఉపయోగపడుతుంది. దీనిని బట్టి వస్తువును రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి ప్రత్యక్ష వస్తువు అంటే 'కవి భౌతిక ప్రపంచం వల్ల ఏర్పడిన సంబంధం నుండి గ్రహించింది'. రెండోది పరోక్ష వస్తువు. అంటే 'కవికి సంబంధించిన అదృశ్య మనఃస్థితి నుండి ఏర్పడినది' ఆధునిక కవి ఎక్కువ భాగం సమాజంలో వాస్తవికమైన ప్రత్యక్ష

జీవితాన్నే కవితా వస్తువుగా స్వీకరిస్తున్నాడు. ప్రాచీన కాలంలో వస్తువు ఎంపికలో కొన్ని పరిమితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆధునిక కాలంలో వివిధ సామాజిక నేపథ్యాలు, వివిధ సాహిత్య ఉద్యమాల కారణంగా వస్తు విస్తృతి పెరిగింది. మిగతా సాహిత్య ప్రక్రియలన్నింటికంటె కవిత్వంలో వస్తువైవిధ్యం ఎక్కువగా కనిపిస్తుంది. అదే విధంగా వస్తువు లక్షణాల గూర్చి , భావకవిత్వంలో గల ప్రణయ శాఖ, ప్రకృతిశాఖ, భక్తి, దేశభక్తి, సంఘసంస్కరణం , స్మృతి , గల వివిధ అంశాలను అనేక కోణాలలో భావకవిత్వ నేపథ్యంలో చక్కగా విశ్లేషిస్తూ, అందులో గల వస్తు వైవిధ్యాన్ని చర్చించాను.

ఐదవ అధ్యాయం:

"తెలంగాణలో భావకవిత్వం– శిల్పం, భాష" అనే ఈ అధ్యాయంలో ముందుగా శిల్పం నిర్వచనం, శిల్పం లక్షణాలు, శిల్పంగాలు (శీర్షికలు, ఎత్తుగడ, ముగింపు, ఆద్యంతాల సమన్వయం, నిర్వహణ, ఛందస్సు, తూగు అంతర్లయ,అలాగే నిర్మాణ వైవిధ్యంలో దీర్ఘ పాదాలు, పొట్టి పాదాలు, మినీ కవిత, స్టాంజా కవిత్వం). అలాగే తెలంగాణ భావకవిత్వంలో గల మాండలిక పదాలు, అన్యదేశాలు, ధ్వని పరిణామం, అర్థ పరిణామం, ధ్వన్యనుకరణ పదాలు, జంట పదాలు, అలంకారాలు వంటి మొదలైన భాషాంశాలను ఈ అధ్యాయంలో పొందుపరిచాను.

******

ఉపయుక్త గ్రంథాలు

ఉపయుక్త గ్రంథ సూచి

1. అప్పారావు, గురజాడ.1965. ముత్యాల సరాలు. విజయవాడ. విశాలాంధ్ర బుక్ హౌజ్.

2. అరుణకుమారి, జి. 2009. తెలుగుకవిత్వం భవిష్య దర్శనం. హైదరాబాద్. స్వీయ ప్రచురణ.

3. ఆంజనేయులు, కుందుర్తి.1987. వీరేశలింగం నుండి భావకవిత్వం వరకు.కుందుర్తి వ్యాసాలు. హైదరాబాద్ . తెలుగు పరిశోధన ప్రచురణలు.

4. ఆరుద్ర, 2005. సమగ్రాంధ్ర సాహిత్యం. హైదరాబాద్. తెలుగు అకాడమీ

5. ఇనాక్, కొలకలూరి. 2010. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం. హైదరాబాద్. గ్రంథమాల.

6. కాత్యాయనీ విద్మహే. 2010. సాహిత్య ఆకాశంలో సగం.వరంగల్. అశోక ప్రింటర్స్

7. కాత్యాయనీ విద్మహే.1987. ఆధునికాంధ్రమీద రవీంద్రుని ప్రభావం – సమాలోచన. హైదరాబాద్. స్వీయ ప్రచురణ.

8. కృష్ణకుమారి, నాయని.1980. 20ఎండ్ల తెలుగు కవిత్వంలో భావకవిత్వం చ్చాయలు. హైదరాబాద్. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

9. కృష్ణశాస్త్రి, దేవులపల్లి. 1982. ఊర్వశి. మద్రాస్. రాజహంస ప్రచురణలు.

10. కృష్ణశాస్త్రి, దేవులపల్లి. 2019. కృష్ణపక్షం. హైదరాబాద్. నవచేతన పబ్లిషింగ్ హౌజ్.

11. గౌరీ శంకర్, జూలూరి. 1993. ఆధునిక కవిత్వం. విజయవాడ. నాగేంద్ర ప్రెస్.

12. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. 2014. ప్రతిఫలం (ఆధునిక తెలుగు కవిత్వ విమర్శ). హైదరాబాద్. విశాలాంధ్ర బుక్ హౌస్.

13. చలం. 1986. గీతాంజలి. విజయవాడ. అరుణ పబ్లిక్ హౌజ్.

14. జగన్ రెడ్డి, సామిడి. 2017. తెలంగాణలో భావకవితా వికాసం. హైదరాబాద్. తెలంగాణ సాహిత్య అకాడమీ.

15. జయప్రభ. 1988. భావకవిత్వంలో స్త్రీ. హైదరాబాద్. చైతన్య తేజ పబ్లికేషన్స్.

16. జయరాములు, బి. 2013. ఆధునికాంధ్ర కవులు. హైదరాబాద్. నవోదయ బుక్ హౌస్.

17. తిరుపతి, భూక్యా. 2019. సమకాలీన తెలుగుసాహిత్యం సమాలోచన వ్యాసాలు. వరంగల్. శ్రీకృష్ణ బైండింగ్ వర్క్.

18. తిరుపతి, భూక్యా. 2017. కాళోజీ రచనల్లో సమాజం భాష. చిత్తూరు. విజయవాడ.

19. బాలగంగాధర్ తిలక్. 2019, అమృతం కురిసిన రాత్రి. హైదరాబాద్. విశాలాంధ్ర ప్రచురణలు.

20. నందిని సిధారెడ్డి. 1988. ఆధునిక తెలుగు కవిత్వం వాస్తవికత అదివాస్తవికత. హైదరాబాద్. మాస్టర్ ఆర్ట్స్ ప్రింటర్స్.

21. నారాయణరావు, వెల్చేరు. 1978. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. విజయవాడ. విశాలాంధ్ర బుక్ హౌస్.

22. నారాయణ రెడ్డి, సి. 1977. ఆధునికాంధ్ర కవిత్వం,సంప్రదాయాలు– ప్రయోగాలు. హైదరాబాద్. నవరత్న బుక్ హౌస్.

23. నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. 2016. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. హైదరాబాద్. తెలుగు అకాడమి.

24. నాగభూషన శర్మ, మొదలి. 2008. నాటక శిల్పం. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లికేషన్స్.

25. నాగయ్య , జి .2004. సాహిత్య సమీక్షలు (1&2వ సం.). హైదరాబాద్. నవ్య పరిశోధక ప్రచురణ.

26. ప్రకాశరావు, శివలెంక. 1978. భావకవులు ప్రతిభవిస్ఫూర్తి. హైదరాబాద్. తెలుగు విశ్వ విద్యాలయం.

27. ప్రతాప రెడ్డి, సురవరం. 2009. గోలకొండ కవుల సంచిక. హైదరాబాద్. తెలంగాణ జాగృతి.

28. భద్రిరాజు , కృష్ణమూర్తి. 2012. భాష సమాజం సంస్కృతి. హైదరాబాద్. నీల్ కమల్ పబ్లికేషన్స్.

29. భద్రిరాజు కృష్ణమూర్తి. 2022. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాద్. లేపాక్షి ప్రింటర్స్

30. భాస్కర్, నల్లిమెల. 2021. తెలంగాణ భాష క్రియా పదాలు. కరీంనగర్. సత్యనారాయణ అప్సెట్ ప్రింటర్స్.

31. భాస్కర్, నలిమెల. 2017. తెలంగాణ భాష దేశ్య పదాలు. హైదరాబాద్. సాయి ప్రింటర్స్.

32. భూమయ్య, అనుమాండ్ల. 1981. నాయని సుబ్బారావు కృతులు– పరిశీలన. హన్మకొండ. స్వీయ ప్రచురణలు.

33. భూమయ్య, అనుమాండ్ల. 2013. తెలంగాణ భావ విపంచిక. గోలకొండ కవుల సంచిక. హైదరాబాద్. నవోదయ బుక్ హౌజ్.

34. బాపిరాజు ,అడవి.1984. శశికళ. విజయవాడ. జయంతి పబ్లికేషన్స్.

35. బసవరాజు అప్పారావు. 1955. బసవరాజు అప్పారావు గీతాలు. రాజమండ్రి. కాళహస్తి తమ్మారావు అండ్ సైన్స్

36. మధుసూదన్ రావు, త్రిపురనేని. 2011. సాహిత్యంలో వస్తూ శిల్పాలు. హైదరాబాద్. నవోదయ బుక్ హోజ్.

37. మందేశ్వరా రావు, వదలి. 1994. పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర సిద్ధాంతాలు. హైదరాబాద్. విశాలాంధ్ర బుక్ హౌస్.

38. మాధవ శర్మ, పాటిబండ. 1935. ఆధునికాంధ్ర భావకవిత్వం. హైదరాబాద్. పొట్టిశ్రీరాములు విశ్వ విద్యాలయం.

39. ముద్దుకృష్ణ, 1987.వైతాళికులు. విజయవాడ. విశాలాంధ్ర ప్రచురణలు.

40. మునిరత్నం నాయుడు, డి. 1985. తెలుగులో సావిత్రి చరిత్ర. చిత్తూరు జిల్లా. లక్ష్మి ప్రచురణలు.

41. రాజేశ్వరరావు, నోరి. 2014. కృష్ణశాస్త్రి సాహిత్య వైభవం. హైదరాబాద్. నవోదయ బుక్ హౌజ్.

42. రాజేశ్వరి, శివుని. 2012. ఆధునిక తెలుగు భాష నిర్మాణం. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్.

43. రామచంద్రయ్య, పనతుల 1966. తెలుగు కవిత్వంలో ఎలిజి. హైదరాబాద్. భారతి బుక్ హౌజ్.

44. రామారావు, చేకూరి. 2000. భాషానువర్తనం. హైదరాబాద్. చరితాగ్రాఫిక్స్.

45. రామలింగం, డి, 2019. బూర్గుల రామకృష్ణా రావు జీవిత చరిత్ర. హైదరాబాద్. తెలంగాణ. సాహిత్య అకాడమీ.

46. రామ్మోహన్, కడియాల,1982. తెలుగు కవితా వికాసం. హైదరాబాద్. సాహిత్య అకాడమి.

47. రెడ్డి, డా.డి.సి.1986. ద్రౌపది తులనాత్మక పరిశీలన. తిరుపతి. ప్రియదర్శిని పబ్లికేషన్స్.

48. రవీంద్రబాబు, ఎ. 2008. కొలకలూరి ఇనాక్ రచనలు–వస్తురూప పరిశీలన. హైదరాబాద్. వెన్నెల ప్రచురణలు.

49.లక్ష్మణ రావు,గండ్ర. 2017. తెలంగాణ పద్యకవిత వైభవం. హైదరాబాద్. తెలంగాణా సాహిత్య అకాడమి.

50. లక్ష్మి కాంతం, పింగళి. 1998. ఆంధ్ర సాహిత్య చరిత్ర. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

51. లక్ష్మి కాంతం, పింగళి. 2012. సాహిత్య శిల్ప సమీక్ష. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

52. లక్ష్మి నర్సయ్య, జి. 2015. కవిత్వ నిర్మాణ పద్ధతులు. సికింద్రాబాద్. ప్రతీక పబ్లికేషన్స్.

53. లక్ష్మీ నరసయ్య, జి. 2021. కవిత్వం–చర్చనీయాంశాలు, హైదరాబాద్, కర్షక ఆర్ట్స్ ప్రింటర్స్.

54. లావణ్య సరస్వతి, ఎం. 1988. రాయ ప్రోలు రచనలు పరిశీలన–తత్వవివేచన, హైదరాబాద్. ఆంధ్ర సారస్వత పరిషత్.

55. విజయకుమార్, గుర్రం. 2005. తెలుగులో గేయ కవిత్వం– సామాజిక చైతన్యం. హైదరాబాద్. సాయి కృష్ణ ప్రింటర్స్.

56. వినోదిని, ఎం. ఎం. 2011. స్త్రీవాద కవిత్వం భాషా వస్తురూప నవీనత. హైదరాబాద్. చరిత ఇంప్రెషన్స్.

57. విరేశలింగం,కందుకూరి. 2008. ఆంధ్ర కవుల చరిత్ర, హైదరాబాద్. విశాలాంధ్ర.

58. వీర భద్రరావు, కొత్తపల్లి.1960 .బెంగాలీ సాహిత్య చరిత్ర. న్యూఢిల్లీ. సాహిత్య అకాడమీ.

59. వెంకటరామ నరసింహం, కాకర్ల. 1982. ఆధునికాంధ్ర కవితా సమీక్ష. విజయవాడ. గంగాధర పబ్లికేషన్స్.

60. వెంకట రామిరెడ్డి, అట్లూ. 2014. శైలీ శిల్పం వెయ్యేళ్ళ తెలుగు కవిత్వం. హైదరాబాద్. విశాలాంధ్ర.

61. వెంకటరావు, కవికొండల. 1934. భావకవిత్వం.హైదరాబాద్, ప్రభుధాంధ్ర.

62. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 2016. కథశిల్పం. హైదరాబాద్. విశాలాంధ్ర బుక్ హౌస్.

63. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 2021. నవలాశిల్పం. హైదరాబాద్, విశాలాంధ్ర బుక్ హౌస్.

64. వెంకటేశ్వర్లు, పతంగి. 2020. అభ్యుదయ కవులపై తెలంగాణ విమోచనోద్యమ ప్రభావం. హనుమకొండ. శ్రీ దీప్తి ప్రింటర్స్.

65. వెంకటేశ్వర్లు, బూదాటి. 2014. తెలుగు సాహిత్య ప్రక్రియలు ధోరణలు. హైదరాబాద్. హిమాకర్ పబ్లికేషన్.

66. శరత్ జ్యోత్స్న రాణి, ఎస్. 2003. స్వాతంత్ర్య నంతర తెలుగు కవితా వస్తువు,రూపం,శిల్పం. హైదరాబాద్. జ్యోత్న కల ప్రీత ప్రచురణ.

67. శరత్ జోత్స్నారాణి, ఎస్. 2017. ఆధునిక తెలుగు విమర్శనా పద్ధతులు. హైదరాబాద్. కర్షక ఆర్ట్స్ ప్రింటర్స్.

68. శాయిరెడ్డి, గంగుల. 2019, కాపుబిడ్డ, హైదరాబాద్. తెలంగాణ సాహిత్య అకాడమీ.

69. శిఖామణి, 2006. సమాంతర (ఆధునిక కవిత్వ వ్యాసాలు). హైదరాబాద్. అనుపమ ప్రింటర్స్.

70. శివప్రసాద్, ముదిగొండ.1990. సాహిత్య ఉద్యమాలు–భావకవిత్వం. హైదరాబాద్. ఉద్యమ దర్శనం.

71. శివరామకృష్ణ, పెన్నా. 2017. గోరంటి వెంకన్న కవితా పరామర్శ. హైదరాబాద్. చరితా ఇంప్రెస్స్.

72. శివశంకర శాస్త్రి, తల్లావఝుల.1954. హృదయేశ్వరి. రేపల్లె. సాహితి సమితి.

73. శివారెడ్డి, ఎల్లూరి &చెన్నయ్య, జె. 2020. వచన కవిత్వం వస్తు,శిల్పాలు. హైదరాబాద్. సాయి లిఖిత ప్రింటర్స్.

74. శ్రీకాంతశర్మ, ఇంద్రగంటి, 2007. ఆలోచన (సాహిత్య వ్యాసాలు) హైదరాబాద్. నవ్య హిమాయత్ ప్రచురణలు.

75. శ్రీనివాస్, కె. 2019. తెలంగాణ సాహిత్య వికాసం. హైదరాబాద్. నవోదయ బుక్ హౌస్.

76. శ్రీరామ చంద్రుడు, పుల్లెల. 2002. అలంకార శాస్త్ర చరిత్ర. హైదరాబాద్. తెలుగు యూనివర్సటీ.

77. సత్యనారయణ రావు, యుండమూరి. 1960. ఉషాకిరణాలు. విజయవాడ. ఆదర్శ మండలి.

78. సత్యనారయణ, విశ్వనాథ. 1970. కిన్నెరసాని పాటలు. విజయవాడ. పి.ఎస్.ఎస్.అండ్ కో.

79. సత్యనారాయణ, పి. 1981. రాయప్రోలు వారి సాహిత్యాలలో నవ్యత–సమాలోచన. హైదరాబాద్. స్వీయ ప్రచురణలు.

80. సిమ్మన్న, వెలమల. 2011. తెలుగు సాహిత్య చరిత్ర. విశాఖపట్టణం. దళిత సాహిత్య పీఠం.

81. సీతారామ భట్టాచార్య, కురుంగంటి. 1949. నవ్యాంధ్ర సాహిత్య వీధులు. హైదరాబాద్. సాహిత్య పరిషత్.

82. సుజాత రెడ్డి, ముదిగంటి, 2004. చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్. నవోదయ బుక్ హౌజ్.

83. సుజాత రెడ్డి, ముదిగంటి. 2015. తెలంగాణ సాహిత్య చరిత్ర. హైదరాబాద్. ఆంధ్ర సారస్వత పరిషత్తు.

84. సుబ్బారావు, నండూరి. 1953. సరాగాలు. యెంకి పాటలు. ఏలూరు. జెమిని ప్రింటర్స్.

85. సుబ్బారావు, నండూరి. 1982. మాతృగీతలు– ఇతర కృతులు. హైదరాబాద్. ఆంధ్ర సారస్వత పరిషత్తు.

86. సుబ్బారావు, నాయని. 1958. సౌభద్రుని ప్రణయ యాత్ర. సికింద్రాబాద్. అజంతా ప్రింటర్స్.

87. సుబ్బారావు, రాయప్రోలు. 1963. స్నేహలత. సికింద్రాబాద్. అజంతా ప్రింటర్స్.

88. సుబ్బారావు, రాయప్రోలు. 1981. తృణకంకణం. హైదరాబాద్. వంశీ ప్రచురణలు.

89. సుబ్రహ్మణ్యం, జి.వి. 1991.సాహిత్యంలో చర్చనీ య అంశాలు. తెలుగు అకాడమీ.

90. సూర్య ధనంజయ, 2019. సినారే సాహితీ వైభవం. హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ.

నిఘంటువులు:

1. చక్రధరరావు, లకంసాని (సంపా).1987. తెలుగు వ్యుత్పత్తి కోశం (6వ సం.). వాల్తేరు, విశాఖపట్టణం. ఆంధ్ర విశ్వకళా పరిషన్ముద్రణం.

2. బ్రౌన్ సి.పి. 1988. బ్రౌణ్య – ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు. Asian Educational Services, New Delhi Madras.

3. రెడ్డి జి.ఎన్. తెలుగు నిఘంటువు. (విద్యార్థుల కొరకు). హైదరాబాదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

4. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2008. శబ్ద రత్నాకరము. (సంపూర్ణ నిఘంటువు). విజయవాడ. విక్టరీ పబ్లికేషన్స్.

5. సుబ్బయ్యశాస్త్రి, కాశీభట్ల. 1944. శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు. (చతుర్థ సంపుటి). హైదరాబాద్. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి .

******

అనుబంధం-1

సంపుటి : 10
సంచిక : 1
పుటలు : 52
రూ. 25 లు
ISSN No. 2582-8738
యు.జి.సి. గుర్తింపు పొందినది

పాఠకులకు, ప్రకటనకర్తలకు ఉగాది శుభాకాంక్షలు

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

మార్చి, ఏప్రిల్ 2024

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరుగనున్న ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి 24, 2024 సాయంత్రం 5.30 గం.లకు తెలుగుభాషోద్యమ సమాఖ్య ప్రజా చైతన్య సభ నిర్వహించింది.సమాఖ్య అధ్యక్షుడు గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ, సిపిఐ(ఎం), జనసేన, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు పాల్గొని తెలుగులో విద్య, ప్రజల భాషలో పాలన విషయంలో తమ పార్టీల విధానాలను వివరించారు. ఉపాధ్యాయ నేత, శాసనమండలి (విశ్రాంత) సభ్యులు వీరపు బాలసుబ్రహ్మణ్యం, సమాఖ్య కార్యదర్శి వర్గ సభ్యుడు డా.గుంటుపల్లి శ్రీనివాస్ విద్యారంగంలోనూ, పాలనా రంగంలోనూ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న విధ్వంసాన్ని వివరిస్తూ కీలకోపన్యాసాలు చేశారు. ప్రధాన కార్యదర్శి మొవ్వా శ్రీనివాసరెడ్డి ప్రతిపాదించిన 5 తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

తెలుగుభాషోద్యమ సమాఖ్య నిక్కచ్చులు(డిమాండ్లు)

1. తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా పూర్తిస్థాయిలో నెలకొల్పాలి
2. అన్ని ప్రభుత్వ రంగాలలో తెలుగును అధికార భాషగా అన్ని స్థాయిలలో అమలుచేయాలి.
3. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 20% రిజర్వేషన్లు ఇవ్వాలి. (తమిళనాడులో వలె)
4. రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోనూ పూర్తి సామర్థ్యంతో తెలుగులో పనిచేసే కంప్యూటర్ వ్యవస్థను విధిగా ఏర్పాటుచేయాలి.
5. తెలుగు జాతి జనులు తమ మాతృభాషలో అన్నిరంగాలలో అభివృద్ధి చెందేందుకు రాజ్యాంగపరంగానూ, సహజ న్యాయంగానూ తమకు లభించిన హక్కులను వినియోగించుకోవడానికి రాజకీయపార్టీలన్నీ తమ సమర్థనను ప్రకటించాలి. ఇతర భాషల ఆధిపత్యం నుండి విముక్తికై ఉద్యమించాలని కూడా అందరికీ తెలుగు భాషోద్యమ సమాఖ్య అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పిలుపును ఇచ్చింది.

జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు నిర్యాణం

నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి పత్రికలకు, తెలుగు భాషోద్యమానికీ తొలినుండి వెన్నుదన్నుగా నిలిచిన జస్టిస్ (విశ్రాంత) ఎ.రామలింగేశ్వరరావు 2024 ఏప్రిల్ 5న అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు.

మళ్ళీ ఎన్నికలు వచ్చేశాయ్... మరి తెలుగు సంగతేంటి!?

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం.
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర,తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ వున్న తెలుగువారి కోసం

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు: డా.సామల రమేష్‌బాబు 9848016136

సహసంపాదకుడు: ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, 9866128846

తోడ్పాటు డా. వెన్నిసెట్టి సింగారావు, డా. సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్
సరస్వతుల రామనరసింహం (సరసి), తమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి



మార్చి, ఏప్రిల్ 2024

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం, సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట- ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1.వ్యాసాలు,కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుండి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి.వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో పంపాలి. అనుఫాంట్‌లో టైప్ చేసినట్లయితే పి.యండి, మరియు పిడిఎఫ్‌లలో కూడా పంపాలి. లేదా ఎ4 సెజు కాగితంపై వ్రాసి,స్కాన్ చేసి పంపాలి editorammanudi@gmail.com కు మాత్రమే పంపాలి. కొరియర్‌లో గాని, రిజిష్టర్ పోస్టులో గాని పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నెంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనలను తీసుకోలేము

4.హామీ పత్రం తప్పనిసరి: రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగా రచనతో జోడించాలి. హామీ పత్రం లేని రచనలను ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.

లోపలి పుటలలో.....

ఇవీ సంగతులు..	ఇవీ సంగతులు...	.....	05
.....	ఐరాస సందేశం	జెద్రే అజోలే	06
సంపాదకీయం	మళ్ళీ ఎన్నికలు వచ్చేశాయ్	గారపాటి ఉమామహేశ్వరరావు	07
జయంతి.	భాషా రాష్ట్రాలు-	.....	10
శ్రద్ధాంజలి.	ఆశయాలతో సంకల్పం....	డా. సామల రమేష్‌బాబు	11
తె.భా.స.	ప్రజా చైతన్య సభ	.....	13
సాంకేతికం	అంతర్జాలంలో తెలుగు..	రహ్మానుద్దీన్ షేక్	30
పరిశోధన	భాష-సమాజం-సంపద	జె.డి.ప్రభాకర్	31
పరిశోధన...	భాషా పరిశీలన	కామెర పురుషోత్తం	36
పరిశోధన.....	తెలుగులో సమానా...	ఇమ్మానియేలుబాబు కారుమంచి	39
శ్రద్ధాంజలి	బుద్ధిస్టు దేవన నిర్యాణం	వెన్నెలకంటి రామారావు	42
ఆదర్శం	మంచి పుస్తకం	రహ్మానుద్దీన్ షేక్	44
సాహిత్య రంగం	నిర్మోహ విమర్శ	మధురాంతకం నరేంద్ర	47
వెలిసిపోతున్న పదాలు	సత్రకాయ	జి.వి.పూర్ణచందు	49
.....	గ్రంథాలయం	.....	50

ఫొటోలు	కార్టూన్‌లు	కంప్యూటర్
టి.యస్.రెడ్డి	సరసి	యన్.రాజారావు

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు.

రచనలను, వార్తలను, వాట్సాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫొటోలు, రచనలను కొందరు వాట్సాప్‌లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్/ రిజిష్టర్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. - సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా

సంపాదకుడు: **అమ్మనుడి**,, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136*, *e-mail* : editorammanudi@gmail.com

రచయితల అభిప్రాయాలు వారి స్వంతం, వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు

పరిశోధన

కామెర పురుషోత్తం
9603705803

తెలంగాణ భావకవిత్వం – భాషా పరిశీలన

మూలం:కాల్పనిక సాహిత్యమనీ, భావకవిత్వమనీ రెండూ పర్యాయపదాలుగా ఒకే విషయాన్ని వివరిస్తున్నాయి. ఆంగ్లంలో రొమాంటిసిజం అన్న పదం తెలుగులో ఈ రెండు పదాల సృష్టికి మూలమయింది. గేయకవిత్వం (లిరికల్ పోయిట్రీ) అనే పదం మరొకటి ఉందనీ అది కాల్పనిక సాహిత్యానికీ, భావకవిత్వానికీ అనువాదాలని భావించే స్థితి లేకపోలేదు. అందువల్ల వివరణ అవసరం. రొమాంటిసిజం అనే ఆంగ్లపదమే భావకవిత్వం, కాల్పనిక కవిత్వం, భావుకత, కాల్పనిక సాహిత్యంగా తెలుగులో పిలవబడుతున్నవాటికి మూలం. నేపథ్యం : యూరపు దేశాలలో మారిన సాంఘిక పరిస్థితులు కారణంగా 18 వ శతాబ్ది చివరి భాగంలో సాహిత్యరంగంలో కాల్పనిక ఉద్యమం బయలుదేరింది. ఇది ఒక విధంగా ప్రాచీన సాహిత్య దృక్పథాన్ని సవరించే ధోరణిలో ఆరంభమయింది. ఈ దృక్పథాన్ని తిరస్కరిస్తూ సంప్రదాయ నవ్య సంప్రదాయ వాదాలు పుట్టాయి. 19 వ శతాబ్దిలో ఈ మూడు వాదాలూ మార్క్సిష్ట సాహిత్య దృక్పథంతో సంఘర్షించాయి. ఇటువంటి క్రమ పరిణామం తెలుగులో రాలేదు. యూరపు దేశాలలో బయలుదేరిన ఎన్నో సాహిత్య ఉద్యమాలు ఒకేసారి 20 వ శతాబ్దిలో తెలుగులో ప్రవేశించాయి.

సంప్రదాయ, నవ్య సంప్రదాయవాదాలు వేరువేరుగానూ, పునరుజ్జీవన సాహిత్యంలో భాగంగానూ ఈ శతాబ్ది ఆరంభం నుంచీ తెలుగులో రూపుదిద్దుకొన్నాయి. పునరుజ్జీవన సాహిత్యం, అందువల్ల, అటు సంప్రదాయ దృష్టినీ, ఇటు ఆధునికతా దృష్టినీ, కలగాపులగంగా కలుపుకొని ప్రవర్తించింది. 1910 లో కాల్పనిక ఉద్యమం, 1930 లలో మార్క్సిష్ట ఉద్యమం తెలుగులో ఆరంభమయ్యాయి. తెలుగులో ఇవి సంఘర్షణాత్మకంగా లేవు. ఒకదాని పరిణామంగా మరొకటి ప్రభవించింది. భావ కవిత్వమే అభ్యుదయ కవిత్వానికి మార్గం ఏర్పరచినట్లు నిలిచింది. విభిన్న సాహిత్య ధోరణులు ఏక కాలంలో భిన్న ధర్మ ప్రబోధకాలుగా తెలుగు సాహిత్యంలో నిలదొక్కుకొన్నాయి.

తెలుగులో భావ కవిత్వం: 20వ శతాబ్దంతో తెలుగు సాహిత్యంలో ఎన్నో కొత్త ధోరణులు ప్రారంభమయ్యాయి. ప్రబంధాలకూ కథా కావ్యాలకూ విరేశలింగం పంతులు కాలం నుంచే ప్రాధాన్యం తగ్గి ఈ కొత్త ధోరణులకు ప్రాధాన్యం పెరిగింది. వస్తువులో, స్వరూపంలో ప్రాచీన కవిత్వం కన్నా భిన్నత్వాన్ని సంతరించుకున్న ఈ కవిత్వాన్ని 'ఆధునిక కవిత్వం' అంటున్నారు. ఒక విధంగా ప్రాచీన కవిత్వ స్వరూపాన్ని కొనసాగిస్తున్న నవ్య సాంప్రదాయ కవిత్వం కంటే ఈ కవిత్వం భిన్నమని గుర్తించడానికి కూడా 'ఆధునిక కవిత్వం' అనే పదం ఉపయోగపడుతుంది.

ఆధునిక కవిత్వం తొలి రోజుల్లో వచ్చిన రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు మొదలైన కవుల కవిత్వాన్ని గురించి ఆయా కవులు గీత కవిత్వమనీ, కాల్పనికి కవిత్వమనీ, అభినవ కవిత్వమనీ నవ్య కవిత్వం అనీ పిలుచుకున్నారు. మొత్తం మీద ఈ కవిత్వం విషయంలో భావ కవిత్వం అనే పదమే స్థిరపడింది.

భావకవిత్వం ముఖ్యంగా పూర్వ ప్రబంధాల పట్ల ప్రతిక్రియగా, సంఘసంస్కరణ ఉద్యమాలు, పాశ్చాత్య సాహిత్య సాంకేతిక విజ్ఞానాల వ్యాప్తి, ప్రధానంగా యూరపులో 18వ శతాబ్దంలో విజృంభించిన రొమాంటిక్ కవిత్వ ప్రభావం వంగాది భాషలలోని కొత్త రచనారీతుల ప్రభావం అందులో ప్రధానంగా రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల ప్రభావం కారణంగా ఆవిర్భవించింది అంటారు.

భావకవిత్వ లక్షణాలు: ప్రకృతి ప్రీతి, స్వేచ్ఛాప్రియత్వం, ప్రణయం – ఊహాసుందరి – విరహం – వేదన, భక్తి, దేశభక్తి సంఘ సంస్కరణాభిలాష, మార్మికత– సూఫీతత్వం, స్త్రీ ఉదాత్త చిత్రణ, మానవ సామాజిక స్పృహ, స్మృతి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తెలంగాణ నేపథ్యం:తెలుగు సమాజల్లో భావ కవిత్వం 20వ శతాబ్దం తొలినాళ్లలో విస్తరించింది. కానీ ఇంతవరకు మనకు తెలిసిన, మనం చదువుకున్న సాహిత్య చరిత్రలు, పరిశోధన గ్రంథాలు భావ కవిత్వం అంటే ఆంధ్ర కవిత్వం అనే విధంగానే చూపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో భావకవితా వికాసం అనే సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా అచ్చు వేసింది. దీనికి సామిడి జగన్ రెడ్డి సంపాదకత్వం వహించారు. తెలంగాణలో భావ కవిత్వాన్ని రెండు దశలుగా, 1920–43 వరకు ఒక దశ, 1948–66 వరకు మరొక దశగా విభజించుకోవడం జరిగింది.

సురవరం ప్రతాపరెడ్డి భావకవి రామ్మూర్తి పేరుతో అనేక భావ కవితా సమీక్షలు రాశారు. వాటన్నిటినీ సేకరిస్తే భావ కవిత్వం తెలంగాణలో ఇంకెంత విలసిల్లిందో తెలుస్తుంది. భావ కవిత్వ చరిత్రను పూర్తిగా మార్చి కొత్త చరిత్ర రాసుకోవాల్సిన అవసరాన్ని తీసుకువచ్చింది. తెలంగాణ భావ కవిత్వంలో అనువాద కవితలు కూడా ఉన్నాయి. అనంతరం తెలంగాణలో వెలువడుతున్న భావ కవిత్వాన్ని వెక్కిరిస్తూ సురవరం రెండు వ్యంగ్య కవితలు రాశాడు. కృష్ణపక్షాన్ని వ్యతిరేకిస్తూ శుక్లపక్షం సంకలనం వచ్చింది. ఈ కోణాల్లో తెలంగాణ భావకవిత్వ వికాసాన్ని అధ్యాయనం చేయవలసిన అవసరం ఉంది. తెలంగాణ భావకవిత్వంలో మహిళలు కూడా భావకవిత్వం వ్రాయడం అనేది ఒక ప్రత్యేకమైన అంశంగా కనిపిస్తుంది. మాడపాటి హనుమంతరావు స్మారక ఆంధ్ర బాలికోన్నత పాఠశాలవారు 1934లో వెలువరించిన ఆరు వార్షిక సంచికలలో ఒకటి లభ్యమయింది.అందులోంచి వెలికి తీసిన స్త్రీల భావకవిత్వాన్ని ఇందులో పొందుపరిచారు. మిగిలిన ఐదు సంకలనాలు దొరికితే

మరింత మహిళా భావకవిత్వం వెలుగుచూసే అవకాశం ఉంది.

తెలంగాణలో భావకవిత్వంలో దాదాపు 8 మంది ఆంధ్ర రచయితల కవితలు కూడా ఉన్నాయి. వారి కవితలను స్వీకరించడానికి కారణం వారు తెలంగాణలో 150 సంవత్సరాలు ముందే స్థిరపడ్డారని వివరించడం జరిగింది. అందులో ముఖ్యంగా రాయప్రోలు సుబ్బారావు ఒకరు భావకవిత్వానికి ఆద్యులైనవారిలో ఒకరని చరిత్ర చెబుతోంది. ఈయన భావకవిత్వం ఎక్కడి నుంచి రాశాడు. ఈయన స్థిర నివాసం ఎక్కడ ఉంది, అనే అంశాలను పరిశీలిస్తే భావకవిత్వం తెలంగాణలోనే ప్రారంభమైంది అన్న వాదన బలంగా నిలబడుతుంది. తెలంగాణలో ఉన్న భావ కవితలు దేశి, మార్గ ఛందస్సులో ఉన్నాయి. ఎక్కువగా సీసం, తేటగీతిలలో ఉన్నాయి. ఇవి గానయోగ్యమైనవి అనే భావన పండితులలో ఉంది.

తెలంగాణ భావ కవిత్వంలో ముఖ్యంగా భాషను పరిశీలించినట్లయితే నాటి ప్రజల భాషలో గల నుడికారాలు, జాతీయాలు, సామెతలు, కవుల మాండలిక వైవిధ్యం, అన్యదేశాలు, ధ్వన్యనుకరణ పదాలు, అర్థ పరిణామం చెందిన పదాలు కనబడతాయి. మరీ ముఖ్యంగా తెలంగాణ భావ కవులపై ఉర్దూ ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. అందు వలన ఉర్దూ పదజాలం వాడుకలోకి వచ్చినవి కవితల్లో మనం చూడవచ్చు. అలాగే తెలంగాణ భావ కవులు దేశి, మార్గ ఛందస్సులో రాశారు. అందులో సీసం, తేటగీతలు ఉన్నాయి. ఇవే ఎందుకు ఎంచుకున్నారనే ప్రశ్నకు ఇవి గానయోగ్యమైనవి అని పండితుల భావన ఉంది.

గంగుల సాయి రెడ్డి రచించిన ప్రకృతి కవిత్వానికి సంబంధించిన కావ్యాల్లోని కవితలను పరిశీలించినట్లయితే ...

సీ. గొడ్డలి గుద్దలి కొడవలి పాఱల
దంతెల కాడిని త్రాళ్ళకట్ట
జడ్డిగంబును గొఱ్ఱు నడ్డగుంటకలను
పలుగుల పొన్నుల నెలుగుపీట
గడ్డపాఱను కొండి కఱ్ఱుల జిమ్మట
కీలుకత్తిని తల కోల గుదల
కొమిరెల కదురుల కొక్కుల బిల్లను
కందెన కొమ్మును కమ్మకత్తి,
తే. బండిపొణక రాగోలల ప్రణుతి జేసి
యెద్దుకొమ్ములు వృక్షాదు । లింపు సొంపు
జాజుసున్నము కట్లచే । పూజజేసి
హాలికుల చర్యలం గూర్చి యభినుతింతు ॥

ఇందులో గల గొడ్డలి, కొడవలి, పార, దంతలకాడి, రాళ్లకట్ట, గొర్రు, పలుగు, పొన్ను, వెలుగుపీట, కర్రు, కోలా, కందెన, నాగలి మొదలగు పదాలు తెలంగాణ మాండలిక పదాలుగా కవిత్వంలో కనబడుతున్నాయి.

నాగేలి/మడక-రాయలసీమ మాండలికం, నాగలి-తెలంగాణ
ఎటికర్ర-కళింగాంధ్ర, నొగ-రాయలసీమ, కోల-తెలంగాణ
నక్కు-కళింగాంధ్ర, కర్రు-తెలంగాణ
గిత్త- కోస్తామాండలికం, ఎద్దు-తెలంగాణ
కందెన-తెలంగాణ (వివరణ కందెన అనేది ఎడ్లబండి చక్రాల నుండి శబ్దం రాకుండా రైతులు ఉపయోగించే ఒక ద్రవ పదార్థం)

ఇలాంటి వైవిధ్యమైన పదాలు తెలంగాణ భావకవిత్వంలో ఇంకా చాల కనిపిస్తున్నాయి.

తేగీ. వఱద కెదురీది చేపలు వాఱుచుండ
కాకి గ్రద్దలు నక్కలు గములు గట్టి
యెండ్రకాయల కప్పల నెరిగి తినగ
జగతి యంతట విందులై సంభ్రమింప
(పీత- కోస్తామాండలికం, ఎండ్రకాయ-తెలంగాణ)

కన్వశ్రీ రాసిన దేశభక్తి కవిత్వంలో

అది నా తెలంగాణ తొలగరా కసాయి
అది నా తల్లినేల తొలగరా గూండా
రుద్రులకు రుద్రుడు ప్రతాపరుద్రుడు వాడు
తెనుగు ఛాతీ విరిచి చూపింది అక్కడే

"కసాయి,గూండా' అను అన్యదేశ పదాలు కనబడుతున్నాయి.

వానమామలై వరదాచార్యులు రాసిన 'రైతు రామాయణం' అనే ప్రకృతి కవిత్వంలో "కాపు పండించు బంగరుపంట సగము భూ
స్వామికే; తక్కిన సగములోన"
కాపుకూలీల స్వకష్టార్జితమ్మెల్ల
దొరలు దొంగలు చుట్టి దోచుచుండ
ఆలుబిడ్డలు కూట్కుంగలార్చుచు గంజీ
దా నీళ్ళపై పూటలు నెట్టుచుండ
అగో రజాకార్లన హడలి కుటుంబాలు
చెట్లు గుట్టలుబట్టి చెదరి పఱువ
రేలెల్ల కంటిపై రెప్పవ్రాల్పక ప్రజల్
కనగల్గి దారులు గాచుచుండ"

(గంజి పదం వివరణ - బియ్యం ఉడకబెట్టి కార్చిన నీరు. ఇది ఆసియా దేశాలలో బలమైన ఆహారపదార్థం. ఇది ద్రవిడ భాషా పదంగా భాషాశాస్త్ర వేత్తలు గుర్తించారు. ఇలాంటి పదాలు చాలా తెలంగాణ భావకవిత్వంలో కనిపిస్తాయి.

అగో అనే తెలంగాణ మాండలిక పదం కనబడుతుంది. దీన్ని గమనించినట్లయితే తెలంగాణ భావ కవిత్వం ప్రధానంగా అనేక భాషా పదాల పలుకుబడులను వొంపుకుందని అర్థమవుతుంది.

గంగుల సాయి రెడ్డి రచించిన మరో ప్రకృతి కవిత్వంలో కవిత్వానికి సౌందర్యాన్ని చేకూర్చే ధ్వన్యనుకరణ పదాలు, అర్థపరిణామ పదాలకి కూడా ఏ మాత్రం కొదువులేదు.

సీ. వనలక్ష్మి పాదముల్ నెనరుతో నింద్రుండు
కడగెనో నీరెల్ల కడలి నిండె
పాదంబులకు రుద్దు పసుపుముద్దలవోలె
భేకంబు లందులోc బ్రేలుచుండె
మొగిలిరేకులకంటె జిగిమించు నఖములో
మీలయి మిలమిల మెఱయుచుండె
మీcగాళ్ళబోలెను మెదలక నీటిపై
కూర్మముల్ తలలెత్తి గూడుచుండె
గీ. తెల్లచీరను వదలుచు మెల్లగాను
కంబు లందులోc బ్రేలుచుండె

మొగిలిరేకులకంటె జిగిమించు నఖములో
మీలయి మిలమిల మెఱయుచుండె
మీఁగాళ్ళబోలెను మెదలక నీటిపై
కూర్మముల్ తలలెత్తి గూడుచుండె
గీ. తెల్లచీరను వదలుచు మెల్లగాను
గగనలక్ష్మి భూలక్ష్మికి కాంతి హెచ్చ
వస్యలక్ష్మి ధరించు నా పచ్చకోక
కనులపండువు కర్షకా గాదె న.

పై కవితలోని "మిల మిల- ధ్వన్యనుకరణ పదం, చీర, కోక అను పదాలు అర్థపరిణామంలోని అర్థసంకోచం విభాగానికి చెందిన పదాలుగా గుర్తించడం జరిగింది.

ఉదయరాజు శేషగిరిరావు రాసిన మనోరమ అనే కావ్యంలోని ప్రణయకవితలో చూస్తే భాషలో ఇంకా ప్రబంధాల ప్రభావం ఉన్న భావకవిత ఈయనది:

పుత్తడి జగ్గునిగ్గు చినబుచ్చెడు మేనిమెఱుంగు వెల్లువల్
మత్తడి దూఁక, బిట్టదరి మాఁటికి బెళ్కులచూఁపు మీలుపే
రొత్తడివార, చేతి వలనొప్పుచు నాయెదఁబోయ చిల్కరా
తత్తడి సామిగొల్వునకుఁదారుపఁడే నిను నా మనోరమా!

పై కవితలోని పదాలు మత్తడి, మాటికి లాంటి పదాలు తెలంగాణ ప్రాంత జన వ్యవహారంలోనే కనిపిస్తాయి.

ఈ విధమైన భాషా పరిశీలన వల్ల తెలంగాణ భావకవిత్వంలో కనిపించిన కొన్ని పదాలను ప్రస్తావించడం జరిగింది.

ఉపయుక్త గ్రంథాలు:

కృష్ణమూర్తి, భద్రిరాజు. 1979. తెలుగు భాషా చరిత్ర. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ.

జగన్ రెడ్డి, సామిడి. 2017. తెలంగాణాలో భావకవిత వికాసం. హైదరాబాదు: తెలంగాణా సాహిత్య అకాడమి.

నారాయణరెడ్డి, సి. 2009. ఆధునికాంధ్రకవిత్వము- సంప్రదాయములు ప్రయోగములు.విశాలాంధ్ర.

నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2016. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. హైదరాబాదు:తెలుగు అకాడమీ.

ప్రతాప రెడ్డి, సురవరం. 2009. గోల్కొండ కవుల సంచిక. తెలంగాణ జాగృతి ముద్రణలు.

భూమయ్య, అనుమాండ్ల. 2000. తెలంగాణా భావ విపంచిక. నవోదయ ప్రచురణలు.

శ్రీనివాస్, కె. 2015. తెలంగాణా సాహిత్య వికాసం. తెలంగాణా ప్రచురణలు

--రచయిత హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి. పరిశోధక విద్యార్థి



www.ijcrt.org © 2024 IJCRT | Volume 12, Issue 3 March 2024 | ISSN: 2320-2882

IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

భావకవిత్వంలో నవ్యత

కామెర పురుషోత్తం

పరిశోధక విద్యార్థి,

తెలుగు శాఖ, మానవీయ శాస్త్రాల విభాగం,

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం,

ఉపోద్ఘాతం

నవ్య కవిత్వంలో తాలోత్తాలంగా నిలిచిన ఉద్యమాలు రెండే రెండు. ఒకటిభావ కవిత్వం. రెండవది అభ్యుదయ కవిత్వం. పై రెండు ఉద్యమాలలో భావ కవిత్వోద్యమం దాదాపు మూడు దశాబ్దాల పాటుగా ఆంధ్రసాహిత్య కేదారంలో పసిడి పంటలా పండించింది. శేషాద్రి రమణ కవులు, కొమండూరి కృష్ణమాచార్యులు వంటి ప్రాచీన ఫక్కికి చెందిన విద్వత్కవులు కూడా భావ కవిత్వాన్ని స్పృశించారు. కావ్య వ్యాకరణ తీర్థులైన పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి వంటి విద్వద్విమర్శకులు దీనిని శాస్త్రీయ దృష్టితో సమర్థించారు. అభ్యుదయ యుగకర్తలైన శ్రీశ్రీగారు సైతం తొలి రోజులలో అసంఖ్యాకంగా భావకవితా ఖండికలు వెలువరించారు. 1940 లోపల పట్టిన నవ కవులెవ్వరూ దీని ముద్రను తప్పించుకోలేక పోయారు. ఒక్కమాటు భావకవితా విహాయసాన్ని పరికిస్తే రాయప్రోలు, వెంకట పార్వతీశ్వర కవులు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, అబ్బూరి, దువ్వూరి, నండూరి, బసవరాజు, వేదుల, నాయని, పింగళి, కాటూరి, జాషువా, తుమ్మల, తల్లావఝుల, బాపిరాజు మున్నగు కవి నక్షత్రాలు అక్షరకాంతివృష్టిని కురిపిస్తూ కనిపిస్తాయి. ఈ కవులు భాకవిత్వంలోని వివిధ శాఖలకు, ప్రతినిధులు. వీరుకాక ప్రతిభామహితమైన భావకవిత్వాన్ని వెలయించిన కవులు పరశ్శతంగా ఉన్నారు. ఈ కవులందరూ ప్రకృతి కవిత్వం, ప్రణయ కవిత్వం, దేశభక్తి కవిత్వం మొదలగునవి ప్రక్రియలను కొంచం తేడాతో స్వీకరించిన వారే. కాబట్టి వారిలో నుండి ముఖ్యులయిన ఏ పదుగురి రచనలనో ఉదాహరణలుగా తీసుకుంటున్నాను. అంతమాత్రాన మిగిలిన కవులూ, వారి కృతులూ అప్రధానమైనవని కాదు.

రాయప్రోలు వారి కావ్యాలలో “భావ పదము, భావగీతము” అనే పదాలు తొలిసారిగా కనిపిస్తాయి. తరువాత విశ్వనాథ వారు, కృష్ణశాస్త్రిగారు "భావగీతము” అనే శబ్దాన్ని ప్రయోగించారు. 'భావకవిత్వ' మనే పదాన్ని గాడిచెర్ల హరిసర్వోత్తమరావు గారు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారనీ డా. గిడుగు తమ "History of Telugu Literature" లో పేర్కొన్నారు.

భావ కవిత్వమంటే వస్తు భావ రచనలలో భావానికి ప్రాధాన్యమిచ్చిన కవిత్వం. అది ఉత్తమ శ్రేణిలో రచింపబడినప్పుడు రస శిఖరాన్ని అందుకున్న రచనయే అవుతుంది. భావ కవిత్వానికి అంతర్ముఖత్వం ప్రధాన లక్షణం. ఇది కేంద్రబిందువుగా భావ కవిత్వాన్ని పరిశీలిస్తే క్రింది విధమైన ఛాయలు అగుపిస్తాయి.

1. స్త్రీ పురుషుల బాహ్య సౌందర్యానికి బదులుగా ఆత్మసౌందర్యం, గుణసౌందర్యం ఈ కవిత్వంలో వర్ణింపబడినాయి.

2. కవి తన సుఖ దుఃఖాలు తెరమరుగు లేకుండా వెర్రిగా వెల్లడించుకున్నాడు.

3. ఒక్కొక్కప్పుడు అవస్థాభేదాన్ని బట్టి అతనికి కొండంత సహనం అలవడింది. అందుకు తోడుగా దార్శనిక దృక్పథం ఏర్పడింది.

4. ప్రకృతి వర్ణనలలో బాహ్య విషయాలకు బదులుగా సుకుమారమైన సౌందర్యతత్త్వం నిర్దేశింపబడింది. అనగా చర్మ చక్షువుకు కనిపించే ప్రకృతి కాక మనోనేత్రానికి భాసించే ప్రకృతియే వర్ణ్యమైంది.

5. కవి తాను విన్న, కన్న ఏ చిన్ని సంఘటననైనా హృదయ తంత్రులను ఝుమ్మనిపించి కవిత్వ రూపంలో వెలిజిమ్ముకొని వచ్చింది.

6. ఆత్మార్పణతత్త్వం, ఆరాధన తత్త్వం పాదుల దన్నుకున్నాయి. అంతశ్చేతన లోని చైతన్యం హద్దులు దాటి వెలువడింది.

7. సామాన్యమైన సంతోషానికి బదులుగా సర్వే సర్వత్ర అలౌకికానందం అంచులు తీర్చుకున్నది. భావకవి చిత్రకవిత్వాన్ని నిరసించడంలో ఈ ఆంతర్యమే ఉన్నది.

8. కవి తన కొలబద్దలతో జీవితాన్ని కొలవడం మాని తన వ్యక్తిత్వాన్ని విస్మరించి ఇతరుల సుఖదుఃఖాలలో లీనమైపోయే స్థితి ఏర్పడింది. దీనినే కీట్స్ “Negative Capability" అని అన్నాడు.

భావకవిత్వ శాఖలు :

భావకవిత్వంలోని శాఖలను స్థూలంగా ఈ విధంగా విభజించవచ్చు.

1. ప్రణయకవిత్వం (Love Poetry)

2. దేశభక్తి కవిత్వం (Patriotic Poetry)

3. ప్రకృతి కవిత్వం (Nature Poetry)

4. సంఘ సంస్కరణ కవిత్వం (Reformative Poetry)

5. భక్తి కవిత్వం (Mystic Poetry)

6. స్మృతి కవిత్వం (Elegies)

వీటిలో ఒక్కొక్కశాఖ అనంత వైవిధ్య విలసితం. ప్రణయ కవిత్వాన్నే తీసుకుందాం. ఇది రెండు విధాలుగా ఉంది. ఒకటి వస్త్వాశ్రయరీతి. రెండవది ఆత్మాశ్రయరీతి. అబ్బూరివారి మల్లికాంబ మొదటి కోవకు చెందిని రచన. కృష్ణశాస్త్రిగారి కృష్ణ పక్షం రెండవకోవకు చెందిన రచన. పైన పేర్కొన్న ఆరు శాఖల్లో ప్రక్రియా బాహుళ్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ ప్రక్రియలన్నీ ఇంగ్లీషు రొమాంటిక్ కవిత్వ ప్రభావం ఉన్నవి కావు. వీటిలో ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం ప్రాయికంగా ఆంగ్ల కాల్పనిక కవితా ముద్ర ఉన్నవే. దేశభక్తి కవిత్వంపై దీని ప్రభావం అంతగా లేదు. సమకాలీన పరిస్థితులను బట్టి, రాజకీయోద్యమాలను బట్టి పెకలివచ్చిన కవిత్వమిది. సంఘసంస్కరణ కవిత్వం కూడా సాంఘిక స్థితి గతులనుబట్టి ఉద్భవించిందే. భక్తి కవిత్వంపైన కొంత సాంప్రదాయిక ముద్ర, కొంత రవీంద్రుని ఛాయ, కొంత బ్రహ్మ సమాజం ప్రభావం అగుపిస్తాయి. ఈరీతిగా కొత్తపాతల మేలికలయికతో, సంప్రదాయ ప్రయోగాల సముచిత మేళనంలో తెలుగునాట వెలుగులు చిమ్మింది భావకవిత్వం.

భావకవిత్వం : నవ్యత

ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలో ఇమేజరీ (Imagery) ప్రధాన స్థానం ఆక్రమించింది. ఇమేజరీ అంటే స్థూలంగా కల్పన అనవచ్చు. ఇమేజ్ అంటే కల్పనా చిత్రమనాలి. కానీ ఇమేజ్ అంటే మాటలతో కట్టిన బొమ్మ కాబట్టి పదచిత్రాలంటే సరిపోతుంది. భావకవిత్వంలోని పద చిత్రాలను రెండు తెగలుగా విభజించవచ్చు. **1.భావ చిత్రాలు, 2. ఊహా చిత్రాలు.**

భావచిత్రాలు హృదయానికి సంబంధించినవి. ఊహా చిత్రాలు బుద్ధికి సంబంధించినవి. భావకవులలో భావ చిత్రాలున్నంతగా ఊహాచిత్రాలు లేవు. భావచిత్రాలు వేసిన వారిలో కృష్ణశాస్త్రి, వేదుల, విశ్వనాధ, దువ్వూరి, నాయని మొదలగువారు ప్రసిద్ధులు, రససిద్ధులు. వారు ప్రధానంగా హృదయ తంత్రికలను

స్పందింపజేసే మెత్తని భావచిత్రాలనే ప్రయోగించారు. అయితే విశ్వనాథ 'కిన్నెరసాని' పాటలలో, జాషువా 'స్వప్నకథ'లో మిన్నుముట్టే ఊహాచిత్రాలు కొన్ని లేకపోలేదు.

భావకవిత్వం ప్రధానంగా ప్రసాద మాధుర్య గుణాలను పెనవేసుకుని పుట్టింది. దేశభక్తి కవిత్వశాఖలో తప్ప ఓజోగుణం ఈ కవిత్వంలో అంతగా కనిపించదు. అందుచేత ఈ కవితకు లలిత మధుర పదవిన్యాసం, శైలీ సౌకుమార్యం, అలతియలతి జిలుగు విరుపులు సహజ గుణాలై పోయినవి. ప్రణయ కవిత్వంలోని వృత్తాలన్నీ ప్రధానంగా నన్నయ శైలినో, నంది తిమ్మన వంటి ప్రబంధ కవుల బాణీనో పుణికి పుచ్చుకున్నాయి. గీతపద్యం నడకలలో భావకవులు అపూర్వమైన విరుపులనూ జిలుగులనూ సాధించారు. దేశభక్తి కవిత్వశాఖలో సీసపద్యాన్ని రకరకాలుగా కదను తొక్కించారు. భావకవులలో కృష్ణశాస్త్రి గారి చేతిలో పాతశబ్దాలే కొత్త పరిమళాలనూ, సరికొత్త వన్నెలనూ సంతరించుకున్నాయి.

"//ఎలదేటి చిరుపాట సెలయేటి కెరటాల బడిపోవు విరికన్నె వలపు//

//తొలిప్రొద్దు తెమ్మెర తోవలో పయనమై పరువెత్తు కోయిల పాట//

//కారు రాతిరి కొసలు, "ఇరుల గుసగుసల//"

మొదలైన అచ్చమైన తెలుగు మాటల కూర్పుల్లో,

"//కరుణార్ద్ర వీక్షణ పరిమళములు//

//విరహవీక్షణ భయంకర మాధురులు//

//అగమ్య తమస్వినీ గర్భకుహరాలు//

//అంగుళీ కిసలయ చంచలాంచములు//"

హేమంత కృష్ణానంత శర్వరి మున్నగు సంస్కృత సమాసాల పోహళింపుల్లో అపూర్వ నవ్యతా భరితమైన కమనీయం వెల్లివిరుస్తున్నది. తెలుగు కవిత్వంలో జిలుగు నగిషీలకు, సన్నపోగరుతనానికి ఎంత వీలున్నదో అంత సాధించి చూపారు కృష్ణశాస్త్రిగారు, వీరి శైలికి మించిన సౌకుమార్యాన్ని సాధించడానికి ప్రయత్నం చేయడమంటే మధు ధారను జలధారగా మార్చడమే.

అపూర్వ పదబంధాలు ప్రయోగించండంలో భావకవితనందుకున్నది. ఇవి రూపకాలు కావచ్చును లేక కర్మధారయాది సమాసాలు కావచ్చును. నీలంపు సిగ్గు, ఆశ్రుఝరులు, హాస మృదుల వాసనలు కొసరు తేనియలు, నెత్తావి గుసగుసలు, నిర్జీవ నిశ్శబ్దము, సురభిళాహ్వానములు, కైశికధ్వాంత నిశ్శబ్దము, రహస్తీరాలు, నిడుద చెర, నీలినీడ, కారు రాతిరి కొసలు, కార్చిచ్చు మంటయేళ్ళు, వలపుటాకలి, మూగ కనులు, వేదనాసుఖము, అరుణారుణాంధ గీతి, అమవస కన్నీటిపాట, ఇరుల గుసగుసలు, ముదుసలి నిరాశలు, పాటరెక్కలు, తీయతేనియ బరువు, విశ్వ వీణాగళము, విరహ విపంచి మొదలైనవి.

(కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి నుండి); భాష్పభాషణములు, పూల వెన్నెలలు, మబ్బు కన్నెలు, వలపు నివాళి, తేనె తావుల బరువు, తలిరుటెడద, జీవితంపు టెడారి, ఆశావిపంచి, మబ్బు కౌగిళులు, రేయికాటుక కనులు, చంద్రికా వసనము, విరభవిషాద రేఖ, నిసి కంటినీరు, తెమ్మెర యూర్పు - (దీపావళి నుండి); పోతు వెన్నెలలు, పూల - దీపము, వెలుగు పోచలు, నులివెచ్చ చిక్కవెన్నెలలు, కల్వపడంతి యూరుపులు, తావి దివ్వియ, వెచ్చ వెన్నెలలు - (శశిదూతము నుండి), తుషార దూతికలు, మేఘ పతాకలు (సౌభద్రుని ప్రణయయాత్రనుండి); లేత గుసగుసలు, గాలి బాలిక, తలిరు తురాయి - (మధుకీల నుండి; జాలివెన్నెల (గబ్బిలము నుండి); మంచుమంట- (హిమగళము నుండి)... ఇలాంటి వినూత్న పదబంధాలెన్నో వున్నాయి.

భావకవులు వృత్తాలను, జాత్యుపజాతులను, మాత్రా ఛందస్సులను సమానాభిరుచితో సంతరించారు. గద్య పద్య మయమైన చంపూరీతి రాయప్రోలుతోనే పరిత్యక్తమైంది. భావకవులు కూడా పద్ధతిలోనే కేవలం పద్య గేయకావ్యాలు రచించారు. గద్య పద్య సమ్మేళనం స్థానే పద్యగేయ సమ్మేళనం వీరి ప్రత్యేకత. సౌభద్రుని ప్రణయ యాత్ర, గిరికుమారుని ప్రేమగీతాలు, మల్లికాంట వంటివి కేవలం పద్య రచనలు. కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి, హృదయేశ్వరి, దీపావళి, ఊహాగానము మొదలగునవి పద్యగేయమిశ్ర రచనలు. కిన్నెరసాని పాటలు, వకుళమాల, శశికళ, యెంకి పాటలు మొదలగునవి కేవలం గేయకృతులు. ఈ కవులలో శివశంకరశాస్త్రి గారు అనేక గతులలో అసంఖ్యాక గేయ పద్య రూపకాలు రచించారు. వీరు కొన్ని వృత్తాలను మూడు పాదాలతో, రెండు పాదాలతో రచించారు. గీత పద్యాలలో భావం ఎక్కడ విరుగుతుందో, అక్కడికే పాదం సమాప్తమయ్యే పద్ధతి ప్రవేశపెట్టారు. కృష్ణశాస్త్రి గారు కొన్ని సందర్భాలలో గీతపద్యాన్ని మధ్యలో యెత్తుకొన్నారు. భుజంగ ప్రయాతం వంటి ప్రాచీన వృత్తాలకు వెల్లవేసి గేయాభాష

కలిగేటట్లు కొందరు రచించారు. సీసపద్యాలను వచన గేయాలవలె అచ్చువేసి, ఇంద్రజాలం చేసినవారు వెంకట పార్వతీశ్వర కవులు. ఈ పద్యాలను చదువుతుంటే వచనగేయాలలాగే అనిపిస్తాయి.

భావకవుల గేయాల్లో ప్రధాన గుణాలు గతి చమత్కారం, లయవిన్యాసం, గేయాలలో అధికభాగం ఐదైదు మాత్రల గణాలతో నడిచే ఖండగతిలో వున్నాయి. యెంకిపాటల్లో ఏ కొన్నో తప్ప మిగతావన్నీ ఈ గతిలోనే వున్నాయి. కృష్ణశాస్త్రిగారి గేయాలు కూడా అధికభాగం ఈ గతిలోనే వున్నాయి. ఇది ద్విపదకూ సీసానికీ సన్నిహితంగా వుండడంవల్ల, మన కవులు మొదట పద్యాలతోనే కవితా వ్యాసంగం ప్రారంభించినందువల్ల ఈ ఖండగతి అనుకోకుండా వారిని వశపర్చుకున్నది. ఈ ఖండగతిలోనే పాదసంఖ్యలో, మాత్రాధిక్యంతో, మాత్రాలుప్తితో ఈ కవులు సాధించిన నవ్యత అపూర్వం. భావకవిత్వ గేయాలలో చతురస్రగతి క్వచిత్తుగా ప్రయోగించబడింది. కిన్నెరసాని పాటల్లో ఈగతి సమమాత్రాకంగా, సమపాదంగా ప్రయోగింపబడింది. తల్లా వజ్ఝలవారు చరణాల చివర 'ప్రియురాలు' అనే మకుటాన్ని పునరావృతం చేసి నవ్యత సాధించారు. దువ్వూరి వారు 'ఆమని నిషా'లో కొన్నిచోట్ల మాత్రలు పెంచారు. ఇకపోతే మిశ్రగతి ముత్యాల సరంగా నవ్యకవిత్వంలో అశేషవ్యాప్తి పొందింది. రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, అబ్బూరి రామ కృష్ణారావు, నండూరి వెంకటసుబ్బారావు, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, బసవరాజు అప్పారావు, వేదుల సత్యనారాయణ మొదలగువారు కనీసం ఒక్క ముత్యాల సరమైనా సంతరించిన కవులే. వీరు ఈ గేయగతిలో సాధించిన వైచిత్రి గణింపదగింది.భావకవులలో వచనగేయాలు వ్రాసిన వారిలో కవికొండల వెంకట్రావు, రామచంద్ర అప్పారావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, దువ్వూరి రామిరెడ్డి పేర్కొనదగిన వారు. కవి కొండలవారు 'నక్కాసామి గాడు' అనే వచనగేయాన్ని 1933లోనే రచించారు. "నక్కసామిగాడు వాడొక మాలవాడు రాజుగారి కమతంలో పాలేరుగాడు. వాడు పోయాడు... "దెందులూరు కాడాక్కుండా వెళ్ళిన మెయల్నీ ఆగిన మా ప్యాసెంజరు రయిల్నీ రెండింటినీ కూడా మరచి... స్థాయి....." ఈ విధంగా సాగిపోయిన వచన గేయంఇది.

దీనిని 'వచన గీతిక' అని వారే స్వయంగా వ్రాసుకున్నారు. రచన శుద్ధ వ్యావహారికంలో ఉండడం, చమత్కారమైన అంత్యనియమాలుండడం చరణ విభాగం ఆధునిక వచనగేయంలాగే వుండడం ఈ గేయంలోని ప్రత్యేకత. రామచంద్ర అప్పారావుగారి 'రక్తవిహారము' అనే గేయం కొంతదూరం వచనగేయం లాగా సాగి, మధ్యలో తేటగీతిగా మారి, మళ్ళీ వచనగేయంగా రూపొంది చివరికి తేటగీతిగా ముగుస్తుంది. మల్లవరపు వారి 'కళ్యాణ కింకిణి'లో 'స్త్రీ' అనే శీర్షికతో చక్కని వచన గేయముంది.

దీనిని ప్రయత్నించి చతురస్రగతిలోనికి ఈడ్వవచ్చును. కానీ స్థూలంగా వచనగేయంలా కనిపించే రచనయిది. విశ్వనాథవారు'శృంగార వీధి' చివర 'రాధిక' అనే శీర్షికతో కొన్ని వచనాలు రచించడం జరిగింది.

అభ్యుదయ కవిత్వ యుగం శిష్టా ఉమామహేశ్వర రావు, నారాయణబాబు, పట్టాభి, శ్రీశ్రీ మొదలగు కవుల చేతులలో సహస్రాంచలాలతో మెరిసిన వచనగేయానికి భావకవిత్వ యుగంలోనే ఇరవయ్యో శతాబ్ది మూడవపదిలోనే బీజావాపం జరిగిందనవచ్చును. విశ్వనాథవారు మహాకావ్యాల నుంచి రసవర్ణట్టాలుగానీ, ఏక విషయాన్ని గూర్చి రాసిన కొన్ని పద్యాలు కాని విడిగా తీసినట్లైతే అవి ఖండకావ్యాలంటారు. **'కన్నీటి కెరటాల వెన్నెలేలా! నిట్టూర్పు గాడ్పులో నెత్తావియేలా!'**

'ప్రళయకాల మహోగ్ర జీమూతోరు గళ ఘోరగంభీర ఫెళ ఫెళార్భటులలో మెరుపేలా' ఇలా చమత్కారాన్ని సాధించడం, 'కారుచీకటి కొసలు', తీయతేనియ బరువు, పూలవెన్నెలలు వేదనాసుఖము, శారదశర్వరీమధుర చంద్రిక, అంగుళీకిసలయ చంచలాంచలములు వంటి తెనుగు, సంస్కృత పద సమాసాల, పదబంధాల కూర్పుతో మనోహరంగా సాగుతుంది వీరి శైలి.

ముగింపు:

ప్రాచీన గద్యపద్య సమ్మేళన స్థానంలో పద్యగేయాల సమ్మేళనం భావకవులలోని ఒక నవ్యతఅనవచ్చు. సౌభద్రుని ప్రణయ యాత్ర, కష్టకమలవంటివి కేవల పద్యమయాలైతే దీపావళి, కృష్ణపక్షాదులు పద్యగేయమిశ్రమాలైతే,కిన్నెరసాని పాటలు,యెంకిపాటలు గేయ కావ్యాలు. ఖండగతి, చతురస్రగతి, త్రస్యగతి, మిశ్రగతి, వచన గేయాలు కూడా భావకవిత్వంలో ఎంతో రమణీయంగాప్రయోగింపబడ్డాయి.

ఉపయుక్త గ్రంథ సూచి:

1.నారాయణ రెడ్డి, సి.2011.ఆధునికాంధ్ర కవిత్వం;సంప్రదాయములు,ప్రయోగములు.విశాలాంధ్రబుక్ హౌస్.

2.నారాయణరావు,వెల్చేరు.1987.తెలుగులో కవితా విప్లవాల స్వరూపం.నవోదయ ప్రచురణలు

3.రంఘనాథాచార్యులు కె.కె. 2005 ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు. ఆంధ్రసారస్వత పరిషత్.

4. తెలుగులో కవిత్వోద్యమాలు. 2011. తెలుగు అకాడమీ.

ISSN 2319-2550

బెంగుళూరు

తెలుగు తేజం

సామాజిక. సాంస్కృతిక. సాహిత్య. రాజకీయ మాస పత్రిక

సంపుటి -7, సంచిక - 3, (ప్రత్యేక సంచిక) సెప్టంబరు 2022

రామాయణ, భారత, భాగవతాలు - వ్యక్తిత్వ వికాసం

2022 సెప్టంబరు 8-9

రెండు రోజుల జాతీయ సదస్సు

నిర్వహణ

సాహిత్య భారతి - అనంతపురము

పతికి రాజ్యలక్ష్మి ఫౌండేషన్ - అనంతపురము

42. విదురనీతి – ధర్మ సూక్ష్మాలు 183
– మణినాథ్ కోపల్లె
43. భారత – భాగవతాలు – శ్రీకృష్ణుడు 188
– రాఘవేంద్రరావు
44. ఉత్తమ విద్యార్థి అర్జునుడు 192
– భక్తుల బిందుప్రియ
45. మహాభారతంలో వ్యాసుని ధర్మనిరతి – మానవ వికాసం 197
– కాళేశ్వరం కృష్ణమూర్తి
46. పోతన భాగవతం – అంబరీషుని పాత్ర – వ్యక్తిత్వ వికాసం 201
– కె. పురుషోత్తం
47. మహాభారతంలోని పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 205
– డా॥ పలివెల చిరంజీవి రావు
48. రామాయణంలో ప్రసిద్ధ పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 212
– బి. క్యాథరీనా
49. శిష్యవాత్సల్యం – శుక్రాచార్యుడు 218
– ముక్కపల్లి సాగర్
50. ధౌమ్యోపదేశం – ఉద్యోగి ప్రవర్తించవలసిన తీరు 224
– సంపత్ కుమార్ బానోజి
51. శకుంతలోపాఖ్యానం – స్త్రీ సాధికారత 228
– గోమారపు కవిత
52. బలరామకృష్ణుల బాల్య క్రీడాభివర్ణనము 234
– బుక్క సిరాజ్
53. రామాయణంలోని సీత వ్యక్తిత్వం 236
– బి. శశికళ
54. మహాభారతంలో వ్యక్తుల వ్యక్తిత్వ వికాసం 239
– పొన్నెకంటి స్వప్న
55. ఆదర్శ నారీమణులు – సీత, ద్రౌపది 247
– ఆవలకొండ అన్నపూర్ణ

Vol. 15 Issue. 10 (Special Edition, September 2022)
ISSN No: 2319-2550 RNI No. KARTEL/2008/27162 బెంగుళూరు తెలుగుతేజం

46. పోతన భాగవతం - అంబరీషుని పాత్ర - వ్యక్తిత్వ వికాసం

కె. పురుషోత్తం, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 9603705803

ఉపోద్ఘాతం:

పోతన క్రీ.శ. 1400-1470 మధ్యకాలంలో జీవించినాడు. తెలంగాణలో ఏకశిలానగరంగా ప్రసిద్ధి నమీవంలోని బమ్మెర గ్రామం ఇతని జన్మస్థలం. కేనన, లక్కమాంబలు ఇతని తల్లిదండ్రులు, సదాచార కుటుంబ వాతావరణంలో పెరిగినవాడు, గురుముఖంగా చదువుకొన్నది బహు స్వల్పమే. చిదానందయోగి ద్వారా తారక మంత్రోపదేశం పొంది, విబుధ అమల ద్వారా విని, స్వయం కృషితో, సరస్వతీదేవి కరుణాకటాక్షంతో పాండిత్యాన్ని అలవర్చుకొని, కవిత్వం రాయనారంభించి సహజకవి అయ్యాడు. పోతన, శ్రీనాథులు సమకాలికులు, పోతన నిరాడంబర జీవి. భూమిని నమ్ముకొని పోలిక వృత్తితో జీవికను కొనసాగించాడు. రాజులను ఆశ్రయించలేదు. శ్రమజీవనమే సుఖప్రదమని నమ్మిన ఆత్మాభిమాని, పోతన బాల్యంలో 'వీరభద్ర విజయము', యవ్వనంలో 'భోగినీ దండకము' పిదప 'నారాయణ శ్రీ శతకము', ప్రౌఢావస్థలో 'శ్రీమదాంధ్రమహాభాగవతము' రచించాడు. ఇది ఇతని రచనలలో ఎంతో విశిష్టమైనది. పోతన భాగవతం భక్తికి మారు పేరు. ఇది మధుర భక్తిని ప్రబోధించేది. నిర్గుణమైన బ్రహ్మాన్ని జ్ఞానం వల్ల పొందగలిగితే, సగుణమైన బ్రహ్మాన్ని భక్తి ద్వారా సాధించవచ్చు. భక్తి మార్గం అందరికీ అందుబాటులో ఉండేది. అందుకే పోతన భాగవతాన్ని భక్తి మార్గంలో తీర్చిదిద్దాడు. భక్తి మార్గంలోని శాంతి, దాస్యాది అయిదు భావాలను పోతన తన భాగవతంలో ప్రతిఫలింపజేశాడు. నవవిధ భక్తి మార్గాలకు ప్రతినిధులుగా ప్రహ్లాదుడు, గజేంద్రుడు, గోపికలు, ధ్రువుడు, అక్రూరుడు, అర్జునుడు, రుక్మిణి, అంబరీషున్ వంటి వారిని తీర్చిదిద్దాడు.

భాగవత భాష - శైలి:

వైదిక మతానుయాయులంతా సంస్కృత సమాస భూయిష్టమైన కావ్యరచనను వెలయింపజేస్తే, భక్తిశాఖకు చెందిన వారు ముఖ్యంగా శివకవులు తమ రచనలు సామాన్య ప్రజలకు కూడా అర్థం కావాలనే దృష్టి సులభమైన, సరళమైన తెలుగు పదాలతో రచనలు చేసేవారు. దీనినే వారు 'జాను తెనుగు' అని చెప్పుకొన్నారు. అంటే పోతనకాలం నాటికి ఒక పక్క పండితులు, శిష్టులు సమాదరించే సంస్కృత పదాల సమ్మిశ్రణంతో కూడిన జటిలమైన శైలిలో కావ్య రచన సాగేది. మరోపక్క సామాన్యుల అవగాహనకు సైతం అదేవిధంగా అంటే 'జాను తెనుగు'తో కూడిన సరళశైలిలో కావ్య రచన సాగేది, పోతన ఈ రెంటికి నడుమ సమన్వయ ధోరణిలో రచించినట్లుగా అతని కవిత్వాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. దానినే ఇలా చెప్పుకొన్నాడు

"కొందఱికి దెనుగు గుణమగు
గొందఱికిని సంస్కృతంబు గుణమగు రెండున్
గొందఱికి గుణములగు నే

నందఱు మెప్పింతు గృతుల వయ్యెయెడలన్”

అంటూ అటు న్నయాదుల మార్గరీతిని, ఇటు పాల్కురికి సోమనాథుల దేశిరీతిని తనలో మేళవింపజేసుకొన్న విశిష్ట కావ్యశిల్పి పోతన.

పోతన ఉపమ, ఉత్ప్రేక్ష వంటి అర్థాలంకారాలతోపాటు అనుప్రాసాది శబ్దాలంకారాలను కూడా. విరివిగా ప్రయోగించాడు. వర్ణనా సంబంధి పద్యాలలో అంత్యానుప్రాస ప్రయోగించాడు. పోతన కవితలో అప్రయత్నంగా జాలువారే అనుప్రాస పద్యానికి ఆకర్షణీయంగా ఉండి పరితలను ఆకట్టుకొంటుంది. కందాన్ని అందం చిందించే విధంగా తీర్చి దిద్దిన కొద్దిమంది కవులలో పోతన ఒకరు. నన్నయ కవిత్వంలో చెప్పబడిన

అక్షర రమ్యత పోతన కవితలో కూడా పోతపోసుకుంది. ఒక్కొక్కప్పుడు పద్యాలు అర్థం కాకపోయినట్లనిపించినా వాటి వడక శ్రవణ సుభగత్వాన్ని కలిగిస్తుంది. వీటిలో ప్రసాద మాధుర్యగుణం గోచరిస్తుంది. అమిత భావావేశాన్ని, అర్థగాంభీర్యాన్ని ప్రకటించవలసి వచ్చినప్పుడు పోతన ఎక్కువ పాళ్ళ గద్యాన్ని ఆశ్రయించేవాడు. ఉదాహరణకు స్తంభం నుండి వెడలిన ఉగ్రనరసింహుని గర్యంలో అత్యంత భావస్ఫోరకంగా, ప్రతిభాపూరితంగా ఆవిష్కరింపజేశాడు. ఛందస్సును అందంగా మలచడంలో పోతన సిద్ధహస్తుడు, భక్తి, శృంగార, కరుణ రసాలు పోతనకు చాలా ప్రియమైనవి. పోతన కవిత్వం ద్రాక్షా పాక సమన్వితం..

విశేషాంశాలు :

భాగవతం భక్తి ప్రధానమైనదని చెప్పుకొన్నాం. భక్తి ద్వారా భగవంతుని చేరుకోవడానికి ముందు మనిషి తనలోని అవలక్షణాలను, అరిషడ్వర్గాలను ఒక్కొక్కటిగా తెగనరుక్కొంటూ ప్రక్షాళితుడు కావాలి. తాననుసరించవలసిన ధర్మ మార్గం తెలుసుకోవాలి. ఇవన్నీ భాగవతంలోని ప్రతి కథ ద్వారా మనకు తెలియవస్తాయి. ప్రతిపాత్ర ఏదో ఒక పరమార్థం కోసం సృష్టించబడిందే. మానవ సమాజం పరస్పర విద్వేషాలకు దూరంగా, సదా శాంతి, సుఖమయ జీవన భరితంగా, ఆధ్యాత్మిక చింతనాపూరితమై, ఆ భగవంతునిలో ఐక్యం కావడానికి ప్రయత్నించాలని భాగవతం ప్రబోధిస్తుంది. భక్తిని ప్రతిపాదిస్తుంది. ఆ భక్తికి ఒక చక్కని తార్కాణం అంబరీషోపాఖ్యానం.

వ్యాఖ్యానం:

అంబరీషుడు సకల సద్గుణ సంపన్నుడు. నిష్టాగరిష్టుడు, నిరతాన్నదాత, ఆడి తప్పనివాడు. ఆపన్నుల పాలిటి దేవుడు. వైష్ణవ మతానుయాయుడు, విష్ణు పాద సేవార్చకుడు, సదా హరిధ్యాన పరాయణుడు, వేదశాస్త్ర పారంగతుడు. ఇతడు సమస్త ప్రపంచానికి రాజై ప్రజలను కన్నబిడ్డల్లా పాలిస్తూ, శాంతి సుఖాలను నెలకొల్పినవాడు. అశ్వమేధాది యజ్ఞాలెన్నో నిర్విఘ్నంగా జరిపి పేరు పొందిన వాడు.

అంబరీషుని భక్తికి మెచ్చి శ్రీమహావిష్ణువు ఒక దివ్య చక్రాన్ని ప్రసాదిస్తాడు. ఇదిలా ఉండగా ఒకనాడు అంబరీషుడు విష్ణుమూర్తిని గురించి ద్వాదశీ వ్రతాన్ని సంవత్సరం పాటు ఆచరిస్తాడు. అందులో భాగంగా కార్తీక మాసంలో మూడు రాత్రులు ఉపవాసం ఉండి, కాళింది నదిలో స్నానం చేసి, మధువనంలో శ్రీవారిని అభిషేకించి, బ్రాహ్మణోత్తములకు గోదానాలు, అన్నదానాలు చేస్తాడు. అనంతరం

విష్ణునామ పారాయణం చేస్తున్న సమయంలో దుర్వాస మహర్షి అభ్యాగతునిగా విచ్చేస్తాడు. రాజు ఎదురేగి అతని తొడ్కొని వచ్చి సకల మర్యాదలతో ఉపచారాలు చేసి భోజనానికి ఆహ్వానిస్తాడు.

దుర్వాసుడు అందుకు అంగీకరించి స్నానార్థం కాళిందీ నదీతీరానికి వెళ్ళి, స్నానమాచరించి, అనంతరం ధ్యాన నిమగ్నుడై ఆలస్యం చేస్తాడు. రాజు, మహర్షి రాక కోసం ఎదురుచూసి, ఎంతక్ రాకపోయేసరికి, ఘడియలు దాటిపోతున్నందువల్ల ఏమి చేయాలో పాలుపోక విద్వజ్జనులను సంప్రదిస్తాడు. ద్వాదశి ఘడియలలోనే ఉపవాస దీక్ష విరమించాలి. కానీ దుర్వాసుడు ఇంకా రాలేదు. అతను రాకుండా తాను భుజిస్తే మహర్షికి ఆగ్రహం రావచ్చు భుజించకపోతే ద్వాదశి ఘడియలు దాటిపోయి. వ్రత ఫలితం దక్కకపోవచ్చు. అయితే భోజనం చేయకపోయినా మంచినీళ్ళు తీసుకొని వ్రతదీక్ష విరమిస్తే దోషం లేదనీ, ఫలితం లభిస్తుందనీ విజ్ఞులు సలహా ఇస్తారు. అంబరీషుడు అలాగే చేస్తాడు. ఇంతలోకి దుర్వాస మహాముని వచ్చి జరిగింది గ్రహించి, ఆగ్రహిస్తాడు, ఆవమానంగా భావిస్తాడు. రాజుపై మండిపడి, తన కేశపాశం నుంచి ఒక జడను పెరికి దానితో 'కృత్య' అనే ఒక శక్తిని సృష్టిస్తాడు. అది భీకరాకారంతో, విలయాట్టహాసం చేస్తూ అంబరీషుని వధించడానికి సమీపిస్తుంది. అయితే విష్ణువు ద్వారా సంక్రమించిన చక్రం అడ్డుపడి అంబరీషుని రక్షిస్తుంది. అంతేగాక ఎదురు దాడి చేసి ఆ దుష్టశక్తిని సంహరిస్తుంది. అంతటితో ఊరుకోక దుర్వాసుని పై దండెత్తుతుంది

దీనితో భయపడి ఆ మహర్షి ప్రాణ రక్షణార్థం త్రిమూర్తులు బ్రహ్మ, మహేశ్వర, విష్ణులను శరణు పేడుతాడు. వారంతా ఆ పని తమ వల్ల కాదని ఒక్క అంబరీషుడే అందుకు తగిన వాడని సూచిస్తారు. చేసేది లేక అహంకారం సమసిపోయిన దుర్వాసమహర్షి తన ప్రాణాలను దక్కించుకోవడానికి చివరికి అంబరీషుని వద్దకు వెళ్ళి పాదాలు పట్టుకొని, ప్రాణ భిక్షను కోరుతాడు. అంబరీషుడు కనికరించి చక్రాన్ని తొలగిపొమ్మని ప్రార్థిస్తాడు, అది శాంతించి వెనుదిరిగి పోతుంది. అప్పుడు రాజు మళ్ళీ మహర్షిని పూజించి, భోజనం పెట్టి సంతృప్తి పరిచి పంపించి వేస్తాడు.

ఎంతటి శక్తిమంతుడైనా నిష్కారణంగా విజశక్తి, ప్రదర్శించకూడదు. అందునా నిరపరాధులు, సాధువుల పట్ల క్రూరంగా వ్యవహరించరాదు. వారికి అపకారం చేయ తలపెట్టకూడదు. అనాలోచితంగా వేపే దుష్కార్యం ఎదురు తిరిగి వచ్చి బాధిస్తుంది. దుర్వాసుని వట్ల అదే జరిగింది. అంబరీషుడు భాగవతోత్తముడు, పరమభక్తుడు. కాబట్టి తనకు అపకారం తలపెట్టిన దుర్వాసుని మనసులో ఏ కోశానా క్రోధం గానీ, పగ గానీ, ప్రతీకారం గానీ, ప్రత్యపకార బుద్ధిగాని లేవు, సమస్తం భగవదధీనమే అని మనసారా నమ్మినందువల్ల స్వయంశక్తితో చక్రాన్ని ఎదుర్కోలేదు, వేడుకొన్నాడు. అహంకారం అనుచితం, సాధువృత్తి సముచితం. అపకారికైనా ఉపకారమే తల పెట్టాలి. ఇది ఈ సారాంశంలోని నీతి.

అంబరీషుని – వ్యక్తిత్వం :

అంబరీషుడు ఒక మహా రాజై ప్రజలను కన్న బిడ్డల్లాగా పాలిస్తున్నవాడు. సకల సద్గుల సంపన్నుడు. అంతకు మించి పరమ భాగవతోత్తముడు. విష్ణుభక్తికే జీవితాన్ని అంకితం చేసినవాడు. ఇతని భక్తికి మెచ్చి శ్రీ మహావిష్ణువు దివ్య చక్రాన్ని ప్రసాదిస్తాడు. అంబరీషుడు విష్ణువు గురించి ద్వాదశీ వ్రతాన్ని ఆచరిస్తాడు. ఆ సమయంలో దుర్వాసమహర్షి అభ్యాగతునిగా విచ్చేస్తారు. రాజు మునిని సకల మర్యాదలతో

ఆహ్వానించి భోజనానికి పిలుస్తాడు. ఆ ముని స్నానం చేసి వస్తానని చెప్పి వదిలోకి వెళ్ళి ఆలస్యం చేస్తాడు. ఈ లోగా ద్వాదశీ ఘడియలు దాటిపోతున్నందువల్ల ఏమి చేయాలో పాలు పోక రాజు పండితులను సంప్రదిస్తాడు. వారు భోజనం చేయకపోయినా మంచినీళ్ళు తీసుకొని వ్రతదీక్ష విరమిస్తే దోషం లేదని, వ్రత ఫలితం దక్కుతుందని చెబుతారు. అంబరీషుడు అలాగే చేస్తాడు. ఇంతలో దుర్వాసుడు తిరిగి వచ్చి జరిగినది తెలుసుకొని కోపోద్రిక్తుడై రాజు పై మండిపడి తన జటాజూటం నుండి ఒక బడను పెరికి దానితో 'కృత్య' అనే ఒక భీకర శక్తిని సృష్టించి అంబరీషుని సంహరించి సంపుతాడు. ఆ అంబరీషుని వద్ద ఉన్న విష్ణు చక్రం అడ్డుకొని చుట్టులెడుతుంది. అంతటితో ఊరుకోక దుర్వాసుని చంపడానికి వెంబడిస్తుంది. ఆ ముని భయంతో పరుగుతీపి త్రిమూర్తులను ప్రాణరక్షణార్థం వేడుకొంటాడు. వారు ఆ చక్రాన్ని ఆపడం తమ వల్ల కాదనీ, అది అంబరీషుని కొక్కనికీ సాధ్యమని తెలపడంతో దుర్వాసుడు తిరిగి వచ్చి అంబరీషుని శరణు కోరుతాడు. అంబరీషుడు ఆ చక్రాన్ని ప్రార్థించి ఆది మహర్షి ప్రాణాలు కాపాడుతాడు. మహర్షి అంబరీషుని భక్తికి సంతసించి అతని అతిథ్యాన్ని స్వీకరించి సంతుష్టుడై వెళతాడు.

ఈ కథవల్ల రెండు అంశాలు స్పష్టమవుతాయి. శక్తి సామర్థ్యాలు ఉన్నాయని అహంకరించకూడదు. అది ఆవర్షదాయకం. దుర్వాసుడు గొప్ప మహర్షి అయినప్పటికీ కోపాన్ని, అహంకారాన్ని జయించలేకపోవడం. చేత ప్రాణాలపైకి తెచ్చుకొని, చివరకు ఎవరివైతే చంపాలనుకొన్నాడో, వారినే ప్రాణభిక్ష కోరవలసి వచ్చింది. సాధుపజ్జమల పట్ల శాంతంగా వ్యవహరించాలి. మరొక వైపు అంబరీషుడు భుజ బల పరాక్రమ వంతుడైనా, పరమభక్తుడు కావడం వల్ల దుర్వాసుని చంపడానికి వచ్చిన ఆ విష్ణు చక్రాన్ని భక్తితో నమస్కరించి వేడుకొన్నాడే. తప్ప, తన ఆయుధాల్ని ప్రయోగించి ఆ చక్రాన్ని అడ్డుకోలేదు. సాధుజన చిత్తవృత్తిని చిత్రించే ఈ కథ అహంకారం, కామ, క్రోధాది అరిషడ్వర్గాన్ని త్యజించమని చెబుతోంది.

ఈ భాగంలో అప్రతిహతమైన బ్రాహ్మణుని శాపం వర్తింపని భక్త అంబరీషుని చరిత్రను శుకుడు నినిపిస్తాడు. ఎంత శక్తిమంతు డయినప్పటికీ విజశక్తి నిష్కారణంగా ప్రదర్శించకూడదు. అందునా నిరపరాధులు, సాధు సజ్జనులపై అపకారం తలపెట్టరాదు. ఆలోచితంగానైనా, అనాలోచితంగానైనా చేసే దుష్కార్యం ఎదురు తిరిగి వచ్చి మనల్ని బాధిస్తుంది. "తన కోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్షో" అన్న సూక్తం ఈ భక్తుని కథలో వ్యక్తమౌతుంది.

ఉపయుక్త గ్రంథ సూచి

1. సమగ్రాంధ్ర సాహిత్యం, ఆరుద్ర, విశాలాంధ్ర, హైదరాబాద్. 1967.
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర, లక్ష్మీకాంతం, పింగళి, ఆం. ప్ర. సాహిత్య అకాడమీ, హైదరాబాద్ 1974.
3. తెలుగు సాహిత్య సమీక్ష, నాగయ్య, జి నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి 1983.
4. ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు, ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్.

టి. ఆర్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

కందుకూరు, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు జిల్లా.

కె. ఆర్. కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

అద్దంకి, బాపట్ల జిల్లా.

తెలుగు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

"తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు, ధోరణులు"

తేదీలు 24, 25 ఆగస్టు 2022

ధ్రువీకరణ పత్రం

శ్రీ / శ్రీమతి / కుమారి / డాక్టర్ / ఆచార్య KAMERA PURUSHOTHAM

కళాశాల పేరు UNIVERSITY OF HYDERABAD , UNIVERSITY OF HYDERABAD, GACHIBOULI

ది. 24, 25 ఆగస్టు 2022 తేదీలలో "తెలుగు సాహిత్యం - విభిన్న ప్రక్రియలు, ధోరణులు" అనే అంశంపై నిర్వహించబడిన రెండు రోజుల అంతర్జాతీయ అంతర్జాల సదస్సు నందు పాల్గొన్నారు / పాల్గొని భావకవిత్వం - పుట్టుపూర్వోత్తరాలు అనే అంశంపై పత్ర సమర్పణ చేసియున్నారని ధ్రువీకరించడమైనది.

ప్రిన్సిపాల్ కె.ఆర్.కె. గవర్నమెంట్ కళాశాల, అద్దంకి	డాక్ బిలక అనిత సదస్సు సంచాలకులు	షేక్ షానాజీ బేగం సదస్సు సంచాలకులు	డాక్ కె. సుజాత సదస్సు సంచాలకులు	ప్రిన్సిపాల్ టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు

CSTS Government Kalasala

Jangareddigudem, Dist: Eluru, AP - India 534447

Affiliated to AKNU, Rajamundry NAAC (Re-Accredited)

తెలుగు విభాగం :: Department of Telugu

One Day International Telugu Webinar / Seminar (29-09-2023)

అంశం: ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న కోణాలు

Topic: Aadhunika Telugu Sahityamlo Vibhinna Konaalu

CERTIFICATE

This is Certified that KAMERA PURUSHOTHAM & Research scholar, University of Hyderabad has Participated & Presented a Paper with title: తెలంగాణ భావకవిత్వం ప్రారంభ వికాసాలు in One Day International Telugu Webinar on "Aadhunika Telugu Sahityamlo Vibhinna Konaalu" organized by the Department of Telugu, CSTS Government Kalasala, Jangareddigudem on 29-09-2023.

Dr G Venkata Lal
Convener

Dr N Prasad Babu
Principal

{{QR Code}}

Made for free with Certify'em

SAHITHYA BHARATHI, ANANTHAPURAMU

PATHIKI RAJYALAKSHMI FOUNDATION, ANANTHAPURAMU

A TWO - DAY NATIONAL WEBINAR

CERTIFICATE

This is to certify that Prof./Dr./Mr./Mrs/Ms K. PURUSHOTHAM, RESEARCH SCHOLAR, HCU

has participated and presented a paper entitled POTHANA BHAGAVATHAM AMBAREESHUNI PAATRA - VYAKTHITVA VIKASAM *in the National Webinar on*

"Personality Development through Ramayana, Bharata, Bhagavatas" (రామాయణ, భారత, భాగవతాలు వ్యక్తిత్వ వికాసం) *Jointly organized by* SAHITHYA BHARATHI, ANANTHAPURAMU, (A.P.) & PATHIKI RAJYALAKSHMI FOUNDATION, ANANTHAPURAMU, (A.P.) held on 8th & 9th September, 2022.

GUTHA HARISARVOTHAMA NAIDU
PRESIDENT
SAHITHYA BHARATHI

GUNTI MURALIKRISHNA BHARADWAJ
FOUNDER CHAIRMAN
SAHITHYA BHARATHI

Dr. P. RAMESH NARAYANA
FOUNDER CHAIRMAN
PATHIKI RAJYALAKSHMI FOUNDATION

Dr. B. ASHOK KUMAR
DIRECTOR
NATIONAL WEBINAR

Dr. J. YOGESWAR NAIDU
CO - DIRECTOR
NATIONAL WEBINAR

అనుబంధం-2

అనుబంధం –2

తెలంగాణ భావకవితా వికాసం పుస్తకం



గోలకొండ కవుల సంచిక పుస్తకం



‘తెలంగాణలో భావకవితా వికాసం’ పుస్తక సంపాదకులు సామిడి జగన్ రెడ్డి గారితో నేను



AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES